Jumua Ke Khutbe
(Telugu)

జుమా ప్రసంగాలు

మూలం:
మౌలానా అబూ సలీమ్ అబ్దుల్ హై (రహ్మలై)

అనువాదం:
అబుల్ ఇర్ఫాన్

మా మాట

మౌలానా అబ్దుల్ హై రచించిన "జుమాకె ఖుత్బె" అనే పుస్తకాన్ని తెలుగు ప్రజలకు అందజేస్తున్నందుకు సంతోషంగా ఉంది.

జుమా ప్రసంగం ఇస్లామీయ జీవితానికి ఊపిరివంటిది. దీని ద్వారా ప్రతి వారం విశ్వాసంలో ఉత్తేజం, నూతన శక్తి జనిస్తాయి. అనేక బలహీనతలు చోటుచేసుకున్న నేటి ముస్లిమ్ సమాజంలో ముస్లింలు జుమా ఖుత్బాల ఈ మహా భాగ్యానిక్కూడా దూర మయ్యారు. తత్ఫలితంగా జుమా ప్రసంగం కేవలం ఓ ఆచారంగా మాత్రమే మిగిలి పోయింది.

ఈ స్థితికి ఒక కారణం జుమా ప్రసంగాలలో ప్రయోగించే అరబీ భాష ముస్లిము లందరికి తెలియకపోవడం. అందువల్ల నేడు అనేక చోట్ల అరబీతోపాటు స్థానిక ప్రజల మాతృభాషలో కూడా జుమా ప్రసంగం చేయడం జరుగుతోంది. ఈ పుస్తకంలో మేము ఉర్దూ రాని మన రాష్ట్ర ప్రజల కోసమని జుమా ప్రసంగాలను అందజేస్తున్నాము.

ఈ ప్రసంగాలు జుమాలో వినిపింపగోరేవారు ప్రతి ప్రసంగానికి ముందు "ఖుత్బయే మస్నూన" (ప్రవక్త సంప్రదాయంలోని ఖుత్బా) పఠించాలి. "ఖుత్బయే సానియ" (ద్వితీయ ప్రసంగం) తమకు నచ్చినది పఠించవచ్చు. అయితే ఇది తప్పనిసరిగా అరబీలోనే ఉండాలి.

- ప్రకాశకులు

రచయిత తొలిపలుకు

జుమా ప్రసంగం ఇస్లామీయ జీవితానికి ఆహారం వంటిదని అనడంలో తప్పులేదు. దీని ద్వారా ప్రతి వారం విశ్వాసానికి పదును, ఇస్లాంకు శక్తిని చేకూర్చే గొప్ప ఏర్పాటు చేయబడింది. అయితే ఇస్లామీయ వ్యవస్థ బలహీనపడ్డం వలన ఏ విధంగానైతే ముస్లిమ్ సమాజం అనేక వరప్రసాదాలకు దూరమయిందో, అదే విధంగా జుమా ప్రసంగాల శుభాలనూ కోల్పోయ్యారు. ఇప్పుడు మన జీవన వ్యవస్థలానే మన జుమా ప్రసంగాలు కూడా నిర్జీవమై, అవి ఒక మొక్కుబడిగా మాత్రం మిగిలాయి.

ఈ దుస్థితికి అనేక ఇతర కారాణాలతోపాటు ప్రసంగం వినేవారికి అరబీ భాష తెలియకపోవడం కూడా ఒక ముఖ్య కారణం. ఈ దృక్పథంతోనే కొంత మంది ఉర్దూలో ప్రసంగించడానికి ప్రయత్నం చేస్తున్నారు. ఈ అవసరం మేరకే 'అల్ హస్నాత్' మాస పత్రికలో 'జుమా ప్రసంగాలు' పేరుతో ఒక శీర్షిక మొదలు పెట్టాము. ఈ జుమా ప్రసంగాలు ప్రజలకు నచ్చాయనీ, వీటిని జుమాల్లో వినిపించడం కూడా జరిగిందని తెలిసింది. ఈ ప్రసంగాలన్నింటినీ ఒక పుస్తక రూపంలో సంకలనం చెయ్యాలన్న ప్రతిపాదన కూడా వచ్చింది.

'అల్ హస్నాత్' లోని ఈ ప్రసంగాల సంకలనాన్నే ఇప్పుడు ప్రచురిస్తున్నాము. 'ప్రసంగ భాష' అనే శీర్షికన ఒక వ్యాసం కూడా జత చేయబడింది. ఈ వ్యాసంలో ప్రసంగం ఏ భాషలో ఉండాలి, ఉర్దూలో ప్రసంగించే అవకాశం ఎంత మేరకు ఉంది అన్న విషయాలు చర్చించబడ్డాయి. ద్వితీయ ప్రసంగం అరబీలోనే ఉండాలి. ఈ అవసరం మేరకు పుస్తకం చివరన ద్వితీయ ప్రసంగం నిమిత్తం రెండు అరబీ ప్రసంగాలు కూడా ప్రచురించాము.

ఈ పుస్తకం సులువయిన భాషలో హితోపదేశానికి లాభదాయకం కాగలగాలని దైవాన్ని వేడుకుంటున్నాను.

- అబ్దుల్ హై

ప్రసంగ భాష

జుమా నమాజుకు ముందు ఖుత్బా (ప్రసంగం) తప్పనిసరి. సాధారణంగా ఈ ప్రసంగం అరబీ భాషలో చదువుతారు. ఇది తప్పనిసరిగా అరబీలోనే ఉండాలనీ, అరబీయేతర భాషలో చదవడం ధర్మసమ్మతం కాదనీ చాలా మంది అభిప్రాయపడతారు. కాని కొంత మంది మాత్రం ఈ ప్రసంగం అసలు ఇస్లామియ ఆదేశాల వ్యాప్తికీ, ప్రజల విశ్వాసంలో పటిష్టత కలిగించడానికి, హితోపదేశం గరపడానికి సాధనమనీ అంటారు. వినేవారికి ఈ ప్రసంగం అర్థమైతేనే ఈ ఆశయాలు నెరవేరుతాయి. కాబట్టి శ్రోతలకు తెలిసిన భాషలోనే ఈ ప్రసంగం ఉండాలి అనేది వీరి వాదన.

అరబీయేతర భాషల్లో జుమా ప్రసంగం చేయడానికి వ్యతిరేకించేవారి వాదన ఏమంటే- జుమా ప్రసంగం నమాజులో ఓ భాగం. దీన్ని గనుక ఇతర భాషల్లో అనుమతిస్తే ముమ్ముందు ప్రజలు అర్థం చేసుకుని చదివేందుకు నమాజును కూడా మాతృభాషలో చదివేందుకు అనుమతి కావాలనే ప్రతిపాదనకు ఆస్కారం ఏర్పడుతుంది. నిస్సందేహంగా ఈ వాదనలో బలం ఉంది. 'జుమా ప్రసంగం నమాజులో ఓ భాగం' అనే విషయాన్ని ఒప్పుకుని, ప్రసంగాన్ని ఇతర భాషల్లో చేయడానికి అనుమతిస్తే నమాజును కూడా ఇతర భాషల్లో చెయ్యడం సరయినదనవచ్చు. 'నమాజును అరబీలోనే చదవాలి' అన్న విషయంలో అందరికీ ఏకాభిప్రాయం ఉంది. అసలు విషయం ఏమిటంటే ప్రసంగం నమాజులో భాగం ఎంత మాత్రం కాదు. కాని జుమా నమాజు నెరవేరడానికి అది తప్పనిసరయిన అంశం. నిస్సందేహంగా జుమా ప్రసంగం కూడా నమాజు లాంటి ఆరాధనాంశమే. కాని రెంటి ఆశయాలూ వేరయినవి, నమాజులో చదివింది కొంత మేరకు అర్థం చేసుకోలేకపోయినా కూడా నమాజు ఉద్దేశ్యం నెరవేరుతుంది. కాని ప్రసంగం ఉద్దేశ్యం వినేవారు దాన్ని అర్థం చేసుకున్నప్పుడు మాత్రమే సిద్ధిస్తుంది. ఈ విషయాన్ని బాగా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఎంతయినా ఉంది.

మనిషి కేవలం వ్యక్తిగత స్థాయిలో సజ్జనుడుగా, సద్వర్తనుడుగా రూపొందడం, నీతిమంతుడయి, నిజాయితీపరుడయి భయభక్తుల జీవితం గడపడం మాత్రమే ఇస్లామ్ అసలు ఉద్దేశ్యం కాదని మనందరికీ తెలుసు. ఇస్లామ్, ఒక్కొక్క వ్యక్తిని సంస్కరించి, మంచి వ్యక్తిగా తీర్చిదిద్ది, అటువంటివారిని పరస్పరం చేరదీసి ఓ ఉన్నత ఆశయాల ఉత్తమ సంఘాన్ని స్థాపించగోరుతుంది. ఆ సమాజం భువిలో దైవ ప్రాతినిధ్యపు బాధ్యతల్ని సవ్యంగా నిర్వర్తించగలగాలని అభిలషిస్తుంది. అందువల్లనే ఇస్లామ్ ఆరాధనల్ని విధిగా నిర్ణయించింది. మనుషుల్లో అవి ఒక వైపు భయభక్తులు, పవిత్రతా గుణాలను సృజిస్తే, మరోవైపు వారిని ఒక ఉత్తమ సంఘంగా రూపొందడానికి సహకరిస్తాయి. వీటిలో అన్నిటికంటే ముఖ్యమయినది నమాజ్. అది మనిషిని నిష్ఠాగరిష్ఠునిగా, పరిశుద్ధుడుగా

తీర్చిదిద్దుతుంది. మనిషిని ఉత్తమునిగా మలచడానికి నమాజ్‌కు మించిన సాధనం మరొకటి లేదు. నమాజ్ ద్వారానే ఖుర్‌ఆన్ ఉపదేశాలు మాటిమాటికి ప్రజల ముందుకు వస్తాయి. ఇందులోనే ఖుర్‌ఆన్ రక్షణ ఇమిడిఉంది. నమాజ్ ముస్లిమ్‌లను సంఘటిత పరుస్తుంది. ఇక నమాజ్ అరబీయేతర భాషల్లో చేయడం గనుక సంభవిస్తే దైవ ప్రవక్త (సఅసం) స్వయంగా అందజేసిన ఉపదేశవాక్కులకు దూరమవుతారు. వాటికి ఉన్న ప్రత్యేకత కాస్తా కనుమరుగవుతుంది. అంతేగాక ఖుర్‌ఆన్‌ని వివిధ భాషల్లో పఠించడం వల్ల దాని రక్షణకు ముప్పువాటిల్లే ప్రమాదం కూడా ఉంది. వివిధ భాషల్లోని అనువాదాలనే ప్రజలు ఖుర్‌ఆన్‌గా భావిస్తారు. దాన్నే పారాయణం, ఆరాధనల కొరకు ఉపయోగించు కుంటారు. ఈ విధంగా 'అసలు ఖుర్‌ఆన్'తో వీరి సంబంధం తెగిపోతుంది. దాన్ని కంఠస్థం చేసే అభిరుచి, చదవే, చదివించే అవసరం అంతమయిపోతాయి, ఈ పరిస్థితి గనక జనిస్తే దాని ఫలితంగా ప్రజలు అసంపూర్ణమయిన, పరస్పరం విభిన్నమయిన అనువాదాలకు అసలయిన ఖుర్‌ఆన్ స్థాయిని కల్పిస్తారు. అంతేకాక వివిధజాతుల్లో, భాషావర్గాల్లో ఖుర్‌ఆన్ భావం, అర్థం రీత్యా విభిన్నమయిపోతుంది. క్రైస్తవుల ధర్మానికి, యూదుల ధర్మానికి పట్టిన గతి ముస్లిముల ధర్మానికి కూడా పట్టకుండా దైవం రక్షించుగాక! ఈ పరిస్థితి గనుక తటస్థిస్తే ప్రతి భాష మాట్లాడే వాళ్ళు తమ వేర్వేరు సంఘాలను స్థాపించుకుంటారు. ఇరానీయుడు అరబ్బు వెనుక నమాజ్ చెయ్యడు. సింధీ ముస్లిమ్ బెంగాలీకి దూరమవుతాడు, పంజాబీ, హిందీ మాట్లాడేవారు వేర్వేరుగా నమాజులు చేస్తారు. చైనీయులు, జర్మన్లు పరస్పరం వేరయిపోతారు.

నమాజ్ భాషా విభేదం ద్వారా ముక్కలవగానే ముస్లిమ్ అనుచర సంఘం కూడా తునాతునకలయిపోతుంది. అందుకు నమాజ్ విషయంలో మాత్రం యావత్ప్రపంచానికీ ఒకే భాష అవసరం. అందుకు అరబీ కంటే మేలయిన భాష మరొకటి లేదు. ఎందుకంటే, నమాజుకు అసలు శిక్షణ ఈ భాషలోనే ఇవ్వబడింది. ఈ భాషలోనే ఖుర్‌ఆన్ అవతరించింది. అర్థం కాకుండా నమాజ్ చేసేవారికి పూర్తి ప్రయోజనం చేకూరదనేది గొప్ప చిక్కు కాదు. నమాజులో చాలా భాగం మాటిమాటికీ చదివేదే. కాబట్టి దాని భావం గుర్తుంచుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. ఎవరయినా సరే ఆ పదాల భావార్థాన్ని సునాయాసంగా ఒకటి రెండు రోజుల్లో జ్ఞాపకం చేసుకోవచ్చు. నమాజ్‌లో సాధారణంగా చదవబడే సూరాల అర్థాన్ని కూడా సుమారు నెల రోజుల్లో మనోగతం చేసుకోవచ్చు. ఇకపోతే ఖుర్‌ఆన్‌లోని పెద్దపెద్ద సూరాల మాటయితే వాటి అర్థాన్ని ప్రజలందరూ అర్థం చేసుకోకపోతే నమాజ్‌లో వాటిల్లే నష్టమేమీ లేదు. నమాజును అరబీయేతర భాషల్లో చేస్తే సంభవించే ఘోర పరిణామాలతో పోలిస్తే అదేమంత పెద్ద లోపం కాదు.

ఈ విషయాలన్నింటినీ ముందుంచుకొని ఆలోచిస్తే 'నమాజు కూడా అరబీయేతర భాషల్లో చేయవచ్చు' అనే నిర్ణయం ఎంత ఘోరమయిన పొరపాటో స్పష్టమవుతుంది.

ప్రసంగం విషయం వేరు. ప్రసంగం, నమాజు ఈ రెండింటి ఉద్దేశ్యాల్లో వ్యత్యాసం ఉంది. మనిషి తాను చదివింది పూర్తిగా అర్థం చేసుకోకపోయినా నమాజు ఉద్దేశ్యం నెరవేరుతుంది. కాని ప్రసంగం పూర్తిగా అర్థం కానంతవరకు దాని ఉద్దేశ్యం నెరవేరదు. నమాజు కోసం లేచినప్పుడు మనిషి నమాజు తనపై దైవం మోపిన విధి అనీ, తాను ఆ విధిని నెరవేర్చేందుకు లేస్తున్నానని అనుకుంటాడు. అతను నమాజులోని అంశాలన్నీ నియమానుసారంగా పూర్తిచేస్తాడు. ఈ ఆచరణ ద్వారా అతను, 'నా విషయాలన్నీ నా ప్రభువుకు తెలుసు. ఆయన నన్ను గమనిస్తున్నాడు' అనే భావాన్ని ప్రకటిస్తాడు. తాను చేతులు కట్టుకుని నిలబడడం, శిరస్సు వంచడం, నుదుటిని నేలపై ఆన్చడం తన ప్రభువు కోసమేననీ, తాను ప్రభువునే ఆరాధిస్తున్నాడనీ, ఆయన తప్ప ఆరాధనకు అర్హులెవరూ లేరనీ మనిషికి తెలుసు. ఈ ఆచరణ ఫలితంగా నమాజు విధిగా చేయబడిన ఉద్దేశ్యం సిద్ధిస్తుంది. అందుకే నమాజుల్లో చదివేదంతా తప్పనిసరిగా అర్థం కావాలన్న కట్టడి మాత్రం లేదు. ఇక వాంఛనీయం ఏమిటీ, ఘనత దేనికి ఉందని ఆలోచిస్తే నమాజులో చదివే సూరాల భావం అర్థం చేసుకోవడం ఏమంత కష్టమయిన పని కాదు. కొద్దిపాటి ఆసక్తి కనబరిస్తే చాలు- అంతా మననం చేసుకోవచ్చు.

దీనికి భిన్నంగా ప్రసంగం వ్యవహారం పూర్తిగా వేరయినది. ప్రసంగం ఒక ఆరాధనాంశం, దైవసంస్మరణ మాత్రమే కాదు. ఒకవేళ ప్రసంగం ఉద్దేశ్యం దైవ సంస్మరణమే అయినట్లయితే దాని కోసం నమాజ్ ఒక్కటే సరిపోయేది. పైగా నమాజ్ దైవ సంస్మరణ విధానాలన్నింటిలో ఉత్తమమయిన విధానం కూడా. మహా ప్రవక్త ముహమ్మద్ (సఅసం)గాని, ఆయన తర్వాత ఆయన అనుచరులుగాని ప్రసంగం లేకుండా జుమా నమాజు చేయలేదన్న సంగతి అందరికీ విదితమే. అందుకే ముస్లిమ్‌లందరూ ప్రసంగాన్ని జుమా నమాజుకు తప్పనిసరి షరతుగా పరిగణిస్తారు.

ప్రవక్త (సఅసం) ఆయన అనుచర వర్గం ఇచ్చిన జుమా ప్రసంగాలలో చాలా భాగం నేటికీ భద్రంగా ఉన్నాయి. వాటిలో కేవలం దైవస్తోత్రం మాత్రమే కాకుండా విశ్వాసాన్ని, దైవభీతిని పెంచేందుకు ప్రయత్నం, షరీఅత్‌కు సంబంధించిన ఆదేశాలు, సద్బుద్ధికి సత్కార్యాలకు ఉపదేశం, చెడు విషయాలకు దూరంగా ఉండేందుకు హితబోధ, వ్యక్తిగత, సామూహిక విషయాలకై శ్రద్ధ మొదలగు విషయాలు కూడా ప్రస్తావించబడేవి. ఈ ఉద్దేశ్యాలన్నీ అరబీ భాషలో ప్రసంగించి సాధించడం అలవికాని పని. పూర్వం పాలనాధికారం ముస్లిమ్‌ల చేతుల్లో ఉన్నప్పుడు అరబీ భాషకు ప్రోత్సాహం లభించేది. తత్ఫలితంగా అరబ్బేతర ముస్లిమ్ దేశాల్లో కూడా చాలా మంది అరబీని అర్థం చేసుకోగలిగేవారు. ప్రసంగం అరబీలో వినిపించినా దాని ఉద్దేశ్యం నెరవేరడంలో పెద్ద ఇబ్బంది ఏమీ కలిగేది కాదు. కాని ప్రస్తుత పరిస్థితివేరు. ప్రస్తుత పరిస్థితిలో అరబీ ప్రసంగం ద్వారా దైవ స్తోత్రం, దైవ నామ సంకీర్తనాల ఆశయాలను మినహాయించి ఇతర ఆశయాలేవీ నెరవేరజాలవు.

ప్రసంగం సరియైన పంథాలో ఇచ్చి షరీఅత్ కోరినదాని ప్రకారం దాని ద్వారా ప్రయోజనాలు సాధించడానికి కృషి జరిపితే ఇది ముస్లిమ్ సమాజ పటిష్ఠతకు సర్వోత్కృష్ట మార్గం కాగలదు. దీని ద్వారా ప్రజల్లో విశ్వాసబలాన్ని జనింపజేయవచ్చు. వారిలో దైవభీతి, పరలోక భీతి భావనలు కలిగించవచ్చు; వారిలోని వ్యక్తిగత, సామూహిక బలహీనతలను దూరం చేయవచ్చు. వారి నీతిని, నిజాయితీని చక్కదిద్దవచ్చు.వారిలో ప్రబలి ఉన్న దురాచారాలను సంస్కరించవచ్చు. ఇంకా వారిని తమ తమ సంబంధీకుల ధార్మిక శిక్షణకూ, సంస్కరణకూ పురికొల్పవచ్చు. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రతీ వారం ఇస్లామీయ సమాజ జీవనానికి కొత్త ఊపిరి పోయవచ్చు. అయితే ఈ ప్రయోజనాలన్నీ ప్రసంగాన్ని వినేవారు అర్థం చేసుకున్నప్పుడు మాత్రమే ఒనగూడుతాయి. లేకపోతే ఈ ప్రయోజనాలు ఏ విధంగానూ కలిగే ఆస్కారం లేదు.

ఒక వైపు మన ముందు ఈ ఆశయాలు (జుమా ప్రసంగం ఆశయాలు) ఉన్నాయి. మరో వైపు ముస్లిమ్‌లను జుమా ప్రసంగం తప్పనిసరిగా అరబీలోనే ఉండాలన్న ఆదేశం ఎక్కడా కానరాదు, కాబట్టి జుమా ప్రసంగం శ్రోతలు అర్థం చేసుకోగలిగే భాషలో ఉండాలనే వారి వాదనలో తప్పు పట్టలేము. అది అధర్మమూ కాదు, అన్యాయమూ కాదు. పైగా జుమా ప్రసంగం ఆశయాల సాధనకోసం ఉత్తమ విధానం అని చెప్పవచ్చు.

అరబీయేతర భాషలో ప్రసంగించడాన్ని వ్యతిరేకించేవారు చూపే మరో గమనార్హమయిన అంశం ఏమంటే- 'జుమా ముస్లిమ్ సమాజాన్ని సంఘటితపరచడానికి ఒక సాధనం. వేర్వేరు భాషలు మాట్లాడేవాళ్ళు వేర్వేరు భాషల్లో చేసే ప్రసంగాల ఆధారంగా జుమా ప్రార్థన కూడా వేర్వేరుగానే ఏర్పాటు చేసుకుంటారు. అది ఇస్లామీయ సామూహిక తత్వానికి వ్యతిరేకమయిందే. దీన్ని వారించడానికి ఈ ప్రసంగం అరబీలో చెయ్యడమే ఉత్తమం' - అయితే ఈ సమస్యకు పరిష్కారం లేకపోలేదు. మొదటి పరిష్కారం ఏమిటంటే వివిధ భాషలు మాట్లాడేవాళ్ళు ఒకేచోట జుమా నమాజు చేసే పరిస్థితిలో ప్రసంగం అరబీ లోనే ఉండాలి. ఉదాహరణకు హజ్‌లో వివిధ భాషలు మాట్లాడే ముస్లిమ్‌లు ఒకే చోట జుమా నమాజు చేస్తారు. అయితే ఏదో ఒక అరబీయేతర భాష తెలిసినవారధికంగా ఉండే చోట, మరికొంత మంది అధిక సంఖ్యాకుల భాష తెలియనివారూ ఉన్నపక్షంలో మొదటి ప్రసంగాన్ని రెండు భాగాలుగా విభజించాలి. ఒక భాగం మాత్రం తప్పనిసరిగా అరబీలోనే ఉండాలి. అందులో దైవస్తోత్రం, దైవప్రవక్త (సఅసం), ఆయన సంతానం, సహచరవర్గంపై దరూద్ సలాంలు ఇంకా ఖుర్‌ఆన్ ఆయత్‌లు ఉండాలి. మరో భాగం శ్రోతల్లోని అత్యధికులు అర్థం చేసుకునే భాషలో ఉండాలి. అందులో షరీఅత్ ఆదేశాలు, నైతిక హితబోధలు, వ్యవహారాన్ని చక్కబరచుకునేందుకు ఉపదేశాలు, విశ్వాసాన్ని పటిష్టపరిచే సదాచరణకు పురిగొల్పే విషయాలు ఇంకా ఇతరత్రా సమస్యలపై చర్చలు ఉండాలి. ఇక ద్వితీయ ప్రసంగం విషయానికొస్తే అది మాత్రం తప్పనిసరిగా పూర్తిగా అరబీలోనే ఉండాలి.

ఈ విధానం వలన ప్రసంగం ద్వారా ఆశించిన ప్రయోజనాలు ఒనగూడటమేకాక శ్రోతల్లోని అధికుల భాషను అర్థం చేసుకోలేని వారికి, తప్పనిసరిగా అరబీ ప్రసంగమే చెయ్యాలనేవారికీ తృప్తి కలుగుతుంది.

మనదేశం విషయానికొస్తే ఉర్దూ భాషను ఇక్కడి సామాన్య ప్రజలు సులభంగా అర్థం చేసుకోగలరు. దీన్ని దేశంలో దాదాపుగా అన్ని ప్రాంతాల్లోనూ అర్థం చేసుకుంటారు. అందుకే ప్రతి చోట స్థానిక భాషలో ప్రసంగం ఉండాలని పట్టుబట్టే బదులు ఉర్దూ అర్థమయ్యే చోటల్లా ఉర్దూలో ప్రసంగం ఏర్పాటు చేయడం మంచిది. కాని అవసరం మేరకు స్థానిక భాషల్లో ప్రసంగించడంలో తప్పులేదు.

ఉర్దూ భాషలో ప్రసంగాన్ని సర్వసామాన్యం చేసే పరిస్థితిలో కొన్ని జాగ్రత్తలు కూడా పాటించవలసి ఉంటుంది. ఈ జాగ్రత్తలు పాటించకపోతే ఉర్దూ ప్రసంగాల వల్ల లాభానికి బదులు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది.

మొట్టమొదటి విషయం ఏమిటంటే ఉర్దూలో ప్రసంగించే బాధ్యతను యోగ్యతలేని ఇమాములకు అప్పగించరాదు. దురదృష్టకరమయిన విషయం ఏమిటంటే, ఈరోజుల్లో సాధారణంగా ప్రాపంచిక పనుల్లో దేనికి పనికిరానివాణ్ణి, తక్కువ జీతానికి ఇమామత్‌ను వృత్తిగా స్వీకరించేవాణ్ణి మనం ఇమామ్‌గా నియమిస్తున్నాం. అసలు విద్య, దైవభీతి, భక్తిపరాయణతల ప్రాతిపదికలపై మనలో మేలయిన సమాజంలో మంచి స్థానంగల వ్యక్తిని ఇమామ్‌గా నియమించాలి. అతని మాటకు ప్రజల్లో విలువ ఉండాలి. చాలా చోట్ల పరిస్థితి ఇలా లేదు. ఈ పరిస్థితుల్లో వృత్తిగా చేసే ఇమాములు మనకు ప్రాపంచిక విషయాల్లోనూ, పారలౌకిక విషయాల్లోనూ మార్గదర్శకం కాగలరని ఆశించలేము, పరిస్థితుల దృష్ట్యా ఇమామ్‌లకు జాగ్రత్తగా రచించిన ప్రసంగం పాఠాలనయినా అందజెయ్యాలి. లేకపోతే అరబీ ప్రసంగంతోనయినా సంతృప్తి చెందాలి.

జాగ్రత్త వహించాల్సిన రెండవ విషయం ఇంకా సున్నితమయినది. అందరికీ అర్థమయ్యే సాధారణ భాషలో జుమా ప్రసంగాలు కావాలంటే ప్రజల దృష్టి ధర్మ జ్ఞానులపై (ఉలమాలపై) పడుతుంది. కాని దురదృష్టవశాత్తు ఈ విషయంలో కొంతమంది తప్ప మిగతావారి పరిస్థితిని ప్రస్తావించడానికి కూడా సిగ్గుపడవలసి వస్తుంది. వీరికి తమ ఇష్టప్రకారం మస్జిద్‌లలో ప్రసంగాలనిచ్చే అవకాశం గనక లభించినట్లయితే ప్రతిరోజా మస్జిద్‌లలో సిగపట్లు మొదలవుతాయి. ప్రజలు నమాజంటేనే విసుగెత్తిపోయే ప్రమాదమూ లేకపోలేదు. ఈ పండితుల్లో ప్రతి ఒక్కడూ తన ప్రత్యేక ధర్మపంథా (మస్‌లక్) గలవాడే. ఆ విషయంలో అతను ఎంత కఠినంగా ఉంటాడంటే- అతని దృష్టిలో ధర్మం మొత్తం తాను పట్టుపట్టే చిన్నచిన్న అప్రముఖమైన విషయాల్లోనేవుంది. షరీఅత్ బద్ధంగానే అతని పంథాను వ్యతిరేకించేవారిని ససేమిరా సహించడు; వారికి ఎలాంటి సడలింపునయినా ఇవ్వడం ఘోర పాపం అనుకుంటాడు. సాధారణంగా వీరికి శిక్షణ ఎలా ఇవ్వబడుతుందంటే-

వీరి సంకుచిత దృష్టి ఈ విషయాలను దాటి ముస్లిమ్ సమాజం ఎదుర్కొంటున్న జటిల సమస్యలపైకి పోనేపోదు. వీరి ఆసక్తి అంతా చిన్న చిన్న విభేదాలపైనే కేంద్రీకృతమయి ఉంటుంది. అందుకే నోరు విప్పినప్పుడల్లా వీరు ఆ విషయాల గురించే మాట్లాడతారు. సాధారణ ప్రజల ధార్మిక సంస్కరణ, నైతిక శిక్షణ, వ్యవహారాల దిద్దుబాట్లకు ప్రాధాన్యతనివ్వరు వీరు. ప్రజలు నూటికి నూరు శాతం తమతో ఏకీభవించాలని మాత్రమే వీరు కోరుకుంటారు. ప్రజల వ్యవహారాలు ఎలా ఉన్నాయి, నైతికత ఎలా ఉంది, ధార్మిక సదాచరణలపై ప్రజల మొగ్గు ఏ మాత్రం ఉంది అనే విషయాలను వీరు పట్టించుకోరు. అయోగ్యులయిన ఈ వర్గం వారికి అర్థమయ్యే భాషలో తమ జుమా ప్రసంగాలనిచ్చే స్వేచ్ఛ గనక ఇచ్చినట్లయితే వీరు పైన పేర్కొన్న చెడుల్లో ప్రజల్ని తలమునకలు చేసి మస్జిద్‌కు బయట కొట్లాటల్లో పడవేసే ప్రమాదం ఉంది.

జాగ్రత్తపడవలసిన మూడో విషయం ఏమంటే- కొంత మంది స్వార్థపరులు ఈ అవకాశాన్ని ఆసరాగా తీసుకుని తమ తమ రాజకీయ ప్రయోజనాల్ని సాధించుకోవడానికి, తమ ప్రాంతాలకు ప్రాబల్యాన్ని సంపాదించడానికి ప్రయత్నం చేస్తారు. దైవ గృహంలో పరస్పరం కలసిపోవడానికి వచ్చినవారిని కూడా విడదీయచూస్తారు.

ఈ సమస్యలన్నింటికి పరిష్కారం ఏమిటంటే- అతి జాగ్రత్తగా వ్యవహరించి అన్ని విషయాల్లోనూ సముచితంగా మెలగుతారన్న పూర్తి నమ్మకం కలవారికి తప్ప ఇతరులకు ఉర్దూలో ప్రసంగించే అవకాశం ఇవ్వరాదు. ఇదిగనక సాధ్యపడకపోతే ఘర్షణలకు, అభిప్రాయ భేదాలకూ అతీతంగా ఉండే మేలయిన ప్రసంగాలను వ్రాయించాలి. ఈ ప్రసంగాల ఆశయం ముస్లిమ్‌ల జీవితంలో మంచి ధార్మిక భావనను సృజించడం తప్ప మరొకటి కారాదు. ఈ ప్రసంగాల్లో సామాన్య నైతిక రుగ్మతలను రూపుమాపడానికి, ముస్లిమ్‌ల వ్యవహారాలు చక్కబరచడానికి వారిలో దైవభీతి, పరలోక భీతి కలిగించడానికి ప్రయత్నం జరగాలి. ఇంకా విశ్వాసం రీత్యా ఉత్తేజాన్ని కలిగించడానికి, సదాచరణ వైపునకు మరలించడానికి కృషిజరగాలి. అంతకు మించి వీటిలో ఏ రాజకీయ, మతపరమయిన ప్రత్యేక పంథాల బోధనగాని, ఒక వర్గం లేక ఒక పార్టీ ప్రచారంగాని ఉండరాదు.

అసలు ఈ పని ఎంతో ముఖ్యమయినది. విద్యాధికులైన వారే దీన్ని చేపట్టవలసింది. వారు ఏకాభిప్రాయంతో కృషి చేసి వివిధ రంగాలకు సంబంధించిన వివాదాస్పదంకాని జుమా ప్రసంగాల్ని ప్రజలు నిస్సంకోచంగా అంగీకరించేటట్లుగా రచించాలి. కాని అలాంటి అవకాశం ఎప్పుడు వస్తుందో చెప్పలేం. కాబట్టి 'అల్ హస్‌నాత్' ద్వారా అప్పుడప్పుడు ఇలాంటి ప్రసంగాలు ప్రచురించాము. ఇప్పటివరకూ ప్రచురిస్తూవచ్చిన ఈ ప్రసంగాలు ప్రజల హితోపదేశానికి, ధార్మిక బోధనలకూ లాభదాయకం కాగలిగాయి. ఈ ప్రసంగాలు జుమాలలో కూడా చదివారు. ప్రజలు వీటి ద్వారా ప్రయోజనం కూడా పొందారు. అందుకే ఇప్పటివరకు వ్రాసినదంతా సంకలనం చేసి పుస్తకరూపంలో ఇప్పుడు మీ ముందుంచుతున్నాము.

విషయ సూచిక

అధ్యాయం ... పేజీ

అనంత కరుణామయుడు అపారకృపాశీలుడయిన అల్లాహ్ పేరుతో

1. సంకల్ప శుద్ధి

మహాశయులారా!

సాధారణంగా బాహ్య స్వరూపం రీత్యా ఇద్దరు వ్యక్తుల పనులు ఒకే విధంగా ఉంటాయి. కాని పరలోకంలో లభించే ఫలితాన్ని బట్టి వాటిలో చాలా తేడా ఉంటుంది. మీ కళ్ళెదుట ఇద్దరు వ్యక్తులు ఒకే విధమైన సత్కార్యం చేస్తున్నట్లు కనిపించడం సాధ్యమే. ఉదాహరణకు ఆ ఇరువురు చెరొక బావిని త్రవ్వించారు. కాని వారిలో ఒకతనికి పరలోకంలో తాను చేసిన పనికి సత్ఫలితం లభిస్తే, మరొకనికి ఏమీ లభించదు. ఎందుకని?

పరలోకంలో మనిషికి లభించే ప్రతిఫలం అతని సంకల్పంపై ఆధారపడి ఉంటుంది. సంకల్పం బాగుంటే అతనికి తన సత్కర్మల పుణ్యఫలం లభిస్తుంది. లేకపోతే పుణ్యఫలం లభించదు. ఏ పనయినా దేవుని ప్రీతి కోసం, అదీ ఆయన చూపిన పద్ధతి ప్రకారం చేస్తే పరలోకంలో దాని ప్రతిఫలం లభిస్తుంది. అయితే సత్కార్యం వెనుక దైవప్రీతికి బదులుగా మరొక ఉద్దేశ్యం ఉంటే పరలోకంలో దానికి ఎలాంటి విలువా ఉండదు. ఒక వ్యక్తి కేవలం పేరు ప్రతిష్ఠల కోసమని, తనను అందరూ మంచి వాడిగా భావించాలని బావిని త్రవ్విస్తే ఇంకా ఆ పేరు ప్రతిష్ఠల కారణంగా అతనేదయినా లాభం పొందగోరితే అలాంటి వ్యక్తికి పరలోకంలో అతను చేసిన ఆ పనికి ప్రతిఫలం లభించకూడదు. దేనికోసమయితే అతను పని చేశాడో అదే అతనికి లభించాలి. ఇదే న్యాయం కూడా. అయితే మరొక వ్యక్తి దైవం తనకు సిరిసంపదలు ప్రసాదించినందుకు కృతజ్ఞతగా బావిని త్రవ్విస్తాడు. ఈ సత్కార్యం వల్ల తన ప్రభువు సంతోషించాలని కోరుకుంటాడు. ఇంకా ఈ బావి వల్ల ప్రజలు కొంతకాలం వరకు ప్రయోజనం పొందా లని ఆశిస్తాడు. అలాంటప్పుడు అతనికి పరలోకంలో దాని ప్రతిఫలం తప్పనిసరిగా దొరకాలి.

హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజిఅన్) ఉల్లేఖించిన ఒక హదీసులో మహాప్రవక్త (సఅసం), "కర్మలు మనోసంకల్పంపై ఆధారపడి ఉంటాయి. మనిషికి తాను సంకల్పించిన వస్తువే ప్రాప్తమవుతుంది" అని తెలిపారు. అదే హదీసులో దైవప్రవక్త (సఅసం) ఈ విషయంపై వ్యాఖ్యానిస్తూ, "ఎవరయితే అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త కోసం హిజ్రత్ చేస్తారో వారి హిజ్రత్ మాత్రమే నిజమయినది. ఎవరయితే ప్రాపంచిక సిరిసంపదల కోసం, లేదా ఒక స్త్రీతో వివాహమాడటానికి హిజ్రత్ చేస్తారో వారి హిజ్రత్ ప్రపంచం కోసమో లేక ఒక స్త్రీ కోసమో చేసిన హిజ్రత్‌గా పరిగణించబడుతుంది" అని సెలవిచ్చారు.

సోదరులారా!

ఇస్లామ్ దృష్టిలో 'హి(జత్' ఓ గొప్ప ఆరాధన, పుణ్యకార్యమని మీ అందరికీ తెలుసు. అయితే పుణ్యం లభించాలని, దైవప్రీతి పొందాలని చేసినప్పుడే హి(జత్ వల్ల పుణ్య ఫలం లభిస్తుంది. ఒకవేళ హి(జత్ చేసేటప్పుడు సయితం సంకల్పంలో ఏదయినా చెడు ఉద్దేశ్యం కలిగితే దానికి ఎలాంటి విలువ లేదు. ఉదాహరణకు - ఈ విధంగా తన దేశం వదలి పరదేశానికి పోతే అక్కడ తన వ్యాపారం బాగా వృద్ధి పొందు తుందని, లేదా అక్కడికి చేరిన తరువాత ఫలానా స్త్రీని వివాహమాడవచ్చునని, లేదా అలాంటిదే మరేదయినా ప్రయోజనం పొందవచ్చునని అనుకుంటే అలాంటి వ్యక్తి చేసిన హి(జత్‌కు దేవుని దృష్టిలో ఎటువంటి విలువలేదని మహాప్రవక్త (సఅసం) అన్నారు.

ఈ విషయాన్ని గురించి దివ్యఖుర్‌ఆన్, హదీసుల్లో స్పష్టంగా వివరించబడింది. ప్రతి సత్కార్యం చేసే ముందు మనిషి తన సంకల్పం పట్ల శ్రద్ధ వహించాలని నొక్కి చెప్పబడింది. ఒకసారి మహాప్రవక్త (సఅసం) "అల్లాహ్ మీ రూపురేఖల్ని, మీ సిరిసంపదల్ని పరిశీలించడు, ఆయన మీ అంతర్యాన్ని, మీ ఆచరణను (మాత్రమే) గమనిస్తాడు" అని ప్రవచించారు.

సోదరులారా!

ఇది ఎంతో సున్నితమయిన అంశం. మనం దీన్ని గురించి చాలా శ్రద్ధ తీసుకోవాలి. మీరెన్ని సత్కార్యాలు చేసినా మీకు సంకల్ప శుద్ధి లేకపోతే మీరు చేసిన దంతా వృధా అవుతుంది. ఈ విధంగా మీరేది కోల్పోతారో ఆలోచించండి. దురదృష్ట కరమయిన ఓ రైతు విషయం వినండి: అతను ఎంతో శ్రమపడి భూమిని దున్నాడు. మేలు జాతి విత్తనాలు నాటాడు. పొలం పనిలోనూ, కావలి పనిలోనూ కొరత చేయలేదు. కాని కోత సమయం దగ్గరపడగానే పంటకు వ్యాధి సోకి ఒక్క గింజ కూడా పండకుండా తాలు మాత్రమే మిగిలినట్లు గమనించాడు. అచ్చంగా ఇలాంటి పరిస్థితే సంకల్ప శుద్ధిలేని పనులదీనూ. చూడటానికి అవి పైకి ఎంతో మంచి పనులుగా కనిపించినా, వాటి వెనుక ఎంతో(శమ, ధన వ్యయం ఉన్నా సంకల్పం సరిగా లేని కారణాన పరలోకంలో వాటికి ఎలాంటి ప్రతిపలం లభించదు. ఇహలోకంలోనే అతనికి లభించవలసిందేదో లభిస్తుంది. ఇతని స్థితి అచ్చం పంట కోసేటప్పుడు తాలు తప్ప మరేమీ చేతికి లభించని రైతులా ఉంది.

సోదరులారా!

ఇది మనమెంతో ఆలోచించవలసిన విషయం. మనమంతా సాధ్యమైన సత్కార్యాలన్నీ చెయ్యడానికి ప్రయత్నిస్తాం. వాటి కోసం సమయం, డబ్బు కూడా ఖర్చుపెడతాం. అయితే అప్పుడు మనం మన సంకల్పం ఎలా ఉందన్న విషయాన్ని

గురించి పరిశీలించుకోవడం ఎంతో అవసరం. లేకుంటే సంకల్పంలో ఏదయినా లోపం పొడసూపి దురదృష్టవశాత్తు మన కర్మలన్నీ వృధా కావచ్చు. మనం ఏ సత్కార్యం చేసినా దాని వెనుక దైవప్రీతి, పుణ్యం పొందే ఉద్దేశ్యం తప్ప మరేదీ ఉండకుండా ఎల్లప్పుడు జాగ్రత్తపడాలి. షైతాన్ మనిషికి పరమ శత్రువు. వాడు మనిషిని సన్మార్గానికి బదులుగా దుర్మార్గంలో పడవేయడానికే మొట్టమొదట ప్రయత్నిస్తాడు. అందులో విజయవంతం కాలేకపోతే, మానవుని సత్కర్మల్ని ఏ విధంగా వృధా చేయాలి అని పన్నాగాలు పన్నుతూ ఉంటాడు. దానికోసం వాడు ఎన్నుకున్న గట్టి మార్గం ఏమిటంటే మనం చేసే సత్కార్యాలకు మనలో రకరకాల చెడు ఉద్దేశ్యాలను పుట్టిస్తాడు. లోకులు చూసి గొప్ప భక్తుడు, పుణ్యాత్ముడని భావించాలన్న ఉద్దేశ్యంతో నమాజ్ చేసేలా మనల్ని షైతాన్ ప్రేరేపిస్తాడు. అలాగే మనం పేదలకు సహాయం, సంఘసేవ చేస్తున్నప్పుడు, "లోకులు నా దాతృత్వాన్ని గురించి చెప్పుకోవాలి, వారి హృదయాల్లో నా పట్ల గౌరవభావం కలగాలి; ఈ పేరు ప్రతిష్టలకు మూలంగా సంఘంలో నాకు మంచి స్థానం లభించాలి" అనే ఆలోచనల్ని మనలో వాడు కలిగింపజేస్తాడు. చివరికి ధర్మ సంస్థాపనం కోసం పాటుపడే హృదయాల్ని షైతాన్ తప్పుదోవ పట్టిస్తాడు. వారిలో కూడా అధికార పిపాస తప్ప మరే సదుద్దేశమూ మిగలకుండా చేస్తాడు.

సోదరులారా!

ఇది ఎంతో ప్రమాదకరమయిన స్థితి, అసలు ముస్లిమ్అనే వ్యక్తి మంచి పనులు కోరేవాడయి మాత్రమే ఉండాలి. అయితే అతను తన సంకల్పాన్ని గురించి అంతకంటే ఎక్కువ జాగ్రత్త వహించాలి. సంకల్పం సవ్యంగా లేని కారణంగా అతను చేసే సత్కర్మలన్నీ బూడిదలో పోసిన పన్నీరు కావచ్చు. దైవం ప్రసాదించే పుణ్యఫలం తప్ప గత్యంతరంలేని పరలోకంలో అతనికి ఏమీ దక్కక పోవచ్చు. పేరు ప్రతిష్ఠల పిపాస, ప్రదర్శనా వాంఛ మానవుని మనస్సులో అతనికి తెలియకుండానే చోటు చేసుకుంటాయి. అతను తన నోటితో ఎంతో మంచి మంచి మాటలు పలకవచ్చు. కాని లోకులు తనని మంచివాడని భావించాలన్న కోరిక తద్వారా తాను గొప్పవాడయిపోవాలన్న తపన అతని హృదయంలో తిష్ఠవేస్తాయి. ఆ విధంగా మనిషి చేసుకున్న సత్కార్యాలన్నీ వృధా అవుతాయి.

సోదరులారా!

అల్లాహ్ మనల్ని ఇలాంటి స్థితినుండి రక్షించాలని మనమంతా చిత్తశుద్ధితో దుఆ చేయాలి. ఇంకా మనం చేసే సత్కర్మల వెనుక దైవప్రీతి తప్ప మరే ఉద్దేశ్యమూ లేకుండా ఉండేలా ప్రయత్నించాలి.

2. పాపానికి నిష్కృతి పశ్చాత్తాపమే

మహాశయులారా!

మనలో పాపం చేయనివారెవరుంటారు? ఉదయం నుండి సాయంత్రం వరకు మనవల్ల ఎన్నో పాపాలు జరుగుతుంటాయి. అయితే పాపం జరిగిన ప్రతిసారీ పశ్చాత్తాపం చెంది దైవాన్ని క్షమాపణ వేడుకోవడం ముస్లిమ్ విధి. "విశ్వసించిన ప్రజలారా! మీరంతా అల్లాహ్ వైపునకు మరలి (మీ తప్పులకు) పశ్చాత్తాపపడండి. ఆ విధంగా మీరు సాఫల్యం పొందే అవకాశం ఉంది" అని దివ్యఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ముస్లి ములను ఆదేశిస్తున్నాడు. పశ్చాత్తాపం అనేది దాసుని లక్షణం. దేవుడు ఖుర్‌ఆన్‌లో మరో చోట ముస్లిమ్ గుణగణాలు వర్ణిస్తూ వారు "పశ్చాత్తాపం చెందే వారు" అని పేర్కొన్నాడు.

దీనివల్ల తెలిసేదేమిటంటే దాసుని వల్ల తప్పు జరగడం వింతేమీ కాదు. మానవుని వల్ల అనేక తప్పులు, పొరపాట్లు జరుగుతాయి. ఏమరపాటుకు లోనయి, షైతాన్ వలలో చిక్కుకుని అపమార్గం పడతాడు. అయితే అల్లాహ్‌ను విశ్వసించిన దాసుడు మాత్రం తన వల్ల తప్పు జరిగిందని గ్రహిస్తాడు. చేసిన తప్పుల్ని సమర్థించుకోవడానికి అడ్డదారులు వెతకకుండా అతను తక్షణమే పశ్చాత్తాప పడి దైవాన్ని వేడుకుంటాడు. దీన్నే 'తౌబా' అంటారు.

తౌబా అంటే మరలడం, వెనక్కి తిరిగి రావడం అనే అర్థాలున్నాయి. ఈ తౌబా మూడు షరతులపై ఆధారపడి ఉంది. ఒకటి, మానవుడు తాను చేసింది తప్పని మనస్ఫూర్తిగా ఒప్పుకోవాలి, సిగ్గుపడాలి. రెండు, వెంటనే ఆ తప్పుడు పనిని వదలిపెట్టాలి. మూడు, మళ్ళీ దాని జోలికి పోనని గట్టిగా నిర్ణయించుకోవాలి. తప్పుడు పనులకు అనుకూలంగా ప్రమాణాలు చూపెట్టే వారికి పశ్చాత్తాప భాగ్యం ఎన్నటికీ లభించదు. కొందరు ఒక వైపు తప్పు చేస్తూనే మరో వైపు పశ్చాత్తాపం కూడా చెందుతుంటారు. అలాంటి పశ్చాత్తాపానికి అర్థమే లేదు. అసలు పశ్చాత్తాపం అంటేనే చేస్తున్న తప్పుడు పనిని తక్షణమే మానేసి, ఇక ముందెప్పుడూ అలాంటి పనిని చేయనని మనసులో గట్టిగా నిర్ణయించుకోవడం.

సరే, ఇది దైవంతో సంబంధమున్న పాపాలను గురించిన విషయం. దాసులతో సంబంధమున్న పాపాలను గురించిన విషయం కూడా వినండి. ఉదాహరణకు ఒక వ్యక్తి ఎవరి హక్కయినా కాజేయడమో, లేదా ఎవరిపైనైనా అసత్య ఆరోపణ చేయడమో జరిగిందనుకోండి అలాంటి వ్యక్తి పాపం పోవాలంటే అతను చేసే తౌబాలోని పై మూడు షరతులతోపాటు మరో షరతు కూడా పాటించాలి. అతను ఎవరికి అన్యాయం చేశాడో

వారి దగ్గరకు పోయి క్షమాపణ పొందాలి; ఏదైనా హక్కు కాజేస్తే వారికి తిరిగి ఇచ్చివేయాలి.

సోదరులారా!

అల్లాహ్ మన పాపాలను, పొరపాట్లను క్షమిస్తున్నాడు. పాప పంకిలం నుండి బయల్పడి తన అనుగ్రహ ఛాయలో ఆశ్రయం పొందమని మాటిమాటికీ మనల్ని పిలుస్తున్నాడు. చూడండి, అల్లాహ్ మన పట్ల ఎంత దయామయుడో ఖుర్‌ఆన్‌లో ఆయన అనేక చోట్ల పశ్చాత్తాపం, మన్నింపులను గురించి బోధించాడు. ఆయనకు తన దాసుల పట్ల దయాదాక్షిణ్యాలే కాని విరోధం లేదు. ఆయన అనవసరంగా శిక్షించి సంతోషించడానికి మానవుల్ని సృష్టించలేదు. ఆయన అపార దయామయుడు. దయజూపడం, కనికరించడం ఆయన నైజం. దాసుడు ఎంత పెద్ద తప్పు చేసినా, చేసిన తప్పుల పట్ల సిగ్గుపడి అల్లాహ్ వైపునకు మరలితే అతడ్ని ఆయన తన సువిశాల అనుగ్రహఛాయలోనికి తీసుకుంటాడు. ఆయన తన సృష్టిజాలాన్ని ఎంతో అభిమానిస్తున్నాడు. హద్దులు మీరి దుర్మార్గంలో పడిపోయి దాన్ని విడిచి పెట్టని వారినే ఆయన శిక్షిస్తాడు.

మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) అల్లాహ్ అనుగ్రహాన్ని ప్రస్తావిస్తూ ఒకసారి ఓ మంచి ఉదాహరణ ద్వారా నచ్చజెప్పారు. ఆయన ఇలా అన్నారు, "మీలో ఎవరి ఒంటె అయినా నీళ్ళూ, జన సంచారం లేని (భయంకర) ఎడారిలో తప్పిపోయిందనుకోండి. అతను తాగే నీళ్ళు తినే ఆహారం కూడా ఆ ఒంటెపైనే ఉన్నాయనుకోండి. అప్పుడు ఆ వ్యక్తి ఒంటెకోసం వెతికి వెతికి నిరాశ చెందుతాడు. జీవితంపై విరక్తి కలిగి ఓ చెట్టు కింద పడుకుంటాడు. సరిగ్గా అలాంటి పరిస్థితిలోనే తప్పిపోయిన ఆ ఒంటె హఠాత్తుగా అతని ముందు నిల్చుంటుంది. అప్పుడతనికి ఎంత సంతోషం కలుగుతుందో అంతకంటే అనేక రెట్ల సంతోషం దైవానికి తన తప్పిపోయిన దాసుడు తిరిగి వచ్చినప్పుడు కలుగుతుంది." అంతకంటే ఆసక్తికరమయిన మరో ఉదాహరణ ఉంది. ఒకసారి దైవ ప్రవక్త (సఅసం) దగ్గరికి కొందరు యుద్ధ ఖైదీలను తీసుకొని రావడం జరిగింది. వారిలో ఒక మహిళ కూడా ఉంది. ఆమె పాలు తాగే పసిపిల్లవాడు ఎక్కడో తప్పిపోయాడు. ఆ కారణంగా ఆమె మాతృ హృదయం తల్లడిల్లసాగింది. పాపం ఆ మాతృమూర్తి ఏ పసిపిల్లవాడు కనిపించినా గుండెలకు హత్తుకొని పాలిస్తుండేది. దైవప్రవక్త (సఅసం) ఆమె పరిస్థితి చూసి సహచరులతో, "ఈ తల్లి తన బిడ్డను స్వయంగా తన చేతులతో అగ్నిలోకి విసిరివేస్తుందని మీరు ఊహించగలరా?" అని అడిగారు. దానికి వారు, "లేదు, అలా ఎన్నటికీ ఊహించలేము. స్వయంగా ఆమె విసిరివేయడం కాదుకదా, బిడ్డ తనంతట తాను నిప్పులో పడిపోవడం చూస్తే ఆ బిడ్డను కాపాడటంలో కూడా ఆమె ఏ మాత్రం కొరత చేయదు" అని పలికారు. అప్పుడు దైవ ప్రవక్త "ఈ స్త్రీకి తన

పిల్లవాడిపై ఎంత కనికరం ఉందో అల్లాహ్‌కు తన దాసులపై అంతకంటే ఎక్కువ కనికరం ఉంది" అన్నారు.

సోదరులారా!

మనం కాస్త ఆలోచిస్తే పిల్లల పెంపకం కోసం తల్లిదండ్రుల హృదయాల్లో ప్రేమాభిమానాలు కలిగించింది అసలు అల్లాహేనన్నది స్పష్టమవుతుంది. ఒకవేళ దైవం తల్లిదండ్రుల హృదయాలలో ఈ ప్రేమాభిమానాలు కలిగించకపోతే వారీ కష్టాలన్నీ ఎందుకు పడతారు? తమ సుఖ శాంతులు వదులుకొని ఇక్కట్లు ఎందుకు అనుభవిస్తారు? కనుక తల్లిదండ్రుల హృదయాలలో తమ సంతానం పట్ల ప్రేమాభిమానాలు ఉంచిన దేవుడు స్వయంగా తన సృష్టిజాలాన్ని మరెంతగా ప్రేమిస్తాడో దీన్ని బట్టి ప్రతివ్యక్తి అర్థం చేసుకోగలడు. దివ్యఖుర్‌ఆన్‌లో "ప్రజలారా! మీ ప్రభువుని వేడుకోండి. ఆయన వైపునకు మరలండి. నిస్సందేహంగా నా ప్రభువు కరుణామయుడు. ఆయన తన సృష్టిజాలాన్ని అభిమానిస్తున్నాడు" అని తెలియజేయబడింది.

సోదరులారా!

దాసుడు తన పాప క్షమాపణకై దైవం వైపునకు మరలడం అల్లాహ్‌కు ఎంత ఇష్టమో ఆలోచించండి. మరోవైపు "మానవులారా! మీ ప్రభువుని వేడుకోండి. ఆయన వైపునకు మరలండి. ఆయన కొంత కాలం వరకు మీకు మంచి జీవితావసరాలను ప్రసాదిస్తాడు" అని ఆయన తన దాసుల్ని పిలుస్తున్నాడు. దీనివల్ల తెలిసేదేమంటే పశ్చాత్తాపం చెందేవారిని అల్లాహ్ పరలోకంలో మాత్రమేగాక, ఇహలోకంలోనూ అనుగ్రహిస్తాడు. ఒకవేళ ఏదయినా ఓ జాతి ఇహలోకంలో తన భ్రష్ట వైఖరిని విడిచిపెట్టి దేవుని ఆదేశాలకు అనుగుణంగా తన జీవితాన్ని మలచుకుంటే ఆ జాతికి ఇహలోకంలోనూ దైవానుగ్రహం లభిస్తుంది. దాని జాతకంలో దేవుడు వినాశనం, శిక్షలకు బదులుగా బహుమానం, ప్రగతి, అభ్యున్నతుల్ని రాస్తాడు.

దేవుని కరుణా కటాక్షాలను మన వైపు మళ్ళించుకోవడానికి పశ్చాత్తాపం (తౌబా) ఒక్కటే అన్నిటికంటే మంచి మార్గం. ఒకసారి మహాప్రవక్త 'దైవసాక్షి! నేను రోజుకు డెబ్బయిసార్లకన్నా ఎక్కువ దైవ మన్నింపును కోరుకుంటాను, పశ్చాత్తాపం చెందుతాను' అని తెలిపారు. మరొకసారి ఆయన, "ప్రజలారా! అల్లాహ్ సన్నిధిలో పశ్చాత్తాపం చెందండి; క్షమాపణ వేడుకోండి. నేను రోజుకు వందసార్లు పశ్చాత్తాపం పడతాను" అని ప్రబోధించారు.

అల్లాహ్ యొక్క క్షమాపణ ఆయన ఇతర గుణగణాలకు మాదిరిగానే అపరిమితమయినది. మానవుడు ఎన్ని తప్పులు చేసినా, అతని తప్పులు అంచనాక్కూడా అందనన్ని ఉన్నా సరే, అతను మనస్ఫూర్తిగా పశ్చాత్తాపం చెందితే అల్లాహ్ అతడ్ని క్షమిస్తాడు. అలాగే ఎంత మంది పాపాత్ములు తన వైపునకు మరలినా అల్లాహ్

వారందర్ని క్షమిస్తాడు. ఆయన క్షమాగుణం విస్తృతమయినది. ఈ విషయాన్ని వివరిస్తూ మహాప్రవక్త (సఅసం), "పగటివేళ పాపం చేసినవారు పశ్చాత్తాపం చెంది క్షమాపణ వేడుకోవడానికి అల్లాహ్ తన చేతిని రాత్రివేళ చాపుతాడు. రాత్రివేళ పాపం చేసినవారు పశ్చాత్తాపం చెంది క్షమాపణ వేడుకోవటానికి ఆయన తన చేతిని పగటివేళ చాపుతాడు" అని బోధించారు. పశ్చాత్తాప ద్వారం ప్రతి వ్యక్తి కోసం ప్రతి వేళా తెరువబడే ఉంటుంది. మరణ చిహ్నాలు కనిపించే వరకు ప్రతి వ్యక్తికీ దైవ మన్నింపు పొందే అవకాశం ఉంది. మరణ చిహ్నాలు కనిపిస్తే మాత్రం ఈ అవకాశం కాస్తా చేజారిపోతుంది.

సోదరులారా!

మనలో ప్రతి ఒక్కరూ మరణించవలసిందే. ఈ యదార్థం అందరికీ తెలుసు. కాని మరణం ఎప్పుడొస్తుందో ఎవరికీ తెలియదు. కనుక పశ్చాత్తాపం గురించి మనం క్షణంపాటు కూడా అశ్రద్ధ చేయకూడదు. పూర్తి స్పృహతో మాటిమాటికి పశ్చాత్తాపపడి దైవాన్ని వేడుకోవాలి. ఉదయం నుండి సాయంత్రం వరకు మనం చేసిన పనుల్ని గురించి ఆత్మ పరిశీలన చేసుకోవాలి; చేసిన తప్పుకు సిగ్గుపడాలి; పశ్చాత్తాపం చెందాలి. మనస్ఫూర్తిగా మన ప్రభువుని క్షమాపణ వేడుకోవాలి. ఇక నుండి ఇలాంటి తప్పులు చేయనని నిర్ణయించుకోవాలి. ఇలా ప్రతి రోజూ చేస్తుండాలి.

సోదరులారా!

మన పాపాల నిష్కృతికోసం పశ్చాత్తాపం చెంది క్షమాపణ అయితే వేడుకోవాల్సిందే. అయితే దాంతోపాటు "క్రియాత్మక పశ్చాత్తాపం" కూడా జరగాలి. అంటే క్షమాపణ వేడుకోవడంతోపాటు దైవ మార్గంలో కొంత ధనం ఖర్చుపెట్టాలి. మంచి వైపునకు మరలడానికి ఈ చర్య ఎంతో దోహదపడుతుంది. అల్లాహ్ అనుగ్రహంతో మనిషికి తన పరిస్థితిని మెరుగుపరచుకోవడంలో సౌలభ్యం కలుగుతుంది. "నిప్పును నీరు ఎలా ఆర్పి అంతం చేస్తుందో, అదే విధంగా దానం పాపాలను నిర్మూలిస్తుంద"ని మన ప్రియ ప్రవక్త (సఅసం) బోధించారు.

3. సహనం సజ్జనుల సొత్తు

మహాశయులారా!

సహనం ముస్లిమ్‌కు ఉండవలసిన ముఖ్యమైన గుణమని మీరు వినే వుంటారు. "సహనం వహించేవారికి దాని ప్రతిఫలం లెక్కలేనంతగా ఇవ్వబడుతుంద"ని ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ తెలియజేస్తున్నాడు. "అల్లాహ్ సహనం వహించేవారితో ఉన్నాడ"ని ఒకచోట ఉంది. "సహనపరులకు శుభవార్తను వినిపించమ"ని అల్లాహ్ తన ప్రవక్త (సఅసం)తో అన్నాడు. "అల్లాహ్ ఓర్పు వహించేవారితో మైత్రి చేస్తాడని" దివ్యఖుర్‌ఆన్ తెలుపుతోంది. అల్లాహ్ తన గ్రంథంలో, "వారికి వారు వహించిన సహనానికి ప్రతిఫలంగా అద్భుతమయిన మేడలు ప్రసాదించబడతాయ"ని శుభవార్త వినిపిస్తున్నాడు. వేరొక చోట ఖుర్‌ఆన్‌లో "ఆయన వారికి వారి సహనానికి ప్రతిఫలంగా స్వర్గాన్ని ప్రసాదించాడ"ని ఉంది. స్వర్గంలో దైవదూతలు విశ్వసించిన వారి దగ్గరకు వచ్చి "మీకు శాంతి కలుగుగాక, ప్రపంచంలో మీరు ఏ విధంగా సహనం వహించారో దానికి ప్రతిఫలంగా ఈ రోజు మీరు దీనికి (స్వర్గానికి) అర్హులయ్యారు" అని పలుకుతారు.

అల్లాహ్ దివ్యఖుర్‌ఆన్‌లో, సహనం వహించాలని దైవ ప్రవక్త (సఅసం)కు, విశ్వసించిన వారికి మాటిమాటికి ఎలా తాకీదు చేశాడో చూడండి: "సహనం వహించండి, భయభక్తులు కలవారికే మంచి ప్రతిఫలం ఉంది. ఉత్తమోత్తమమైన రీతిలో ఓర్పు వహించు" అని ప్రబోధించాడు ఆయన.

ఇలా దివ్యఖుర్‌ఆన్‌లో సహనం గురించి అనేక ఆయత్‌లు వచ్చాయి. వీటిని బట్టి ముస్లిమ్‌లకు సహనం అలవర్చుకోవలసిన ఆవశ్యకత ఎంత ఉందో తెలుస్తోంది. అలాంటి సుగుణాన్ని అలవర్చుకోవాలని అల్లాహ్ మనల్ని ఆదేశిస్తున్నాడు. ఆ సుగుణాన్ని అలవర్చుకునేవారిని ఆయన ఎంతో అభిమానిస్తాడు; వారి కోసం పరలోకంలో గొప్ప పుణ్యఫలాన్ని ప్రసాదిస్తాడు. కనుక సోదరులారా! ఇంతటి పుణ్యఫలాన్ని ఇవ్వగల ఈ సహనం యొక్క వాస్తవికత ఏమిటో కాస్త ఆలోచించండి. ఒకసారి మహాప్రవక్త (సఅసం), "సహనం కంటే ఎక్కువ మంచిది, లాభకరమయినది అయినటువంటి ఏ వస్తువూ ఎవరికీ ప్రసాదించబడలేద"ని అన్నారు, చూశారా! సహనం ఎంత గొప్ప పుణ్య కార్యమో! దానికింత గొప్ప ప్రతిఫలం ఎందుకివ్వబడుతుందో!!

సోదరులారా!

సహనాన్ని అరబ్బీ భాషలో 'సబ్ర్' అంటారు. ఈ పదానికి ఎంతో విస్తృతమయిన భావం ఉంది. మన భావోద్రేకాలను, మనో వాంఛలను అదుపులో పెట్టుకోవడమూ సహనమే. ఆత్రం, ఆవేశం, తొందరపాటుతనాలకు స్వస్తిచెప్పి ప్రవర్తించడమూ

సహనమే. భయప్రలోభాలు ఎదురయినప్పుడు నిజస్థానం వదలిపెట్టకుండా స్థిరంగా ఉండటమూ సహనమే. ప్రశాంతంగా ఆలోచించి తీసుకున్న సముచిత నిర్ణయంపై అమలు చేయడమూ సహనమే. ఎన్ని ఆపదలొచ్చినా, ఎన్ని ప్రమాదాలు ఎదురయినా సరే కదలని కొండలా స్థిరంగా ఉంటే అదీ సహనమే. కోపోద్రేకాలు వచ్చినప్పుడు వాటిని అణచిపెట్టుకోవడం కూడా సహనమే. ఆవేశం, ఉద్రేక సమయాల్లో తప్పుడు పని చేయకుండా ఉండటమన్నది కూడా సహనం కిందికే వస్తుంది. ఎలాంటి కష్టాలు వచ్చిపడినా, పరిస్థితులు మారిపోతున్న సూచనలు కనిపించినా ఆందోళన చెందకుండా ఉండటం కూడా సహనమే. ఏదయినా ఒక లక్ష్యాన్ని సాధించే ఉత్సాహంలో తొందరపాటు పడకపోవడం కూడా సహనమే.

ప్రాపంచిక ప్రయోజనాలు, మనోవాంఛలు, ఇంకా అలాంటివే రకరకాల విషయాలు మనిషి హృదయాన్ని కలవరపరుస్తాయి. అలాంటి సమయంలో పరిస్థితుల ప్రభావానికి కొట్టుకుపోయి తప్పుడు చర్యలు తీసుకోకుండా సరైన మార్గంపై స్థిరంగా ఉండాలి. అప్పుడు అదీ సహనమే అనిపించుకుంటుంది. దివ్యఖుర్‌ఆన్‌లో 'సబ్ర్' అనే పదం ఎక్కడెక్కడ ఏ విధంగా వాడబడిందో గమనిస్తే అందులో ఎంతో విస్తృతమైన భావం ఉన్నట్టు కనిపిస్తుంది, ఆలోచించండి! సహనం విషయంలో ఖుర్‌ఆన్ సూచించిన ఈ మొత్తం సందర్భాలలో ముస్లిమ్ తన మనస్సుని అదుపులో ఉంచుకొని ఏ విధమయిన తప్పుడు చర్యకూ పాల్పడకుండా ఉంటే ఇది గొప్ప సాహసకార్యమనడంలో ఎలాంటి సందేహం లేదు. ఉదాహరణకు ఎవరైనా ఒకడు మనల్ని బాధ పెడుతున్నాడనుకోండి, తిరిగి అతడ్ని బాధ పెట్టగల శక్తి మనకూ ఉంటుంది. అయితే మనపై జరుగుతున్న ఈ దౌర్జన్యాన్ని మనం ఓర్చుకుంటే మన ప్రభువు సంతోషిస్తాడని భావించి ఆ వ్యక్తికి ప్రతీకారం చేయం. మనం చూపిన ఈ ఓర్పుకు ఎలాంటి ప్రతిఫలం లభించకుండా వృథా అవుతుందంటారా? ముమ్మాటికీ వృథాకాదు. అలాగే మనకు వ్యతిరేకంగా ఎవరయినా నిందారోపణలు చేస్తున్నారనుకోండి. అతను చేసిన పొరపాట్లు, తప్పుడు పనులు మనకు తెలుసు, వాటినిజనంలో ప్రచారం చేసి అతడ్ని కూడా అప్రతిష్టపాల్జెయ్యమని మన ఆంతరంగం అంటుంది; కాని అలా చేస్తే దైవప్రీతికి దూరమవుతామని మనం అలా చేయము. ఇలా మనోకాంక్షను అణచి ఉంచడం వల్ల మనకు మరో బాధకూడా కలుగుతుంది. దాన్ని కూడా మనం సహిస్తాం. ఇంత బాధను సహించిన మనకు ఎలాంటి ప్రతిఫలం లభించకపోవడం సమంజసమేనా?

మనిషిని ప్రతి చెడువైపునకు తీసుకెళ్ళేది అతని మనో వాంఛే అన్న విషయం మీకు తెలుసు. అంటే సహనం చెడుల్ని అరికట్టగలిగే ఓ మంచి సాధనం. దీన్ని ఉపయోగించుకోకపోతే సత్కార్యాలకు దూరమై చెడుల రొంపిలో కూరుకుపోయే ప్రమాదం ఉంది.

ఒక వ్యక్తి ఆర్థిక ఇబ్బందుల్లో పడిపోతాడు. నీతిగా సంపాదించడానికి ఎంత ప్రయత్నించినా లాభంలేకపోతుంది. అలా కాకుండా అధర్మ పద్ధతులు, అక్రమ మార్గాల ద్వారా ప్రయత్నిస్తే అతనికి ఎంతో సులువుగా ఉపాధి లభిస్తుంది. అయితే అతను అలాంటి పరిస్థితిలో దైవాగ్రహానికి భయపడి అక్రమ పద్ధతుల జోలికి పోకుండా ధర్మసంపాదనా కృషిలో ఎదురయ్యే కష్టాలను భరించగలుగుతాడు. అంటే ఇది ఆ వ్యక్తి చూపిన సహనం అన్నమాట. దాని ప్రతిఫలం అతనికి తప్పకుండా లభించాలి. అలాగే మరో వ్యక్తి ఆర్థికంగా ఏ లోటూ లేకుండా సుఖ జీవనం సాగిస్తాడు. నీతి మార్గాల ద్వారా అల్లాహ్ అతనికి అపార సిరిసంపదలు ప్రసాదించాడు. సాధారణంగా ధనం తనతోపాటు భోగలాలసను, పేరు ప్రతిష్ఠల కాంక్షను కూడా తీసుకొస్తుంది. మనోవాంఛలు అడుగడుగునా డబ్బును రకరకాలుగా ఖర్చుపెట్టిస్తాయి. కాని అలాంటి సమయంలో దైవాన్ని, దైవ ప్రవక్త (సఅసం)ను విశ్వసించిన ఈ వ్యక్తి మధ్యేమార్గంపై స్థిరంగా ఉంటాడు. దైవాగ్రహానికి కారణభూతమయ్యే ఎలాంటి పనిలోనూ తన సంపదను ఖర్చుపెట్టకుండా చెడు కోర్కెలు ప్రేరేపించినప్పుడల్లా మనస్సుకు కళ్ళెంవేస్తూ ఉంటాడు. ఆ విధంగా ఇతనూ సహనం వహిస్తాడు. కనుక దాని ప్రతిఫలానికి ఇతనూ అర్హుడే.

ఒక వర్తకుడి సంగతి కూడా తీసుకుందాము. వ్యాపారం జోరుగా సాగుతుంది. వ్యాపార వ్యవహారం నుంచి దృష్టి ఏ కాస్త మళ్ళించినా నష్టం కలుగుతున్నట్లు ఉంటుంది పరిస్థితి. సరిగ్గా అదే సమయంలో ఒక్కోసారి ధార్మిక విధులు వస్తాయి. సరుకు కొనడానికి వచ్చిన వారిని వదలి, సామూహిక నమాజ్ కోసం దుకాణం నుంచి లేచిపోవలసి వస్తుంది. ఒకవైపు జోరుగా సాగుతున్న వ్యాపారమయితే, మరో వైపు దైవాజ్ఞల పిలుపు మనసును తికమకపెట్టే పరిస్థితి. కాని అలాంటి సమయంలో బాహ్య ప్రయోజనాలను వదులుకోవడమంటే సహనం వహించడమే అవుతుంది. దాని ప్రతిఫలం తప్పనిసరిగా లభించాల్సిందే.

ఇదే విధంగా మన దైనందిన జీవితంలో రకరకాల సందర్భాలు ఉదయం నుండి సాయంత్రం వరకూ ఎదురవుతూ ఉంటాయి. ఒకవైపు మనో వాంఛలు లాగుతుంటే, మరో వైపు ధార్మిక, నైతిక విధులు పిలుస్తుంటాయి. మనల్ని కుటుంబ సమస్యలు, సంతానంపట్ల ప్రేమ, సంతానం చూపే అవిధేయత, బంధుమిత్రుల నమ్మకద్రోహం, నౌకర్ల తలబిరుసుతనం, వ్యాపార భాగస్వాముల అవినీతి చర్యలు, అధికారుల నిరంకుశ ధోరణి - ఒకటేమిటి, అడుగడుగునా ముస్లిమ్‌కు ఏదో ఒక పరీక్ష ఎదురవుతూనే ఉంటుంది. ఎవరయినా నీకు కీడు తలపెడితే నువ్వూ అతనికి కీడు చెయ్యమని, నిన్ను ఆదుకోనివాడ్ని నువ్వు ఆదుకోవద్దని మనసు అంటుంది. కాని అలాంటి సమయాల్లోనే నీలోని నైతిక ఔన్నత్యాన్ని నిరూపించుకోవాలని ధర్మం పట్ల మన విశ్వాసం అంటుంది.

4. ఓర్మి కలవారే విజేతలు

మహాశయులారా!

మానవుడు అన్నాక ఏదో ఒక రూపేణ కష్టాలు రాకుండా ఉండవు. ఈ కష్టాలు ఒకసారి శారీరకమయినవయితే మరోసారి ఆర్థికమయినవై ఉంటాయి. మనిషి జబ్బు పడతాడు; అతని కుటుంబ సభ్యులు, దగ్గరి బంధువులు, ప్రాణ మిత్రులు వ్యాధిగ్రస్తులవుతారు; అతని వ్యాపారంలో నష్టం వస్తుంది; కరువు కాటకాలొచ్చి పంటలు పండకుండా పోతాయి; భార్యా పిల్లలు, బంధువులు అందర్నీ వదలి ఒక రోజు శాశ్వతంగా ఈ లోకం నుండే వెళ్ళిపోతాడు. ఒక్కోసారి చూస్తుండగానే మన కళ్ళెదుట గొప్ప గొప్ప స్థితిపరులు, రాజ్యాధినేతలు సయితం సర్వస్వాన్ని కోల్పోయి బికారులుగా మిగిలిపోతారు. లక్షలాది ఆస్తులు బూడిదపాలయి పోతాయి. వీటి నుండి ఏ ఒక్కరూ బయటపడలేరు. కాకపోతే కొందరికి తక్కువ, మరికొందరికి ఎక్కువ అంతే.

ఇలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు మనం ఏం చేయాలి? మన ప్రభువు, పరిపోషకుడు అయిన అల్లాహ్ అమిత దయగలవాడని మనం విశ్వసిస్తున్నాము. స్వయంగా ఆయన దివ్యఖుర్ఆన్‌లో "మీ ప్రభువు గొప్ప కారుణ్యమూర్తి" అని తెలిపాడు. ఇంకా ఆయన ఖుర్ఆన్‌లో మరొక చోట "నా కారుణ్యం ప్రతి వస్తువునీ ఆవరించి ఉంద"ని పేర్కొన్నాడు. మన ప్రభువు ఇంతటి కరుణామయుడయినప్పుడు మరి ఈ కష్టాలేమిటి? అనే సందేహం వస్తుంది. కష్టాలనేవి ఆయన్ని తిరస్కరించి దుర్మార్గంలో పడిన వారికి వస్తాయి అంటే ఒక అర్థం ఉంది. కాని ఆయన్ని విశ్వసించి సన్మార్గం అవలంబించిన వారిక్కూడా వస్తున్నాయే ఈ కష్టాలు. కారణం ఏమిటి? సరైన ధార్మిక పరిజ్ఞానం లేక పోవడం వల్లనే ఇలాంటి ప్రశ్నలు మనల్ని వేధిస్తాయి. ప్రాపంచిక జీవితం యొక్క అసలు స్థానం ఏమిటో తెలిస్తే మన హృదయాల్లోకి ఇలాంటి ప్రశ్నలే రావు.

సోదరులారా!

ఈ ప్రపంచ జీవితం అసలైన జీవితం కాదని మన విశ్వాసం. ఇది మన శాశ్వత జీవితం యొక్క ఒక మజిలీ మాత్రమే. శాశ్వత జీవితం మరణం తరువాత ప్రారంభమవుతుంది. మరణానికి ముందు ప్రతి మానవుడికీ ఈ ప్రపంచంలో కొంత వ్యవధి ఇవ్వడం జరిగింది కదా! నిజానికి ఇది రాబోయే జీవితం కోసం పుణ్యం సంపాదించుకోవడానికి ఇవ్వబడిన గడువు కాలం మాత్రమే. ఒక వ్యక్తికి ప్రాపంచిక

జీవితంలో అపార భోగభాగ్యాలు లభిస్తుంటే, అది అతను చేసుకున్న సత్కర్మల ఫలితంకాని లేదా దైవం తరపున బహుమానం కాని కానవసరంలేదు. అలాగే మరో వ్యక్తి దుర్భర కష్టాల్లో చిక్కుకుంటే అది అతని దుష్కర్మల పర్యవసానమనో లేదా దైవం విధించిన శిక్ష అనో అనలేము. ఈ ప్రపంచం ఒక పరీక్షా స్థలం మాత్రమే. ఇక్కడ విశ్వ ప్రభువు ప్రతి మానవుణ్ని పరీక్షిస్తాడు. కొందరికి భోగభాగ్యాలు ప్రసాదించి పరీక్షిస్తే, మరికొందరికి బాధలు, కష్టాల ద్వారా పరీక్షిస్తాడు.

దేవుడు ఎవరికయినా శారీరకంగాగాని, ఆర్థికంగా గాని ఏదైనా కష్టం కలిగించాడంటే, దానర్థం దేవుడు అతణ్ని శిక్షించాలని లేదా అంతమొందించాలని భావిస్తున్నాడని కాదు, దీని ద్వారా దేవుడు మానవుణ్ని ఒక్కోసారి హెచ్చరిస్తాడు, ఒక్కోసారి పరీక్షిస్తాడు, కష్టాల ద్వారానైనా అతని హృదయం కరిగి మంచిని స్వీకరిస్తాడేమోనని దేవుడు ఇలా కష్టాలను తెచ్చి పెడతాడు. తన దాసుని దగ్గర సహన శక్తి ఎంత ఉంది. తన మీద అతనికి ఏ మేరకు విశ్వాసం, నమ్మకాలు ఉన్నాయి అనే విషయాలను గురించి తెలుసుకోడానికి దేవుడు మనిషిపై ఆపదలు తెస్తాడు. వీటివల్ల మనిషి విశ్వాసం పటిష్టమవుతుంది. దైవంపై భరోసా పెరుగుతుంది. అతనిలో సహనం, స్థిరత్వాల శక్తి వృద్ధి చెందుతుంది.

"నా నుండి వేరైపోయిన వానితో నేను సంబంధం కలిగి ఉంటాను; నాపై దౌర్జన్యం చేసిన వానిని నేను క్షమిస్తాను" అన్నారు మన ప్రియ ప్రవక్త (సఅసం). ఇలాంటి అమృత పలుకులు వినగానే అంతరంగం ఆనందానుభూతితో పులకరిస్తుంది. చెడు తలంపులు, నిర్ణయాలు ఒక్కసారి మారిపోతాయి. ధర్మపథంలో స్థిరంగా ఉంటాము. ఇది ఎంతో గొప్ప సహనం. సహనమే కాదు, సాహస కృత్యం కూడా. అందువల్లనే అల్లాహ్ తన దివ్యగ్రంథంలో, "ఎవడైతే సహనం వహించాడో, క్షమాగుణంతో ప్రవర్తించాడో, (అతడు చేసిన) ఈ పని అత్యున్నత స్థాయికి చెందిన కార్యం" అని అభివర్ణించాడు.

సత్యం సహనాలకు మధ్య గొప్ప అవినాభావ సంబంధం ఉంది. సత్యాన్ని అవలంబించవలసివచ్చినా, సత్యంపై స్థిరంగా ఉండవలసి వచ్చినా ఆ రెండు పరిస్థితుల్లోనూ మనకు సహనం ఎంతో అవసరం. ఒక్కోసారి పరిస్థితులు మనకు ఏ మాత్రం అనుకూలంగా ఉండవు. సత్యాన్ని గురించి మాట్లాడేందుకు పెదవి విప్పడమంటే ఆపదలను కొని తెచ్చుకున్నట్లే. అయితే అలాంటి సమయంలోనూ, పరిస్థితుల ఒత్తిడికి తలవగ్గకుండా సత్యంపై స్థిరంగా ఉండాలి. ఎన్ని బాధలు, కష్టాలు వచ్చినా భరించగలగాలి. అప్పుడే మనం సహనపరులమని దైవంచే గుర్తించబడతాము.

ఇక ధర్మ ప్రచార కార్యంలోనయితే మనం అనేక పరీక్షలను ఎదుర్కోవలసి వస్తుంది. దైవ తిరస్కారులు ఈ వ్యవహారంలో అనేక ఆటంకాలు కలిగిస్తారు; రకరకాలుగా భయపెడతారు. నిరాధారమయిన ఆరోపణలు, నిందలు మోపుతారు. వీటన్నిటినీ నిర్భయంగా ఎదుర్కొంటూ దైవ ధర్మ పరిచయ కార్యాన్ని నిరాఘాటంగా కొనసాగించడం గొప్ప సహనంతో కూడుకున్న పని.

ఒక్కోసారి ధర్మ ప్రచార పని సంవత్సరాల తరబడి చేసినా ఏ ఒక్కరూ దాన్ని ఆలకించరు. ప్రజల్లో మంచీ చెడుల విచక్షణ సన్నగిల్లిపోతుంది. సమాజంలో దైవ తిరస్కారం, పరలోక విస్మరణ సర్వసామాన్యమైపోతాయి. చెడు విషయాలు క్రమేణా మంచి విషయాలుగా మారిపోతాయి. మంచికి విలువ లేకుండా పోతుంది. అలాంటి పరిస్థితిలో ధర్మ ప్రచార పని చేసే వ్యక్తిని తన వలలో వేసుకోవడానికి షైతాన్ ప్రయత్నిస్తాడు. ఎవరూ నీ మాట వినకపోతే వృధా ప్రచారం ఎందుకు చేస్తావని అధైర్య పరుస్తాడు. మరో వైపు ధర్మప్రచారం చేసే వ్యక్తిని ప్రజలు పిచ్చివాడికింద జమకడతారు. కాని కర్తవ్య పరాయణుడైన ముస్లిమ్ షైతాన్ వలలో పడలేడు. లోకులు ఎగతాళి చేస్తున్నారని సిగ్గు పడడు. ఎవరూ తనతో సహకరించడం లేదని నిస్పృహకు గురికాడు. దైవం మోపిన ధర్మ ప్రచార బాధ్యతను అతను కొనసాగిస్తూనే ఉంటాడు. కేవలం దైవ ప్రీతి కోసం తానీ మహాకార్యం చేస్తున్నానని అతను భావిస్తాడు. అందువల్ల దైవమార్గంలో ఎదురయ్యే ఈ బాధలన్నీ అతను సునాయాసంగా భరించగలుగుతాడు.

దాసుడు దైవప్రీతిని ఎంతగా కోరుకుంటాడో అంతగా అతని విశ్వాస బలం పెరుగుతుంది. తనకు మంచి జరిగినా, చెడు జరిగినా, కష్టాలొచ్చినా, భోగభాగ్యాలు లభించినా అదంతా తన ప్రభువు తరపు నుండే వస్తున్నాయని అతను భావిస్తాడు. ఏది జరిగినా తన స్వామి నిర్ణయమేనని తలుస్తాడు. అలాంటప్పుడు ఈ కష్టాలు, బాధలు అతడ్ని ఏమీ చేయలేవు. వాటన్నిటిని ఎంతో తేలిగ్గా భరిస్తాడు. పైగా వాటివల్ల అతనికి ఒక విధమయిన ఆనందానుభూతి కూడా కలుగుతుంది. ఈ మహాభాగ్యం దైవానికి అత్యంత సన్నిహితులైన దాసులకే ప్రాప్తమవుతుంది.

సోదరులారా!

కష్టాలొచ్చి పడినప్పుడు సహనం వహించడం, దైవనిర్ణయాన్ని సంతోషంగా స్వీకరించడం ఎంతో గొప్ప భాగ్యం. ఇది ఎంత గొప్ప భాగ్యమంటే దానికి మించిన మహాభాగ్యమే లేదు. ఆ మహాభాగ్యం ఫలితంగా దాసుని పాపాలు క్షమించబడతాయి. పరలోకంలో అతనికి అత్యున్నత స్థానం లభిస్తుంది. అసలీ కష్టాలు, బాధలు సహనం వహించే సజ్జనుల పాలిట కారుణ్య ప్రదాయమవుతాయి. అందుకే కొందరు మహాత్ములు

అన్నారు "ఇహలోకంలో కష్టాలే లేకపోతే పరలోకంలో బహుశా మనం ఖాళీ చేతులతో ఉండాల్సి వస్తుందేమో" అని. ముస్లిముకు ఇటు సుఖ సంతోషాల్లోనూ, అటు ఆపదల్లోనూ శ్రేయమే శ్రేయముంది. సుఖ సంతోషాలు లభిస్తే దైవానికి కృతజ్ఞతలు అర్పిస్తాడు; దైవ కారుణ్యం కోసం మరింత ఉత్సాహంగా సత్కార్యాలు చేస్తాడు. ఒకవేళ ఆపదలు వచ్చి పడినా అతను ధైర్యం వీడక నిగ్రహాన్ని పాటిస్తాడు. ఆ విధంగా విశ్వప్రభువు దగ్గర తన నిగ్రహానికి తగిన పారితోషికం పొందుతాడు.

సోదరులారా!

ఆపదలు ఎవరికి రావు? దైవ ధర్మాన్ని నిరాకరించిన వాళ్ళకు కష్టాలు రావా? వాళ్ళకు రోగాలు రావా? ధన నష్టం కలగదా? వీటన్నిటినీ వారు భరించడం లేదా? వారు తమ తప్పుడు వైఖరిని అనుసరించడానికి రకరకాల బాధలు, కష్టాలు సహించడం లేదా? ప్రాపంచిక జీవితం తప్ప మరణం తరువాత మరో జీవితమే లేదని భ్రమలోపడ్డవాడు, మిథ్యావాది. కష్టాలొచ్చినప్పుడు కాస్త ఆందోళన చెందాడంటే, త్వరగా లభించే తాత్కాలిక ప్రయోజనాల కోసం కొన్ని పొరపాట్లు చేశాడంటే వింతేమీ లేదు. కాని శాశ్వత పరలోక జీవితం ముందు ప్రాపంచిక జీవితం క్షణభంగురమని, నీటి బుడగలాంటిదని భావించే ముస్లిం ఎప్పుడైనా కాస్తంత ఆపద వచ్చిపడగానే భయపడి కర్తవ్యాన్ని వదలడం సమంజసమేనా? ఈ ప్రపంచాన్ని అతను పరలోక జీవిత సాఫల్యం కోసం పుణ్య సంపాదనకై నిర్ణయించబడిన కార్యక్షేత్రమని విశ్వసిస్తున్నాడు. ఇది భోగభాగ్యాలు అనుభవించే స్వర్గధామమనిగాని, కష్టాలు కడగండ్లు భరించే నరక కూపమనిగాని భావించడు, అతని దృష్టిలో ఇక్కడి కష్టాలకయినా, సుఖాలకయినా ఎలాంటి విలువ లేదు. అతను ఎల్లప్పుడూ "మనమంతా దేవునికి చెందిన వాళ్ళము. మనకు ఎలాంటి కష్టాలొచ్చినా, ఏ సుఖాలు కలిగినా అవన్నీ దేవుని ఇష్ట ప్రకారం ఆయన ఆజ్ఞల మేరకే సంభవిస్తాయి. చివరికి ఒక రోజు మనం మన స్వామి సన్నిధికే పోవలసి ఉంది" అని దృఢంగా నమ్ముతున్నాడు. కాబట్టి కష్టాలొచ్చినప్పుడు అలాంటి వ్యక్తి సహించకపోతే మరెవరు సహించగలరు?

అల్లాహ్ మనల్ని అనుక్షణం గమనిస్తున్నాడు. ఆపదల్ని భరించే శక్తి మనలో ఉందా లేదా అనే విషయం కూడా ఆయనకు తెలుసు. మనం భరించలేని కష్టాలను మోపి మనల్ని నాశనం చేయడం ఆయన అభిమతం కాదు. కష్టాలొచ్చినపుడు వాటిని సహించి దేవుని సరిహద్దుల్ని అతిక్రమించనివారికి ఆయన తప్పనిసరిగా పరలోకంలో శాశ్వత స్వర్గ సౌఖ్యాలు ప్రసాదిస్తాడు. వాళ్ళకు తన కారుణ్య ఛాయలో ఆశ్రయమిస్తాడు. అదే అసలైన విజయం.

5. కృతజ్ఞత లేనివాడు కృతార్థుడు కాలేడు

మహాశయులారా!

కృతజ్ఞత మన ఆరాధనలన్నింటికీ ఆత్మ లాంటిది. కృతజ్ఞత లేని ఆరాధనలు పరలోకంలో మనకు ఎలాంటి లాభాన్నీ చేకూర్చవు. కృతజ్ఞత అంటే ఎవరయినా మనకు మేలు చేస్తే వారి మేలును మనస్ఫూర్తిగా అంగీకరించాలి. దాన్ని జ్ఞాపకం చేస్తుండాలి. మేలు చేసిన వ్యక్తి పట్ల ప్రేమాభి మానాలు కలిగి ఉండాలి. నోటితో అతని దయాదాక్షిణ్యాలను ప్రస్తావించాలి. ఆచరణ ద్వారా మనం అతని ఇష్టాయిష్టాలకు వ్యతిరేకంగా ప్రవర్తించమని నిరూపించాలి.

మానవునికి జరిగే గొప్ప మేళ్ళలో గొప్ప మేలు దేవుని మేలే. అతనికి ఏది లభించినా దేవుని నుండే లభిస్తుంది. మానవునికి ఉనికిని ప్రసాదించినది ఆయనే. ఆయనే మానవుని జీవితావసరాలను సమకూర్చుతున్నాడు. ఆయన దయాదాక్షిణ్యాలతోనే మానవుని మనుగడకు కావలసిన ఏర్పాట్లన్నీ జరుగుతున్నాయి. వీటిలో ఏ ఒక్క ఏర్పాటు లేక పోయినా మానవుడు జీవించలేడు.

బ్రహ్మాండమయిన ఈ విశ్వంలో మానవుడనే ఈ చిన్నారి జీవి కోసం విశ్వప్రభువు ఎన్నెన్ని ఏర్పాట్లు చేశాడో గమనిస్తే మన హృదయం కృతజ్ఞతా భావంతో నిండిపోతుంది. మనిషి మనుగడ కోసం దేవుడు చేసిన అసంఖ్యాకమయిన ఏర్పాట్లను పరిశీలిస్తే ఈ మొత్తం విశ్వాన్ని ఆయన మనిషి కోసమే సృష్టించాడా అనే అనుభూతి కలుగుతుంది. వాస్తవం కూడా అదే. దేవుడు ఈ విశాల ప్రపంచాన్ని మనకోసమే సృష్టించాడు. అంటే ఆయన మనకు గొప్ప ఉపకారం చేశాడన్నమాట.

ఉదాహరణకు ఆ ప్రభువు చేసిన కొన్ని మేళ్ళను గమనించండి: మనం పీల్చుకునే ప్రతి శ్వాస ఊపిరితిత్తుల్లోకి పోయి మన ప్రాణానికి తాజా దనం చేకూర్చుతుంది. ఈ ఒక్క మేలుకే మనం దైవానికి ఎంతో రుణపడాల్సి ఉంటుంది. అలాగే మనం విడిచే ప్రతి శ్వాస మన జీవిత మనుగడకు కారణభూతమవుతుంది కనుక, ఆ విషయంలోనూ మనం దైవానికి కృతజ్ఞత అర్పించుకోవాల్సి ఉంటుంది. ఇలా ప్రతి శ్వాసా దైవానికి మనం అర్పించవలసిన కృతజ్ఞతను గుర్తు చేస్తోంది. మనం పీల్చుకునే ఈ గాలే కాకుండా ప్రతి దినం, ప్రతి క్షణం, మనకు లాభం చేకూర్చే అసంఖ్యాక వస్తువులను అల్లాహ్ మనకు ప్రసాదించాడు, ఆయన ప్రసాదించిన వస్తువులు, ఆయన చేసిన

మేళ్ళు ఎన్ని ఉన్నాయో మనిషి ఊహకే అందవు. వాటన్నిటి విషయం లోనూ పూర్తిగా కృతజ్ఞతలు అర్పించడం మనిషికి సాధ్యమయ్యే పని కాదు. అయితే ఆ మహోపకారికి, ఆ విశ్వ ప్రభువుకు తప్పని సరిగా కృతజ్ఞతలు చెప్పాలనే విషయం మాత్రం నిరాకరించలేనిది.

సోదరులారా!

అల్లాహ్‌తో సంబంధాన్ని సాన్నిహిత్యాన్ని పటిష్టం చేసుకోవడం మనందరి ఆశయం. ఈ ఆశయం కోసం మనం దేహ సంబంధమయిన, ధన సంబంధమయిన ఆరాధనలన్నీ పాటిస్తున్నాము కాని మన ఆరాధనల్లో, మన ప్రయత్నాల్లో జీవం తొణికిస లాడాలంటే, మాటిమాటికి దైవం పట్ల మనం కృతజ్ఞతా భావాన్ని పెంపొందించు కోవాలి. కృతజ్ఞతా భావం లేని ఆరాధనల వల్ల దైవం పట్ల మన సంబంధం ఎన్నటికీ పటిష్టం కాజాలదు.

అల్లాహ్ మనకు అనుగ్రహించిన వస్తువులను, ఆయన చేసిన మేళ్ళను అనుక్షణం మనం దృష్టిలో పెట్టుకోవాలి. అప్పుడే ఆయన పట్ల మన హృదయంలో నిజమయిన కృతజ్ఞతా భావం కలుగుతుంది. ఎవరి హృదయాల్లో అయితే ఈ కృతజ్ఞతా భావం ఉండదో వారి విశ్వాసం (ఈమాన్) స్థిరంగా ఉండదు. అలాంటి వారి ఆరాధనల్లో సంకల్పశుద్ధి కూడా ఉండదు.

సోదరులారా!

మొట్ట మొదటి విషయం ఏమిటంటే మనం మనస్ఫూర్తిగా దేవుని మేళ్ళను అంగీకరించాలి. రెండవది, అసలయిన అనుగ్రహశాలి ఆయనేనని మనం దృఢంగా నమ్మాలి. ఇలాంటి శక్తి అధికారం దైవేతరులకు ఉండవు. స్వయంగా వారే దేవుని దయాదాక్షిణ్యాలపై ఆధారపడతారు. అలాంటి వారు ఇతరులకు అనుగ్రహించే ప్రసక్తే రాదు. ఒకవేళ ఇతరుల నుండి ఏదైనా వస్తువు మనకు లభిస్తుందంటే దాని అర్థం వారు సృష్టించిన సొత్తు మనకు ఇస్తున్నట్లు కాదు. నిజానికి అది దేవుడు సృష్టించిన వస్తువు. ఆయన అభిమతం, ఆయన ఆదేశం ప్రకారమే మనకది లభిస్తుంది.

ఇక మూడో విషయం మేలు చేసిన వారికి కృతజ్ఞతలర్పించడం. ఇదే అన్నిటికన్నా అతి ముఖ్యమయిన విషయం. ఒక ఉపకారి పట్ల మన హృదయం కృతజ్ఞతా భావంతో నిండినప్పుడు ఆయనకు వ్యతిరేకమయిన పనులు ఎలా చేయగలం? అందులో మన జీవన మనుగడకు కావలసిన యావత్తు సౌకర్యాలను అనుగ్రహించి

అనుక్షణం మనల్ని కాపాడుతున్న దైవాన్ని ఎలా మరచి పోగలం? ఆ మహోపకారికి విధేయులయి, ఆయన అభీష్టం ప్రకారం నడుచుకోవడం తప్ప మనకు వేరే దారి లేదు. ఒకవైపు ఆయన మేళ్ళను అంగీకరిస్తూ, ఆయన అనుగ్రహాలను కూడా ప్రస్తావిస్తూ, మరో వైపు ఆయన ఆదేశాలకు వ్యతిరేకంగా ప్రవర్తించడం సమంజసమేనా? ఆ ప్రభువు పట్ల మనలో కృతజ్ఞతా భావం ఉందనడానికి నిదర్శనం ఆయనకు విధేయులై ఉండటమే. మనలో కొందరి వైఖరి చాలా విచిత్రంగా ఉంటుంది, దేవుడు తమకు ఎలాంటి మేలు చేయలేదన్నట్లు వ్యవహరిస్తారు. మరికొందరయితే తమకు దేవుడే ఈ మేళ్ళన్ని చేశాడని ఒప్పుకుంటారు కాని, ఆచరణలో మాత్రం దైవేతరుల ఆజ్ఞలను పాటిస్తూ, వారి అభీష్టం ప్రకారం నడుచుకుంటారు. ఇది దేవునిపట్ల కృతజ్ఞత కాదు, కృతఘ్నుత. ఇంకా చెప్పాలంటే ఇది నమ్మక ద్రోహం, స్పష్టమయిన తిరుగుబాటుతనం. కాబట్టి -

సోదరులారా!

మనమంతా ఎల్లప్పుడు మన నడవడిక, మనం చేస్తున్న ఒక్కొక్క పనిని గురించి ఆత్మ పరిశీలన చేసుకుంటూ ఉండాలి. మనలో దైవ విధేయతకు వ్యతిరేకమయిన విషయాలు ఏవయినా ఉంటే వాటిని దూరం చేసుకోడానికి ప్రయత్నించాలి. ఒకవేళ రేపు పరలోకంలో మన పేరు కృతజ్ఞుల జాబితాకు బదులుగా కృతఘ్నుల జాబితాలో పడితే మనకంటే దురదృష్టవంతుడు మరొకడుండడు, విశ్వ ప్రభువు సన్నిధిలో కృతజ్ఞుడైన దాసుడిగా హాజరవ్వడమే అన్నిటికన్నా గొప్ప విజయం.

ఈ ప్రపంచంలోని సమస్త వస్తువుల్ని, చివరికి మన ఈ శరీరాన్ని, అందులోని శక్తి సామర్థ్యాల్ని ప్రసాదించి అల్లాహ్ మనకు ఎంతో మేలు చేశాడన్న విషయాన్ని మనం ఒప్పుకుంటున్నాం. బాగానే ఉంది. కాని వాటిని ఉపయోగించే విధానాన్ని కూడా ఆయన మన మంచికోసమే తెలిపాడన్న విషయాన్నీ మనం మరచిపోతున్నాము. అందుకే మనలో అనేక మంది అల్లాహ్ చూపిన విధానాన్ని అంటే ఇస్లామ్ ధర్మాన్ని పూర్తిగా పాటించకుండా దాన్ని ఆరాధనలు, కొన్ని వ్యక్తిగత సంప్రదాయాల వరకే పరిమితం చేసుకున్నాం. ఫలితంగా ఆయన వాగ్దానం చేసిన అనేక శుభాలకు దూరమయిపోయాము. అంతేకాదు, దాని దుష్ఫలితాన్ని కూడా ఈ రోజు మనం అనేక రూపాల్లో చవిచూడవలసి వస్తోంది. పరలోకంలో ఇంతకన్నా ఘోరమయిన దుష్ఫలితాన్ని అనుభవించవలసి వస్తుందని వేరే చెప్పనవసరం లేదు.

సోదరులారా!

తరచుగా మనపై కరువు కాటకాలు, వరదలు, భూకంపాలు, యుద్ధాలు, అంటు వ్యాధులు మొదలైన విపత్తులు వస్తున్నాయి. వీటి వాతనపడి ఏటా లక్షలాది మానవులు నష్టపోతున్నారు. ఇది దైవాగ్రహమే అని చెప్పక తప్పదు. మానవులు దేవునికి విధేయులయి, ఆయన ఆజ్ఞలను శిరసావహిస్తూ, ఆయనపట్ల కృతజ్ఞులై ఉంటే ఈ విధంగా ఆయన ఎందుకు శిక్షిస్తాడు? మనం కృతజ్ఞులుగా ఉండకపోయినా ఆయన దైవత్వానికి వచ్చే లోటేమీ ఉండదు, మనం కనబరచే కృతఘ్నతకు, అవిధేయతకు దుష్ఫలితం అనుభవించేది మనమే.

అల్లాహ్ మన సంక్షేమం కోసం, జీవితపు అన్ని రంగాల్లో మనకు మార్గదర్శకత్వం చేయడానికే ఇస్లామ్ ధర్మాన్ని మనకు ప్రసాదించాడు. నిజానికి ఇదే మానవాళికి ఆయన చేసిన గొప్ప మేలు. కాని అలాంటి మహాభాగ్యాన్ని మనం పూర్తిగా ఉపయోగించుకో వడం లేదు. పైగా నేడు మనలో అనేకమంది అనుదినం కొందరు దైవేతరులను కీర్తిస్తూ వారు చూపిన మార్గాన్ని అనుసరిస్తున్నారు. ఈ వైఖరిని విడిచిపెట్టనంతవరకు మనం కృతజ్ఞుల జాబితాలోకి ఎక్కలేము.

6. సత్యానికి మించిన సద్గుణం లేదు

మహాశయులారా!

సత్యం ఒక ముస్లిమ్‌కు ఉండవలసిన ముఖ్య గుణమని మీకందరికీ తెలుసు. సత్యమంటే ఇష్టపడనివారెవరూ ఉండరని కూడా మీకు తెలుసు. చివరికి ఇస్లామ్ బోధనలు తెలియని వాళ్ళు కూడా సత్యానికి మించిన సద్గుణం లేదని ఒప్పుకుంటారు. ఈ విషయం మన ప్రియ ప్రవక్త (సఅసం) మానవాళికి ఎలా బోధించారో చూడండి: "సత్యసంధత మానవునికి మంచి వైపునకు మార్గదర్శకత్వం చేస్తుంది; మంచితనం మనిషిని స్వర్గం దాకా తీసుకెళ్తుంది. (అలాగే) అసత్యం మానవుణ్ణి చెడుల వైపునకు తీసుకెళ్తుంది; చెడులు అతణ్ణి నరకం దాకా చేర్చుతాయి" అన్నారు ఆయన.

సోదరులారా!

సత్యసంధతకు ఇంత ప్రాముఖ్యత ఉందని మనలో ప్రతి ఒక్కరికీ తెలుసు. ఈ విషయంలో ఎవరికి అనుమానంగాని, అభ్యంతరంగాని ఉండదు. అయినప్పటికీ మనలో అనేక మంది ఇలాంటి ముఖ్య గుణం గురించి పట్టించుకోవడం లేదు. పరిస్థితి చూస్తుంటే ప్రజలు అసలు దీని ఆవశ్యకతను మరచిపోయారా అనిపిస్తోంది. విచిత్రం ఏమిటంటే ఇలాంటి వ్యక్తులు తమకు సంబంధించిన వ్యవహారంలో మటుకు ఇతరులు అసత్యమాడడాన్ని సహించరు. తమల్ని తాము పరిశీలించుకునే భాగ్యం చాలా కొద్ది మందికే కలుగుతుంది. ధన సంబంధమయిన వ్యవహారాల్లో చాలా స్వల్పమయిన లాభాల కోసం కూడా అసత్యమాడటం ఈ రోజుల్లో మామూలయి పోయింది. పైగా మరి కొందరయితే కాలక్షేపం కోసం చెప్పుకునే కబుర్లలో, వినోద సమావేశాల్లో కూడా అసత్యపు మాటలు పలుకుతారు.

పరిస్థితిని కాస్త జాగ్రత్తగా గమనిస్తే ఈనాడు అసత్యం చెడుల జాబితా నుండి బయటికిపోయి ఒక కళగా మారిపోయినట్లు కనిపిస్తుంది. ఈ విషయంలో మన పత్రికల రాతలు, మన జాతీయ నాయకుల పలుకులు, చివరికి ప్రభుత్వ రంగంలో బాధ్యత గల పెద్ద పెద్ద అధికారులు చెప్పే మాటలు సయితం వింటే సత్యానికి, అసత్యానికి మధ్య తేడా కాస్త కూడా లేదా అనిపిస్తుంది. వీరు తమకు నచ్చిందే తమకు లాభం చేకూర్చగల వస్తువని భావిస్తారు. అందువల్ల వీరు దాని కోసం ఎంత పెద్ద అబద్ధాన్ని పలకడానికయినా సంకోచించరు.

సోదరులారా!

ఇలాంటి పరిస్థితిలో "ముస్లిమ్"పై మరిన్ని బరువుబాధ్యతలు వచ్చిపడతాయి.

ముస్లిమ్ అంతిమ దైవప్రవక్త (సఅసం)ను తన జీవిత మార్గదర్శిగా అంగీకరించాడు. ఏదో ఒక రోజు విశ్వప్రభువు సన్నిధిలో హాజరు కావలసి ఉందని కూడా అతడు విశ్వసిస్తున్నాడు. అలాంటి వ్యక్తి సమాజం యొక్క ప్రస్తుత వైఖరిని గురించి ఆలోచించకుండా ఎలా ఉండగలడు? దాన్ని సంస్కరించడానికి పూనుకోకుండా ఎలా ఉండబుద్ధవుతుంది? సమాజ వాతావరణంలో మనిషి కొట్టుకుపోవడం సంభవమే. పరిస్థితుల ప్రభావం అతని మనస్సుపై పడుతుందన్నది కూడా నిజమే. కాని మాటిమాటికి ఆత్మపరిశీలన చేసుకుంటూ తనను తాను సంస్కరించుకోవడం ముస్లిమ్ లక్షణం. తన వల్ల ఏదయినా పొరపాటు జరిగితే వెంటనే అతను పశ్చాత్తాపపడి దైవ సన్నిధిలో క్షమాపణ వేడుకుంటాడు. పరలోకంలో దొరికేదే అసలయిన లాభమని, అదే అసలు సాఫల్యమని మనిషి గ్రహించగలిగితే అతను సులభంగా పరిస్థితులకు ఎదురీదగలడు; ఎలాంటి చెడులో మునిగిపోయినా బయటపడగలడు.

ఈనాడు మనం చిన్న చిన్న లాభాల కోసం అబద్ధాలాడుతున్నాం. బంధు ప్రీతికి, మిత్రబంధాల ఒత్తిడికి గురయి అబద్ధ సాక్ష్యాలను కూడా ఇస్తున్నాం. ఇక వ్యాపార లావాదేవీల విషయానికొస్తే, అబద్ధమాడందే లాభాలు గడించలేమనే విధంగా మనం ప్రవర్తిస్తున్నాం. వస్తువు విలువ, నాణ్యతల విషయంలో అబద్ధాలు పలకడం వ్యాపారంలో అంతర్భాగమయి పోయింది. పైపెచ్చు ఈ ధోరణిని వ్యాపార చాతుర్యంగా కూడా పరిగణించడం జరుగుతోంది. ఇలాంటి వ్యాపారంలో ఎంత సంపాదించినా ఈ చెడు ఫలితంగా మనం మనశ్శాంతికి దూరమయిపోయాము; పరస్పర సంబంధాలు క్షీణించిపోయాయి; ప్రతి వ్యక్తీ ఎదుటివాణ్ని అనుమానిస్తున్నాడు; అతను తనను ఎప్పుడు మోసగిస్తాడోనని భయపడుతున్నాడు.

సోదరులారా!

కాస్త ఆలోచించండి. సమాజంలో ఏర్పడిన ఈ దుస్థితి మన పాలిట దైవ శిక్ష కాదా? నిజానికి పరస్పర సంబంధాలు, నమ్మకాలు, నీతి నిజాయితీలు - ఇవే కదా సమాజ మనుగడకు కావలసిన పునాదిరాళ్ళు? ఈనాడు మనమంతా వీటిని కోల్పోయామనిపిస్తోంది. పరిస్థితి అలాగే కనిపిస్తోంది కాని, దాన్ని మార్చడం మా వల్ల ఏమవుతుంది అని మీరనవచ్చు. నిజమే, కొందరి కృషి వల్ల పరిస్థితులు ఒక్కసారి మారవు. కాని ముస్లిములుగా మనం ఆలోచించవలసిన ధోరణి ఇది కాదు, సంస్కరించవలసిన ప్రతి విషయాన్ని మొదట వ్యక్తిగత సమస్యగా భావించాలి. అప్పుడు ఈ ఆపద నుండి మనంతట మనం ఎలా బయటపడాలి, పరలోక సాఫల్యం కోసం దీన్ని వదిలించుకోవడం ఎలా అని తీవ్రంగా ఆలోచిస్తాం. ఈ విధంగా

ఆలోచించినప్పుడు భౌతిక ప్రయోజనాలు ఎన్నో వదులుకోవలసి వస్తుంది. అయితే పరలోక సాఫల్యమే జీవిత లక్ష్యంగా పెట్టుకున్నవారికి ఈ భౌతిక ప్రయోజనాలు పోయినంత మాత్రాన కలిగే నష్టమేమీ ఉండదు.

జీవితంలో అన్నిటికన్నా ముఖ్యమయినది మనశ్శాంతి. ఒకడికి పెద్ద వ్యాపారం, మేడలు, సిరిసంపదలు లేకపోవచ్చు. కాని అతనికి దేవుడు శాంతీ సంతృప్తులు ప్రసాదించాడు. మరొకడికి కోట్లాది రూపాయల ఆస్తులున్నాయి. ఎటు చూసినా అతని చేతి కింద నౌకర్లు ఉన్నారు, కాని మనశ్శాంతికి నోచుకోలేకపోయాడు. ఈ ఇద్దరు వ్యక్తులు ఒకటేనా? ఎన్నటికీ కాలేరు. అందుకే మన ప్రియ ప్రవక్త (సఅసం)ఇలా అన్నారు: "సత్యంతో శాంతి లభిస్తుంది".

సోదరులారా!

ఎప్పుడయినా కాస్సేపు మనం సత్యాన్ని వదలి ఏదయినా పని అవలంబించా మనుకోండి, వెంటనే మన అంతరంగాన్ని ఏదో కలచివేస్తున్నట్లు అనిపిస్తుంది. అప్పుడు మనిషి అంతరంగాన్ని అణచివేసి, దానికి వ్యతిరేకంగా అనేక లాభాలను దృష్టికి తెచ్చుకుంటాడు. ఆపై తాను చెడు పనికి నిదర్శనాలు చూపెట్టుకొని తృప్తిపడతాడు. ఆలోచించండి ఈ విధంగా సత్యాన్ని వదలి మన అంతరంగాన్ని సంతృప్తిపరచుకోగలమా? లేక సత్యాన్ని అవలంబించడం ద్వారానే మనకు నిజమయిన శాంతీ సంతోషాలు లభిస్తాయా? మహాప్రవక్త (సఅసం) ఏమని సెలవిచ్చారో చూడండి:

"ఏదయినా విషయం మీ అంతరంగాన్ని కలచివేసేదిగా ఉంటే దాన్ని వదలి, అంతరంగాన్ని కలచివేయని విషయాన్ని అవలంబించండి" అన్నారు. మరొక సందర్భంలో "అసత్యం ఆందోళనకు, వ్యాకులతకు కారణభూతమవుతుంద"ని అన్నారు మన ప్రియ ప్రవక్త ముహమ్మద్ (సఅసం).

సోదరులారా!

సత్యసంధత ప్రాముఖ్యత ఏమిటో దాని ఒక కోణం తెలుసుకున్నారు. ఇది కాకుండా సత్యసంధత యొక్క ప్రాముఖ్యతను మరో కోణం ద్వారా తెలుసుకోవలసింది ఎంతో ఉంది. ఈనాడు ముస్లిములు తమ ఆచరణ ద్వారా ఇస్లామ్ ధర్మాన్ని సరయిన రీతిలో పరిచయం చేయడం లేదు. మనం మన ఆచరణ ద్వారా ఇస్లామ్ బోధనలకు వ్యతిరేకమయిన ఎలాంటి విషయాన్నీ వ్యక్తపరచకూడదు. మనం చేసే ప్రతి పని ద్వారా, పలికే ప్రతి పలుకు ద్వారా నిజంగా మనకు అల్లాహ్‌పై, పరలోకంపై విశ్వాసముందని నిరూపించుకోవాలి. ఈ విధంగా మన ప్రతి కదలికా సత్యానికి సాక్ష్యమిచ్చేదిగా

ఉండాలి. ఇది దైవ ధర్మం పట్ల అభిమానం ఉన్న ప్రతి ముస్లిమ్ యొక్క వ్యక్తిగత బాధ్యత.

రోమ్ చక్రవర్తి హెరక్లియస్ దగ్గరికి మహాప్రవక్త (సఅసం) ఇస్లామ్ సందేశాన్ని పంపిన సంఘటన మీకు తెలిసే ఉండవచ్చు. అప్పుడు హెరక్లియస్ హజ్రత్ ముహమ్మద్ (సఅసం) నిజంగా దైవ ప్రవక్తేనా అనే విషయాన్ని తెలుసుకోవడానికి అరబ్ నాయకుల్లో ఒకడయిన అబూ సుఫ్యాన్‌తో సంభాషిస్తాడు. అబూ సుఫ్యాన్ అప్పటికి ముస్లిమ్ కాదు. అలాంటి వ్యక్తి రోమ్ దర్బారులో దైవ ప్రవక్త (సఅసం) యొక్క నిజాయితి, సత్య సంధతలను కూడా వివరించవలసి వచ్చింది. దాంతో రోమ్ చక్రవర్తి ఎంతో ప్రభావితుడవుతాడు. కనుక దైవ సందేశాన్ని అందజేసేవారు మొదట తమ వాక్కర్మలన్నీ ఆ సందేశానికి అనుగుణంగా ఉండేలా తమ వ్యక్తిత్వాన్ని సంస్కరించుకోవాలి, అప్పుడే వారు అందజేసే సందేశాన్ని వినడానికి ప్రజలు సిద్ధపడతారు, దాని ప్రభావంపడే అవకాశం కూడా ఉంటుంది.

7. విశ్వాసానికి గీటురాయి ఆచరణే

మహాశయులారా!

అల్లాహ్ తన అపార అనుగ్రహంతో మనకు రుజు మార్గం చూపించాడు. కాబట్టి మనం మన ఆరాధనలను, మన జీవన్మరణాలను కేవలం అల్లాహ్‌కు మాత్రమే ప్రత్యేకించాలి. అల్లాహ్‌ను తప్ప ఇతరులను ఆరాధించకూడదు. అల్లాహ్ తప్ప ఇతరుల కోసం జీవించకూడదు, చావకూడదు. ఇదే ఇస్లామ్ తనను విశ్వసించిన వారిని కోరుతున్న విషయం. దివ్యఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఆదేశాన్ని చూడండి:

"ఓ ముహమ్మద్ (సఅసం) చెప్పెయ్యి - నా నమాజ్, నా ఆరాధనలు, నా జీవన్మరణాలు అన్నీ అల్లాహ్ కోసమే. అల్లాహ్ సకల లోకాల ప్రభువు. ఆయనకు సహవర్తులెవరూ లేరు. దీన్ని గురించే నాకు ఆదేశమివ్వబడింది. అందరికంటే ముందు నేను ఆయనకు విధేయత ప్రకటిస్తున్నాను."

ఈ విషయంలో మన ప్రియ ప్రవక్త (సఅసం) అమృత ప్రవచనం కూడా వినండి:

"ఎవరితోనైనా స్నేహం చేస్తే అల్లాహ్ కోసమే చేసేవాడు-విరోధిస్తే అల్లాహ్ కోసమే విరోధించేవాడు, ఎవరికయినా ఏదైనా ఇస్తే అల్లాహ్ కోసమే ఇచ్చేవాడు, ఆపితే అల్లాహ్ కోసమే ఆపేవాడు పరిపూర్ణ విశ్వాసాన్ని కలిగి వున్నాడు."

సోదరులారా!

దీన్నిబట్టి మనం చేసే స్నేహం, విరోధం, ప్రపంచ వ్యవహారాలలో ఇచ్చిపుచ్చు కోవడాలు అన్నీ అల్లాహ్ కోసమే ఉండాలి. ఈ గుణం ఎవరిలో ఉండదో వారి విశ్వాసం పరిపూర్ణ విశ్వాసం కాదు. పరిపూర్ణ విశ్వాసం కోసం ఈ లక్షణం ఎంతో అవసరం.

కొందరు మనిషి విశ్వాసం కోసం ఈ సద్గుణం అవసరం లేదంటారు. కాని ఇది ఒక అపోహ మాత్రమే. అలా అనేవారు ఫికహ్ పరమయిన ఇస్లామ్ స్వరూపాన్నే చూస్తారు గాని, దేవుని దృష్టిలో నమ్మతగిన వాస్తవిక విశ్వాసాన్ని చూడరు. ఫికహ్ పరమయిన ఇస్లామ్‌లో మనిషి హృదయాన్ని చూడటం జరుగదు, చూడ్డానికి వీలుండదు కూడా. అక్కడ మనిషి నోటితో చేసే ప్రకటనను మాత్రమే లెఖ్ఖలోకి తీసుకోవడం జరుగుతుంది. ఆ ప్రాతిపదికపై మాత్రమే అతను మోమిన్, ముస్లిమ్ అని నిర్ణయించబడుతుంది. కాని ఇది ప్రాపంచిక వ్యవహారాల కోసమే. అతను ముస్లిమ్ సమాజంలోని వ్యక్తి అవునా కాదా అని తెలుసుకోవడానికి, దాని ప్రకారం అతనితో ప్రవర్తించడానికి మాత్రమే ఈ ఫికహ్ పరమైన విశ్వాస ప్రకటన పనికొస్తుంది.

పరలోకంలో మనిషి సాఫల్యానికి, దైవప్రీతి పొందడానికి కావలసింది ఇలాంటి

విశ్వాసం కాదు. ఇక్కడ మనిషి యొక్క మానసిక స్థితి ముఖ్యం. నిజంగా అతను మనస్ఫూర్తిగా విశ్వసించాడా? ఇష్టపూర్వకంగా తనను తాను దైవానికి సమర్పించుకున్నాడా? అతని శ్రమా ప్రయత్నాలు, అతని చావు బ్రతుకులు, అతని వినయ విధేయతలు, అతని సేవలు అన్నీ అల్లాహ్ కోసమే ప్రత్యేకించబడ్డాయా లేదా ఇతరుల కోసం ప్రత్యేకించ బడ్డాయా? అనే విషయాలను పరిశీలించడం జరుగుతుంది. వీటన్నిటినీ అల్లాహ్ కోసమే ప్రత్యేకిస్తే అతను నిజమయిన మోమిన్‌గా, ముస్లిమ్‌గా పరిగణించబడతాడు. ఒకవేళ వాటిని దైవేతరుల కోసం ప్రత్యేకిస్తే మటుకు అతను మోమిన్‌గా గాని ముస్లిము గా గాని పరిగణించబడడు. ప్రపంచంలో ప్రజలు అతడ్ని ఎలా గౌరవిస్తుండేవారు, అతని విశ్వాసం రీత్యా అతనికి ఎలాంటి స్థానం ఇచ్చారు అనే విషయాలు ఇక్కడ పరిశీలించబడవు.

సోదరులారా!

మనకు అల్లాహ్ అనుగ్రహించిన వాటిని మనం ఆయన మార్గంలో వినియోగించామా లేదా అనే విషయాన్ని గురించే పరలోకంలో పరిశీలించడం జరుగుతుంది. నిజంగా మనం వాటిని అల్లాహ్ మార్గంలోనే వినియోగిస్తే మన పేరు ఆయన అభిమానుల జాబితాలో చేరుతుంది. ఒకవేళ వేరొకరి మార్గంలో వినియోగిస్తే లేదా ఏవయినా కొన్ని విషయాలను దేవుని ఆరాధనా పరిధి నుండి తొలగిస్తే మనం దేవుని దృష్టిలో సర్వాన్ని సమర్పించుకున్న (ముస్లిమ్) దాసులుగా పరిగణించబడలేము.

ఫికహ్ లేదా చట్టపరమైన ఇస్లామ్‌కు, వాస్తవిక ఇస్లామ్‌కు మధ్య వున్న తేడా ఏమిటో ఇప్పుడు మీకు అర్థమైందనుకుంటా. దీన్నిబట్టే పరలోక ఫలితాలుంటాయి. కాస్త జాగ్రత్తగా పరిశీలిస్తే ప్రపంచంలో కూడా ఇలాంటి ఫలితాలు కనిపిస్తాయి. ప్రపంచంలోని ముస్లిమ్‌లను రెండు రకాలుగా విభజించవచ్చు.

ఒక రకం ముస్లిములు దైవాన్ని, దైవప్రవక్త (సఅసం)ని విశ్వసించినట్లు ప్రకటిస్తారు. ఇస్లామ్‌ను ఒక ధర్మంగా స్వీకరిస్తారు. కాని వీరు ఈ ధర్మాన్ని తమ జీవితంలోని ఒక భాగంగా మాత్రమే తయారుచేసి పెట్టుకుంటారు. వీరు ఇస్లామ్ అంటే ఎంతో ప్రేమాభిమానాలు వ్యక్తపరుస్తారు. ఆరాధనల పట్ల అమితమయిన ఆసక్తి చూపుతారు. దైవ నామ సంస్మరణలో లీనమవుతారు. ఆహార పానీయాల విషయంలో, కొన్ని సామాజిక వ్యవహారాల విషయంలో దైవాజ్ఞలను పాటిస్తారు. అంతకు మించి వీరు ఇతర రంగాలలో ముస్లిమ్‌లుగా దైవాజ్ఞలను పాటిస్తున్నట్లు కనిపించరు. వీరు తమ ప్రేమాభిమానాలను దైవం కోసం కాకుండా, తమ మనోవాంఛల కోసమో, అధికారాల కోసమో, దేశం కోసమో వ్యక్తపరుస్తారు. వీరు యుద్ధం చేసినా, శత్రుత్వం వహించినా స్వార్థ ప్రయోజనాల కోసమే చేస్తారు, వీరి వ్యాపార లావాదేవీలు, ఇచ్చిపుచ్చుకోవడాలు, సాంఘిక సేవలు రాజకీయ పరుగులు, రేయింబవళ్ళ కార్యకలాపాలు చాలా వరకు

ధర్మానికి వేరుగా ఉంటాయి. వీరు ప్రాపంచిక ప్రయోజనాలు తప్ప మరో విషయానికి ప్రాధాన్యతనివ్వరు. వీరు సాంఘిక సంస్థలు, ఉద్యమాలు కూడా నడుపుతారు. రాజకీయ, సాంస్కృతిక, విద్యా రంగాల్లో కూడా పనిచేస్తారు. కాని ఆ రంగాల్లో ఇస్లామ్ ధర్మాలను ఆచరించేవారుగా కనిపించరు; ఒక్క మాటలో చెప్పాలంటే వీరు ఇస్లామ్‌ను జీవితంలోని ఒక చిన్న శాఖగా, ఒక వ్యక్తిగత విషయంగా పరిగణించి ప్రవర్తిస్తారు.

ఇక రెండవ రకానికి చెందిన ముస్లిమ్‌లు తమ పూర్తి జీవితాన్ని ఇస్లామ్ కోసం అంకితం చేశారు. వీరు ఏదైనా పని చేస్తే ముస్లిమ్‌గా చేస్తారు. ఆలోచిస్తే ముస్లిమ్‌గా ఆలోచిస్తారు. వీరి ఇష్టాయిష్టాలు, స్నేహం శత్రుత్వాలు, సంపాదన ఖర్చులు అభిమానం ఆగ్రహాలు అన్నీ ఇస్లామ్ బోధనలకు అనుగుణంగా ఉంటాయి. వీరు జీవితపు ఏ రంగంలో పనిచేసినా ఇస్లామ్‌కు వ్యతిరేకంగా ప్రవర్తించరు.

సోదరులారా!

ఈ రెండు రకాల ముస్లిమ్‌లలో ఎంత తేడా ఉందో చూశారు కదా! మొదటి కోవకు చెందిన ముస్లిమ్‌లు ఇస్లామ్ చరిత్రలో గర్వకారణమయిన కార్యం ఏదీ చేయలేదు. పైగా వీరి స్వార్థ చర్యల వల్ల ఇస్లామ్‌కు ఎప్పుడూ నష్టమే కలిగింది. వీరు ఇస్లామ్ వ్యతిరేక శక్తులతో చేతులు కలిపి ముస్లిమ్ సమాజానికి, ఇస్లామీయ జీవన వ్యవస్థకు ద్రోహం తల పెట్టడానిక్కూడా వెనుకాడరు. ఇలాంటి ముస్లిముల వల్లనే ఇస్లామ్ అధికార వైభవాన్ని కోల్పోయి ఈనాడు ప్రజల ప్రయివేటు విషయంగా మిగిలిపోయింది. మస్జిద్‌లో నమాజ్ చేయడానికి అనుమతి ఉంటే చాలు, ఇస్లామ్‌కు స్వేచ్ఛ ఉన్నట్లే అని భావిస్తున్నారు వీరు. దైవానికి ఇలాంటి ముస్లిములు అవసరం లేదని ఇంతకు ముందు వినిపించిన ఆయత్‌లో తెలుసుకున్నారు. ఆయనకు యావజ్జీవితాన్ని ఇస్లామ్‌కు సమర్పించేవారు కావాలి.

సోదరులారా!

నా ఈ మాటలు విని ఆశ్చర్యపడకండి. నేనేదో అనవసరమైన విషయాలు వినిపిస్తున్నానని అనుకోకండి. కాస్త మీరూ ఆలోచించండి. ప్రపంచంలో ఏ సిద్ధాంతం కూడా ఇలాంటి అనుచరుల వల్ల వృద్ధి చెందలేదు. పూర్తి విశ్వాసంతో, యావజ్జీవితాన్ని సమర్పించడానికి సిద్ధపడేవారి వల్లనే ఏ సిద్ధాంతమయినా విజయం సాధించగలిగేది.

అయితే ఇస్లామ్‌కు, ఇతర సిద్ధాంతాలకుగల వ్యత్యాసం ఏమిటంటే ఇతర సిద్ధాంతాల కోసం పాటుపడితే లభించేవి కొన్ని ప్రాపంచిక ప్రయోజనాలు మాత్రమే. ఇస్లామ్‌కోసం పాటుపడిన వారికి ఇహలోకంలోనే గాక, పరలోకంలోనూ ప్రయోజనం కలుగుతుంది. ఇస్లామ్ కోసం అన్నిటిని సమర్పించడం మానవుని విధి కూడా. ఎందుకంటే అతని దగ్గరున్న సమస్త దేవుడు ప్రసాదించినవే. చివరికి మానవుని శరీరం,

ఆత్మ కూడా ఆయన అనుగ్రహించినవే. కనుక దైవం ప్రసాదించినవి దైవానికి సమర్పించడం న్యాయం కూడా.

సోదరులారా!

విశ్వాసానికి గీటురాయి ఏమిటో తెలుసుకున్నాం. దీని ప్రకారం మనలో ఏ మేరకు విశ్వాసం ఉందో ఆత్మపరిశీలన చేసుకోవాలి. మనందరిలోనూ పొరపాట్లు, బలహీనతలు ఉన్నాయి. అయితే దానివల్ల నిరాశ చెందవలసిన అవసరం లేదు. మనం చేయవలసిన పని - ఇస్లామ్ యొక్క వాస్తవ స్వరూపం ఏమిటో తెలుసుకొని, దానికి అనుగుణంగా జీవితాన్ని మలచుకోవడానికి ప్రయత్నించడమే. ప్రతి క్షణం, ప్రతి విషయంలోనూ మనం నిజంగా దైవానికి, దైవ ప్రవక్త (సఅసం)కు విధేయులుగా ఉంటున్నామా, వారి అభీష్టం ప్రకారమే నడుచుకుంటున్నామా లేక మనోవాంఛలకు దాసులవుతున్నామా అని పరిశీలించుకుంటూ ఉండాలి. జీవితపు అన్ని రంగాల్లోనూ అల్లాహ్ ఆదేశాలనే అనుసరిస్తూ ఆయన ప్రీతిని పొందడానికి ప్రయత్నించాలి. ఈ ప్రయత్నంలో ఇస్లామ్ వ్యతిరేక శక్తుల నుండి ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా, స్వయంగా దైవం తరఫు నుండి ఎన్ని పరీక్షలు వచ్చి పడినా మనం ధైర్యంతో, సహనంతో ఎదుర్కొంటూ ముందుకు సాగాలి. అప్పుడే మనం అల్లాహ్ దృష్టిలో పరిపూర్ణమయిన విశ్వాసులుగా పరిగణించబడతాము. పరలోకంలో ముక్తి మోక్షాలకు అర్హులవుతాము. అన్ని స్థాయిల్లోనూ నిజమయిన ముస్లిములుగా జీవితం గడిపితే ఇహలోకంలో మనం కోల్పోయిన గత వైభవాన్ని కూడా తిరిగి పొందగలం.

8. విశ్వాస బలమే విజయానికి నాంది

మహాశయులారా!

ఇస్లామ్ ఒక జ్యోతివంటిది. ప్రపంచంలోని అజ్ఞానాంధకారాన్ని దూరం చేయగల జ్యోతి ఇదే. ఈ జ్యోతే మానవుడికి సరయిన జీవన మార్గాన్ని చూపిస్తుంది. దీని వెలుగును చూడ లేనివాడి బ్రతుకు చీకటిలో తచ్చాడుతూ భ్రష్ట మార్గాన ప్రయాణం చేసేవారు చేరుకునే గమ్య స్థానం ఎంతో భయంకరంగా ఉంటుంది.

సోదరులారా!

ఇదొక యదార్థం. కాని ఈ యదార్థాన్ని చాలా తక్కువ మంది అంగీకరిస్తారు. చాలా మంది దైవ ధర్మానికి దూరమయి ఉన్నారు. వారు దీని వ్యాప్తిని ఏ మాత్రం సహించలేరు. దీని వెలుగు ఎక్కడయినా కాస్త కనిపిస్తే చాలు, వారు హడలిపోతారు. అసలు వారి హృదయాల్లో దైవ ధర్మం పట్ల దురభిమానం తిష్ఠ వేసింది. ఆ దురభిమానమే వారిని దీని వెలుగును చూడనివ్వడం లేదు. అందుకే వారు దీన్ని తమ నోటితో ఊది ఆర్పజూస్తున్నారు. దీని వైపునకు వచ్చేవారి మార్గంలో అవరోధాలు సృష్టిస్తున్నారు.

అల్లాహ్ ఎంతో మందికి అధికారం, అంగబలం, అర్థబలం ఇచ్చి పరీక్షకు గురి చేశాడు, కాని ఇది దైవం తరపున పరీక్ష అన్న సంగతి వారు తెలుసుకోలేకపోతున్నారు. తమపై దేవుడనే ఓ అత్యున్నత శక్తి ఉందనే విషయం కూడా వారు మరచిపోయి విశృంఖలంగా ప్రవర్తిస్తున్నారు. అధికార మత్తులోపడి కన్నూ మిన్నూ కనిపించకుండా ఇష్టారాజ్యం చేస్తున్నారు.

సోదరులారా!

ఇలాంటివారి మాటలు, చేతలు మన విశ్వాసానికి అగ్ని పరీక్ష అని చెప్పాలి, కాని అల్ప విశ్వాసులు ఇలాంటి సమయంలో భయపడి పోతారు. వారి ఆగ్రహానికి తట్టుకోలేరు. వెంటనే వీరు, "వారి కోపం దూరం కావాలంటే మనం ఎలా నడచుకోవాలి?" అని ఆలోచిస్తారు. దాని ప్రకారం తమ ప్రవర్తనను మార్చుకుంటారు. విశ్వాసం రుచి ఎరుగని వాళ్ళే ఇలా భయపడి అధికారులకు దాస్యం చేస్తారు.

అయితే దైవ ధర్మం పట్ల దృఢమయిన విశ్వాసం గల సత్పురుషులు అధికారుల ఆగ్రహానికి ఏమాత్రం భయపడరు. పైగా వారి విశ్వాసం మరింత పటిష్టమవుతుంది. దైవానికి, దైవప్రవక్త (సఅసం)కు ఇంకా దగ్గరవుతారు. పైగా పరలోక సాఫల్యం గురించినవారి వాంఛ దృఢమవుతుంది. దైవప్రీతి పొందాలన్న వారి కోరిక తీవ్రమవుతుంది. వారు తమ విశ్వాసానికి విఘాతం కలిగించే ప్రతి దుష్ట చర్యను ప్రతి ఘటించడానికి సిద్ధపడతారు. షైతాన్ రంగు మార్చి వారి ముందు ప్రత్యక్షమవుతాడు. వారి

హృదయాల్లోనూ లేనిపోని అనుమానాలు, ఆందోళనలు రేకెత్తిస్తాడు. కాలచక్రపు ఎగుళ్ళు దిగుళ్ళను గురించి మాటలు చెబుతాడు. భార్యా పిల్లల పోషణ భారాన్ని గురించి హిత బోధలు చేస్తాడు. ఆర్థిక చిక్కులను గురించి భయపెడతాడు. కాని వారు షైతాన్ వలలో ఏమాత్రం చిక్కుకోరు. "ఇంతకు మేము చేసిన తప్పేమిటో కాస్త చెప్పు. దేనికోసం నీవు మా వెంటపడి మా పట్ల ఈ మొసలి కన్నీరు కారుస్తున్నావు? మేము అల్లాహ్‌ను మా ప్రభువుగా, యజమానిగా అంగీకరించడం తప్పా? ఒక్క అల్లాహ్ ఆదేశాలనే శిరసావహిస్తూ ఇతరుల ఆజ్ఞలను త్రోసివేయడం నేరమా? ఇహలోకం కంటే శాశ్వతంగా ఉండే పరలోకాన్ని గురించే ఎక్కువగా ఆలోచించడం నేరమా?" అని ఘాటుగా జవాబిచ్చి వాడి నోరు మూయిస్తారు.

సోదరులారా!

ఇస్లామ్ పట్ల అచంచల విశ్వాసం గలవారు సత్య తిరస్కారుల ముందు ఎన్నటికీ తల వంచరు. వారి అధికార దర్పం చూసి భయపడరు, వారి సంపదలను ఆశించరు, వారు ఒక్క విశ్వ ప్రభువు ముందే తలవంచుతారు. ఆయనకు మాత్రమే భయపడతారు. ఆయనపైనే ఆశలు పెట్టుకుంటారు. ఆయన చూపిన మార్గాన్నే అనుసరిస్తారు. అంతిమ ప్రవక్త ముహమ్మద్ (సఅసం) వారి నాయకులు. జీవితపు ప్రతి రంగంలోనూ ఆ మహా నాయకుని బోధనలే వారు అనుసరిస్తారు. వాటికి వ్యతిరేకంగా ఎవరి బోధనలనూ స్వీకరించరు. వారి దృష్టి ఎల్లప్పుడూ పరలోకంలో ఎదురయ్యే ఫలితాల పైనే కేంద్రీకృతమయి ఉంటుంది. కనుక వారు ప్రాపంచిక ఫలితాలకు ప్రాధాన్యత నివ్వరు. ఆ దృక్పథంతోనే వారు ప్రాపంచిక నాయకులను ఖాతరు చేయరు.

వారి దృఢ విశ్వాసానికి బలమయిన మరో కారణం, వారు ఇస్లామ్‌ను బాగా ఆలోచించి, అధ్యయనం చేసి మరీ స్వీకరించారు. అది సకల జీవన రంగాల్లోనూ మానవాళికి మార్గ దర్శకత్వం చేసే సమగ్ర జీవన వ్యవస్థ అని తెలుసుకున్నారు. అంతే కాదు. ఇహపర సాఫల్యాల కోసం అదే ఏకైక దైవ మార్గమని, మిగతావన్నీ నరకానికి గొనిపోయే మార్గాలనీ వారు గ్రహించారు. ఈ భావన, ఈ జ్ఞానం, ఈ విశ్వాసాలే వారిని మిథ్యా వాదులకు లొంగనీయకుండా స్థిరంగా ఉంచుతున్నాయి.

సోదరులారా!

విశ్వాసమంటే ఇదే. పరిపూర్ణ ఆచరణ పరిపూర్ణ విశ్వాసానికి నిదర్శనం, ఇది గొప్ప దైవానుగ్రహం. ఎవరికయితే ఇలాంటి విశ్వాస భాగ్యం లభించిందో వారికి సమస్తం లభించినట్లే. ఇదే నేనింతకు ముందు వివరించిన జ్యోతి. ఈ జ్యోతిని ఎవరూ ఆర్పలేరు. ఈ జ్యోతిని మరింత దేదీప్యమానంగా ప్రకాశింప జేస్తానని అల్లాహ్ వాగ్దానం చేశాడు. అల్లాహ్ వాగ్దానం ప్రకారం ఈ జ్యోతి ఎప్పటి కయినా ప్రపంచం మూలమూలలా వ్యాపిస్తుంది. అవిశ్వాసులకు ఇష్టమున్నా లేక పోయినా ఈ జ్యోతి వ్యాపించి

తీరుతుంది, దైవధర్మ వ్యాప్తి అవిశ్వాసుల ఇష్టాయిష్టాలపై ఆధారపడి లేదు. విశ్వసించిన వారి విశ్వాస శక్తిపై ఆధారపడి ఉంది.

మహాశయులారా!

దైవ ధర్మం ప్రపంచంలో అణిగి ఉండటానికి రాలేదు. అల్లాహ్ తన అంతిమ సందేశహరుని (సఅసం) ప్రపంచంలో ప్రభవింపజేశాడు. ఆయన ద్వారా ప్రపంచానికి అంతిమ ధర్మం ప్రసాదించాడు ఇది కేవలం పూజా పురస్కారాలకు సంబంధించిన విషయం మాత్రమే కాదు. జీవితపు అన్ని రంగాల్లోనూ మానవులకు రుజుమార్గం చూపగల ధర్మం ఇది. ఇంకా ఇది మానవుని సమస్యలన్నిటికీ చక్కని పరిష్కారం చూపుతుంది. పరలోక సాఫల్యానికే గాక ఇహలోక సాఫల్యానిక్కూడా ఇది గ్యారంటీ ఇస్తుంది. ఇలాంటి ధర్మం, జీవన వ్యవస్థ ఉండగా మనకు మరో మార్గం అనుసరించ వలసిన అవసరంలేదు. అసలీ ధర్మం వచ్చింది ఇతర ధర్మాలపై ఆధిక్యత పొందడానికే. అయితే ఈ ఆధిక్యత దాన్ని అవలంబించినవారి విశ్వాస పటిష్ఠతపై ఆధారపడి ఉంటుంది. ఒకవేళ ఎవరయినా ఈ ధర్మం తమ ఇష్టాయిష్టాలకు అనుకూలంగా ఉండాలని కోరితే ఇది ధర్మం యొక్క స్వభావానికే విరుద్ధం. అలాంటి వ్యక్తి అల్లాహ్ దాస్యానికి బదులుగా ఇతరుల దాస్యం స్వీకరించడానికి సిద్ధమయ్యాడన్న మాట. దేవుడు ఆయన ప్రవక్త (సఅసం) ఇష్టానికి వ్యతిరేకంగా ఇతరుల ఆజ్ఞలకు తలవంచడం "షిర్క్" అవుతుంది. షిర్క్ పర్యవసానం నరకం.

సోదరులారా!

ఇతర ధర్మాలు, జీవన వ్యవస్థల అన్నిటిపై ఆధిక్యత కలిగి ఉండటానికి ఇస్లామ్‌ను అవతరింప జేశానని అల్లాహ్ స్పష్టంగా తెలియజేశాడు. కాని ఈనాడు మనం చూస్తున్నదేమిటి? దైవ ధర్మం అధికార పీఠాల నుండి తొలగించబడి మస్జిద్ నాలుగు గోడల మధ్య బంధించబడింది. మిథ్యా వ్యవస్థలు ప్రపంచాన్ని సమస్యల రణరంగంగా మార్చి రాజతీవితో కులుకుతున్నాయి. దీనికి కారణం మనలోని లోపాలు, పొరపాట్లే. ఇస్లామ్‌ను విశ్వసించినవారే ఆచరణలో ఇస్లామ్‌కు దూరంగా మసలుకుంటున్నారు. అలాంటప్పుడు ఇస్లామ్ పైకెలా వస్తుంది?

కాబట్టి మనలో దైవ ధర్మం పట్ల అభిమానమున్న ప్రతి ఒక్కడూ ఈ రోజు నుంచి తమ జీవితాన్ని ఇస్లామ్ బోధలకు అనుగుణంగా మలచుకుంటామని, అల్లాహ్, ఆయన ప్రవక్త (సఅసం) ఆదేశాలకు వ్యతిరేకంగా ఎన్నటికీ నడచుకోమని నిశ్చయించుకోవాలి. దైవాదేశాలను అనుసరించే ఈ ప్రయత్నంలో ఎలాంటి భయ ప్రలోభాలకు లోనుకాకూడదు. ఈ మార్గంలో ఇతరుల కోపం, సంతోషాలను గురించి పట్టించుకోనవసరం లేదు. మన చర్య దైవానికి, దైవ ప్రవక్త (సఅసం)కు ఇష్టమా కాదా అన్న విషయమే మన దృష్టిలో ఎప్పుడూ ఉండాలి. ఈ కృషి ఇస్లామ్ అభ్యున్నతి కోసమే కాదు, స్వయంగా పరలోకంలో మన ముక్తి మోక్షాల కోసం కూడా అవసరమే.

9. సహృదయాలే సత్యామృతాన్ని ఆస్వాదిస్తాయి

మహాశయులారా!

వర్షం వచ్చే ముందు చల్లటి పిల్ల గాలులు వీస్తాయి. అలా అవి దైవ కారుణ్యం ప్రభవించే వేళ ఆసన్నమయిందని మనకు శుభవార్తనిస్తాయి. ఆ తరువాత నీళ్ళతో నిండిన మేఘాలను తీసుకొని బయలుదేరుతాయి. ఆ మేఘాలు కుండపోత వర్షం కురిపిస్తాయి. దాంతో మృత భూమి సజీవ మవుతుంది. అంటే ఎండి బీటలు వారిన భూమి సస్యశ్యామలమవుతుంది. రకరకాల ఫలపుష్పాలు, ధాన్యం పండుతాయి. అలా భౌతిక జీవితానికి కావలసిన సామగ్రి తయారవుతుంది. అయితే వర్షం కురిసినంత మాత్రాన ప్రతి భూభాగం సస్యశ్యామలం కాజాలదు. సారవంతమయిన భూమి మాత్రమే పుష్కలంగా పండుతుంది. నిస్సారమయిన భూమిపై, చవుటి నేలపై ఎంత వర్షం కురిసినా ప్రయోజనం ఉండదు. కాకపోతే కొన్ని చోట్ల గడ్డి గరిక, ముండ్ల చెట్లు మాత్రం మొలకెత్తుతాయి. ఈ విధంగా గాలులు వీచడం మేఘాలు సంచరించడం, నీళ్ళు కురవడం, నేల నుంచి పచ్చటి చెట్లు మొలకెత్తడం చిత్రవిచిత్రంగా కనిపిస్తుంది. ఈ అద్భుత ఏర్పాటును గురించి ఆలోచించిన కొద్దీ ఇదంతా ఓ గొప్ప పథకం ప్రకారం సకల లోకాలను సృష్టించిన విశ్వప్రభువే నిర్వహిస్తున్నాడన్న మన విశ్వాసం దృఢ మవుతుంది.

మన ఆధ్యాత్మిక, నైతిక జీవితం కూడా ఇలాగే ఉంటుంది. మన భౌతిక జీవితంలా అల్లాహ్ మన నైతిక, ఆధ్యాత్మిక జీవితం కోసం కూడా ఒక నియమావళిని ఒక ప్రణాళికను రూపొందించాడు. మానవుల ఆధ్యాత్మిక జీవితం నిర్జీవంగా పడి ఉంటుంది. ఫలితంగా వారి జీవితాల నుండి నైతిక శుభాలు దూరమవుతాయి. ఆ సమయంలో దైవ సందేశం మరియు ప్రవక్తల రాక రూపంలో కారుణ్య మేఘాలు ప్రత్యక్షమవుతాయి. దివ్య బోధనల్ని కురిపిస్తాయి. అప్పటిదాకా నిర్జీవంగా పడి ఉన్న మానవత ఒక్కసారిగా మేల్కొంటుంది. ఆధ్యాత్మిక, నైతిక ప్రపంచం కళకళ లాడుతుంది. సత్క్రియల నదులు పొంగిపారుతాయి.

సోదరులారా!

ఏ విధంగానయితే వర్షం కురవగానే సారవంతమైన నేల, సస్యశ్యామల మవుతుందో, అదే విధంగా దైవ ప్రవక్తలు ఉపదేశించే దివ్య బోధనలతో సాధు స్వభావం గలవారే ఉత్తేజితులవుతారు. సరయిన మార్గదర్శకత్వం లేక ముకుళించుకుపోయి ఉన్నవారి హృదయాలు ఒక్కసారిగా విచ్చుకొని నైతికతా సువాసనల్ని వెదజల్లుతాయి.

ఇక చెడు స్వభావం, వక్రబుద్ధి, మంకుతనం, అహంకారం కలవారి సంగతికొస్తే, నిస్సారమైన నేలపై ఎంత వాన కురిసినా లాభం లేనట్లు ప్రవక్తలు ఎలాంటి బోధనలు చేసినా వారిలో మార్పు రాదు. ఈ ధర్మ బోధనల వల్ల వారు ఎలాంటి లాభాన్నీ పొంద లేరు. పైపెచ్చు నిస్సారమైన భూమి నుండి ముండ్ల చెట్లు మొలకెత్తినట్లు, వారి హృద యాల్లో దాగి ఉన్న కల్మషం, దుర్మార్గం, దుర్గంధం అన్నీ బయటపడతాయి.

సోదరులారా!

ప్రపంచ చరిత్రను చూస్తే ఒక విషయం మనకు స్పష్టంగా కనిపిస్తుంది. ప్రతి యుగంలోను దైవ ప్రవక్త ప్రభవించిన తరువాత ఆ సమాజం రెండు వర్గాలుగా మారిపోయేది. ఒకవర్గం దైవసందేశం, దైవ ప్రవక్త బోధనలతో ప్రయోజనం పొందిన సజ్జనులకు సంబంధించినది. వీరు నైతికంగా, ఆధ్యాత్మికంగా బాగా వృద్ధి చెందినవారు. రెండవ వర్గం మార్గభ్రష్టులకు చెందినది. వీరు దైవ దౌత్యం రూపంలో వచ్చిన దైవ కారుణ్యం వల్ల ప్రయోజనాన్ని పొందనివారు. పైగా వారు తమ హృదయాల్లో దాగి ఉన్న పైశాచికత్వాన్ని బయట పెట్టుకునేవారు.

దివ్య ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ కొన్ని చారిత్రక సంఘటనలను వివరిస్తూ, దైవ దౌత్యం రూపంలో తన కారుణ్య వర్షం మానవులపై ఎల్లప్పుడూ కురుస్తూ ఉంటుందని తెలియపరిచాడు. అయితే దాని ప్రభావం ఎలా ఉంది? దానివల్ల అతను ఏ విధంగా లాభం పొందాడు? అనే విషయాలపై అతని అదృష్ట, దురదృష్టాలు ఆధారపడి ఉంటాయి.

హజ్రత్ నూహ్ (అలైహిస్సలామ్) ప్రభవించి తన జాతి ప్రజలతో, "సోదరులారా! అల్లాహ్‌ను ఆరాధించండి. ఆయన తప్ప మీకు మరో దేవుడు లేడు. ఆయనే ఆరాధనకు అర్హుడు, ఆయన పట్ల మీరంతా విధేయత కలిగి ఉండాలి. ఒకవేళ మీరలా చేయకపోతే, మీ విషయంలో ఒక భయంకరమయిన దినాన విరుచుకుపడే శిక్ష గురించి నాకు భయంగా ఉంది" అని బోధించారు. అయితే ఆయన జాతివాళ్ళు దాన్ని పెడచెవిన పెడుతూ, "నువ్వు దారి తప్పావు. మన తాత ముత్తాతల ధర్మాన్ని విడిచి పెట్టావు. అలాంటిది, నీ మాటలు మేము ఎలా వినగలం?" అని ప్రశ్నించారు. నూహ్ (అలైహిస్సలామ్) వారికి నచ్చజెబుతూ, "కాదు, అలాంటిదేదీ కాదు. వాస్తవంగా నేను విశ్వ ప్రభువు తరఫు నుండి మీకు సందేశాన్ని తెచ్చాను (నా మాట వినండి). నేను మీ శ్రేయోభిలాషిని. ఏ యదార్థం గురించయితే నాకు తెలుసో, అది మీకు తెలియదు" అన్నారు. కాని చివరికేమయింది? కొందరు సజ్జనులు తప్ప ఆ జాతి ప్రజలంతా దైవ ప్రవక్త నూహ్ (అలైహిస్సలామ్)ను తిరస్కరించారు. పర్యవసానంగా అల్లాహ్ హజ్రత్

నూహ్ (అలైహిస్సలామ్)ని, ఆయన అనుచరుల్ని ఒక ఓడ ద్వారా కాపాడి మిగిలిన దుష్ట జనాన్ని ముంచివేశాడు.

అదే విధంగా ఆద్ జాతి కూడా దైవ ప్రవక్తను తిరస్కరించింది. హజ్రత్ హూద్ (అలైహిస్స లామ్) ప్రభవించి, "సోదరులారా! అల్లాహ్‌ను ఆరాధించండి. ఆయన తప్ప మరో దేవుడులేడు. ఆయన పట్లే మానవులు వినయ విధేయతలు కలిగి ఉండాలి" అని ఉపదేశించారు. కాని ఆద్ జాతి వాళ్ళు తలబిరుసుతో, "నువ్వు పచ్చి అబద్ధాలకోరువి, నీ బుద్ధి గడ్డి తిన్నది" అన్నారు. దైవప్రవక్త (అలైహిస్సలామ్) నచ్చజెబుతూ, "సోదరులారా! నా బుద్ధి గడ్డి తినలేదు, నేను బుద్ధిలేని మాటలు పలకడం లేదు. నేను నిస్సందేహంగా విశ్వ ప్రభువు తరపున వచ్చిన దైవ ప్రవక్తను. మీ శ్రేయస్సు కోరేవాడ్ని. ఇంతకూ మీ ప్రభువు మీ జాతి నుండే ఒక వ్యక్తికి తన సందేశాన్నిచ్చి పంపడం పట్ల మీరెందుకు ఆశ్చర్యపోతున్నారు?" అన్నారు. దానికి వారు, "ఏమిటి? మా తాత ముత్తాతలు పూజిస్తూ వస్తున్న దేవుళ్ళందర్నీ వదిలేసి ఒక్క అల్లాహ్‌ను మాత్రమే పూజించాల్నా?! ఇది చాలా బాగుంది!" అంటూ తిరస్కరించారు. ఫలితంగా దైవ శిక్ష వచ్చిపడింది. అల్లాహ్ హజ్రత్ హూద్ (అలైహిస్సలామ్)ని, ఆయన అనుచరుల్ని రక్షించి మిగిలినవాళ్ళను నామరూపాల్లేకుండా చేశాడు.

అలాగే సమూద్ జాతి పరిస్థితి కూడా. హజ్రత్ సాలిహ్ (అలైహిస్సలామ్) వచ్చి, "సోదరులారా! అల్లాహ్‌ను ఆరాధించండి. ఆయనే ఆరాధనలకు అర్హుడు. ఆయన తప్ప మరొక దేవుడు లేడు మీకు" అని బోధించారు. ప్రవక్త బోధనను సమూద్ జాతిలోని బలహీన వర్గాల వారే కళ్ళకద్దుకున్నారు. పెద్దలయి కూర్చొన్న ఆ జాతి నాయకులు మాత్రం దైవ సందేశాన్ని తిరస్కరించారు. అంతే కాకుండా సాలిహ్ (అలైహి స్సలాం) మోజిజాగా (మహత్యం) వదలిపెట్టిన ఒంటెను కూడా వారు వధించారు. ఆ తరువాత వారిపై దైవ శిక్ష విరుచుకుపడింది. హజ్రత్ సాలిహ్ (అలైహిస్సలామ్), "ప్రజలారా! నేను నా ప్రభువు సందేశాన్ని మీకు అందజేశాను; మీ మంచిని కోరాను. కాని నా మాటలు మీకు నచ్చలేదు" అంటూ విచారంగా ఆ పట్టణం వదలి వెళ్ళిపోయారు.

లూత్, మద్‌యన్ జాతులు కూడా అంతే. ఫిరౌన్ వృత్తాంతమూ అలాంటిదే. ప్రతి యుగంలోనూ, ప్రతి జాతి విషయంలోనూ అల్లాహ్ విధానం ఇలాగే ఉంటూ వచ్చిందని చరిత్ర సాక్ష్యమిస్తోంది. చివరికి మహా ప్రవక్త ముహమ్మద్ (సఅసం) సందేశ పర్యవసానం కూడా అలాగే ఉంది. సామర్థ్యం, సాధు స్వభావం ఉన్న ప్రజలు మహా ప్రవక్త (సఅసం) మార్గదర్శకత్వం వల్ల లాభం పొందారు. వీరే చరిత్రాకాశంలో

కాంతిమంతమయిన నక్షత్రాలుగా రుజువయ్యారు, ఆ కారుణ్యాన్ని పొందలేని అభాగ్యులు మాత్రం నామ రూపాల్లేకుండా పోయారు.

సోదరులారా!

ఈ రోజు కూడా మానవాళి ముందు అదే పరిస్థితి ఉంది. ఒక వైపు దివ్య ఖుర్‌ఆన్ రూపంలో దైవ జ్యోతి, హదీస్‌రూపంలో ప్రవక్త (సఅసం) ప్రబోధనామృతం ఉన్నాయి. మరో వైపు దైవ మార్గదర్శకత్వం కోసం పరితపిస్తున్న మానవత ఉంది. ఇంకా కావలసిందల్లా ఒక్కటే. మనలో ఒకవర్గం లేచి, మహా ప్రవక్త (సఅసం) ద్వారా లభించిన ఈ దైవ కారుణ్యాన్ని నిర్జీవంగా పడి ఉన్న మానవతపై చిలికించాలి. ఆ తరువాతనే ఆధ్యాత్మికంగా, నైతికంగా సారవంతమయిన నేలలు ఎక్కడెక్కడ ఉన్నాయి, నిస్సారమైన చవుటి నేలలు ఎక్కడెక్కడున్నాయి అనే విషయం తెలుస్తుంది. మహా ప్రవక్త (సఅసం) తరువాత ఈ గురుతర బాధ్యత మనందరిపై పడింది. కాని ఈ మహా కార్యాన్ని మహా భాగ్యంగా స్వీకరించి దాని కోసం తమ సర్వస్వాన్ని త్యాగం చేసే వాళ్ళే నిజానికి అదృష్టవంతులు.

10. మరణాన్ని మరిచే మానవులకు మోక్షం లేదు

మహాశయులారా!

పుట్టిన ప్రతి జీవీ గిట్టవలసిందే. ఇది అందరికీ తెలిసిన నగ్న సత్యం. ఈ సత్యాన్ని ఎవరూ నిరాకరించరు; నిరాకరించలేరు కూడా. అయినప్పటికీ మనిషి మరణాన్ని మరచిపోతుంటాడు. ప్రపంచ వ్యామోహంలో పడి మనిషి అనేక యదార్థాలను విస్మరించడం మనకు తెలిసిందే. అయితే చావు విషయంలో మాత్రం మనిషి మరీ అజాగ్రత్తలో పడి ఉన్నాడు. చావు అనే ఎంతో ముఖ్య విషయాన్ని చాలా తక్కువ మంది మాత్రమే గుర్తుంచుకుంటారు. "మనం ఒక రోజు చావవలసి ఉంది" అనే విషయాన్ని జీవితంలో అడుగడుగునా జ్ఞాపకం చేసుకునే వారు నిజానికి ఎంతో అదృష్టవంతులు. మనిషి మరణాన్ని గురించి ఎప్పుడూ తలచుకుంటూ ఉంటే అతను దుర్మార్గం, దౌర్జన్యం, ఇంకా ఇతర కార్యకలాపాలకు దూరంగా ఉండగలడు; ఉన్నతమయిన నీతి నడివడికలకు అలవాటుపడతాడు. అందుకే మహాప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం మరణాన్ని జ్ఞాపకం చేసుకుంటూ ఉండమని మనకు తాకీదు చేశారు.

అప్పుడప్పుడు మనలోని వ్యక్తులు మనల్నుండి శాశ్వతంగా దూరమవడం జరుగుతుంటుంది. మరణాన్ని తలచుకోవడానికి ఇది మంచి సమయం. అప్పుడు ఇలాంటి పరిస్థితి మనకూ వస్తుందన్న భావన కలుగుతుంది. ఈ ఉద్దేశ్యంతో అంత్యక్రియల్లో పాల్గొనడం ఎంతో ప్రయోజనకారి అవుతుంది. కాని ఈనాడు ఈ ఉద్దేశ్యంతో అంత్యక్రియల్లో పాల్గొనేవాళ్ళు చాలా తక్కువ మంది ఉన్నారు. అనేక మంది స్నేహసంబంధాలను నెలకొల్పుకోవడానికో, చనిపోయిన వ్యక్తి వారసుల మెప్పు పొందడానికో, సామాజిక వత్తిడి మూలంగానో లేదా ఇలాంటివే ఇతర కారణాల వల్లనో అంత్యక్రియల్లో పాల్గొంటారు. ఇలాంటి వారు చావును తలచుకోవడం వెనుక ఉన్న అసలయిన లక్ష్యాన్ని పొందలేరు. మనం తరచుగా చూస్తుంటాము - అనేక మంది జనాజా నమాజ్‌లో పాల్గొంటారు! శవం వెంట స్మశానం దాకా వెళతారు. సమాధిగావించే పనిలో కూడా పాల్గొంటారు. కాని అలాంటి సమయాల్లోనూ వారు ఏవేవో ప్రాపంచిక విషయాలు మాట్లాడుకుంటారు, కొంత మందయితే పనికిమాలిన కబుర్లతో కాలక్షేపం చేస్తారు. ఎందుకని?

దీనికి మూలకారణం ఒక్కటే. వారు ప్రాపంచిక మైకంలో మునిగిపోయారు, వివిధ వస్తువుల వ్యామోహంలో వారి హృదయాలు కూరుకుపోయాయి. ఫలితంగా మరణం లాంటి కటిక సత్యాన్ని కూడా వారు విస్మరించారు. కాబట్టి ఇది ఎంతో

ఆలోచించవలసిన విషయమని స్వయంగా మీరే అంటారు. మన హృదయాలకు అంటుకున్న ఈ వ్యాధికి చికిత్స చేయడం మనందరి బాధ్యత. ఈ రోగాన్ని నివారించడానికి మన ప్రియ ప్రవక్త (సఅసం) ఎన్నో విషయాలను బోధించారు. స్వయంగా దివ్య ఖుర్‌ఆన్‌ని అధ్యయనం చేస్తుండటం వల్ల ఈ లక్ష్యం సులువుగా నెరవేరుతుంది. అన్నిటికంటే ఇదే మంచి మార్గమని చెప్పవచ్చు. దాంతోపాటు తరచుగా సమాధుల్ని దర్శిస్తూ ఉండాలి.

సోదరులారా!

సమాధుల దర్శనం వెనుక వుండవలసిన ఉద్దేశ్యం ఏమిటో మహనీయ ముహమ్మద్ (సఅసం) స్పష్టంగా చెప్పారు. "ఇప్పుడు మీరు సమాధుల్ని దర్శించుకోండి. ఎందుకంటే దానివల్ల హృదయాల్లో సౌమ్యత జనిస్తుంది. కళ్ళు అశ్రుపూరితాలవుతాయి. పరలోకం జ్ఞాపకమొస్తుంది. (అయితే ఆ సమయంలో మీరు) పనికిమాలిన కబుర్లు మానివేయాలి" అన్నారు ఆయన. మహాప్రవక్త (సఅసం) బోధించిన ఈ దివ్య ప్రవచనం ప్రకారం మనం స్మశానాలకెళ్ళి మరణాన్ని, మరణానంతరం ఎదురయ్యే పరలోక జీవితాన్ని గురించి తలచుకుంటూ ఉండాలి. ఆ విధంగా హృదయంలో జనించే మృదుత్వం మనిషిని పాపకార్యాలకు దూరంగా ఉంచుతుంది. దైవభీతి వల్ల, చావును గురించిన తలంపు వల్ల కళ్ళు అశ్రుపూరితాలైతే అలాంటి వ్యక్తి అల్లాహ్, ఆయన ప్రవక్త (సఅసం) ఆదేశాలకు వ్యతిరేకంగా నడచుకోలేడు. మనల్ని మనం సరిదిద్దుకోవడానికి ఇది ఎంత మంచి మార్గమో ఆలోచించండి. కాని అలా కాకుండా సమాధుల్ని దర్శించడానికి వెళ్ళి అక్కడ అనవసరమయిన విషయాలు మాట్లాడుకోవడంలో లీనమయితే సమాధుల దర్శనమే వ్యర్థం.

సమాధుల దర్శనం గురించి మన ప్రియ ప్రవక్త (సఅసం) బోధించిన మరో అమృత ప్రవచనం కూడా గమనించండి: "సమాధుల్ని దర్శించండి, ఎందుకంటే దాని వల్ల గుణపాఠం లభిస్తుంది" అన్నారు ఆయన. గుణపాఠం లభించడమంటే మనిషి తాను చేస్తున్న తప్పును విడిచిపెట్టి మంచి దారిన నడవడానికి ప్రయత్నించడమే. ఉదాహరణకు మీరు ఓ గొప్ప చక్రవర్తి సమాధిని చూశారనుకోండి. అప్పుడు, "ఈ చక్రవర్తి ఒకప్పుడు ఎంతో వైభవంగా గడిపాడు. అతని పేరు వింటే ప్రజలు భయంతో వణికిపోయేవారు. కాని ఇప్పుడు స్వయంగా ఇతని పరిస్థితే దయనీయంగా మారిపోయింది. వందలాది టన్నుల మట్టి కిందపడి, మట్టిలో మట్టి అయిపోయాడు నిర్భాగ్యుడు!" అని మీరు అనుకుంటారు. అంతేకాదు, "జీవితం అన్నాక వడిదుడుకులు, ఎగుడుదిగుళ్ళు సహజం. ప్రతి జీవికి ఈ పరిస్థితులు తప్పవు" అనే భావన కూడా అప్పుడు మీలో కలుగుతుంది. ఇంకా ఇలాంటివే అనేక ఆలోచనలు

సమాధుల్ని దర్శించడానికి వెళ్ళినప్పుడు మన హృదయాల్లో మెదులుతాయి. వాటి నుండి మనం గుణపాఠం నేర్చుకోగలం.

మరొక హదీసులో దైవ సందేశహరుడు హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వ సల్లమ్ ఇలా బోధించారు. "నేను (లోగడ) మిమ్మల్ని సమాధుల దగ్గరికి పోకుండా నిరోధించి ఉన్నాను. ఇప్పుడు మీరు సమాధుల్ని దర్శించండి. ఎందుకంటే దానివల్ల మీలో ప్రపంచం పట్ల అనాసక్తత కలుగుతుంది; పరలోకం గుర్తు కొస్తుంది." ఇంకొక సందర్భంలో మహాప్రవక్త (సఅసం), "సమాధుల్ని దర్శించండి. దానివల్ల మరణం గుర్తుకొస్తుంది" అని బోధించారు.

సోదరులారా!

సమాధుల్ని దర్శించడానికి దైవ ప్రవక్త (సఅసం) మనల్ని ఎందుకు అనుమతించారో ఇప్పుడు మీకు స్పష్టంగా బోధపడిందనుకుంటా. ప్రాపంచిక వ్యామోహంలో పడటం, మరణాన్ని తలచుకోకపోవటం అన్నవి అనేక చెడులకు మూలాంకురాలు. దైవం, చావు గుర్తురానంత తీవ్రంగా మనం ప్రాపంచిక ఆకర్షణలకు లోనుకాకూడదు. ఈ విషయం అనుక్షణం మన స్మృతిపథంలో మెదులుతూ ఉండటం ఎంతో అవసరం, దీనికోసం సమాధుల్ని దర్శిస్తూ ఉండాలి. కాని దురదృష్టవశాత్తు ఈనాడు మనం సమాధుల దర్శనం ద్వారా అసలైన ప్రయోజనాలను పొందలేకపోతున్నాం. వాటికి బదులుగా మన ధార్మిక విశ్వాసాలకే విఘాతం కలిగించే అనేక చెడు సంప్రదాయాలను ప్రవేశపెట్టాం. అందువల్ల మనలోని ప్రతి వ్యక్తీ మొదట ఈ చెడు సంప్రదాయాలకు స్వస్తి చెప్పాలి, ఆ తరువాతనే మహాప్రవక్త (సఅసం) సూచించిన లక్ష్యం కోసం సమాధుల్ని సందర్శించాలి.

సోదరులారా!

సమాధుల సందర్శనం వల్ల కలిగే ఒక రకమైన ప్రయోజనాన్ని గురించి విన్నారు. ఇక రెండో రకమైన ప్రయోజనాన్ని గురించి మన ప్రియ ప్రవక్త (సఅసం) బోధించిన ప్రవచనాన్ని కూడా వినండి, "ఎవరయితే ప్రతి శుక్రవారం తన తల్లిదండ్రులు లేదా వారిలో ఒకరి సమాధి దగ్గరికి వెళతాడో, అతని పాపాలు క్షమించబడతాయి, అతను సజ్జనుడని తీర్మానించడం జరుగుతుంది" అన్నారు దైవ ప్రవక్త (సఅసం). మరొక సందర్భంలో, "సమాధిలో మృతుడు (నీటిలో) మునిగి (సహాయం) అర్థించేవాడిగా ఉంటాడు. అతను (తనకోసం) తన తల్లి, తండ్రి, సోదరుడు లేదా స్నేహితుడు చేసే దుఆ కోసం ఎదురుచూస్తుంటాడు. ఎప్పుడైతే ఈ దుఆ అతనికి చేరుతుందో అతను దాన్ని ప్రపంచం మరియు ప్రపంచంలోని దానికంటే ఎక్కువగా ప్రేమిస్తాడు.

అల్లాహ్ తప్పనిసరిగా ప్రపంచ మానవుల దుఆలను పర్వతాలంతా అధికంగా చేసి వాటిని సమాధివాసుల దగ్గరికి చేర్చుతాడు గుర్తుంచుకోండి పాప క్షమాపణకై చేసే దుఆ సజీవుల తరఫున మృతుల కోసం ఒక బహుమానం" అన్నారు మన ప్రియ ప్రవక్త (సఅసం).

మహాప్రవక్త (సఅసం) ఉపదేశించిన ఈ హితవుల ద్వారా మనం మృతుల కోసం క్షమాపణా ప్రార్థన చేయాలని తెలుస్తోంది. అందులో మనకు అత్యంత సన్నిహితులయినవారి కోసం ఎక్కువగా దుఆ చేయాలని ప్రవక్త బోధనలు సూచిస్తున్నాయి. మరణానంతరం వారికి మనం ఇవ్వగల మంచి బహుమానం ఇదే. ఇలా మృతుని పాప క్షమాపణకై మనం చేసే దుఆ కేవలం మృతునికే కాదు, మనకూ ప్రయోజనం చేకూర్చుతుంది. అయితే సమాధుల్ని దర్శించేటప్పుడు దైవప్రవక్త (సఅసం) హితవుల్ని, అందులోని ఉద్దేశాన్ని గుర్తుంచుకుంటేనే దుఆ వల్ల ప్రయోజనం ఉంటుంది.

11. అంతిమ దైవ గ్రంథం

మహాశయులారా!

అల్లాహ్ మనకు ప్రసాదించిన వరాలలో ఆయన పంపిన దివ్యఖుర్ఆన్ ఎంతో ముఖ్యమయినది. ఇది సమస్త మానవాళి కోసం అవతరించిన అంతిమ దైవ గ్రంథం. ఇంతకు ముందు అవతరించిన దైవ గ్రంథాలన్నిటిని ధృవీకరిస్తూ, జీవితపు అన్ని రంగాలలోనూ దైవాదేశాలను బోధిస్తున్న దివ్యగ్రంథం ఇది. ఇదే మనకు జీవితంలో రుజుమార్గాన్ని చూపే ఏకైక కరదీపిక. ఈ కరదీపిక చూపే మార్గమే మనల్ని సాఫల్యం వైపునకు గొనిపోతుంది.

ఈ గ్రంథంలో చెప్పబడిన ప్రతి మాటా స్వచ్ఛమయినది, దృఢమయినది. ఇది అత్యంత వివేచనాపరుడు, సమస్తం ఎరిగినవాడు అయిన విశ్వప్రభువు తరఫున అవతరించిన గ్రంథం. అంతేగాని, ఇది ఏ ఇంద్రజాలకుని జాల విద్యో లేక ఏ కవి రచించిన కావ్యమో కాదు. అందువల్ల ఇందులో ఉన్న ప్రతి విషయమూ యదార్థంతో కూడుకున్నది. ఇందులో బోధించబడిన ప్రతి మాటా జ్ఞానం మీద ఆధారపడి ఉంది. ఈ జ్ఞానం మనకు భూతభవిష్యత్ వర్తమాన కాలాలను ప్రస్ఫుటంగా ఎత్తి చూపిస్తుంది. ఈ గ్రంథకర్త సర్వజ్ఞాని. సృష్టిలో ఆయనకు తెలియని విషయమంటూ లేదు. మానవుని ఉద్బోధకోసం, నిజమయిన సాఫల్యం కోసం కావలసిన సమస్త విషయాలను సవివరంగా విపులంగా చర్చించింది. ఇందులో బోధించబడిన ఏ ఒక్క విషయమూ వివాదాస్పదంగాగానీ, అనుమానాస్పదంగా గాని లేదు.

సోదరులారా!

మానవుడు అల్లాహ్‌ను వదలి ఇతరుల్ని ఆరాధించకూడదని, ఆయన పట్ల మాత్రమే విధేయత కలిగి ఉండాలని ఖుర్ఆన్ మాటిమాటికి చెబుతోంది. ఇదే దీని మౌలిక సందేశం. ఇది మానవుడ్ని అతని నిజమయిన యజమాని వైపునకు పిలుస్తుంది. ఆయనే మానవులకు, ఇతర చరాచర సృష్టిరాసులకు సృష్టికర్త, యజమాని, ప్రభువు, పాలకుడు, పరిపోషకుడని చెబుతోంది. మానవుడు తన తప్పుల్ని, పొరపాట్లను గ్రహించి దైవం దగ్గర క్షమాపణ వేడుకోవాలని, అపమార్గాన్ని విడిచిపెట్టి దైవ మార్గాన్ని అనుసరించాలని ఖుర్ఆన్ మానవుడికి బోధిస్తుంది. అలా మానవుడు దైవం వైపునకు మరలి పవిత్ర జీవితం గడిపితే అతను ఇహలోక జీవితంలోనే కాకుండా శాశ్వతంగా ఉండే పరలోక జీవితంలోనూ సుఖశాంతులు అనుభవించగలడని తెలుపుతోంది.

జీవితానికి సంబంధించిన దైవ విధానాన్ని గనక మానవుడు అవలంబిస్తే, అది చూపిన సూత్రాల ప్రాతిపదికపై సమాజ నిర్మాణం జరిగితే, మానవుడు ఈ ప్రపంచంలో

జీవించి ఉన్నంత వరకు అతనిపై దేవుని శుభాలు వర్షిస్తూ ఉంటాయి, అతను సుఖ సంతోషాలతో మనుగడ సాగించగలడు. అతనికి జీవితంలో శాంతి సంతృప్తులు ఒనగూడుతాయి. అవమానం, అభాగ్యాలు అతని దరికి చేరలేవు.

సోదరులారా!

ప్రాపంచిక వ్యామోహపరుడయిన ప్రతి వ్యక్తిని షైతాన్ అపమార్గం పట్టించడానికి ప్రయత్నిస్తుంటాడు. దైవారాధనను, దైవ మార్గాన్ని అవలంబిస్తే మనిషికి పరలోకంలో మోక్షం లభించవచ్చేమో కాని, ప్రపంచంలో మాత్రం అతని జీవితం నాశనమవుతుందని చెప్పి షైతాన్ ప్రాపంచిక వ్యామోహపరుల్ని సులభంగా తన వల్లో వేసుకుంటాడు. ఇది నీతిగా జీవించాల్సిన కాలం కాదని, నీతి, నిజాయితీలను పట్టుకుని వ్రేళ్ళాడే వారు ప్రపంచంలో అష్టకష్టాలు పడవలసి వస్తుందని, చివరికి తిండి కూడా దొరకక చావవలసి వస్తుందని షైతాన్ మనిషిలో లేనిపోని ఆలోచనల్ని రేకెత్తించి దైవానికి దూరంగా ఉంచుతాడు. కాని దేవుడు ఈ అభిప్రాయాన్ని ఖండిస్తూ "ఏ వ్యక్తి అయినా స్త్రీగాని, పురుషుడుగాని నిజాయితీగా సత్కార్యాలను చేస్తే వారిచేత మేము పవిత్ర జీవితాన్ని గడిపింపజేస్తాం" అని స్పష్టంగా ప్రకటిస్తున్నాడు.

ఖుర్‌ఆన్ బోధనల ప్రకారం మనిషి సన్మార్గాన్ని అవలంబిస్తే అతని పరలోకమే కాదు, ఇహలోకం కూడా బాగుపడుతుంది. మోమిన్ అసలు లక్ష్యం పరలోకమే. పరలోక సాఫల్యం కోసం ఇహలోకంలోని తన సర్వస్వాన్ని సమర్పించవలసి వచ్చినా అతను బాధపడడు. అయితే పరలోకంలో లాగానే ఇహలోకంలోనూ మోమిన్‌కు నిజమయిన గౌరవం, సాఫల్యాలను ప్రసాదిస్తానని అల్లాహ్ వాగ్దానం చేశాడు. అల్లాహ్ చేసిన ఈ వాగ్దానం నెరవేరాలంటే ప్రతి ముస్లిమ్ దేవుని పట్ల పూర్తిగా భయభక్తులు కలిగి ఉండి, నీతి నిజాయితీలతో కూడిన పవిత్ర జీవితాన్ని గడపాలి. అతని జీవితంలోని ప్రతి వ్యవహారం దైవాజ్ఞల ప్రకారమే జరుగుతుండాలి. ప్రతి విషయంలోనూ అతని ప్రవర్తన, అతని నడవడికలు చూసి ప్రజల్లో అతను నమ్మకస్తుడన్న భావం ఏర్పడాలి, అతని వల్ల ప్రజలకు ప్రయోజనమే చేకూరాలి. అతని జీవితంలో అడుగడుగునా దైవం పట్ల భయభక్తులు, పరలోక భావన, పరోపకారం, సాధుత్వం, సత్యసంధతలు తొణికిసలాడుతూ ఉండాలి.

సోదరులారా!

ఇలాంటి సజ్జనులకే దేవుని వాగ్దానం వర్తిస్తుంది. ఈ వాగ్దానంతోపాటు మరో యధార్థాన్ని కూడా మనం ఎల్లప్పుడూ దృష్టిలో ఉంచుకోవాలి. ఖుర్‌ఆన్ దృక్పథం ప్రకారం ప్రపంచ సామగ్రి రెండు విధాలుగా ఉంది. ఒక రకమయిన సామగ్రి ఏమంటే, దైవాన్ని మరచిన మానవులకు ఇవ్వబడే సామగ్రి. ఈ సామగ్రి వాళ్ళను ప్రాపంచిక

వ్యామోహంలో పడవేసి అంధుల్నిగా చేసివేస్తుంది. ఆ అంధత్వంలో వారికి సత్యం, సన్మార్గం కనిపించవు. వీరికి లభించిన ఈ సామగ్రి పైకి ఒక వరంగా, మహాభాగ్యంగా కన్పించవచ్చు. కాని ఇది వారిపై విరుచుకుపడనున్న భయంకర శిక్షకు ఒక సూచన మాత్రమే.

ఇక రెండో రకమయిన సామగ్రి - మోమిన్‌కు లభించే సామగ్రి. మోమిన్ తనకు లభించిన సామగ్రి పూర్తిగా దైవ ప్రసాదితమని భావించి దైవానికి కృతజ్ఞతలు చెల్లిస్తాడు. తోటి దైవదాసుల హక్కుల్ని నెరవేరుస్తుంటాడు. అతను దైవం ప్రసాదించిన వనరుల్ని సద్వినియోగం చేస్తూ ప్రపంచంలో మంచిని వ్యాప్తి చేయడానికి చెడును నిరోధించడానికి నిరంతరం కృషి చేస్తుంటాడు. మోమిన్‌కు ఇంతకంటే మహాభాగ్యం మరేం కావాలి. దీనివల్ల మోమిన్‌కు ఈ ప్రపంచంలోనూ శాంతి సంతోషాలు లభిస్తాయి; పరలోకంలోనూ అపార స్వర్గ సౌఖ్యాలు లభిస్తాయి.

సోదరులారా!

విశ్వాసం, సదాచరణ అనేవి దైవం మానవునికి ప్రసాదించిన గొప్ప భాగ్యం. ఈ మహాభాగ్యం పైనే మనం ఎల్లప్పుడూ మన దృష్టిని కేంద్రీకరించాలి. మనం దివ్యఖుర్‌ఆన్‌ని విశ్వసించడమే కాకుండా ఆ విశ్వాసానికి తగినట్లు ఖుర్‌ఆన్ ఆదేశాలను తు.చ. తప్పకుండా పాటిస్తూ ఉండాలి. ఖుర్‌ఆన్‌ని కేవలం విశ్వసించినంత మాత్రాన సరిపోదు, ఆ విశ్వాసాన్ని మన జీవితపు అన్ని రంగాల్లో కనబరచాలి. అంటే ఖుర్‌ఆన్ ఆదేశాల ప్రకారం నడుచుకోవాలన్న మాట. అప్పుడే మనలో విశ్వాసం ఉన్నట్లు అర్థం. అప్పుడే మన విశ్వాసానికి సార్థకత ఉంటుంది. అల్లాహ్ మనందరికీ విశ్వాసం సదాచరణల మహా భాగ్యం ప్రసాదించుగాక!

12. అగుపించని శత్రువుపట్ల అప్రమత్తంగా ఉండాలి

మహాశయులారా!

మీ శత్రువు ఎవరో మీరు గుర్తించినప్పుడు అతని కుతంత్రాల పట్ల మీరు అప్రమత్తంగా ఉంటారు. అతని కీడు నుండి మిమ్మల్ని మీరు కాపాడు కోవడానికి తగిన చర్య తీసుకుంటారు, కాని శత్రువు కన్పించకుండా ఉంటే, అతను వేసే ఎత్తుగడలను గురించి ఏ మాత్రం తెలియకపోతే మీరు ఎక్కువ నష్టానికి గురయ్యే ప్రమాదం ఉంటుంది. షైతాన్ మనందరి బద్ధ శత్రువని మీకందరికీ తెలుసు. ఎందుకంటే వాడు మన శాశ్వత జీవితాన్ని సర్వనాశనం చెయ్యడానికి మన వెంటపడ్డాడు. అయితే వాడు మనకు కనపించకుండా దాక్కొని ఉన్నాడు. వాడు వేసే ఎత్తుగడలేమిటో కూడా మనకు సరిగా తెలియవు. అందువల్ల మానవునికి అన్నిటికంటే పెద్ద సమస్య ఈ శత్రువు నుండి కాపాడుకోవడమే. అనేక కారణాల వల్ల ఈ సమస్యకు ఎంతో ప్రాముఖ్యత కలిగింది.

మొదటి కారణం - మానవుడు తన అజ్ఞానం, అజాగ్రత్తల వల్ల, తన మనోవాంఛల వత్తిడికి లొంగిపోయి ఇంతటి పెద్ద శత్రువుని గుర్తించడానికి ఒప్పుకోడు. ఎందుకంటే షైతాన్ పన్నే పన్నాగాలు మానవుడికి అందంగా కనిపిస్తాయి. వాటి ద్వారా లభించే క్షణిక ప్రయోజనాల కోసం అతని మనస్సు ఆరాటపడుతుంది. అతను దాని పరలోక పరిణామాలను గురించి పట్టించుకోడు. కనుక మనల్ని సర్వనాశనం చేయడానికి మన ఆగర్భ శత్రువు మన మనో వాంఛలు నెరవేరే ఎత్తుగడలన్నీ వేస్తాడు. ఇలా ఈ శత్రువు ఎంతో ప్రశాంతంగా తన కార్యకలాపాలు కొనసాగిస్తుంటాడు. నల్ల మందు విష పదార్థమని తెలిసినప్పుడు దాని జోలికిపోకుంటే ఏ ప్రమాదం ఉండదు. కాని అందులోని రుచిని మరిగితే మాత్రం దాన్ని వదిలించుకోవడం చాలా కష్టం. అది క్రమేణా మన ప్రాణానికే ముప్పు తెస్తుందన్న యదార్థాన్ని కూడా మనం పట్టించుకోము.

సోదరులారా!

మన శత్రువు షైతాన్ విషయం కూడా అలాంటిదే. వాడి ఎత్తుగడలు ఆకర్షణీయంగా ఉంటాయి. వాడి సలహాలు వింటే నోరూరుతుంది. కాని వాడి వలలో పడితే మటుకు మనల్ని వాడు సర్వనాశనం చేసిగాని వదలిపెట్టడు. అందువల్ల అనంత కరుణామయుడయిన అల్లాహ్ మనకు వాడి ఎత్తుగడలన్నిటినీ తెలిపి హెచ్చ రించాడు. మనకు ఏది లాభమో ఏది నష్టమో - అన్నీ వివరించాడు. మంచీ చెడుల్ని గురించిన విచక్షణా జ్ఞానాన్ని ఉపయోగించి షైతాన్ వేసే ఎత్తుగడల్ని వమ్ము చెయ్యడం మన పని.

షైతాన్ మనల్ని వలలో వేసుకోడానికి వేసే ఎత్తుగడలు ఎన్నో ఉన్నాయి. కాని

ఎత్తుగడలన్నిటినీ ఆరు ముఖ్య భాగాలుగా విభజించవచ్చు. వాటిని క్షుణ్ణంగా అర్థం చేసుకుంటే మనం షైతాన్ విష వలయంలో చిక్కు పడకుండా జాగ్రత్తవహించడంలో కృతకృత్యులవుతాము.

షైతాన్ వేసే ఎత్తుగడలలో మొదటిది - వాడు మనల్ని షిర్క్, కుఫ్ర్ లాంటి ఘోరాతి ఘోరమయిన పాపకూపాలలోకి తోయడానికి ప్రయత్నిస్తాడు. ఆ ప్రయత్నంలో వాడు విజయం సాధించగలిగితే వాడి ఆనందానికి అవధులే ఉండవు. అలాంటి పాపకూపంలో పడిన వ్యక్తిని వాడు తన శిష్య గణంలో చేర్చుకుంటాడు.

ఒకవేళ షైతాన్ ఇందులో విజయవంతం కాలేకపోతే ఆ వ్యక్తిపై వాడు మరో ఉపద్రవం తీసుకువస్తాడు. ఆ ఉప్రదవమే 'బిద్అత్'. దేవుడు, దైవప్రవక్త (సఅసం) తెలుపనటువంటి విషయాన్ని కూడా కొందరు ధర్మంలో కొత్తగా చేర్చుతారు. దీన్నే 'బిద్అత్' అంటారు. షైతాన్‌కు ఇతర చెడులకన్నా ఇది ఎంతో ఇష్టం. ఎందుకంటే బిద్అత్ యొక్క నష్టం నేరుగా ధర్మానికి కలుగుతుంది. ఇది ఒకరి నుంచి మరొకరికి సోకే అంటువ్యాధి లాంటిది. ఇది ఎలాంటి పాపమంటే దాన్నుంచి బయటపడే అదృష్టం చాలా కొద్ది మందికే లభిస్తుంది. ఎందువల్లనంటే బిద్అత్‌కు లోనయినవాడు దాన్ని ఓ పుణ్యకార్యంగా భావిస్తుంటాడు. షిర్క్, కుఫ్ర్ అనే పైశాచిక గృహాలకు 'బిద్అత్' అందమయిన ద్వారం. ఎవరయినా ఈ ద్వారం దగ్గరికి వచ్చాడంటే షైతాన్ అతడ్ని తేలిగ్గా కుఫ్ర్, షిర్క్‌లలో ముంచి తన అనుయాయుల జాబితాలలోకి చేర్చుకుంటాడు.

ఈ ప్రయత్నం కూడా ఫెయిల్ అయితే షైతాన్ మనిషికి మరో విధమయిన కీడును తెచ్చి పెడతాడు. వాడు మానవుడి చేత మహా పాతకాలను చేయించడానికి ప్రయత్నిస్తాడు. ముఖ్యంగా షైతాన్ జ్ఞానులు, పండితులయిన వ్యక్తులను మహా పాతకాలకు పాల్పడేలా చేయజూస్తాడు. సామాన్య ప్రజలు పండితుడు చెప్పినట్లు నడుచుకుంటారు. కాని పండితుడే ఘోర పాపానికి పాల్పడితే సామాన్యులు పాల్పడటంలో విశేషం ఏముంది? అందుకని షైతాన్ పండితులను వంచించడానికి శత విధాలా ప్రయత్నిస్తాడు.

షైతాన్ ఈ ప్రయత్నంలోనూ విజయవంతం కాలేకపోతే మనల్ని చిన్న పాపాల్లో త్రోయడానికి ప్రయత్నిస్తాడు. ఇవి చిన్న పాపాలే అయినా మనిషి అందులో కాలుజారితే క్రమంగా అవి అతడ్ని మహా పాపాల వైపునకు తీసికెళ్తాయి.

ఒకవేళ ఎవరయినా ఈ చిన్న పాపాల నుండి కూడా తప్పించుకుంటే షైతాన్ అతడ్ని మరో విధంగా మోసగించడానికి ప్రయత్నిస్తాడు, అతడ్ని షైతాన్ ఇటు

పాపంగాని, అటు పుణ్యంగాని లభించని ధర్మసమ్మతమైన కార్యాలలో ఇరికిస్తాడు. ఆ విధంగా మానవుడ్ని షైతాన్ సత్కార్యాలకు దూరంగా ఉంచుతాడు.

ఈ ప్రయత్నంలో కూడా షైతాన్ ఓడిపోతే వాడు మరో పన్నాగం పన్నుతాడు. పెద్ద పెద్ద సత్కార్యాలు చేయనీయకుండా వాడు మానవుని మనస్సును చిన్న చిన్న సత్కార్యాలపై లగ్నం చేయిస్తాడు. ఉదాహరణకు, షైతాన్ కొందరిని నఫిల్ సత్కార్యాలకు అమితమయిన ప్రాముఖ్యతనిచ్చేలా చేస్తాడు. ఫలితంగా వారు నఫిల్ సత్కార్యాలలో లీనమయిపోయి చివరికి ఫర్జ్ సత్కార్యాలనే విస్మరిస్తుంటారు. నమాజ్ ఎగరగొట్టి దైవ ధ్యానంలో నిమగ్నమవడం, జకాత్ చెల్లించకుండా విస్తృతంగా దాన ధర్మాలు చేయడం మొదలగునవి ఇలాంటి కోవకు చెందిన విషయాలే. ఫర్జ్‌కు బదులు నఫిల్‌కు ప్రాధాన్యత నివ్వడమనేది షైతాన్ ఎత్తుగడని వారు గ్రహించరు. నఫిల్ కర్మలయినా అసలు షైతాన్ మనచే సత్కర్మలు ఎందుకు చేయిస్తాడని వారు మనస్సులో ప్రశ్నించుకుంటారు.

ఈ పన్నాగం కూడా బెడిసికొట్టిందనుకోండి. అప్పుడు షైతాన్ ఆఖరి ఆయుధం ప్రయోగిస్తాడు. వాడు మోమిన్‌పై రకరకాల నిందారోపణలు మోపుతాడు. ప్రవక్త (సఅసం) మీద అభిమానం లేనివాడని, వలీల ద్వేషి అని, మోసగాడని అతనిపై నిందలు వచ్చేలా చేస్తాడు. వీటితో మోమిన్ ఆందోళన చెందుతాడు. తన కాలాన్నంతా తనపై వచ్చిపడిన నిందారోపణలను దూరం చేసుకోవడంలోనే గడిపేస్తాడు. ఈ విధంగా అతను తన అసలు కర్తవ్యాన్ని వదిలేస్తాడు. కాని అల్లాహ్ ఆయన ప్రవక్త (సఅసం) పట్ల అచంచల విశ్వాసం కల మోమిన్ అలాంటి పరిస్థితిలో ఎంతో నిగ్రహాన్ని పాటిస్తాడు. తనపై వచ్చే నిందారోపణలకు జవాబులిస్తూ కాలం గడపడానికి బదులుగా అతను తన దృష్టిని అసలు లక్ష్యంపై కేంద్రీకరిస్తాడు. దాంతో షైతాన్ నిరాశచెంది చెవులు జాడించుకుంటూ వెళ్ళిపోతాడు.

సోదరులారా!

షైతాన్ మనల్ని నరకాగ్నికి సమిధలుగా మార్చడానికి కంకణం కట్టుకున్నాడు. వాడు మన వెనుక నుంచి, ముందు నుంచి, కుడి వైపు నుంచి, ఎడమ వైపు నుంచి ప్రతి కోణం నుంచీ ప్రతి క్షణం మనపై దాడిచేసే ప్రమాదం ఉంది. అందుకే వాడి ఎత్తుగడలను గురించి ఇంతగా వివరించవలసి వచ్చింది. వీటన్నిటిని మనం ఎప్పుడూ దృష్టిలో ఉంచుకోవాలి.

షైతాన్ బారినుండి తప్పించుకోవడానికి మనం కొన్ని చిట్కాలను అనుసరించాలి. అన్నింటికంటే అతిముఖ్యమైన చిట్కా- "షైతాన్ ఎప్పుడైనా మిమ్మల్ని చెడుపనికి ప్రేరేపిస్తే వెంటనే మీరు దేవుని శరణువేడండి" అని స్వయంగా దివ్యఖుర్ఆన్ చెబుతోంది. ఇలాంటి బోధనలు దివ్యఖుర్ఆన్‌లో అనేక చోట్ల ఉన్నాయి. దైవప్రవక్త (సఅసం) కూడా ఈ విషయాన్ని గురించి మనకు తాకీదు చేశారు.

దీంతోపాటు షైతాన్ కీడు నుంచి తప్పించుకోవడానికి ప్రతి రోజు దివ్యఖుర్ఆనని అర్థం చేసుకుంటూ పఠించాలి. ముఖ్యంగా "ఖుల్ అవూజు బిరబ్బిల్ ఫలఖ్, ఖుల్ అవూజు బిరబ్బిన్నాస్" సూరాలు పఠించాలి. షైతాన్ కీడునుండి రక్షణ పొందడానికి ఈ రెండు సూరాలకు మించిన మరే విషయం లేదని దైవప్రవక్త (సఅసం) అన్నారు. అదీగాక ఈ విషయంలో మన ప్రియప్రవక్త (సఅసం) ఉదయం, సాయంత్రం మూడేసి సార్లు 'ఇఖ్లాస్' సూరా కూడా పఠించమని బోధించారు. 'ఆయతుల్ కుర్సి', బఖరా సూరా యొక్క చివరి రుకు, మోమిన్ సూరాలోని మొదటి మూడు ఆయత్‌లు పఠించడం కూడా ప్రయోజనకరమే. పోతే షైతాన్ బారినుండి కాపాడుకోవడానికి దైవ ధ్యానం కూడా ఎంతో అవసరం. సైనికుడికి యుద్ధ కవచంలా మోమిన్‌కు దైవధ్యానం రక్షణగా ఉంటుంది. వీటన్నిటికి మించి, మనం చేస్తున్న పనులు ఖుర్ఆన్, హదీసుల పరిధిలో ఉన్నాయా లేదా అనే విషయాన్ని గురించి అనుక్షణం ఆత్మపరిశీలన చేసుకుంటూ ఉండాలి. మన ఆచరణలో ఏ కాస్త చెడు ఉన్నట్టు అనిపించినా తక్షణమే దాన్ని దూరం చేసుకోవాలి. ఇలా చేస్తే ఇన్షాఅల్లాహ్ షైతాన్ పాచికలు ఏవీ మనపై పారవు.

13. నైతిక రుగ్మతలకు నివారణోపాయం-నమాజ్

మహాశయులారా!

మనం అల్లాహ్‌ను, ఆయన అంతిమ సందేశహరు (సఅసం)ని విశ్వసించాం. అయితే అల్లాహ్ తన అంతిమ ప్రవక్త (సఅసం) ద్వారా పంపిన ఆజ్ఞలను శిరసా వహించినప్పుడే మన విశ్వాసానికి గుర్తింపు లభిస్తుంది. అల్లాహ్ ఆదేశాలలో నమాజ్‌కు ఎంతో ప్రాముఖ్యత ఉంది. నమాజ్ పాటించక పోతే దేవుని దగ్గర మన విశ్వాసానికి ఎలాంటి విలువ ఉండదు.

ఎవరయితే పరలోకాన్ని దివ్యఖుర్‌ఆన్‌ని విశ్వసిస్తారో వారు నమాజ్‌ని పాటిస్తారని దేవుడు తన గ్రంథంలో విశ్వసించిన వారి పరిస్థితిని వివరించాడు. ఖుర్‌ఆన్‌లో మరొక చోట, తమ నమాజ్‌లో ఏకాగ్రత పాటించే విశ్వాసులు నిస్సందేహంగా సాఫల్యం చెందుతారని ఉంది. ఈ విషయంలో మన ప్రియప్రవక్త (సఅసం) ఏం సెలవిచ్చారో గమనించండి. "ఎవరయితే అయిదు వేళల నమాజులను పరిరక్షిస్తాడో, సరైన రీతిలో రుకూ చేస్తాడో, సక్రమమయిన పద్ధతిలో సజ్దా చేస్తాడో, నమాజ్ వేళలను పాటిస్తాడో, అది అల్లాహ్ తరపు నుండి విధించబడిన ఒక విధి అని విశ్వసించాడో అతను స్వర్గంలో ప్రవేశిస్తాడు" అన్నారాయన.

అల్లాహ్ మనపై అయిదు వేళలా నమాజ్‌ను విధించాడని మీకందరికీ తెలుసు. ఈ నమాజులను నిర్ణీత వేళల్లో చేయాలి. నిర్దేశించబడిన రీతుల ప్రకారమే చేయాలి. అంతేగాని మనిష్టమొచ్చిన వేళకు, ఇష్టమొచ్చిన విధంగా చేయడానికి వీల్లేదు. దీన్ని గురించి దైవ ప్రవక్త (సఅసం) గట్టిగా తాకీదు చేశారు. నమాజ్‌ను ఎంతో వినయంతో, ఏకాగ్రతతో, నిశ్చలంగా ప్రశాంత హృదయంతో చేయాలన్న సంగతి కూడా మీకు తెలుసు. దైవ ప్రవక్త (సఅసం) తన వాక్కర్మల ద్వారా మనకీ విషయాన్ని బోధించారు.

"నేను ఎలా నమాజ్ చేస్తున్నట్లు మీరు చూస్తున్నారో మీరు అలా నమాజ్ చేయండి" అన్నారు ఆయన. ఈనాడు మన ముందు ఎన్నో హదీసులు ఉన్నాయి. వీటి ద్వారా మన ప్రియప్రవక్త (సఅసం) నమాజ్ ఎలా ఆచరించేవారో, ఎంత ఏకాగ్రతతో చేసేవారో తెలుస్తోంది. ఆ విధంగా నమాజ్ పాటించాలని ఆయన మనకు ఉపదేశించారు.

ఒకసారి మహాప్రవక్త (సఅసం) ఒక వ్యక్తిని నమాజ్ చేస్తుండగా చూశారు. ఆ వ్యక్తి రుకూ సరిగా చేయడం లేదు. సజ్దా కూడా సరిగా చేయడం లేదు. అలా చేసి వస్తుంటే, అతడ్ని చూసి దైవప్రవక్త (సఅసం), "నీవు నమాజ్ సరిగా చేయలేదు.

మళ్ళీపోయి నమాజ్ చెయ్యి" అన్నారు. ఆ వ్యక్తి వాపసు పోయి మళ్ళీ నమాజ్ చేశాడు. కాని దైవ ప్రవక్త (సఅసం) తిరిగి అదే విధంగా ఆదేశించారు. ఇలా ఈ సంఘటన మూడు సార్లు జరిగింది. ఆ తరువాత అతను దైవప్రవక్త (సఅసం)తో "మీకు సత్యాన్నిచ్చి పంపిన దేవుని సాక్షి! ఇంతకంటే బాగా నేను నమాజ్ చేయలేను. మీరు నేర్పండి నాకు"అని అడిగాడు. అప్పుడు దైవప్రవక్త (సఅసం) ఇలా బోధించారు :

"నువ్వు నమాజ్ చెయ్యడానికి నిలబడినప్పుడు (మొదట) 'అల్లాహు అక్బర్' అని చెప్పు, తరువాత ఖుర్‌ఆన్‌ని పఠించగలిగినంత పఠించు, తరువాత 'రుకూ'లోకి వెళ్ళు రుకూలో ప్రశాంతంగా రుకూ చేయగలిగినంత సేపు ఉండు. తరువాత రుకూ నుండి నిటారుగా లేచి నిలబడు ఆ తరువాత సజ్దా (స్థితి)లోకి వెళ్ళు అలా ప్రశాంతంగా సజ్దా చేయగలిగినంత సేపు వుండు. తరువాత సజ్దా నుండి తల పైకెత్తి ప్రశాంతంగా సజ్దా చేయగలిగినంత సేపు ఉండు, నీ మొత్తం నమాజ్‌ని ఇదే విధంగా చెయ్యి."

ఇలా మన ప్రియప్రవక్త (సఅసం) నమాజ్ ఎలా ప్రశాంతంగా, స్థిమితంగా చేయాలో మనకు నేర్పారు. ఇదే సరయిన నమాజ్. ఇలాంటి నమాజ్‌నే అల్లాహ్ అంగీకరిస్తాడని ఆశించగలం. స్థిమితంగా చేయని నమాజ్ సరయిన నమాజ్ కాదు. ఇలాంటి నమాజ్ విషయంలోనే మహాప్రవక్త (సఅసం) "నీవు సరిగా నమాజ్ చెయ్యలేదు, పోయి సరిగా నమాజ్ చెయ్యి" అన్నారు.

కొందరు నమాజ్‌లో రుకూ, సజ్దాలు కూడా సరిగా చేయరు. స్థిమితంగా నమాజ్ చేయరు. వారి నమాజ్‌లో ఎప్పుడు ముగించి వెళదామా అనే ధోరణి కనిపిస్తుంది. అంటే వీరు నమాజ్‌ని పరిరక్షించడం లేదన్న మాట. అలాంటి వ్యక్తిని దైవ ప్రవక్త (సఅసం) పచ్చి దొంగగా అభివర్ణించారు. ఒసారి ఆయన రుకూ, సజ్దాలు సరిగా చేయనటువంటి వ్యక్తిని చూసి, "ఇతను ఇదే స్థితిలో మరణిస్తే అతని అంతం ముహమ్మద్ సమాజంలో కాదు" అని పలికారు. అంటే అతను ముస్లిమేతరుని స్థితిలో చనిపోతాడని అర్థం. ఇలాగే వేళ తప్పించి నమాజ్ చేసే వ్యక్తి కూడా నమాజ్‌ని పరిరక్షించని వారి జాబితాలోకే వస్తాడు.

సోదరులారా!

దైవాజ్ఞలలో నమాజ్‌కు ఉన్నంత ప్రాముఖ్యత మరే ఆజ్ఞకూ లేదు. దాన్ని ఎలాంటి స్థితిలోనూ వదలిపెట్టడానికి వీల్లేదు. నమాజ్ ముస్లిమ్ యొక్క గుర్తింపు. హజ్రత్ మసీహ్ (అలైహిస్సలామ్) మాటల్లో నమాజ్ మానసిక మందు నమాజ్ హృదయ కవాటానికి తాళం వంటిది. నమాజ్ విశ్వాసాన్ని కాపాడే ఆయుధం. నమాజ్ మనో వాంఛలను అదుపులో ఉంచే కళ్ళెం, నమాజ్ ప్రళయ దినంనాడు మనల్ని రక్షిస్తుంది.

మన విశ్వప్రభువు అల్లాహ్ మన పాపాలను నమాజ్ ద్వారా తుడిచివేస్తాడు. హజ్రత్ ఈసా (అలైహిస్సలామ్) ఒకసారి తన అనుచరులకు నమాజ్ ప్రాముఖ్యతను ఒక ఉదాహరణ ద్వారా బోధిస్తూ, "ఒక మూగవాడికి ఒక పుట్టు గ్రుడ్డి ముందు ఎలా తన ఉనికిని నిరూపించుకునే శక్తి ఉండదో అలాగే నమాజ్ పాటించని మానవుడికి సత్కార్యాలు చేసేవాడిగా తయారయ్యే శక్తి ఉండదు" అని చెప్పారు.

సోదరులారా!

యూదులు అల్లాహ్ శుభాలను విస్మరించారు. అల్లాహ్‌తో చేసిన ఒడంబడికను భంగం చేశారు. అనేక నైతిక రుగ్మతలలో నిమగ్నులయ్యారు. వారి నైతిక రుగ్మతలన్నిటికీ నివారణ తెలుపుతూ అల్లాహ్, "నమాజ్‌ని స్థాపించండి. జకాత్‌ని చెల్లించండి. నా ముందు రుకూ చేసే వారితో మీరూ రుకూ చేయండి" అని ఆదేశించాడు. సంస్కరణ అనేది ప్రతి వ్యక్తికీ అవసరమే. నాకు సంస్కరణ అవసరం లేదని మనలో ఏ ఒక్కరూ అనలేరు. అయినప్పటికీ ప్రజలకు నమాజ్ చేయడం చాలా కష్టమయిపోయింది. ఈనాడు అనేక మంది ముస్లిమ్‌లు అసలు నమాజే చెయ్యరు. నిజం చెప్పాలంటే నమాజ్ మనిషి విశ్వాసానికి గీటురాయి. మన విశ్వాసం ఏ స్థాయిలో ఉంటుందో నమాజ్‌తో మన సంబంధం కూడా అదే స్థాయిలో ఉంటుంది. దేవుడు దివ్యఖుర్‌ఆన్‌లో "నిస్సందేహంగా నమాజ్ కష్టంతో కూడుకున్న పనే. అయితే మేము మా ప్రభువుని కలుసుకోవలసి ఉందని, ఆయన వైపునకే మరలి పోవలసి ఉందని విశ్వసించిన, వినయులైన దాసులకు మాత్రం నమాజ్ కష్టమైన పని కాదు" అని తెలిపాడు.

నమాజ్ విషయంలో స్థిరంగా ఉండేందుకు ఒకవైపు అల్లాహ్‌పై, అంతిమ దినంపై, దైవ దౌత్యంపై దృఢ విశ్వాసం ఉండాలి. మరో వైపు మనిషి జీవితం పవిత్రంగా ఉండటం కూడా అవసరమే. జీవితం యొక్క ప్రభావం నమాజ్‌పై పడుతుంది. ఎలాంటి చెడు లేకుండా జీవితం పరిశుద్ధంగా ఉంటే నమాజ్ చేయడం కష్టమేమీ కాదు. నమాజ్ సవ్యంగా ఉంటే చెడులు దూరమయి జీవితం కూడా పరిశుద్ధమవుతుంది. షైతాన్ దైవ ధ్యానం నుండి, నమాజ్ నుండి మానవుణ్ని నిరోధించదలచినప్పుడు అతను మానవుణ్ని చెడులలో ఇరికిస్తాడు. ప్రత్యేకంగా మహా పాతకం నమాజ్‌కు పెద్ద ఆటంకంగా ఉంటుంది.

సోదరులారా!

అల్లాహ్ పట్ల భయభక్తులు కలిగి ఉండండి. నమాజులను పరిరక్షించండి. ప్రతి నమాజ్‌ను దాని వేళకు పాటించాలి. సామూహికంగా చేయాలి. వీలయినంత వరకు నమాజ్ కోసం మహాప్రవక్త (సఅసం) నిర్దేశించిన షరతులన్నింటిని పూర్తిచేయడానికి

ప్రయత్నించాలి. అంటే మన ఆలోచనలు అటూ ఇటూ పోనీయకుండా ఏకాగ్రతతో నమాజ్ చేయాలి, నమాజ్‌లో మనం పఠించే పదాలు, వాక్యాలను జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలి. నమాజ్‌లో ఉన్నంత సేపూ మనం విశ్వప్రభువు ముందు నిలబడ్డామన్న ధ్యాస ఉండాలి. ఆయన మనల్ని చూస్తున్నాడని మన మాటలు వింటున్నాడని, ఆయనకు మన అంతరంగంలోని విషయాలు కూడా తెలుసని గ్రహించాలి. నమాజ్‌లో మన ధ్యానం అల్లాహ్‌పై లేకపోతే అల్లాహ్ కూడా మనల్ని పట్టించుకోడు, మనపై తన కరుణాకటాక్షాలను ప్రసరింపజేయడు.

కనుక సోదరులారా! అల్లాహ్‌కు భయపడండి. నమాజ్ విషయంలో జాగ్రత్తగా ఉండండి. సామూహికంగా నమాజ్ చేయండి. ఒకసారి దైవప్రవక్త (సఅసం) సన్నిధికి ఒక అంధ అనుచరుడొచ్చి, "దైవప్రవక్తా! నేను అంధుడనైన కారణంగా సామూహిక నమాజ్‌కు హాజరు కాలేక పోతున్నాను. అందువల్ల నాకు సామూహిక నమాజ్‌లో పాల్గొనకుండా ఉండే అవకాశం ఏమైనా ఉందా?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (సఅసం), "నీకు అజాన్ పిలుపు వినిస్తుందా?" అని అడిగారు. ఆయన ఔనన్నాడు. అప్పుడు మన ప్రియ ప్రవక్త (సఅసం) "అలాగయితే దానికి జవాబుగా నీవు మస్జిద్‌కు హాజరు కావలసిందే. నీకు అనుమతి ఇచ్చే అవకాశమేదీ లేదు" అని విస్పష్టం చేశారు. మహాప్రవక్త (సఅసం) కాలంలో కపట ముస్లిములక్కూడా సామూహిక నమాజ్ చేయడం తప్పేది కాదు. దీన్ని బట్టి సామూహిక నమాజ్ ఎంత ముఖ్యమయిందో తెలుస్తోంది.

14. సమాజ శ్రేయస్సుకై జకాత్ ఆవశ్యకత

మహాశయులారా!

మనకు అల్లాహ్ ప్రసాదించిన అనుగ్రహాలలో గొప్ప అనుగ్రహం ఆయన ధర్మమే. ఇస్లామీయ షరీఅత్‌ను కాస్త జాగ్రత్తగా పరిశీలిస్తే అందులో మన అభివృద్ధి శ్రేయాలకు సంబంధించిన అనేక విషయాలున్నట్లు సులభంగా గ్రహించగలం. షరీఅత్ ఆదేశాలలో 'జకాత్' కూడా ఒకటుంది. నమాజ్ తరువాత దీనికే ఎక్కువ ప్రాముఖ్యత ఉంది, ఇది దైవం తరపున నిర్ణయించబడిన ఒకవిధి. జకాత్ చెల్లించనివాడు గొప్ప నేర స్థుడు, పాపాత్ముడు. పరలోకంలో అతను తీవ్రమయిన శిక్షకు గురవుతాడు.జకాత్ దైవా దేశం కాదని నిరాకరించినవాడు దైవ తిరస్కారి అవుతాడు.

మోమిన్ షరీఅత్ యొక్క ఏ ఆజ్ఞను పాటించినా అది దైవం తరఫున జారీ చేయ బడిన ఆదేశమని గ్రహించడం వల్లనే దాన్ని పాటిస్తున్నాడు, షరీఅత్ ఆజ్ఞలను శిరసావహిస్తే తన నిజ యజమాని సంతోషించి పరలోకంలో తనకు శాశ్వత స్వర్గ సౌఖ్యాలు ప్రసాది స్తాడని అతను నమ్ముతున్నాడు. ఇహలోకంలో మోమిన్ యొక్క ప్రయత్నాలన్నీ పరలోక సాఫల్యం కోసమే.

షరీఅత్ ఆజ్ఞలను శిరసావహించడం వల్ల కేవలం పరలోకంలోనే కాదు, ఇహ లోకంలో కూడా అనేక ప్రయోజనాలున్నాయి. జకాత్ వల్ల మానవాళికి ఇహలోకంలో కలిగే ప్రయోజనాన్ని గురించి ప్రస్తావిస్తూ అల్లాహ్, సిరిసంపదలు కేవలం ధనిక వర్గంలో మాత్రమే కేంద్రీకృతమై ఉండకూడదని అన్నాడు.

సోదరులారా!

దీనివల్ల మనకు తెలుస్తున్నదేమిటంటే జకాత్ మనకు ఒక వైపు ఆధ్యాత్మికత, నైతికతలకు సంబంధించిన అనేక ప్రయోజనాలను చేకూర్చుతుంది. మరో వైపు ప్రపంచంలో ఇది సంపదను వ్యాపింపజేస్తుంది. సంపదను కూడబెట్టేవారి విషయంలో "ఎవరయితే వెండీ, బంగారం నిధులను నిల్వచేస్తారో, దైవమార్గంలో వాటిని ఖర్చుపెట్టరో వారికి తీవ్రమైన, బాధకరమయిన శిక్ష ఉందని శుభవార్త వినిపించు" అని దివ్యఖుర్‌ఆన్ హెచ్చరించింది.

దీన్నిబట్టి మనకు తెలుస్తున్న మరో విషయం ఏమిటంటే సంపద ఒక చోట పోగవడం, మనిషి డబ్బుపాము దాన్ని కాపలా కాయడం ఇస్లామ్ ఎన్నటికీ సహించదు.ధనం సమాజంలో సంచరిస్తూ ఉండాలని ఇస్లామ్ కోరుతోంది. సంపద ఏ ఒక్క ప్రత్యేక

వర్గంలో నిలువకుండా సాధ్యమయినంత ఎక్కువగా ప్రజల్లో పంపిణీ జరగాలి. ఇస్లామ్ యొక్క ఈ లక్ష్యం దాని వారసత్వపు చట్టం ద్వారా కూడా నెరవేరుతుంది. ఒక వ్యక్తి చని పోయిన తరువాత అతని ఆస్తి మొత్తం అతని కుటుంబంలోని ఎవరో ఒక సభ్యుడికి మాత్రమే చెందకుండా ఇస్లామ్ అతని కొడుకులు, కూతుళ్ళు, ఇతర బంధువుల్ని కూడా అందులో భాగస్థులుగా చేసింది.

ఆర్థిక రంగంలో ఇస్లామ్ జారీ చేసిన మరో ఆజ్ఞను కూడా గమనించండి; అది వడ్డీని పూర్తిగా నిషేధించింది. వడ్డీ వల్ల మనిషికి కొన్ని దుర్గుణాలు అబ్బే ప్రమాదం ఉంది. అల్లాహ్ తనను విశ్వసించిన దాసులకు ఈ దుర్గుణాలు అబ్బకుండా ఉండేందుకే వడ్డీని నిషేధించాడు. దానికి బదులు ఆయన జకాత్ ద్వారా వారిలో ఉత్తమ గుణగణాలను పెంపొందించదలచాడు.

సోదరులారా!

వడ్డీ,జకాత్ - ఈ రెండు పూర్తిగా విరుద్ధమయిన విషయాలు. వీటి ద్వారా తయా రయ్యే మనస్తత్వాలు కూడా భిన్నంగా ఉంటాయి. వడ్డీ వ్యామోహం గలవారిలో ప్రేమ, దయ,జాలి, సానుభూతి, సహనం, త్యాగం వంటి సద్గుణాలు అంతరిస్తాయి. వాటి స్థానంలో ద్వేషం, కాఠిన్యం, నిర్దయ, ధన వ్యామోహం, పేరాశ వచ్చి తిష్ఠ వేస్తాయి. దీనికి భిన్నంగా జకాత్ వ్యవస్థ మనిషిలో మమత, మమకారం, సౌమ్యత, సౌభ్రాతృత్వం, త్యాగం, దాతృత్వాలను జనింపజేస్తుంది.

మానవుడి దృష్టి సంకుచితమయింది. అతను దగ్గరి లాభాలనే చూడగలుగుతాడు. అతను తనతోటి మానవుడికి వంద రూపాయలిచ్చి తిరిగి అతని దగ్గర్నుంచి నూట పది రూపాయలు పొంది లాభం గడించానని తలుస్తాడు. ఆ విధంగా తన ఆస్తి పెరిగిందని భావిస్తాడు. అలా కాకుండా ఆ వంద రూపాయలపై రెండున్నర రూపాయలు జకాత్ చెల్లిస్తే తన ఆస్తి తరిగిపోతుంది అనుకుంటాడు. కాని జకాత్ వల్ల అతని సంపాదనలో ఒక భాగం సమాజంలోని ఇతరులకు చేరడం, దాన్ని అతను కోల్పోవడం అనీ ఎంత మాత్రం అర్థం కాదు. సంఘంలోని తోటి సభ్యులకు రావలసిన సంపాదనను రాకుండా చేసి తన జేబును నింపుకోవడమే నిజానికి కోల్పోవడమవుతుంది.

ఈ యదార్థాన్ని రెండు కోణాల ద్వారా అర్థం చేసుకోవచ్చు. ఒకటి, దైవ మార్గంలో ఖర్చుపెట్టడం అంటే నిజానికి కూడబెట్టుకోవడమే. ఎందుకంటే మోమిన్ దైవ మార్గంలో ఖర్చు పెడితే దేవుడు అతనికి రుణగ్రస్తుడవుతాడు. "మీరు ఎంత ఖర్చుపెట్టారో నేను తిరిగి అంతే ఇవ్వను; అంతకంటే చాలా ఎక్కువే ఇస్తాను" అని అల్లాహ్ అంటున్నాడు. ఆలోచించండి. సమస్త భూమ్యాకాశాలకు యజమాని అయిన అల్లాహ్‌కు మనదగ్గర అప్పు తీసుకోవలసిన అవసరం ఏమిటి? మనకు ప్రసాదించబడిన

సమస్తం, చివరికి మనం కూడా ఆయన సొత్తే కదా? మనం ఆయనకు అప్పిచ్చేటంతటి వాళ్ళమా? వాస్తవానికి ఆయన మన మేలు కోసమే తన మార్గంలో ఖర్చు పెట్టమని అంటున్నాడు. పైగా మనం ఖర్చుచేసిన దానికి ఆయన స్వయంగా బాధ్యత తీసుకుం టున్నాడు. మనం చేసిన ఖర్చుకు అనేక రెట్ల విలువ ఆయన పర లోకంలో మనకు తిరిగి ఇస్తానని హామీనిస్తున్నాడు.

ఇక, లౌకిక ప్రయోజనాలకు గురించి ఆలోచించండి. అల్లాహ్ విశ్వసించిన తన దాసులతో, సమాజంలోని మీ నిరుపేద సోదరులు కూడా మీతోపాటు ప్రశాంత జీవితం గడపడానికి వీలుగా వారికి సహాయం చేయమని అంటున్నాడు. లేకపోతే దారిద్ర్యం వల్ల వారు స్వయంగా ఆందోళనపడటమేగాక, సమాజం యొక్క ఆందోళనక్కూడా కారకులవుతారు. అందువల్ల పేదల్ని ఆదుకోవడం ధనికుల కర్తవ్య మని అల్లాహ్ ఉద్ఘాటిస్తున్నాడు. అయితే ఈ సహాయానికి ప్రత్యుపకారంగా ఇవ్వడానికి పేదల దగ్గర ఏముంది? అందుకని ధనికులు తాముచేసిన సహాయానికి పేదల నుండి ఎలాంటి బదులూ ఆశించకూడదు. అప్పుగా ఇస్తే దానికి వడ్డీ తీసుకోకూడదు, ధని కులు తాము చేసే సహాయం పేదల హక్కని భావించి చేయాలని అల్లాహ్ ఆదేశిస్తున్నాడు.

ఇక వడ్డీ సంగతి వినండి. వడ్డీపై అప్పిచ్చి తన ఆస్తిని పెంచుకుంటున్నామని మానవుడు అనుకుంటాడు. నిజమే, వడ్డీ ద్వారా అతని ఆస్తి కొంత పెరుగుతుంది. కాని దానివల్ల సమాజంలో దయ, సానుభూతి తుడిచి పెట్టుకొనిపోయి స్వార్థం పడగలు విప్పుతుంది. పరస్పర ప్రేమ, నమ్మకం, సౌభ్రాతృత్వాలకు మారుగా ద్వేషం, అపనమ్మకం, సంబంధాలు తెగిపోవడాలు పెరిగిపోతాయి. ఈధోరణి సామూహిక జీవితానికి విషం కన్నా చాలా ప్రమాదకరమయినది. వడ్డీ విడిచి పెట్టనివారి విషయంలో దివ్యఖుర్ఆన్, "వీరు దేవుడు, ఆయన ప్రవక్తపై యుద్ధాన్ని ప్రకటిస్తున్నార"ని అంటోంది. అంటే వడ్డీ తినేవారు దైవానికి, దైవప్రవక్త (సఅసం)కు బద్ధవిరోధులవుతున్నారన్నమాట.

సోదరులారా!

కాస్త ఆలోచించండి. ప్రపంచంలో దేవునిపై యుద్ధాన్ని ప్రకటించినవాడు పర లోకంలో ఆయన కారుణ్యాన్ని ఆశించగలడా? ఎన్నటికీ ఆశించలేడు. వడ్డీ, ఇతర అక్రమ మార్గాల ద్వారా సంపాదించినదేది అక్కడ ఆదుకోదు.

ఇప్పుడు రెండవ కోణాన్ని పరిశీలిద్దాం. మానవుడు సంకుచిత దృష్టి గలవాడని నేనింతకు ముందు చెప్పాను. అతను ప్రతి పని యొక్క ఫలితం వెంటనే లభించాలని కోరుతాడు. ప్రతి విషయంలోనూ తనస్వలాభాన్నే చూసుకుంటాడు. తన డబ్బు తన సుఖసంతోషాల కోసమే ఖర్చు కావాలంటాడు. ఎవరికయినా ఇస్తే దానికి వెంటనే

ప్రతిఫలం ముట్టాలంటాడు. ఒకవేళ సహాయం రూపేణ ఏ పేదలకు ఇచ్చినా దాని ద్వారా తనకు ప్రజలపై పెత్తనం చెలాయించే అధికారమో, హెూదాయో లేదా కనీసం పేరు ప్రతిష్ఠలయినా లభించాలని తలుస్తాడు. "వీటిలో ఏదీ లభించకపోతే తాను అనాధలు, వితంతువులు, అగత్యపరుల కోసం ఎందుకు ఖర్చుపెట్టాలి? పేద విద్యార్థుల్ని ఎందుకు ఆదుకోవాలి? దారిద్ర నిర్మూలన కోసం ఎందుకు వెచ్చించాలి? నయా పైస వడ్డీ లేకుండా అప్పెందుకివ్వాలి?" అని వాదిస్తాడు.

సోదరులారా!

మనిషికి ఇలాంటి మనస్తత్వం ఉంటే అతను ఎంతటి స్వార్థపరుడవుతాడో ఆలోచించండి. ఒకవేళ అతను తన డబ్బు ఖర్చుపెట్టినా మనోరంజనం కోసం సంగీతానికో, డ్యాన్సుకో లేదా త్రాగుడికో ఖర్చుపెడతాడు. ఫలితంగా సమాజంలో గానకచేరీలు, నాట్యశాలలు, సారా అంగళ్ళు, సాని కొంపలు ఉనికిలోకి వస్తాయి. దాంతో ప్రజల్లో భోగ లాలసత్వం, అశ్లీలం, అక్రమ ఆర్జన, విశృంఖలత్వం పెరిగిపోతాయి. వీటి దుష్ప్రభావం ఖర్చుపెట్టేవాళ్ళపైనేగాక మొత్తం సమాజం పైనే పడుతుంది. తద్వారా సంపద సమాజంలోని కొందరు వ్యక్తుల్లో కేంద్రీకృతమయి అధిక సంఖ్యాక ప్రజల జీవితం దుర్భరమవుతుంది. వారు మరింత పేదవారయిపోతారు. అనారోగ్యానికి గురయి వారిలో పనిచేసే శక్తి సన్నగిల్లిపోతుంది. పర్యవసానం జాతీయోత్పత్తులు క్షీణించిపోతాయి.

అంతేకాదు, సంపద యొక్క ఈ తప్పుడు పంపిణీ వల్ల సమాజంలో అజ్ఞానం, అక్రమాలు, ఇతర అనేక నేరాలు కూడా పెచ్చరిల్లిపోతాయి. చివరికి అశాంతి, అలజడులతో సమాజం సర్వనాశనానికి దారితీస్తుంది.

సోదరులారా!

ఆలోచించండి. మనలో ఎవరు ఈ వినాశనాన్ని కొనితెచ్చుకోవాలనుకుంటారు? ఎలాంటి స్వార్థం లేకుండా, కేవలం దైవ ప్రీతి కోసం ఖర్చు పెట్టే ధనంలోనే సమాజ శ్రేయస్సు ఉంది. ఆ విధంగా ఖర్చుపెట్టేవారు కూడా పరోక్షంగా ప్రయోజనం పొందు తారు. సంపద పెరిగిన చోట మానసిక అశాంతి కూడా పెరుగుతుందన్న విష యాన్ని మనం విస్మరించకూడదు. ఎవరి హక్కులు దోచుకోవడం జరిగిందో వారి విషయమయి అంతరాత్మ చేసే వత్తిడి ధనికుడ్ని అనుక్షణం కలవరపెడుతూనే ఉంటుంది. దొంగలు దోపిడిదారుల బెడద కూడా అతనికి మనశ్శాంతి లేకుండా చేస్తుంది.

కనుక సోదరులారా! అల్లాహ్ ఆయన ప్రవక్త (సఅసం)ను విశ్వసించిన మన మయినా మన సంపదల్ని సక్రమమయిన మార్గాన ఖర్చుపెట్టడానికి ప్రయత్నించాలి. ముఖ్యంగా జకాత్, వడ్డీ విషయాల్లో మనం చాలా జాగ్రత్తగా ఉండాలి. మన ధ్యేయమైన ధర్మ సంస్థాపన కోసం ఖర్చుచేసే విషయాన్ని కూడా మనం ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకూడదు.

15. దేవునితో మన ఒప్పందం

మహాశయులారా!

ఈమాన్‌ని గురించి మీరు అనేక విషయాలు విని ఉంటారు. కాని ఈమాన్ యొక్క వాస్తవికత ఏమిటో చాలా కొద్దిమందికి మాత్రమే తెలుసు. ఈమాన్ వాస్తవికత అంటే కొన్ని విషయాలను నోటితో అంగీకరించి వాటిని మనస్ఫూర్తిగా ఒప్పుకోవడమే కదా అంటారు కొందరు.

కాని నిజానికి ఈమాన్ లేదా విశ్వాసం అన్నది దాసుడు తన దైవంతో చేసుకునే ఒక ఒప్పందం. ఈ ఒప్పందం ప్రకారం దాసుడు తన ప్రాణం, ధనం ఒకటేమిటి సమస్తం అల్లాహ్‌కు అమ్మేస్తాడు, దానికి బదులుగా పరలోకంలో అల్లాహ్ తనకు స్వర్గం ప్రసాదిస్తాడన్న అల్లాహ్ వాగ్దానాన్ని అంగీకరిస్తాడు. ఈ విషయాన్నే అల్లాహ్ దివ్యఖుర్‌ఆన్‌లో ఇలా పేర్కొన్నాడు:

"యదార్థం ఏమిటంటే, అల్లాహ్ ముస్లిమ్‌ల నుండి వారి ప్రాణాలను, వారి సొమ్ములను స్వర్గానికి బదులుగా కొనుక్కున్నాడు. వారు అల్లాహ్ మార్గంలో పోరాడుతారు, చంపుతారు మరియు చస్తారు." (9 : 11)

సోదరులారా!

ఈ ఆయత్‌లోని యదార్థాన్ని గమనిస్తే, ముస్లిమ్ స్వర్గం కోసం తన ధన ప్రాణాలను అల్లాహ్‌కు అమ్మివేశాడని స్పష్టమవుతోంది. కాని స్వర్గానికి బదులుగా అల్లాహ్‌కు అమ్మి వేయడానికి అసలు తనదంటూ అతని దగ్గర ఏముందని? మానవుని దగ్గర ఉన్నదంతా అల్లాహ్ ప్రసాదించిందే. అతని సిరిసంపదలు, అతను వాడుకునే వివిధ వస్తువులు, అతని శరీరం, చివరికి అతని ప్రాణం సయితం అల్లాహ్ చేత సృష్టించబడినవే. ఆయనే వాటి అసలు యజమాని. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రపంచంలోని ప్రతి వస్తువుకూ ఆయనే యజమాని. ప్రతిదీ ఆయన సొత్తే.

అయితే అల్లాహ్ మానవుడికి స్వేచ్ఛ, అధికారాలను మాత్రం ఇచ్చాడు. మానవుడు తాను కోరితే తనపై, తన శరీరంపై, తనమనో భావాలపై, తన సిరిసంపదలపై ఉన్న దేవుని హక్కులను అంగీకరించవచ్చు. వాటిని నిర్వర్తించవచ్చు. లేదా దేవుని హక్కులను నిరాకరించి, ఈ వస్తువులన్నింటికీ నేనే యజమాని, వీటిని నా ఇష్టమొచ్చినట్లు వాడుకుంటాను అని కూడా అతను భావించవచ్చు. ఆ ప్రకారం నడుచుకోడానికి అల్లాహ్ అతనికి పూర్తిగా స్వేచ్ఛ ప్రసాదించాడు. ఈ విషయంలో అల్లాహ్ అతనికి

ఎలాంటి ఆటంకం కలిగించడు. తన ఆజ్ఞలను తప్పనిసరిగా పాటించాలని కూడా అల్లాహ్ మానవునిపై ఒత్తిడి చేయడు. అయితే దాంతో పాటు అల్లాహ్ అతనికి సత్యాన్ని అంగీకరించి అవలంబించే స్వేచ్ఛను కూడా ప్రసాదించాడు. మానవుడు తన ధనాన్ని, తన ప్రాణాన్ని, తన శక్తి సామర్థ్యాలను దేవుని సొత్తుగా ఒప్పుకొని ఆయన ఇష్టమే తన ఇష్టమని భావించి నడుచుకోవచ్చు.

నేను ఇంతకు ముందు పేర్కొన్న ఆయత్‌లో మానవుడు స్వర్గానికి బదులుగా ప్రాణాన్ని, సొత్తును అల్లాహ్‌కు అమ్మివేశాడనీ వచ్చింది. అంటే తన ఇష్టానుసారం వ్యవహరించడానికి మానవునికి పూర్తి అధికారం ఉన్నప్పటికీ అతను అల్లాహ్ అభీష్టమే తన అభీష్టమని, ప్రతి విషయంలోనూ అల్లాహ్ ఆదేశించినదాన్నే శిరసావహిస్తానని అంగీకరించాడన్నమాట.

సోదరులారా!

ఇస్లామ్ మానవుణ్ణి కోరేదిదే, మన దగ్గర ఏదైతే ఉందో; మనం ఏదయితే మనది అంటామో నిజానికి అది మనది కాదు. అది సృష్టికర్త విశ్వ ప్రభువు అయిన అల్లాహ్‌ది. ఆయన దాన్ని మన దగ్గర 'అమానత్'గా ఉంచాడు. అంటే మన దగ్గర ఉన్నదంతా అల్లాహ్ యొక్క అమానత్ లేదా అప్పగించబడిన వస్తువు అన్నమాట. మనం కోరితే ఈ అమానత్ లేదా అప్పగించబడిన వస్తువుని దుర్వినియోగపరచి నమ్మక ద్రోహం తలపెట్టగలం. అమానత్ యొక్క అసలు యజమానిని మరచి మనమే దానికి యజమాని అని తలచి మన ఇష్టమొచ్చినట్లు దాన్ని వాడుకోగలం. అల్లాహ్ అలాంటి స్వేచ్ఛ మనకిచ్చాడు.

కాని మనం అల్లాహ్‌ను విశ్వసించాం. మన దగ్గరున్న సమస్త వస్తువుల్ని ఆయనే సృష్టించాడని ఆయనే వీటికి అసలు యజమాని అని మనం నమ్ముతున్నాం. మనం అమానత్‌దారులమే కాని యజమానులంకాము. ఈమాన్, కుఫ్ల మార్గాలు వేరయ్యేది ఇక్కడే. ఎవరయితే తనకివ్వబడిన స్వేచ్ఛ, అధికారాలను వదలి పెట్టి తన సర్వస్వాన్ని అల్లాహ్‌కు అప్పగిస్తాడో అతను మోమిన్. ఎవరయితే తన స్వేచ్ఛా అధికారాలపై విర్రవీగుతూ అల్లాహ్ ఇష్టాయిష్టాలను త్రోసిరాజని తన ఇష్టమొచ్చినట్లు నడచుకుంటాడో అతను దైవతిరస్కారి.

అల్లాహ్ ఒక వైపు మనకు మన ఇష్టమొచ్చినట్లు నడచుకోడానికి స్వేచ్ఛ ఇచ్చి మరో వైపు తన ఇష్ట ప్రకారం నడచుకోవాలని ఆదేశించడం ఏమిటి? ఇది విచిత్రంగా ఉన్నట్లు అనిపించవచ్చు. కాని ఈ ప్రపంచంలో మానవుని స్థానం ఏమిటి? మానవునికి, దేవునికి గల సంబంధం ఏమిటి? అనే విషయాలను గ్రహిస్తే అది విచిత్రమనిపించదు.

ఈ ప్రపంచం ఒక పరీక్షా స్థలం, ప్రపంచంలోని యావత్తు సృష్టిరాసులకు యజమాని అల్లాహ్ మాత్రమే. ఇక్కడ మానవునికి అల్లాహ్ వివిధ వస్తువులు ప్రసాదించి వాటిని తన ఆదేశానుసారం వినియోగిస్తాడా లేదా అని పరీక్షించదలిచాడు.

ఈ పరీక్ష రెండు విధాలుగా ఉంది. ఒకటి, మానవుడు తన యజమాని అయిన అల్లాహ్‌ను యజమానిగానే గుర్తిస్తాడా లేదా అని పరీక్షించడం జరుగుతుంది. రెండు, మానవుడు ఈ రోజు తనకు ఇహలోకంలో ఇవ్వబడిన స్వతంత్ర ప్రతిపత్తి వదలి పెడితే, రేపు పరలోకంలో అతనికి స్వర్గం రూపంలో దాని ప్రతిఫలం లభిస్తుందని, లేకపోతే నరక శిక్షకు గురికావలసి వస్తుంది అని అల్లాహ్ ముందే తెలియజేస్తున్నాడు. ఈ విషయాన్ని మానవుడు విశ్వసిస్తాడా లేదా అని కూడా అల్లాహ్ పరీక్షిస్తాడు. ఈ విధంగా అల్లాహ్ మనకు గొప్ప పరీక్ష పెట్టాడు.

అల్లాహ్ ఆదేశాలను శిరసావహిస్తూ, ఆయన అభీష్టం ప్రకారం జీవితం గడిపితే పరలోకంలోనే కాదు, ఇహలోకంలో కూడా మనం దాని సత్ఫలితాలను చూడగలం. అంటే అల్లాహ్ ఈపరీక్ష ద్వారా ఇహలోకంలోనూ మన శ్రేయస్సును కోరుతున్నాడన్న మాట. ఏమయినప్పటికీ మోమిన్ దృష్టి ఎల్లప్పుడూ పరలోక ఫలితాలపైనే ఉంటుంది. పరలోకంలోని సత్ఫలితాలను పొందడానికి ఇహలోకంలో వచ్చే కష్టనష్టాలను అతను ఏమాత్రం ఖాతరు చేయడు. పరలోక ఫలితాలకే అతను ప్రాధాన్యతనిస్తాడు, అదే అతని జీవిత ధ్యేయం. ఇహలోక లాభాన్ని జీవిత లక్ష్యంగా పెట్టుకున్నవాడు తాను దైవాన్ని విశ్వసిస్తున్నానని నోటితో ఎంత చెప్పుకున్నా అతను నిజానికి ప్రపంచం వెంటనే పడతాడు.

ప్రపంచ అపేక్షాపరుడు ఏది చేసినా తన సంతోషం కోసమే చేస్తాడు. అతను కొన్ని ప్రాపంచిక ప్రయోజనాలను లక్ష్యాలుగా పెట్టుకొని వాటికోసమే కృషి చేస్తాడు. ఉదాహరణకు, ధనాన్ని సంపాదించుకోవడం, వ్యాపారాన్ని వృద్ధి చేసుకోవడం, అధికారాన్ని చేజిక్కించుకోవడం, కీర్తిప్రతిష్ఠలు పొందడం మొదలయిన వాటి కోసం అతను ప్రయత్నిస్తాడు. ఇవి గనక లభిస్తే అతను సంతోషంతో పొంగిపోతాడు; లభించకపోతే క్రుంగిపోతాడు. అతను భౌతిక ప్రయోజనాలపై ఆధారపడతాడు. అవి లభిస్తే అతని ఆనందం అవధులు దాటుతుంది. ఆ ఆనందంలో తనను తానే మరచిపోతాడు. లభించకపోతే లేదా ఉన్నది కాస్త ఊడిపోతే తనకన్నా దురదృష్టవంతుడు లేడని బాధపడి పోతాడు.

పోతే మోమిన్ పరిస్థితి మాత్రం దీనికి భిన్నంగా ఉంటుంది. అతను ఏది చేసినా అల్లాహ్ సంతోషం కోసం చేస్తాడు. ఆయన మెప్పు పొందడానికి చేస్తాడు. అతను ప్రతి

విషయంలోనూ అల్లాహ్‌పై ఆధారపడతాడు. అతను ఎలాంటి ఆపదలు వచ్చి పడినా భయపడడు, నిరాశ చెందడు. అలాగే సౌఖ్యాలు లభించినపుడు ఆనందంతో తన్ను తాను మరచిపోడు, సుఖదుఃఖాలు వచ్చినా అన్ని పరిస్థితుల్లోనూ అతను ఒకే విధంగా ఉంటాడు. సౌఖ్యాలు లభించినప్పుడు దైవానికి కృతజ్ఞతలు చెల్లిస్తాడు. కష్టాలు వచ్చినప్పుడు దైవంపై భారం వేసి సహనం వహిస్తాడు.

ఎవరయితే ఇలాంటి పరిస్థితిని పొందాడో, అతనే నిజమైన అదృష్టవంతుడు. ఈమాన్‌లోని మాధుర్యం ఏమిటో అతనికే తెలుసు. ఈమాన్ మాధుర్యాన్ని చవిచూసినవాడే తన ధన ప్రాణాలను దైవానికి అమ్మగలుగుతాడు. ధన ప్రాణాలను దైవానికి అమ్మినవాడి పరిస్థితి ఏమిటో మీరు విన్నారు. అతను ధర్మసంస్థాపన కోసం జీవితాంతం పోరాడుతాడు. దైవమార్గంలో ఎదురు వచ్చిన దుష్టశక్తులను ధైర్యంగా ఎదుర్కొంటాడు. చివరికి ఆ మార్గంలోనే అతను ప్రాణాలను అర్పిస్తాడు.

సోదరులారా!

ఇలాంటి విశ్వాసం మనలో ఉందా లేదా అని మనలో ప్రతి ఒక్కరూ ఆత్మపరిశీలన చేసుకోవాలి. అంటే అది మన క్రియాత్మకమయిన జీవితంలో ప్రతి చోటా వ్యక్తమవ్వాలి. అల్లాహ్‌తో మనం చేసుకున్న ఒప్పందం నిరంతరం ఆయన మార్గంలో మన శక్తి సామర్థ్యాలన్నిటిని వినియోగించి పోరాడుతూ ఉండాలి. అవసర మయితే మన ధన ప్రాణాలను సయితం త్యజించడానికి సిద్ధంగా ఉండాలి. ఒకవేళ అలాంటి విశ్వాసం మనలో లేకపోతే, దాన్ని పొందడానికి మనం కృషి చేయాలి. అన్నిటికన్నా విశ్వాస భాగ్యమే గొప్ప భాగ్యం. ఈ మహాభాగ్యమే మనకు పరలోకంలో పనికి వచ్చే దైవ ప్రసాదం.

16. దైవానికి, దాసునికి మధ్య వ్యాపార ఒప్పందం

మహాశయులారా!

ఈమాన్‌ని గురించి మీరు లోగడ కొంత తెలుసుకొని ఉన్నారు. కాని ఈమాన్ అనేది దైవానికి, దాసునికి మధ్య జరిగే ఒక ఒప్పందాన్ని అంటారు. ఈ విషయాన్నే దివ్యఖుర్‌ఆన్ విశ్వాసులకు గుర్తుచేస్తూ, అల్లాహ్ విశ్వాసుల ధన, ప్రాణాలను స్వర్గానికి బదులుగా కొన్నాడని చెబుతోంది. కాబట్టి ఈమాన్ అంటే మనిషి కొన్ని కనిపించని యదార్థాలను ఒప్పుకోవడం మాత్రమే కాదు. అదొక ఒప్పందం. ఈ ఒప్పందం ప్రకారం మోమిన్ తన ధన ప్రాణాలను దైవానికి అమ్ముతున్నాడు. వాటికి బదులు మరణానంతరం తనకు స్వర్గం ప్రసాదించబడుతుందన్న అల్లాహ్ వాగ్దానాన్ని అతను అంగీకరిస్తున్నాడు.

ఈ యదార్థం దృష్ట్యా మానవుని దగ్గర ఉన్న సమస్తానికి యజమాని అల్లాహ్‌యేనని స్పష్టమవుతోంది. మన ఈ ప్రాణం, శరీరం, సిరిసంపదలు, ఇతర వస్తువులు అన్నీ దైవానివే. ఎందుకంటే దేవుడే వీటన్నిటిని సృష్టించి మనకు ప్రసాదించాడు. ఈ విధంగా చూస్తే అమ్మడం-కొనడం అన్న ప్రశ్నే ఇక్కడ తలెత్తదు. అసలు మానవుని దగ్గర అమ్మడానికి తనదంటూ సొంత వస్తువు ఏముంది కనక? కాని దేవుడు ఒక వస్తువుని పూర్తిగా మానవుని అధీనంలో ఉంచాడు. అదే స్వతంత్ర్య ప్రతిపత్తి లేక స్వయం నిర్ణయాధికారం. దేవుడు మనిషికి తన ఇష్ట ప్రకారం నడుచుకోవడానికి కొంత స్వేఛ్ఛనిచ్చాడు. అయితే ఈ స్వేచ్ఛ, స్వతంత్ర ప్రతిపత్తి లభించినంత మాత్రాన మనిషి ఏదయినా ఒక వస్తువుకు యజమాని అయ్యాడని గాని, దాన్ని తన ఇష్టమొచ్చినట్లు ఉపయోగించుకోవచ్చని గాని అర్థం కాదు. వాస్తవానికి ప్రతి వస్తువుకూ యజమాని అల్లాహ్‌యే. మానవుడు తనకు ప్రసాదించబడిన వస్తువులపై అల్లాహ్‌కు ఉన్న యాజమాన్య హక్కుల్ని అంగీకరించినా, అంగీకరించకపోయినా ఈ యదార్థం ఎన్నటికీ మారదు. మనిషికి తన అధీనంలో ఇవ్వబడిన వస్తువుల్ని తన ఇష్టానుసారం ఉపయోగించుకునే స్వేచ్ఛ ఉన్నప్పటికీ వాటిని దేవుని అభీష్టం ప్రకారమే వినియోగించవలసిన బాధ్యత మనిషిపైవుంది. ఇక్కడే అమ్మడం-కొనడం అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది.

సోదరులారా!

అమ్మడం-కొనడం అనే ప్రస్తావన వచ్చిందంటే అల్లాహ్ తనది కాని ఏదయినా వస్తువుని మనిషి నుండి తీసుకోదలిచాడని భావం కాదు, సమస్త వస్తువులు అల్లాహ్‌వే. వాటిని ఆయన అమానత్ రూపంలో మనిషి అధీనంలో ఉంచాడు. మనిషి తనకివ్వబడిన

స్వేచ్ఛా అధికారాలను ఉపయోగించుకొని ఆ వస్తువులను అల్లాహ్ అభీష్టం ప్రకారంగానయినా వాడవచ్చు లేదా తన ఇష్టమొచ్చినట్లయినా వాడవచ్చు. అయితే మనిషి తనకు ప్రసాదించబడిన స్వేచ్ఛా స్వయం నిర్ణయాధికారాలతో ఏ వస్తువునీ అల్లాహ్ అభిమతానికి వ్యతిరేకంగా ఉపయోగించకూడదని, అలా చేస్తే అది విశ్వాస ఘాతుక చర్య అవుతుందని ఇస్లామ్ విస్పష్టం చేసింది. అందువల్ల మోమిన్ ఇలాంటి విశ్వాసఘాతుక వైఖరిని వదిలేసి నిజాయితీగల దైవదాసుడిగా తన స్వయం నిర్ణయాధికారాన్ని దైవానికి హస్తగతం చేస్తాడు. దీన్నే ఖుర్‌అన్ దైవానికి, దాసునికి మధ్య అమ్మకం-కొనుగోలు వ్యవహారంగా వర్ణించింది:

'మనిషి ఒకవేళ నేను ప్రసాదించిన ఈ స్వయం నిర్ణయాధికారాన్ని తిరిగి నాకే హస్తగతం చేసినట్లయితే దానికి వెలకట్టి నేనతనికి శాశ్వతంగా ఉండే స్వర్గ జీవితం అనుగ్రహిస్తాను' అని అల్లాహ్ వాగ్దానం చేస్తున్నాడు. కాబట్టి అల్లాహ్ అభీష్టానికి అనుకూలంగా ఎవరయితే తన స్వయం నిర్ణయాధికారాన్ని వదలుకుంటాడో అతనే మోమిన్. అతను అవలంబించిన ఈ వైఖరి యొక్క మారు పేరు ఈమాన్. ఈ స్వయం నిర్ణయాధికారాన్ని వదలుకోవటానికి అంగీకరించని వ్యక్తి లేదా అంగీకరించినప్పటికీ దాన్ని ఆచరణలో పెట్టని వ్యక్తి దైవతిరస్కారి అనబడతాడు. ఇలాంటి విశ్వాస ఘాతుక వైఖరినే కుఫ్ర్ అంటారు.

సోదరులారా!

అల్లాహ్ అనుగ్రహం వల్ల మనకందరికీ విశ్వాస భాగ్యం లభించింది. ఈ విశ్వాస భాగ్యమే మనల్ని దైవాజ్ఞాబద్ధులుగా చేస్తుంది. అల్లాహ్ మనకు ప్రసాదించిన స్వేచ్ఛను, స్వయం నిర్ణయాధికారాన్ని పూర్తిగా అల్లాహ్ అభిమతం ప్రకారమే వినియోగించాలి. మనదగ్గర ఉన్నదంతా అల్లాహ్‌దేనని మనం ఒప్పుకుంటున్నాము. ఏ వస్తువైనా చివరికి మన ధన ప్రాణాలనయినా వాటి అసలు యజమాని ఇష్టానికి వ్యతిరేకంగా ఉపయోగించే హక్కు మనకు లేదని కూడా మనం ఒప్పుకుంటున్నాము. అయితే ఈ అంగీకారాన్ని మనం మన ఆచరణలో చూపాలి.

దాసుని ధన ప్రాణాలకు బదులుగా అతనికి దైవం స్వర్గాన్నిచ్చే ఈ ఒప్పందంలో మానవులకు ఒక పెద్ద పరీక్ష ఉంది. మానవుడు తన యజమాని అయిన దైవాన్ని యజమానిగా గుర్తిస్తాడా లేక యజమానిని యజమానిగా గుర్తించకుండా తిరుగుబాటుకు, విశ్వాసఘాతుకానికి పాల్పడతాడా అని అల్లాహ్ పరీక్షిస్తాడు. అంతేకాదు, మానవుడు స్వేచ్ఛ పొందిన తరువాత నాపై ఏ మేరకు నమ్మకం ఉంచుతాడు? ప్రళయ దినాన నేను ఇచ్చే కర్మల ఫలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రపంచంలో తక్షణం లభించగలిగే తాత్కాలిక ప్రయోజనాలను ఎంతవరకు వదులుకుంటాడు అని కూడా అల్లాహ్ పరీక్షిస్తాడు.

సోదరులారా!

అల్లాహ్ ఒప్పందాన్ని అమలు చేయడంలో అశ్రద్ధ చేస్తున్నవారు మోమిన్‌లు కాదని నేను విమర్శిస్తున్నాని భావించకండి. అల్లాహ్, ఆయన ప్రవక్త (సఅసం)ను విశ్వసిస్తున్నట్లు ఒప్పుకున్న ప్రతి వ్యక్తీ ముస్లిమే. షరీఅత్ దృష్టిలో, చట్టం దృష్టిలో అతను మోమిన్ అనే పిలువబడతాడు. ఇస్లామీయ సమాజంలో ఇతర మోమిన్‌లకు ఉండే హక్కులు, రాయితీలు ఇతనికీ ఉంటాయి. నేనిక్కడ చెబుతున్న విషయం అది కాదు. మనిషి తన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను దైవానికి అమ్మినట్లు తన మాటల్లోనూ, చేతల్లోనూ నిరూపించుకోవాలి. అలాంటి విశ్వాసమే అల్లాహ్ దృష్టిలో ఆమోదయోగ్యమయినది. ఒకవేళ ఎవరైనా కలిమాను అంగీకరించి నమాజ్, రోజా లాంటి ఆరాధనలతో పాటు మరికొన్ని దైవాజ్ఞలను మాత్రమే పాటిస్తూ, తన మానసిక శారీరక శక్తి సామర్థ్యాలను, తన ధనాన్ని, ఇతర వస్తువులు ఒనరుల్ని తన ఇష్టమొచ్చినట్లు ఉపయోగిస్తూ వాటికి తానే యజమాని అని భావిస్తే, అలాంటి వ్యక్తి ప్రపంచం దృష్టిలో మోమిన్ కావచ్చు. కాని దేవుని దృష్టిలో మాత్రం అతను మోమిన్ కాలేడు. ఈమాన్ పర్యవసానమయిన "దైవంతో ఒప్పందం" అతను మనస్ఫూర్తిగా చేయనే లేదు. అలాంటి వ్యక్తి దేవుని అభీష్టం కోసం తన ధన ప్రాణాలను ఎలా త్యజించగలడు?

ఈ విధంగా మానవుల విశ్వాసాన్ని రెండు రకాలుగా విభజించవచ్చు. ఒక రకమయిన విశ్వాసం పరిపూర్ణమయినది, పటిష్టమయినది. సంకల్పశుద్ధితో కూడు కున్నది. ఇలాంటి విశ్వాసం కలిగిన వ్యక్తి జీవితంలోని ప్రతి రంగం లోనూ ప్రతి పనినీ అల్లాహ్ అభీష్టం ప్రకారమే చేస్తాడు. ఏ విషయంలోనూ అతనికి స్వయం నిర్ణయాధికారం ఉండదు. ఒకవేళ ఎప్పుడైనా ఏదయినా పొరపాటు జరిగితే వెంటనే అతను పశ్చాత్తాపం చెంది దైవ సన్నిధిలో క్షమాపణ వేడుకుంటాడు. రెండవ రకమయిన విశ్వాసం అసం పూర్ణమయినది, ఆచరణ శూన్యమయినది, మాటలకు, చేతలకు పొంతన లేనిది. ఇలాంటి విశ్వాసం కలిగిన వ్యక్తి ఏ పని చేసినా తన అభీష్టానికిగాని లేదా తనలాంటి ఇతర మానవుల అభీష్టానికి అనుగుణంగా చేస్తాడు. ఫలానా పనిలో దేవుని ఇష్టాయిష్టాల ప్రమేయం ఏదయినా ఉందా అని అతను విచారించడు. ఈ రెండు రకాల విశ్వాసాలను వ్యక్తిగత జీవితంలోనూ, సామూహిక జీవితంలోనూ చూడవచ్చు.

సోదరులారా!

ఇక్కడ మనం మరో ముఖ్య విషయాన్ని గురించి తెలుసుకోవలసి ఉంది. మనిషి దైవాభీష్టం ప్రకారం నడచుకోవడానికి నిశ్చయించుకుంటే అతనికి ఆ దైవాభీష్టం ఏమిటో ఎవరు తెలుపాలి? ఆ దైవాభీష్టం ఫలానాది అని మనిషి తనంతటనే

కల్పించుకోకూడదు. అలా చేస్తే మనిషి తన అభీష్టం ప్రకారమే నడచుకున్నట్లవుతుందిగాని దైవాభీష్టం ప్రకారం నడచుకున్నట్లు కాదు. దైవాభీష్టం ప్రకారం నడచుకోవడమంటే దైవమే స్వయంగా తన అభీష్టాన్ని మానవులకు తెలియ జేయాలి. దీన్ని బట్టి దైవ గ్రంథం, ప్రవక్త బోధనలు లేకుండా మానవుడు తనంతట తాను దైవాభీష్టం ఏమిటో నిర్ణయించలేడని స్పష్టమవుతోంది.

దేవుని దయవల్ల ఆయన అభీష్టమేమిటో తెలియ జేసే దివ్యఖుర్ఆన్, ప్రవక్త సంప్రదాయాలు మన దగ్గర ఉన్నాయి. వాటిని మనం విశ్వసిస్తున్నాం. స్వర్గానికి బదులుగా ధన ప్రాణాలు అర్పిస్తామని అల్లాహ్‌తో చేసుకున్న ఒప్పందాన్ని కూడా మనం అంగీకరిస్తున్నాం. అయితే కేవలం నోటి మాటలతో అంగీకరించటంవల్ల ఈ ఒప్పం దానికి విలువ ఉండదు. ఈ ఒప్పందం ప్రకారం జీవితాన్ని గడుపుతూ, మరణించే వరకూ దానిపై స్థిరంగా ఉండాలి. ఒప్పందం ప్రకారం ప్రాపంచిక జీవితం అంతమయిన తరువాతనే మన ధన ప్రాణాల త్యాగ ఫలాన్ని అల్లాహ్ మనకు ప్రసాదిస్తాడు. ప్రాపంచిక జీవితమనే నిర్ణీత గడువు చివరి దాకా ఒప్పందంలోని షరతులన్నింటిని పాటించగలిగిన పక్షంలోనే మనం అల్లాహ్ వాగ్దానం చేసిన స్వర్గానికి అర్హులమవుతాము. అల్లాహ్‌కు ఏది ఇష్టమో, ఏది ఇష్టం కాదో మనం అడుగడుగునా ఆచరణ ద్వారా నిరూపించుకో వాలి. అల్లాహ్ అభిమతానికి వ్యతిరేకంగా ఉండే ఏ ఇతర అభిమతాన్నీ మనం ఖాతరు చేయకూడదు. అల్లాహ్ అభీష్టాన్ని నెరవేర్చడంలో అవసరమయితే మన సమయాన్ని, సొంత ప్రయోజనాలను, ధన ప్రాణాల్ని సయితం త్యాగం చేయడానికి సిద్ధంగా ఉండాలి. ఒకవేళ మనం మన ధనాన్ని, శక్తి సామర్థ్యాలను దైవాభీష్టానికి వ్యతిరేకంగా దైవధిక్కారులు, మనోవాంఛల దాసులు, మార్గభ్రష్టులు జరిపే కార్యకలాపాల్లో వినియోగిస్తుంటే దేవుని ఒప్పందాన్ని ధిక్కరించినట్లే. మనం ప్రజల దృష్టిలో విశ్వాసులు అయినప్పటికీ, దేవుని దృష్టిలో మాత్రం విశ్వాస ఘాతకులమవుతాము. అల్లాహ్ మనందరినీ విశ్వాస ఘాతుకం నుంచి కాపాడి, పటిష్టమయిన ఆచరణాత్మక విశ్వాసం ప్రసాదించుగాక!

17. మంచిని పెంచు, చెడును త్రుంచు

మహాశయులారా!

సమాజంలోని చెడుల్ని అరికట్టే బాధ్యత సంఘ శ్రేయోభిలాషులైన వారందరిపై ఉంది. కాని మంచిని పెంచడం, చెడుని త్రుంచడం ముస్లిమ్‌ల ధార్మిక విధి. విశ్వ ప్రభువు దివ్యఖుర్‌ఆన్‌లో మనల్ని ఇలా ఆదేశిస్తున్నాడు: "మీలో మంచి వైపునకు పిలిచేవారు, మేలు చెయ్యమని ఆజ్ఞాపించేవారు, చెడు నుండి వారించేవారు కొందరు తప్పకుండా ఉండాలి. ఈ పనిని ఎవరైతే చేస్తారో, వారే సాఫల్యం పొందుతారు."

సోదరులారా!

ఈ ఆదేశం ప్రకారం ప్రతి ముస్లిమ్ పురుషుడు, స్త్రీ తమ శక్తి సామర్థ్యాలనుబట్టి ప్రజలకు మంచిని బోధిస్తూ, చెడుల నుండి వాళ్ళను వారిస్తూ వుండాలి. ఇది తప్పనిసరిగా నిర్వహించవలసిన విధి. మంచి వైపునకు ఆహ్వానించడం, చెడు నుండి నివారించడం ఎంతో అవసరమయిన ధార్మిక విధి. ఈ పని జరగకపోతే ధర్మంలో పరిపూర్ణత రాదు, స్వయంగా మనం ధర్మావలంబనలో స్థిరంగా నిలువలేము. ఈ మహాకార్యం మూలానే ఉమ్మత్‌కు మోక్షం, సాఫల్యాలు లభించగలుగుతాయి. మనలోని ప్రతి వ్యక్తి తోటి వ్యక్తిని మంచి వైపునకు ప్రేరేపించాలని, సత్కార్యాలు చేయడంలో పరస్పరం సహరించుకోవాలని మహాప్రవక్త (సఅసం) తాకీదు చేశారు. అలాగే దౌర్జన్యపరుల్ని దౌర్జన్యం చేయకుండా వారించాలి, కొందరు అజ్ఞానం, మూర్ఖత్వాల వల్ల ధర్మానికి నష్టం కలిగే పనులు చేస్తారు. వారిని కూడా వారిస్తూ ఉండాలి. దీనివల్ల వారికీ మంచిదే, మనకీ మంచిదే.

ఏ పనిలో మనందరి శ్రేయం ఉందో దాని కోసం కృషి చేయడం మన విద్యుక్త ధర్మం. మన ప్రియ ప్రవక్త (సఅసం) ఆదేశం వినండి: "మీలో ఎవరైనా ఏదయినా చెడును చూస్తే అతను దాన్ని చేతితో (బలం ఉపయోగించి) నిర్మూలించాలి. ఒకవేళ అలా చేయడానికి శక్తిలేకపోతే అతను తన నోటిని ఉపయోగించి ఆ చెడును సంస్కరించడానికి ప్రయత్నించాలి. ఒకవేళ ఏదైనా అసహాయ పరిస్థితి వల్ల అదీ చేయలేకపోతే, ఆ చెడును నిర్మూలించడానికి కనీసం అతని హృదయంలో ఆరాటమైనా కలగాలి" అన్నారు మహాప్రవక్త (సఅసం).

సోదరులారా!

ఈ హదీసు వెలుగులో ప్రతి ముస్లిమ్ పురుషుడు, స్త్రీ తమ తమ శక్తిమేరకు ఎక్కడయినా, ఏదయినా చెడును చూస్తే దాన్నిఅరికట్టడానికి, దాని స్థానంలో మంచిని

నెలకొల్పడానికి తీవ్రంగా కృషి చేయాలి అని తెలుస్తోంది. ఇది తప్పనిసరి విధి. ఎవరైనా, ఏదైనా చెడును చూస్తే, దాన్ని అరికట్టగల శక్తి అతనిలో ఉంటే అతను అలా చేసి తీరాలి. ఒకవేళ ఏదైనా అనివార్య కారణం వల్లగాని లేదా పరిస్థితుల వత్తిడి వల్లగాని అలా చేయలేకపోతే అతను తన నోటిని ఉపయోగించాలి. ప్రజలకు హితబోధ చేసి, నచ్చజెప్పి వారిలోని చెడుల్ని పోగొట్టడానికి, వారిచేత మంచిని అవలంబింపజేయడానికి ప్రయత్నించాలి. సరే, చెడుకు వ్యతిరేకంగా పెదవి విప్పడానికిక్కూడా వీలు లేనంతగా పరిస్థితులు క్షీణించిపోతే అప్పుడు మోమిన్ హృదయం తీవ్రంగా ఆందోళన చెందడం సహజం. కాని సమాజంలో మంచి క్షీణించిపోతూ, చెడు ప్రబలిపోతూ ఉంటే హృదయం కనీసం ఆందోళన కూడా చెందకపోతే, అలాంటి హృదయంలో ఈమాన్ వెలుగు లేనట్లేనని భావించవలసి ఉంటుంది.

ఎంత బలహీన విశ్వాసమయిన సరే, దైవ తిరస్కారాన్ని, శాసనాల ఉల్లంఘనను సహించలేదు. దైవ శాసనాలకు వ్యతిరేకమయినవన్నీ ఇస్లామ్ దృష్టిలో చెడులే. ముఖ్యంగా కుఫ్ర్, షిర్క్, దైవాన్ని త్రోసిరాజని మానవుడు తన అధికారాన్ని, సార్వభౌమత్వాన్ని ప్రకటించుకోవడం మొదలయినవి ఘోరాతి ఘోరమయిన చెడులు. ఎవరికయినా ఒక చెడును నిర్మూలించి, దానికి బదులుగా దైవ విధేయత గల పనిని చేయించే శక్తి వుంటే, అతను తన శక్తిని ఉపయోగించకుండా చెడును సహిస్తూ ఉంటే అలాంటివాడు అల్లాహ్, ఆయన ప్రవక్త (సఅసం) దృష్టిలో అపరాధి. అంతేకాదు, అతను తనపై తాను జులుం చేసుకున్నాడు. అతని ఈ వైఖరి యావత్తు ముస్లిమ్‌లకే సిగ్గుచేటు. పైగా అతడు మానవతా విరోధి కూడా. ఇస్లామ్ దృష్టిలో దేవుని పట్ల అవిధేయతా వైఖరే మానవ వినాశానికి పెద్ద కారణం. ఈ కారణాన్ని దూరం చేయగల శక్తి ఉండి కూడా దూరం చేయనివాడు దేవుని దృష్టిలో గొప్ప నేరస్థుడు. ఇది ఎంత పెద్ద నేరమంటే దాని శిక్ష పరలోకంలో సరే ఎటూ లభించి తీరుతుంది, ఇహలోకంలో సయితం దాని దుష్పరిణామం అనుభవించవలసి వస్తుంది. చెడు ప్రబలినప్పుడు దాని ప్రభావానికి చెడు చేసే వారే గురికారు; అది మొత్తం సమాజాన్నే దుర్గంధమయం చేస్తుంది.

అల్లాహ్ దివ్యఖుర్‌ఆన్‌లో మానవుల్ని ఇలా హెచ్చరిస్తున్నాడు: "ప్రజలారా! ఈ ఉపద్రవాన్నుండి తప్పించుకోండి. దేని ఆపదయితే ప్రత్యేకంగా మీలో పాపం చేసిన వారికే పరిమితంగా ఉండదో."

ఇక మహా ప్రవక్త (సఅసం) కూడా ఈ విషయంలో ఏం సెలవిచ్చారో చూడండి: "ఎవరి అధీనంలో ప్రాణం ఉందో ఆ దేవుని సాక్ష్యంగా చెబుతున్నాను - మీరు తప్పకుండా సత్కార్యాలను గురించి ఆదేశిస్తూ ఉంటారు, చెడుల నుండి వారిస్తూ

ఉంటారు. లేకపోతే అల్లాహ్ తన శిక్షను పంపే అవకాశం ఉంది. అప్పుడు మీరు ఆయన్ని ఎంతగానో వేడుకుంటారు. కాని మీ వేడుకోలు స్వీకరించబడదు."

సోదరులారా!

అల్లాహ్ అనుగ్రహం వల్ల మనమంతా ముస్లిమ్‌లము. అల్లాహ్ ధర్మంపై నడిచి ఆయన మెప్పు పొందాలన్న ఉద్దేశ్యం కూడా ఉండాలని మనం కోరుకుంటున్నాం. ఆయన కారుణ్యామృతాన్ని ఆశిస్తున్నాం. కాబట్టి జీవితం యొక్క ప్రతి రంగంలోనూ, ప్రతి కార్యంలోనూ అల్లాహ్ ఆజ్ఞలను శిరసావహించడం, ఆయన ప్రవక్త (సఅసం) బోధనల్ని అమలుపరచడం మనందరి విధి. సాధ్యమయినంత వరకు సమాజంలోమంచిని వ్యాపింపజేయడానికి, చెడుల నుండి ప్రజలను వారించడానికి మన శక్తి వంచన లేకుండా ప్రయత్నించాలి. అల్లాహ్‌కు వ్యతిరేకంగా మానవుని తిరుగుబాటును, తిరస్కారాన్ని అంతమొందించడానికి వీలైన ప్రతి ప్రయత్నమూ చేస్తుండాలి. ఇంకా వీలైతే బలం ఉపయోగించి అత్యాచారాలు చేసే వారిని అత్యాచారాలు చేయకుండా అడ్డుకోవాలి. కొంతమంది అజ్ఞానం, మూర్ఖత్వంవల్ల తమ కాళ్ళను తామే నరుక్కుంటారు. అలాంటి వారికి మంచిని బోధించి కళ్ళు తెరిపించాలి.

సోదరులారా!

అల్లాహ్, ఆయన ప్రవక్త (సఅసం) మనపై మోపిన ఈ బాధ్యత ఎంత ముఖ్యమయిందో, ఎంత ఉన్నతమైందో ఇప్పుడు మీరు గ్రహించి ఉంటారు. కనుక మనమందరం మంచిని అనుసరించడానికి, మంచిని వ్యాపింపజేయడానికి నడుం బిగించాలి. ఒకరికొకరు సత్యాన్ని ఉపదేశించుకోవాలి. మంచిని వ్యాప్తిచేయడంలో దైవ వచనం సమున్నతి కోసం ఇతరులతో సహకరించాలి. ఈ లక్ష్యం కోసం గనుక మనం చిత్తశుద్ధితో సిద్ధమయితే, నిజాయితీతో లక్ష్యం పట్ల దీక్ష కలిగి ఉండే ఈ పని చేయాలన్న గట్టి సంకల్పం ఉంటే అల్లాహ్ కారుణ్యవర్షం మనపై తప్పకుండా కురుస్తుంది. ఆయన శుభాలకు మనం అర్హులమవుతాము. ఇహపర సాఫల్యాలు పొందగలం. ఇందులో ఎలాంటి సందేహం లేదు, ప్రపంచ శాంతికి యావత్తు మానవాళి శ్రేయస్సుకు కారణభూతమయ్యే మహా కార్యం ఏదైనా ఉందా అంటే ఇదొక్కటే అని చెప్పాలి. ఈ మహాకార్యాన్ని విడిచి పెట్టిన కారణంగానే మనం అల్లాహ్ కరుణా కటాక్షాలకు దూరమైపోతున్నాం. ఈ సందర్భంలో దివ్యఖుర్‌ఆన్ ఏమంటుందో గమనించండి:

"ఇస్రాయీల్ సంతతి వారిలో ఎవరయితే తిరస్కార మార్గం అవలంబించారో వారిని దావూద్ మరియు మర్యం కుమారుడైన మసీహ్ నోట శపించటం జరిగింది.

ఎందుకంటే వారు తిరుగుబాటు చేశారు, మితిమీరి ప్రవర్తించసాగారు, వారు ఒకరినొకరు చెడు పనులు చెయ్యకుండా నిరోధించడం మానేశారు. వారు అవలంబించిన ఈ ఆచరణా విధానం చాలా చెడ్డది."

సోదరులారా!

ఇప్పుడు మీరే చెప్పండి, మనం మన కర్తవ్యాన్ని ఎంత వరకు నిర్వహిస్తున్నామో, ఈ ఆయత్‌లో ఇస్రాయీల్ సంతతి వారు తమపై మోపబడిన బాధ్యతను విస్మరించిన కారణంగానే దైవప్రవక్తలు వారిని శపించారు. ఇందులో మనం నేర్చుకోవాల్సిన గుణపాఠం ఎంతో ఉంది. దురదృష్టవశాత్తు ఒకవేళ మనమూ యూదుల్ని అనుసరిస్తే, రేపు అంతిమ దినాన అల్లాహ్ సమక్షంలో సిగ్గుతో తలవంచుకొని నేరస్థులుగా నిలబడవలసిన దుర్గతి పడుతుంది. అల్లాహ్ మనందర్నీ ఈ దుర్గతినుండి కాపాడి, దైవ సందేశాన్ని పరిచయం చేసే కార్యాన్ని నిరంతరం నిర్వహించే భాగ్యం ప్రసాదించుగాక!

18. ధర్మసేవకై దూరదృష్టి ఆవశ్యకత

మహాశయులారా!

హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం అంతిమ దైవ ప్రవక్త అని మనమంతా విశ్వసిస్తున్నాం. అల్లాహ్ ఇక ఖయామత్ వరకూ ఎవరినీ ప్రవక్తగా నియమించి పంపడు. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) ద్వారా పంపిన అంతిమ హితవును ప్రళయం వరకూ కాపాడే బాధ్యతను అల్లాహ్ స్వయంగా స్వీకరించాడు. ప్రళయం వరకు ఈ ధర్మం తన వాస్తవ రూపంలో ఉంటుంది. అయితే దైవ ధర్మాన్ని మానవులందరికీ అందజేయవలసిన అవసరం కూడా ఉంది. ఈ బాధ్యతను అల్లాహ్ మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను, ఆయన తెచ్చిన ధర్మాన్ని విశ్వసించిన ముస్లిమ్ సమాజానికి అప్పగించాడు. మనం ఎంతో అదృష్టవంతులం. అల్లాహ్ మనల్ని ముస్లిమ్ సమాజంలో పుట్టించి ఈ ధర్మానికి సేవ చేసే మహా భాగ్యాన్ని ప్రసాదించాడు.

సోదరులారా!

ధర్మసేవ చేయడం ప్రతి ముస్లిమ్ విధి. అల్లాహ్ ఎవరికి ఏ మేరకు శక్తి సామర్థ్యాలు ఇచ్చాడో ఆ మేరకు ధార్మిక సేవ చేయడం వారి బాధ్యత. వారి వారి శక్తి సామర్థ్యాలను బట్టి కార్యరంగాలు ఉంటాయి. కొందరి కార్యరంగం మొత్తం దేశమయి ఉంటే, మరికొందరి కార్యరంగం తమ పట్టణం వరకే పరిమితమై ఉంటుంది. అంటే వారు ఆ పట్టణం వరకే తమ కార్యకలాపాలను నిర్వహిస్తారు. అలాగే కొందరికి తమ కుటుంబ సభ్యులను సంస్కరించే వారికి శిక్షణ ఇచ్చే సామర్థ్యం మాత్రమే ఉంటుంది. మరి కొందరికి అల్లాహ్ ప్రసంగ సామర్థ్యాన్ని ప్రసాదిస్తే, ఇంకొందరికి రచనాశక్తిని అనుగ్రహించాడు. వాటి ద్వారా వారు ప్రజలకు ధర్మాన్ని పరిచయం చేస్తారు. కేవలం సంభాషణ ద్వారా గ్రహింపజేయగలిగితే ఆ పని కూడా చేయవచ్చు. ఒక విషయంలో మాత్రం అందరూ సమానులే. అదేమిటంటే ఆచరణ ద్వారా ధర్మానికి సాక్ష్యమివ్వడం. తమ పూర్తి జీవితాన్ని ఇస్లామ్‌కు అనుగుణంగా మలచుకొని, చూసే వారికి తమ ఆచరణలో ఇస్లామ్ వాస్తవ స్వరూపం కనిపించేలా వారు ప్రతి వ్యవహారంలోను నీతిగా నడచుకోవాలి. దాంతోపాటు ఇస్లామ్ దృక్పథానికి వ్యతిరేకంగా ఉండే ప్రతి విషయాన్నీ విడిచిపెట్టాలి. ఇది అందరూ చేయగలిగిన పని. ఇలా ఆచరణ ద్వారా ధర్మానికి సాక్ష్యమివ్వడం కూడా ధర్మ సేవలోని ఒక భాగమే.

ధర్మసేవలో ఇదంతా తొలిమెట్టు మాత్రమే. అయినా ఇది అంత సులభమయిన పని కాదు. ధార్మిక సేవలో మనిషికి తన ధన ప్రాణాలను సయితం దైవ ప్రీతి కోసం

అర్పించవలసిన సమయం వస్తుంది. అయితే ఇలాంటి గమ్యానికి చేరుకోక మునుపే మనం ధర్మ పరిచయ కార్యాన్ని పూర్తిగా సరైన పంథాలో నిర్వహించడం ఎంతో అవసరం. ఈ పనిచేసే వారికి తప్పని సరిగా ఉండవలసిన మొట్టమొదటి లక్షణం - దైవంతో వారి సంబంధం బాగుండాలి. దైవ ప్రవక్తల దగ్గర కూడా ఇదే శక్తి ఉండేది. ఈశక్తితోనే వారు ఒంటరిగా యావత్ ప్రపంచాన్ని ఎదిరించి నిలబడగలిగేవారు.

సోదరులారా!

దైవప్రవక్తలు అనుసరించిన విధానం ప్రకారం మనం ధర్మపరిచయ పనిచేయడానికి పూనుకున్నప్పుడు దైవంతో మన సంబంధం ఎలా ఉందో ఎల్లప్పుడూ ఆత్మపరిశీలన చేసుకుంటూ ఉండాలి. మనలో ఏమైనా లోపాలు ఉంటే తక్షణమే వాటిని సరిదిద్దుకోవాలి. ప్రతి సందర్భంలోనూ దైవం మీదే ఆధారపడాలి. ధర్మ పరిచయ పని కోసం భౌతిక వనరుల్ని ఉపయోగించుకునే ముందు అల్లాహ్ శక్తి సామర్థ్యాలపై పూర్తి విశ్వాస ముంచాలి; ఆయన సహాయంపైనే భరోసా ఉంచాలి. ఆయన పైనే మన ఆశలన్నీ పెట్టుకోవాలి. ఆయన ప్రసన్నత కోసమే ఈ పని చేస్తున్నామన్న భావం మనుస్సులో బలంగా నాటుకోవాలి. ధర్మ పరిచయ పని వెనుక ఉండవలసిన ఉద్దేశం ఇదే. దైవ ప్రసన్నతను పొందడమే మన లక్ష్యంగా వుండాలి. అది తప్ప ఈ పని ద్వారా ప్రాపంచిక సంపద, సుఖసౌఖ్యాలు, అధికారం, హోదా, అంతస్తు పేరు, పలుకుబడి, లేదా మరేదైనా ఐహిక వస్తువులను పొందాలన్న కోరిక ఏ మాత్రం ఉండకూడదు.

మన దృష్టి ఎల్లప్పుడు పరలోక విషయాల మీదే ఉండాలి. మనం ఏది చేసినా దైవ ప్రీతి కోసమే చేయాలి. ఆయన స్వర్గాన్ని పొందాలన్న కోరికతోనే చేయాలి. ఒకవేళ ప్రపంచ వ్యవహారాలను చేతిలోకి తీసుకోవడానికి కృషి చేస్తే, ప్రపంచంలో చెడును రూపుమాపి మంచిని నెలకొల్పాలన్న లక్ష్యంతోనే కృషి చేయాలి. భౌతిక వనరుల్ని కోరుకున్నా, వాటి ద్వారా దైవ ధర్మాన్ని ఉన్నతం చేయాలన్న ఉద్దేశ్యంతోనే కోరుకోవాలి. ఇలా ప్రతి విషయంలోనూ ధార్మిక సేవ చేసేవాడి ధ్యేయం ఇతరుల ధ్యేయానికి పూర్తి భిన్నంగా ఉంటుంది. ప్రపంచమే సర్వస్వం అనుకున్న వాళ్ళు ఏ పని తలపెట్టినా, ఏ ఉద్యమం చేపట్టినా దాని వెనుక సిరిసంపదలో, పేరు పలుకుబడులో, హోదా అధికారాలో సంపాదించాలన్న ఉద్దేశ్యం ఉంటుంది వారికి. కాని పరలోకంపై దృష్టి ఉంచిన వాళ్ళు దైవ సంతోషం కోసమే ఈ ప్రపంచంలో తమ కర్తవ్యాన్ని నిర్వహిస్తారు.

సోదరులారా!

ఈ ప్రపంచంలో ఒక ముస్లిమ్‌కు ధర్మ సంస్థాపన కార్యం కన్నా గొప్ప కర్తవ్యం ఏముంది? అయితే ధర్మ సంస్థాపన కార్యానికి అంకితమయినవాళ్లు లక్ష్యసాధన కోసం

భౌతిక వనరులు ఎంత సమకూర్చుకున్నా, వారి విశ్వాసం మాత్రం పూర్తిగా అల్లాహ్ శక్తిపై, ఆయన సహాయంపైనే ఉండాలి.

ఇక ధర్మసేవ చేసేవారు గమనించవలసిన రెండవ విషయం - విప్లవం. విప్లవం అనేది అధికారం, బలప్రయోగాలు, భయ ప్రలోభాల ద్వారా సాధ్యమయ్యే విషయం కాదు. ఒకవేళ సాధ్యమైనా దాని ప్రభావం కొంతకాలం వరకే ఉంటుంది. నిజానికి విప్లవం ప్రజల హృదయాల నుండి ప్రారంభం కావాలి. ఇస్లామీయ విప్లవానికి స్టార్టింగ్ పాయింట్ హృదయమే. అన్నింటి కంటే ముందు మనం ప్రజల హృదయాలను ఆకట్టుకోవడానికి ప్రయత్నించాలి. దీనికోసం ప్రేమ, సానుభూతి, సౌమ్యతలు ఎంతో అవసరం.

సోదరులారా!

ఇస్లామ్ ధర్మం యావత్తు మానవాళి కోసం దైవకారుణ్యమై అవతరించిందన్న సంగతి మీ కందరికీ తెలుసు. అందువల్ల దీన్ని ప్రతి మానవుడికీ అందజేయవలసిన బాధ్యత మనపై ఉంది. ఈ సందర్భంలో మరో విషయాన్ని కూడా దృష్టిలో ఉంచుకోవాలి. స్వయంగా మన ముస్లిమ్ సమాజంలో కూడా అనేక లోపాలున్నాయి. కనుక వీలయినంత మేరకు ఈ లోపాలను దూరం చేసి ముస్లిమ్ సమాజాన్ని సంస్కరించవలసిన బాధ్యత కూడా మనపై ఉంది. ఈ పని వదిలేసి మనం ఏ విధంగానూ ముందడుగు వేయలేము. ముస్లిమ్ సమాజంలోని అత్యధిక మంది దైవధర్మానికి దూరమయి పోయారు. నైతికంగా ఎంతో దిగజారి ఉన్నారు. మన యువకుల్లో ఎంతో మంది వివిధ వర్గాల భ్రష్ట మార్గాల్లో పడి విశృంఖల జీవితాన్ని గడుపుతున్నారు. పనికిమాలిన కార్యకలాపాల్లో వారి శక్తి సామర్థ్యాలు వృధా అవుతున్నాయి. అందువల్ల యువతలో మార్పు తీసుకురావలసిన అవసరం నేడు ఎంతయినా ఉంది. వారి సంస్కరణ ధర్మ పరిచయ పనికి ఎంతో శక్తినిస్తుంది.

సోదరులారా! షైతాన్ మన గర్భశత్రువని మీ కందరికీ తెలుసు. వాడు ఎప్పుడూ మనల్ని వెన్నంటే ఉంటాడు. ముఖ్యంగా ధార్మిక సేవ చేసేవారిలో అనేక అవరోధాలు సృష్టిస్తూ ఉంటాడు. అవరోధాలు సృష్టించడానికి వాడు ప్రయోగించే పదునయిన ఆయుధం మన అంతర్విభేదాలే. షైతాన్ చిన్నచిన్న ధార్మిక విషయాల్లో మనలో మనకు విభేదాలు సృష్టించి మన అసలు లక్ష్యమయిన ధర్మసంస్థాపన కృషికి అడ్డుపడతాడు. ఒక్కోసారి పెద్ద పెద్ద పండితులు, ధర్మవేత్తలు సయితం షైతాన్ వలలో చిక్కుకుని ఫికహ్ విషయాల్నే ఇస్లామ్ మౌలిక విషయాలుగా భావించి అసలు లక్ష్యాన్ని వదిలేసి కూర్చుంటారు.

కాబట్టి మనమంతా ఇలాంటి విభేదాలను మరచిపోవాలి. ఫికహ్ విషయాలకు సంబంధించిన విభేదాలలో మునిగి ఉండే కాలం అంతరించింది. ఒకవేళ మీరు ఈ విభేదాల పరిష్కరణ వెంటపడితే మరో విభేదానికి జననమివ్వడం తప్ప మీరు సాధించగలిగేదేమీ లేదు. ఇప్పటికే అనేక వర్గాలుగా చీలిపోయిన ముస్లిమ్ సమాజంలో ఈ విధంగా మరో వర్గం ఏర్పడుతుంది. ధార్మిక సేవలో నిజ ధ్యేయం వైపునకు పయనించేవారు ఎల్లప్పుడూ విభేదాలకు తావునిచ్చే ఫికహ్ సమస్యలకు దూరంగా ఉండాలి, ఇస్లామ్ మౌలిక విషయాల వైపునకు ప్రజలను ఆహ్వానించాలి. వారిలో విశ్వాస జ్యోతుల్ని వెలిగించాలి. వారి హృదయాల్లో దైవభీతి, పరలోక చింతన కలిగించాలి. జీవితపు అన్ని రంగాల్లో ఇస్లామ్ నియమాలను పాటిస్తూ నీతి నిజాయితీలతో వ్యవహరించవలసిన ఆవశ్యతకను మాటిమాటికీ నొక్కి చెబుతుండాలి. ఇవన్నీ మౌలిక విషయాలే. వీటిలో ఈనాటి వరకు ఎలాంటి విభేదాలు తలెత్తలేదు.

సోదరులారా! ఇతరుల బలహీనతలను ఎత్తిచూపి వాళ్లను ఎత్తిపొడవడంలో ఆనందం ఉండవచ్చు, కాని దానివల్ల మన పని నెరవేరదు. మన శక్తిని, సామర్థ్యాల్నీ ఇస్లామ్ యొక్క మౌలిక విషయాలను పరిచయం చేయడానికే వినియోగించాలి. అయితే ఈ పని సంకల్పశుద్ధితోపాటు, సహనం సానుభూతులతో చేయడం ఎంతో అవసరం. అప్పుడే మనం మన ధ్యేయపథంలో స్థిరంగా ముందుకు సాగిపోగలం.

19. ప్రభావం

సోదరులారా!

మనలోని ప్రతి వ్యక్తీ ఏదో ఒకవిధంగా ఇతరుల్ని ప్రభావితం చేస్తున్నాడని అంటే చాలామందికి ఆశ్చర్యం కలుగుతుంది. కాని ఇది వాస్తవం. అయితే ప్రసంగాలు చేసేవారు, వ్యాసాలు రాసేవారు, ఉద్యమాల్లో పాల్గొనేవారు మాత్రమే ప్రజలను ప్రభావితం చేయగలరని, ఈ పనులకు దూరంగా ఉండేవారు ప్రజలను ప్రభావితం చేయలేరని కొందరు భావిస్తారు. ఇదొక అపోహ మాత్రమే. నేనీరోజు ఈ అపోహను దూరం చేయదలిచాను. మనలోని ప్రతివ్యక్తీ తన మాటల ద్వారానైనా, చేతలద్వారానైనా లేదా మరేవిధంగానైనాసరే ఎల్లప్పుడూ ఇతరుల్ని ప్రభావితం చేస్తూనే ఉంటాడు. చివరికి తన రూపురేఖల ద్వారా, హావభావాల ద్వారా కూడా అతను ప్రజలను ప్రభావితం చేస్తుంటాడు.

మనం మన చేష్టల ద్వారా ఇతరుల్ని ఎలా ప్రభావితం చేస్తామో, ఇతరుల చేష్టల ద్వారా మనం కూడా ప్రభావితులమవుతుంటాము. ఇది చెడు ప్రభావమైనా, మంచి ప్రభావమైనా, స్వల్పప్రభావమైనా, అధికప్రభావమైనా మొత్తం మీద మనం ఇతరుల ద్వారా, ఇతరులు మనద్వారా నిరంతరం ప్రభావితులవుతుంటారు. ఇదెంతో గమనించదగిన విషయం. ముఖ్యంగా దైవధర్మాన్ని విశ్వసించిన మనం ఈ విషయాన్ని గురించి సీరియస్‌గా ఆలోచించవలసి ఉంటుంది.

మనలో ఏ ఒక్కరూ తన మూలంగా ఇతరులు దుష్ప్రభావానికి గురికావాలని, లేదా ఇతరుల మూలంగా తాను దుష్ప్రభావానికి లోనుకావాలని కోరుకోడు. కాని కేవలం ఇలా కోరుకున్నందువల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. ఆ కోరికను ఆచరణలో పెట్టేందుకు కృషి చేయాలి. మనవల్ల ఇతరులు ఎలాంటి దుష్ప్రభావానికి గురికాకూడదనుకుంటే మనం చెడ్డపనులన్నిటిని పూర్తిగా మానెయ్యాలి. మన నోటి నుండి వెలువడే ప్రతి పలుకూ, మన అవయవాల ద్వారా వ్యక్తమయ్యే ప్రతి కదలికా ఎంతో కొంత మేరకు ఇతరుల్ని ప్రభావితం చేస్తూనే ఉంటాయి. అందువల్ల మన సంభాషణ, నడవడిక, తీరుతెన్నుల్ని గురించి ఏమాత్రం నిర్లక్ష్యం, ఏమరపాటులు వహించకూడదు. మనవల్ల పొరపాటుగా నైనసరే ఏదైనా తప్పుడు పని జరిగిపోతే దాని దుష్ప్రభావం ఇతరుల మీద పడవచ్చు.

సోదరులారా!

ఏ రూపంలోనైనా కొద్దోగొప్పో ఒక మనిషి రెండో వ్యక్తిని ప్రభావితం చేస్తాడన్నది తిరుగులేని సత్యం. ఈ వాస్తవందృష్ట్యా మన సంభాషణ, మన నడవడిక, మన

తీరుతెన్నులకు ఎంత ప్రాముఖ్యం ఉందో ఊహించండి. నేను ఇతరులకు ఎలాంటి కీడు తలపెట్టకపోయినా, నా వ్యక్తిత్వం మూలంగా ఇతరులు దుష్ప్రభావానికి లోనయితే దాంతో నాకేమిటి సంబంధం అంటారు కొందరు. కాని మన వ్యక్తిత్వం మూలంగా ఇతరులు దుష్ప్రభావానికి గురయితే దానికీ మనమే బాధ్యత వహించవలసి ఉంటుంది. నేను సారా తాగితే ఆ తప్పు నాదే కాని, నన్ను చూసి ఇతరులు త్రాగుడుకు అలవాటు పడితే దానికి నేనెలా బాధ్యుణ్ణవుతాను అనడం సరికాదు. మీరొక మంచి పని చేస్తున్నప్పుడు, దాన్ని చూసి ఇతరులు కూడా ఆపని చేయడం ప్రారంభిస్తే మీకెంత ఆనందం కలుగుతుంది! అంతేకాదు మీరు చేసిన మంచిపనికి లభించే పుణ్యఫలంతో పాటు, మిమ్మల్ని చూసి ఇతరులు చేసిన మంచిపని వల్లకూడా మీకు పుణ్యఫలం లభిస్తుంది. అలాగే మీరొక చెడ్డపని చేసినప్పుడు దానిపాపంతోపాటు, మిమ్మల్ని చూసి ఇతరులు చేసిన చెడ్డపనివల్ల కూడా మరోపాపం మీ ఖాతాలో చేరుతుంది.

ఈ వాస్తవాన్నే దైవప్రవక్త (సఅసం) ఎలా వివరించారో చూడండి. "ఒక వ్యక్తి ఎవరినైనా మంచి విషయం వైపునకు పిలవడం జరిగినప్పుడు అతనికి అతడ్ని అనుసరించినవానికి లభించేటంత పుణ్యమే లభిస్తుంది. పైగా అతడ్ని అనుసరించిన వానికి లభించే పుణ్యాన్ని ఏమాత్రం తగ్గించడం జరగదు. అదే విధంగా మరొక వ్యక్తి ఎవరినైనా చెడ్డ విషయం వైపునకు పిలవడం జరిగితే అతనికి అతడ్ని అనుసరించినవానికి లభించే పాపమే లభిస్తుంది. అతడ్ని అనుసరించినవానికి లభించే పాపాన్ని ఏమాత్రం తగ్గించడం జరగదు."

మన ప్రియప్రవక్త (సఅసం) చెప్పిన ఈ అమృత ప్రవచనాన్ని దృష్టిలో పెట్టుకొని మనం ఓసారి ఆత్మపరిశీలన చేసుకోవాలి. మనల్ని చూసి ఇతరులెవరైనా మంచిని అవలంబిస్తే అది మనకెంత పుణ్యప్రదమైన విషయమో ఆలోచించండి. ప్రసంగాల ద్వారా, రచనల ద్వారా, ఉద్యమాల్లో పాల్గొనడం ద్వారా ప్రజలను దైవధర్మం వైపునకు పిలిచే వారికి వారి కృషికి తగ్గ పుణ్యఫలం ఎటూ లభిస్తుంది. అలాగే వారి కృషివల్ల ఇతరులెవరైనా సన్మార్గం అవలంబిస్తే దేవుడు వారిక్కూడా పుణ్యఫలం ప్రసాదిస్తాడు. అయితే వారు సన్మార్గం అవలంబించిన కారణంగా వారిని సన్మార్గం వైపునకు ఆహ్వానించినవారికి అదనంగా కూడా పుణ్యఫలం లభిస్తుంది. ఈ విధంగా ఒక వైపు ప్రజలకు దైవసందేశాన్ని పరిచయం చేసినందుకు, మరోవైపు ప్రజలు ఆ సందేశాన్ని స్వీకరించి అనుసరించినందుకు గాను, దైవసందేశ ప్రచారకులకు రెట్టింపు పుణ్యఫలం లభిస్తుంది. అలాగే ప్రత్యక్షంగాగాని, పరోక్షంగాగాని చెడు విషయాలు ప్రచారం చేసేవారికి ఆచెడు విషయాలు ప్రచారం చేసినందుకేగాకుండా, వాటిని ఇతరులు అనుసరించిన కారణంగా కూడా దైవశిక్ష పడుతుంది. అంటే అలాంటి వారికి రెట్టింపు శిక్షపడుతుందన్న మాట.

అందువల్ల దేవుణ్ణి, దైవప్రవక్త (సఅసం)ను, పరలోకాన్ని విశ్వసించే మనం ఈ వాస్తవాన్ని దృష్టిలో పెట్టుకొని అనుక్షణం అప్రమత్తంగా మసలుకోవలసి ఉంటుంది. మనం ప్రత్యక్షంగా మన ప్రసంగాలు, రచనలద్వారా చెడును ప్రచారం చేయకపోయినా; పరోక్షంగా లేక అసంకల్పికంగా మన నోట ఏదైనా ధర్మవ్యతిరేక మాట వెలువడవచ్చు. లేదా మన చేతల ద్వారానైనా ధర్మవ్యతిరేక విషయాలు వ్యక్తం కావచ్చు. వాటివల్ల ఇతరులు ప్రభావితులయి ఆ చెడు విషయాలను ఆచరించవచ్చు. అప్పుడు మనపై రెట్టింపు పాప భారం పడుతుంది.

సోదరులారా!

మనలో ప్రతి ఒక్కడూ ఉపన్యాసకుడు కాకపోయినా, రచయిత కాకపోయినా ఏదో ఒక రూపేణా నిరంతరం ఇతరుల్ని ప్రభావితం చేస్తున్నాడని ఇప్పుడు మీరు గ్రహించి ఉంటారు. మంచి ప్రభావమైనా, చెడు ప్రభావమైనా అది ఆ వ్యక్తివరకే పరిమితమై ఉండదు, ఇతరులు కూడా దానికి లోనవుతుంటారు. కనుక మన మాటలు-చేతలు, మన అలవాట్లు-అభిరుచులు ఎలా ఉన్నాయో ఓసారి పునఃపరి శీలించుకోవాలి. వాటిలో ఏవైనా లోపాలుంటే సవరించుకోవడానికి ప్రయత్నించాలి. మన ద్వారా ఇతరులు ఎల్లప్పుడూ మంచినే స్వీకరించాలి. ఆవిధంగా మనల్ని మనం రూపొందించుకోవాలి.

మన ప్రియ ప్రవక్త (సఅసం) ఓసారి హజ్రత్ అలి (రజి)కి హితోపదేశం చేస్తూ "నీ ద్వారా (లేక నీమూలంగా) ఎవరైనా సన్మార్గం అవలంబిస్తే అది నీకోసం నీకు లభించే అనేక ఎర్ర ఒంటెల కన్నా ఎంతో శ్రేష్టమయిన విషయం" అని చెప్పారు. నిజమైన విశ్వాసి ఎల్లప్పుడూ మంచినే కోరుకొంటాడు, మంచినే ఆచరిస్తాడు, అతని వ్యక్తిత్వం ద్వారా పుణ్యకార్యాలే వ్యాప్తిచెందుతాయి. అతను ఎట్టిపరిస్థితిలోనూ చెడును కోరుకోడు, చెడును ఆచరించడు, తన వ్యక్తిత్వం ద్వారా చెడు ప్రబలడాన్ని అతను ఎన్నటికీ సహించడు. ఈ విషయమయి అతను ఎల్లప్పుడు ఆత్మపరిశీలన చేసుకుంటూ ఉంటాడు. ఇది విశ్వాసికి ఉండవలసిన అత్యంత శ్రేష్ఠమైన లక్షణం, మన ప్రియప్రవక్త (సఅసం) దైవభీతిపరాయణుల్ని గురించి ప్రస్తావిస్తూ "వీరు ఎలాంటి వారంటే, మీరు గనక వారిని చూస్తే మీకు దేవుడు గుర్తొస్తాడు." అని అన్నారు. నిష్కల్మషహృదయుడైన విశ్వాసి ముఖం చూస్తే నిజంగానే దేవుడు గుర్తుకొస్తాడు. అతని ముఖంలో మంచితనం ఉట్టిపడుతుంటుంది. అతని మాటలు, చేతలు ఇతరులపై మంచిప్రభావాన్నే వేస్తాయి. ఇలా దేవుడు మనందరికీ నిజమైన విశ్వాసిగా రూపొందే సద్బుద్ధి ప్రసాదించుగాక!

20. సామూహిక జీవితం

మహాశయులారా!

ఈ రోజు మనం ఇస్లామ్‌లో సామూహిక జీవితానికి ఇవ్వబడిన ప్రాముఖ్యతను గురించి తెలుసుకుందాం. మన ప్రియప్రవక్త (సఅసం) ఇలా సెలవిచ్చారు: "నేను మీకు అయిదు విషయాలను గురించి ఆజ్ఞాపిస్తున్నాను. సంగఠితంగా ఉండటం, మాట వినడం, విధేయత, హిజ్రత్, దైవ మార్గంలో జిహాద్ చేయటం." ముస్లిమ్‌లు సామూహిక జీవితం గడపాలని ఈ హదీసులో దైవప్రవక్త (సఅసం) స్పష్టంగా ఆదేశించారు. సామూహిక జీవితానికి కావలసిన మౌలిక విషయం - ప్రజలకు వారి వ్యవహారాలకు సంబంధించిన ఆదేశాలు ఇవ్వడానికి ఒక నాయకుడుండాలి. ప్రజలు అతని పట్ల విధేయులుగా ఉండాలి. అప్పుడే సామూహిక జీవితం గడపడానికి వీలవుతుంది.

మహాప్రవక్త (సఅసం) మొదట సంఘం ఆవశ్యకతను గురించి చెప్పారు. సంఘం అంటే వ్యక్తుల సమూహం. అయితే ఈ సమూహం మనం చెప్పుకునే గుంపు లాంటిది కాదు. కొందరు ప్రజలు ఒకచోట కేవలం గుమికూడినంత మాత్రాన ఆ సమూహాన్ని మనం సంఘం అనము. ఏదైనా ఒక లక్ష్యం కోసం సంఘటితమయిన ప్రజల సమూహాన్నే సంఘం అంటాము. ఒక లక్ష్యానికి కట్టుబడి ఉండక, జీవిత వ్యవహారాల్లో ఎప్పుడూ కీచులాడుకునే ప్రజా సమూహం సంఘం అనిపించుకోదు. సంఘ నిర్మాణం కోసం నిర్ణీత లక్ష్యంతో అందరూ ఏకీభవించడం కూడాసరిపోదు. దానికోసం వ్యక్తుల్లో పరస్పర సాన్నిహిత్యం, సానుభూతి, సహనం, ప్రేమ, ఔదార్యం వంటిఉన్నత గుణాలు ఎంతో అవసరం. చూస్తే, వీరంతా సమైక్యంగా ఉన్నారని, వీరందరి ధ్యేయం ఒకటేనని, ఒకే గమ్యం వైపునకు వీరంతా కలసి ప్రయాణం చేస్తున్నారని కనిపించాలి. ఇలాంటి వ్యక్తుల సమూహమే సంగఠితంగా ఉందని చెప్పవచ్చు.

సంగఠిత సంఘం ప్రసక్తి రాగానే దానికొక నాయకుడుంటాడన్న ఆలోచన కూడా వస్తుంది. ఈ నాయకుడు అల్లాహ్ ఆదేశాలు మరియు మహాప్రవక్త (సఅసం) ప్రవచనాల వెలుగులో సమాజాన్ని నడిపిస్తాడు. సంఘం లేదా ఉమ్మత్‌లోని వ్యక్తులు ఆయనకు విధేయులై ఆయన ఆజ్ఞలను పాటిస్తారు. ఈ విషయాన్నే దైవ ప్రవక్త (సఅసం) "మాట వినడం, విధేయత పాటించడం" అనే మాటల్లో పేర్కొన్నారు. ఈ "మాట వినటం, విధేయత పాటించడం"అనేది ఇస్లామీయ జీవితానికి ఊపిరి లాంటిది. "మాట వినడం, విధేయత పాటించడం" అనేది లేకుండా సంఘం ఉనికిలోకే రాదు.

ముస్లిమ్ సమాజం లక్షణాలు, ఇతర ప్రత్యేకతల దృష్ట్యా దానికి మాట వినడం, విధేయత పాటించడం అనే ఒక వ్యవస్థ ఉండటం అవసరమయింది. అందువల్ల ఇలాంటి వ్యవస్థను నెలకొల్పవలసిన బాధ్యత ముస్లిమ్ సమాజంపై వుంది. మహాప్రవక్త (సఅసం) సూచనల ప్రకారం ముస్లిమ్ సమాజం ఈ బాధ్యతను నెరవేర్చడానికి కృషి చేయనంతవరకూ, "మాట వినడం, విధేయత పాటించడం" అనే వ్యవస్థ నెలకొనదు. ఇక్కడ ఒక విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. విధేయత అనేది కేవలం మంచి విషయం లోనే కాని, చెడు విషయంలో కాదు. అంటే దేవుని ఆజ్ఞలకు షరీఅత్ నియమాలకు వ్యతిరేకం కాని విషయాల్లోనే "విధేయత పాటించడం" మన విధి అన్న మాట. అలా కాని పక్షంలో విధేయత పాటించనవసరం ఉండదు.

సోదరులారా!

ప్రవక్త (సఅసం) ప్రవచనాల వెలుగులో సంగఠితంగా ఉండడం, మాట వినడం, విధేయత పాటించడం అనే విషయాలు ఇప్పుడు మన ముందు వివరంగా వచ్చాయి. అయితే కేవలం అభిలాష వల్లగాని, మాటిమాటికి ప్రస్తావించడం వల్ల గాని ఏ పనీ కాదు. ఈనాటి వరకు సత్యంగాని, అసత్యంగాని, మరే వ్యవస్థగాని దాని కోసం కృషి చేయనంత వరకూ నెలకొనలేదు. దీనికి ప్రపంచ చరిత్రే సాక్ష్యం. ఇస్లామ్ నెలకొల్పదలిచిన "మాట వినే, విధేయత పాటించే" వ్యవస్థ స్థాపించడం కోసం కూడా కృషి చేయడం ఎంతో అవసరం. ఈ కృషి "హిజ్రత్", "దైవ మార్గంలో జిహాద్" అనే రెండు విధాలుగా జరుపవలసి ఉంటుంది. కాని విచారకరమైన విషయం ఏమిటంటే ఈ రెండు పదాల సరైన భావం మనలో చాలా మందికి తెలీదు. దీనికి తోడు ఇస్లామ్ వ్యతిరేక శక్తులు వీటి భావాలను వక్రీకరించి ప్రచారం చేశాయి. నిజానికి ఈ రెండు విధాల ప్రయత్నాలు లేకుండా ఏ సంస్కృతి కూడా వృద్ధి చెందలేదు.

హిజ్రత్ అంటే ఒక చోటి నుండి మరొక చోటికి వలస పోవడం లేదా ఒక విషయాన్ని మానేసి మరో విషయాన్ని అవలంబించడం అని అర్థం. మనిషి తాను నమ్మిన ఉన్నత ఆశయాల కోసం చిన్న లాభాలను త్యాగం చేస్తాడు. ఆశయాన్ని సాధించే మార్గంలో అవరోధాలుగా నిలిచే ప్రతి విషయాన్నీ వదిలేస్తాడు. ఉదాహరణకు, సుఖశాంతులు, సిరి సంపదలు, స్వస్థలం, బంధు మిత్రులు మొదలైనవి తన లక్ష్యానికి అడ్డుపడితే వాటిని త్యజిస్తాడు. ఇదే హిజ్రత్ ఉద్దేశ్యం. అయితే ఇస్లామ్ లక్ష్యానికి సంబంధించిన హిజ్రత్‌కు, ఇతర ప్రాపంచిక లక్ష్యాలకు సంబంధించిన హిజ్రత్‌కు మధ్య ఒక తేడా ఉంది. ప్రాపంచిక లక్ష్యాలకు సంబంధించిన హిజ్రత్ కోసం చేసే త్యాగాలు కేవలం ప్రపంచపరమయినవే. ఈ రోజు తన సౌఖ్యాన్ని, సిరిసంపదల్ని త్యజిస్తే తరువాత

రాబోయే తరం మరింత సౌఖ్యాన్ని, భోగభాగ్యాల్ని అనుభవిస్తుందన్న ఆశతో మాత్రమే ఇక్కడ వ్యక్తి త్యాగాలు చేస్తాడు. కాని ఇస్లామ్‌లో హిజ్రత్ కోసం త్యాగాలు చేసే వ్యక్తి తన ఈ త్యాగాలకు బదులుగా మరణానంతర జీవితంలో శాశ్వత స్వర్గ సౌఖ్యాలు లభిస్తాయని ఆశిస్తాడు. ఇహలోకంలో ఎంత నష్టపోయినా పరలోకంలో మటుకు శాశ్వత సౌఖ్యం లభిస్తుంది అనే దృఢ విశ్వాసం ఉంటే మనిషి ఎలాంటి త్యాగాలకైనా సిద్ధపడతాడు. ఒక్క ఇస్లామ్ కోసమే కాదు. మరే జీవన వ్యవస్థ కోసమైనా హిజ్రత్ సహజమైన విషయం. అనివార్యం కూడా. కనుక మనం మన ప్రియ ప్రవక్త (సఅసం) కిష్టమయిన జీవితాన్ని గడపదలచుకుంటే హిజ్రత్ చేయడానికి ఎలాంటి పరిస్థితుల్లోనూ వెనుకాడకూడదు.

ఇక రెండో విషయం జిహాద్‌ని తీసుకుందాం. మానవుడు తన జీవితాశయాన్ని సాధించడానికి, దాన్ని శత్రువుల బారి నుండి కాపాడడానికి తన ధన ప్రాణాలను ఎదురొడ్డి తీవ్రంగా కృషి చేస్తాడు. దీన్నే జిహాద్ అంటారు. కాస్త ఆలోచించండి, ఎలాంటి కృషిచేయకుండా ప్రపంచంలో ఏ జాతి అయినా, ఏ దేశమయినా మనుగడ సాగించగలదా? ఒకవేళ మనం మన ధార్మిక వ్యక్తిత్వాన్ని నిలుపుకోవడానికి మన శత్రువుల్ని నిరోధించడం నేరమని భావిస్తే ఈ ప్రపంచంలో మనల్ని కాపాడగలిగే శక్తి మరేదయినా ఉందా?

ఏ జాతి అయినా, ఏ సంఘం అయినా తన ఉనికిని కాపాడుకోవడానికి తప్పనిసరిగా ఈ ప్రయత్నం చేస్తుంది. కాకపోతే ఈ ప్రయత్నం వెనుక ఇతర జాతులపై, లేదా ఇతర సంఘాలపై ఆధిక్యత కలిగి ఉండాలన్న ఉద్దేశ్యం మాత్రం ఉంటుంది. అయితే ఇస్లామ్ కోరే జిహాద్ అలా కాదు. ఇక్కడ "దైవ మార్గంలో జిహాద్" అనే షరతు విధించడం జరిగింది. ఈ షరతుని దృష్టిలో పెట్టుకుంటే ఒక జాతి మరొక జాతిని జయించడం లేదా ఆధిక్యతకై ప్రయత్నించడం అన్న ప్రస్తావనే రాదు. రాజ్య విస్తరణాకాంక్ష అంతకన్నా రాదు. దీనికి భిన్నంగా దైవ మార్గంలో తమ ధన ప్రాణాలను పణంగా పెట్టి పోరాడే వాళ్ళు తమ స్వలాభం కోసం ఏదీ చేయరు, వాళ్ళు మానవాళి దుఃఖాన్ని దూరం చేయడానికి ప్రతియ్నిస్తారు. దారితప్పిన దైవ దాసులకు సన్మార్గం చూపడానికి ఆరాటపడతారు. ప్రాపంచిక మైకంలో పడిపోయిన వాళ్ళలో పరలోక స్పృహ కలిగించి వాళ్ళకు శాశ్వత సౌఖ్యాలు అందజేయడానికి ప్రయత్నిస్తారు. ఇక్కడ మీరు అడగవచ్చు- తమ కోసం ఏదీ కోరని వారు ఇతరుల కోసం ఈ త్యాగాలు ఎందుకు చేస్తారని. కాని ఇక్కడ తమ కోసం ఏదీ కోరరంటే ఈ ప్రపంచంలో లభించే ఏ లాభం కోసమయినా తమ పరలోక సాఫల్యానికి నష్టం కలిగించే ఏ పనీ చేయరని అర్థం. వాళ్ళ దృష్టి అంతా ఎప్పుడూ పరలోక సాఫల్యం పైనే ఉంటుంది. వాళ్ళు పరలోక ప్రయోజనాన్నే కోరుకుంటారు. పరలోక సాఫల్యం కోరుకుంటారు. పరలోక ప్రయోజనం కోసమే

ఇహలోక నష్టాన్ని భరిస్తారు. ఈ విధంగా దైవ మార్గంలో జిహాద్ చేసే వ్యక్తి స్వార్థం, ద్వేషం, సంకుచిత జాతీయ ప్రయోజనాలకు అతీతంగా యావత్ మానవాళిని మనస్ఫూర్తిగా ప్రేమిస్తాడు.

సోదరులారా!

ఇదంతా ఒక్క హదీసు సారాంశం మాత్రమే. ఇంకా ఇతర హదీసుల్లో స్వయంగా దివ్యఖుర్ఆన్‌లో అల్లాహ్, ఆయన ప్రవక్త (సఅసం) కిష్టమయిన జీవితాన్ని గడపడానికి అనేక త్యాగాలు చేయవలసిన అవసరముందని నొక్కి చెప్పడం జరిగింది. కాని ఈనాడు మనలో అనేక మంది హిజ్రత్, జిహాద్ లాంటి త్యాగాల సంగతి అలావుంచి ధర్మసంస్థాపన కోసం కనీసం సామూహిక కృషి కూడా చేయడానికి సిద్ధంగా లేరు. ఇది చాలా విచారకరమైన విషయం. దైవం మనందరికీ ఖుర్ఆన్, హదీసుల వెలుగులో సామూహిక జీవితం గడిపే భాగ్యం ప్రసాదించుగాక!

21. ప్రచార కార్యంలో ప్రథమ కర్తవ్యం

మహాశయులారా!

ధర్మాన్ని అనుసరించే విషయంలో మనపై మోపబడిన బాధ్యత రెండు విధాలుగా ఉంది. ఒకవైపు మనల్ని మనం నరకాగ్ని నుండి కాపాడుకోవడం గురించి శ్రద్ధ వహించాలి. ప్రాపంచిక జీవితంలో లభించిన అవకాశాన్ని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలి. పరలోకంలో దైవశిక్ష నుండి తప్పించుకోవడానికి చేయవలసిన కృషి అంతా ఇక్కడ చేయాలి. మరో వైపు మనం తోటి దైవ దాసుల్ని కూడా నరకాగ్ని నుండి రక్షించడానికి ప్రయత్నించాలి. ఈ విషయంలో మనపై ప్రత్యేకంగా మన కుటుంబ బాధ్యత ఎక్కువగా ఉంది. మనలోని ప్రతి వ్యక్తీ తన కుటుంబానికి బాధ్యుడు, కావలివాడు కూడా. అతని భార్య పిల్లలు, అతని రక్షణలో ఉండే ఇతరులు అతని కావలిలో ఇవ్వబడ్డారు, వాళ్ళందర్నీ నరకాగ్ని నుండి కాపాడే బాధ్యత అతనిపై మోపబడింది.

కాని మనలో అనేక మంది ఈ బాధ్యతనే మరచిపోయారు. వీళ్ళు ప్రాపంచిక వ్యామోహంలో పడి తమల్ని తాము సంస్కరించుకునే విషయాన్ని కూడా మరచిపోయారు. పైగా వీరిలో దైవభీతి ఏ కోశానా లేదా అనే విధంగా ప్రవర్తిస్తూ షరీఅత్, ఆజ్ఞలను ఉల్లంఘిస్తున్నారు. ఇలాంటి వాళ్ళు తమ కుటుంబ సభ్యులకు ఏదయినా సత్కార్యం చేయమని శాసించలేరు. అందువల్ల వీళ్ళు మొదట తమల్ని తాము సంస్కరించుకునే విషయాన్ని గురించి ఆలోచించవలసి ఉంది. ప్రపంచంలో అల్లాహ్ మనకిచ్చిన ఈ అవకాశం ఎప్పుడు అంతమవుతుందో ఎవరికి తెలుసు? దురదృష్టవశాత్తు మనపై మోపబడిన ఈ బాధ్యతను నెరవేర్చక ముందే మనల్ని చావు కబళిస్తే, రేపు మన ప్రభువు ముందు సిగ్గుతో తలవంచుకొని వట్టి చేతులతో పరమ దోషులుగా నిలబడవలసిన దుస్థితి ఏర్పడుతుంది.

సోదరులారా!

అల్లాహ్ అమితమయిన దయగలవాడు. ఆయన ఎంతటి దోషినయినా క్షమించడానికి సిద్ధంగా ఉన్నాడు. పశ్చాత్తాపం చెంది సన్మార్గం వైపునకు మరలడానికి ఆయన తన దాసులకు అనేక అవకాశాలు ఇస్తున్నాడు. పశ్చాత్తాపం చెందిన వాళ్ళను ఆయన అమితంగా ప్రేమిస్తాడు, వాళ్ళపై తన కారుణ్యాన్ని కురిపిస్తాడు. అయితే మరణ సూచనలు ఆసన్నం కాగానే భయపడి పశ్చాత్తాపం చెందేవాళ్ళను మాత్రం అల్లాహ్ క్షమించడు. సమయానికి ముందే కళ్ళు తెరిచినవాళ్ళనే ఆయన క్షమిస్తాడు.

గత జీవితం పట్ల సిగ్గుపడి, ఇక ముందు అల్లాహ్‌కు విధేయుడయి ఆయన ఆజ్ఞల్ని శిరసావహిస్తామని దృఢంగా నిశ్చయించుకున్నవాళ్ళనే ఆయన అనుగ్రహిస్తాడు.

కొందరి జీవితాలు ఇస్లామ్‌కు అనుగుణంగా ఉంటాయి. వీళ్ళు ధార్మిక విధుల్ని తప్పకుండా పాటిస్తారు. దైవప్రీతి కోసం ఎన్నో సత్కార్యాలు చేస్తుంటారు. అపరాధాలకు దూరంగా ఉంటారు. మొత్తానికి వీళ్ళ జీవితాల్లో సత్యం, ధర్మం తొణికిసలాడుతూ ఉంటాయి. కాని వీళ్ళు తమ కుటుంబ సభ్యుల్ని సంస్కరించే విషయాన్ని గురించి అంతగా పట్టించుకోరు, ఇది తమ బాధ్యత కాదన్నట్లు మసలుకుంటారు. తామొక్కరు పవిత్ర జీవితం గడిపితే చాలు, భార్యా పిల్లలు ఏమయిపోయినా ఫరవాలేదని భావిస్తారు. ఇలాంటి వాళ్ళు తమ సొంత విషయంలోనూ జీవితాంతం ధర్మంపై స్థిరంగా ఉంటారని నమ్మకం ఏమిటి? వీళ్ళు తమ ప్రభావాన్ని కుటుంబీకులపై వేయకపోతే, కుటుంబీకుల ప్రభావమైనా వీళ్ళపై కొద్దో గొప్పో పడితీరుతుంది. ఆ విధంగా వీళ్ళు ఒక్కొక్క దైవాజ్ఞను విడిచిపెడుతూ పోవలసి వస్తుంది. పరలోకంలో కుటుంబ సభ్యులతోపాటు ఘోరమైన పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుంది.

ఇంకా కొందరున్నారు. వీళ్ళు బయట మాత్రం ధర్మ ప్రచార కార్యకలాపాలను జోరుగా సాగిస్తారు. కాని ఇంటివాళ్ళ సంగతి విచారించరు. అదేమంటే ఇంటివాళ్ళు తమ మాట వినడం లేదంటారు. కాని ప్రాపంచిక వ్యవహారాల్లో మాత్రం దబాయించి పని చేయించుకుంటారు. అసలు విషయం ఏమిటంటే, దైవ సందేశాన్ని పరిచయం చేసే పనిని ఎక్కడో ఓ చోట నిర్వహించడమే గదా తమపై ఉన్న బాధ్యత అని భావిస్తారు వీళ్ళు. ఒకవేళ తమ కుటుంబీకులకు ధర్మాన్ని గురించి కాస్తో కూస్తో బోధించినా ధార్మిక ప్రచార కార్యంలో తమ అసలు కర్తవ్యం, తమ మొట్టమొదటి కర్తవ్యం ఇదే అని తలచరు. అందువల్ల ఈ కాస్త బోధ వల్ల కుటుంబ సభ్యులు తమ జీవితాల్ని సంస్కరించుకోకపోతే వీళ్ళు నిరాశ చెంది తిరిగి వాళ్ళవైపు కన్నెత్తి కూడా చూడరు. ఇలాంటివారి కుటుంబాల్లోనే ప్రాపంచిక వ్యామోహపరులు, పాశ్చాత్య నాగరికతా ప్రియులు, చివరికి నాస్తికులు, దైవధిక్కారులు కూడా తయారవుతున్నారు. భర్త పొడుగాటి చొక్కా, టోపీ, గడ్డాలతో బయట ధర్మ ప్రచారానికిపోతే ఇంట్లో అతని భార్యామణి అందంగా అలంకరించుకొని పరదా నిబంధనల్ని అతిక్రమించి పార్కులకు, సినిమాలకు వెళ్ళడాన్ని మీలో అనేక మంది చూసే ఉంటారు. అలాగే తండ్రి మస్జిద్ ఇమామ్‌గా, బోధకుడిగా చెలామణి అవుతుంటే అతని కొడుకులు నాస్తికులయి ఇస్లామ్ వ్యతిరేక కార్యకలాపాల్లో నిమగ్నులై ఉండే ఉదంతాలు కూడా మీ అనుభవంలోకి వచ్చి ఉంటాయి. కుటుంబ సంస్కరణ పట్ల బాధ్యతలను విస్మరించిన కారణంగా కలిగే దుష్ఫలితాలే ఇవి.

కుటుంబ సభ్యులకు, దగ్గరి బంధువులకు ధర్మబోధ చేయవలసిన ఆవశ్యకతను గురించి మన ప్రియ ప్రవక్త (సఅసం) ఎంతగానో నొక్కి చెప్పారు. దైవ దౌత్యం లభించిన తరువాత ఆయన దైవ సందేశాన్ని మొట్టమొదటి పరిచయం చేసింది తన దగ్గరి బంధువులకే. స్వయంగా దివ్య ఖుర్‌ఆన్ కూడా దగ్గరి బంధువులకు ధర్మ బోధ చేయమని ఆదేశిస్తోంది.

సోదరులారా!

కుటుంబ సంస్కరణ విషయంలో మనపై ఎంత బాధ్యత ఉందో ఖుర్‌ఆన్ స్పష్టంగా సూచిస్తోంది. కొందరు తమ కుటుంబ సభ్యులకు ధర్మాన్ని బోధిస్తారు. కాని, సరైన రీతిలో బోధించరు. దీనికోసం విజ్ఞత, వివేచన, సందర్భం, సహనం కావాలి. సాధారణంగా కొందరు కుటుంబ సంస్కరణకై ప్రయత్నించినప్పుడు మొదట నమాజ్‌ను గురించి తాకీదు చేయడంతో ఈ పనిని ప్రారంభిస్తారు. మొదట్లో శాంతంగానే ధర్మాన్ని బోధిస్తారు. తరువాత ఒక్కసారిగా కఠినంగా ప్రవర్తించడం ప్రారంభిస్తారు. ఇంట్లో ప్రతి వ్యక్తి నోరు మూసుకొని తన ఆజ్ఞల్ని శిరసావహించాలని కోరుకుంటారు. ధర్మాన్ని అనుసరించడంలోనూ వీళ్ళు ఇదే వైఖరి అవలంబిస్తారు. కఠిన వైఖరి వల్లగాని, విజ్ఞత లోపించిన బోధ వల్లగాని కుటుంబ సభ్యులు దారికి రాకపోతే వీళ్ళు పూర్తిగా నిస్పృహ చెంది వాళ్ళ మానాన వాళ్ళని వదలిపెడతారు.

ఇది వివేచనతో కూడిన పద్ధతి కాదు. ఇంటివాళ్ళ హృదయాల్లో మొదట ధార్మిక విశ్వాసాలను పటిష్ఠం చేయాలి. ఇస్లామ్ వ్యతిరేక విశ్వాసాలను, మూఢ నమ్మకాలను దూరం చేయాలి. సందర్భోచితంగా ఇస్లామీయ విశ్వాసాలను వాళ్ళ హృదయాల్లోకి దించాలి. వాళ్ళ విద్యా శిక్షణలకై తగిన ఏర్పాట్లు చేయాలి. విద్యా బోధన ద్వారా పిల్లలను సులభంగా ఇస్లామ్ వైపునకు మళ్ళించవచ్చు. కాని బయట, నేటి విద్యా విధానాల్లో ఈ లక్ష్యం నెరవేరే అవకాశం లేదు. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో సయితం పిల్లలకు వారి వారి ధార్మిక విశ్వాసాలను, నైతిక విద్యను బోధించడం జరిగేది. ఆనాడు తల్లిదండ్రులు నమాజ్, నైతిక విషయాలను గురించి కాస్త చెబితే చాలు, వారి సంతానం వెంటనే వాటిని పాటించేది. కాని ఈనాడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది.

నేటి విద్యా సంస్థల్లో ధార్మిక బోధనగాని, నైతిక విషయాలుగాని మచ్చుకయినా కనిపించవు. పైగా ఇస్లామ్ వ్యతిరేక విషయాలు, నీతి బాహ్యమయిన అంశాలను కూడా పిల్లలకు బోధించడం జరుగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో కుటుంబ సంస్కరణా బాధ్యత మనపై మరింత అధికమవుతుంది. మనం పిల్లలకు కేవలం ఇస్లామ్‌ను గురించి బోధించడం మాత్రమే సరిపోదు. ఇస్లామ్ వ్యతిరేక బోధనల ఫలితంగా వారి హృదయాల్లో తిష్ఠవేసిన విషాన్ని కూడా కడిగివేయవలసి ఉంటుంది.

సోదరులారా!

మన భార్య, పిల్లలు, మనలోని ఇతర బంధువుల్ని పోషించే బాధ్యతనయితే మనం నెత్తి మీద వేసుకున్నాం. కాని వాళ్ళను ధార్మికంగా, నైతికంగా సంస్కరించవలసిన బాధ్యత కూడా ఉంటుందనే విషయాన్ని మనం మరచిపోతున్నాం. వాళ్ళను అలా గాలికి వదిలేస్తే అంతిమ దినంనాడు అల్లాహ్ ఎదుట వాళ్ళు మనకు వ్యతిరేకంగా సాక్ష్యమిస్తారు. ఇహలోకంలో వ్యక్తిగతంగా మన కోసం మనం చేసుకున్న సత్కార్యాలేవీ అప్పుడు పనికిరాకుండా పోతాయి. అంతకంటే దురదృష్టం మరొకటి ఉండదు.

కనుక ఈ విషయంలో మనం ఎంతో జాగ్రత్తపడవలసి ఉంది. ఇతరులకు ధర్మాన్ని పరిచయం చేయడం, ధర్మ బోధ చేయడం తప్పనిసరి విధి అన్న విషయం మీకందరికీ తెలుసు. ఈ పని మన ఇంటి నుంచే ప్రారంభం కావాలి. ఇంట్లో భార్యా పిల్లలకు బోధించనివారు, బయట సుదీర్ఘ ఉపన్యాసాలు చేస్తే వాటి ప్రభావం ప్రజలపై ఎంత పడుతుందో మీకు తెలుసు. వాళ్ళు మనమాట విన్నా వినకపోయినా బ్రతికినంత కాలం బోధ చేయడం మన విధి. దీక్ష, సహనం ఉంటే బోధించగా బోధించగా కొన్నాళ్ళకైనా వాళ్ళలో మార్పు వస్తుందని ఆశించగలం. ఒకవేళ మార్పు రాకపోతే మనం మాత్రం మన బాధ్యత నెరవేర్చినవాళ్ళమవుతాము. అల్లాహ్ ముందు మనకు వ్యతిరేకంగా సాక్ష్యమివ్వడానికి వాళ్ళకు ఏ ఆధారమూ దొరకదు.

22. ముండ్ల బాటపై నడిస్తేనే పూలపాన్పు లభిస్తుంది

మహాశయులారా!

మక్కాలో ఇస్లామీయ ఉద్యమం ప్రారంభమయిన తొలి రోజుల్లో ఎవరైనా ఒక వ్యక్తి ఇస్లామ్ స్వీకరించగానే అతనిపై అనేక ఆపదలు విరుచుకుపడేవి. ఇస్లామ్ స్వీక రించిన వ్యక్తి పేదవాడో లేక బానిసో అయి ఉంటే అవిశ్వాసులు అతడ్ని దారుణంగా కొట్టేవారు. వ్యాపారం లేదా కూలినాలి చేసుకునే వాడైతే అతని ఉపాధి మార్గాలను మూసేసేవారు. ఒకవేళ ఉన్నత వంశానికి చెందిన వాడైతే స్వయంగా అతని వంశస్థులే రకరకాలుగా హింసించి అతని జీవితాన్ని దుర్భరం చేసేవారు. ఇలా ఆనాడు దైవ ధిక్కారులు, మిథ్యావాదులు ముస్లిమ్‌లను హింసిస్తూ ఇస్లామ్ మార్గంలో ఎన్నో అవ రోధాలను సృష్టించేవారు. అయినప్పటికీ అనేక మంది ధైర్యంతో ఇస్లామ్ స్వీకరించి విశ్వసించిన వారిలో చేరిపోయే వాళ్ళు. ఒక్కోసారి విశ్వసించిన వారు ఈ బాధలకు తట్టు కోలేక ఆందోళన చెందేవారు. అయితే దైవధర్మాన్ని మాత్రం విడిచిపెట్టేవాళ్ళు కాదు.

దైవమార్గంలో కఠిన పరిస్థితుల్ని ఎదుర్కొన్న ఈ ముస్లింలు విశ్వాసం దృష్ట్యా ఈనాటి ముస్లిముల కన్నా ఎంతో గొప్పవాళ్ళు. నిజం చెప్పాలంటే అప్పటి ముస్లిముల దృఢ విశ్వాసం ధైర్యస్థయిర్యాలతో పోల్చుకుంటే ఈనాడు మనల్ని మనం ముస్లిములమని చెప్పుకోవడం కూడా కష్టమే. ఆనాడు మక్కాలో క్లిష్ట పరిస్థితులు ఏర్పడినందువల్ల మహాప్రవక్త (సఅసం) కొంతమంది ముస్లిములకు అబిసీనియాకు వలస పోవడానికి అనుమతినిచ్చారు. ఆ రోజుల్లో అవతరించిన దైవసందేశం వినండి:

"ఏమిటి, మేము విశ్వసించామని ప్రకటించినంత మాత్రాన ప్రజల్ని పరీక్షించ కుండా వదలిపెట్టడం జరుగుతుందని భావిస్తున్నారా? మేము వారి పూర్వీకు లందర్నీ పరీక్షించాము. మీలో సత్యవంతులెవరో, సత్యవంతులు కాని వారెవరో తప్పకుండా పరీక్షించవలసి ఉంది" అని అల్లాహ్ దివ్య ఖుర్‌ఆన్‌లో స్పష్టంగా తెలియజేశాడు.

కేవలం నోటితో విశ్వసించానని చెప్పుకున్నంత మాత్రాన ఏ వ్యక్తి పరలోక సాఫల్యానికి అర్హుడు కాలేడు. దైవ సంతోషం, స్వర్గ సుఖాలు అనేవి అంత తేలిగ్గా లభించే వస్తువులు కావు. వాటికోసం అతను కఠిన పరీక్షల్ని ఎదుర్కోవలసి ఉంటుంది. అనేక కష్టనష్టాలను భరించవలసి ఉంటుంది. ధన ప్రాణాల త్యాగానికయినా సిద్ధపడవలసి వస్తుంది. భయప్రలోభాల ద్వారా కూడా అల్లాహ్ మనల్ని పరీక్షిస్తాడు. మనకిష్టమయిన ప్రతి వస్తువునీ దైవ సంతోషం కోసం త్యజించవలసి వస్తుంది. ఈ పరీక్ష లన్నిటినీ తట్టుకొని నిలబడగలిగినవాడే అల్లాహ్ దృష్టిలో నిజమయిన ముస్లిమ్.

ఆ కాలంలో మక్కా పరిస్థితులు అంత కంతకూ క్లిష్టతరమైపోయి, చివరికి దైవప్రవక్త (సఅసం) తన అనుయాయులతో సహా స్వస్థలం వదలి మదీనాకు హిజ్రత్ చేయవలసి వచ్చింది. కాని అక్కడా ముస్లిములు అనేక కష్టాలను ఎదుర్కోవలసి వచ్చింది. ఆర్థిక ఇబ్బందులు, అరబ్ తెగల నుండి ప్రమాదం, యూదుల వ్యతిరేకత, కపటుల ఆగడాలు మొదలైన విషయాలు ముస్లిములను తీవ్రంగా ఆందోళనపరచాయి. అలాంటి క్లిష్టపరిస్థితుల్లోనే అల్లాహ్ ముస్లిములను ఇలా హెచ్చరించాడు:

"స్వర్గ ప్రవేశం ఊరకే లభిస్తుందని మీరు అపోహపడుతున్నారా? మీకు పూర్వం విశ్వసించిన వారికి సంభవించినవన్నీ ఇంకా మీకు సంభవించలేదే! వారిపై ఆపదలు, ఎనలేని వ్యథలు విరుచుకుపడ్డాయి. జీవితం దుర్భరం, దుస్సహం అయి వారికి స్థిమితం లేకుండా పోయింది. చివరకు అప్పటి ప్రవక్త, అతని అనుచరులు, 'అల్లాహ్ సహాయం ఇంకా ఎప్పుడు వస్తుంది' అని అరిచారు. అప్పుడు, 'అదిగో, అల్లాహ్ సహాయం సమీపంలోనే ఉంది' అని వారిని ఓదార్చటం జరిగింది."

ఉహుద్ యుద్ధం తరువాత ముస్లిమ్‌లు మరొకసారి కఠినమయిన ఆపదలకు గురి అయ్యారు. అప్పుడు కూడా అల్లాహ్ ముస్లిములను హెచ్చరిస్తూ, "మీరు ఇట్లే స్వర్గంలో ప్రవేశిద్దామని అనుకుంటున్నారా? వాస్తవానికి ఆయన మార్గంలో ప్రాణాలు తెగించి కృషిచేసేవారు, ఆయన కొరకు సహనం చూపేవారు మీలో ఎవరో అల్లాహ్ ఇంకా చూడనేలేదే" అన్నాడు.

సోదరులారా!

దివ్యఖుర్‌ఆన్‌లో వచ్చిన ఈ ఆయతలను బట్టి మనకు తెలుస్తున్నదేమిటంటే అల్లాహ్‌ను, ఆయన ప్రవక్త (సఅసం)ను విశ్వసించామని ప్రకటించుకున్నవారు పరీక్షించ బడతారు; తీవ్రమయిన పరిస్థితులకు లోనవుతారు; వారిపై రకరకాల ఆపదలు విరుచుకుపడతాయి. ప్రతి యుగంలోనూ అల్లాహ్ విశ్వసించిన వారిని పరీక్షిస్తూ వస్తు న్నాడు. అసలు, కల్తీ నుండి మేలిమిని విడదీసే గీటురాయి ఈ పరీక్షే. దైవ మార్గంలో కఠినాతికఠినమయిన పరీక్షలు ఎదురైనప్పుడు కల్తీ దానంతటదే తొలగిపోయి మేలిమి మాత్రమే మిగిలిపోతుంది, ఈ విధంగా దేవుని వరాలకు, స్వర్గానికి ఎవరు అర్హులో తేటతెల్లమవుతుంది. దివ్య ఖుర్‌ఆన్‌లో గతించిన జాతులకు సంబంధించిన ఇలాంటి సంఘటనల్ని అనేక చోట్ల ప్రస్తావించడం జరిగింది.

సోదరులారా!

ఖుర్‌ఆన్‌లో ప్రస్తావించబడిన ఈ చారిత్రక సంఘటనల్ని దృష్టిలో పెట్టుకొని ఈనాడు మనం ఏ స్థితిలో ఉన్నామో కాస్త ఆలోచించండి. ఆ కాలంలో వారికి ఎదురయిన కష్టాల్లో ఒక్క శాతం కూడా మనకు రావడం లేదు. ఈమాన్, ఇస్లామ్‌కు

సంబంధించినంతవరకూ మనకు ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురు కావడం లేదు. ఒకవేళ ఏవయినా కష్టాలు వస్తున్నాయనుకుంటే అవి ముస్లిమ్, ముస్లిమేతరులందరి జీవితాల్లో వచ్చే సాధారణ ఎగుడుదిగుళ్ళు మాత్రమే. నిజానికి ప్రత్యేకంగా దైవ మార్గంలో అనుభవిస్తున్న కష్టాలేవీ లేవు. ఎందుకని? మన విశ్వాస ప్రకటన, పరీక్షించ నవసరం లేనంతటి దృఢమైన ప్రకటనంటారా? లేక ప్రవక్త ప్రత్యక్ష అనుచరులకన్నా మనం దైవానికి ఎక్కువ ప్రియమయిన వాళ్ళమా?

అల్లాహ్ మనల్ని పరీక్షించకపోవడానికి కారణమేమిటో కాస్త ఆలోచిస్తే ఒక విషయాన్ని మనం అంగీకరించక తప్పదు. అదేమిటంటే, మనం అల్లాహ్‌ను, ఆయన ప్రవక్త (సఅసం)ను విశ్వసించామని చెప్పుకుంటాం కాని, ఆ విశ్వాసాన్ని ఆచరణ ద్వారా మాత్రం వ్యక్తపరచం. ఒకవేళ మన విశ్వాసం రీత్యా ధార్మిక విధుల్ని పాటించినా దైవ పరీక్ష ఎదురుకానంత వరకే వాటిని పాటిస్తాం. ఉదాహరణకు నమాజ్ చేయమని, సాముహికంగా చేయమని ఇస్లామ్ మనల్ని ఆదేశిస్తోంది. కాని మనలో చాలా మంది అసలు నమాజ్ విషయాన్నే పట్టించుకోరు. ఇక నమాజ్ చేసే వారిలో అనేకమంది అన్ని విధాలా పరస్థితులు తమకు అనుకూలంగా ఉంటేనే చేస్తారు. ఆఫీసు వదలి నమాజ్‌కు వెళితే ఆఫీసర్ ఏం చేస్తాడోనని భయపడతారు. లేక దుకాణం వదలి వేళకు నమాజ్‌కు వెళితే లాభాలు తగ్గిపోతాయని భావిస్తారు. అలాగే మన బంధుమిత్రులు మూఢాచారాలతో కూడిన ఏదైనా ఉత్సవం జరుపుకుంటూ మనల్ని ఆహ్వానిస్తే మనం అందులో పాల్గొంటాం. వారి మెప్పు కోసం ఆ దురాచారాల్లో మనమూ ఓ చెయ్యి వేస్తాం. ప్రభుత్వం, పాలనా వ్యవస్థ విషయంలోనూ మనం ఇదే వైఖరిని అవలంబిస్తున్నాం. పాలకుల్లో పాలనా వ్యవస్థలో చెడు స్పష్టంగా కనిపిస్తున్నా మనం దానికి వ్యతిరేకంగా పెదవి విప్పడానికూడా చొరవ తీసుకోవటం లేదు. ప్రభుత్వానికి ఇష్టమయిన మేరకే మనం ఇస్లాం ఆదేశాలను పాటిస్తున్నాం. అలాంటప్పుడు ఇక కష్టాలు రావడానికి తావెక్కడుంటుంది?

పోతే మనం మరో విషయంలో కూడా తప్పటడుగు వేశాం. ఇస్లామ్ ఒక సమగ్ర జీవన వ్యవస్థ అని అంగీకరిస్తాం. కాని ఆచరణ ద్వారా మతం వేరు, ప్రపంచం వేరని చాటిచెబుతున్నాం. ప్రభుత్వం తన అధీనంలోకి తీసుకోదలచిన ప్రతి విషయాన్నీ మనం ధర్మం నుండి వేరుచేస్తున్నాం. ప్రభుత్వం మంచిదని ప్రకటించిన ప్రతి విధానాన్నీ మనం నిస్సంకోచంగా అవలంబించడానికి సిద్ధమవుతున్నాం. ఇందులో దైవాజ్ఞలు ఏమిటని మనం విచారించడం లేదు. ఆర్థిక, సాంఘిక రంగాల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్నో ఇస్లామ్ వ్యతిరేక విధానాలను మనం ప్రాపంచిక వ్యవహారాలుగా భావించి అనుసరిస్తున్నాం. ఇలాంటి పరిస్థితిలో దైవపరీక్ష ప్రసక్తే తలెత్తదు.

చివరికి దైవ సందేశాన్ని ప్రచారం చేసేవాళ్ళు సయితం ఎదుటి వాళ్ళ మనస్సును మృదువుగానయినా విమర్శించరు. మన భార్యాపిల్లలు, ప్రాపంచిక వ్యామోహంలో పడి దైవాజ్ఞలను బహిరంగంగా ఉల్లంఘిస్తున్నా మనం వారిని మందలించం, ఏదో రెండు మాటలు ఉపదేశించి మన బాధ్యత తీరిందనుకుంటాము.

సోదరులారా!

ఇలా ఒక్కొక్క విషయంలో మనం అల్లాహ్ అభీష్టంతో ప్రమేయం లేకుండా ప్రజల ఇష్టాయిష్టాలనే దృష్టిలో పెట్టుకొని మసలుకుంటుంటే ఇక ఆపదలు ఎక్కడ్నుంచి వస్తాయి? దైవ పరీక్ష ప్రస్తావన ఎందుకు వస్తుంది? పరీక్ష హాలుకు వెలుపలే నిలబడ్డ వారికి పరీక్ష ఏమిటి? క్రియారంగంలోకి దిగినవాళ్ళనే అల్లాహ్ పరీక్షిస్తాడు. ఈనాడు మనం ఇదే స్థితిలో ఉన్నాం. పరీక్ష హాలు బయట నిలబడి పాసైపోతామని అనుకుంటున్నాం. పరీక్షకు గురి కాకుండానే పరలోక సాఫల్యం కోసం కలలు గంటున్నాం. దైవ పరీక్షకు దూరంగా ఉండటమంటే దైవ కారుణ్యానికి దూరంగా ఉండటమేనన్న వాస్తవికతను మనం మరిచిపోతున్నాం.

సోదరులారా!

దైవ పరీక్ష అనేది మనం కోరుకుంటే వచ్చేది కాదు. మన విశ్వాసాన్ని జీవితంలోని ప్రతి రంగంలోనూ ప్రతిబింబింపజేయాలి, ప్రజల ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా కేవలం దైవ సంతోషం పొందాలన్న ఆకాంక్షతో ఇస్లామ్ ఆదేశాలను గట్టిగా పాటించాలి. అప్పుడు దైవ పరీక్షా వస్తుంది, దైవ కారుణ్యమూ మనపై వర్షిస్తుంది.

23. పరీక్షా ఘడియలు

మహాశయులారా!

మీలో చాలా మంది విద్యార్థి దశలో ఎన్నో పరీక్షలు రాసి ఉంటారు. పరీక్షా హాల్లో అడుగుపెట్టి, నిర్ణీత సమయం సమీపించే వరకు ప్రశ్నాపత్రంలో ఎలాంటి ప్రశ్నలుంటాయో విద్యార్థికి తెలియదు. కాని పరలోక పరీక్షలో మహోన్నతుడయిన అల్లాహ్ ఏ ఏ ప్రశ్నలు అడుగుతాడో మన ప్రియ ప్రవక్త (సఅసం) మనకు ముందే తెలియజేశారు. ఖియామత్ రోజు దైవం అడిగే అయిదు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చే వరకూ మనిషి తాను నిల్చున్న చోటు నుండి కదలలేడని మహాప్రవక్త (సఅసం) అన్నారు. ఆయన తెలిపిన ఆ అయిదు ప్రశ్నలేమిటో ఈ రోజు మనం తెలుసుకుందాం.

సోదరులారా! పరలోకం గురించి దైవప్రవక్త (సఅసం)కు తెలిసినంతగా ఏ మానవుడికీ తెలియదని మనం విశ్వసిస్తున్నాం. ఇంకా ఆయన చెప్పిన ప్రతి మాటా సత్యబద్ధమయినదని కూడా మనం నమ్ముతున్నాం. ఖియామత్ మైదానంలో అల్లాహ్ ప్రతి మానవుడికీ ఫలానా ఫలానా ప్రశ్నలు అడుగుతాడని, మానవుడు వాటికి జవాబులు చెప్పేదాకా అల్లాహ్ సమక్షాన్నుండి ఒక్క అంగుళం కూడా కదల్లేడని దైవ ప్రవక్త (సఅసం) ముందే తెలియజేస్తూ ప్రశ్నాపత్రాన్ని మనకిచ్చిపోయారు. ఈ సమాచారం ఎంత విలువైనదో ఆలోచించండి.

సోదరులారా!

అల్లాహ్ అడిగే మొట్టమొదటి ప్రశ్న చూడండి. నీ జీవితాన్ని నువ్వు ఏ ఏ పనుల్లో గడిపావు? అంటే, ప్రాపంచిక జీవితంలో ఆచరణ కోసం నేనిచ్చిన అవకాశాన్ని నువ్వు ఏ ఏ పనుల కోసం వినియోగించావు? అని అడుగుతాడు. ప్రాపంచిక జీవితం ప్రతి మానవుడికి ఒక పరీక్షా సమయంలాంటిదని మీకందరికీ తెలుసు. ఇక్కడ ప్రతి మానవుడ్నీ దేవుడు ఏ స్థితిలో ఉంచాడో ఆ స్థితిని బట్టే అతడ్ని పరీక్షిస్తాడు. ఈ పరీక్షలో మానవుడు ఏ ఏ కర్మలు ఆచరించాడో పరలోకంలో పరిశీలించడం జరుగుతుంది.

రెండవ ప్రశ్న మానవుని యవ్వనానికి సంబంధించింది. అతని యవ్వనంలో అల్లాహ్ ఎలాంటి శక్తిసామర్థ్యాలు ప్రసాదించాడో వాటిని అతను ఎలా ఉపయోగించాడో ప్రశ్నించడం జరుగుతుంది. అల్లాహ్ ప్రసన్నతను, ఆయన ఆదేశాలను దృష్టిలో పెట్టుకొని అతను యవ్వన కాలాన్ని గడిపాడా లేక ఉద్రేకపు వెల్లువలో కొట్టుకుపోయి, మనోవాంఛలకు లొంగిపోయి తన శక్తి సామర్థ్యాలను తప్పుడు మార్గాల్లో వృథా చేశాడా అని పరిశీలించడం జరుగుతుంది.

మూడో ప్రశ్న ధనార్జన విషయంలో ఉంటుంది. మానవుడు తన ప్రాపంచిక జీవితంలో ఏ ఏ మార్గాల ద్వారా ధనాన్ని సంపాదించాడో జవాబు చెప్పుకోవలసి ఉంటుంది. సుఖ సంతోషాలతో జీవితం గడిపేందుకు అల్లాహ్ అపరిమితమయిన సామగ్రిని సృష్టించాడు. వీటిని మానవుడు తన ఇష్టానుసారం సంపాదించుకుంటున్నాడు. అయితే వీటిని సంపాదించడానికి కొన్ని ధర్మసమ్మతమయిన మార్గాలున్నాయి. దైవాజ్ఞలకు అనుగుణంగా ఉండేవన్నీ మంచి మార్గాలే. కాని దైవానికి ఇష్టం కాని మార్గాలు కూడా ఉన్నాయి. ఆ మార్గాల ద్వారా సంపాదించడాన్ని అల్లాహ్ నిషేధించాడు. ఏ మార్గాల ద్వారానయినా సంపాదించుకోవడానికి మనిషికి స్వేచ్ఛ ఉంది. అయితే ఆ స్వేచ్ఛను దుర్వినియోగం చేసి అక్రమంగా, అన్యాయంగా, ఇతరుల హక్కులు కాజేసి సంపాదిస్తే పరలోకంలో పట్టుబడిపోతాడు.

నాల్గో ప్రశ్న ధన వ్యయానికి సంబంధించింది. ప్రాపంచిక జీవితంలో ప్రసాదించబడిన వస్తువులను ఏ మార్గాల్లో ఏ ఏ పనులకు ఖర్చు చేశాడో ఖియామత్ రోజు అల్లాహ్ మానవుడ్ని నిలదీసి అడుగుతాడు. ఖర్చు చేసే విషయంలో కూడా కొన్ని మంచి పద్ధతులున్నాయి, కొన్ని తప్పుడు పద్ధతులున్నాయి. ఇక్కడ కూడా మానవుడు మనోవాంఛలకు బానిసై దైవం ప్రసాదించిన ధనాన్ని తప్పుడు మార్గాల్లో ఖర్చు పెడుతుంటాడు. నీవు సంపాదించిన ధనాన్ని ఏ విధంగా ఖర్చుపెట్టావని మానవుణ్ణి అల్లాహ్ దర్బారులో ప్రశ్నించటం జరుగుతుంది.

ఇక అయిదో ప్రశ్న విద్యాజ్ఞానాల విషయంలో ఉంటుంది. నువ్వు సంపాదించిన జ్ఞానం ప్రకారం నువ్వు ఎంత వరకు ఆచరించావని అల్లాహ్ మానవుడ్ని అడుగుతాడు. మంచి, చెడు హరాం, హలాల్ దైవాజ్ఞలు, షైతాన్ చేష్టలు మొదలైన విషయాలకు సంబంధించిన జ్ఞానం కొద్దోగొప్పో ప్రతి మనిషికీ ఉంటుంది. ఏ పనులు చేస్తే దేవుడు సంతోషిస్తాడో; ఏ పనుల జోలికిపోతే ఆయన ఆగ్రహిస్తాడో కూడా ఆ మనిషికి కాస్తోకూస్తో తెలియకుండా ఉండదు. ఇవి సామాన్య ప్రజల విషయంలో చెప్పే మాటలు. ఇక మనం ధర్మవేత్తలుగా పిలిచే పండితుల విషయానికి వస్తే వారికి అల్లాహ్ ఇతరులకంటే ఎంతో ఎక్కువ జ్ఞానాన్ని ప్రసాదించాడు. అల్లాహ్ ఆదేశాలేమిటో వారికి బాగా తెలుసు. అయితే ఖియామత్ రోజు అల్లాహ్ ప్రతి మానవుడ్నీ, నీకు తెలిసిన విషయాల్ని నువ్వు ఎంతవరకు ఆచరించావని ప్రశ్నిస్తాడు.

సోదరులారా!

పరలోక పరీక్షలో అడిగే ప్రశ్నలేమిటో మీరు తెలుసుకున్నారు. పరలోకంలో విశ్వప్రభువు ముందు మనం చేసిన ప్రతి కర్మకూ సమాధానం చెప్పుకోవలసి ఉంటుందన్న

విశ్వాసం మనకు నిజంగా ఉంటే, మన వైఖరి పరీక్షకు హాజరయ్యే విద్యార్థికి మల్లే ఉండాలి. పరీక్ష తేది దగ్గరపడుతున్న కొద్దీ విద్యార్థి మరింత కష్టపడి చదవడానికి ప్రయత్నిస్తాడు. ఒకవేళ పరీక్షలో అడిగే ప్రశ్నలేమిటో ముందే తెలిస్తే సంతోషంతో గంతులేస్తాడు. కనీసం చూచాయగా తెలిసినాసరే అతను ఏ మాత్రం అశ్రద్ధ చేయకుండా పుస్తకాలన్నీ గాలించి ఆ ప్రశ్నలకు సరయిన సమాధానాలను తయారు చేసుకుంటాడు. వాటిని పదే పదే చదివి మనస్సులో భద్రపరచుకుంటాడు.

కాని విద్యార్థికి అలాంటి ఛాన్సు లేదు. మోమిన్‌కు మాత్రమే అల్లాహ్ అలాంటి ఛాన్స్ ఇచ్చాడు. ఆయన తన ప్రవక్త (సఅసం) ద్వారా ఈ ప్రశ్నావళి మనకు ముందే తెలియజేశాడు. పరలోక పరీక్షలో ఈ ప్రశ్నలే వస్తాయని మనకు నమ్మకం కూడా ఉంది. అలాంటప్పుడు ప్రశ్నాపత్రాన్ని ముందేసుకొని గోళ్ళు గిల్లుకుంటూ కూర్చుంటారా ఎవరయినా? ఒకవేళ ఎవరయినా అలా కూర్చుంటే అతనికి పరలోక పరీక్షలో ఈ ప్రశ్నలే వస్తాయన్న నమ్మకమయినా లేకపోవాలి. లేదా అతనికి పిచ్చయినా పట్టి ఉండాలి.

సోదరులారా!

ఇప్పుడు మీరే చెప్పండి, పరలోక పరీక్షలో అడిగిన ప్రశ్నలకు మనం సరైన సమాధానాలు చెప్పడానికి సిద్ధంగావున్నామా? విద్యార్థికి మల్లే కేవలం పుస్తకాలు చదివి రాసే పరీక్ష కాదిది. మోమిన్ తన ఆచరణ ద్వారా మాత్రమే ఈ ప్రశ్నలకు సరయిన సమాధానాలు చెప్పగలడు. కేవలం పుస్తకాలు చదివి రాసే పరీక్ష కోసమే విద్యార్థి యేడాదిపాటూ ఎంతో కష్టపడి దీక్షగా చదవుతాడు. కాని మనమో? పరీక్షలో అడిగే ప్రశ్నలేమిటో తెలిసి కూడా వాటికి సరైన జవాబులు చెప్పడానికి సన్నాహాలు చేయడం లేదు. ప్రశ్నలకు సమాధానాలు తయారుచేసుకోవడానికి మనకు దైవం ఇచ్చిన గడువు ఏ క్షణంలోనయినా తీరిపోవచ్చు. పరీక్ష కోసం ఏదైనా చేయదలచుకుంటే ఈ గడువులోపలే చేసుకోవాలి. ఆ తరువాత ఎంత పశ్చాత్తాపపడినా లాభం ఉండదు.

ఈ విషయంలో మనం చేయవలసిన మొట్టమొదటి పనేమిటో మహాప్రవక్త (సఅసం) సెలవిచ్చారు. ఈ అయిదు ప్రశ్నలకు సమాధానాలు చెప్పుకోవలసిన స్థితి అయితే ప్రతి మానవుడికీ తప్పనిసరిగా వస్తుంది. అయితే ఆ స్థితి రాకముందే దాన్ని ఎదుర్కోవడానికి మనం ప్రాపంచిక జీవితంలో సన్నాహాలు చేయాలి. దాని కోసం ప్రతి మానవుడూ ఈ ప్రశ్నల్ని ముందు పెట్టుకొని ఆత్మపరిశీలన చేసుకుంటూ ఉండాలని మహాప్రవక్త (సఅసం) అన్నారు. ఆత్మపరిశీలన ద్వారానే ఆత్మ సంస్కరణ సాధ్యమవుతుంది. ఇలా ఆత్మపరిశీలన చేసుకుంటున్నప్పుడు మనలో ఉన్న పొరపాట్లు, బలహీనతలేమిటో చక్కగా తెలుస్తాయి. వెంటనే వాటిని దూరం చేసుకోవడానికి ప్రయత్నించాలి. ఇందులో విజయం సాధిస్తే పరలోక విజయం వైపునకు పురోగమిస్తున్నట్లే.

సోదరులారా!

మన ప్రియప్రవక్త (సఅసం) ఇచ్చిన ఈ ఆచరణాత్మకమయిన సలహాను పాటిస్తే తప్పనిసరిగా ప్రయోజనం పొందగలం. కాని ఈనాడు మన సమాజం ఏ స్థితిలో ఉందో చూడండి. ఎక్కడ చూసినా అన్యాయం, అవినీతి, అపనమ్మకం, అశ్లీలం విలయతాండవం చేస్తున్నాయి. నలుగురు కలిసిన ప్రతి చోటా ఈ చెడుల్ని గురించే చర్చ వస్తుంది. ప్రతి వ్యక్తీ సమాజం పతనావస్థకు చేరువవుతోందనే విచారం వ్యక్తపరుస్తాడు. కాని వీటిని దూరం చెయ్యడానికి ప్రయత్నించడు. ఎదుటివాళ్ళు చేస్తే దాని ఫలాలు ప్రశాంతంగా అనుభవించాలనుకుంటాడు. అలాంటప్పుడు ఈ చెడులు ఎలా దూరమవుతాయి? మహాప్రవక్త (అసం) ఉపదేశించినట్లు దీనికి ఒక్కటే పరిష్కారం. మనలోని ప్రతి వ్యక్తీ ఆత్మపరిశీలన చేసుకుంటూ తనను తాను సంస్కరించుకోవడానికి కృషి చేయాలి. సమాజ సంస్కరణకు తీసుకోవలసిన తొలి చర్య కూడా ఇదే. అలా చేస్తేనే ఈ చెడులు దూరమవుతాయి.

అసలీ సమాజంలో చెడులు వ్యాపించడానికి మూల కారణం, ప్రజల్లో దైవభీతి, దైవం ఎదుట తమ కర్మలకు జవాబు చెప్పుకోవలసి ఉంటుందన్న నమ్మకం తగ్గిపోవడమే. అందువల్ల దైవభీతిని, పరలోకం పట్ల విశ్వాసాన్ని సర్వసామాన్యం చేయవలసిన అవసరం ఎంతయినా ఉంది.

సోదరులారా!

మనిషి చనిపోయాక అల్లాహ్ దర్బారులో హాజరు కావలసి ఉంటుందని మనం విశ్వసిస్తున్నాం. అయితే ఈ విశ్వాసానికి అనుగుణంగా మన నీతి నడవడికలు ఉండాలి. మన జీవితపు అన్ని రంగాల్లోనూ ఈ విశ్వాసం వ్యక్తమవ్వాలి. అంటే అల్లాహ్ ఆయన ప్రవక్త (సఅసం) ఆదేశాలకు అనుగుణంగా మన పూర్తి జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలి. ఇలా చేయడం ముస్లిములుగా మన కర్తవ్యం కూడా. కాబట్టి ఈ విధంగా మనం మారితే మనల్ని చూసి ఇతరులు కూడా మారతారని ఆశించగలం.

24. మానవ చరిత్ర గతిని మార్చిన మహా విప్లవం

మహాశయులారా!

మన ప్రియ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం ఈ లోకానికి రాక ముందు యావత్ మానవాళి అజ్ఞానాంధకారంలో మునిగి ఉండేది. ప్రజలు విశ్వప్రభువును మరచి రకరకాల భ్రష్టమార్గాలను అనుసరిస్తుండేవారు. రాళ్ళను, చెట్లను, పుట్టల్ని, ప్రకృతి శక్తుల్ని పూజిస్తుండేవారు. దైవ ప్రవక్తల్ని, దైవదూతల్ని, మహాపురుషుల్ని దేవుళ్ళుగా భావించి వారి విగ్రహాల ముందు మోకరిల్లేవారు. మాంత్రికులు మతాచార్యులు, దొంగ సన్యాసులు ప్రజలను మరింత దారి తప్పించి ఎన్నో మూఢ నమ్మకాలు, దురాచారాల్లోకి దించి వేశారు. పనికిమాలిన పూజా పురస్కారాలు తప్ప నీతికి, సదాచరణకు విలువ లేకుండా పోయింది. మరోవైపు ఆనాటి సమాజం అన్యాయం, అక్రమం, హింస, దౌర్జన్యాలతో నిండిపోయింది. బలవంతులు బలహీనుల్ని దోచుకునే వారు. స్త్రీలని, బానిసల్ని పశువులకన్నా నీచంగా చూసేవారు. ఎటు చూసినా అశాంతి, అలజడులే ఉండేవి.

ఇలాంటి పరిస్థితిలో అల్లాహ్ అంతిమ దైవప్రవక్త (సఅసం)ను ప్రభవింపజేశాడు. ఆయన మానవాళిని అంధకారం నుంచి వెలుగులోకి తెచ్చారు. సృష్టికర్త విషయంలో వారికి సరైన జ్ఞాన జ్యోతిని చూపించారు. మంచి చెడుల విచక్షణా జ్ఞానాన్ని బోధించారు. సజ్జనుల కోసం స్వర్గ శుభవార్తను వినిపించారు. దుర్మార్గులు దుష్ఫలితాన్ని అనుభవిస్తారని హెచ్చరించారు. మహాప్రవక్త (సఅసం) నైతికంగా యావత్ మానవుల్లోనే అత్యంత శ్రేష్ఠులు. ఆయన మానవుల శ్రేయస్సుకోసం తన సర్వస్వాన్నీ ధారపోశారు. ఆయన ద్వారానే ప్రపంచానికి వెలుగుబాట లభించింది. అజ్ఞానం, అంధ విశ్వాసాలు పటాపంచలైపోయాయి. షిర్క్, కుఫ్రులు తుడిచిపెట్టుకుపోయాయి. మానవ మహోపకారి అయిన ఆ మహనీయునిపై అల్లాహ్ శాంతీ సౌభాగ్యాలు వర్షించుగాక!

సోదరులారా!

మన ప్రియప్రవక్త (సఅసం) ఇంతటి విప్లవం ఎలా తెచ్చారో ఈ రోజు తెలుసు కుందాం. ఆయన దేవుని ఏకత్వపు నినాదంతో తన ఉద్యమాన్ని ప్రారంభించారు. అంధకారంలో తచ్చాడుతూ ఉండిన మనిషికి ఆయన మిథ్యా దేవుళ్ళ దాస్యం నుండి విముక్తి ప్రసాదించారు. కేవలం అల్లాహ్ దాసుడిగా రూపొందించారు. సమస్త రాచరికాలు, నాయకత్వాలను తుడిచివేసి అల్లాహ్ భూమిపై ఒక్క అల్లాహ్ శాసనాన్నే చెలాయించారు. ఇది అంత తేలికయిన పని కాదు. దైవ ప్రవక్త (సఅసం) అందజేసిన తౌహీద్ సందేశాన్ని ప్రారంభంలో కొంతమందే స్వీకరించారు. మక్కాలో ఉండిన 13 ఏళ్ల

పాటు ఆయన తౌహీద్ సందేశాన్నే ప్రజలకు అందజేస్తుండేవారు. అయినా సహచరుల సంఖ్య పెద్దగా పెరగలేదు. ప్రజలు ఆయన్ని తిరస్కరించారు. మాంత్రికుడని, జ్యోతిష్కుడని ఆరోపించారు. ఆయన సహచరుల స్థితి మరీ దీనమైపోయింది. దైవ విరోధులు వాళ్ళను దారుణంగా హింసించేవారు. మక్కాలో వారి జీవితం దుర్భర మయిపోయింది.

దైవప్రవక్త (సఅసం)కు వ్యతిరేకంగా విగ్రహారాధకులంతా ఏకమయ్యారు. ఆయన వెలిగించిన దైవ జ్యోతిని ఆర్పడానికి పూనుకున్నారు. కాని అవిశ్వాసులకు ఇష్టం లేకపోయినా సరే అల్లాహ్ తన జ్యోతిని ప్రపంచమంతటా ప్రసరింపజేయడానికే నిశ్చయించుకున్నాడు. ఆయన వారి ప్రయత్నాలను వమ్ము చేశాడు. తరువాత ఖురైషీలు దైవప్రవక్త (సఅసం)ను హతమార్చాలని పథకం వేశారు. అల్లాహ్ ఆ పథకాన్ని కూడా భగ్నం చేశాడు. మహాప్రవక్త (సఅసం), ఆయన అనుచరులు ఎంతో సహనంతో, ధైర్యంతో పరిస్థితుల్ని ఎదుర్కొన్నారు. వాళ్ళు ప్రతి చెడుకూ, 'మంచి'తో జవాబిచ్చారు. దుర్భాషకు బదులు దుఆ చేశారు. అయినా ఆ దుర్మార్గులు దైవ ప్రవక్త (సఅసం)ను ఆయన సహచరుల్ని హింసించడం మానుకోలేదు. పైగా వారి ఆగడాలు ఇంకా మితిమీరిపోయాయి.

సోదరులారా!

మక్కాలో పరిస్థితి ఇలా విషమిస్తూ పోయింది. ఇక మక్కావాసులు ఎవరూ ప్రవక్త (సఅసం) మాటను వినరని స్పష్టమవగానే అల్లాహ్ హిజ్రత్ ఆదేశాన్ని ఇచ్చాడు. ఈ ఆదేశం ప్రకారం మహాప్రవక్త (సఅసం), ఆయన అనుచరులు తమ సొంత ఇళ్ళు, భూములు, బంధువులు సమస్తం వదలిపెట్టి మదీన వెళ్ళారు. దైవ మార్గంలో వలసపోవడానికి ఆత్మబంధువులు, ప్రాణమిత్రులు, అందమయిన మేడలు, పచ్చని తోటలు, ఒకటేమిటీ, తమకు ప్రియమైన ఏ వస్తువూ వాళ్ళకు అడ్డం రాలేదు. అల్లాహ్ పట్ల వారి విశ్వాసం అలాంటిది. ఆయనపై పూర్తి భరోసా ఉండేది. అదే వారికి పెద్ద ఆధారం. దాంతో వారు కొండల్ని కూడా ఢీకొనగలిగే శక్తిని సంపాదించారు.

ఇంతకూ, ఈ హిజ్రత్ లక్ష్యమేమిటీ? అల్లాహ్ కలిమాను ఉన్నతం చెయ్యాలి. కుఫ్ర్, షిర్క్‌లను అంతమొందించాలి. సమస్త రంగాల్లో ఇస్లామీయ జీవన వ్యవస్థను స్థాపించాలి. వీటి కోసమే మక్కాలో ముస్లింలు తమ శక్తి సామర్థ్యాలన్నిటినీ ధారపోసి కృషి చేశారు. చివరికి స్వస్థలాన్ని కూడా వదలి పెట్టవలసి వచ్చింది.

ముస్లింలు హిజ్రత్ చేసి మదీనా వస్తే ఇక్కడ వారికి అఖండ స్వాగతం లభించింది. మదీనా ప్రజలు అంతకు ముందే మహాప్రవక్త (సఅసం) ఔన్నత్యాన్ని,

ఆయన ఉద్యమాన్ని గురించి విని ఉన్నారు. వారిలో అనేకమంది దైవ ధర్మాన్ని స్వీకరించారు కూడా. అందువల్ల వారు మహాజిర్ ముస్లిమ్‌లను అమితంగా ప్రేమించారు. వారికి తమ ఆస్తిపాస్తుల్లో వాటా ఇచ్చారు. అన్ని రకాల వసతులు కల్పించారు. తరువాత అందరూ కలిసి దైవ త్రాటిని దృఢంగా పట్టుకున్నారు. ధర్మ సంస్థాపన కోసం నడుం బిగించారు.

సోదరులారా!

ఆ తరువాత ఏం జరిగిందో మీకందరికీ తెలుసు. ముస్లింలు ఇస్లామీయ ఉద్యమం రెండో ఘట్టం ప్రారంభించడంతో బహు దైవారాధన పునాదులు కదలి పోయాయి. వారు తమ ధన ప్రాణాలను ఒడ్డి దైవ విరోధులతో వీరోచితంగా పోరాడారు. దురాచారాలను, మూఢ నమ్మకాలను కూకటి వ్రేళ్ళతో పెళ్ళగించారు. మానవుల హృదయాల్లో దైవజ్యోతిని వెలిగించారు. వారిలో మానవత్వపు విలువల్ని జాగృతంచేశారు. అశాంతి, అలజడులు, అన్యాయం, అక్రమాలు నామరూపాల్లేకుండా పోయాయి. సర్వత్రా న్యాయం, ధర్మం సుహృద్భావాలు విరాజిల్లాయి.

అంతటితో ఈ విప్లవం ఆగలేదు. ఆ తరువాత ఇస్లామీయ విజయాల పరంపర ప్రారంభమయింది. తూర్పు నుంచి పడమరకు ఇస్లామ్ విస్తరించింది. విగ్రహారాధన నడుం విరిగిపోయింది. మానవుల దైవత్వం మట్టికరిచింది. దుష్ట శక్తుల ఆటలు అంతమయిపోయాయి. దైవదాసులు నిజమయిన దైవదాసులుగా మారిపోసాగారు. ఇస్లామ్ విప్లవ ప్రభావంతో వారి జీవితాలు కాంతిమంతం కాసాగాయి. వారు జీవితపు సమస్త రంగాల్లో దైవాదేశాలను పాటించడం ప్రారంభించారు. శాంతీ సౌభ్రాతృత్వాలు నెలకొన్నాయి. నేల నాలుగు వైపులా ఇస్లామ్ పేరు ప్రతిధ్వనించింది.

సోదరులారా!

ఇదీ మన ప్రవక్త (సఅసం), ఆయన అనుచరులు తెచ్చిన ఇస్లామీయ విప్లవం, ఇది ఇతర ప్రాపంచిక విప్లవాల్లా పాల పొంగులా వచ్చి ఆగిపోయే విప్లవం లాంటిది కాదు. ప్రపంచంలో చెడు ఏ భాగంలో ఉన్నా, ఏ కాస్త ఉన్నా సరే ఇస్లామీయ విప్లవ జ్వాలలు మండుతూ ఉండవలసిందే. అంతిమ దైవ సందేశహరుని (సఅసం) తరువాత ఈ మహా కార్యాన్ని కొనసాగించే బాధ్యత ఆయన అనుచర సమాజమయిన మనపై పడింది. కాని ఈనాడు మన పరిస్థితి ఏమిటి? ఎటు పయనిస్తున్నాం? ఏ లక్ష్యాల కోసం మన శక్తి సామర్థ్యాలను ఉపయోగిస్తున్నాం? ప్రపంచంలో మన జనాభా అయితే కోట్ల సంఖ్యలో ఉంది. కాని లాభం ఏమిటి? మానవులే మానవులకు దేవుళ్ళయి మానవత్వపు విలువల్ని మంటకలుపుతుంటే మనం చూస్తూ ఊరుకుంటున్నాం.

ప్రపంచంలో దైవరాహిత్యం, భౌతికారాధనలు అడ్డూ ఆపు లేకుండా ప్రబలిపోతుంటే మనం వాటికి వ్యతిరేకంగా పెదవి విప్పి కూడా మాట్లాడలేని అసహాయ స్థితిలో ఉండిపోయాం.

సోదరులారా!

మన ఈ దుస్థితికి కారణం ఒక్కటే. మనం ఈనాడు మహాప్రవక్త (సఅసం) బోధనలకు, ఆయన విధానాలకు దూరంగా మసలుకుంటున్నాం. దైవ సందేశ వ్యాప్తికై కృషిచేయాలన్న బాధ్యతనే మనం విస్మరించాం. ధర్మ సంస్థాపనాకార్యంలో జిహాద్ ప్రాముఖ్యత ఏమిటో మనకు తెలియనే తెలియదు. దైవ మార్గంలో కష్టనష్టాలను కూడా భరించవలసి ఉంటుందన్న విషయమయితే అసలే తలెత్తదు. మన జీవితాలు ప్రశాంతంగా, లేదా సాఫీగా సాగిపోతున్నాయి. ఒకవేళ మనకేవయినా చిక్కులొచ్చినా అవి పొట్ట కోసం లేదా ఇతర ప్రాపంచిక ప్రయోజనాలకోసం ప్రయత్నించే మార్గంలోనే. ధర్మం కోసం నిలబడటానికి మనం స్థిరంగా లేము. తోటి మానవులకు దైవ సందేశాన్ని అందజేసే బాధ్యతతో మనకు ఎలాంటి సంబంధం లేదని భావిస్తున్నాం.

ఇక ధర్మ ప్రచారం కోసం పనిచేసే వారు మనలో నూటికొకరు కూడా లేరంటే అతిశయోక్తి కాదు. వారయినా సవ్యంగా ఈ పవిత్ర బాధ్యతను నెరవేరుస్తున్నారంటే అదీ లేదు. వారిలో వారు ఎన్నో విభేదాలు సృష్టించుకుని సతమతమవుతున్నారు. కాబట్టి సోదరులారా! పరస్పరం విభేదాలు మరచిపోయి దైవ గ్రంథాన్ని దృఢంగా పట్టుకోండి. దైవదాసులకు దైవ సందేశాన్ని అందజేయండి. కుఫ్ర్, షిర్క్, దౌర్జన్యం, దురాచారాలను నిర్మూలించండి. మంచిని వ్యాపింపజేయండి. సంఘటిత కృషితో ఇస్లామీయ ఉద్యమాన్ని ముందుకు నడిపించండి. ధన ప్రాణాలతో దుష్ట శక్తుల్ని ఎదిరించండి, దైవ మార్గంలో కష్టనష్టాలను భరించండి. స్వయంగా మీరు మీ జీవిత సమస్త రంగాల్లో దైవాజ్ఞలను పాటిస్తూ, ఇస్లామ్ మానవాళి మార్గదర్శకత్వం కోసం పంపబడిన ఒక సమగ్ర జీవన వ్యవస్థ అని ప్రపంచం ముందు నిరూపించండి; తోటి మానవులకు ఆదర్శ ప్రాయులయి నిలబడండి. ధర్మసంస్థాపనకై పాటుబడటం అనేది ఏదో ఒక సంఘమో లేదా కొందరు వ్యక్తులో చేసే పని కాదు. ఇది మనందరి కర్తవ్యం. అల్లాహ్ మనందరికీ ఈ కర్తవ్యాన్ని నిర్వహించే శక్తి, సద్బుద్ధి ప్రసాదించుగాక!

25. నైతిక రుగ్మతలు

మహాశయులారా!

మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) లేవదీసిన నైతిక విప్లవం ఎంతటి మహత్తరమయిందో మీకందరికీ తెలుసు. ఈ నైతిక విప్లవం మానవుని జీవితపు సమస్త రంగాలను ప్రభావితం చేసింది. అత్యుత్తమ సమాజ నిర్మాణానికి పునాదులేసింది. మానవుల్లో ఇంతటి నైతిక పరివర్తన కలిగించిన ఈ విప్లవం వెనుక ఉన్న శక్తి ఒక్కటే. అదే ఒకే దేవుని ఆరాధన. మనిషి మిథ్యా దేవుళ్ళందర్నీ వదలి సృష్టికర్త, విశ్వపాలకుడు అయిన ఒక్క అల్లాహ్ ఆదేశాలను శిరసావహిస్తే అతని జీవితంలో నీతి రాహిత్యమన్నది మచ్చుకయినా కన్పించదు. అల్లాహ్ తనను విశ్వసించినవారిని ఇలా స్పష్టంగా ఆదేశిస్తున్నాడు-

అల్లాహ్, ఆయన ప్రవక్త మీకు జీవనదాయకమయిన విషయం వైపునకు పిలిచినప్పుడు మీరు దాన్ని విని ఆ సందేశాన్ని అంగీకరించండి. అల్లాహ్, ఆయన ప్రవక్తల హితవుకు వ్యతిరేకంగా మీరు ఇతరుల పిలుపును ఏమాత్రం ఆలకించకండి. మీ వ్యవహారం అల్లాహ్‌తో ముడిపడి ఉంది. ఆయనకు మీ ఆంతర్యాల స్థితి కూడా తెలుసు, మీ ఆలోచనలు, కోరికలు, ఉద్దేశ్యాలు అన్నీ ఆయనకు తెలుసు, ఆయన దగ్గర మీరు ఏదీ దాచలేరు. చివరికి మీరు ఆయన దగ్గరకే మరలిపోవలసి ఉందన్న విషయాన్ని కూడా గుర్తుంచుకోండి. ఆయన నుండి మీరు తప్పించుకొని ఎక్కడికీ పారిపోలేరు, ఆ రోజు తప్పనిసరిగా వస్తుంది. అప్పుడు మీరు ఆయన సమక్షంలో నిలబెట్టబడతారు.

మరో విషయం కూడా గుర్తుంచుకోండి. మీరు ప్రపంచ వాసుల్ని అయితే మోసగించగలరు, బాహ్య వేషాలతో మీరు గొప్ప భక్తులుగా, ఎంతో మంచివారుగా కన్పించి వారిని నమ్మించగలరు. కాని అల్లాహ్ మీ ఆంతర్యాలను గమనిస్తాడు. ఆయన దగ్గర మీరు సంకల్ప శుద్ధితో చేసే సత్కార్యమే అంగీకరించబడుతుంది. మాటి మాటికి తన ఆంతర్యంలోకి తొంగి చూసుకునేవాడు, ఏది చేసినా దైవ సంతోషం కోసం, దైవ హితవు ప్రకారమే చేసేవారు ఎంతో ధన్యులు.

సోదరులారా!

అల్లాహ్ ఎల్లప్పుడు మంచినే ప్రేమిస్తాడు. ఆయన తన దాసుల్ని చెడుకు దూరంగా ఉంచగోరుతున్నాడు. ఈ ఉద్దేశ్యంతో ఆయన తన ప్రవక్తల్ని పంపాడు. వారి ద్వారా మానవులకు ప్రబోధనా జ్యోతిని ప్రసాదించాడు. అల్లాహ్ ప్రసాదించిన ఈ జ్యోతి

సహాయంతో సరయిన జీవన గమ్యాన్ని ఎన్నుకున్నవాడే నిజానికి అదృష్టవంతుడు. కాని కొందరు ఈ ప్రబోధనా జ్యోతి వైపు కన్నెత్తి కూడా చూడరు. వీరు తమ కీడుని తామే చేజేతులా కొనితెచ్చుకుంటారు. ఇంతకంటే దురదృష్టం మరొకటి లేదు.

సోదరులారా!

అల్లాహ్ అవతరింపజేసిన ప్రబోధనను నిరాకరించినవారు రెండు విధాలుగా నష్టపోతారు. ఒకటి, మరణానంతరం పరలోకంలో తీవ్రమయిన శిక్షలతో వ్యధాభరిత మయిన జీవితాన్ని చవిచూస్తారు. రెండు, ఇహలోకంలో కూడా వారు అనేక ఉపద్రవాలకు లోనవుతారు. అశాంతి, అలజడులు, అపనమ్మకం, రక్తపాతం, స్వార్థం, దోపిడి, దౌర్జన్యాలు - ఒకటేమిటి, రకరకాల ఉపద్రవాలు దైవ ప్రబోధనను విస్మరించిన ఫలితంగానే వచ్చిపడతాయి. తిరిగి ఈ ఉపద్రవాలు ఓ మహమ్మారిలా వ్యాపించిపోయి మానవుని ప్రాపంచిక జీవితం కూడా నరకప్రాయమవుతుంది. ఈ కల్లోలం ఎంతగా వ్యాపిస్తుందంటే దాన్నుంచి కల్లోలానికి కారకులయినవారు మాత్రమే గురికారు. వారి చెడు చేష్టల్ని సహిస్తూ వారితో కలిసిమెలసి ఉండేవారు కూడా ఈ ఘోర విపత్తుకు గురికాక తప్పదు.

చెడుల వల్ల కలిగే అనర్థాలను గమనిస్తే చెడులకు, కంపుకొట్టే మురికికి పెద్దగా తేడా లేదనిపిస్తుంది. కంపుకొట్టే మురికి ద్వారా భయంకరమయిన అంటువ్యాధులు వ్యాపిస్తాయి. అలాగే చెడులు సమాజంలో ఎన్నో ఉపద్రవాలను సృష్టిస్తాయి. మురికి ఇద్దరు ముగ్గురికే పరిమితంగా ఉన్నప్పుడు దాని వల్ల వ్యాపించే అంటు వ్యాధి కూడా పరిమితంగానే ఉంటుంది. అంటే ఈ వ్యాధి ఆ ఇద్దరు ముగ్గురిలోనే ఉంటుందన్న మాట, అయితే మురికి నాలుగు వైపులా బాగా వ్యాపించిందనుకోండి. దాన్ని శుభ్రపరచాలనే విషయాన్ని కూడా ఎవరూ పట్టించుకోలేదనుకోండి. అప్పుడేమవుతుంది? ఆ దుర్గంధం ఏదో ఒక అంటు రోగాన్ని తెచ్చిపెడుతుంది. అప్పుడు చూడండి, పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉండదలచేవాళ్ళు కూడా ఈ మహమ్మారి వాతన పడతారు, ఎందుకంటే వీళ్ళు ఆ మురికిని తొలగించకుండా చూస్తూ ఊరుకున్నారు.

చెడుల విషయం కూడా ఇలాగే ఉంటుంది. మొదట్లో ఈ చెడులు చాలా తక్కువగా ఉన్నప్పుడు సమాజంలోని సజ్జనులు, సంఘ శ్రేయోభిలాషులు వాటిని నిరోధిస్తున్నంత వరకూ అవి అణిగి ఉంటాయి. కొత్త చెడులు తలెత్తే అవకాశం కూడా ఉండదు. సమాజం యొక్క సాధారణ వాతావరణం నీతి, నిజాయితి, న్యాయాలతో నిండి ఉంటుంది. అయితే సమాజంలో చెడుల్ని నివారించే శక్తి తగ్గిపోయినప్పుడు, మంచిని ప్రేమించేవాళ్ళు చెడుల్ని అరికట్టేందుకు ముందుకు రానప్పుడు పరిస్థితి

క్రమేణా విషమిస్తుంది. దుర్మార్గులు, దౌర్జన్యపరులు, నీతి విహీనులు, మోసగాళ్ళు, అశ్లీలపరులు విచ్చలవిడిగా ప్రవర్తిస్తూ చెడుల్ని వ్యాపింపజేస్తారు. మంచివాళ్ళు సమాజంలోని చెడుల్ని గురించి పట్టించుకోకుండా తమల్ని తాము సంస్కరించుకుంటే చాలనుకుంటారు. అయితే కొంత కాలానికి వారు కూడా చెడ్డవాళ్ల ప్రభావానికి గురయి ఒక్కొక్క చెడును అవలంబిస్తూ పోతారు, చివరికి మొత్తం సమాజమే పతనావస్థలో కూరుకుపోతుంది. మంచి అన్నది నామ మాత్రంగా మిగిలిపోతుంది.

ఇలాంటి పరిస్థితి రాకముందే మోమిన్ మేల్కొని తన స్థానం ఏమిటో గుర్తించాలని అల్లాహ్ ఆదేశిస్తున్నాడు. అసలు మంచిని పెంచడానికి, చెడుల్ని త్రుంచడానికే అల్లాహ్ ముస్లిము సమాజాన్ని ఎన్నుకున్నాడు. ఈ మహా కార్యం కోసమే ఆయన ముస్లిమ్‌లను పిలుస్తున్నాడు. కాబట్టి ఈ పిలుపును అందుకొని అందరూ కలసి ప్రపంచంలోని చెడులన్నిటినీ తుడిచిపెట్టాలి. ఇదే వీరికప్పగించబడిన పని. ఈ పని చెయ్యకపోతే వీరు వ్యక్తిగత స్థాయిలోనూ సాఫల్యం పొందలేరు. సామూహిక స్థాయిలోనూ ప్రగతి సాధించలేరు. వీరే గనక ఈ పని చేపట్టి గట్టిగా కృషి చేస్తే స్వయంగా వీరు సాఫల్యం పొందడమే కాకుండా, దానివల్ల ఇతరులు కూడా ప్రయోజనం పొందగలుగుతారు. ఒకవేళ వీరు బాధ్యతను నెరవేర్చకుండా తమకేమీ పట్టనట్లు కూర్చుంటే చెడులు వారి చుట్టూ ప్రబలుతాయి. వాటిని కూడా వీరు సహిస్తూ ఉంటే ఈ చెడులు ఇంకా వ్యాపించిపోయి మొత్తం సమాజాన్ని విషపూరితం చేస్తాయి. అప్పుడీ ఉపద్రవం నుంచి ముస్లిమ్‌లు కూడా తప్పించుకోలేరు. వ్యక్తిగతంగా వీరు ఎంత పవిత్ర జీవితం గడుపుతున్నా, తమ వ్యక్తిగతమయిన భక్తి పరాయణత, సదాచార సంపత్తుల పట్ల ఎంత సంతృప్తిపడినా సరే వీరీ ఉపద్రవం నుంచి దూరంగా పారిపోలేరు.

సోదరులారా!

ఈనాడు మనం దాదాపు ఇదే పరిస్థితిలో చిక్కుకొని ఉన్నాం. చెడులు మన చుట్టూ వ్యాపించి ఉన్నాయి. ఫలానా చోట చెడు లేదు అనడానికి వీలు లేనంత విస్తృతంగా చెడులు నేడు ప్రపంచంలో ప్రబలిపోయి ఉన్నాయి. వాణిజ్య రంగంలో బ్లాక్ మార్కెటింగ్, స్మగ్లింగ్, మోసం సర్వసామాన్యమయిపోయాయి. పాలనా యంత్రాంగంలో అవినీతి కుళ్ళి కంపుకొడుతోంది. సమాజంలో దోపిడి, దౌర్జన్యం, నీతిబాహ్యతలు వికటాట్టహాసం చేస్తున్నాయి. రాజకీయాల్లో దగా, వంచన, అవకాశ వాదాలు కదం తొక్కుతున్నాయి. ఇలా ఎక్కడ ఏ రంగంలో చూసినా ఏదో ఒక చెడు తప్పనిసరిగా కనిపిస్తుంది.

సమాజంలో ఇన్ని చెడులు వ్యాపించాయంటే దానికి బాధ్యులు ముస్లిములే. వీరు చెడుల్ని అరికట్టే బాధ్యతను విస్మరించారు. వీరు తమ ధార్మిక విధుల్ని

నిర్వర్తించడంలో చాలా అలక్ష్యం చూపారు. పరిస్థితుల ఈ స్వరూపం ఇలాగే కొనసాగితే కొంత కాలానికి దాని పరిణామాలు మరీ ఘోరంగా మార్తాయి. ముస్లిములు తమ కర్తవ్యాన్ని విడిచిపెట్టడం వల్ల కలిగే దుష్ఫలితాలు చూడండి - ఒకటి, సమాజం పూర్తిగా నైతిక రుగ్మతలతో నిండి చావుకు సమీపంలో నిలబడిన రోగిలా మారుతుంది. రెండు, సమాజం ఈ స్థితికి దిగజారే వరకూ అజాగ్రత్త వహించిన ముస్లిములు తుది దినంనాడు దైవ న్యాయస్థానంలో పరమ దోషులుగా నిలబడవలసి వస్తుంది. అప్పుడు ఎంత పశ్చాత్తాపం పడినా లాభం ఉండదు.

కాబట్టి సోదరులారా! అలాంటి దుస్థితి రాకమునుపే మనం కళ్ళు తెరవాలి. ప్రతి వ్యక్తికి దేవుడు కొద్దో గొప్పో శక్తి సామర్థ్యాలు ప్రసాదించాడు. వాటిని బట్టి అతను తన కార్యాచరణ పరిధిని ఎన్నుకోవాలి. తన ఇంటిలో, బంధుమిత్రుల్లో, తన వాడలో, ఊళ్ళో తన శక్తి సామర్థ్యాలను ఉపయోగించి, వీలయినంత వరకు తన బాధ్యతను నిర్వహించాలి. ఇలాంటి వాళ్ళంతా పరస్పరం కలసిమెలసి కృషి చేస్తే వ్యక్తిగత స్థాయిలో చేసే పని కంటే అనేక రెట్లు అధికంగా చేయగలరు. ఎందుకంటే సామూహికంగా చేసే పనికి దేవుని తోడ్పాటు లభిస్తుంది. దైవ సహాయానికి మించిన శక్తి ఏముంటుంది? ప్రతి పనీ సామూహికంగా చేయవలసిన బాధ్యత కూడా మనపై ఉంది. ముఖ్యంగా మంచిని పెంచే, చెడుని త్రుంచే పనిలో ఈ బాధ్యత మరీ గురుతరమయింది. సామూహిక శక్తికి దైవ సహాయం తోడయితే సాధ్యం కానిదేముంది? దైవం మనకందరికీ తనకిష్టమయిన పనులు చేసే సద్బుద్ధిని ప్రసాదించుగాక!

26. అమానత్

మహాశయులారా!

ఏ జాతిలోగాని, సమాజంలోగాని నిజాయితీ, నమ్మకం అనే సద్గుణాలు సర్వ సామాన్యం కాకపోతే ఆ జాతి లేదా సమాజం ఎన్నటికీ ప్రగతికి నోచుకోలేదు. మానవులంతా ఒక రోజు తన యజమాని, పాలకుడయిన అల్లాహ్ సమక్షంలో హాజరు కావలసి ఉంటుందని, అక్కడ తమ యావజ్జీవితానికి సంబంధించిన లెక్క చూపవలసి ఉంటుందని ముస్లిమ్‌లు విశ్వసిస్తారు. ఈ విశ్వాస ఫలితంగానే నిజాయితీ ముస్లిమ్ సమాజపు ప్రత్యేక లక్షణంగా అలరారింది. కాని ఈనాడు మన పరిస్థితి ఏమిటి? కాగడా పెట్టి వెతికినా ఈసద్గుణం కనిపించడం కష్టమైపోయింది. సాధారణంగా స్నేహితునిపై స్నేహితునికి, భార్యపై భర్తకు, సంతానంపై తండ్రికి నమ్మకం లేకుండాపోయింది. దీనికి మూల కారణం ఒక్కటే. మన విశ్వాసం బలహీనమయిపోయింది. ఈ విశ్వాస బలహీనతవల్ల మనలో నిజాయితీ కూడా లోపించింది.

అమానత్ లేదా నిజాయితీ అంటే, ఒక వ్యక్తి ఇతరుల దగ్గర తన ధనాన్నో లేక వస్తువునో ఉంచితే అతను దాన్ని భద్రపరచి తిరిగి అడిగినప్పుడు యజమానికి అప్పగించడమే కదా అని భావిస్తారు చాలా మంది. కాని అమానత్ అనే పదానికి విస్తృత భావం ఉంది. దివ్యఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా పేర్కొన్నాడు:

"మేము ఆకాశాలు, భూమి, పర్వతాలపై అమానత్ భారాన్ని ఉంచదలచినపుడు అవి దీన్ని మోయడానికి నిరాకరించాయి. దీనికి భయపడ్డాయి. అయితే మానవుడు దీన్ని ఎత్తుకున్నాడు."

ఇక్కడ 'అమానత్' అంటే అర్థం సామాన్యంగా ప్రజలు చెప్పుకునే అమానత్ కాకపోవచ్చు. కాని దానికంటే ఎంతో విస్తృతమైన అర్థం ఇందులో ఇమిడి ఉంది. ఇక్కడ అల్లాహ్ ఆదేశాలను శిరసావహించి ఆయన అభీష్టానికి అనుగుణమయిన జీవితాన్ని గడిపేందుకు స్వీకరించే బాధ్యతా భారాన్ని అమానత్‌గా వర్ణించడం జరిగింది. ఈ బాధ్యతా భారాన్ని మోయడానికి భూమ్యాకాల్లో దేనికీ లేని శక్తిని దేవుడు మానవునికి ప్రసాదించాడు. దీనితోపాటు అల్లాహ్ ఇతనికి స్వయం నిర్ణయాధికారం, విషయ స్వీకార స్వేచ్ఛ, మంచీ చెడుల విచక్షణా జ్ఞానం, ప్రకృతి రహస్యాలను ఛేదించి వాటిని వినియోగించుకునే తెలివితేటల్ని కూడా ఇచ్చాడు. మానవుడు కోరితే ఈ 'అమానత్'కు సంబంధించిన బాధ్యతల్ని నిర్వహించవచ్చు. లేదా దీన్ని తిరస్కరించి తన ఇష్టమొచ్చినట్లు

వ్యవహరించవచ్చు - ఇలాంటి అవకాశాలు అతని జీవితంలో అడుగడుగునా వస్తుంటాయి.

సోదరులారా!

మానవుడు ప్రపంచంలోని ఏ వస్తువునూ సృష్టించలేదు. వాటన్నిటికీ సృష్టికర్త, యజమాని అల్లాహ్ మాత్రమే. చివరికి మానవుడు తన ఆత్మకు, శరీరానిక్కూడా యజమాని కాడు. ఇవన్నీ దైవం ఇతనికి 'అమానత్'గా అనుగ్రహించినవే. ఉదాహరణకు మానవుడి మేధ, బుద్ధి దైవం తరపున ఇవ్వబడిన అమానత్‌లు. మానవుడు వీటిని అల్లాహ్ అభీష్టం ప్రకారం వినియోగిస్తే ఈ పని అమానత్ ప్రకారం జరిగినట్లవుతుంది. ఒకవేళ అతను అల్లాహ్ అభీష్టానికి వ్యతిరేకంగా దాన్ని తన ఇష్టమొచ్చినట్లు వినియోగిస్తే అది విశ్వాస ఘాతుకం అవుతుంది.

మన సంతానం కూడా అల్లాహ్ అమానతే. కనుక వాళ్ళను పెంచి, పోషించి, సరైన శిక్షణ నివ్వడం మన విధి. ముఖ్యంగా అల్లాహ్ అభీష్టం ప్రకారం జీవించడానికి వీలుగా వారిని ధార్మికంగా తీర్చిదిద్దాలి. ఒకవేళ మన అజాగ్రత్త, అలక్ష్యాల మూలంగా వారు దైవాగ్రహానికి గురై, నరకాగ్నికి ఇంధనంగా మారితే దైవమిచ్చిన ఈ అమానత్ విషయంలో మనం విశ్వాస ఘాతుకానికి పాల్పడినట్లవుతుంది. అందుకే అల్లాహ్ దివ్యఖుర్ఆన్‌లో, "ఓ ముస్లిమ్‌లారా! మిమ్మల్ని మీరు, మీ ఇంటి వాళ్ళను నరకాగ్ని నుండి కాపాడుకోండి" అని స్పష్టంగా ఆదేశిస్తున్నాడు.

సోదరులారా!

మనలో ప్రతి వ్యక్తికీ అల్లాహ్ ఏదో ఒక రంగంలో పని చేయగల శక్తిని ప్రసాదించాడు. ఒకతనికి ఊరు మొత్తం మీద పలుకుబడి ఉంటుంది. అంటే ఆ ఊరి ప్రజలందరిలో అతని మాట చెల్లుబాటవుతుందన్న మాట. అలాగే మరొకతనికి తన బంధువర్గంలో ఎక్కువ పలుకుబడి ఉంటుంది. ఇంకొకతను తన కుటుంబ సభ్యులపై పెత్తనం చెలాయించగలడు, కొందరికి తమ పరిచయస్తులలో పలుకుబడి ఉంటుంది. దైవం ప్రసాదించిన ఈ పరపతి, పలుకుబడులు కూడా అమానతే. కాబట్టి ఈ అమానత్ విషయంలో కూడా మనం దేవుని సమక్షంలో జవాబు చెప్పుకోవలసి ఉంటుంది.

మహాప్రవక్త (సఅసం) అన్నారు : "మీలోని ప్రతి వ్యక్తి ఏదో ఒక పరిధిలో బాధ్యతాయుతుడుగా, కాపలాదారుడిగా ఉన్నాడు. మీలోని ప్రతి వ్యక్తినీ అతని అధీనంలో ఇవ్వబడిన వాళ్ళను గురించి ప్రశ్నించడం జరుగుతుంది." అందువల్ల మనం మన పలుకుబడిని, అధికారాన్ని వినియోగించి ప్రజల్ని సంస్కరించడానికి ప్రయత్నించాలి. అలా చేయకపోతే మనకు దైవం ప్రసాదించిన పలుకుబడి, అధికారం

అనే అమానత్ విషయంలో విశ్వాస ఘాతుకం చేసినట్లవుతుంది. ఈ తప్పిదానికి పర్యవసానం అనుభవించవలసి వస్తుంది.

ఇదే విధంగా దేశ పాలకులు కూడా అల్లాహ్ తరపున ఇవ్వబడిన ఒక పెద్ద అమానత్‌కు బాధ్యతాయుతులవుతారు. వారికి ప్రసాదించబడిన పాలనాధికారం ఒక అమానత్. వారి అధీనంలో ఇవ్వబడిన దేశ ప్రజలు కూడా అమానతే. పాలకుడు దైవ సమక్షంలో తన వ్యక్తిగత వ్యవహారాలు, విశ్వాసాల విషయంలో ఎలా ప్రశ్నించబడతాడో, పరిపాలన, ప్రజల వ్యవహారాల విషయంలో కూడా అలాగే ప్రశ్నించబడతాడు. ప్రజల హక్కుల్ని నెరవేర్చడానికి, వాళ్ళ మధ్య న్యాయం నెలకొల్పడానికి, వాళ్ళను తప్పుడు మార్గాల నుండి తీసి మంచి మార్గాన నడిపించడానికి నీవు చేసిన కృషి ఏమిటి? అని అతడ్ని అక్కడ ప్రశ్నించడం జరుగుతుంది. అల్లాహ్ యొక్క ఈ అమానత్‌ని కాపాడటానికి బదులు స్వయంగా పాలకుడే ప్రజలకు అన్యాయం చేసి వారి హక్కుల్ని కాలరాస్తే, వాళ్ళను దుర్మార్గం, దైవతిరస్కారం, నీతి బాహ్యతలకై ప్రేరేపిస్తే, అతనిని మించిన విశ్వాస ఘాతకుడు ప్రపంచంలో మరెవరూ ఉండరు.

ఇదే విధంగా ధర్మజ్ఞానం ప్రసాదించబడిన వాళ్ళ విషయం కూడా ఆలోచించవచ్చు. కొద్దో గొప్పో విద్యాగంధం సంపాదించినవారు తమ విద్యా సామర్థ్యంతో దైవ రాహిత్యం, మిథ్యావాదాలకు వ్యతిరేకంగా పోరాడుతూ, ధర్మం అంటే ఏమిటో తెలియనివారికి దైవ సందేశాన్ని అందజేస్తూ, దైవ ధర్మాన్ని కాపాడుతూ ఉండాలి. అప్పుడే అతను తనపై మోపబడిన జ్ఞానం అనే అమానత్ బాధ్యతను నిర్వహించినవాడవుతాడు. ఈ బాధ్యతను నిర్వహించకపోతే అతను కూడా విశ్వాసఘాతుల జాబితాలోకి చేరి దాని దుష్ఫలితం అనుభవించవలసి వస్తుంది.

మన రచనా సామర్థ్యం, మన ప్రసంగ సామర్థ్యం, మన ఆలోచనా శక్తి తెలివితేటలు - ఒకటేమిటి అన్ని శక్తి సామర్థ్యాలూ అల్లాహ్ యొక్క అమానత్‌లే. వీటిలో ఏ ఒక్కదాన్ని కూడా అల్లాహ్ అభిమతానికి వ్యతిరేకంగా ఉపయోగించకుండా జాగ్రత్త వహించడం మన విధి.

ఇదే విధంగా మన దగ్గర ఉన్న ధనం కూడా అమానతే. దైవం ప్రసాదించిన ఈ అమానత్‌ని మన సంబంధీకుల ధర్మ సమ్మతమయిన అవసరాల కోసం ఖర్చు పెట్టాలి. అవసరానికి మించి ఉంటే పుణ్య కార్యాల కోసం వెచ్చించాలి. ఇలా చేయడం మన విధి. ఈ విధిని నిర్వర్తించకపోతే రేపు అల్లాహ్ ముందు ఒక్కొక్క పైసా గురించి లెక్క చెప్పుకోవలసి వస్తుంది.

సోదరులారా!

అమానత్ అంటే ఏమిటో వివరంగా తెలుసుకున్నారు. కాని ఈనాడు మన

ముస్లిమ్ సోదరుల పరిస్థితి ఎంతో శోచనీయంగా ఉంది. ఎందరో పండితులు, ధర్మవేత్తలు తమకు లభించిన ధర్మజ్ఞానాన్ని తోటి మానవులకు అందజేయడమే మానుకున్నారు. కొందరయితే వాదోపవాదాల్లో వినియోగిస్తూ అసలు కర్తవ్యాన్ని విస్మరించారు. మరికొందరు క్షుద్ర లాభాల కోసం దాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. పాలకుల పరిస్థితి కూడా అంతే. వారు తమ అధికారాన్ని నీతి, న్యాయం కోసం ఉపయోగించడానికి బదులుగా కీర్తిప్రతిష్ఠలు సంపాదించడానికి, భోగభాగ్యాల్లో తేలాడటానికి ఉపయోగించుకుంటున్నారు.

ధనవంతుల సంగతికొస్తే, వారు తమ దగ్గరున్న ధనం దేవుని అమానత్ అన్న విషయమే మరచిపోయారు. ఫలితంగా వారిలో కొందరు పరమ పిసినారులయి డబ్బుకూడబెడుతుంటే, మరికొందరు పేరు ప్రతిష్ఠల కోసం వృధా కార్యాల్లో కూడా వేలు, లక్షలు ఖర్చుపెట్టి దుబారా చేస్తున్నారు.

అలాగే తల్లిదండ్రులు తమకు అల్లాహ్ అమానత్‌గా ఇచ్చిన సంతానానికి సరయిన శిక్షణ ఇవ్వకుండా విచ్చలవిడిగా వదిలేస్తున్నారు. ధనార్జన కోసం వేలు ఖర్చుపెట్టి ప్రాపంచిక చదువులు చదివిస్తున్నారు కాని, వాళ్ళను ధర్మవంతులుగా, సత్పౌరులుగా తీర్చిదిద్దడానికి కనీసం ఆసక్తి అయినా చూపడం లేదు. విచారకరమయిన విషయం ఏమిటంటే పండితులు, ధర్మవేత్తలు అనబడే వాళ్ళు సయితం తమ పిల్లల శిక్షణ పట్ల శ్రద్ధ వహించడం లేదు. భార్య విషయంలో - ఆమె పరదా పాటించకపోయినా, నమాజ్ చేయకపోయినా, పండుగలు, పెళ్ళిళ్ళ సందర్భాల్లో పనికిమాలిన ఆచారాలు పాటించినా వీళ్ళు చూస్తూ ఊరుకుంటారు. అందువల్లనే పెద్ద పెద్ద పండితుల కుటుంబాల్లో సయితం నాస్తికులు, ప్రపంచ పూజారులు పుడుతున్నారు.

సోదరులారా!

ఈ స్థితి నుండి బయటపడాలంటే మొదట మనం ఆత్మ పరిశీలన చేసుకోవాలి. తరువాత మనలోని ప్రతి వ్యక్తి తనకున్న శక్తి సామర్థ్యాలు, అధికారం పలుకుబడులతో ఇక నుంచి తోటి మానవుల్ని సంస్కరించడానికి పూనుకుంటానని గట్టి నిర్ణయం తీసుకోవాలి. వివిధ రూపాల్లో దైవం మన కప్పగించిన అమానత్ బాధ్యతల్ని నిర్వహించడానికి శక్తి వంచన లేకుండా ప్రయత్నించాలి.

27. ధన వ్యామోహం

మహాశయులారా!

ఈనాడు మన సమాజం దోపిడి, దౌర్జన్యం, దగా, మోసం, అవినీతి అక్రమాలతో నిండిపోయింది. వీటిని దూరం చేయడానికి ప్రయత్నించేవాళ్ళు తమకు తోచిన విధంగా రకరకాల పద్ధతుల్ని అనుసరిస్తున్నారు. అసలీ చెడులకు మూల కారణం గురించి మన సమాజంలోనే ఒక తప్పుడు అభిప్రాయం ఏర్పడిఉంది. చెడులకు మూలం ఆర్థికంగా వెనుకబడినతనమే అనంటారు చాలా మంది. ఇది దూరమయితే చాలు, అంతా సవ్యంగా సాగిపోతుందని అభిప్రాయపడ్డారు వీరు. ఈ తప్పుడు అభిప్రాయం ఫలితంగానే ఏ విధంగానయినా సరే వీలయినంత ఎక్కువ డబ్బు సంపాదించాలని, సంపాదించిన డబ్బును కూడ బెట్టడమో లేదా ఇష్టమొచ్చినట్లు విచ్చలవిడిగా ఖర్చు పెట్టడమో చెయ్యాలని ప్రజల్లో ఒక తప్పుడు ఆలోచన సర్వసామాన్య మయి పోయింది.

ఈ ఆలోచనా విధానం వెనుక ఉన్న ఉద్దేశ్యం ఏమిటో కాస్త జాగ్రత్తగా ఆలోచిస్తే మనకు రెండు విషయాలు తెలుస్తాయి. ఒకటి, డబ్బు పట్ల విపరీతమయిన ప్రేమ, వ్యామోహం కలిగి ఉండటం. రెండు, అవసరానికి మించిన కోరికల్ని తీర్చుకోవడానికి డబ్బు ఖర్చుపెట్టడం. మానవ మేధకు పట్టుకున్న ఈ జబ్బు ఈనాడు కొత్తదేమీ కాదు. షైతాన్ ఎల్లప్పుడూ ఈ రెండు దృక్పాధాల ద్వారానే దైవం ప్రసాదించిన వరాలను మానవుల చేత తప్పుడు మార్గాల్లో వినియోగింపజేస్తున్నాడు.

ఈ దుర్మార్గుడు, మనిషి మెదడులో దూరి, "నువ్వు వీలైనంత ఎక్కువగా డబ్బు సంపాదించకపోతే, ధర్మం అధర్మం, పాపం పుణ్యం అంటూ కూర్చుంటే వెనకబడిపోతావు. అభివృద్ధి చెందుతున్న జాతుల వైపు చూడు, అవి ఆర్థిక అభివృద్ధిలో ఎలా పురోగమిస్తున్నాయో" అంటూ మభ్యపెడతాడు. డబ్బు రావడం ప్రారంభం కాగానే " ఇక దాన్ని కూడబెడుతూ కోటికి పడగలెత్తు. లేదా ఇష్టమొచ్చినట్లు ఖర్చుచేసి నీ కోరికలన్నిటినీ తీర్చుకో. భోగభాగ్యాల్లో తేలిపో. ఇంకా ప్రపంచంలో పేరు ప్రఖ్యాతులు వచ్చే పనులేమయినా ఉంటే వాటి కోసం ఖర్చుచెయ్యి. అంతేగాని, పుణ్యకార్యాలంటూ దరిద్రులకు, ధర్మసంస్థలకు దానం చేసి నీ కష్టార్జితాన్ని అనవసరంగా తగలెట్టుకోకు" అని ఉపదేశిస్తాడు, "అలా చేస్తే నువ్వు పేదవాడివయి పోతావు. రేపొకవేళ ఏదయినా ఆపద వస్తే నిన్నెవరూ ఆదుకోరు. ముందు నీ సంగతి చూసుకో, నీ భవిష్యత్తును గురించి ఆలోచించుకో. రోగమొచ్చినప్పుడయినా, ముసలితనం వచ్చినప్పుడయినా ఇప్పుడు నువ్వు కూడబెట్టుకున్న డబ్బే కదా నిన్ను కాపాడగలిగేది?" అంటూ వాడు మనిషిలో లేనిపోని భయాన్ని సృష్టిస్తాడు.

షైతాన్ ఇలా మనిషి మనస్సులో తిష్ఠవేసి కూర్చుంటే, ఇక ఆ మనిషి ఏ సత్కార్యానికి డబ్బు ఖర్చుపెడతాడు? ఈ ఆలోచనా ధోరణి ఎంత ప్రమాదకరమయిందో చూశారా? ముఖ్యంగా ఏదయినా సత్కార్యం కోసం డబ్బు ఖర్చుపెట్టాల్సి వచ్చినప్పుడు మనిషి ఇలా ఆలోచిస్తాడు. కొన్ని సందర్భాల్లో ఎంతో పొదుపరి, దూరదృష్టి కలవారిలా కనిపించేవాళ్ళు సైతం తమకు నచ్చిన పనుల కోసమయితే విచ్చలవిడిగా ఖర్చుచేస్తారు. ఇలాంటి దూరదృష్టి కలవాళ్ళే షైతాన్ వలలో చిక్కుకొని పనికిమాలిన పద్దుల్లో డబ్బును మంచి నీళ్ళలా ఖర్చుపెడతారు. ప్రమాదకరమయిన ఈ ధోరణిని గురించే అల్లాహ్ మానవుల్ని హెచ్చరిస్తూ అన్నాడు: "షైతాన్ చర్యల పట్ల జాగ్రత్తగా ఉండండి. వాడు మీ మనస్సును చెడగొట్టడానికి అనుక్షణం మీ వెనుకే కాచుకొని ఉన్నాడు. డబ్బు కూడబెట్టుకోకపోతే ఇతరుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడవలసి వస్తుందని వాడు మిమ్మల్ని రకరకాలుగా భయపెడతాడు. అంతటితో ఊరుకోడు; విలాసవంతమయిన జీవితం గడపడానికి, దుబారా ఖర్చుచేయడానికి వాడు మీకు కొత్త కొత్త మార్గాలను చూపిస్తాడు. వాడి పంజాలో చిక్కుకున్నవాళ్ళు మనోవాంఛల్ని తీర్చుకోవడానికయితే వేలాది రూపాయలు ఖర్చుపెడతారు, కాని అగత్యపరునికి ఒక పూట కూడు పెట్టాలంటే విలవిల్లాడిపోతారు."

సోదరులారా!

ఇదీ నేడు మన సమాజంలో పాతుకుపోయిన ఒక పెద్ద చెడు. మనలో అనేక మంది హృదయాల్లో షైతాన్ కూర్చుని ఉన్నాడు. మీరిలా చేయకపోతే ఇతర జాతుల్లా ప్రగతి సాధించలేరని, ఫలానా ఫలానా పనుల కోసం డబ్బు ఖర్చుచేస్తే మీరు వట్టి చేతులతో ఉండవలసివస్తుందని వాడు మనల్ని భయపెడతాడు. మరో వైపు వాడు దుబారా ఖర్చు కోసం మనల్ని పురికొల్పుతాడు, ఫలానా పని కోసం డబ్బు ఖర్చుపెడితే ప్రపంచంలో మీ పేరు చిరస్థాయిగా ఉంటుందని ఆశలు కల్పిస్తాడు.

షైతాన్ మనిషిలో ముఖ్యంగా దారిద్ర్యభయాన్ని కలిగిస్తాడు. ఈ దారిద్ర్య భయం విభిన్న రూపాల్లో ఉంటుంది. వెనకటి రోజుల్లో ప్రజలు తమ సంతానాన్ని హతమార్చేవారని మీరు విని ఉంటారు, దీనిక్కారణం,వారిలో షైతాన్ దారిద్ర్యభయాన్ని కలిగించడమే. తమ ఉపాధిలో పిల్లలు కూడా భాగస్తులయితే తమకు లభించే సుఖసంతోషాలు తరగిపోతాయని, ఆర్థికంగా బాగా దెబ్బ తింటామని వారు భావించేవారు. ఇలా పిల్లల మూలంగా తాము ఆర్థిక ఇబ్బందులకు గురి కావడం వారు సహించేవాళ్ళు కాదు. ఈ దారిద్ర్య భయం ఈనాడూ ప్రజల హృదయాలను పట్టి పీడిస్తోంది. కాకపోతే ఇప్పుడు రూపం, పేరు మాత్రమే మారాయి. పూర్వకాలంలో ప్రజలకు పుట్టక ముందే

పిల్లల్ని హతమార్చే తెలివితేటలు లేకపోయాయి. అందువల్ల పుట్టిన తరువాతనే వారు పిల్లల్ని చంపే పద్ధతుల్ని కనిపెట్టారు. ఇప్పుడు కూడా ఆర్థిక ఇబ్బందుల భయమే ప్రజల్ని పట్టుకుంది. జనాభా ఇలా పెరిగిపోతూ ఉంటే తిండి ఎక్కణ్నుంచి వస్తుంది అని షైతాన్ వాళ్ళను భయపెడుతున్నాడు. పూర్వం శిశు హత్యే అనేవాళ్ళు. ఈకాలంలో తెలివిగలవాళ్ళు దాన్ని కుటుంబ నియంత్రణ అనే అందమయిన పేరు పెట్టి పిలుస్తున్నారు. రెండింటిలోనూ దాగి ఉన్న ఉద్దేశ్యం ఒక్కటే. పిలిచే ధోరణి మాత్రం మారింది అంతే. ఈనాటి కుటుంబ నియంత్రణ విషయంలో మానవుని ఆంతర్యం ఏమిటో కాస్త విశ్లేషించి చూడండి. దాని వెనుక స్వార్థంతో కూడుకున్న విలాసమయ జీవితం గడపాలన్న వాంఛ తొంగి చూస్తోంది. అంతకంటే ఘోరం అందులో నీతిబాహ్యమైన చేష్టలకై షైతాన్ ప్రేరణ కూడా ఉంది. ఈవిషయంలో ఇంకా లోతుగా ఆలోచిస్తే ఈ రెండు భావాలు రకరకాల రూపాల్లో అనేక చెడులకు దారి తీస్తున్నట్లు గ్రహిస్తారు.

షైతాన్ మానవుణ్ని ఒకవైపు పేదరికం గురించి భయపెడుతూ, మరో వైపు నీతిబాహ్యమయిన చేష్టలకై పురికొల్పుతుంటాడు. కాని వాడి చెడు చేష్టలకు భిన్నంగా అల్లాహ్ మానవులకు ఎలాంటి మార్గదర్శకం చేస్తున్నాడో చూడండి. మీరు సంపాదించేదంతా ధర్మ సంపాదనయి ఉండాలి. అలా కాకుండా ఇతరుల హక్కుల్ని కాజేసిగాని లేదా ఇతరుల్ని మోసగించిగాని సంపాదిస్తే అలాంటి సంపాదన వల్ల ఒక వ్యక్తి జేబు నిండవచ్చు. కాని, సామూహిక శ్రేయానికి, మొత్తం జాతి ప్రయోజనాలకు ఈ వైఖరే ఆర్థిక సంక్షోభానికి దారితీస్తుందని అల్లాహ్ మనకు బోధిస్తున్నాడు; ఒక జాతి యొక్క ఆర్థిక వ్యవహారాల్లో ఈ పరిస్థితి ఉన్నంత వరకూ దాని సమస్యలు ఎన్నటికీ పరిష్కారం కాలేవు. పైపెచ్చు ఒక సమస్యను పరిష్కరించబోతే మరో కొత్త సమస్య పుట్టుకొస్తుంది. మంచీ-చెడు, నీతి-అవినీతి అనే విషయాలను ఖాతరు చేయకుండా ప్రజలు విచ్చలవిడిగా ధనాన్ని సంపాదించడం ప్రారంభిస్తే మొత్తం ఆర్థిక వ్యవస్థే అస్తవ్యస్తమయి అనేక సమస్యలకు ఆలవాలమయి పోతుంది.

ధనాన్ని సంపాదించే విషయంలోనే గాకుండా, దాన్ని ఖర్చుపెట్టే విషయంలో కూడా అల్లాహ్ మనకు మార్గదర్శకత్వం చేస్తున్నాడు. సమాజంలో ప్రజల పరస్పర హక్కులేమిటి? ఎవరిపై ఎవరి హక్కులున్నాయి? అనే స్పృహ గనక ప్రజల్లో లేకపోతే శాసనబలంతో సమానత్వం నెలకొల్పే నాటకాలు ఎన్ని ఆడినా ఆర్థిక సమస్యకు సరయిన పరిష్కారం సాధ్యంకాదు. తీవ్రమయిన జ్వరం వచ్చినప్పుడు మనిషి నుదుటిపై ఓ మంచు గడ్డ పెట్టి ఇక రోగం పూర్తిగా పోయినట్లేనని భావిస్తే రోగం నిజంగా పోతుందా? అచ్చం ఇలాగే ఈనాడు పెద్దపెద్ద ఆర్థిక శాస్త్రవేత్తలు, నిపుణులు బలవంతపు

సమానత్వంతో సమస్యను పరిష్కరించగలమని అనుకుంటున్నారు. కాని సమస్యకు అసలు పరిష్కారం ఇది కాదు. ప్రజలను నైతికంగా తీర్చిదిద్దాలి. ప్రతి వ్యక్తి హృదయంలో ఇతరుల పట్ల ప్రేమ, సానుభూతులు జనించాలి. తన ప్రేమ, సానుభూతులకు ఇతరుల నుండి ఎలాంటి ప్రతిఫలాన్ని ఆశించకూడదు. ఇతరులకేదయినా మేలు చేయదలిస్తే నిస్వార్థ బుద్ధితో, ప్రజల నుండి ఎలాంటి ప్రతిఫలాన్ని ఆశించకుండా చేయాలి. ప్రతిఫలాన్ని దైవం నుండి ఆశించాలి. ఏ సమాజంలోనయితే ఇలాంటి మనస్తత్వం సర్వసామాన్యమవుతుందో ఆ సమాజంలో ఆర్థిక సమస్య అన్నదే కనిపించదు. అక్కడ సహాయం చేసేవాళ్ళేకాని, ఆ సహాయాన్ని స్వీకరించే వాళ్ళు మాత్రం చాలా తక్కువగా కనిపిస్తారు.

సోదరులారా!

ఆర్థిక సమస్యకు ఇస్లామ్ చూపిస్తున్న పరిష్కార మార్గం ఇదే. ప్రజలు నీతి మార్గాల ద్వారా మాత్రమే సంపాదించాలని అది బోధిస్తోంది. అలా సంపాదించిన ధనాన్ని భోగభాగ్యాల కోసం, దుబారా ఖర్చుకోసం ఉపయోగించడానికి బదులుగా పేదలు, అగత్యపరుల పట్ల సానుభూతి వ్యక్తపరచడానికి వినియోగించమని ఆదేశిస్తోంది. మీ మనోవాంఛల్ని అరికట్టి, మీ అవసరాల్ని తగ్గించుకొని దైవమిచ్చిన మీ ధనాన్ని దైవాదేశాల ప్రకారం ఖర్చుచేస్తే, దానికి ప్రతిఫలంగా అల్లాహ్ మీకు అన్నింటికంటే విలువయిన, ఎన్నటికీ తరగని స్వర్గ సౌఖ్యాలను ప్రసాదిస్తాడని ఇస్లామ్ వాగ్దానం చేస్తోంది. దాంతోపాటు ఈ ప్రపంచంలో కూడా అల్లాహ్ మనకు అనేక వరాలను అనుగ్రహిస్తాడు. ఇలాంటి ఆలోచనా వైఖరిని ప్రజలు సామూహికంగా అవలంబించినప్పుడే సామాజిక ప్రయోజనాలు కనిపిస్తాయి. వ్యక్తిగతంగా ఎవరయినా ఈ వైఖరిని అవలంబిస్తే అతను తప్పనిసరిగా పరలోకంలో దైవసంతోషానికి, స్వర్గ సౌఖ్యాలకు అర్హుడవుతాడు, ఇటు ప్రాపంచిక జీవితంలో అతని మనస్సుకు ఏ ధనికుడికి లభించని శాంతీ సంతృప్తులు లభిస్తాయి.

28. గౌరవాభిమానాలకు కొలమానం

మహాశయులారా!

ఈమాన్ అనేది బయటికి కనిపించే వస్తువు కాదు. అది మనిషి అంతరంగంలో దాగి ఉండే ఒక విచిత్ర వస్తువు. ఈమాన్ ఏ స్థాయిలో ఉంది అనే విషయాన్ని మనిషి స్వయంగా తన గురించి కూడా అంచనా వేయలేడు. అయితే అది ఎవరిలో ఏ మేరకు ఉంటుందో కొంతవరకయినా తెలుసుకోవడానికి కొన్ని చిహ్నాలున్నాయి. ఉదాహరణకు మనిషి యొక్క ఆచరణ, అతని అభిరుచులు, అతని నీతి నడవడికలు, అతని ప్రయత్నాల తీరుతెన్నులు మొదలైన వాటిని బట్టి అతని హృదయంలో ఉండే విశ్వాస స్థితిని అంచనా వేయవచ్చు. మన ప్రియ ప్రవక్త (సఅసం) ఇలాంటి అనేక విషయాలను మనకు సూచించారు. వీటి సహాయంతో మనం మన విశ్వాసాన్ని కొలుచు కోవచ్చు. వాటిలో ఒకటి గౌరవాభిమానాలకు సంబంధించిన విషయం. అంటే మన హృదయంలో ఎలాంటి వారి పట్ల ఎక్కువ గౌరవాభిమానాలున్నాయో మనం ఆత్మ పరిశీలన చేసుకోవాలన్న మాట.

సోదరులారా!

ఈనాడు ప్రజల్లో హోదా, అంతస్తు, అధికారం, సిరిసంపదలే గౌరవాభిమానాలకు కొలమానాలయి పోయాయి. మన సమాజంలో దుర్నీతిపరులు అనేకమంది ఉన్నారు. వారు అబద్ధాలాడుతారు, మోసం చేస్తారు, ఇతరుల హక్కుల్ని కాలరాస్తారు. అవినీతి మార్గాల ద్వారా సంపాదిస్తారు. నైతిక నియమాలను ఉల్లంఘిస్తారు. అయినప్పటికీ ప్రజలు వాళ్ళను గౌరవిస్తారు, పొగడ్తారు ప్రతి సమావేశానికి ఆహ్వానిస్తారు, ప్రతి చోటా వాళ్ళే ముందు ముందు కనిపిస్తారు. దీనికి భిన్నంగా నీతి నిజాయితి గల ఒక వ్యక్తి విషయాన్ని తీసుకోండి. అతను సౌశీల్యం, సత్ప్రవర్తన, సద్గుణాలు కలిగిన ఒక మంచి వ్యక్తి. అతను ఎలాంటి నీచానికి పాల్పడడు. కల్లబొల్లి మాటలు పలకడు. కాని పేదవాడు. ఏదో చిన్న దుకాణం పెట్టుకొని పొట్టపోసుకునే వాడు లేదా కూలినాలి చేసుకునే ఓ సామాన్య కార్మికుడు. అతనికి ఆస్తిపాస్తులు ఏమీ లేవు. బంగ్లా, కారు, టీ.వీలు కూడా లేవు. అందువల్ల ప్రజలు అతనివైపు కన్నెత్తి చూడరు; ఏ సమావేశానికీ పిలువరు. ఇదీ నేటి మన ప్రజల స్థితి. మన దగ్గర గౌరవ ప్రతిష్ఠల కొలమానం నీతి, సత్ప్రవర్తనలకు బదులు డబ్బు, హోదా అయిపోయింది.

సోదరులారా!

ఈ ధోరణి ఇస్లాం దృక్పథానికి, దాని బోధనలకే విరుద్ధం. "ఎవరయితే ఒక 'బిద్అత్'కి గౌరవమిచ్చాడో, అతను ఇస్లామ్‌ని అంత మొందించడంలో సహాయ

పడ్డాడు" అని మహాప్రవక్త (సఅసం) బోధించారు. బిద్‌అత్ అంటే మీకు తెలిసే ఉంటుంది. ఇస్లామ్‌కు వ్యతిరేకమయిన లేదా దాంతో పొసగని ఒక కొత్త విషయాన్ని ఇస్లామ్‌లో ప్రవేశపెట్టినవాడిని బిద్అతి అంటారు. మరొక సందర్భంలో దైవప్రవక్త (సఅసం) ప్రజలకు ధర్మాన్ని గురించి బోధిస్తూ, "మునాఫిక్‌ని నాయకుడు అనకండి. ఎందుకంటే అలా అంటే మీరు మీ ప్రభువుకు ఆగ్రహం తెప్పించినట్లే" అన్నారు. మునాఫిఖ్ అంటే కపటం కలిగిన వాడు. మోమిన్‌గా నటించేవాడు. అతను బయటికి మాత్రం ముస్లిమ్‌గానే కనిపిస్తాడు. కాని ఇస్లాం బోధనల విషయమయి అనుమానంలో పడి ఉంటాడు. అతని మాటలకు, చేతలకు పొంతన ఉండదు. ఇలాంటి వ్యక్తిని నాయకుడిగా ఎన్నుకోవద్దని, అలా చేస్తే మీరు అల్లాహ్ అయిష్టతను కొని తెచ్చుకోలసి వస్తుందని ఈ హదీసులో మహా ప్రవక్త (సఅసం) మనల్ని హెచ్చరించారు. మద్యపానం సేవించేవాడు జబ్బుపడితే అతడ్ని ప్రేమపూర్వకంగా పలకరించడానికి వెళ్ళవద్దన్నారు హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅన్). అతన్ని సంస్కరించే ఉద్దేశంతో అతని సేవ చెయ్యడం వేరే విషయం. ఇంకా ఇలాంటి అనేక విషయాలున్నాయి హదీసుల్లో.

వీటిని బట్టి మోమిన్ దృష్టిలో గౌరవాభిమానాల కొలమానం ఏమయి ఉండాలో తెలుస్తోంది, కాబట్టి ఇలాంటి కొలమానం మన హృదయంలో ఉందా లేదా అని మనం ప్రతి క్షణం పరిశీలించుకుంటూ ఉండాలి. ఒకవేళ మన హృదయంలో దైవాన్ని విస్మరించిన వారి పట్ల గౌరవాభిమానాలు ప్రారంభమయితే అలాంటి హృదయంలో అల్లాహ్ ఔన్నత్యానికి, విశ్వాసులైన ఆయన దాసుల పట్ల అభిమానానికి చాలా తక్కువ స్థానం మిగులుతుంది. దైవాన్ని విస్మరించిన ప్రతి ధనికుడు, దేశాధినేతకంటే విశ్వాస భాగ్యం పొందిన ఒక పేదవాడే మోమిన్ దృష్టిలో ఎంతో గౌరవనీయుడు కాగలగాలి.

ఇది విశ్వసించిన వ్యక్తి సహజ లక్షణం. మనిషి తన కిష్టమయిన వ్యక్తి గొప్పతనాన్నే ఒప్పుకుంటాడు. దైవాన్ని మరచిన వాళ్ళు, ధనమదాంధులు, అధికార గర్విష్ఠులు, దుర్నీతిపరులు మోమిన్ దృష్టిలో ప్రియమైన వాళ్ళు కాలేరు. అలాంటి వ్యక్తుల్ని మోమిన్ గొప్ప వాళ్ళుగా భావించడు. వాళ్ళ గొప్పతనాన్ని ఎన్నటికీ అంగీకరించడు. దైవ ధర్మానికి దూరమయిన వాళ్ళు, సచ్ఛీలురు కాని వాళ్ళు కోటీశ్వరు లయినా, కళాకారులైనా, మంత్రులైనా, మాంత్రికులయినా సరే, మోమిన్ దృష్టిలో వాళ్ళంతా సామాన్య మానవులే. వాళ్ళ హోదా, అంతస్తులు చూసి ప్రజలు వారికి పూల దండలు వేయవచ్చు, పూల పల్లకిలో ఊరేగించవచ్చు. కాని వీటి ప్రభావం మోమిన్‌పై ఏ మాత్రం ఉండదు. ప్రజల్లో వారి పలుకుబడిని, ఏ మాత్రం ఖాతరు చేయడు.

అల్లాహ్ దృష్టిలో ఒక వ్యక్తి ఔన్నత్యానికి కొలమానం అతని సదాచరణ, భయభక్తులే. మోమిన్ దృష్టిలో కూడా ఇదే కొలమానం ఉంటుంది, ఉండాలి. ఒక

వ్యక్తి ఎంతగా సౌశీల్యవంతుడో దేవుడు, దైవప్రవక్త (సఅసం)ల పట్ల ఎంతగా విధేయుడయి దైవధర్మంపై ఎంత స్థిరంగా ఉంటాడో అతను అంతే ప్రేమపాత్రుడవుతాడు మోమిన్ దృష్టిలో. కాబట్టి సోదరులారా! గౌరవాభిమానాల విషయంలో మనం కూడా ఇదే కొలమానాన్ని ఎల్లప్పుడూ దృష్టిలో పెట్టుకోవాలి. ప్రజలను సిరిసంపదల కారణంగా లేక హోదా పలుకుబడుల కారణంగా లేదా ఇతర ప్రాపంచిక కారణాలవల్ల ప్రేమించడం, గౌరవించడం మన విశ్వాసానికి తగని పని. ఈ వైఖరిని విడనాడాలి.

ఒకసారి మహాప్రవక్త (సఅసం) కొందరు సహచరుల్ని తీసుకొని కూర్చుని ఉన్నప్పుడు వారి ముందు నుంచి ఒక వ్యక్తి పోవడం జరిగింది. దైవ ప్రవక్త (సఅసం) ఆ వ్యక్తి వైపు చూపిస్తూ, అతని గురించి మీ అభిప్రాయం ఏమిటని అడిగారు. దానికి ప్రజలు, "దైవ ప్రవక్తా! ఇతను తన తెగవారిలో ఒక పెద్ద మనిషి. అందరూ అతడ్ని గౌరవిస్తారు. ఒకవేళ ఇతను ఫలానా స్త్రీని పెళ్ళి చేసుకుంటానని కబురు చేస్తే ఎవరూ అతని మాటను కాదనరు. ఎవరి విషయంలోనయినా అతను ఏదన్నా సిఫారసు చేస్తే దాన్ని అంగీకరిస్తారు, తిరస్కరించరు. అతను ఏదైనా విషయాన్ని గురించి చెబితే ప్రజలు ఎంతో శ్రద్ధతో అతని మాటలు వింటారు. ప్రజలు అతడ్ని చాలా గౌరవిస్తారు" అని సమాధానమిచ్చారు.

ఆ తరువాత కాస్సేపటికి మరో వ్యక్తి వాళ్ళ ముందు నుంచి వెళ్ళిపోయాడు. మహాప్రవక్త (సఅసం) అతని విషయంలో కూడా సహచరుల్ని ఇంతకు ముందు అడిగిన ప్రశ్నే అడిగారు. దానికి వారు ఇలా జవాబిచ్చారు, "ఇతనొక పేద ముస్లిమ్. ఇతని దగ్గర ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. ఒకవేళ ఇతను ఎక్కడికయినా వివాహ సందేశం పంపిస్తే దాన్ని ఎవరూ సమ్మతించరు, ఎవరి కోసమయిన సిఫారసు చేస్తే దాన్ని ఎవరూ ఖాతరు చేయరు, అతనేదయినా చెబితే ఎవరూ దాన్ని ఆలకించరు. ఇలా ప్రజల దృష్టిలో అతనికి ఏ విధమైన స్థానమూ లేదు" మహాప్రవక్త (సఅసం) అను చరులు చెప్పిన ఈ మాటలు విని. "ప్రజలారా! మీ దృష్టి వాస్తవికతపై లేదు. మొదట మీరు చూసిన మనిషిలాంటి మనుషులు ప్రపంచ మంతటా నిండి ఉంటే, వారంతా కలిసినా విశ్వసించిన వ్యక్తికి సాటి రాలేరు. మోమిన్ స్థానం ఉన్నతమయింది" అన్నారు.

సోదరులారా!

మనకోసం ఇదొక ప్రస్ఫుటమయిన కొలమానం. దీంతో మన విశ్వాస స్థితిని చాలా సులభంగా కొలుచుకోవచ్చు. ఇస్లామ్ దృక్పథంలో ఇదే సరైన, ఖచ్చితమైన కొలమానం. మోమిన్ ఎల్లప్పుడూ ఈ కొలమానాన్నే ఉపయోగిస్తూ ఉండాలి.

29. జుమా నమాజ్ ప్రాముఖ్యత

మహాశయులారా!

అల్లాహ్ అత్యంత కరుణామయుడు. ఆయన తన కరుణా కటాక్షాలతో మన కోసం ఒక సమగ్ర జీవన వ్యవస్థను ఏర్పరిచాడు. తన ప్రవక్త (సఅసం) ద్వారా ఎన్నో వరాలను అనుగ్రహించాడు. ఇంకా ఆయన మనకు ఇస్లామ్ స్వీకరించే సద్బుద్ధిని కూడా ప్రసాదించాడు. ఆయన అనుగ్రహం వల్లనే మనం ఆయన ప్రియ ప్రవక్త (సఅసం) అనుచర సంఘంలో ముస్లిములుగా జీవించే మహా భాగ్యానికి నోచుకున్నాం.

సోదరులారా! అల్లాహ్ మన మంచి కోసమే మనపై ఇస్లామ్ ధర్మాన్ని విధించాడు. ఇటు ప్రపంచంలో, అటు పరలోకంలో మన సాఫల్యం కోసమే ఆయన మనకు కొన్ని విషయాలను అనుమతించాడు; కొన్ని విషయాలను నిషేధించాడు. అల్లాహ్‌ను, ఆయన ప్రవక్త (సఅసం)ను విశ్వసించిన తరువాత మనపై మోపబడిన మొట్ట మొదటి బాధ్యత నమాజ్. అంటే ప్రతి ముస్లిం విధిగా నమాజ్ చెయ్యవలసి ఉంటుంది. సమాధిలో మొట్ట మొదట అడిగే ప్రశ్న కూడా నమాజ్ గురించి ఉంటుంది.

ప్రతి రోజూ అయిదు పూటలు నమాజ్ చెయ్యమని అల్లాహ్ మనల్ని ఆదేశించాడు. నమాజ్ ఇస్లామ్ సౌధం యొక్క ఇతర స్తంభాలలో ఒక ముఖ్యమైన స్తంభం. ఎవడయితే నమాజ్‌ను స్థాపించలేడో అతను ఇస్లామ్ యొక్క ఇతర ఆదేశాలను కూడా పాటించలేడు. అలాంటి వ్యక్తి అసలు ధర్మంపై స్థిరంగా ఉండటం కూడా కష్టమే. నమాజ్ చెయ్యని వాడి ఇస్లామ్ ఇస్లామే కాదు.

నమాజుల్లో జుమా నమాజ్‌కు కూడా ఎంతో ప్రాముఖ్యత ఉంది. జుమా నమాజ్ కోసం పిలవగానే అంటే అజాన్ చెప్పగానే మొత్తం పనులు వదలిపెట్టి నమాజ్ చెయ్యడానికి బయలుదేరాలని అల్లాహ్ మనల్ని ఆజ్ఞాపిస్తున్నాడు. జుమా నమాజ్ వేళలో ముస్లిమ్ అయినవాడు ఎలాంటి ప్రాపంచిక పనిలోనూ నిమగ్నుడయి ఉండకూడదు. అల్లాహ్ దివ్యఖుర్‌ఆన్‌లో ఇలా ఆదేశించాడు:

"ముస్లిమ్‌లారా! శుక్రవారం రోజు నమాజ్ కొరకు అజాన్ చెప్పగానే మీరు అల్లాహ్ స్మరణ వైపునకు (అంటే నమాజ్ వైపునకు) పరుగెత్తండి. అమ్మకం, కొనుగోలు వ్యవహారాలను ఆపివేయండి. మీరు అర్థం చేసుకుంటే ఇది మీ కొరకు ఎంతో శ్రేయస్కరమయినది. తిరిగి నమాజ్ చెయ్యడం అయిపోయిన తరువాత మీ మీ పనులలో లీనమైపోండి. అల్లాహ్‌ను వీలయినంత ఎక్కువగా స్మరిస్తూ ఉండండి. తద్వారా మీకు సాఫల్య భాగ్యం చేకూరుతుంది."

సోదరులారా!

ఈ ఆయత్‌లలో నమాజ్ ప్రస్తావన వచ్చింది, దీనివల్ల అల్లాహ్ ఆదేశాలకున్న ప్రాముఖ్యత ఏమిటో మనకు స్పష్టంగా తెలుస్తోంది. ముస్లిమ్‌గా మనలోని ప్రతి వ్యక్తి ఆలోచించవలసిన విషయం ఇది. మోమిన్‌కు ఏదయినా ఒక దైవాజ్ఞ పాటించేందుకు పిలుపు వస్తే అతను దాన్ని ఖాతరు చేయకుండా ఇతర పనుల్లో తలమునకలయి ఉండటం ఎట్టి పరిస్థితిలోనూ భావ్యం కాదు. ఇస్లామ్ అంటేనే అల్లాహ్‌కు లొంగిపోవడం, ఆయన ఆజ్ఞలను శిరసావహించడం అని అర్థం. దీని ప్రకారం ముస్లిమ్ అన్ని దేశాల్లోనూ, అన్ని పరిస్థితుల్లోనూ అల్లాహ్ దాసుడుగా మాత్రమే ఉండాలి. ఆయన దాస్యాన్ని త్రోసిపుచ్చి ఇతరుల దాస్యాన్ని స్వీకరించకూడదు. ఆయన ఆదేశాలకు వ్యతిరేకంగా ఇతరుల ఆదేశాలను పాటించకూడదు.

ఇక్కడ ఒక విషయాన్ని గమనించాలి. ఇతరుల ఆదేశాన్ని ఏదయినా పాటించవలసి ఉంటే అది అల్లాహ్ ఆదేశాల పరిధిలో ఉన్నప్పుడే దాన్ని పాటించాలి. అంటే మనం పాటించే ప్రతి ఆజ్ఞా, చేసే ప్రతి పనీ ఖుర్‌ఆన్, హదీసులకు అనుగుణంగా ఉండాలన్న మాట. ఒకవేళ మనల్ని ఆదేశించే వ్యక్తి ఖుర్‌ఆన్, హదీసులకు అనుగుణమైన ఆదేశం ఇచ్చినా, అంతకంటే ముఖ్యమయిన ఆదేశం ఏదయినా అల్లాహ్ తరఫు నుండి వస్తే మటుకు ఈ రెండవ ఆదేశానికే ప్రాధాన్యత ఇవ్వాలి.

జుమా నమాజ్ విషయంలో కూడా అంతే. సరిగ్గా నమాజ్ వేళలలోనే మన పైఅధికారి మనకేదయినా పని అప్పగిస్తాడు. కాని అంతకంటే ముఖ్యమయిన పనికి, విధిగా చేయవలసిన పనికి హాజరు కావలసిందిగా మస్జిద్‌నుండి ముఅజ్జిన్ పిలుస్తుంటే, అతని పిలుపుని పెడచెవిన పెట్టి ఆ అధికారి అప్పగించిన పనిలోనే తగుల్కొని ఉండటం ఎంత మాత్రం సమంజసం కాదు. అలాగే వ్యాపారంలో ఉన్నప్పుడు - సరిగ్గా నమాజ్ వేళలో జనం దుకాణం చుట్టు ముసురుకుంటారు. వ్యాపారం జోరుగా సాగుతుంటుంది. గల్ల పెట్టెల్లో కరెన్సీ నోట్లు టకటక వచ్చి పడుతుంటాయి, వాటిని వదులు కోవడం ఎట్లా అని మధన పడతాడు వ్యాపారి. కాని మోమిన్ ప్రాపంచిక లాభనష్టాలను లెక్కచేయడు. భయానికి, ఒత్తిడికి్కూడా లొంగిపోడు.

సోదరులారా!

ఏ విషయంలోనయినా సరే, లాభనష్టాలు కేవలం అల్లాహ్ అధీనంలో మాత్రమే ఉన్నాయని మనం విశ్వసిస్తున్నాం. అలాంటప్పుడు నష్టానికి భయపడి లేదా లాభానికి ఆశపడి దైవానికి ఆగ్రహం కలిగించే పని ఎలా చేయగలం? అల్లాహ్ శక్తి సామర్థ్యాల

పట్ల దృఢ విశ్వాసం లేనివాడే అలా చేస్తాడు. లేకపోతే పరలోకాన్ని విస్మరించి ప్రాపంచిక వ్యామోహంలోపడ్డవాడు అలా చేస్తాడు.

సోదరులారా! ఈ ప్రపంచం శాశ్వతం కాదు, అల్లాహ్ మనల్ని పరీక్షించడానికి సృష్టించిన తాత్కాలిక స్థలం మాత్రమే ఇది. ఇక్కడ ప్రతి రోజూ ప్రతి క్షణం మనం పరీక్షించబడుతున్నాం, దైవాజ్ఞలను పాటించడంలో ఏదయినా ప్రాపంచిక నష్టం సంభవించే ప్రమాదం కనిపించవచ్చు. కాని మోమిన్ సంకుచిత దృష్టి కలవాడు కాదు. తక్షణం లభించే లాభనష్టాల వరకు అతని దృష్టి పరిమితమై ఉండదు. అతని దృష్టి పరలోక జీవితంలోని అసాధారణ విషయాల వరకు విస్తరించి వుంది. అందువల్ల అతని దృష్టిలో లాభనష్టాల కొలమానమే వేరుగా ఉంటుంది. అవసరమొస్తే మోమిన్ తన సర్వస్వాన్ని ధారపోసి కూడా విజయం పొందాననే భావిస్తాడు. చివరికి ప్రాణం అర్పించడం కూడా అతని దృష్టిలో సజీవంగా ఉండటం కన్నా అత్యంత ప్రియమయిన విషయం. అతని దృష్టి, ఆలోచనలు ఎంతో విశాలమయినవి. దైవ మార్గంలో జీవితాంతం బాధలు అనుభవించినా పరలోకంలో లభించే క్షణంపాటు సౌఖ్యానికి సయితం బలాదూర్ అని భావిస్తాడు అతను.

ఈ ఆయత్‌లలో మనం గ్రహించవలసిన మరో విషయం - అల్లాహ్ స్మరణ. అల్లాహ్‌ను స్మరించడం అంటే ప్రాపంచిక వ్యవహారాలు విడిచిపెట్టి ఒక మూలలో కూర్చుని దైవనామాన్ని జపించడం కాదు, జీవితపు ప్రతి రంగంలోనూ, ప్రతి సందర్భంలోనూ అల్లాహ్ ఆజ్ఞలనే దృష్టిలో పెట్టుకొని నడవాలి. మోమిన్ అల్లాహ్ అనుగ్రహాన్ని వెతికేందుకు బయలుదేరుతాడు. అల్లాహ్ అనుగ్రహం అంటే ఇక్కడ అల్లాహ్ తన అనుగ్రహంతో ప్రసాదించే ఉపాధి అన్నమాట. మోమిన్ అలా బయలుదేరి నీతి మార్గాల ద్వారా ఉపాధిని సంపాదించుకోడానికి కృషి చేస్తాడు. అయితే అతను ఆ స్థితిలో కూడా దైవాన్ని స్మరిస్తాడు. అతను ఉపాధిని తన కష్ట ఫలమని అనుకోడు. దాన్ని అల్లాహ్ అనుగ్రహమని మాత్రమే భావిస్తాడు. అతని కళ్ళు, చెవులు, నోరు, చేతులు, వ్యాపార వ్యవహారాల్లో మునిగి ఉన్నప్పటికీ అతని హృదయం మాత్రం దైవ స్మరణను విస్మరించదు. అల్లాహ్ ఇష్టానికి వ్యతిరేకంగా ఒక్క అడుగు కూడా పడకుండా అతను అడుగడుగునా చూసుకుంటూ, జాగ్రత్తవహిస్తూ నడుచుకుంటాడు. మంచి-చెడు, ధర్మ-అధర్మం, హలాల్-హరామ్ అనే విషయాలు అతని దృష్టిలో అనుక్షణం మెదలుతుంటాయి.

సోదరులారా!

యుక్త వయస్కుడు, ప్రాజ్ఞుడు, స్థానికుడు, ఆరోగ్యవంతుడు అయిన ప్రతి ముస్లిమ్ పురుషునిపై జుమా నమాజ్ విధించబడింది. జుమా ప్రసంగం వినడం కూడా

విధియే. జుమా ప్రసంగం అవుతున్నప్పుడు నిశ్శబ్దంగా ఉండాలి. ఇమామ్ చెబుతున్నది శ్రద్ధగా ఆలకించాలి. "ఒకవేళ మీరు జుమా ప్రసంగం అవుతున్నప్పుడు నోటితో ఎవరినయినా నిశ్శబ్దంగా ఉండు అని చెప్పినా మీరు తప్పు చేసినట్లే" అని మహాప్రవక్త (సఅసం) అన్నారు. నమాజుకు మాదిరిగానే జుమా ప్రసంగాన్ని కూడా నిశ్శబ్దంగా వినవలసిన అవసరం ఉంది.

సరైన కారణం లేకుండా జుమా నమాజ్‌ని వదలిన వ్యక్తి దైవాగ్రహానికి గురవుతాడు. బద్ధకం, అలక్ష్యంతో వరుసగా మూడు జుమా (నమాజ్)లు విడిచినవాడి హృదయానికి అల్లాహ్ సీలు వేస్తాడని దైవప్రవక్త (సఅసం) అన్నారు. అంటే అలాంటి వ్యక్తి తిరిగి దారికి రావడం చాలా కష్టమన్న మాట. జుమా నమాజ్‌కు మూడు రకాల మనుషులు వస్తారని దైవ ప్రవక్త (సఅసం) తెలిపారు. వారిలో ఒకడు పనికి మాలిన మాటల్లో పడిపోతాడు. అలాంటి వాడికి తాను చేసిందే లభిస్తుంది. మరొకడు తన అవసరాలేమయిన ఉంటే అల్లాహ్ దగ్గర వాటిని కోరుకోవటానికి వస్తాడు. అలా అతను వచ్చి అల్లాహ్‌ను దుఆ చేస్తాడు. అల్లాహ్ తాను కోరితే అతని దుఆను స్వీకరిస్తాడు లేదా తిరస్కరిస్తాడు. ఇంకొకడు వచ్చి నిశ్శబ్దంగా, ప్రశాంతంగా దైవస్మరణలో నిమగ్నుడవుతాడు. అతను తోటి నమాజీలను త్రోసుకుంటూ వారిని నొప్పిస్తూ వారిపై నుండి రాడు. అలాంటి వ్యక్తికి ఆ విధమయిన అతని రాక వచ్చే జుమా దాకా, ఇంకా మూడు రోజుల వరకు పాపపరిహారంగా అవుతుంది. అంటే పది రోజుల వరకు అతని వల్ల జరిగే పొరపాటులు ఏవైనా ఉంటే వాటిని అల్లాహ్ తన అపార అనుగ్రహంతో క్షమిస్తాడన్న మాట.

30. వరాల వసంతం-1

మహాశయులారా!

మానవుల శ్రేయస్సు కోరుతూ వరాల వసంతం మళ్ళీ వచ్చేసింది. సామాన్య ప్రజానీకం దృష్టిలో రమజాన్ నెలకు ఇతర నెలలకు ప్రత్యేకత యేదీ లేకపోవచ్చు. రమజాన్ నెలలోని రేయింబవళ్ళు, ఇతర దినాల్లోని రేయింబవళ్ళ వంటివే కదా అని వారు భావించవచ్చు. కానీ దేవుడు, దైవ సందేశహరుని (సఅసం) దృష్టిలో మాత్రం రమజాన్ నెలకు, ఇతర నెలలకు ఎంతో వ్యత్యాసం ఉంది. ఈ వ్యత్యాసం ఏమిటో మనకు సరిగా తెలిస్తే, మనం తప్పకుండా రమజాన్ నెల రాక పట్ల ఆనందోత్సవాలు జరుపుకుంటాం; ఈ వరాల వసంతం ద్వారా దైవం మనకు ప్రయోజనం పొందే అవకాశం ఇచ్చినందుకు మనం ఎంతో అదృష్టవంతులమని పొంగిపోతాము.

రమజాన్ నెల ఔన్నత్యం గురించి పూర్తిగా మహాప్రవక్త (సఅసం)కే తెలుసు. అందుకే ఆయన రమజాన్ నెల రాక కోసం రెండు, మూడు నెలల ముందు నుంచే ఎంతో ఆసక్తితో, ఆత్రంతో ఎదురుచూసేవారు. రజబ్, షాబాన్ల నెలవంకను చూస్తే, ఆయన "దేవా! మమ్మల్ని రమజాన్ దాకా చేర్చు" అని ప్రార్థించేవారు. రమజాన్ మాసం బాగా సమీపించిన తరువాత రమజాన్ శుభాలను గురించి ప్రసంగాలు, బోధనలు చేసేవారు. ఈ విధంగా దైవప్రవక్త (సఅసం) తన ప్రియ సహచరులకు ఒక నెల ముందు నుంచే శిక్షణ ఇస్తూ రమజాన్ మాసం రాగానే దాని శుభాలను పూర్తిగా ఆస్వాదించడానికి అనువైన వాతావరణాన్ని సృష్టించేవారు.

ఇప్పుడు మనకలాంటి అదృష్టం లేదు కదా అని కొందరు అడగవచ్చు. కానీ ఆనాడు మన ప్రియ ప్రవక్త (సఅసం) చేసిన ప్రసంగాలు హదీసు గ్రంథాల్లో సురక్షితంగా ఉన్నాయి. ఇవి మనకు ఎంతో ఉపయోగపడతాయి, ఇంతకంటే దైవానుగ్రహం మరేంకావాలి?

ఒకసారి మహాప్రవక్త (సఅసం) షాబాన్ నెల ఆఖరి రోజున ప్రసంగం చేస్తూ "ప్రజలారా! గొప్ప శుభాలతో కూడిన ఒక పవిత్ర మాసం మీకు నీడనివ్వబోతోంది. ఆ శుభప్రదమైన నెలలో వేయి నెలల కంటే మేలయిన ఒక రేయి ఉంది" అని బోధించారు.

దైవప్రవక్త (సఅసం) బోధించిన ఈ ప్రవచనాన్ని బట్టి రమజాన్ నెల మోమిన్ దృష్టిలో ఎంతో ఉన్నతమయిన నెలని స్పష్టమవుతోంది. వేయి నెలల కంటే మేలయినది

ఈ రాత్రి అని దివ్యఖుర్ఆన్ తెలిపిన మహారాత్రి (లైలతుల్ ఖద్ర్) కూడా రమజాన్ నెలలోనిదే. ఆ తరువాత మహాప్రవక్త (సఅసం) ఏం బోధించారో చూడండి:

"అల్లాహ్ ఈ నెల మొత్తం ఉపవాసాలను (మనపై) విధించాడు. ఈ నెల రాత్రుళ్ళలో తరావీహ్ నమాజ్ చెయ్యడం గొప్ప పుణ్యకార్యంగా పేర్కొన్నాడు. ఈ నెలలో సున్నత్ లేదా నఫిల్ సత్కార్యాలు చేసే వారికి ఇతర మాసాల్లో ఫర్జ్ సత్కార్యాలు చేసినంతటి పుణ్యం లభిస్తుంది, ఎవరయితే ఈ నెలలో ఫర్జ్ ఆరాధనలు చేస్తారో వారికి ఇతర మాసాల్లో డెబ్భయి ఫర్జ్ ఆరాధనలు చేసినంతటి పుణ్యం లభిస్తుంది."

సోదరులారా!

మహాప్రవక్త (సఅసం) బోధించిన ఈ ప్రవచనాలు ఎంతో విలువైనవి. వీటిలో మనకోసం గొప్ప శుభవార్త ఉంది; పరలోకంలో గొప్ప పుణ్యఫలం లభిస్తుందన్నదే ఆ శుభవార్త. దేవుని ప్రసన్నతకోసం మనం సాధ్యమయినంత ఎక్కువగా సత్కార్యాలు చేస్తే పరలోకంలో ఈ శుభవార్త ప్రాముఖ్యత ఏమిటో ప్రత్యక్షంగా తెలిసిపోతుంది.

అత్యాశగల వ్యాపారి లాభాలు గడించే సీజన్‌లో తన దగ్గరున్న పెట్టుబడి అంతా వ్యాపారంలో పెడతాడు. చివరికి తన అవసరాలను కూడా కొన్నింటిని తగ్గించుకొని మరీ మొత్తం పైకాన్ని వ్యాపారంలో మదుపు పెడతాడు. అదే విధంగా నిజమయిన విశ్వాసి మహాప్రవక్త (సఅసం) తెలిపిన ఈ శుభవార్తను విని రమజాన్ నెలలో వచ్చిన అవకాశాన్ని వీలైనంతవరకు పూర్తిగా వినియోగించుకొని లాభం పొందడానికి ప్రయత్నిస్తాడు. ఈ నెలలో ఒక్క నిమిషం కూడా వృథా పోనీయకుండా దేవుని ప్రసన్నత కోసం ఏదో ఓ సత్కార్యం చేస్తూనే ఉంటాడు.

విశ్వసించిన వారికి ప్రతి నెలా దైవ కారుణ్యం వర్షించే నెలే అయితే రమజాన్ నెలలో దేవుని విశేష కారుణ్యం వర్షిస్తుంది. ఇలాంటి శుభప్రదమయిన మాసంలో వచ్చే సువర్ణ అవకాశాన్ని వినియోగించుకోడానికి నడుం బిగించాలి. అప్పుడే రేపు మనం పరలోకంలో పనికివచ్చే సామగ్రిని సమకూర్చుకోగలమని ఆశించగలం. రమజాన్ నెల ఔన్నత్యం, ప్రాముఖ్యతలను గురించి మన ప్రియప్రవక్త (సఅసం) ఇంకేమన్నారో వినండి.

"ఈ రమజాన్ మాసం సహనం వహించవలసిన నెల. సహనానికి ప్రతిఫలం స్వర్గం. ఇది సానుభూతి, సంతాపం తెలిపే నెల. ఈ నెలలో విశ్వసించిన వారి సత్కార్యాల ప్రతిఫలాన్ని వారి ఆహారాన్ని అధికం చెయ్యడం జరుగుతోంది."

"ఈ నెలలో ఎవరయితే ఉపవాసం పాటించిన వ్యక్తికి ఇఫ్తార్ చేయిస్తాడో అతని అపరాధాలు మన్నించబడతాయి. అతను చేసిన ఈ సత్కార్యం అతడ్ని నరకాగ్ని నుండి

విమోచనం కలిగించే సాధనమవుతుంది. అంతేకాదు, అతనికి ఉపవాసం పాటించిన ఆ వ్యక్తికి లభించే పుణ్యంతో సమానమయిన పుణ్యం లభిస్తుంది. అయితే దీనివల్ల ఉపవాసం పాటించిన వ్యక్తికి లభించే పుణ్యం ఏ మాత్రం తగ్గించడం జరుగదు."

"ఇది ఎలాంటి నెల అంటే, ఈ నెల మొదటి భాగం కారుణ్యంతో కూడుకున్నది, మధ్య భాగం మన్నింపుకు సంబంధించినది, చివరి భాగం నరకం నుండి విముక్తి కలిగించేది."

ఇవీ రమజాన్ నెల శుభాలను గురించి మహాప్రవక్త (సఅసం) మనకు బోధించిన అమృత ప్రవచనాలు. వీటినిబట్టి రమజాన్ నెలలో ప్రత్యేకంగా మోమిన్ వైఖరి ఎలా ఉండాలో మనకు తెలుస్తోంది. దైవ ప్రవక్త (సఅసం) మొదట మనకు సహనాన్ని గురించి తాకీదు చేశారు. సహనం మన ధార్మిక జీవితానికి ప్రాణం లాంటిది. దైవ మార్గంపై స్థిరంగా ఉండటానికి ధర్మంలోని దైవాజ్ఞలను పాటించడానికి, సహనం మనకు గొప్ప శక్తినిస్తుంది. ఈ శక్తిని పొందడానికి రమజాన్ మాసమే మంచి సమయం. ఎవరయితే ఈ నెలలో సహనగుణాన్ని తమలో వృద్ధి చేసుకుంటారో వారు తప్పకుండా అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో సయితం ధర్మంపై స్థిరంగా ఉండి దైవాజ్ఞలను పాటించగలరు. అంటే దైదమార్గంలో ఎదురయ్యే కష్టనష్టాలను వారు సులభంగా భరించగలరన్న మాట. ఇలాంటి వారే పరలోక సాఫల్యానికి అర్హులవుతారు.

సోదరులారా!

మన పరస్పర సంబంధాలను పటిష్టం చేసుకోవడానికి, ఒకరి కష్టసుఖాల్లో మరొకరు పాలుపంచుకోవడానికి రమజాన్ నెల ఎంతో అనువయిన తరుణం. ఈ అవకాశాన్ని ఏ మాత్రం జారవిడుచుకోకూడదు. అల్లాహ్ అనుగ్రహాలకు అర్హులవ్వడానికి, ఆయన శిక్ష నుండి కాపాడుకొనే ప్రయత్నం చేసేవారికి ఇది ఎంతో విలువయిన కాలం. ఇందులో ఒక్కొక్క క్షణాన్ని మనం ఎంతో శ్రద్ధగా సద్వినియోగం చేసుకోవాలి. అల్లాహ్ అనుగ్రహాల కోసం అనుక్షణం కృషిచేయాలి. మన అపరాధాల మన్నింపు కోసం దీనాతి దీనంగా ఆయన సన్నిధిలో వేడుకోవాలి. ఇక ముందు దైవానికి ఇష్టం కాని ఏ పనీ చేయమని ఎల్లప్పుడూ సత్కార్యాలే చేస్తామని గట్టిగా నిర్ణయించుకోవాలి. దైవ శిక్ష నుండి బయటపడేందుకు ఇదొక్కటే మంచి మార్గం.

రమజాన్ నెల మోమిన్ పాలిట వరాల వసంతం. ఈ నెలలో అల్లాహ్ కారుణ్యం కోసం, ఆయన శుభాల కోసం అవిశ్రాంతంగా శ్రమించేవారు ఎంతో అదృష్టవంతులు. ఈ సంవత్సరం వచ్చిన ఈ సదవకాశం, వచ్చే సంవత్సరం అందరికీ వస్తుందో లేదో చెప్పలేము. అందువల్ల మనలోని ప్రతి వ్యక్తి ఇదే మన ఆఖరి అవకాశంగా భావించి సత్కార్యాలను చేయడంలో పూర్తిగా లీనమయిపోవాలి.

సాధారణంగా ప్రజలు త్వరగా లభించే లాభాలకయితే ఎగబడతారు. పరలోక ప్రయోజనాల పట్ల అంతగా ఆసక్తి చూపరు. కాని ఒక్క విషయం ఆలోచించండి. ఒక మామిడి చెట్టుకు మామిడి పండ్లు పండి సిద్ధంగా ఉన్నాయనుకోండి. స్వయంగా కోసుకునే వారికి ఉచితంగా వాటిని ఇస్తామని ఎవరైనా అంటే ఇప్పుడెందుకులే, వచ్చే యేడు చూద్దాం అంటారా మీరు? అనరు. వెంటనే ఆ పళ్ళను కోసుకోడానికి ఉపక్రమిస్తారు. ఒకవేళ ఆ చెట్టుకు మామిడి పళ్ళ స్థానంలో ఏభై రూపాయలు, వంద రూపాయల నోట్ల కట్టలు వ్రేలాడుతున్నాయనుకోండి. ఒకర్ని ఒకరు తోసుకుంటూ పోయి ఆ చెట్టుపైకి ఎగబడతారు. కాని రమజాన్ నెలలో సత్కార్యాలు చేసుకోవడంలో నిమగ్నులయ్యే వారికి పరలోకంలో ఇంతకంటే లక్షలు, కోట్ల రూపాయల విలువగల పుణ్యఫలం లభిస్తుంది.

సోదరులారా!

రమజాన్ నెల ఎంత శుభప్రదమయిందో మీరు తెలుసుకున్నారు. ఈ శుభాలను పొందడానికి మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) మనకు ఈ నెలలో ప్రత్యేకంగా నాలుగు విషయాలను ఎక్కువగా ఆచరించమని ఉపదేశించారు. ఒకటి 'లా ఇలాహ ఇల్లల్లాహు' అనే కలిమాను ఎక్కువగా జపించాలి. రెండు, అపరాధాల మన్నింపుకై ఎక్కువ వేడుకోవాలి. మూడు స్వర్గం అనుగ్రహించమని ప్రార్థించాలి. నాలుగు, నరకం నుండి విముక్తికై దైవాన్ని శరణు కోరాలి. కలిమాకు అనుగుణంగా జీవితం గడుపుతూ పొరపాట్లను క్షమింపజేయించుకొని నరకం నుండి విముక్తి పొంది స్వర్గప్రవేశం చేయడం కంటే మించిన సాఫల్యం మరేముంటుంది?

31. వరాల వసంతం-2

మహాశయులారా!

అల్లాహ్ కృపవల్ల ఈ సంవత్సరం కూడా మనం పవిత్రమయిన రమజాన్ నెలలో శ్వాస తీసుకునే భాగ్యానికి నోచుకోగలిగాం. ఈ నెలలోని ఒక్కొక్క క్షణం ఎంతో శుభప్రదమైనది, ఇది ఉపవాస వ్రతాల మాసం. నమాజులు చేసే నెల, దైవధ్యానం చేసే నెల, అపరాధాల మన్నింపును వేడుకునే నెల. ఈ నెలలో స్వర్గ ద్వారాలు తెరవబడతాయి. అందువల్ల ఈ నెలలో వీలయినంత ఎక్కువ సమయాన్ని నమాజ్, దైవధ్యానం, ఖుర్అన్ పారాయణం చేయడంలో వెచ్చించాలి. తగాదాలు దుర్భాషలు, పాపకూపంలోకి తీసుకుపోయే ఇతర అన్ని రకాల చెడు పనులకు దూరంగా ఉండాలి. పేదసాదలకు, అగత్యపరులకు చేతనయిన సహాయం చేయాలి. దిక్కులేని వారి స్థితిగతులు విచారించాలి. దేవుని అపార శుభాలను పొందడానికి ఇదే మంచి సమయం. కాబట్టి విజ్ఞత కలవారు ఈ నెలలో ఒక్క నిమిషం కూడా వృధాపోనీయకుండా సత్కార్యాలు చేయడంలో నిమగ్నులవుతారు.

సోదరులారా! ఉపవాస వ్రతం ఒక గొప్ప ఆరాధన. విశ్వసించిన దైవదాసులు కేవలం తమ ప్రభువు ఆదేశాన్ని పాటించడానికి ఆయన ప్రసన్నతను పొందడానికి అన్నపానీయాలు త్యజిస్తారు. ధర్మసమ్మతమైన అనేక కోరికలకు సయితం కళ్లెం వేస్తారు. ఆత్మశుద్ధి కోసం వారు చేసే ఈ పని ఎంతో ప్రయోజనకరమయినది. దీనివల్ల దేవుని పట్ల భయభక్తులు జనిస్తాయి. దైవాగ్రహాన్ని తప్పించుకొని సత్కార్యాలు చేయాలన్న ఆసక్తి కలుగుతుంది. దాసుడు ఏ పని చేయదలచుకున్నా ఆ పని తన యజమానికి ఇష్టమా కాదా, అది ఆయన ఆజ్ఞలకు అనుగుణంగా ఉందా లేదా అని ఆలోచిస్తాడు. ఈ ఆలోచనా సరళే మనిషి శక్తి సామర్థ్యాలను చెడు నుంచి తప్పించి మంచి మార్గాన వినియోగింపజేస్తుంది. తత్ఫలితంగానే మనిషి దానవుడుగా మారడానికి బదులుగా మానవుడిగా జీవిస్తాడు.

సోదరులారా!

ఈ నెలలో శరీర సంబంధమైన ఆరాధనలక్కూడా ఎంతో ప్రాముఖ్యం ఉంది. అనాధలకు, నిరుపేదలకు సహాయం చేయడం, బంధుమిత్రుల పట్ల సద్భావంతో మసలుకోవడం, వారి కష్టనష్టాల్లో చేయూతనివ్వడం, దైవధర్మాన్ని వ్యాప్తిచేసే కృషిలో వీలయినంత ఎక్కువగా ధనత్యాగం చేయడం మొదలయిన సత్కార్యాల వల్ల ఈ నెలలో అపారమయిన పుణ్యఫలం ప్రాప్తమవుతుంది. ఆత్మను శుద్ధి చేయడంలో ధనవ్యయం ఎంతో ప్రయోజనకారి అవుతుంది. ఆత్మకు పట్టిన అనేక జాడ్యాలు దైవ

మార్గంలో ధనాన్ని ఖర్చుపెట్టడం ద్వారానే దూరం కాగలుగుతాయి. పిసినారి ఎన్ని నమాజులు చేసినా, ఎన్ని ఉపవాసాలు పాటించినా అతని ఆత్మపరిశుద్ధం కాజాలదు. అందుకే అల్లాహ్ ధనవంతుల కోసం జకాత్ చెల్లింపును విధిగా చేశాడు.

జకాత్‌ని విధిగా చెల్లించనవసరంలేని వారు తమ శక్తిని బట్టి దానధర్మాలు చేయాలి. ధనవంతులు జకాత్‌ను గడువు ప్రకారమే చెల్లించవలసి ఉంటుంది. అయితే జకాత్ చెల్లించడానికి కూడా రమజాన్ నెలే మంచి సమయం.

సోదరులారా!

డబ్బు ఖర్చుపెట్టే విషయంలో మోమిన్ దృక్పథం, ప్రాపంచిక వ్యామోహపరుల దృక్పథానికి భిన్నంగా ఉంటుంది. ప్రాపంచిక వ్యామోహపరులు దైవ మార్గంలో డబ్బు ఖర్చు పెడితే తరగిపోతుందనుకుంటారు. కాని మోమిన్ అలా అనుకోడు. దైవ మార్గంలో ఖర్చుపెట్టడమంటే రేపటి కోసం కూడబెట్టుకోవడమేనని అతను భావిస్తాడు.

"ఓ ఆదమ్ సంతానమా! నీవు నా మార్గంలో ఖర్చు పెడితే నేను నీకోసం ఖర్చుపెడతాను" అని అల్లాహ్ ఒక హదీసులో తెలిపాడు.

మోమిన్ తన ధర్మసంపాదన నుంచి దైవ మార్గంలో ఖర్చు పెడితే అతని కోసం ఇటు ప్రపంచంలోనూ, అటు పరలోకంలోనూ శుభాల ద్వారాలు తెరుచుకుంటాయి. ఈ సూక్ష్మం దైవ తిరస్కారి అయిన ఒక ప్రాపంచిక వ్యామోహపరుడికి అర్థం కాకపోవచ్చు. కాని మోమిన్‌లు ఈ విషయాన్ని విశ్వసిస్తున్నారు. విశ్వసించడమే కాదు, వారిలో అనేక మంది అనుభవపూర్వకంగా ఈ వాస్తవాన్ని తెలుసుకున్నారు.

సోదరులారా!

దాన ధర్మాలు చేసేటప్పుడు కొన్ని విషయాలను మనం దృష్టిలో పెట్టుకోవాలి. దాన ధర్మాల వల్ల కలిగే సత్ఫలితాన్ని రెండు విషయాలు వృధా చేస్తాయి. ఆ తరువాత ధనం ఖర్చు పెట్టిన వాడికి ఏదీ మిగలదు.

మొదటి విషయం, ప్రదర్శనా బుద్ధి, ఇతరులకు చూపడానికి, కీర్తి ప్రతిష్టలు ఆర్జించడానికి ఖర్చు చేసే ధనం వల్ల ఎలాంటి సత్ఫలితమూ దక్కదు. తీర్పుదినం నాడు అలాంటి వ్యక్తితో, "నీవు పేరుకోసం ఖర్చుపెట్టావు ఇహలోకంలో నీకా పేరొచ్చింది. నిన్ను లోకులు గొప్ప దాత, ఉదార స్వభావుడని ప్రశంసించారు. కాబట్టి ఇక్కడ నీ కోసం ఏమీ లేదు నరకాగ్ని తప్ప" అనంటాడు విశ్వప్రభువు.

రెండవ విషయం, మేలు చేసి చెప్పుకోవడం, ఎవరికైనా సహాయం చేసి నలుగురికి చెప్పు కోవడం, సహాయం పొందిన వారి నుండి కృతజ్ఞతలు, పొగడ్తలను ఆశించడం ఘోరమయిన తప్పు. "విశ్వాసులారా! ప్రజల్లో మీ పరోపకారాన్ని చాటుకొని మీరు చేసుకున్న సదఖాలు, సత్కార్యాలను వృధా చేసుకోకండి" అని దేవుడు

ముస్లిములను హెచ్చరిస్తున్నాడు. మోమిన్ ఇతరులకు ఏదయినా ఉపకారం చేస్తున్నాడంటే అది నిజానికి తనకు తాను ఉపకారం చేసుకుంటున్నట్లే అవుతుంది. ఎందుకంటే పరోపకారం ద్వారా అతను దైవకారుణ్యాన్ని ఆశిస్తున్నాడు.

సోదరులారా!

ఈ పవిత్ర మాసం యొక్క గొప్ప తనం వర్ణనాతీతం. దివ్యఖుర్ఆన్‌లో దైవం వేయి నెలల కంటే మిన్న అని తెలిపిన మహారాత్రి ఈ నెలలోనే వస్తుంది. రమజాన్ నెలలోని చివరి పది దినాల్లో బేసి సంఖ్య గల రాత్రుల్లో ఇది ఏదయినా ఒక రాత్రి అయి ఉంటుందని హదీసులో తెలియజేయబడింది. ఇదే నెల చివరి పది రోజుల్లో మనం ఎతెకాఫ్ కూడా పాటిస్తాం. రమజాన్ శుభాలను తనివితీరా ఆస్వాదించడానికి ఎతెకాఫ్ ఎంతో మంచి మార్గం. మహాప్రవక్త (సఅసం) ప్రతి యేడూ ఎతెకాఫ్ పాటించేవారు. పుణ్యనిధిని కూడబెట్టుకోవడానికి ఇంతకంటే మంచి అవకాశం మరొకటి లేదు. అందువల్ల మన మంతా మన సమయాన్ని వీలయినంత మేరకు నమాజ్, దైవధ్యానం, ఖుర్ఆన్‌పఠనం, ధర్మాభ్యున్నతికై కృషి చేయడంలో గడపాలి. ఇలా చేసిన వారు దైవానికి కృతజ్ఞతలు అర్పించుకోవాలి. ఎందుకంటే వారు ఈ నెలలో గొప్ప పుణ్య నిధిని పొందగలిగారు. ఎవరయితే ఈ మహాభాగ్యానికి నోచుకోలేక పోయారో వారే నిజానికి నష్టపోయిన వారు.

ఇలాంటి శుభప్రదమైన నెల ద్వారా ప్రయోజనం పొందడానికి తాను వచ్చే యేడు కూడా జీవించి ఉండగలనని మనలో ఏ ఒక్కడూ అనలేడు. కాబట్టి ఈ సంవత్సరం మనకు లభించిన ఈ అవకాశాన్ని మహాభాగ్యంగా తలచి పూర్తిగా సద్వినియోగం చేసుకోడానికి ప్రయత్నించాలి.

ప్రాపంచిక వ్యామోహంలోపడి లేదా బద్ధకంతో ప్రతి సత్కార్యాన్నీ రేపటి కోసం వాయిదా వేస్తూ చివరికి ఏ సత్కార్యం చేయకుండానే తనువు చాలించిన వారిని కూడా మీరు చూసి ఉంటారు. ఇస్లామ్ దృష్టిలో ఇంతకంటే దురదృష్టవంతులు మరొకరుండరు. మంచి పనులు చేయనీయకుండా నిరోధించడానికి షైతాన్ ఎల్లప్పుడూ మన చుట్టూ కాచుకొని ఉంటాడు. ఆ దుష్టుడ్ని తప్పించుకొని సత్కార్యాల వైపునకు మళ్ళడానికి రమజాన్ నెలకు మించిన సదవకాశం లేదు. రమజాన్ నెల ఔన్నత్యాన్ని తెలుసుకొని కూడా ఇలాంటి సువర్ణ అవకాశాన్ని చేజేతులా ఎవరు జారవిడుచుకుంటారు - పూర్తిగా ప్రాపంచిక మైకంలో పడినవాళ్ళు తప్ప?

రండి విశ్వప్రభువుని వేడుకుందాం - ప్రభూ! రమజాన్ నెల శుభదినాల వల్ల పూర్తిగా ప్రయోజనం పొందే సద్బుద్ధిని మాకు ప్రసాదించు. మా పొరపాట్లను మన్నించి మాపై నీ కారుణ్యాన్ని కురిపించు. ప్రభూ! మమ్మల్ని నరకం నుండి కాపాడు. నీ ప్రసన్నతకు పాత్రుల్నిజెయ్యి.

32. వరాల వసంతం-3

మహాశయులారా!

అన్ని నెలల కంటే రమజాన్ నెల మనకెంతో పవిత్రమైన నెల. ఈ నెలలోనే దివ్యఖుర్‌ఆన్ అవతరించింది. దివ్యఖుర్‌ఆన్ యావత్ మానవాళికి దైవం ప్రసాదించిన మహాభాగ్యం. మానవుల శ్రేయస్సుకై ఉపవాస వ్రతం అనే ఒక ప్రత్యేక ఆరాధన కోసం విశ్వ ప్రభువు ఈ నెల ఎన్నుకున్నాడు. ఇతర నెలల్లో చేసే ఆరాధనల కంటే ఈ నెలలో చేసే ఆరాధనలు ఎంతో విలువైనవి. ఈ నెలలో నఫిల్ ఆరాధనల పుణ్యం, ఇతర రోజుల్లో చేసే ఫర్జ్ ఆరాధనల పుణ్యానికి సమానంగా ఉంటుంది. ఫర్జ్ ఆరాధనల పుణ్యమయితే డెబ్బయి రెట్లకన్నా ఎక్కువగానే ఉంటుంది.

రమజాన్ మరో ప్రత్యేకత ఏమంటే ఈ నెలలో ఎంతో శుభప్రదమయిన ఒక రాత్రి వస్తుంది. ఆ రాత్రిలో చేసే ఆరాధనలు ఇతర వేయి నెలల్లో చేసే ఆరాధనల కంటే శ్రేష్ఠమయినవని ఇస్లామ్ బోధనలు తెలుపుతున్నాయి. దీన్నిబట్టే ఈ రాత్రి ఎంత శుభప్రద మయిందో స్పష్టమవుతోంది.

ఇలాంటి శుభరాత్రి అందించే వరాలను పొందినవారు ధన్యులు. మరి ఈ వరాలను అందరూ పొందగలరా? దేవుడు ఈ వరాలను ప్రసాదించినందుకు మనం ఆయనకు ఎంతో కృతజ్ఞత చెల్లించుకోవాలి. అప్పుడే ఈ వరాలు పొందడానికి మనం అర్హులమవుతాము. స్వయంగా రమజాన్ నెల మోమిన్‌కు ఒక గొప్పవరం. అందువల్ల మనం ఆ వరాన్ని సరైన రీతిలో వినియోగించుకోవాలి. దాని ద్వారా మన ప్రభువు ప్రసన్నత పొందడానికి కృషిచేయాలి. ఇదే ఆయనకు మనం కృతజ్ఞతలు చెల్లించుకునే మంచి మార్గం. దేవుడు మరోసారి మనకు రమజాన్ వరాలను పొందే అవకాశాన్ని ప్రసాదించాడు. తద్వారా మన పుణ్య నిధిని పెంపొందించుకోవచ్చు. కనుక ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే వారే అదృష్టవంతులు.

సోదరులారా!

చిత్తశుద్ధి, ఏకాగ్రత, ఆసక్తి, నిష్ఠగలవారే దైవారాధాన ద్వారా ప్రయోజనం పొందగలరు. ఈ విషయం మనకందరికీ తెలుసు. ఆచారం రీత్యా ఆరాధన యొక్క ఏవో కొన్ని అంశాలను నిర్వహిస్తే మనపై మోపబడిన విధిని మాత్రం నిర్వహించిన వాళ్ళమవుతాము. కాని ఆరాధన ద్వారా ఒక మోమిన్‌కు కలగవలసిన ప్రయోజనాలు మాత్రం కలగవు. శ్రద్ధ, చిత్త శుద్ధి, ఏకాగ్రతలతో చేసిన ఆరాధనే మనకు సత్ఫలితాన్ని

ఇస్తుంది. ఉపవాస వ్రతం పాటించడమయితే అందరికీ తెలుసు. కాని ఉపవాసం పాటించడంలో గమనించవలసిన నిబంధనలతో పాటు, వాటిని పూర్తి స్పృహతో నిర్మలమైన మనస్సుతో, అత్యంతశ్రద్ధాశక్తులతో పాటించినప్పుడే ఉపవాస వ్రతం వల్ల మనకు పూర్తి లాభం కలుగుతుంది. అనుక్షణం మన అంతరంగంలోకి తొంగి చూసుకుంటూ ఈ విధంగా మనం పాటిస్తున్నామా లేదా అని గమనించాలి.

మనం రమజాన్ నెలలో ఉపవాసం ఉంటున్నాము. యాంత్రికంగానో, స్పృహతోనో దాని నిబంధనలను కూడా పాటిస్తున్నాము. కాని ఇతర విషయాల్లో మన జీవన నౌక ఎలా సాగుతుందో గమనిస్తున్నామా? ఒక్కసారి మనం ఆత్మపరిశీలన చేసుకుంటే మన పొరపాట్లు ఏమిటో గ్రహించగలం. అబద్ధమాడటం, పరోక్షంగా ఇతరుల్ని నిందించడం, పరుల సొమ్ము కోసం ప్రాకులాడటం, దుర్భాష లాడటం మొదలయిన ఎన్నో చెడులు మన వల్ల జరుగుతాయి. వీటికి, ఉపవాసాలకు లేదా ఇతర దైవారాధనలకు సంబంధం ఏమిటీ అంటారు కొందరు అమాయకులు. అసలు వీటిని నిర్మూలించడమే ఇస్లామ్ లక్ష్యం అని గ్రహించరు వీరు. కాబట్టి వెంటనే మనం పశ్చాత్తాప హృదయంతో దైవ సన్నిధిలో మన పొరపాట్లకుగాను క్షమాపణ చెప్పుకోవాలి. ఇక నుండి వీటి జోలికి పోమని దృఢ మనస్సుతో నిర్ణయించుకోవాలి.

సోదరులారా!

ఈ నెలలో ప్రతి రోజూ మనం పూర్తి స్పృహతో ఉపవాస వ్రతాన్ని ప్రారంభిద్దాం. మనం హృదయంలోని స్వార్థం, ద్వేషం, ప్రాపంచిక వ్యామోహం లాంటి మలినాలను కడిగేద్దాం. మనం చేయబోయే పని మన ప్రభువుకు ఇష్టమేనా అని ఆలోచించి మరీ ప్రారంభిద్దాం. ఇలా చేయగలిగినప్పుడే మనం దేవుని కరుణా కటాక్షాలకు పాత్రులవుతాము. ఒక హదీసులో ఇలా ఉంది. "ఎవరయితే విశ్వాసశుద్ధితో, అల్లాహ్ ప్రసన్నతను, ఆయన ప్రసాదించే పుణ్యాన్ని పొందాలన్న కోరికతో ఉపవాసం పాటిస్తాడో, అల్లాహ్ అతని పొరపాట్లను క్షమిస్తాడు" అని బోధించారు మహాప్రవక్త (సఅసం). విశ్వసించిన దైవదాసునికి ఇంతకంటే గొప్ప శుభవార్త మరేం కావాలి?

ఎవరయితే ఈ హదీసుని ఆచరణలో పెడుతూ ఉపవాసం పాటిస్తారో వారి దైనందిన కార్యకలాపాల్లో తప్పకుండా మార్పు వస్తుంది. వారి సంభాషణ తీరు మారిపోతుంది. వ్యర్థమయిన మాటలు మాట్లాడటాన్ని మానుకుంటారు. వృధా పనులకు షైతాన్ చేష్టలకు దూరంగా ఉంటారు.

బట్టల వ్యాపారికి, కూల్ డ్రింక్స్ వర్తకుడికి వేసవి కాలం మంచి సీజన్. ఈ కాలంలోనే వారు ఎక్కువగా సంపాదించగలరు. అందువల్ల అత్యాశగల వ్యాపారులు

తమ దగ్గరున్న పైకమంతా వ్యాపారంలో పెట్టి సాధ్యమయినంత ఎక్కువ లాభాలను గడించడానికి ప్రయత్నిస్తారు. ఇరవై నాలుగు గంటలూ అదే ధ్యాసలో ఉంటారు. అదే విధంగా పుణ్య నిధిని పెంచుకోడానికి మోమిన్‌కు రమజాన్ నెల మంచి సీజన్. విజ్ఞతగల మోమిన్ ఈ నెలలో ఒక్క నిమిషం కూడా వృధా చేయకుండా దైవ ప్రసన్నత లభించే పనులు చేయడంలో నిమగ్నమవుతాడు. పేరాశగల వర్తకుడిలా ఇతను పుణ్యార్జనలో పడి వీలయినన్ని ఎక్కువ సత్కార్యాలు చేయడానికి కృషిచేస్తాడు.

ఇహలోకపు బ్యాంకు బ్యాలెన్స్‌ను పెంచుకోవడం ఆ వ్యాపారి లక్ష్యమయితే, పరలోకపు బ్యాంకు బ్యాలెన్సును పెంచుకోవడమే ఈ మోమిన్ ధ్యేయం. దానికోసం మోమిన్ ఈ నెలలో వీలయినంత ఎక్కువగా ఖుర్‌ఆన్ పఠనం, దైవధ్యానం, నఫిల్ నమాజులు చేయడంలో తలమునకలయిపోతాడు. సాధ్యమయినంత ఎక్కువ ధనాన్ని దైవ మార్గంలో ఖర్చుపెడతాడు. నిరుపేదల్ని, అగత్యపరుల్ని ఆదుకుంటాడు. దైవ ధర్మాన్ని ఉన్నతం చేసే కార్యకలాపాల్లో పాల్గొని వీలయినంత ఎక్కువ కాలాన్ని, ధనాన్ని వెచ్చిస్తాడు.

సోదరులారా!

మనం ఈనాడు ఏ స్థితిలో ఉన్నామో చూడండి. రమజాన్ నెల రాగానే రోజాల నయితే ఆర్భాటంగానే పాటిస్తున్నాము. కాని ఇతర విషయాల్లో విశ్వసించని వారికి, మనకు పెద్ద తేడా కనిపించడంలేదు. వారు ఏ చెడులను అయితే చేస్తున్నారో వాటిని మనమూ చేస్తున్నాం. పరిస్థితులకు ఎదురీదవలసిన మనం పరిస్థితులకు బానిసలయ్యాం. ఇతరులపై ప్రభావం వేయవలసిన మనం, స్వయంగా మనమే ఇతరులచే ప్రభావితులమవుతున్నాం. ఇది ఎంతో విచారకరమయిన విషయం.

దీనికి మూల కారణం ఒక్కటే. "మంచిని పెంచు, చెడును త్రుంచు" అన్న గొప్ప బాధ్యతలను మనం మరచిపోయాము. నమాజ్, రోజా, జకాత్, హజ్ మొదలైన ఆరాధనలు చేసేవారు కూడా ఈ సమతర బాధ్యతను అలక్ష్యం చేస్తున్నారు. ఈ బాధ్యతను నిర్వహించడానికి రమజాన్ నెల ఎంతో మంచి అవకాశం. కాబట్టి ఈ కార్యాన్ని ముందు మీ ఇంటి నుంచి ప్రారంభించండి. తరువాత మీ ఇరుగుపొరుగు, మీ వీధి, మీ పేట, మీ పట్టణంలో ఈ పని చేపట్టండి. దైవ ధర్మాన్ని విస్మరించడం వల్ల కలిగే దుష్పరిణామాలను గురించి ప్రజలకు భయపెట్టండి. ప్రళయాన్ని గురించి హెచ్చరించండి, రుజు మార్గం వైపునకు పిలువండి, ఇలా చేయడానికి ప్రయత్నిస్తే ఇతరులు చేసే చెడు పనుల ప్రభావానికి మనం గురయ్యే ప్రమాదం ఉండదు. ఈ విధంగా మనం పరలోకంలో దైవానుగ్రహానికి పాత్రులం కూడా కాగలం.

33. వరాల వసంతం-4

మహాశయులారా!

ప్రతి వ్యక్తి సంఘంలో తానో గొప్ప వాడనిపించుకోవాలని కోరుకుంటాడు. దీనికోసం కొందరు సిరిసంపదలను కూడబెట్టుకోవాలని ఆరాటపడతారు. కొందరు అధికారం కోసం ప్రాకులాడతారు. మరికొందరు విద్యాజ్ఞానాల ద్వారా పేరు సంపాదించాలని తపనపడ తారు. ఇంకొందరు తమ కుల గోత్రాల ప్రాతిపదికపై గొప్ప వాళ్లుగా చెలామణి కావడానికి ప్రయత్నిస్తారు. కొందరు శాశ్వతంగా ప్రపంచానికి గుర్తుండే వస్తువు దేన్నయినా కనుగొనాలని అనుకుంటారు. మరికొందరు ఏదో ఒక కళలో నైపుణ్యం సంపాదించి కలకాలం ప్రజల్లో వెలిగిపోవాలని భావిస్తారు, ఇలా మనుషులు ఒక కోరికను నెరవేర్చుకోవడానికి వేయి రకాలుగా ఆలోచిస్తారు.

వీరందరిలోనూ ప్రజల్లో పేరు ప్రఖ్యాతులు సంపాదించి గొప్పవాళ్ళయి పోవాలన్న కోరిక మాత్రమే ఉంటుంది. అంటే వీరు సంఘంలో తమకంటూ ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకోవాలని తాపత్రయపడతారు. ఇతరులపై తమ ఆధిక్యతను చాటుకోవాలన్నదే వీరి ధ్యేయం. కాని సోదరులారా! ప్రజల దృష్టిలో ఇలా గొప్పవాడయిపోవడం అన్నది నిజానికి ఒక పనికి మాలిన ప్రయత్నం మాత్రమే. మోమిన్ దృష్టిలో ఇలాంటి గొప్పతనానికి ఎలాంటి స్థానంలేదు. ఎందుకంటే ఈ ప్రపంచం తాత్కాలికమని, ఆ తరువాత మానవుడు శాశ్వతంగా ఉండే మరో జీవితంలో అడుగు పెట్టవలసి ఉంటుందని అతను భావిస్తాడు. అలాంటప్పుడు ఈ తాత్కాలిక జీవితం లోని గొప్పతనాన్ని అతను ఎందుకు కోరుకుంటాడు.

సోదరులారా!

దేవుని దృష్టిలో ఏదయితే గొప్పతనంగా చెలామణి అవుతుందో మోమిన్ దాన్నే గొప్ప తనంగా భావిస్తాడు. ఆ గొప్పతనం తప్ప ప్రాపంచిక జీవితంలోని ఏ విషయమూ అతని దృష్టిలో గొప్పతనం కాదు. దేవుడు అనుగ్రహించి తనకు ఏదైనా మహాభాగ్యాన్ని ప్రసాదించినప్పుడే మోమిన్ తృప్తి చెందుతాడు. ఒకవేళ తనను అనుగ్రహించకపోతే ప్రపంచంలో లభించే గొప్ప గొప్ప హోదాలు, అంతస్తులు, అధికార పీఠాలు కూడా అతనికి ఇష్టముండవు.

సోదరులారా! మోమిన్‌కు, ఇతరులకు ఉన్న ఈ తేడాను దృష్టిలో ఉంచుకొని ఆలోచిస్తే నిజానికి మానవుల్లో గొప్పవాడెవరో మనం తెలుసుకోగలం. దేవుని దృష్టిలో మానవుని గొప్పతనానికి గల గీటురాయి ఏమిటో మీకందరికీ తెలుసు. మానవుడు సాధ్యమైనంత ఎక్కువగా దేవుని ప్రసన్నత పొందడం, ఆయన ఆగ్రహానికి, అసంతృప్తికి భయపడటమే నిజమయిన గొప్పతనానికి గీటురాయి. "మీ అందరిలో (దైవం పట్ల)

ఎక్కువ భయభక్తులు ఉన్నవాడే దేవుని దృష్టిలో గొప్పవాడని" దివ్య ఖుర్‌ఆన్ స్పష్టంగా తెలుపుతోంది. ఈ భయభక్తులే మనిషిని ఉన్నత స్థానానికి చేర్చుతాయి. ఒక వ్యక్తి దైవం పట్ల ఎంతగా భయ భక్తులు కలిగి ఉంటాడో అతను అంత గొప్పవాడవుతాడు.

సోదరులారా!

ఈ రమజాన్ నెల ఎంతో శుభప్రదమయింది. ఈ నెలలో అల్లాహ్ ముస్లిములపై ఉపవాసాలను విధించాడు. దివ్యఖుర్‌ఆన్‌లో మన ప్రభువు ఉపవాసాలను గురించి ప్రస్తావిస్తూ "ముస్లిమ్‌లారా! మీ పూర్వీకులపై రోజా ఎలా విధించబడిందో, మీపై కూడా అలాగే విధించబడింది. దాని ద్వారా మీరు భక్తి పరాయణులవుతారు" అని వివరించాడు. దీన్నిబట్టి రమజాన్ నెల ప్రాముఖ్యం ఏమిటో స్పష్టంగా తెలుస్తోంది. దేవునిపట్ల ఎక్కువ భయభక్తులు కల జీవితాన్ని అవలంబించడానికి మనకు ఈ నెలే మంచి అవకాశం. ఈ విధంగా మనం మన నిజ ప్రభువు, యజమాని అయిన అల్లాహ్ దగ్గర గౌరవోన్నతుల స్థానాన్ని పొందగలం.

రమజాన్ ఉపవాసాలకున్న ఔన్నత్యం మీకందరికీ తెలిసిందే. దీనికి అల్లాహ్ అపార పుణ్యఫలితాన్ని ఉంచాడు. ఒక హదీసులో "రోజా నా కోసం ఉంది. దాని పుణ్య ఫలాన్ని స్వయంగా నేనే ప్రసాదిస్తాను" అని దేవుడు ప్రకటించాడు. మనిషి సంకల్పశుద్ధితో కేవలం దేవుని ఆజ్ఞను పాటించడంలో, ఆయన ప్రసన్నతనుపొందే ఉద్దేశ్యంతో అన్నపానీయాలను విడిచిపెడితే, ఆ పని అతడ్ని తప్పకుండా దైవానికి సన్నిహితం చేస్తుంది.

సోదరులారా!

ఉపవాస వ్రతాన్ని సరైన రీతిలో పాటిస్తే దాని వల్ల మన ఆత్మలో పవిత్రత, పారిశుద్ధ్యాలు జనిస్తాయి. దైవమార్గంలో కృషి చేయడానికి కావలసిన శక్తి లభిస్తుంది. అల్లాహ్ మనకు ఎలాంటి వరాలను ప్రసాదించాడో గ్రహించగలం. పేదసాదలు పడే బాధలు ఏమిటో మనకు తెలిసివస్తాయి.

ఉపవాసం పాటించడం అంటే కేవలం అన్న పానీయాలు మానేయడమని అర్థం కాదు. చెడులను మానేసి మంచి పనులను అవలంబించడమే ఉపవాసం యొక్క లక్ష్యం. ఈ లక్ష్యానికి అనుగుణంగా మన నడవడికలను మార్చుకోకపోతే ఉపవాసాలవల్ల కలిగే ప్రయోజనాలేవీ మనకు కలగవు. రోజా ఉండి అబద్ధం, అపనింద, దుర్భాష, వృథా పనులు, పనికిమాలిన కబుర్లు మొదలైన చెడులకు దూరంగా ఉండవలసిన అవసరం ఎంతో ఉంది. దానర్థం ఇతర దినాల్లో ఈ చెడులన్నీ యథేచ్ఛగా చేయవచ్చని కాదు. ఈ నెలలో మరింత పవిత్రమైన జీవితం గడపడానికి ప్రయత్నించాలన్నదే దీని భావం. ఈ విషయాలను పట్టించుకోని వారి గురించి మహాప్రవక్త (సఅసం) ఏం సెలవిచ్చారో చూడండి:

"ఎందరో రోజా పాటించే వ్యక్తులకు తమ ఉపవాస వ్రతం ద్వారా కేవలం ఆకలిదప్పులు తప్ప మరేమీ లభించదు. అలాగే ఎందరో తరావీహ్ నమాజ్ చేసే

వ్యక్తులకు తమ తరావీహ్ ద్వారా కేవలం జాగరణం తప్ప మరేదీ ప్రాప్తం కాదు" అన్నారు ఆయన.

"ఎవరయితే (రోజా పాటిస్తున్నప్పటికీ) అసత్యం పలకడం, అసత్యపు మాటలను ఆచరించడం వదలడో అతను ఆకలిదప్పులతో పడుండడం పట్ల అల్లాహ్‌కు ఏ మాత్రం ఆసక్తి లేదు" అని కూడా ఆయన విస్పష్టం చేశారు.

సోదరులారా!

దైవ మార్గంలో డబ్బు ఖర్చు పెట్టడానికి ఈ శుభ దినాలు ఎంతో మంచి సమయం. పేదలకు ఆర్థిక సహాయం చేయడం, అగత్యపరులను ఆదుకోవడం, అనాథలు వితంతువుల స్థితిగతులను విచారించి చేతనయిన సహాయం అందజేయడం వంటి సత్కార్యాల కోసం వీలయినంత ఎక్కువ సమయాన్ని కేటాయించాలి. ఇలా ఖర్చు చేసే డబ్బు మోమిన్ దృష్టిలో నిజానికి ఖర్చు చేయడం కాదు, పరలోక పుణ్య ఫలాన్ని సమీకరించుకోవడమే. దివ్యఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా బోధిస్తున్నాడు:

"ఎవరు తమ సంపదను అల్లాహ్ మార్గంలో ఖర్చు చేస్తారో, వారి ఖర్చు ఉప మానం ఇలా ఉంటుంది: ఒక విత్తనాన్ని నాటితే, అది మొలిచి ఏడు వెన్నుల్ని యీనుతుంది; ప్రతి వెన్నుకు నూరేసి గింజలు ఉంటాయి."

అంటే దాసుడు సంకల్ప శుద్ధితో దైవ మార్గంలో ఖర్చు పెడితే, అతను ఖర్చు పెట్టే ఒక రూపాయికి బదులుగా అతనికి ఏడొందల రూపాయలు లభించవచ్చు. అంతేకాదు, దైవం ఇష్టపడితే అతని పుణ్యఫలం కొన్ని వేల రెట్లు అధికం కావచ్చు కూడా. ఎందుకంటే ఎవరెంత చిత్తశుద్ధితో, ఆసక్తితో ఖర్చు పెడుతుంటారో దైవానికి తెలుసు. ఈ విధంగా గమనిస్తే రమజాన్ నెల మోమిన్ కోసం ఎంత లాభదాయకమైన నెలో తెలుస్తుంది. పేదలకు ధనసహాయం చెయ్యడం, ధర్మ వ్యాప్తి జరిగే కార్యకలాపాల్లో వీలయినంత ఎక్కువ డబ్బు ఖర్చు పెట్టడం మనకెంతో లాభదాయకం. ఈ లాభం మనకిక్కడ కనిపించకపోవచ్చు. కాని పరలోకంలో అది ముందుకు వచ్చినప్పుడు మన ఆశ్చర్యానికి అంతుండదు.

సోదరులారా!

సత్కార్యాలు చేయడంలో మనం ఒకరికంటే ఒకరు ముందుకు పోవడానికి ప్రయత్నించాలి. "ఎవరయితే రమజాన్ నెల రాత్రుళ్ళలో సంకల్పశుద్ధితో అల్లాహ్ నుండి పుణ్య ఫలం సంపాదించడానికి నమాజ్ చేస్తాడో అతని అపరాధాలను ఆయన క్షమిస్తాడు" అని మన ప్రియ ప్రవక్త (సఅసం) అన్నారు. ఫర్జ్ నమాజ్‌లేగాక, ఈ నెలలో తరావీహ్ నమాజులు కూడా చేయడం ఎంతో అవసరం. బద్ధకంతో లేదా ఇతర ప్రాపంచిక కార్యకలాపాల్లో లీనమైపోయి తరావీహ్ నమాజులను వదిలేసేవాళ్లు నిజానికి ఒక గొప్ప వరాన్ని కోల్పోయినట్లే.

34. సంపూర్ణ విప్లవమే సమస్యలకు పరిష్కారం

మహాశయులారా!

ఎవరయితే భూమ్యాకాశాలను, అందులోని సమస్త సృష్టిరాసులను సృజించి మానవులకోసం చక్కని జీవితాన్ని ప్రసాదించాడో అతనే అందరి యజమాని, ప్రభువు. కాని కొందరు, వీటన్నిటిని ఎవరూ సృష్టించలేదు; వాటంతటవే ఉనికిలోకి వచ్చాయి అంటారు. మరికొందరు, ఈ భూమ్యాకాశాలను, అందులోని సృష్టిరాసులను ఆయనే సృష్టించాడు కాని, వాటిపై పెత్తనం మటుకు మరొకరిది సాగుతోందని అంటారు. అంటే యజమాని ఒకరును, పెత్తనం మరొకరిదన్న మాట! ఇదేమన్నా బుద్ధికందే విషయమేనా? ఇస్లామ్ ఈ విషయాన్నే ఖండిస్తూ అన్నిటిని సృష్టించిన దేవుడే సృష్టి కార్యకలాపాలను కూడా నిర్వహిస్తున్నాడని చెబుతోంది. ఈ వాస్తవికతే ఇస్లామీయ ధర్మానికి మూల స్తంభం.

ఈ యదార్థాన్నే దివ్యఖుర్‌ఆన్ మాటిమాటికి మానవాళి ముందుంచుతూ, "మానవులారా! దేవుని భూమిపై మీరు దేవుని దాసులయి ఉండండి, అంతేగాని ఆయన దైవత్వంలో ఇతరులను సహవర్తులుగా నిలబెట్టేందుకుగాని లేదా స్వయంగా మీరే దేవుళ్ళు అవడానికిగాని ప్రయత్నించకండి" అని నొక్కి బోధిస్తోంది.

సోదరులారా!

దివ్యఖుర్‌ఆన్ ఇస్తున్న ఈ మౌలిక సందేశాన్నే ప్రారంభం నుండి ప్రతి దైవ సందేశహరుడూ మానవాళికి అందజేస్తూ వచ్చాడు. ఈ సత్యాన్ని అంగీకరించినప్పుడే మానవుడు ఇటు ఇహలోకంలోనూ, అటు పరలోకంలోనూ నిజమైన సాఫల్యాన్ని పొందగలడు. ఈ సత్యానికి అనుగుణంగా జీవితం గడపడం పైనే అతని శాశ్వత జీవిత సౌఖ్యం ఆధారపడి ఉంటుంది. 14 వందల సంవత్సరాల క్రితం అరేబియాలో అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఈ సందేశాన్నే ప్రజలకు ఇచ్చారు. దీన్ని స్వీకరించినవారు ఇంతవరకు ఎవరూ కనీవినీ ఎరుగనంతటి బ్రహ్మాండమైన విప్లవాన్ని తీసుకొచ్చారు. ఇది అందరికీ తెలిసిన చారిత్రక యదార్థం.

మానవ చరిత్రలో విప్లవాలైతే ఎన్నో వచ్చాయి. మరెన్నో ఉద్యమాలు లేచాయి. వాటి ద్వారా ప్రపంచంలోని పెద్ద పెద్ద భూభాగాలను ఆక్రమించు కోవడం జరిగింది. కాని ఇస్లామీయ సందేశం రూపంలో వచ్చిన మహత్తర విప్లవానికి, ఇతర విప్లవాలకు ఎంతో తేడా ఉంది. కాస్త జాగ్రత్తగా ఆలోచిస్తే ఈ విప్లవం వెనుక పని చేసిన శక్తి సత్యధర్మం యొక్క సందేశమేనని సులభంగా తెలుస్తుంది.

సత్యధర్మానికి సంబంధించిన ఈ సందేశం మానవుని నైతిక, మానసిక, సాంఘిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ఓ పరిపూర్ణమయిన విప్లవాన్ని తెచ్చింది. ఈ విప్లవ ప్రభావం ఎక్కడెక్కడైతే పడిందో అక్కడల్లా అత్యున్నతమైన మానవీయ విలువలు వికసిస్తూ పోయాయి; నైతిక విహీనత అథఃపాతాళానికి అణగద్రొక్కబడింది. ఎక్కడయినా, ఏదైనా ఒక ఉద్యమం విజయం సాధిస్తే సాధారణంగా అక్కడ అదే ఉద్యమం ద్వారా, హింసా దౌర్జన్యాలు కూడా ప్రబలుతాయి. కాని దైవ సార్వభౌమాధికారం ప్రాతిపదికపై వచ్చిన విప్లవం అపూర్వం, అద్వితీయం. మానవీయ విలువలు అనే మణిమాణిక్యాలన్నింటిని మూటగట్టుకు వచ్చిన విప్లవం ఏదయినా ఉందంటే అది ఇస్లామీయ విప్లవమే.

సద్గుణ సంపత్తి కేవలం సర్వసంగపరిత్యాగులైన రుషులు, యోగుల్లోనే ఉంటుందని సాధారణంగా జనం అనుకుంటారు. అలాగే మతాన్ని ఆశ్రయించిన వారు ప్రపంచ వ్యవహారాల జోలికి పోరన్న భావన కూడా ప్రచారంలో ఉంది. కాని ఇస్లామీయ విప్లవకారులయిన ఆనాటి ముస్లిములు ప్రపంచ వ్యవహారాల్లో సయితం పాల్గొని, రాజకీయ రంగంతోపాటు జీవితపు అన్ని రంగాల్లోనూ తమ సచ్ఛీలత, సత్యసంధతలను ప్రపంచానికి చాటి చెప్పారు. వీరు న్యాయపీఠంపై కూర్చొని తమ వారు - పరాయి వారు, మిత్రులు-శత్రువులు అన్న తేడా లేకుండా రాజ్యంలోని ప్రజలందరికీ న్యాయం చేకూర్చారు. సైన్యాధిపతి హోదాలో ఉండి గొప్ప గొప్ప విజయాలు సాధించినా అన్యాయం, అత్యాచారాలకు ఏ మాత్రం పాల్పడలేదు. వ్యాపారంలో నిజాయితీ, శ్రామికులతో సత్ప్రవర్తన, పొరుగువారి పట్ల ప్రేమభావం లాంటి సద్గుణ సంపత్తిని పుణికిపుచ్చుకున్నారు. ఆనాడు నిజమయిన సమానత్వం, సౌభ్రాతృత్వాలు ఎక్కడయినా ఉన్నాయంటే అది ముస్లిమ్ సమాజంలోనే ఉన్నాయని చెప్పక తప్పదు.

అంతేకాదు. ఆ సమాజంలో నిమ్నోన్నతాభావాలు అస్పృశ్యత, అనే సాంఘిక రుగ్మతలు మచ్చుకయినా కనిపించవు. భాషా, ప్రాంతీయ దురభిమానాలకు అసలే తావులేదు. మరోవైపు ప్రజల్లో నీతి నిజాయితీ, సహకారం, సానుభూతులు తొణికిసలాడేవి. అవినీతి, అశ్లీలం, దోపిడి, దొంగతనం, దగా, మోసం, జూదం, మద్యపానంలాంటి చెడుల్ని గురించిన సమస్యలు అక్కడ ఉత్పన్నమే కావు. అందువల్ల సమాజంలో ప్రతి చోటా శాంతి సామరస్యాలే విరాజిల్లాయి. ముస్లిముల నైతిక ప్రమాణాలను చూసి ఆనాడు ఇతర జాతులవారు ఆశ్చర్య చకితులయ్యేవారు. ముస్లిమ్‌లలో ఇంతటి గొప్ప మార్పు రావడానికి కారణం ఏమిటన్న ప్రశ్నకు వారికి లభించిన జవాబు ఒక్కటే - ఇదంతా ఇస్లామ్ ప్రభావం! ఇస్లామీయ విప్లవం తెచ్చిన మార్పు!!

సోదరులారా!

ఆనాడు ప్రజల్లో ఇలాంటి ఉన్నత ప్రమాణాలు ఉన్నాయంటే ఆ ప్రజలు స్వీకరించిన సందేశం దైవ సందేశమని, వారు అవలంబించిన ధర్మం సత్యధర్మం అని స్పష్టమవుతోంది. ఇంతటి గొప్ప మార్పు తీసుకురాగల శక్తి ఇస్లామ్‌లో తప్ప మరే ధర్మంలో కానరాదు. ఇదంతా దివ్యఖుర్‌ఆన్ పండించిన శుభాల పంట. కాని ఈనాడు మనం ఖుర్‌ఆన్‌ని అనుసరించడం మానేశాం. ఇస్లామీయ విప్లవం అన్న పదాన్ని కూడా మనం మరచిపోయాము, ఇస్లామీయ విప్లవ సారథి అయిన మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను వదలి ఇతర జాతుల నాయకులను అనుసరిస్తున్నాం. దైవ భావనను మస్జిద్ నాలుగు గోడల మధ్య పరిమితం చేశాం.

వాస్తవానికి దైవాన్ని గనక మనం మన యజమాని ప్రభువు, పాలకుడని అంగీకరించినప్పుడు, ఆయన బోధనలను మన జీవిత చట్టాలుగా స్వీకరించినప్పుడు మనలోనూ తప్పని సరిగా మహాప్రవక్త (సఅసం) కాలం నాటి మార్పులు వచ్చి తీరాలి. దేవుని పట్ల మన విశ్వాసం ఎంత పటిష్టంగా ఉంటుందో దాని ప్రభావం మానవ జీవితంపై అదే స్థాయిలో ఉంటుంది.

సోదరులారా!

మన సమస్యలన్నిటికి ఒక్కటే పరిష్కారం. సృష్టికర్తను మన యజమాని అని భావించి, ఆయన ఆజ్ఞలనే జీవిత చట్టాలుగా చేసుకోవాలి. ఇహపర లోకాలలో మనం సఫలం కావాలంటే ఇదొక్కటే దారి. దీనిగ్గాను అన్నిటి కంటే ముందు మనం అన్ని వ్యవహారాల్లోను దేవుడే మన యజమాని, పాలకుడని ఒప్పుకోవాలి. ఆ తరువాత ఆయన చట్టాలకు అనుగుణంగా జీవితాన్ని మలచుకొని, ఈ సత్యాన్నే ఇతర దైవదాసులక్కూడా అందజేస్తుండాలి. జీవితపు ప్రతి రంగంలోనూ మన వాక్క్రియల ద్వారా సత్యధర్మానికి సాక్ష్యమివ్వాలి. ఈ విధంగా ఇస్లామీయ విప్లవాన్ని ప్రారంభించాలి. ఈ మహాకార్యంలో అపజయమన్న ప్రసక్తి ఉండదు. మనం మహాప్రవక్త (సఅసం) కాలం నాటి గొప్పమార్పు తీసుకురాలేక పోవచ్చు, కాని దైవం మనపై మోపిన బాధ్యతను నెరవేర్చిన వారమైనా అవుతాము. ఆ విధంగా పరలోకంలో ఆయన ఆగ్రహం నుండయినా తప్పించుకోగలం.

35. సత్యానికి ప్రతిరూపం సౌశీల్యం

మహాశయులారా!

ప్రపంచంలో పుట్టే ప్రతి మానవుడికీ కొన్ని హక్కులు, కొన్ని బాధ్యతలు ఉంటాయి. మానవులు పరస్పరం కలసిమెలసి జీవిస్తున్నప్పుడు వారి జీవితం సుఖంగా సాఫీగా సాగాలంటే ప్రతి మానవుడూ ఇతరుల హక్కులను గుర్తించాలి. ఇలా గుర్తించి ఈ విషయంలో తనపై మోపబడే విధులను, బాధ్యతలను నిర్వర్తించాలి. ఈ విధులు, బాధ్యతల నిర్వహణనే నైతికత అంటారు. ప్రపంచంలో శాంతిభద్రతలు, సుఖ సంతోషాలు ఈ నైతికతపైనే ఆధారపడి ఉంటాయి. ప్రతి మనిషి ఇతరుల హక్కులను గుర్తించి తన విధులను, బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తే ఈ ప్రపంచం స్వర్గధామం అవుతుందనడంలో అతిశయోక్తి లేదు.

కాని ఈనాడు యావత్ ప్రపంచం అశాంతి, అలజడులతో నిండిపోయింది. దీనిక్కారణం ముఖ్యంగా ప్రజలు తోటి మానవుల హక్కులను గౌరవించకపోవడమే. సాధారణంగా ప్రజలు ఇతరుల హక్కుల్ని అయితే రాబట్టుకోవడానికి ప్రయత్నిస్తారు కాని, ఇతరుల హక్కుల విషయంలో తమ బాధ్యతల్ని మాత్రం నిర్వహించేందుకు సిద్ధంగా ఉండరు. ఈనాడు కార్మికులకు యజమానికి, ప్రజలకు ప్రభుత్వానికి, వ్యక్తికీ వ్యక్తికీ, జాతులకు జాతులకు మధ్య జరుగుతున్న ఘర్షణలకు మూల కారణం ఇదే.

ఇస్లామ్ ఈ చెడును నిర్మూలించి మానవుల జీవితాన్ని సుఖప్రదం చేయ గోరుతోంది. అది మానవులకు వీలయినంత ఎక్కువగా సత్కార్యాలు చేసేందుకు అవకాశాలు కల్పించి ప్రపంచం నుండి అశాంతి, అలజడులను పారదోలదలిచింది. అందుకే ఇస్లామ్ నీతికి ఎంతో ప్రాధాన్యతనిస్తుంది. మనిషిని మానవుడిగా మలచడానికి అది పరిపూర్ణమయిన ఒక నైతిక నియమావళిని సూచిస్తుంది. వాటిని ఆచరించమని నొక్కి చెబుతుంది. ఇలాంటి మహాభాగ్యాన్ని అల్లాహ్ మనకు అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ (సఅసం) ద్వారా పంపిన సంగతి మీకందరికీ తెలుసు. అందుకే ఆ మహనీయుని జీవితం లోని ప్రతి సంఘటన మనకు ఆదర్శప్రాయమైనది, ఆయన బోధించిన ఒక్కొక్క ప్రవచనంలో మనకు ఎంతో గుణపాఠం ఉంది. "నిస్సందేహంగా మీరు ఘనమయిన నైతికతపై ఉన్నార"ని ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ అభివర్ణించాడు. స్వయంగా ప్రియ ప్రవక్త (సఅసం) ఒక సందర్భంలో "నైతికత యొక్క పరిపూర్ణతకే నేను పంపబడ్డాన"ని అన్నారు.

హజ్రత్ అబూజర్ (రజిఅన్) సోదరుడు, మహా ప్రవక్త (సఅసం) ను కలుసుకొని

వచ్చిన తరువాత తన తెగవాళ్ళతో మాట్లాడుతూ "ఆయన తన జాతి వారికి ఉత్తమ నైతికతను బోధిస్తున్నారు" అని తెలిపారు.

నజాషీ దర్బారులో హజ్రత్ జాఫర్ (రజిఅన్) మహా ప్రవక్త (సఅసం) వ్యక్తిత్వాన్ని పరిచయం చేస్తున్నప్పుడు కూడా ఇలాంటి విషయమే ఆయన నోట వెలువడింది. "ఆయన మాకు విగ్రహపూజ మానమని, సత్యమే పలకమని, రక్తపాతం జోలికి పోవద్దని బోధించారు. ఆయనే మాకు అనాథల ఆస్తిని కాజేయకూడదని, పొరుగువాళ్ళను ఆదుకోవాలని, మచ్చలేని స్త్రీలపై అపనిందలు మోపవద్దని ఉపదేశించారు" అని హజ్రత్ జాఫర్ (రజిఅన్) నజాషీతో అన్నారు.

రోమ్ చక్రవర్తి దర్బారులో అబూసుఫ్యాన్ కూడా ఇదే విషయాన్ని ప్రస్తావించారు. అప్పటికి ఆయన ఇంకా ఇస్లామ్ స్వీకరించలేదు. రాజ దర్బారులో ఉన్నత సైనికాధికారులు, గొప్ప గొప్ప పండితులు ఉండిన నిండు కొలువులో అబూ సుఫ్యాన్ ప్రసంగిస్తూ "ఆయన మాతో ఒకే దైవాన్ని ఆరాధించమని చెబుతున్నారు. పవిత్ర జీవితం గడపమని బోధిస్తున్నారు. ఎల్లప్పుడూ సత్యమే పలకాలని, బంధువుల హక్కులను నెరవేర్చాలని ఆదేశిస్తున్నారు" అని చెప్పారు.

మహాప్రవక్త (సఅసం)పూర్తి జీవితం ఉన్నత నైతిక ప్రమాణాలతో నిండి వుంది. ఆయన జీవితపు ప్రతి రంగంలోనూ నీతిని పాటించమని మానవాళికి బోధించారు. ఇంట్లో, వీధిలో, న్యాయస్థానంలో, అధికార పీఠంపై ప్రతి చోటా సౌశీల్యం తొణికిసలాడుతూ ఉండాలని, జీవితపు ఏ వ్యవహారం కూడా నీతి లేకుండా, విచ్చలవిడిగా ఉండకూడదని బోధించారు. ఇస్లామ్ నైతికతను కేవలం బోధించడమే కాదు, దాన్ని జీవితంలో పూర్తిగా ఆచరించేందుకు తగిన ఏర్పాట్లు కూడా చేసింది. నీతి నియమాల విషయంలో ఏమాత్రం అశ్రద్ధ, అలక్ష్యం కనబరచినా అది సహించరాని నేరం కింద పరిగణిస్తుంది. ఒకవేళ మీరు నీతి నియమాలను పాటించకుండా ఎవరయినా ఒక వ్యక్తి హక్కును కాజేశారనుకోండి. అప్పుడు హక్కు కాజేయబడిన వ్యక్తి మిమ్మల్ని క్షమించే వరకు మీ అపరాధం క్షమించబడదు. అంతేకాదు, ఇస్లామీయ వ్యవస్థ ఉన్న దేశంలో అయితే న్యాయస్థానంలో మీ అపరాధానికి తగిన శిక్ష కూడా పడుతుంది.

ఒకవేళ మీరు మీ అపరాధం పట్ల పశ్చాత్తాపం చెందక, అటు న్యాయ స్థానంలోనూ పట్టుబడక ఉంటే, తుదిదినం నాడు విశ్వప్రభువు న్యాయస్థానంలో మాత్రం మీరు పట్టుబడక తప్పదు. ఇహలోకంలో మీరు ఎవరెవరి హక్కులనయితే కాజేశారో పరలోక న్యాయస్థానంలో వాటన్నిటినీ మీరు సంబంధిత వ్యక్తులకు తిరిగి ఇచ్చివేయవలసి ఉంటుంది. అక్కడ హక్కులను హక్కుదారులకు తిరిగి ఇవ్వడం

ఎలా జరుగుతుందో తెలుసా? హక్కులు కాజేసిన అపరాధానికి పరిహారంగా మీ పుణ్యాల్లో నుండి కొన్నింటిని తగ్గించి బాధితునికి అప్పగించబడతాయి, ప్రపంచంలో మీరు ఎవరిదయినా ఆస్తిని అన్యాయంగా స్వాధీనం చేసుకోవడంగాని, మోసం చేసి అతనికి రావలసిన హక్కును ఇవ్వకపోవడంగాని అతని పట్ల మీపై దైవం మోపిన, బాధ్యతల్ని నెరవేర్చకపోవడంగాని లేదా అతనికి మరే విధమయిన బాధ కలిగించడం గాని జరిగివుంటే దైవ న్యాయస్థానంలో అల్లాహ్ మీ సత్కర్మల్లో కొన్నిటిని తీసి హక్కుదారుడికి ఇప్పిస్తాడు. అప్పటికీ తీరకపోతే అతని పాపాల భారాన్ని మీపై వేస్తాడు.

సోదరులారా!

తుది దినం పరిస్థితి ఎంత భయానకంగా ఉంటుందో చూశారా? ఈ భయంకర పరిస్థితి నుండి మనల్ని కాపాడగలిగే వస్తువు ఏదయినా ఉందంటే అది మనం ఇహలోకంలో చేసుకున్న సత్కర్మలే. కాని ప్రపంచంలో మనం ఇతరుల హక్కుల్ని నెరవేర్చకపోతే ఈ సత్కర్మలు కూడా అక్కడ మనకు పనికిరాకుండా పోతాయి.

ఈ విషయంలో మహాప్రవక్త (సఅసం) ఎంత ఖండితంగా చెప్పారో వినండి. "ఒక సోదరుడు తన తోటి సోదరునిపై దౌర్జన్యం (లేదా అన్యాయం) చేస్తే అతను పీడిత సోదరునికి ఇహలోకంలోనే క్షమాపణ చెప్పుకోవాలి. లేకపోతే పరలోకంలో దాని పరిహారం చెల్లించవలసి వస్తుంది. అక్కడ పరిహారం చెల్లించడానికి దిర్హమ్‌లుగాని, దీనార్లుగాని (డబ్బుగాని) ఉండవు. కర్మలే ఉంటాయి. అత్యాచారి సత్కర్మలు పీడితునికి లభిస్తాయి. సత్కర్మలు లేని పక్షంలో పీడితుని దుష్కర్మలను తీసి అత్యా చారిపై రుద్దడం జరుగుతుంది." అని చెప్పారు ఆయన.

సోదరులారా! ఇప్పుడు నేను చెప్పిన విషయాలకన్నా ఎక్కువ విషయాలే మీలో చాలా మందికి తెలిసి వుండవచ్చు. కాని కేవలం తెలిసినంత మాత్రాన లాభం లేదు. వాటి ప్రభావం మన క్రియా జీవితంలో కన్పించాలి. ఇచ్చిపుచ్చుకోవడాల్లో ఇతర వ్యవహారాల్లో ఏది చేయాలో, ఏది చేయకూడదో మనకు బాగా తెలుసు. కాని తాత్కాలిక ప్రయోజనాలకు ఆశపడి నీతికి తిలోదకాలిస్తున్నాం. జంకూ గొంకూ లేకుండా ఇతరుల హక్కుల్ని సులభంగా కాజేస్తున్నాం. ఎల్లప్పుడూ సత్యం పలకడాన్ని మనం ఎన్నడో మరచి పోయాము. మామూలు లాభం కోసం కూడా మనం అలా సులువుగా అబద్ధమాడుతున్నాం. పొరుగు వారిని ప్రేమించడం, అగత్య పరుల్ని ఆదుకోవడం, ఇతరుల గౌరవాన్ని కాపాడడం, వ్యవహారాల్లో నిజాయితీగా మెలగడం మొదలయిన విషయాలు ఈనాడు మన జీవితాల్లో ఎక్కడా కానరావడంలేదు. వీటిని గురించి మనం ఆలోచించవలసిన అవసరం లేదా? ఈ విషయాల్లో కూడా ఏదయినా

భేదాభిప్రాయం ఉందా? పైగా ఇది మన సొంత విషయం. ఇతరుల్ని సంస్కరించాలంటే కాస్త కష్టంతో కూడిన పనని చెప్పవచ్చు. కాని ఇది మన ఆత్మ సంస్కరణకు సంబంధించిన విషయం. అలాంటప్పుడు మన లోపాల్ని మనం సరిదిద్దుకోకపోతే ఇతరు లెవరొచ్చి సరిదిద్దుతారు?

ఈ ప్రపంచంలో ఆచరణకోసం మనకివ్వబడిన వ్యవధి ఎప్పుడు అంతమవుతుందో ఎవరికీ తెలియదు. మరణదూత ఎప్పుడూ మనిషి చుట్టూ తిరుగుతూ ఉంటాడు. ఎప్పుడు దైవాజ్ఞయితే అప్పుడు ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా మన ప్రాణాల్ని తీసికెళతాడు. కాబట్టి మనకివ్వబడిన గడువు ముగియకముందే తోటి మానవుల హక్కుల్ని గౌరవిస్తూ నీతి నిజాయితీతో జీవించడమే విజ్ఞత అనిపించుకుంటుంది. నీతిమంతమయిన జీవితం గడపడం పరలోక సాఫల్యం కోసమే కాదు, ఇహలోక సుఖ సంతోషాలు పొందడానికి కూడా అవసరమే. నైతికత మానవత్వానికి మారుపేరు. విజయానికి మూలాధారం. నైతికత లోపించిన ముస్లిమ్ జీవితం ఆత్మలేని శరీరంతో సమానం. అందుకే మన ప్రియ ప్రవక్త (సఅసం) "మీలో అత్యున్నత శీలం కలవాడే అందరికన్నా ఉత్తముడ"న్నారు.

నైతికతను గురించి నొక్కి చెబుతూ ఇంకా ఆయన ఏమేమి బోధించారో చూడండి:

> "తుదిదినం త్రాసులో సౌశీల్యానికి మించిన బరువైన వస్తువు మరేమీ ఉండదు."
>
> "దైవం తరపున ప్రజలకు ప్రసాదించబడిన వాటిలో అత్యుత్తమమయినది సుగుణ సంపత్తే."
>
> "దేవుని దాసులలో అందరికన్నా ఉన్నత శీలం కలవాడే దేవునికి ప్రియమయిన వాడు."

ఒకసారి దైవ సందేశహరుని (సఅసం) దగ్గర ఇద్దరు స్త్రీల ప్రస్తావన వచ్చింది. వారిలో ఒకామె రాత్రంతా నమాజ్ చేస్తుంది. పగటిపూట ఉపవాసం పాటిస్తుంది. దైవ మార్గంలో ధనం కూడా ఖర్చుపెడుతుంది. ఆమె నోటి దురుసుతనం వల్ల ఆమె ఇరుగు పొరుగు వాళ్ళకు ఎంతో బాధ కలిగేది. రెండవ స్త్రీ ఫర్జ్ నమాజ్ మాత్రమే చేస్తుంది. ఫర్జ్ రోజాలే పాటిస్తుంది. పేదలకు కాస్తో కూస్తో సహాయం కూడా చేస్తుంది. అయితే ఆమె ఎవరి మనస్సూ నొప్పించదు. ఈ మాటలు దైవ ప్రవక్త (సఅసం) విని మొదటి మహిళ విషయంలో "అందులో ఎలాంటి పుణ్యంలేదు. ఆమె తన దుష్ప్రవర్తన మూలంగా శిక్ష అనుభవిస్తుంది" అని చెప్పారు. రెండవ స్త్రీ విషయంలో "ఆమె స్వర్గ నివాసి అవుతుంద"ని పలికారు.

సోదరులారా!

సచ్ఛీలం, సత్ప్రవర్తనలకు ఎంత ప్రాముఖ్యం ఉందో ఈ సంఘటన ద్వారా మనకు స్పష్టంగా తెలుస్తోంది. అంచేత మనం మన నైతికతను, వ్యవహారాలను సరిదిద్దుకోవడానికి ప్రయత్నించాలి. గతంలో ఏవయినా పొరపాట్లు జరిగివుంటే పశ్చాత్తాపంతో దైవసన్నిధిలో దుఆ చేయాలి. మనం ఎవరెవరి హక్కులు కాజేశామో ఆయా వ్యక్తుల దగ్గర క్షమాపణ చెప్పుకోవాలి. ఇక ముందు ఏ ఒక్కరి మనస్సూ నొప్పించమని; నీతి, నిజాయితీ, సౌమ్యత, సహృదయతలు నిండిన కొత్త జీవితాన్ని ప్రారంభిస్తామని గట్టిగా నిర్ణయించుకోవాలి. మనం ఎలాంటి మనోవాంఛలకు లొంగకుండా దేవుడు మనల్ని సత్యం, సదాచరణ, నీతి నియమాలపై స్థిరంగా నడిపించుగాక!

36. పొరుగువారి హక్కులు

మహాశయులారా!

పొరుగువారిని ప్రేమించడం, వారి హక్కులను నెరవేర్చడం పట్ల ముస్లిములుగా మనపై ఎంతో బాధ్యత ఉంది. అల్లాహ్ ఇలా ఆదేశిస్తున్నాడు. "మీరంతా అల్లాహ్ దాస్యం చెయ్యండి. ఎవర్నీ ఆయనతోపాటు భాగస్వాములుగా చెయ్యవద్దు. తల్లిదండ్రుల ఎడల సద్భావంతో మెలగండి. బంధువుల్ని, అనాధల్ని, నిరుపేదల్ని ఆదుకోండి. పొరుగున ఉన్న బంధువులు, అపరిచితులయిన పొరుగువారు, ప్రక్కనున్న సహవాసులు, బాటసారులు, మీ స్వాధీనంలో ఉన్న దాసదాసీజనం పట్ల ఉదారంగా వ్యవహరించండి." ఈ ఆయత్ పొరుగు వారి పట్ల మన బాధ్యతల్ని స్పష్టంచేస్తోంది. ముఖ్యంగా మన సమాజంలో ఈ విషయమై దృష్టి కేంద్రీకరించవలసిన అవసరం ఎంతో ఉంది.

ఈనాడు మన సమాజం క్రమేణా దైవభీతికి దూరమయిపోతోంది. దాంతోపాటు ప్రజలు తమ ఇరగుపొరుగు వారి హక్కులను గౌరవించడంలో ఎంతో నిర్లక్ష్యం చేస్తున్నారు. ఫలితంగా స్పర్థలు, తగాదాలు తలెత్తుతున్నాయి. కాని ఇస్లామ్ పొరుగువారి మధ్య ప్రేమ, మైత్రి, సోదరభావాన్ని కలిగించి పటిష్టమైన సంబంధాలను ఏర్పరచదలిచింది. పొరుగు వారంటే కేవలం పొరుగింటివాళ్ళే కాదు. అనేకచోట్ల, అనేక సందర్భాల్లో మనకు పొరుగువారు తారసపడతారు. ఉదాహరణకు, బజార్లో ఏదయినా ఒక దుకాణం దగ్గర వస్తువులు కొనడానికి మనమూ వస్తాము, ఇతరులూ వస్తారు. వారూ పొరుగు వారే. ప్రయాణంలో తోటి ప్రయాణీకులు మనకు పొరుగువారే అవుతారు. ఇలా మనం ఎక్కడికి పోయినా, ఏ పని చేసినా ఇతరులు మనకు తోడవుతారు. ఈ 'పొరుగు' వారి పట్ల సద్భావంతో మెలగడం మన నైతిక ధర్మం.

పొరుగువారి విషయంలో మన ప్రియప్రవక్త (సఅసం) మనకు చాలా తాకీదు చేశారు. పొరుగువారి పట్ల మన బాధ్యతలేమిటో, వాటిని ఎంతవరకు నెరవేర్చాలో ఆయన స్పష్టంగా బోధించారు. ఇక్కడ నేను ప్రవక్త (సఅసం) ప్రవచనాలను కొన్నింటిని వినిపిస్తాను.

ఒకసారి మహాప్రవక్త (సఅసం) సెలవిచ్చారు, "అతను విశ్వాసి కాడు, దైవ సాక్షిగా అతను విశ్వాసి కాడు," అప్పుడు "దైవ ప్రవక్తా! ఎవరూ అతను?" అని అడిగారు అక్కడున్న వారు. "ఎవరిచేత కలిగే కష్టాలవల్లనయితే అతని పొరుగువారు సురక్షితంగా ఉండరో అతను."

"ఎవరి పొరుగువారైతే అతని వల్ల కలిగే నష్టాలకు లోనవుతారో అతను."

'ఎవరి పొరుగువారికయితే అతను పెట్టే కష్టాల వల్ల శాంతి శూన్యమవుతుందో అతను' అని ప్రవచించారు మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం). - (బుఖారి, ముస్లిమ్ - అబూహురైరా)

"జిబ్రీల్ (అస్సలాం) పొరుగువారి పట్ల మంచిగా ప్రవర్తించాలని ప్రతినిత్యం నాకు తాకీదు చేసేవారు. చివరికి ఇరుగు పొరుగు వారిని పరస్పరం వారసులుగా ప్రకటిస్తారేమో నన్న అనుమానం కలిగేది" అని దైవప్రవక్త సందేశహరులు (సఅసం) చెప్పారు. *- (ముత్తఫకున్ అలైహ్ - ఆయిషా)*

ఇబ్ను అబ్బాస్ ఉల్లేఖించారు, "తాను కడుపు నిండా భుజించి, తన ప్రక్కన ఉండే పొరుగు వాడు పస్తులుండడాన్ని సహించే వ్యక్తి విశ్వాసి కాజాలడు" అని మహాప్రవక్త (సఅసం) బోధించగా నేను విన్నాను. (మిష్కాత్)

అబూజర్ (రజిఅన్)కు దైవ ప్రవక్త (సఅసం) ఇలా ఉపదేశించారు, "అబూజర్! నీవు ఏదైనా కూర వండినప్పుడు అందులో కాస్త నీరు ఎక్కువ పొయ్యి; పొరుగువారిని కూడా కనిపెడుతూ ఉండు." *(ముస్లిమ్)*

మహాప్రవక్త (సఅసం) ఇలా బోధించారు, "ముస్లిమ్ మహిళల్లారా! పొరుగింటి స్త్రీకి ఇచ్చే ఏ కానుకనయినా తుచ్ఛమయిందిగా భావించకండి, అది ఒక మేక కాలి డెక్కయినా సరే." *(బుఖారి, ముస్లిమ్-అబూహురైరా)*

సాధారణంగా స్త్రీలు తమ మనస్తత్వం రీత్యా సాధారణమయిన వస్తువును కానుకగా ఇవ్వాలంటే అభిమానం అడ్డువచ్చి సిగ్గుపడతారు. కానుకగా పంపదలచుకున్న వస్తువు కాస్త గొప్పదై ఉండాలని భావిస్తారు. ఈ మనస్తత్వాన్ని మార్చడానికే మహాప్రవక్త (సఅసం) ఇలా బోధించారు. ఎలాంటి "సాధారణమయిన వస్తువయినా పొరుగింటికి కానుకగా పంపదలచుకుంటే అందులో సిగ్గుపడాల్సిన అవసరం లేదు. అలాగే కానుకగా వచ్చిన వస్తువు ఎంత చిన్నదయినా దాన్ని ప్రేమతో, ఆదరణతో స్వీకరించాలి. దాన్ని తుచ్ఛంగా భావించడంగాని, దాన్ని విమర్శించడం గాని తగదు. అయితే కానుకలు ఇచ్చిపుచ్చుకోవడాలు మాత్రం జరగాలి."

హజ్రత్ ఆయిషా (రజిఅన్) ఇలా ఉల్లేఖించారు. "నాకు ఇద్దరు పొరుగువారుంటే వారిలో కానుక ఎవరికి పంపాలి?" అని నేనడిగినదానికి మహాప్రవక్త (సఅసం), "నీ వాకిలికి ఎవరి వాకిలి అతి సమీపమో వారికి (పంపాలి)" అని ప్రవచించారు. *(బుఖారి)*

"పొరుగు" అంటే ఇరుగు పొరుగున వున్న నలభయి ఇళ్ళ వరకు వారి పరిధి. వారిలో ఎవరి ఇల్లు ఎంత సమీపాన ఉంటే వారి హక్కు అంతే అధికంగా ఉంటుంది.

"అల్లాహ్ మరియు ఆయన సందేశహరుడు (సఅసం) తనను ప్రేమించాలని

కోరే వ్యక్తి వీటిని పాటించాలి, మాట్లాడితే సత్యమే పలకాలి. నమ్మి అమానతును అప్పగిస్తే దాన్ని దాని యజమానికి సురక్షితంగా అందజెయ్యాలి. పొరుగువారితో మంచిగా ప్రవర్తించాలి" అని మహాప్రవక్త (సఅసం) ఉపదేశించారు. *(మిష్కాత్-అబ్దుర్రహ్మాన్ బిన్ అబిఖరాద్)*

ఒక వ్యక్తి మహాప్రవక్త (సఅసం) వద్దకు వచ్చి, "ఫలానా స్త్రీ ఎన్నెన్నో నఫిల్ నమాజులు చేస్తుంది, నఫిల్ ఉపవాసాలు పాటిస్తుంది, దాన ధర్మాలు చేస్తుంది; ఈ సత్కార్యంలో ఆమె చాలా ఖ్యాతి పొందింది కూడా. అయితే ఆమె తన నోటి ద్వారా తన పొరుగువారిని కష్టపెడుతుంది" అని చెప్పాడు. దానికి మహాప్రవక్త (సఅసం), "ఆమె నరకానికే పోతుంది" అని పలికారు. తిరిగి ఆ వ్యక్తి అన్నాడు, "దైవ ప్రవక్తా! ఫలానా స్త్రీని గురించి, ఆమె అరుదుగా నఫిల్ రోజాలు పాటిస్తుందని, అతి స్వల్పంగా నఫిల్ నమాజులు ఆచరిస్తుందని, పాల జున్ను ముక్కల్ని కొన్నింటిని మాత్రం దానం చేస్తుందనిప్రతీతి. కాని ఆమె తన నోటితో తన పొరుగువారిని కష్టపెట్టదు." ఇది విని మహాప్రవక్త (సఅసం) "ఈమె స్వర్గ నివాసి" అని సెలవిచ్చారు.

(మిష్కాత్ - అబూ హురైరా)

మహాప్రవక్త(సఅసం) ప్రవచించారు, "ప్రళయ దినాన ప్రప్రథమంగా విచారణకు హాజరయ్యే వారు ఇద్దరు పొరుగువారు"

(మిష్కాత్ - అకబా బిన్ ఆమిర్)

అంటే ప్రళయ దినాన మానవ హక్కులకు సంబంధించిన కేసుల్లో మొట్టమొదటి కేసు ఇరుగు పొరుగువారిదయి ఉంటుందన్న మాట. ఇరుగుపొరుగు వారు తమ ప్రపంచజీవితంలో సామరస్యంతో, ప్రేమాభిమానాలతో మెలిగిన వారైతే వారి కేసు అలా రచ్చకెక్కేది కాదు. వారిలో ఏ ఒక్కరో లేదా ఉభయులో తమ పొరుగువారి పట్ల అన్యాయంగా, అధర్మంగా ప్రవర్తించి ఉంటారు. పరస్పరం బాధ కలిగించుకున్నవారు, ఒకరిపై మరొకరు దౌర్జన్యం చేసుకున్నవారయి ఉంటారు.

సోదరులారా!

దేవుని హక్కుల్లో ప్రప్రథమంగా నమాజ్‌ను గురించి విచారణ జరుగుతుందని హదీసుల ద్వారా తెలుస్తోంది. ఆ తరువాత మానవ హక్కుల్లో పొరుగువారి హక్కుకు అలాంటి ప్రాధాన్యత ఇవ్వబడిందంటే మానవ జీవితంలో దాని ప్రాముఖ్యం ఎలాంటిదో గ్రహించవచ్చు. కాని అనేక మంది దీన్ని ఒక పెద్ద సమస్యగా చిత్రించి అనవసరంగా చిక్కుల్లో పడిపోతారు. మేము మటుకు మా పొరుగు వారి పట్ల మంచిగా ప్రవర్తించడానికి సిద్ధంగానే ఉన్నాం, కాని మా పొరుగువారే ఇలాంటి వాళ్ళు, అలాంటివాళ్ళు, అలాంటి

వాళ్ళతో ఎలా సర్దుకుపోగలం?అంటారు వీరు. నిజమే, ఇది ఒక విధమయిన చిక్కు సమస్యే. పొరుగువాడు మంచివాడు, సచ్ఛీలుడయితే అతని పట్ల మంచిగా ప్రవర్తిస్తారు. కాని సోదరులారా! మనం ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. మనం కోరినటువంటి మంచివాడే మన పొరుగువాడయివుంటే సామరస్యం లేకపోవడం అన్న ప్రసక్తే రాదు. ఒకవేళ వచ్చినా మనకంటే ముందే ఆ వ్యక్తి ముందుకు వచ్చి వ్యవహారాన్ని చక్కబెడ తాడు. అలాంటప్పుడు మనకు సమస్యేముంటుంది? పొరుగు వారిని ప్రేమించి, వారి హక్కులను నెరవేర్చవలసిన అవసరం ఇంకెక్కడ వస్తుంది మనకు?

మంచివాళ్ళతో మంచిగా ప్రవర్తించడంలో, సర్దుకుపోవడంలో విశేషమేమీలేదు, కాని అల్లాహ్ మనకు ఈమాన్ భాగ్యాన్ని ప్రసాదించాడు. అల్లాహ్, ఆయన ప్రవక్త (సఅసం), బోధనల ప్రకారం ఎలాంటి పొరుగువానితో నైనా సరే మంచిగా మెలగడమే మన కర్తవ్యం. ఈ కర్తవ్యాన్ని విస్మరిస్తే ప్రళయ దినాన మన వ్యవహారం రచ్చకెక్కుతుంది. ఆపై ఎలాంటి భయంకర పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుందో ఊహించడమే కష్టం. కాబట్టి మన పొరుగువారు ఎలాంటి వారయినా వారి పట్ల మన బాధ్యతలేమిటని ఆత్మపరిశీలన చేసుకొని వ్యవహరించాలి. కాస్త సహనంతో వ్యవహరిస్తే ఎంత చెడ్డ పొరుగువాడైనా ఎప్పుడో ఒకప్పుడు మంచివాడిగా మారవచ్చు. అప్పుడు పరలోకంలోనే కాదు, ఇహలోకంలోనూ దీని సత్ఫలితాలను మనం చూడ గలుగుతాము.

37. షిర్క్‌- ఓ ఘోర అత్యాచారం

మహాశయులారా!

యావత్ సృష్టిలో దేవుడు ఒక్క మానవుడికే బుద్ధి వివేకాలను ప్రసాదించాడు. మానవుడు ఈ బుద్ధివివేకాలను వినియోగించి తన నిజప్రభువు అయిన సృష్టికర్త పట్ల విధేయుడయి, కృతజ్ఞుడయి మెలగాలి. తిరస్కారం, తిరుగుబాటు, నమ్మక ద్రోహాలకు పాల్పడకూడదు; తనకు లభించినవన్నీ దైవం అనుగ్రహించినవేనని దృఢంగా విశ్వసించాలి. నా శరీరం, నా ప్రాణం, నా ధనం, నా సంతానం, నా శక్తిసామర్థ్యాలు అన్నీ దైవం ప్రసాదించినవేనన్నభావన హృదయంలో స్థిరంగా చోటు చేసుకోవాలి. సృష్టికర్త మనకు చేసిన మేళ్ళకు కృతజ్ఞతగా ఆయన్ని ఎల్లప్పుడూ స్మరిస్తూ ఉండాలి. ఏదయినా కష్టం వస్తే సహనం వహించాలిగాని కృతఘ్నుడయి ప్రవర్తించకూడదు.

అంతేకాదు, దైవంపట్ల మన వినయ విధేయతలు ఆచరణలో కూడా చూపెట్టాలి. దేవుని అభీష్టానికి వ్యతిరేకంగా ఏదీ చెయ్యకూడదు. ఆయనకు ఇష్టంలేని ఏ పని జోలికి పోకూడదు. ఎల్లప్పుడూ ఆయనకు ఇష్టమయిన పనులనే చేస్తూ ఉండాలి. మనకు దైవం అనుగ్రహించినవాటిని అవి లభించని పేదలకు అందజేయాలి. దైవం పట్ల కృతజ్ఞులయి ఉండేందుకు చేయవలసిన మరొక ముఖ్యమయిన పని ఏమంటే, దైవద్రోహులకు వ్యతిరేకంగా చెడును త్రుంచి, మంచిని పెంచేందుకు పాటుపడాలి. చెడు అంతమయి, ప్రజలు దేవునికి ఇష్టమయిన జీవితాన్ని సులభంగా గడిపేందుకు వీలయిన వాతావరణాన్ని సృజించాలి. దాని కోసం మన శక్తిసామర్థ్యాలన్నీ వినియోగించి తీవ్రంగా పోరాడాలి. ఇదే మనం దేవునికి విధేయులయి కృతజ్ఞతలు చెల్లించవలసిన అసలయిన పద్ధతి. సృష్టికర్తను నమ్మి, మనకు లభించినదంతా ఆయన అనుగ్రహించినదేనన్న విశ్వాసం గల ప్రతి మానవుడూ తన మనోవాక్కాయ కర్మల ద్వారా ఈ కృతజ్ఞతా భావాన్ని వ్యక్తపరచాలి.

సోదరులారా!

మనం దేవుని పట్ల ఇలా కృతజ్ఞతాభావాన్ని వ్యక్తపరుస్తున్నామంటే దానివల్ల మనకే ప్రయోజనం ఉంది కాని దేవునికి కాదు. మానవుడు కృతఘ్నుడు కావడమండే కుఫ్ర్ వహిస్తున్నట్లే. ఈ కుఫ్ర్ వల్ల నష్టపొయ్యేది మానవుడే. దైవానికి ఎలాంటి నష్టం కలగదు. ఆయన దైవత్వం ఎవరి కృతజ్ఞతలపై ఆధారపడిలేదు. యావత్ సృష్టిరాసులు కృతజ్ఞతలు చెల్లించినా ఆయన దైవత్వానికి ఒరిగేదేమీ లేదు. ఒకవేళ సృష్టిరాసులన్నీ కుఫ్ర్ వహించినా ఆయన దైవత్వానికి ఎలాంటి లోటూ రాదు. దేవుని దైవత్వం ఆయన

స్వశక్తిపై ఆధారపడి ఉంది. సృష్టిలోని అణువణువూ ఆయన ఔన్నత్యానికి, శక్తిసామర్థ్యాలకు సాక్షీభూతంగా ఉన్నాయి. ప్రతి వస్తువూ ఆయనే సృష్టికర్త, ప్రభువు, పరిపోషకుడని సాక్ష్యమిస్తోంది? అనుక్షణం ఆయన్నే స్తుతిస్తోంది.

దేవుని విషయంలో ఈ యదార్థం ఏ మానవుని హృదయంలోనైతే వేరుగొంటుందో అతను తన తోటి మానవులక్కూడా దాన్ని తెలిపి, దాని ప్రకారం వాళ్ళను మలచడానికి ప్రయత్నిస్తాడు. ముఖ్యంగా అతను ఈ దృష్టితో తన సంతానానికి శిక్షణ ఇస్తాడు. తన సంతానానికి సరయిన శిక్షణ ఇచ్చే బాధ్యత తన పైనే ఉందని అతనికి తెలుసు. ఈ విషయంలో సృష్టికర్త రేపు మరణానంతరం తనని ప్రశ్నిస్తాడని కూడా అతనికి తెలుసు. ఖుర్‌ఆన్‌లో ఇలాంటి ఒక విశ్వాసి అయిన హజ్రత్ లుఖ్మాన్ (అలైహి)ను గురించిన ప్రస్తావన వచ్చింది. ఆయన తన కొడుకును ఏ దృక్పథంలో చూశారో, ఎలాంటి శిక్షణ ఇచ్చారో ఖుర్‌ఆన్ మనకు తెలిపింది. అన్నిటికంటే ముందు ఆయన షిర్క్ యొక్క నష్టాన్ని గురించి కొడుకుని హెచ్చరించారు. "బాబూ! నీవు ఇతరుల్ని అల్లాహ్‌కు సాటి కల్పించకు. అది షిర్క్. షిర్క్ అన్నిటికంటే పెద్ద జులుం. ఇది ఎన్నటికీ క్షమించరాని మహాపరాధం" అంటూ ఆయన తన కొడుకును హితబోధ చేశారు.

జులుం లేక అత్యాచారం అంటే ఇతరుల హక్కును కొల్లగొట్టడం. వారికి అన్యాయం చేయడం అని అర్థం. మానవుడు ఏ దైవేతరులనయితే తన సృష్టికర్త, పాలకుడు, పరిపోషకుడైన దైవానికి సహవర్తనులుగా తెచ్చి నిలబెడ్తాడో వాటికి తనను సృజించడంలోగాని, పోషించడంలోగాని, ఇతర వస్తువులను అనుగ్రహించడంలోగాని ఎలాంటి పాత్రలేదు. ఈ కారణంగా షిర్క్ అన్నిటికంటే పెద్ద అత్యాచారం అవుతుంది. ఇంతకంటే పెద్ద అన్యాయం కూడా మరొకటి ఉండదు.

మానవుడు కేవలం సృష్టికర్తనే ఆరాధించాలి. ఆయన ముందే మోకరిల్లాలి. ఇది మానవునిపై సృష్టికర్తకున్న హక్కు. కాని అతను ఇతరులను ఆరాధిస్తూ, వారి ముందు తలవంచుతూ, వారికి దాస్యం చేస్తున్నాడు. ఇలా అతను తన సృష్టికర్త, పాలకుడు, పరిపోషకుడయిన దేవుని హక్కును కాజేస్తున్నాడు. అతను దైవేతరులను ఆరాధించే మార్గంలో తన శారీరక, మానసిక శక్తి సామర్థ్యాలన్నిటినీ ఉపయోగిస్తున్నాడు. ఇంకా ఇతర అనేక వస్తువులను ఉపయోగిస్తున్నాడు. అంటే అతను వీటన్నిటిపై అత్యాచారం చేస్తున్నాడన్నమాట. నిజానికి సృష్టికర్త ప్రసాదించిన వాటిని ఆయన కోసమే వినియోగించాలి. ఆయన ఆజ్ఞలనే శిరసావహించాలి. కాని మనిషి సృష్టికర్తను వదలి సృష్టిరాసులను ఆరాధిస్తూ తనపై తాను అత్యాచారం చేసుకుంటున్నాడు. ఇంకా ఇతర అనేక వస్తువులను దుర్వినియోగం చేస్తూ వాటిపై అత్యాచారం చేస్తున్నాడు. ఈ విధంగా ఒక బహుదైవారాధకుని జీవితమంతా అత్యాచారంతో నిండి ఉంటుంది.

ఖుర్‌ఆన్ షిర్క్ వంటి ఘోర అత్యాచారాన్ని ఖండించడంతోపాటు తల్లిదండ్రుల

పట్ల సద్వర్తనుడయి మెలగమని మనిషిని ఆదేశిస్తోంది. దీన్నిబట్టి దేవుని దృష్టిలో తల్లిదండ్రుల సేవకున్న ప్రాముఖ్యం ఏమిటో స్పష్టమవుతోంది. మనిషికి ఏ ఆధారంలేని స్థితిలో తల్లిదండ్రులు అతడ్ని పెంచిపోషించారు. అలాంటి తల్లిదండ్రుల పట్ల కృతజ్ఞుడయి విధేయత కలిగి ఉండమని దేవుడు ఆజ్ఞాపిస్తున్నాడు. అయితే మనిషిపై అతని తల్లిదండ్రులకన్నా దేవుని హక్కు ముఖ్యమయినది. ఒకవేళ తల్లిదండ్రులు దైవాజ్ఞకు వ్యతిరేకంగా ఏదయినా పని చేయమని ఆజ్ఞాపిస్తే అలాంటి ఆజ్ఞను శిరసావహించకూడదు. అయితే తల్లిదండ్రులు ఎంత చెడ్డవారయినప్పటికీ వాళ్ళ హక్కులను గౌరవించి వారిని అన్నివిధాలా ఆదరించాలి.

ఇక సంతానాన్ని ధర్మమార్గాన నడిపించాలంటే వారిలో ముందు దైవం పట్ల విశ్వాసాన్ని జనింపజేయాలి, దేవుడే సర్వ శక్తిమంతుడు, మన ప్రతి కదలికను ఒక కంట కనిపెట్టేవాడు, మరణానంతరం ఆయన దగ్గరికే పోవలసి ఉంది అన్న నమ్మకాన్ని కలిగించాలి. ఇలాంటి నమ్మకం లేకపోతే మనిషి ధర్మమార్గాన స్థిరంగా ఉండలేడు.

ఆ తరువాత అతడ్ని దేవుని విధేయత వైపునకు మళ్ళించాలి. ముఖ్యంగా నమాజ్‌ను గురించి ఉపదేశించాలి . అప్పుడే అతను ఇతరుల్లో కూడా చెడును పోగొట్టి, మంచిని పెంచే ప్రయత్నం చేయగలడని ఆశించగలం. ఇలా సంతానానికి చిన్నప్పటి నుంచే సరయిన శిక్షణ ఇవ్వని తల్లిదండ్రులు వారు పెద్దవారాయ్యాక పశ్చాత్తాపం పడతారు. తమ పిల్లలు ఇక దారికి రారని నిరాశపడతారు. దృఢమైన విశ్వాసం ఉన్నప్పుడే మనిషి దైవమార్గంలో వచ్చే కష్టనష్టాలను భరించగలుగుతాడు. తన ఆశయ సాధనలో ముందుకు పురోగమిస్తాడు.

ఇతరుల్ని మంచి వైపునకు పిలువడం, చెడుల నుంచి వారించడం ఎంతో ముఖ్యమయిన ధర్మకార్యం. ఇందులో నీతిమంతులే సఫలం కాగలరు. కాబట్టి మనం ఇతరులతో కలుపుగోలుగా మెలుగుతూ హృదయాలను ఆకట్టుకునే విధంగా వారికి దైవ సందేశాన్ని అందజేయాలి. చెడువర్తనం, గర్వం, కోపం, తలబిరుసుతనంతో, మనసునొప్పించే మాటలతో ఈ కార్యం చేసేవాళ్ళు ఎన్నటికీ సఫలం కాలేరు. పైపెచ్చు ఇలాంటివారి వల్ల లక్ష్యం కూడా దెబ్బతింటుంది. వీరు ఈ మహా కార్యం చేస్తూ త్వరలోనే నిరాశజెందుతారు. తమతోపాటు తోటి కార్యకర్తలను కూడా నిరాశపరుస్తారు. ఇది ఎంతో సహనంతో , విజ్ఞత, వివేచనలతో చేయవలసిన పని. దైవం మనందరికి ఆ సహనం, విజ్ఞత వివేచనలు ప్రసాదించుగాక!

38. మనిషిని మానవుడిగా తీర్చిదిద్దే పరలోక విశ్వాసం

మహాశయులారా!

ఖుర్‌ఆన్ అల్లాహ్ తరపు నుంచి అవతరించిన దివ్య గ్రంథం. ప్రపంచంలోని యావత్ మానవాళి కోసం పంపబడిన బోధనామృతం. అయితే ఈ గ్రంథం ద్వారా ప్రయోజనం పొందడానికి మానవుడు విశ్వ వ్యవస్థను గురించి ఈ గ్రంథం తెలిపే కొన్ని వాస్తవికతలను ఒప్పుకోవలసి ఉంటుంది. ఉదాహరణకు - ఈ విశ్వం సృష్టికర్త లేకుండా ఉనికిలోకి రాలేదు. దీన్ని సృష్టించిన వాడొకడున్నాడు. ఆయనే ఈ విశ్వానికి యజమాని. ఆయనే మానవుడ్ని కూడా సృజించాడు. ఈ ప్రపంచంలో మానవుడు తన ఇష్టమొచ్చినట్లు విచ్చలవిడిగా వ్యవహరించడానికి అతనికి స్వేచ్ఛా స్వయం అధికారాలు ఇవ్వబడలేదు. అతను తాను చేసే ప్రతి పనికీ దైవం ఎదుట జవాబుదారుడయి ఉన్నాడు. అతను తన ప్రభువు, యజమాని అయిన దేవుని సన్నిధిలో నిలబడే ఒక రోజు రానున్నది. ఇహలోకంలో తాను చేసిన మంచి చెడ్డలకు ఆ రోజు సమాధానం చెప్పుకోవలసి ఉంటుంది.

ఖుర్‌ఆన్‌లో ఇలాంటివే ఇంకా అనేక మౌలిక యదార్థాలను గురించి మానవుడికి తెలియజేయడం జరిగింది. మానవుడు వీటిని ఒప్పుకోవాలి. వీటికి అనుగుణంగా తన జీవితాన్ని మలచుకోవడానికి, ఖుర్‌ఆన్ సూచించే వైఖరిని తన క్రియాజీవితంలో వ్యక్తపరచడానికి సిద్ధం కావాలి. అలాంటి వాడే ఖుర్‌ఆన్ వల్ల ప్రయోజనం పొందగలడు. అలాంటి వ్యక్తికే ఖుర్‌ఆన్ మార్గ దర్శకత్వం చూపిస్తుంది.

సోదరులారా!

ఖుర్‌ఆన్ మానవులకు ఒక నిర్ణీత మార్గాన్ని చూపుతోంది. ఈ మార్గాన్ని అనుసరించినవారే ప్రపంచంలోనూ, పరలోకంలోనూ సాఫల్యం చెందగలరని ప్రతి యుగంలో ప్రతి దైవ ప్రవక్తా మానవులకు బోధించాడు. ఈ మార్గంపై నడవని వారు ఘోర నష్టానికి గురవుతారని వారు హెచ్చరించారు. అయితే ఈ మార్గంలో నడవడానికి మానవులకు సాధారణంగా ఒక విషయం అడ్డువస్తుంది. అది పరలోక తిరస్కారం. ఈ పరలోక తిరస్కారమే మానవుడ్ని బాధ్యత లేనివాడిగా తయారుచేస్తుంది. ఈ కారణంగానే అతను ప్రాపంచిక వ్యామోహపరుడిగా, మనోవాంఛల దాసుడిగా మారుతాడు. ఎలాంటి నైతిక కట్టుబాటులూ అతడ్ని బంధించి ఉంచలేవు. ప్రతి విషయంలోనూ అతను ప్రాపంచిక లాభాలపైనే దృష్టి కేంద్రీకరించి భోగలాలసుడిగా, పరమ స్వార్థపరుడిగా జీవిస్తాడు.

కేవలం పరలోక తిరస్కారం కారణంగా సరైన జీవన మార్గాన్ని పొందకుండా నాశనమయిన అనేక జాతులున్నాయి. వాటిలో కొన్ని జాతుల గాథలు ఉదాహరణగా ఖుర్‌ఆన్‌లో ప్రస్తావించబడ్డాయి. ఈ జాతులకు పట్టిన దుర్గతిని తెలిపే చిహ్నాలు ప్రపంచంలో ఇప్పటికీ అక్కడక్కడా వున్నాయి. ఫిరౌన్, అతని జాతి విషయాన్ని చూడండి. సమూద్ జాతి నాయకుల గాథని గమనించండి. లూత్ జాతిని గురించి ఆలోచించండి. వీరంతా పరలోకాన్ని తిరస్కరించారు. ఆ తిరస్కార ధోరణి వారిని అహంకారులుగా, కోరికల బానిసలుగా మార్చి వేసింది. పరలోక వాస్తవికతను గురించి దైవ ప్రవక్తలు వారి ముందు ఎన్నో ప్రమాణాలు తెచ్చారు. మరెన్నో ఆధారాలు చూపారు. అయినా వారు పరలోకాన్ని విశ్వసించడానికి సిద్ధపడలేదు. పైపెచ్చు మంచిని బోధించేవారికే విరోధులయ్యారు. కొన్ని జాతులు వారిని హతమార్చడానిక్కూడా వెనుకాడలేదు.

వారు ప్రాపంచిక మైకంలో పూర్తిగా లీనమయిపోయారు. వారు తమ సంతానం, సిరిసంపదల్ని చూసుకొని విర్రవీగి పోయారు. తాము చేస్తుండిన దుశ్చేష్టలకు గర్వపడ్డారు. దైవ ప్రవక్తలు చేసిన హెచ్చరికలేవీ వారి చెవికెక్కలేదు. చివరికి వారిపై దైవ శిక్ష విరుచుకుపడింది. దాంతో వారు సర్వనాశనమయ్యారు. అలా వారు తమ చరిత్రలను ప్రపంచానికి గుణపాఠంగా మిగిల్చిపోయారు. చివరి క్షణం వరకూ వారికి మత్తు వదల్లేదు. మంచి చెడ్డలు గ్రహించడానిక్కూడా వారికి వ్యవధి దొరక్కుండా పోయింది. అలా వారు ప్రపంచంలో ఒక్క వెలుగు వెలిగి శాశ్వతంగా కాల గర్భంలో కలసిపోయారు.

పరలోకాన్ని తిరస్కరించడం వల్లగాని లేదా దాన్ని పూర్తిగా విస్మరించడం వల్ల గాని జరిగే పర్యవసానం ఇదే. ఇది ప్రపంచంలో జరిగిన పర్యవసానం. ఇక పరలోకంలో ఇంతకంటే ఘోరాతి ఘోర దుష్పరిణామాలకు గురి కావలసి ఉంది. కానీ పరలోక విశ్వాసం మనిషిని మానవుడుగా తీర్చిదిద్దుతుంది. పరలోకాన్ని విశ్వసించిన వారు గొప్ప గొప్ప కోటీశ్వరులయినా, పెద్ద పెద్ద సామ్రాజ్యాధిపతులైనా మనో వాంఛలకు బానిసలు కాలేరు; అహంకారులు, అన్యాయపరులు కాలేరు. ఇలాంటి జీవితానికి అద్దంపట్టే ఒక నమూనాను హజ్రత్ సులైమాన్ (అలైహి) లో చూడవచ్చు. దేవుడు ఆయనకు అపార సిరిసంపదలు అనుగ్రహించాడు. ఎవరికీ ఇవ్వనటువంటి గొప్ప సామ్రాజ్య వైభవాన్ని కూడా ఆయనకు ప్రసాదించాడు. ఇన్ని ఉన్నప్పటికీ ఆయన విశ్వప్రభువుకు ఎంతో భయపడేవారు. మరణానంతరం ఆ ప్రభువు దగ్గరికే పోవలసి వుందని హజ్రత్ సులైమాన్(అలైహి) భావించేవారు. పరలోక జీవితంపై ఆయనకు అచంచల విశ్వాసం ఉండేది. అందువల్ల ఆయన తనకు లభించినదంతా అల్లాహ్ అనుగ్రహించినదేనని

తలచేవారు. కనుకనే ఆయన ఎలాంటి అహంభావానికి, అహంకారానికి లోనుకాకుండా ఎల్లప్పుడూ తన శిరస్సును దైవం ముందే వంచేవారు.

ఖుర్‌ఆన్‌లోనే మరో సంఘటన - సబారాణిని గురించి మీరు చదివి వుంటారు. మానవుని అహంకారానికి కారణభూతమయ్యే సమస్త వనరులు, వస్తువులు ఆమె దగ్గర ఉన్నాయి. ఆమె బహుదైవారాధన చేసే ఓ జాతికి చెందిన మహారాణి. సాధారణంగా బహుదైవారాధకుల్లో ఉండే లక్షణాలన్నీ ఆమెలోనూ వున్నాయి. ఆమె తన జాతికి మహారాణిగా చెలామణి కావడానికి ఆ జాతి మతమయిన బహుదైవారాధన మతాన్ని అంటిపెట్టుకోవలసి వచ్చింది. అయితే ఎప్పుడయితే ఆమెలో పరలోక భావన జాగృతమైందో అప్పుడు ఆమె సమస్త బహుదైవారాధన బంధనాల నుండి, మనోవాంఛల దాస్యం నుండి బయటపడగలిగింది. సన్మార్గాన్ని అవలంబించడానికి ఆమెకు తన మనోవాంఛల దాస్యంగాని తన జాతిలో ఉండిన మూఢ విశ్వాసాలు గాని ఏవీ అడ్డురాలేదు.

సోదరులారా!

ఇవి కొన్ని సంఘటనలు మాత్రమే. పరలోక వాస్తవికతను వివరించే ఇంకా అనేక సంఘటనలు ఖుర్‌ఆన్‌లో ఉన్నాయి. పరలోకం పట్ల సరైన విశ్వాసం లేకపోతే మనిషికి మార్గదర్శకత్వం లభించదు. మానవుణ్ని దానవుడిగా మార్చే చెడుల నుండి కూడా బయటపడలేడు. కాబట్టి మనిషికి పరలోక విశ్వాసం ఎంతో అవసరం. ఈ పరలోక విశ్వాసం పునాదులపైనే అతని జీవితం సంస్కరించబడుతుంది. పరలోకం కళ్ళకు కనిపించని ఓ తిరుగులేని సత్యం. ఇలాంటి జీవితం గడపడానికి మానవులు దైవ సందేశాన్ని అందజేసిన ప్రవక్తల ప్రబోధనలపై నమ్మకం ఉంచాలి.

దైవప్రవక్తలంతా ముక్తకంఠంతో, పరలోకం అనేది ఒకటుంది, మరణించిన తరువాత ప్రతి మానవుడు అక్కడికి పోవలసి ఉంటుంది అని ప్రతి యుగంలోనూ మానవులకు బోధిస్తూ వచ్చారు. పరలోకాన్ని విశ్వసించని వారు విశృంఖలమయిన జీవితం గడుపుతారు. నైతిక నియమాలన్నీ ఉల్లంఘిస్తారు. పశువులకన్నా ఘోరంగా ప్రవర్తిస్తారు. తోటి మానవుల హక్కుల్ని కాలరాస్తారు. అధికారం లభిస్తే అత్యాచారాలకు వడిగడ్తారు; అరాచకాన్ని సృష్టిస్తారు. ఇలాంటి జాతులే పూర్వం వినాశాన్ని కొనితెచ్చుకొని నామరూపాల్లేకుండా తుడిచిపెట్టుకొని పోయాయి. దైవ ప్రవక్తల్ని తిరస్కరించి పరలోకాన్ని విశ్వసించనందువల్లే ఆద్, సమూద్, లూత్ జాతులు నాశనమైనట్లు ఖుర్‌ఆన్ చెబుతోంది.

పరలోకాన్ని విశ్వసించటం, విశ్వసించకపోవడంపైనే మనిషి జీవన వైఖరి ఆధారపడి ఉంటుంది. పరలోకాన్ని విశ్వసిస్తే దాని ప్రభావం అతని జీవితంలో స్పష్టంగా

కనిపిస్తుంది. సద్వర్తనుడయి ఎల్లప్పుడూ బాధ్యతాయుతమైన జీవితాన్ని గడుపుతాడు. పరలోకంపై విశ్వాసం లేకపోతే తాను ఎవరి ముందూ జవాబుదారు కానన్న అహంభావంతో ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తాడు.

లంచం తీసుకోవడం నేరమని తెలిసి కూడా ఒక వ్యక్తి రహస్యంగా దాన్ని తీసుకుంటున్నాడంటే, అతనికి పరలోకం పట్ల దేవుని శక్తి సామర్థ్యాల పట్ల సరైన అవగాహన లేదని గ్రహించాలి. తనను ఇక్కడ ఎవరూ చూడలేకపోయినా దేవుడు మాత్రం చూస్తున్నాడని, తాను ప్రపంచ పోలీసులకు పట్టుబడకపోయినా, పరలోక పోలీసుల నుండి తప్పించుకోలేనని, అక్కడ తన అవినీతి చర్యకు దుష్ఫలితం అనుభవించక తప్పదని దృఢనమ్మకం ఉంటే అతను ఎన్నటికీ లంచగొండితనానికి పాల్పడలేడు.

సోదరులారా!

పరలోక విశ్వాసానికున్న ప్రాముఖ్యత ఏమిటో ఇప్పుడు మీరు గ్రహించారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని మనలోని ప్రతి వ్యక్తీ ఆత్మ పరిశీలన చేసుకోవాలి. నిజంగా మన అంతరంగంలో పరలోక విశ్వాసం ఉందా, ఉంటే ఏ మేరకు ఉంది అని తెలుసుకోవాలంటే మనం మన నడవడికపై, మన దైనందిన జీవిత వ్యవహారాలపై రోజూ దృష్టి సారిస్తూ ఉండాలి. పరలోకంపై విశ్వాసమే ఉంటే దాని ప్రభావం మన క్రియా జీవితంలో తప్పనిసరిగా కనిపించాలి. ఆచరణలో కనపడని విశ్వాసం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదు.

39.ప్రజలకు ధర్మాన్ని పరిచయం చెయ్యడం మనందరి కర్తవ్యం

మహాశయులరా!

అల్లాహ్ చేసిన మేళ్ళను గుర్తుకు తెచ్చుకోండి. ఆయన మనల్ని అంతిమ దైవప్రవక్త (సఅసం) ఉమ్మత్‌లోపుట్టించాడు. మనకు శ్రేయస్కర సమాజం అనే బిరుదును ప్రసాదించాడు. ఎవరి స్థాయి ఎంత ఉన్నతంగా ఉంటుంతో వారి బాధ్యతలు కూడా అంతే ఉన్నతంగా ఉంటాయన్న సంగతి మీకు తెలుసు. ఆ బాధ్యతలు ఏమిటి? అల్లాహ్ తన చివరి ప్రవక్త (సఅసం) ద్వారా ఇస్లామ్ ధర్మాన్ని పరిపూర్ణం చేశాడు. ఇక ప్రళయం వరకు ఏ దైవప్రవక్తా ప్రభవించడు. ఇలాంటి పరిస్థితిలో అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) ను విశ్వసించిన వారిపై దైవ సందేశాన్ని ప్రపంచ మానవులందరికీ పరిచయం చేయవలసిన బాధ్యత ఉంది.

సోదరులారా!

దేవుని దయవల్ల మనం ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లంను అంతిమ దైవప్రవక్తగా విశ్వసిస్తున్నాము. కాబట్టి వీలయినంత మేరకు దైవసందేశాన్ని దైవదాసులకు అందజేయవలసిన గురుతర బాధ్యత మనందరిపై ఉంది. అయితే మనలో కొందరు ఇది గొప్ప గొప్ప పండితులు చేయాల్సిన పని కదా? మా వల్ల ఎలా సాధ్యమవుతుంది? అంటారు. ఈ అభిప్రాయం సరయినది కాదు, దేవుడు ఎవరికి ఏ మేరకు శక్తిసామర్థ్యాలు ప్రసాదించాడో వారి బాధ్యత కూడా ఆ మేరకు ఉంటుంది.

ఈ బాధ్యత ఒక్క విద్యాజ్ఞానాలు ఉన్నవారిపైనే లేదు; సంపద, అధికారం, పలుకుబడి, ప్రభావం, పరపతి, పేరు, ప్రతిష్టలు ఉన్నవారిపై కూడా ఈ బాధ్యత ఉంది. దైవధర్మాన్ని వ్యాపింపజేయడానికి, దైవ దాసులను రుజుమార్గంపై తేవడానికి వీటన్నింటిని వినియోగించాలి. కాని ఇది కేవలం కొందరు ముఖ్యమైన వ్యక్తులు మాత్రమే చేసే పని, మిగతా వాళ్ళపై ఈ బాధ్యతలేదని దీని అర్థం కాదు. ఈ బాధ్యత ప్రతి వ్యక్తిపై ఉంది. కాకపోతే కొందరిపై ఎక్కువ, మరికొందరిపై తక్కువ ఉంటుంది.

సోదరులారా!

మనలో కొందరు, మేము సామాన్యులం, మావల్ల ఈ పని ఎలా అవుతుంది అనుకుంటారు. వీరిలా ఆలోచించడానికి కారణం కొన్ని విషయాలు తెలియకపోవడమే. దైవధర్మాన్ని ప్రజలకు అందజేయడం అంటే ధర్మ గ్రంథాలుచదివి వినిపించడం,

ఉపన్యాసాలివ్వడం, పుస్తకాలు రాసి వ్యాపింపజేయడం కదా అని భావిస్తారు. అప్పుడే ఈ బాధ్యత సరిగా నెరవేరుతుంది అనుకుంటారు. కాని అసలు విషయం అది కాదు. ఈ బాధ్యత నెరవేర్చడానికి ఉపన్యాసాలు, రచనలు మంచి సాధనాలే కావచ్చు. అయితే ఈ పనికోసం తప్పనిసరిగా ఉపన్యాసాలివ్వడమో, రచనలు చెయ్యడమో జరగాలన్న నియమం ఏదీ లేదు.

ముస్లిములు మొట్టమొదట ఇతరులకు ఆదర్శంగా, ఇస్లామ్ యొక్క సజీవ ఉదాహరణగా రూపొందాలి. అప్పుడు ఉపన్యాసాలివ్వగలిగినా, ఇవ్వలేకపోయినా, రచనలు చెయ్యగలిగినా, చెయ్యలేకపోయినా వారు చెప్పే ప్రతి మాట ద్వారా, చేసే ప్రతి పనిద్వారా ప్రజలకు దైవ ధర్మం పరిచయమవుతుంది. అంటే వారి నడవడికలోని ప్రతి కదలిక ద్వారా ప్రజలకు ఇస్లామ్ అంటే ఏమిటో తెలిసిపోతుంది. ధర్మపరిచయానికి కావలసిన మొట్టమొదటి విషయం ఇదే. ఇది లేకపోతే ఉపన్యాసాలిచ్చినా, రచనలు చేసినా ధర్మ ప్రచార మార్గంలో ఆశించిన ప్రయోజనాలను సాధించలేము.

ఒక నిప్పు కణం తన పరిసరాల్లో వేడి పుట్టించడానికి తనంతటతాను ఏ పనీ చేయనవసరం లేదు. నిప్పు కణంలో ఉన్న వేడి వల్ల పరిసరాలు వాటంతటవే వేడెక్కుతాయి. అలాగే ఇస్లామ్ ఆజ్ఞలను పూర్తిగా పాటించే ఒక నిజమయిన ముస్లిమ్ తప్పనిసరిగా ఇతరులపై ప్రభావాన్ని వేయగలడు. ఈ విధంగా అతను తోటి దైవదాసులకు పరోక్షంగా దైవధర్మాన్ని పరిచయం చేయగలడు.

సోదరులారా!

ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుంటే ధర్మప్రచార బాధ్యత మాపై లేదని మనలో ఎవరూ అనలేరు. చదువున్నా లేకపోయినా, ఉపన్యాసాలివ్వగలిగినా ఇవ్వలేకపోయినా ఈ బాధ్యత నుంచి ఏ వ్యక్తీ తప్పించుకోలేడు. ప్రతివ్యక్తికీ ఇతరులపై కంటే ఎక్కువగా తనపైనే అధికారముంటుంది. అందువల్ల ఈపనిని అతను మొట్టమొదట తన నుంచే ప్రారంభించాలి. ఇది శ్రమతో కూడిన పనే, సందేహం లేదు. కాని స్వర్గం వూరికే వస్తుందా? దాని కోసం మనం కష్టపడాలి. అవసరమయితే అనేక త్యాగాలు కూడా చేయవలసి ఉంటుంది.

దైవ మార్గంలో మనిషికి ఉండవలసిన మొట్టమొదటి లక్షణం- అల్లాహ్ పట్ల అతని సంబంధాలు సవ్యంగా ఉండాలి. అతను చేసే ప్రతి పనీ అల్లాహ్ కోసమే ఉండాలి. అల్లాహ్ శక్తిసామర్థ్యాలు , గుణగణాలపై పూర్తి విశ్వాసం ఉండాలి. ఆయన దైవత్వంలో ఇతరుల్ని సహవర్తులుగా నిలబెట్టకూడదు. ఆయన్నే నమ్ముకొని ఉండాలి. ఆయన వ్యక్తిత్వంపైనే ఎల్లప్పుడూ దృష్టి కేంద్రీకరించాలి. ఆయనకు మాత్రమే మన మొరలను ఆలకించేవాడని, కష్టాలను తీర్చేవాడని విశ్వసించాలి. ఆయనకు మాత్రమే విధేయుడయి ఉండాలి, ఎవరి ఆజ్ఞనయినా పాటించవలసి వచ్చినప్పుడు అది

దైవాజ్ఞకు అనుకూలంగా ఉందా లేక వ్యతిరేకంగా ఉందా అని చూడాలి. దైవాజ్ఞలకు వ్యతిరేకంగా ఉంటే ఇతరుల ఆజ్ఞను శిరసావహించకూడదు.

సాధారణంగా మనుషులు వివిధ రకాల ఉద్దేశ్యాలతో పనులు చేస్తుంటారు. కొందరు ఇతరుల మెప్పు కోసం పని చేస్తారు. మరికొందరు జాతి కోసం, దేశం కోసం పని చేస్తారు. ఇంకొందరు కొన్ని స్వార్థ ప్రయోజనాలను ఆశించి పనిచేస్తారు. వీటన్నింటినీ దైవంతో సంబంధం లేకుండా కూడా విజయవంతంగా చేయవచ్చు. కాని దైవ మార్గంలో పనిచేసేవాడు తప్పనిసరిగా దైవంతో మంచి సంబంధాలు కలిగి ఉండాలి. దైవంతో సరైన సంబంధాలు లేకపోతే ఏ సత్కార్యం చేసినా ప్రయోజనం ఉండదు. ఈ కొరతను ఏ విద్యాజ్ఞానాలు తీర్చలేవు. సిరిసంపదలు కూడా తీర్చలేవు. దైవ మార్గంలో పనిచేసేవాడు దైవంతో సరయిన సంబంధాలు కలిగి ఉంటూ ప్రతీదీ ఆయన సంతోషం కోసమే చేయాలి.

సోదరులారా!

ఇప్పుడు మీరే చెప్పండి. ఇది కేవలం పండితులు, విద్వాంసులు ,ధర్మవేత్తలు మాత్రమే చేయవలసిన పనంటారా? రచనలు, ఉపన్యాసాల మేరకే ఈ పని పరిమితమా? కాదు, ఇది ప్రతి ఒక్కరూ చేయవలసిన పని. దీనికోసం ముందు మన వ్యక్తిత్వాన్ని ఇస్లామ్‌కు అనుగుణంగా తీర్చిదిద్దుకోవాలి. జీవితంలోని ప్రతి రంగంలోనూ మనం దైవాజ్ఞలను పాటిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలవాలి. ఇస్లామ్ నైజానికి వ్యతిరేకంగా ఉండే ప్రతీ విషయాన్ని విడిచి పెట్టాలి. అటువంటప్పుడే మనం ఇతరులకు ఏదయినా బోధించినా దాని ప్రభావం వారిపై పడే అవకాశం ఉంది.

దైవ ధర్మాన్ని ప్రచారం చేసేవారు ఈ విషయంపై తమ దృష్టిని పూర్తిగా కేంద్రీకరించాలి. వారు చేసే ప్రతి పనిలో, చెప్పే ప్రతి మాటలో ఇస్లామ్ దృక్పథం వ్యక్త మవుతూ ఉండాలి. వారి నీతి నడవడికలు, వారి ఆచార వ్యవహారాలు, వారి వ్యాపార లావాదేవీలు వారి రాజకీయ సంబంధాలు, వారి ఆర్థిక వ్యవహారాలు, వారి ప్రవర్తనా తీరుతెన్నులు- ప్రతి ఒక్కటి ఇస్లామ్‌కు సాక్షీభూతమై ఉండాలి. వారి జీవనసరళిని చూసిన ప్రజలు ఇస్లామ్ అంటే ఇలా ఉంటుంది అనుకోవాలి. లేదా వారికి ఇస్లామ్ ఇలా బోధిస్తోంది అని భావించాలి. ధర్మపరిచయ మార్గంలో ప్రతి ముస్లిమ్ గుర్తించవలసిన మొట్టమొదటి విషయమిది. ధర్మసేవ చేసేవారు తెలుసుకోవలసిన మౌలిక విషయాలు ఇంకా కొన్ని ఉన్నాయి. వాటిని ఇన్షాఅల్లాహ్ మరో జుమా ప్రసంగంలో వివరిస్తాను.

అల్లాహ్ మనందరకూ ధర్మసేవ చేసే సద్బుద్ధిని అనుగ్రహించుగాక. ఆ మార్గంలో ఎదురయ్యే ఆపదలను అధిగమించే శక్తిని, సహనాన్ని ప్రసాదించుగాక!

40. నిజమయిన సాఫల్యం

మహాశయులారా!

మనలోని ప్రతి వ్యక్తీ సుఖసంతోషాలతో వర్థిల్లాలని విజయవంతమైన జీవితం గడపాలనే కోరుకుంటాడు. అయితే విజయవంతమయిన జీవితం అంటే ఏమిటి అన్నది వ్యక్తుల ఆలోచనాధోరణిపై ఆధారపడి ఉంటుంది. దీన్ని ముఖ్యంగా రెండు విభిన్న భాగాలుగా విభజించవచ్చు. ఒకటి భౌతిక ప్రధానమయిన దృక్పథం. మంచి తిండి, ఖరీదయిన బట్టలు, అందమయిన బంగ్లా, డబ్బు, సంతానం, పేరు, పలుకుబడి, అధికారం, హోదా, అంతస్తు, ప్రభుత్వం మొదలయినవన్నీ ఈ కోవకు చెందుతాయి. భౌతిక ప్రధానమైన ఇలాంటి జీవితాన్నే కొందరు విజయవంతమైన జీవితమనుకుంటారు. కాని ఇస్లామ్ దృష్టిలో విజయం అంటే భౌతిక ప్రధానమయిన విజయం కాదు. దేవుని ప్రసన్నతకు, స్వర్గ సౌఖ్యాలకు అర్హుడయ్యేలా ఈ ప్రపంచంలో పవిత్రమయిన జీవితం గడిపి, అదే స్థితిలో తనువు చాలించడమే ఇస్లామ్ దృష్టిలో నిజమయిన విజయం.

జయాపజయాలకు సంబంధించిన ఈ భావనే ప్రజల ఆలోచనా దృక్పథాన్ని పూర్తిగా మార్చివేస్తుంది. ప్రజలకు దైవం వివిధ భౌతిక వస్తువుల్ని ఇచ్చి, భౌతికపరంగా వారిని సుఖ సంతోషాలలో తేలియాడేలా చేస్తే సాధారణంగా వారు ఇదంతా తాము సాధించుకున్న విజయమని అపోహపడతారు. మరి కొందరు ఇంకో అడుగు ముందుకువేసి వీటన్నిటిని తమంతట తాము సాధించుకున్నామని గర్వపడటమేగాక, తాము దేవునికి ప్రియమయినవారమని కూడా తలుస్తారు. అసలు తాము దేవునికి ప్రియమయినవాళ్ళం కాబట్టే ఆయన తమకివన్నీ ఇచ్చాడని అనుకుంటారు వీరు. ఇక ఏ భౌతిక సౌఖ్యాలూ లభించని పేద వాళ్ళను గురించి కూడా వీరు అపోహలోపడతారు. ఈ పేద వాళ్ళు సరైన మార్గం మీద లేరని, అందుకే దేవుడు ఆగ్రహించి వీరిని రకరకాల కష్టాలపాలు చేశాడని అనుకుంటారు.

ఇలాంటి తప్పుడు భావన ఏర్పడడానికి ఒక పెద్ద కారణం ఉంది. ప్రజలు ఈ ప్రపంచం న్యాయం లేదా అన్యాయం జరిగే స్థలం కాదని భావించరు. నిజానికి ఈ ప్రపంచం మానవుల కోసం ఒక పరీక్షా స్థలం. ఒక క్రియా మైదానం. ఇక్కడ మనిషి ఏ స్థితిలో ఉన్నా అది అతనికోసం ఒక పరీక్ష. అంటే మనిషి ఇక్కడ ఏ స్థితిలో ఉంటే దేవుడు ఆ స్థితిలోనే అతణ్ణి పరీక్షిస్తాడన్న మాట. అసలిక్కడ మనిషికి అతను చేసిన పనులకు నైతికంగా న్యాయంగాని, శిక్షగాని లభించదు. ఒకవేళ లభించినా చాలా పరిమితంగా ఉంటుంది. ఇక్కడ ప్రతి స్థితిలోనూ పరీక్షే ఉంటుంది.

ఎవరికయినా ఇక్కడ సిరిసంపదలు, సంతానం, అధికారం, హోదా, అంతస్తులు లభిస్తే, దేవుడు అతణ్ణి అదే స్థితిలో పరీక్షిస్తాడు. ఇన్ని సౌఖ్యాలు పొంది, ఈ స్థాయికి

చేరుకున్న తరువాత అతని ఆచరణ, నడవడికలు ఎలా ఉంటాయి అని దేవుడు అతడ్ని ప్రతి క్షణం పరీక్షిస్తుంటాడు. అయితే మరొకరిపై దారిద్ర్యం తాండవిస్తూ కష్టాలపై కష్టాలు వచ్చిపడుతుంటాయనుకోండి, ఇది తప్పనిసరిగా దైవ శిక్షే అని అర్థం కాదు. అతనిపై వచ్చిపడుతున్న ఆపదల పరంపర దేవుని ఆగ్రహం కానవసరంలేదు. ఈ పరిస్థితి కూడ అతనికోసం ఒక పరీక్షే.

ఇలాగే జాతుల విషయంలోనూ ఉంటుంది. ఉదాహరణకు ఏదైనా ఒక జాతి నీతి మార్గాన్ని వదలిపెట్టి అన్యాయం, అధర్మం, అవినీతి, అక్రమం, అత్యాచారాలు చేయడమే పనిగా పెట్టుకుంటుంది. అయినా దేవుడు ఆ జాతిని శిక్షించకుండా వదిలేస్తాడు. పైపెచ్చు దానికి ఎన్నో భౌతిక వస్తువుల్నిచ్చి మరింత సుఖసంతోషాలు అనుభవించే అవకాశాన్ని ఇస్తాడనుకోండి. అప్పుడు దేవుడు ఆ జాతిని తన కటాక్షవీక్షణాలతో చూస్తున్నాడని అర్థం కాదు. వాస్తవం ఏమంటే దేవుడు ఆ జాతికి పెద్ద పరీక్ష పెట్టాడు. ఈ సంగతి తెలుసుకోకుండా ఆ జాతి తన తప్పుడు దారిలోనే పడి కొట్టుకుపోయింది. అందువల్ల దేవుని ఆగ్రహమే ఆ జాతిపై పడుతున్నట్లు భావించాలి.

ఒకవేళ ఆ జాతిపై అది చేసిన అన్యాయం, అక్రమం, అత్యాచారాలకుగాను ఏదయినా ఆపద విరుచుకుపడితే దాంతో అది కళ్ళు తెరవవచ్చు. చేసిన తప్పుడు పనులకు పశ్చాత్తాపం చెంది సరైన మార్గాన్ని అవలంబించవచ్చు. కాని అలా ఏ ఆపద రాకుండా సుఖాల మీద సుఖాలు కలుగుతూ ఉంటే ఆ జాతికి కనువిప్పు ఎలా కలుగుతుంది? ఎందుకు పశ్చాత్తాపం చెందుతుంది? ఇక దారికి ఎందుకు వస్తుంది? పైగా ఆ జాతి భోగభాగ్యాలలో ఓలలాడుతూ మరింత విశృంఖలంగా వ్యవహరిస్తుంది. ఈ విధంగా అది దేవుని ఆగ్రహానికి ఇంకా దగ్గరవుతుంది.

దీనికి భిన్నంగా దైవ భావన, నీతి, న్యాయం, ధర్మం, సత్యం, సచ్ఛీలం ఉన్న చోట దేవుని అనుగ్రహం కురుస్తుంది. ఎవరయినా ఒక మనిషి సజ్జనుడు, నిజాయితీపరుడు, పరోపకారి, వాగ్దానపాలకుడు, దయార్ద్రహృదయుడు, దైవం పట్ల భయభక్తులు కలవాడు అయి ఉన్నాడనుకోండి. ఇలాంటి మంచి వ్యక్తి ఒకవేళ దుర్భర కష్టాలకు లోనయితే, దేవుని అనుగ్రహం అతనికి దూరమైందని, అందుకే ఇలా కష్టాల రూపంలో అతనిపై దైవ శిక్ష పడిందని భావించడం పూర్తిగా పొరపాటు. నిజానికి అతను అనుభవిస్తున్న ఈ కష్ట పరిస్థితి దేవుని ఆగ్రహం కాదు, ఆయన కారుణ్యానికి ప్రతిరూపం.

కంసాలి బంగారాన్ని బాగా కాల్చి కరగబెడతాడు. చివరికి అందులోంచి మేలిమి బంగారాన్ని తీస్తాడు. అలాగే ఒక మోమిన్‌కు కష్టాలు వచ్చినప్పుడు అతను దైవం వైపునకు మరలుతాడు. ఈ స్థితిలో తన పొరపాట్లు ఏమిటో గ్రహించి, దైవం వైపునకు మరలడం అతనికి చాలా సులభతరమవుతుంది. అతనిపై వచ్చిన కష్టాలకు పరిహారంగా దేవుడు అతని చిన్న చిన్న పొరపాట్లను మన్నిస్తాడు. ఇంకా పరలోకంలో అతని

అంతస్తులను ఉన్నతం చేస్తాడు. ఈ విధంగా మోమిన్‌కు వచ్చే కష్టాలు దైవ కారుణ్యానికి కారణభూతమవుతాయి. పైగా మోమిన్‌కు దైవం పట్ల దృఢ విశ్వాసం ఉందో లేదో కష్టాలు వచ్చినప్పుడే కదా తెలిసేది.

మోమిన్ ప్రపంచంలో భయభక్తులు లేకుండా విశృంఖలంగా జీవితం గడపడు. అందరి అధికారి అయిన విశ్వప్రభువు ఒక్కడున్నాడనే విషయాన్ని అతను ఒక్క క్షణం కూడా మరచిపోకుండా ఆయన ఇష్టాయిష్టాల ప్రకారమే జీవితం గడుపుతాడు. ఇదే మోమిన్ అసలు గొప్పతనం.

నిజానికి విశ్వాసుల లక్షణం ఇలాగే ఉండాలి. వారు సృష్టిలోని వివిధ వస్తువుల్ని దీర్ఘంగా పరిశీలిస్తూ సృష్టికర్త ఔన్నత్యాన్ని ప్రశంసిస్తారు. ఆయన ఆయత్‌లను విశ్వసిస్తారు. వాటిని పూర్తిగా ఆచరించడానికి శాయశక్తులా కృషి చేస్తారు. ఆయనకు కోపాన్ని తెప్పించే ప్రతి చెడుకూ దూరంగా పారిపోవడానికి ప్రయత్నిస్తారు.

ఉదాహరణకు ప్రదర్శనాబుద్ధి 'షిర్క్' అని మీకు తెలుసు. దీనివల్ల పెద్ద పెద్ద సత్కార్యాలు కూడా వృధా అవుతాయి. విశ్వాసులు ఏ సత్కార్యాలు చేసినా, ఏ సేవలు చేసినా, ఏ త్యాగాలు చేసినా, వాటి పట్ల సంతోషంతో ఎగిరి గంతేయరు. తాము ఏదో పెద్ద భక్తులమయ్యామన్న భావంతో విర్రవీగరు. గొప్ప వాళ్ళమన్న భావన కూడా వారి మనసులోకి రాదు. వీలయినన్ని సత్కార్యాలు చేసి కూడా వీటిని దేవుడు అంగీకరిస్తాడో లేదోనని భయపడతారు. పరలోకంలో సత్కార్యాలకన్నా దుష్కర్మలే ఎక్కువయిపోయి తాము దైవానుగ్రహానికి నోచుకోకుండా పోతామేమోనని కూడా ఒక్కోసారి వారు భయపడతారు. ఈ విధంగా విశ్వాసులు ప్రతి క్షణం దైవానికి భయపడుతూ ఈ ప్రపంచంలో జీవిస్తారు.

హజ్రత్ ఉమర్ (రజిఅన్) జీవిత గాథ మీరు వినే ఉంటారు. అలాంటి మహాపురుషుడే ఇహలోకం వీడిపోతున్నప్పుడు, పరలోకంలో నేను ఏ కాస్త విడిచిపెట్టబడినా నాకు మహాభాగ్యం ప్రాప్తమయినట్లే అన్నారు. మోమిన్ ఆలోచనా ధోరణి అంటే ఇలాగే ఉంటుంది. ఈ విషయంలో హజ్రత్ హసన్ బస్రి (రహ్మలై) ఎంత మంచి మాట చెప్పారు! "మోమిన్ విధేయత పాటిస్తున్నప్పటికీ దైవానికి భయపడుతూ ఉంటాడు. కాని మునాఫిక్ (కపట ముస్లిమ్) చెడుచేస్తూ కూడా దైవానికి భయపడకుండా ఉంటాడు" అని చెప్పారాయన.

పరలోక సాఫల్యానికి కారణభూతమయ్యే జీవితమే అసలు జీవితమంటే. ఈ దృక్పథంతోనే మనం జీవితం గడపాలి. ఈ దృక్పథంతోనే మన ఆలోచనల్ని, మన నడవడికల్ని, మన వ్యవహారాల్ని సంస్కరించుకోవాలి. అప్పుడే మనం నిజమయిన సాఫల్యానికి అర్హులమవుతాము.

41. కష్ట సుఖాలు

మహాశయులారా!

దైవాన్ని ధిక్కరించినప్పటికీ ఇక్కడ భోగభాగ్యాలు అనుభవించేవారు ఎంతో అదృష్టవంతులని చాలా మంది అనుకుంటారు. కాని వారికి పరలోకంలో ఎదురయ్యే కష్టనష్టాలను గురించి వీరు ఆలోచించడం లేదు. అల్లాహ్ దివ్య ఖుర్ఆన్‌లో ఏమంటున్నాడో చూడండి:

"ఎవరయితే ఇస్లామ్ స్వీకరించడానికి నిరాకరించారో ఒకనాడు వారు తీవ్రంగా పశ్చాత్తాపపడుతూ, 'అయ్యో! మేము ముస్లిములయిపోయి ఉండినట్లయితే ఎంత బాగుండేది' అంటారు. ఆ రోజు ఎంతో దూరంలో లేదు. (ఓ ముహమ్మద్!) వదిలెయ్యి వారిని. తినని, తాగని, అనుభవించని. వారి అసత్య ఆశలు వారిని విస్మరణలో పడవేశాయి. వారికి త్వరలోనే తెలిసిపోతుంది."

సోదరులారా! కష్టాలు, బాధలు అంటే ఏమిటో మీకు తెలుసు. సుఖాలు, భోగాలు, అంటే ఏమిటో కూడా మీకు తెలుసు. ఎవరయిన ఒక వ్యక్తి దారిద్ర్యానికి గురయితే లేదా ఏ రోగమో, ప్రమాదమో వచ్చిపడితే అతను పెద్ద ఆపదలో పడిపోయాడని, కష్టాలపాలయ్యాడని అంటారు మీరు. అలాగే ఎవరయిన ఒకడు మస్తుగా తింటూ, తాగుతూ జీవితావసరాలన్నీ సమకూర్చుకొని, హాయిగా ఆరోగ్యంగా జీవితం గడుపుతుంటే అతను భోగభాగ్యాలు అనుభవిస్తున్నాడని అంటారు మీరు. కాని మీరు వాటి బాహ్య కోణాన్ని చూసి ఇలా నిర్ణయించారు. దీన్ని అంతిమ నిర్ణయమని తలచకండి.

ఉదాహరణకు మరణం తరువాత తొలగిపొయ్యే అదృశ్య తెర ఈ రోజే తొలగిపోయిందనుకోండి. అప్పుడు పరలోకంలో ఎదురయ్యే పరిణామాలు ఈ రోజే మీ ముందు సాక్షాత్కరిస్తాయి. మీకు వాస్తవికత స్పష్టంగా కనిపిస్తుంది. జీవితంలో ఎన్నడూ కడుపు నిండా తిండికి నోచుకోని ఒక పేదవాడు ఈ రోజు పెద్ద పెద్ద బహుమానాలను స్వీకరిస్తూ ఉంటాడు. అతని అంతస్తులు ఉన్నతమవుతూ ఉంటాయి. ఎందుకంటే అతను దారిద్ర్య స్థితిలో ఎప్పుడూ పెదవి విప్పి ఒక్కసారి కూడా ఫిర్యాదు చెయ్యలేదు. ఎన్నడూ తన ప్రభువు పట్ల నిరాశ చెందలేదు. సంతృప్తితోనే కాలం గడిపాడు. తనకు లభించిన బహుమానాలకు గాను అతను అన్ని స్థితుల్లోను దైవం పట్ల కృతజ్ఞుడుగానే ఉన్నాడు. లభించని బహుమానాల విషయంలో దేవా, వీటిని నాకెందుకు ఇవ్వలేదు అని అసంతృప్తికరమయిన పలుకులు పలకలేదు. తాను పేదవాడయినప్పటికీ విశ్వాస

భాగ్యమయినా లభించిందని సంతోషించి దైవానికి కృతజ్ఞతలు అర్పించాడు. అందువల్ల ఈ రోజు అతనంటే దైవానికి ఎంతో సంతోషంగా ఉంది. ఇప్పుడు దైవం ప్రసాదిస్తున్న బహుమానాలతో అతను కూడా ఎంతో సంతోషంగా ఉన్నాడు. ఇప్పుడు చెప్పండి - ఈ పేదవాడు పడుతున్న కష్టాలను మేము పడమని మీలో ఎవరయినా అనగలరా? అనలేరు, ఈ పేదవాడిగానే ఎన్ని కష్టాలయినా అనుభవించి సార్థకులవుతామని అంటారు.

అలాగే ఎప్పుడూ రోగిష్టిగా ఉండే మరో వ్యక్తిని గురించి ఆలోచించండి. అతను రోగాలతో బాధలు పడుతున్నా సహనశీలి అని, కృతజ్ఞుడని నిరూపించుకున్నాడు. లేదా అతను ఎన్నో కష్టాలు అనుభవించాడు. ప్రమాదాలకు లోనయ్యాడు; అతనిపై ఎన్నో ఆపదలు విరుచుకుపడ్డాయి. కాని దైవాన్ని మాత్రం ఎప్పుడూ వదలిపెట్టలేదు - అలాంటి వ్యక్తికి ఈ రోజు బహు మానాలపై బహుమానాలు లభిస్తున్నాయి. ఇహలోక జీవితంలో లభించనివాటికి బదులుగా అంతకంటే లక్షల రెట్లు ఎక్కువ విలువగల బహుమానాలు ఈ రోజు లభిస్తున్నాయి. మరి ఇలాంటి వ్యక్తి దురదృష్టవంతుడని మీరెలా అనుకుంటారు?

మరొక ఉదాహరణ చూడండి: సాధారణ జీవితం గడిపే మధ్యతరహాకు చెందిన ఒక ముస్లిమ్ ఉన్నాడనుకోండి. అతని జీవితంలో చెప్పుకోదగ్గ మంచితనం ఏదీ లేదు. సాధారణంగా ఇతర ముస్లిమ్‌లలో ఉండే కొన్ని పొరపాట్లు కూడా అతనిలో ఉన్నాయి. హఠాత్తుగా అతని ప్రాణానికి ముప్పు ఏర్పడింది. కొందరు దుండగులు అతడ్ని రకరకాల హింసలు పెట్టి హతమార్చివేస్తారు. అయితే అతను చివరి శ్వాసదాకా ఓర్పు వహించాడు. విశ్వాసంపై స్థిరంగా ఉన్నాడు. ప్రాణం పోయే వరకు దైవాన్ని స్మరిస్తూనే ఉన్నాడు. అలా అతను సహనంతో, స్థయిర్యంతో ధర్మంపై స్థిరంగా ఉన్నందుకు అతనిపై దేవుని కరుణాకటాక్షాలు వర్షించాయి. అతను అమరగతుల జాబితాలోకి చేరిపోయాడు.

ఆలోచించండి, అదృశ్య తెర తొలగిపోయి దుండగుల చేత హతమార్చబడిన ఈ పీడిత ముస్లిమ్‌కు లభించే అసాధారణ బహుమానాలను చూస్తే మీరేమనుకుంటారు? ఇలాంటి పర్యవసానమే తమకూ లభించాలని మీరు కోరుకోరా? తప్పకుండా కోరుకుంటారు.

అదే విధంగా దైవాన్ని మరచిన ధనికులను గురించి కూడా ఆలోచించండి. ఈ రోజు వారు ఆస్తి, అంతస్తు, అధికారంలో మత్తుగా తేలిపోతూ పైకి ఎంతో విలాసవంత మయిన జీవితం గడుపుతున్నారు. వారికి ఏ వస్తువూ కొదవలేదు. కాని అదృశ్య తెర

తొలగిన తరువాత వారి స్థితి చూడండి. దారుణ దుష్ఫలితాల్ని అనుభవిస్తుంటారు. సమాధి నుండి హషర్ వరకు, హషర్ నుండి నరకం వరకూ ఊహించలేని ఆపదలకు గురవుతుంటారు. నరకాగ్ని యొక్క తొలి తాకిడి తగలగానే వారితో దేవుడు 'ఎప్పుడయిన మీరు సుఖవంతమైన జీవితం గడిపారా?' అని ప్రశ్నిస్తాడు. దానికి వారు, 'ఓ మా ప్రభూ! మేము ఎన్నడూ సుఖాన్నే ఎరగం' అంటారు. నరకం యొక్క ఒకే ఒక తాకిడికి వారు ప్రపంచ జీవితంలో అనుభవించిన సుఖాలు, అధికార వైభవాలు అన్నీ మరచిపోతారు.

సోదరులారా!

ఇహలోక కష్టసుఖాల పర్యవసానం ఏమిటో మీరిప్పుడు గ్రహించారు. పరలోకం పట్ల విశ్వాసమున్న వ్యక్తికి ఆ పర్యవసానాలన్నీ దైవ గ్రంథంలో కనిపిస్తాయి. ఈ ప్రసంగం ప్రారంభంలో నేను పేర్కొన్న ఖుర్ఆన్ వాక్యంలో ఆ పర్యవసానం ఏమిటో స్పష్టంగా తెలియజేయబడింది. దైవవాణి ప్రకారం ఆ సమయం ఎంతో దూరంలో లేదు. అప్పుడు దైవ తిరస్కారులైన గొప్ప హోదా, అంతస్తులు గల పెద్ద మనుషులు, అయ్యో! మేము దైవాన్ని, ఆయన ప్రవక్తని విశ్వసించి ఉంటే ఈ రోజు మాకీ దుర్గతి పట్టేది కాదే; మేమిలా మా స్వామి ముందు ద్రోహులుగా నిలబడేవాళ్ళం కామే. మేమెంత దురదృష్టవంతులం - అని ఘోరంగా కుమిలిపోతారు.

సోదరులారా! ఈ సన్నివేశాన్ని దృష్టిలో పెట్టుకొని నిజమయిన కష్టసుఖాలు ఏమిటో తెలుసుకోండి. అల్లాహ్ దయవల్ల మనమంతా పరలోకాన్ని విశ్వసిస్తున్నాం, పరలోక జీవితమే అసలయిన జీవితమని భావిస్తున్నాం. పరలోక సాఫల్యమే నిజమయిన సాఫల్యమని గ్రహించగలిగాం. ఆ సాఫల్యం కోసమే మనం నిరంతరం పాటుపడుతున్నాం. అలాంటప్పుడు కష్టసుఖాల వాస్తవ భావాన్ని మనమెందుకు గ్రహించలేం? ప్రాపంచిక సౌఖ్యాలే అసలయిన సౌఖ్యాలని ఎందుకు అనుకుంటాం?

శాశ్వతంగా ఉండే పరలోక జీవితానికి సంబంధించిన కొన్ని విషయాలు మనకు దైవ గ్రంథంలో ప్రవక్త ప్రవచనాల్లో లభిస్తాయి. మరణం తరువాత ప్రతి మనిషికీ ఈ పరిణామాలు ఎదురవుతాయి. అల్లాహ్ దయవల్ల వీటికి సంబంధించిన వాస్తవిక జ్ఞానం మనకందరికీ లభించింది. ఈ యదార్థాన్ని విశ్వసించినవారి దృష్టిలో ప్రాపంచిక కష్టాలు పెద్ద కష్టాలు కావు. ఇక్కడి సౌఖ్యాలు పెద్ద సౌఖ్యాలు కావు. అందువల్ల కష్టాలు వచ్చినా, ఆపదలు వచ్చినా, సిరిసంపదలు లభించినా, అధికారం అంతస్తులు లభించినా ఎలాంటి పరిస్థితుల్లోనయినా సరే దైవం పట్ల వారి విశ్వాసం ఏ మాత్రం తగ్గదు. వారు దైవానికిష్టమయిన జీవితాన్నే గడుపుతారు.

ప్రవక్త (సఅసం) పినతండ్రి హజ్రత్ హమ్‌జా (రజిఅన్)ను శత్రువులు హతమార్చి ఆయన శరీరాన్ని అగౌరవపరచిన సంగతి మీకు తెలుసు. అలాగే ఎంతో మంది సజ్జనులు, సత్యవంతులు, ప్రవక్తలపై దైవ విరోధులు దుర్భర దౌర్జన్యకాండ జరిపిన విషయం కూడా మీకు తెలుసు. ఇదంతా ఏమిటి? ఈ కష్టాలు, బాధల ద్వారా అల్లాహ్ వారి గౌరవ ప్రతిష్ఠలను ఇనుమడింపజేశాడు; పరలోక జీవితంలో వారి అంతస్తులను ఉన్నతం చేశాడు.

సోదరులారా!

వీరంతా అల్లాహ్ కారుణ్యానికి అర్హులయ్యారు. అల్లాహ్ కారుణ్యానికి మనకు పూర్వం కూడా అర్హులయినవారున్నారు; ఇప్పుడూ అర్హులవుతున్నవా రున్నారు. అయితే ఇహలోక పరీక్షలో ఎవరెలా నెట్టుకొస్తారో అన్న విషయంపై ఈ అర్హత ఆధారపడి ఉంది. ఈ పరీక్ష అన్ని పరిస్థితుల్లోనూ ఉంటుంది, అల్లాహ్ మనకు కష్టాలిచ్చి కూడా పరీక్షిస్తాడు. సుఖాలిచ్చి కూడా పరీక్షిస్తాడు. ఈ పరీక్షలో కృతార్థులయినవారే పరలోకంలో సాఫల్యం పొందుతారు.

42. మానవ సమానత్వం

మహాశయులారా!

మానవ అసమానత అనే చెడు ప్రపంచంలో ఎన్నో ఉపద్రవాలకు దారి తీసిన విషయం మీకందరికీ తెలుసు. నిజం చెప్పాలంటే ప్రపంచంలో ఇప్పటి వరకు జరిగిన పెద్ద పెద్ద ఉపద్రవాలకు మూల కారణం ఈ చెడే. దీన్ని నిర్మూలించడానికి విశ్వప్రభువు దివ్యఖుర్‌ఆన్‌లో ఏం బోధిస్తున్నాడో చూడండి :

"మానవులారా! మేము మిమ్మల్ని ఒకే స్త్రీ పురుషుల జంట ద్వారా పుట్టించాము. మీరు ఒకరినొకరు పరిచయం చేసుకోవాలని మాత్రమే మీలో జాతుల్ని, తెగల్ని సృజించాము. మీలో ఎక్కువ భయభక్తులు కలవారే గౌరవనీయులు."

ఈ ఆయత్‌లో దేవుడు మానవులంతా ఒక్కటే అన్న సమగ్ర భావనను బోధిస్తున్నాడు. కాని మానవుడు ఈ విశాల భావనను వదలి ఎప్పుడూ తన చుట్టూ చిన్న చిన్న గీతలను గీసుకొని ఆ గీతల పరిధిలో ఉన్న వాళ్ళనే తన వాళ్ళుగా భావించసాగాడు. దానికి వెలుపల ఉన్న వాళ్ళని పరాయి వాళ్ళుగా, శత్రువులుగా తలిచాడు. ఈ గీతలను అతను ఏ హేతువు ప్రాతిపదికపైగాని, నైతిక ప్రాతిపదికపైగాని గీయలేదు. కేవలం పుట్టుక ఆధారంగా వీటిని గీసుకున్నాడు.

కొందరు తమ వంశాన్ని గిరిగా చేసుకొని, ఆ వంశం వెలుపల పుట్టేవారిని పరాయి వాళ్ళుగా భావించారు. కొందరు జాతి, తెగల ఆధారంగా గిరి గీసుకొని తమ జాతి లేదా తెగ బయట ఉన్న వాళ్ళను శత్రువులుగా భావించారు. కొందరు భౌగోళిక ప్రాతిపదికపై మానవుల్ని విభజిస్తే, మరికొందరు రంగు, భాష ప్రాతిపదికలపై మానవాళిని చీల్చారు. అలా వారు తమ భౌగోళిక సరిహద్దులకు వెలుపల ఉన్న వాళ్ళను, తమ వర్ణం కాని వాళ్ళను, తమ భాషకు చెందని వాళ్ళను పరాయి వాళ్ళుగా భావించారు. అంతేకాదు, తాము గీసుకున్న గిరి లోపలికి వచ్చిన వాళ్ళ పట్లయితే ఎంతో ప్రేమాభిమానాలతో ప్రవర్తిస్తారు. ఆ గిరి బయట ఉన్న వాళ్ళను ద్వేషిస్తారు. ఇంకా వాళ్ళను నీచులుగా, అల్పులుగా భావించి రకరకాలుగా హింసించడానికయినా వెనుదీయరు.

మానవుడు తాను చేస్తున్నది తప్పని గ్రహించడానికి బదులుగా తన తప్పును సమర్థించుకోడానికి అనేక సిద్ధాంతాలను రూపొందించుకున్నాడు. చివరికి మానవుల్ని విభిన్న జాతులుగా, కులాలుగా విభజించి విచక్షణా భావాన్ని సమర్థించే మతాలు కూడా ఉనికిలోకి వచ్చాయి. ఈ విచక్షణా భావం ఆధారంగా ఒక వర్గం వాళ్లు మరో వర్గం

వాళ్ళను శతాబ్దాల తరబడి బానిసలుగా చేసుకొని వారి పట్ల పశువుల కన్నా నీచంగా ప్రవర్తించారు. యూదులు తమల్ని తాము దైవానికి ప్రియమైన వాళ్ళుగా పరిగణించుకున్న సంగతి మీకు తెలుసు. ఈ భావనతో వాళ్ళు తమ వాళ్ళ కోసం ఒకరకంగా, యూదులు కానివాళ్ళ కోసం మరొక రకంగా మతాచారలను, నియమాలను ఏర్పరచుకున్నారు.

అలాగే హిందువుల దగ్గర వర్ణాశ్రమం మతం యొక్క అంతర్భాగమయిపోయింది. వీళ్ళు తమ సొంత మతంలోని వాళ్ళనే కొందరిని అగ్ర కులస్తులుగా, మరికొందరిని అల్ప కులస్తులుగా మార్చివేశారు. యావత్ మానవులపై బ్రాహ్మణులకు ఆధిక్యత నిచ్చారు. అల్ప కులాల వారిని అపవిత్రులుగా తలిచారు. మరికొన్ని వర్గాలనయితే నీచాతినీచమైన కులాలుగా పరిగణించడం జరిగింది.

ఇదే విధంగా అమెరికాలో తెల్ల వాళ్ళకు, నల్ల వాళ్ళకు మధ్య విచక్షణ ఏర్పడింది. తెల్ల వాళ్ళు తమల్ని తాము అధికులమని భావించి నల్ల వాళ్ళపై అత్యాచారాలు చేయడం సమంజసమని తలచారు. ఇలా ప్రపంచంలోని అనేక జాతుల వారు తాము గీసుకున్న గీతలకు ఆవల ఉన్న వాళ్ళను అధముల క్రింద లెక్క కట్టి వారి ధన మాన ప్రాణాలను హరించడంలో ఎలాంటి తప్పు లేదని అభిప్రాయ పడ్డారు. ఇలాంటి విచక్షణా భావనల కారణంగానే ఈనాడు యావత్ ప్రపంచం ఒక రణరంగంగా మారిపోయింది.

సోదరులారా!

ఈ భావనలు ఎంతటి ప్రమాదకరమైనవో ఆలోచించండి. ఒక మనిషి కేవలం ఒక ప్రత్యేక పరిధిలో పుట్టినంత మాత్రాన అతడ్ని నీచుడిగా పరిగణించడం భావ్యమా? తమ జాతికి భాషకు, వర్ణానికి చెందనంత మాత్రాన అతను అల్పుడయిపోతాడా? నిజానికి ఆ మనిషి పుట్టుకలో అతని ప్రమేయం ఏదీ లేదే. మరి ఎందుకీ విచక్షణ, వ్యత్యాసాలు?

ఇలాంటి భావనలను ఆధారంగా చేసుకొని కొందరు ఉన్నతులని మరి కొందరు నీచులని మానవుల్ని విభజించటం పూర్తిగా తప్పని ఇస్లామ్ అంటున్నది. మానవులంతా ఒకే తల్లిదండ్రుల సంతానం కాబట్టి వారంతా ఒక్కటేనని; ఈ జాతులు, తెగలు, కులాలు, గోత్రాలు అన్నీ వారి పరస్పరం పరిచయం కోసం ఏర్పడినవి మాత్రమేనని చాటుతోంది. మిమ్మల్నందర్నీ సృష్టించిన దేవుడు కూడా ఒక్కడేనని ఇస్లామ్ అంటున్నది. ఆయన మానవులందర్నీ ఒకే విధమయిన పదార్థంతో సృజించాడు కాబట్టి, వారిలో కొందరు పవిత్రులని, మరి కొందరు అపవిత్రులని నిర్ణయించడం పొరపాటని చెబుతోంది.

ఇస్లామ్ ఈ వాస్తవికతను వివరించిన తరువాత, ఒక మనిషిపై మరో మనిషికి

ఆధిక్యత ఏదైనా ఉంటే అది కేవలం నైతికత ఆధారంగా మాత్రమే ఉండాలని అంటున్నది. భావాలు, ఆచరణ దృష్ట్యా వారందరిపై కొందరికి ఆధిక్యత ఉండటం సహజమే. అలా కాకుండా పుట్టుక ఆధారంగా ఆధిక్యత ఉండటం అన్యాయం, అధర్మం అంటున్నది. ఎందుకంటే ఒక ప్రత్యేక జాతిలోనో, ఒక ప్రత్యేక కులంలోనో పుట్టడం ఎవరి అధీనంలో లేదు. దీనికి భిన్నంగా మనిషి తాను కోరిన భావాలను, విశ్వాసాలను ఏర్పరచుకొని తాను కోరిన పనులు చేయగలడు. అందువల్ల ఎవరయితే చెడు జోలికి పోకుండా దైవం పట్ల భయభక్తులు కలిగి ఉంటూ మంచి పనులు చేస్తారో వాళ్ళే ఉన్నతులు, గౌరవనీయులని ఇస్లామ్ పేర్కొంటోంది. వాళ్ళు ఏ జాతికి, ఏ వంశానికి, ఏ ప్రాంతానికి చెందిన వాళ్ళయినా సరే వారి ఔన్నత్యం గౌరవాలలో ఎలాంటి తేడా రాదని అంటోంది.

మక్కా నగరాన్ని జయించిన తరువాత మహా ప్రవక్త (సఅసం) ప్రజల్ని ఉద్దేశించి ఇలా అన్నారు : "ప్రజలారా యావత్ మానవాళి రెండే రెండు వర్గాలుగా విభజించబడుతుంది! ఒకటి, సజ్జనులు, భయభక్తులు కలవారు, దేవుని దృష్టిలో గౌరవనీయులయిన వారి వర్గం. రెండు, దుర్మార్గులు, కఠినాత్ములు, దేవుని దృష్టిలో నీచులయిన వారి వర్గం. ఈ విభజన తప్పిస్తే మానవులంతా ఆదమ్ (అలైహి) సంతానమే. ఆదమ్ (అలైహి)ని అల్లాహ్ మన్నుతో సృజించాడు.

ఇలాంటి మాటలనే మహాప్రవక్త (సఅసం) తన చివరి హజ్ సమయంలో కూడా బోధించారు. ఆయన అప్పుడు ప్రసంగిస్తూ, "ప్రజలారా! జాగ్రత్తగా వినండి. మీరందరి దేవుడు ఒక్కడే. అరబ్బులకు అరబ్బేతరులపైగాని, అరబ్బేతరులకు అరబ్బులపైగాని తెల్లవానికి నల్లవానిపైగాని, నల్లవానికి తెల్లవానిపైగాని ఎలాంటి ఆధిక్యత లేదు-భయభక్తుల ఆధారంగా తప్ప. అల్లాహ్ దగ్గర మీలో ఎక్కువ భయభక్తులు గలవాడే నిజానికి అత్యధిక గౌరవనీయుడు"అన్నారు.

మహాప్రవక్త (సఅసం) ఇలా ఎన్నో ప్రవచనాల్లో జాత్యహంకారాన్ని, కుల వైషమ్యాన్ని ఖండించారు. తాతముత్తాతలను గురించి గొప్పలు చెప్పుకోడాన్ని ఆయన నిషేధించారు. ప్రళయదినాన దేవుడు మీ కులగోత్రాలను గురించి అడగడని అన్నారు. మీ ముఖాలను, మీ ఆస్తిపాస్తులను చూడటానికి బదులు ఆయన మీ కర్మలను మాత్రమే చూస్తాడని దైవప్రవక్త (సఅసం) మనకు బోధించారు. ఈ బోధనల ఆధారంగానే ఇస్లామ్ ఒక విశ్వజనీన వ్యవస్థను నిర్మించగల సత్తా పొందగలిగింది. ఈ వ్యవస్థలో ఎలాంటి అంటరానితనానికి, నిమ్నోన్నతా భావాలకు తావులేదు. ఇందులో చేరదలచిన వారికి వారు ఏ జాతికి, ఏ తెగకు, ఏ కులానికి చెందిన వారయినా, ఏ

ప్రాంతంలో నివసిస్తున్న వారయినా, ఏ భాష మాట్లాడే వారయినా సరే సమాన హక్కులు లభిస్తాయి.

మానవ సమానత్వానికి ఇస్లామ్ సూచించిన ఈ సూత్రాలు మరే ఇతర మతంలోగాని, వ్యవస్థలోగాని మనకు కనిపించవు. ఇస్లామ్ ఆవిర్భవించిన తొలి రోజుల్లో మనుషుల్ని సంతలో పశువుల్లా కొనడం జరిగేది. అట్టడుగు ప్రజల్ని నీచాతినీచంగా చూసేవారు. స్త్రీలను బానిసలకన్నా హీనంగా చూసేవారు. అలాంటి పరిస్థితిలో ఇస్లామ్ వచ్చి మానవులకు సమానత్వాన్ని బోధించింది. అంతేకాదు, ఒక ఆదర్శ సమాజాన్ని నిర్మించి ఈ సూత్రాల ఆధారంగా మానవుల్లో మానవత్వాన్ని నెలకొల్పవచ్చని ఆచరణాత్మకంగా నిరూపించింది.

సోదరులారా!

ఇస్లామ్ మానవులందరినీ సమానంగా పరిగణించే ఇలాంటి ఆదర్శ సమాజాన్ని నిర్మించగలిగిందంటే ఈ ధర్మం తప్పనిసరిగా దైవం తరపున ఆవిర్భవించిందేనని స్పష్టమవుతోంది. ఒకవేళ ఇది ఏ మానవుడి చేతనో స్థాపించబడిన ధర్మమయితే ఇందులో కూడా జాతి విచక్షణలు, వర్ణ విభేదాలు, ప్రాంతీయ దురభిమానాలు ఉండేవి. కాని అలాంటివి ఎక్కడా ఇస్లామ్‌లో కన్పించవు. ఇలాంటి మహా భాగ్యాన్ని పొందిన మనం ఎంతో అదృష్టవంతులం. కాని ఈ మహాభాగ్యాన్ని ఇతర మానవులక్కూడా పంచవలసిన బాధ్యత మనపై ఉందన్న సంగతిని మరచి పోకూడదు.

43. అల్లాహ్ గుణగణాలకు ఆయన పేర్లే దర్పణాలు

మహాశయులారా!

అల్లాహ్‌కు ఎన్నో మంచి పేర్లున్నాయి. ఖుర్‌ఆన్‌లో అనేక చోట్ల ఈ పేర్ల ప్రస్తావన వచ్చింది. నిజానికి ఇవన్నీ అల్లాహ్ గుణగణాలను తెలిపే పేర్లు. మన విశ్వాస పరిపూర్తి కోసం ఈ గుణగణాలపై నమ్మకం ఉంచడం చాలా అవసరం. ఈ గుణగణాలే మనిషి ఆలోచనా దృక్పథాన్ని, ఆచరణా దిశను నిర్ణయిస్తాయి. ఇప్పుడు మనం కొన్ని దేవుని పేర్లను గురించి తెలుసుకుందాం. దేవుని పేర్లలో 'అజీజ్' ఒకటి. అజీజ్ అంటే శక్తి మంతుడని అర్థం. అంటే అల్లాహ్ అందరికంటే శక్తిమంతుడు. ఆయన నిర్ణయానికి తిరుగులేదు. ఆయన తలచుకున్నది జరిగితీరుతుంది. ప్రపంచంలో ఆయనతో పోటీ చేసి గెలుపొందగల శక్తి ఏదీ లేదు. ఆయన పట్టు నుంచి తప్పించుకోగలవారు కూడా ఎవరూ లేరు. అందువల్ల ఎవరయినా అల్లాహ్‌ను విస్మరించి సాఫల్యం పొందగలనని ఆశిస్తే అతను మోసపోయాడని భావించాలి. అతను విచ్చలవిడిగా జీవించడానికి దేవుడు, అతనికి కొంత కాలం అవకాశమీయవచ్చు. అంతమాత్రాన తనను ఎదిరించేవాళ్ళెవరూ లేరని భావిస్తే అతను తనను తాను మోసగించుకున్నట్లే.

అజీజ్ అనే పేరులో విశ్వసించిన దాసుల కోసం ధైర్యాన్నిచ్చే భావం కూడా ఉంది. దైవ మార్గంలో జీవితం గడుపుతున్నప్పుడు మోమిన్‌కు అనేక కష్టాలు ఎదురుకావచ్చు; లోకం అతడ్ని రకరకాలుగా హింసించవచ్చు. అయితే దీని అర్థం మోమిన్ తన జీవితంలో ఓడిపోయాడని కాదు. అతని ప్రభువు సర్వశక్తిమంతుడు. అన్ని వ్యవహారాలు ఆయన అధీనంలోనే ఉన్నాయి. ఆయన ఎప్పుడు తలచుకుంటే అప్పుడు మోమిన్ స్థితిని మార్చివేయగలడు.

అల్లాహ్ పేర్లలో మరొకటి 'అలీమ్'. అలీమ్ అంటే అన్నీ తెలిసినవాడని అర్థం. ఈ సృష్టిలో ఆయనకు తెలియని విషయం ఏదీ లేదు. ఆయన సజ్జనుల సత్కార్యాలనూ చూస్తున్నాడు; దుర్మార్గుల దుష్కార్యాలనూ గమనిస్తున్నాడు. ఆయన ఏది చేసినా పరిపూర్ణ జ్ఞానం ఆధారంగానే చేస్తున్నాడు కాని , అనుమానాలు, ఊహల ఆధారంగా మాత్రం కాదు. ఆయన ప్రతి విషయాన్ని ప్రత్యక్షంగా తెలుసుకోగల సర్వజ్ఞుడు.

సోదరులారా!

ముస్లిమ్ ఎవరూ చూడలేని అతీంద్రియ విషయాలను విశ్వసిస్తాడని మీకు తెలుసు. ఉదాహరణకు అతను స్వర్గనరకాలను విశ్వసిస్తాడు. దైవ దూతలు ఉన్నారని నమ్ముతాడు. పరలోకంలో సంభవించే విషయాలను గురించి అల్లాహ్, ఆయన

ప్రవక్త మానవాళికి తెలిపారు. అవన్నీ వాస్తవమేనని ముస్లిమ్ విశ్వసిస్తాడు. ఈ విశ్వాసానికి ఆధారం కూడా అల్లాహ్ యొక్క అలీమ్ అనే ఈ గుణ నామమే. అల్లాహ్, అన్నీ ఎరిగినవాడని, ఆయన జ్ఞానంలో ఎలాంటి లోపం లేదని మోమిన్ నమ్ముతాడు. దీని ఆధారంగానే అతను అల్లాహ్ తెలిపిన యదార్థాలను నిజమైనవని విశ్వసిస్తాడు. మానవుడు ఈ యదార్థాలను విశ్వసించకపోతే, లేదా వీటికి వ్యతిరేకమైన విషయాలను విశ్వసిస్తే అతను తప్పకుండా అజ్ఞానాంధకారంలో పడిపోయాడని తెలుసుకోవాలి.

ఈ గుణనామంలో మరొక విషయాన్ని కూడా గ్రహించవచ్చు. మానవుడి సాఫల్యం ఎందులో ఉందో అది అల్లాహ్‌కే తెలుసు. కాబట్టి మానవుడి సాఫల్యం కోసం ఆయన ఏదయినా మార్గం చూపిస్తే దానికంటే మంచిమార్గం మరొకటి ఉండజాలదు. ఈ వాస్తవాన్ని తెలుసుకున్నప్పుడు మనిషి తన సాఫల్యం కోసం దైవం నిర్ణయించిన సమస్త నియమాలను, నిబంధనలను పాటించవలసి ఉంటుంది. ఎందుకంటే దైవం ప్రసాదించిన ప్రబోధనలన్నీ సరయిన వివేచన, జ్ఞానాలపైనే ఆధారపడి ఉంటాయి. వాటిలో ఏ విధమయిన దోషంగాని, పొరపాటుగాని ఉండే అవకాశం లేదు. ఇలాంటి జ్ఞానంగల అల్లాహ్ రుజుమార్గం చూపినప్పుడు మనిషి దాన్ని స్వీకరించకపోతే అతను భ్రష్టమార్గంలో పడి తనను తాను నాశనం చేసుకోదలిచాడని అనుకోవాలి.

ఈ గుణనామం వల్ల మానవుడు తన పనులు, వ్యవహారాల పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండే అవకాశం కూడా ఉంది. అల్లాహ్ తన చర్యలను అనుక్షణం గమనిస్తున్నాడని, హృదయంలో మెదిలే ఊహలను కూడా ఆయన పసిగట్టగలడని అతను నమ్ముతాడు. లోకం కళ్ళు కప్పగలిగినా దేవుని కళ్ళు కప్పలేమని అతనికి తెలుసు. ఈ రోజు ప్రపంచంలో చేసే తప్పుడు పనులకు రేపు దేవుని సన్నిధిలో ఎలాంటి సాకు చూపలేమని కూడా అతనికి తెలుసు. ఇలా విశ్వసించే వ్యక్తి ఎలాంటి అకృత్యానికి పాల్పడలేడు.

మూడవ గుణనామం- 'ఆఫిరిజ్జంబ్' మరియు 'ఖాబిలి తౌబ్'. అంటే అల్లాహ్ క్షమించేవాడని, పశ్చాత్తాపాన్ని అంగీకరించేవాడని అర్థం. ఇది మనిషిలో ధైర్యాన్ని కలిగించి, జీవిత గమ్యాన్ని మార్చుకోవడానికి దోహదపడుతుంది. అజ్ఞానంతో ప్రాపంచిక వ్యామోహంలో పడి, దేవుని ఆదేశాలకు వ్యతిరేకంగా జీవితాన్ని గడిపేవారు కూడా నిరాశపడవలసిన అవసరం లేదు. అలాంటివారు తమ ప్రస్తుత జీవితాన్ని గురించి ఆత్మ పరిశీలన చేసుకోవడానికి దేవుని ఈ గుణనామం అవకాశం కల్పిస్తోంది. ఇప్పటికయినా వారు దుర్మార్గాన్ని వదలిపెడితే వారికి అల్లాహ్ అనుగ్రహ ఛాయలో స్థానం లభిస్తుందని ఈ పేరు ప్రకటిస్తోంది. నిజానికి అల్లాహ్ యొక్క అసలు గుణం అనుగ్రహమే. ఎవరైతే తమ దుర్మార్గ వైఖరిని అంటిపెట్టుకొని ఉంటూ చనిపోయేదాకా పశ్చాత్తాపం చెందరో అలాంటివారికే దేవుని శిక్ష ఉంటుంది.

కొన్ని పొరపాట్ల విషయంలో మనిషి పశ్చాత్తాపం చెందకపోయినా అల్లాహ్ వాటిని క్షమిస్తూ ఉంటాడు. ఉదాహరణకు ఒక వ్యక్తి పాపాలు చేస్తూనే మరొక వైపు పుణ్యకార్యాలు కూడా చేస్తుంటాడు. అలాంటి వ్యక్తి పాపాల క్షమాపణకు అతను చేసే పుణ్యకార్యాలే కారణమవుతాయి. అలాగే ప్రపంచంలో కొందరిపై ఆపదలు, కష్టాలు వస్తుంటాయి. ఈకష్టాలు బాధలు వారి చిన్న చిన్న తప్పులను, పొరపాట్లను హరించివేస్తుంటాయి. అయితే ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి. ఈ రాయితీ తిరస్కారం, తిరుగుబాటు మనస్తత్వం లేని విశ్వాసులకు మాత్రమే పరిమితం. సత్యం తెలిసి కూడా అపమార్గం పట్టి విచ్చలవిడిగా వ్యవహరించే దైవ తిరస్కారులు, బహుదైవారాధకులు దేవుని సన్నిధిలో పశ్చాత్తాపం చెందకపోతే వారి పాపాలు క్షమించబడవు.

నాల్గవ గుణనామం- 'షదీదుల్ ఇఖాబ్'.అంటే అల్లాహ్ కఠినంగా శిక్షించేవాడని అర్థం. దాస్యమార్గం అవలంబించేవారి పట్ల అల్లాహ్ ఎంతటి కరుణామయుడో, తిరస్కారం, తిరుగుబాటు వైఖరి అనుసరించేవారి విషయంలో ఆయన అంతటి కఠినుడు. ఈ గుణనామం ఈ విషయాన్నే మానవుడికి తెలుపుతూ హెచ్చరిస్తోంది.

అయిదో గుణనామం- అనుగ్రహశీలి. అంటే అల్లాహ్ అనుగ్రహాలకు, వరాలకు ఒక పరిమితమంటూ లేదు. ఆయన తన దాసులకు ఎంతయినా ప్రసాదించగలడు, ప్రసాదిస్తున్నాడు కూడా. ఆయన గొప్పదాత. ఆయన దాతృత్వానికి హద్దులు ఉండవు. మానవులకు ఏవైనా లభిస్తున్నాయంటే అది ఆయన అనుగ్రహ ఫలితమే, ఆయన చేస్తున్న మేళ్ళ పర్యవసానమే.

సోదరులారా!

అల్లాహ్ పేర్లలో నేను నాలుగైదు పేర్లనే ప్రస్తావించాను. ఇంకా ఆయనకు ఎన్నో పేర్లున్నాయి. వాస్తవానికి ఇవన్నీ ఆయన గుణగణాలను, శక్తిసామర్థ్యాలను తెలిపే పేర్లే. ఈ గుణనామముల గురించి మనం ఎంతగా ఆలోచిస్తే అంతగా అల్లాహ్‌పై మన విశ్వాసం పటిష్టమవుతూపోతుంది. అంటే ఆరాధనకు, విధేయతకు ఆయన తప్ప మరొక దేవుడు లేడన్న భావన మన అంతర్యాల్లో దృఢంగా నాటుకొని పోతుందన్నమాట. ప్రజలు ఎన్ని చిల్లర దేవుళ్ళను కల్పించుకున్నా వాటిలో ఒక దేవునికి ఉండవలసిన గుణగణాలు ఎన్నటికీ ఉండవు. ఈ గుణగణాలన్నీ ఒకే ఒక దేవుని వ్యక్తిత్వంలో ఉన్నాయి. అదే అల్లాహ్ వ్యక్తిత్వం. మనమంతా చివరికి ఆయన దగ్గరికే వెళ్ళవలసినవాళ్ళం. ఆయనే మన కర్మలను విచారించి శిక్ష లేదా సాఫల్యాన్ని ఇస్తాడు. అందువల్ల ఆయన్ని వదిలి ఇతరుల్ని ఆశ్రయించినవారు ఇటు ప్రపంచంలోనూ, అటు పరలోకంలోనూ దాని దుష్ఫలితాన్ని చవిచూడవలసి వస్తుంది.

44. అమానత్ మోపే బాధ్యతలు

మహాశయులారా!

అల్లాహ్ మనల్ని తన ప్రతినిధులుగా ఈ భూమిపై పుట్టించాడు. అంటే మనమంతా ఆయన ఆజ్ఞలకు బద్ధులమై ఇక్కడ జీవితం గడపాలన్నమాట. మరొక విషయం ఏమిటంటే మనకు ఈ ప్రపంచంలో ఇవ్వబడిన వస్తువులన్నీ చివరికి మన ఆత్మ, శరీరం, శక్తిసామర్థ్యాలు కూడా ఆయన ప్రసాదించినవే. దేవుని ప్రతినిధులుగా మనం వీటన్నింటినీ ఆయన ఆజ్ఞల ప్రకారమే వినియోగించాలి.

దివ్య ఖుర్‌ఆన్‌లో "ముస్లిమ్‌లారా! అమానతుల్ని వాటి స్వంతదారులకు అప్పగించండి, మరియు ప్రజల మధ్య తీర్పు చేసేటప్పుడు న్యాయంగా చెయ్యండి అని అల్లాహ్ మిమ్మల్ని ఆజ్ఞాపిస్తున్నాడు" అని ఉంది.

దేవుని ఈ ఆదేశం మనపై ఒక పెద్ద బాధ్యతను వేస్తోంది. వాస్తవం చెప్పాలంటే మోమిన్ యొక్క మొత్తం జీవితం అల్లాహ్ అమానతే. మోమిన్ జీవితం అల్లాహ్ అమానత్ అయినప్పుడు, ఈ అమానత్‌ను దాని అసలు యజమాని అయిన అల్లాహ్ అభీష్టం ప్రకారమే ఉపయోగించవలసి ఉంటుంది. మన జీవితం, అల్లాహ్ అనుగ్రహించిన శక్తిసామర్థ్యాలు, సాధన సంపత్తులు, ఇతర అన్ని వస్తువులూ అల్లాహ్ ఇష్టప్రకారమే వినియోగమవుతుంటే, ఆయన అమానతుల్ని మనం సద్వినియోగం చేస్తున్నట్లు లెక్కలోనికి వస్తుంది.

ఒకవేళ అలాకాకుండా ఈ వస్తువుల్ని అల్లాహ్ అభీష్టానికి వ్యతిరేకంగానో లేదా ఇతర మానవుల అభీష్టం ప్రకారమో ఉపయోగిస్తుంటే మనం అల్లాహ్ అమానతుల్ని దుర్వినియోగం చేస్తున్నట్లు అవుతుంది. అంటే ఈ అమానతుల సొంతదారు అయిన అల్లాహ్‌ను మనం మోసగిస్తున్నామన్నమాట. నిజానికి ఇది అల్లాహ్‌ను మోసగిస్తున్నట్లు కాదు, మనల్ని మనం మోసగించుకుంటున్నట్లే. ఈ విధంగా చూస్తే మనం ఈ ప్రపంచంలో అడుగడుగునా పరీక్షించబడుతున్నామని, ఈ పరీక్షలో మనం సఫలమవడమో, విఫలమవడమో జరుగుతున్నదని స్పష్టమవుతోంది.

సోదరులారా!

ప్రజలతో సంబంధాలుండే గొప్ప బాధ్యతాయుతమయిన పదవిగలవారిపైనే అమానత్ బాధ్యత ఉంటుందని, సామాన్యులపై ఈ బాధ్యత ఉండదని ఎన్నటికి భావించకూడదు. ఏదో ఒక రూపంలో అల్లాహ్ ప్రతి వ్యక్తికి అమానత్‌ని అప్పగించివున్నాడు. అల్లాహ్ అప్పగించినవాటిలో అన్నిటికంటే పెద్ద అమానత్- మనం రుజుమార్గాన్ని అవలంబించడమే, దైవ ధర్మాన్ని అవలంబించామంటే దేవుడు మనకు ఒక పెద్ద అమానత్‌ని అప్పగించాడన్న మాట. ఈ అమానత్ బాధ్యతను గ్రహించి, మనం ప్రతి పనీ

దేవుని అభీష్టం ప్రకారమే చేయాలి. ఆయనకు ఇష్టంగాని ఏ పనీ చేయకూడదు. సాధ్యమయినంత వరకు ఆయన ఆదేశాలకు వ్యతిరేకంగా ఎలాంటి పనికి ఉపక్రమించకూడదు.

ఆ తరువాత మనం ధర్మసంస్థాపన పనిలో. లీనమైపోవాలి. సమాజంలో చెడులను నిర్మూలిస్తూ మంచిని సర్వసామాన్యం చేయడానికి కృషి చేయాలి. చెడుల నిర్మూలన కార్యకలాపాలలో మనం ఎంత నిమగ్నులమైపోవాలంటే- సంఘంలోని ఎంత పెద్ద నాయకుడయినా, అధికారి అయినా సరే చెడులను ప్రోత్సహించనివ్వకుండా ప్రజలు అతని ప్రయత్నాలను వమ్ము చేసే విధంగా వాతావరణాన్ని సృష్టించాలి. కొందరు 'స్కీముల' పేరిట జూదం, లాటరీల వ్యాపారం చేస్తుంటే, మరికొందరు సంస్కృతి, కళల పేరిట అశ్లీలం, అసభ్యకార్యాలను వ్యాపింపజేస్తుంటారు. ప్రజలు మంచిని అభిమానించేవారుగా తయారైతే వారే స్వయంగా వీరి ఆటలను కట్టిస్తారు. ప్రజలలో ఇలాంటి శక్తిని కలిగిస్తే సమాజంలో చెడులు తలెత్తే అవకాశమే ఉండదు. చెడులను ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రోత్సహించే నాయకులు కూడా క్రమేణా కనుమరుగైపోతారు. వారి స్థానంలో మంచిని ప్రేమించేవారు వస్తారు.

ఈ విధంగా మంచిని ప్రేమించే ప్రజలకు, మంచిని ప్రేమించే నాయకులే లభిస్తారు. ఈ విషయాన్నే మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ప్రజలకు తెలుపుతూ, " మీరు ఎలాంటి వాళ్ళవుతారో అలాంటి పాలకులే మీపై పెత్తనం చెలాయిస్తారు" అని బోధించారు. దీన్ని బట్టి మనకు తెలుస్తున్నదేమిటంటే, అన్నిటికీ పాలకులే కారణ మంటూ ప్రజలు తమపై ఉన్న బాధ్యతల్ని విస్మరించలేరు. పరిస్థితులను చక్కదిద్దడంలో ప్రజలు కూడా తమ వంతు బాధ్యతను నిర్వహించవలసి ఉంటుంది.

సోదరులారా!

సాధారణంగా సంఘంలో పాలకవర్గమే కీలక పాత్ర వహిస్తుందన్నది నిజమే. అయితే ఈ రోజుల్లో పాలక వర్గాన్ని ఎన్నుకునేది ప్రజలే కాబట్టి, అలాంటి నాయకులు, ప్రతినిధులే అధికారంలోకి వస్తారు. వీరి చేతికి అధికారం, నాయకత్వం లభించింది అంటే ప్రజలు వీరికి ఒక పెద్ద అమానత్ బాధ్యతను అప్పగించారన్న మాట. అలాంటప్పుడు పాలకులు పరిపాలనా విధుల్ని ఎంతో బాధ్యతాయుతంగా నిర్వహించవలసి ఉంటుంది. ప్రజలు వారికి అప్పగించిన ఏ పనయినను సరే పూర్తిగా చిత్తశుద్ధి, నిజాయితీలతో నిర్వహించాలి. ఒకవేళ వీరు ఈ విధుల్ని సక్రమంగా నిర్వహించకపోతే ప్రజలు అప్పగించిన అమానత్‌ను దుర్వినియోగం చేసినట్లు అవుతుంది. అంతేకాదు, వారు ప్రజలకు ద్రోహం చేసినట్లు కూడా అవుతుంది.

పాలనాధికారమే కాకుండా అమానత్ క్రిందికి వచ్చేవి మరికొన్ని విషయాలు కూడా ఉన్నాయి. ఉదాహరణకు అల్లాహ్ కొందరికి బుద్ధి, వివేచనలు ప్రసాదించాడు. వీటిని ఉపయోగించి, వారు ఏది మంచి విషయమో, ఏది చెడు విషయమో ప్రజలకు

తెలియజేస్తూ వాళ్ళను సరయిన దృక్పథం వైపునకు మళ్ళించే ప్రయత్నం చేస్తుండాలి. ఇంకా ఇలాంటి వ్యక్తులు తమ బుద్ధీ వివేచనలను ఉపయోగించి తాము ఏదైతే వాస్తవమని గ్రహిస్తారో దాన్ని ఎలాంటి సంకోచం లేకుండా బహిర్గతం చేయాలి. సామాన్యంగా స్వార్థపరులు, స్వప్రయోజకులు పాలకుల ముఖస్తుతి చేస్తూ పబ్బం గడుపుకుంటారు. వీళ్ళ దగ్గర సత్యాసత్యాల ప్రమాణాలు అవకాశాన్ని బట్టి మారుతుంటాయి. వీళ్ళు, ఒక విషయం వాస్తవమని గ్రహించినా దాన్ని బయటపెట్టరు. దానికి బదులుగా మరో అవాస్తవిక విషయాన్ని వాస్తవ విషయంగా చిత్రించడానికి ప్రయత్నిస్తారు.

బుద్ధీ వివేచనలు దైవం ప్రసాదించిన వరాలు. వీటిని దుర్వినియోగం చేస్తే పరలోకంలో తీవ్ర పరిణామాలకు గురికావలసి వస్తుంది. సత్యానికి, ధర్మానికి వ్యతిరేకంగా అలజడులు చెలరేగినప్పుడు సత్యమేదో తెలిసినవారు మౌనం వహించడం సరికాదు. బుద్ధీ వివేచనాల రూపంలో దైవం అప్పగించిన అమానత్‌ను ఇలాంటి సమయంలో ఉపయోగించకపోతే అది దైవ ద్రోహం అవుతుంది. ఎందుకంటే ఒక విషయం సత్యమని తెలిసినప్పుడు దాన్ని ధృవపరచకుండా దాచడం కూడా దైవ ద్రోహం క్రిందికే వస్తుంది.

సోదరులారా!

మనలోని ప్రతి వ్యక్తికీ అల్లాహ్ ఏదో ఒక రూపంలో అమానత్‌ను అప్పగించి ఉన్నాడు. ఒకరికి తక్కువ బాధ్యత, మరొకరికి ఎక్కువ బాధ్యత అన్న ప్రసక్తి లేదు. ప్రతి ఒక్కరూ తమ తమ శక్తిసామర్థ్యాలను బట్టి, కార్యరంగాలను బట్టి ఈ బాధ్యతను నిర్వహించవలసి ఉంటుంది. ప్రతి ఒక్కరూ తమకు అప్పగించబడిన అమానత్‌ల విషయంలో రేపు తీర్పు దినాన అల్లాహ్ ముందు సమాధానం చెప్పుకోవలసి ఉంది. కాబట్టి మనమంతా అమానత్ ప్రాముఖ్యత ఏమిటో తెలుసుకొని మనపై మోపబడిన బాధ్యతల్ని సక్రమంగా నిర్వహించాలి.

మంచిని చేయడానికి, చెడుల్ని విసర్జించడానికి, అమానత్ బాధ్యతల్ని నెరవేర్చడానికి అల్లాహ్ మనకు ప్రపంచంలో వ్యవధి నిచ్చాడు. ఈ వ్యవధిని సద్వినియోగం చేసుకుంటూ ప్రపంచంలో మనం బాధ్యతా యుతమయిన జీవితాన్ని గడపాలి. ఒకవేళ దైవాన్ని, దైవం అప్పగించిన బాధ్యతల్ని విస్మరించి విశృంఖలమైన జీవితం గడిపితే, ఈ స్థితిలోనే మనకివ్వబడిన వ్యవధి కాస్త గడచిపోతే మనకంటే దురదృష్టవంతులు మరొకరు ఉండరు. అంతిమదిన న్యాయస్థానంలో మనం మన ప్రభువు ముందు ద్రోహులుగా, విశ్వాసఘాతకులుగా నిలబడవలసి వస్తుంది. అలాంటి దుస్థితికి అవకాశమీయకుండా మనం మనకప్పగించబడిన అమానతులేమిటో తెలుసుకొని చిత్తశుద్ధితో వాటిని సద్వినియోగం చెయ్యడానికి కృషిచేయాలి.

45. ప్రయత్నం మన విధి, ఫలితం దైవాధీనం

మహాశయులారా!

దివ్య ఖుర్‌ఆన్‌లో అనేక చోట్ల విశ్వసించేవారికి శుభవార్త వినిపించమని అల్లాహ్ మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ను, ఇతర ప్రవక్తలను ఆదేశించడం జరిగింది. అల్ బఖరా సూరాలో " ఓ ప్రవక్తా ! ఈ గ్రంథాన్ని విశ్వసించి (దీని బోధనలకు అనుగుణంగా) తమ నడవడికను సరిదిద్దుకునేవారి కొరకు సెలయేరులు ప్రవహించే స్వర్గవనాలు ఉన్నాయని శుభవార్తను వినిపించు" అని ఉంది. ఇలాంటి శుభవార్తను వినిపించడంలో ఉన్న ఒక అర్థం ఏమిటంటే - ఇస్లామ్‌ను విశ్వసించినవారే పరలోకంలో సాఫల్యం చెందుతారు. అక్కడి శాశ్వత జీవితంలో వీరు అల్లాహ్ ప్రసాదించే మహా భాగ్యాలను అనుభవిస్తూ, గౌరవప్రదమయిన జీవితం గడుపుతారు.

ఈ అర్థంతో పాటు శుభవార్తను వినిపించడంలో మరో అర్థం కూడా దాగి ఉంది. దైవాజ్ఞలను పాటిస్తూ పవిత్ర జీవితం గడిపే విశ్వాసులకు సాధారణంగా అనేక కష్టాలు వస్తుంటాయి. దైవ సందేశ వ్యాప్తికై సాగించే కృషిలో ఇస్లామ్ వ్యతిరేక శక్తుల నుండి ఎన్నో ఇక్కట్లు ఎదురవుతుంటాయి. ఇలా ఇహలోక జీవితంలో సంభవించే కష్టనష్టాలన్నీ విశ్వసించినవారికి పరలోకంలో మేలే చేకూర్చుతాయి. ఈ బాధలు, కష్టాలతో క్రుంగిపోకుండా స్వర్గ శుభవార్త వారికి మనో ధైర్యాన్ని ఇస్తుంది.

ఫిరౌన్, అతని దుష్టసహచరుల చేతుల్లో ఇస్రాయీల్ సంతతి ప్రజలు ఎన్నెన్ని కష్టాలు అనుభవించవలసి వచ్చిందో మీరు వినే ఉంటారు. ఫిరౌన్ అత్యాచారాల నుండి ఈ అభాగ్యులకు విముక్తి కలిగించడానికి అల్లాహ్ హజ్రత్ మూసా (అలైహి), హజ్రత్ హారూన్ (అలైహి) లను ప్రభవింపజేశాడు. ఇస్రాయీల్ సంతతి ప్రజలు దైవ ధర్మాన్ని అవలంబించిన తరువాత వారికి శుభవార్తను వినిపించమని ఆయన హజ్రత్ మూసా(అలైహి) ను ఆదేశించాడు. పరిస్థితుల వత్తిడి వల్ల విశ్వసించిన వారిపై అవతరించిన భయాందోళనలను, నిరాశానిస్పృహలను దూరం చేయడానికి ఇలా శుభవార్తను వినిపించడం జరిగింది.

మోమిన్ దృక్పథం కేవలం ప్రపంచం వరకే పరిమితంగా లేదు. అతను పరలోకాన్ని విశ్వసించాడు. కాబట్టి అతను కష్టకాలంలో నిరాశానిస్పృహలకు గురికాకుండా ఎల్లప్పుడూ ధైర్య స్థయిర్యాలను ప్రదర్శిస్తూ పరిస్థితులకు ఎదురీదాలి. ఆత్మవిశ్వాసంతో దైవ మార్గంలో ముందుకు సాగాలి. ప్రతి విషయంలోనూ అంతిమ నిర్ణయం అల్లాహ్

అధీనంలోనే ఉందన్న యదార్థాన్ని గుర్తుంచుకుంటూ ఆయన మీదనే భరోసా ఉంచాలి. అల్లాహ్ తలచుకుంటే పరిస్థితులు మారిపోవడంలో ఎంతో సేపు పట్టదని దృఢంగా విశ్వసించాలి. ఇలాంటి విశ్వాసం, ధైర్యంకల మోమిన్ కష్టాలొచ్చినప్పుడు ఆందోళన చెందడు. మూణ్నాళ్ళ ఈ ప్రాపంచిక జీవితంలో కష్టాలను కాస్త ఓర్చుకుంటే, ఆ తరువాత పరలోకంలో అతనికి అంతా సుఖమయమైన జీవితమే ప్రాప్తమవుతుంది.

సోదరులారా!

మోమిన్ దైవ మార్గంలో పని చేయడానికి సిద్ధమైనప్పుడు ఆ మార్గంలో అతనికి అనేక అవాంతరాలు ఎదురవుతాయి. ప్రతికూల వాతావరణం ఏర్పడుతుంది. అయితే ఇలాంటి పరిస్థితుల్లో ఆందోళన చెందకుండా, ధైర్యం వీడకుండా దైవ కార్యాన్ని ముందుకు సాగించినవారు ఎంతో అదృష్టవంతులు. మోమిన్ ఎలాంటి పరిస్థితిలో కూడా నిరాశ చెందడు. ఎందుకంటే తాను చేయగలిగిందేదో చేస్తూ ఉండటమే తన బాధ్యతని అతను భావిస్తాడు. ఫలితాలను గురించి అతను ఆలోచించడు. వాటిని దైవంపై వదలిపెడతాడు. నిజానికి ఫలితాలు ఎప్పుడూ దేవుని అధీనంలోనే ఉంటాయి. దైవ మార్గంలో బేషరతుగా కృషి చెయ్యడమే మోమిన్ కర్తవ్యం. తన కృషి వల్ల చెడులు తప్పకుండా అణగిపోతాయని అతను ఎప్పుడూ అనుకోడు, ఒక వేళ తన ప్రయత్నాల వల్ల ఏ ఒక్క మంచి పనీ జరగకపోతే తాను విఫలుడయ్యానని కూడా అతను భావించడు.

మోమిన్ ముందు ఒకే ఒక విషయం ఉంటుంది. దైవం తనపై మోపిన బాధ్యతల ప్రకారం, తాను ధర్మసంస్థాపన కోసం తన శక్తిసామర్థ్యాలన్నీ ఉపయోగించి పాటుపడాలి; ప్రజల్ని మంచి వైపునకు పిలవాలి, చెడుల నుంచి నిరోధించాలి, వారిని నీతి మార్గాన నడిపించాలి, అని మాత్రమే అతను ఆలోచిస్తాడు, ప్రయత్నాల పర్యవసానాన్ని గురించి ఆలోచించకుండా దీక్షతో ధర్మసంస్థాపన కృషిలో ముందుకు సాగిపోవడమే తన బాధ్యతని భావిస్తాడు. బాధ్యతల నిర్వహణలో స్థిరంగా ఉంటేనే దైవ ప్రసన్నత ప్రాప్తమవుతుందని విశ్వసిస్తాడు. ఎన్ని కష్టాలొచ్చినా సహించడానికి ఎన్ని అవాంతరాలు ఎదురయినా అధిగమించడానికి ఈ విశ్వాసమే అతనికి శక్తినిస్తుంది.

సోదరులారా!

మనమంతా ఇలాంటి విశ్వాసం, దీక్ష, ఆకాంక్షలనే మనలో జనింపజేసుకోవాలి. ఇవి లభించిన తరువాత భయం, పిరికితనం, నిర్లిప్తత, నిరాశ, నిస్పృహలు మన దరిదాపులకే రావు. ఈ మహాభాగ్యం పొందిన మనిషి ఇతరుల సహకారం, ప్రోత్సాహాలు లేకపోయినా ఒంటరిగానే యావత్ప్రపంచాన్ని ఎదిరించగలడు. ఎలాంటి భయం, సంకోచం లేకుండా చెడులకు వ్యతిరేకంగా పోరాటం సాగించగలడు.

ఒక విషయాన్ని ఎల్లప్పుడూ దృష్టిలో ఉంచుకోండి. మంచి కోసం చేసే ఏ పనీ వృథా పోదు. చెడుల నిర్మూలన కోసం మేం చేస్తున్న ఈ చిన్న ప్రయత్నాల వల్ల లాభం ఏమిటి అంటారు కొందరు, కాని ఇలా ఎన్నటికీ అనుకోకూడదు. ధర్మసంస్థాపన మార్గంలో కృషి ఎంత చిన్నదయినా సరే వృథా కాదు. దాని ప్రభావం కొంత కాలానికైనా సమాజం మీద కనబడుతుంది. మంచి కోసం ఏ పని చేసినా కొద్దో గొప్పో దాని ప్రభావం తప్పకుండా వ్యక్తమవుతుంది. అయితే ఈ ప్రభావం వెంటనే వ్యక్తం కావచ్చు. ఒక్కోసారి చాలా కాలం తర్వాత కూడా వ్యక్తం కావచ్చు. కొందరు తమ ప్రయత్నాలకు ఫలితం తొందరగా కనిపించకపోతే లేదా కనీసం సమీప భవిష్యత్తులోనయినా కనిపించకపోతే ఢీలా పడిపోతారు. ఈ చెడుల వెల్లువను నిరోధించడానికి ఒక చిన్న కర్రను అడ్డం వేస్తే లాభం ఏమిటి? అని భావించి ఆ చేసే ప్రయత్నాన్ని కూడా మానుకుంటారు. కాని ఇలా భావించకూడదు.

అసలు విషయం ఏమిటంటే, మంచి కోసం మనం చేసే ఏ ప్రయత్నమైనా మనక్కూడా లాభం చేకూర్చుతుంది. అల్లాహ్ దృష్టిలో సంకల్పశుద్ధి అన్నిటికంటే విలువైనది. మన ప్రయత్నాల ఫలితం ఆయన అధీనంలోనే ఉంది. కాబట్టి సత్సంకల్పంతో చేసే ఏ ప్రయత్నమూ వృథా పోదు. రెండో విషయం, పరలోకంలో లభించే పుణ్యఫలాన్ని దృష్టిలో పెట్టుకుంటే నిరాశా నిస్పృహలకు ఆస్కారమే ఉండదు. నిజానికి ఏ మంచి పని చేసినా దాని వెనుక మన ఉద్దేశ్యం దైవప్రసన్నత, పరలోక సాఫల్యం పొందాలన్నదే. ప్రాపంచిక ఫలితాల దృష్ట్యా కూడా మనం, మన ప్రయత్నాలు వృథా పోవని, ఎప్పటికయినా అవి తమ ప్రభావాన్ని చూపగలవని విశ్వసించాలి. కాబట్టి ఎలాంటి పరిస్థితులు ఎదురయినా అధైర్యం చెందకుండా దైవమార్గంలో కృషిని కొనసాగించవలసిందే.

ఒకవేళ ఈ చెడుల్ని అరికట్టడం మన వల్ల సాధ్యం కాదనో లేదా మరేదయినా కారణంగానో నిరాశపడి దైవ మార్గంలో ధనాన్ని, శక్తిసామర్థ్యాలను వినియోగించడం తగ్గించి వేస్తే పరలోకంలో పుణ్యఫలం తగ్గిపోతుంది. పైగా ఈ పొరపాటుకు దైవం ముందు సమాధానం కూడా చెప్పుకోవలసిన పరిస్థితి రావచ్చు. అందువల్ల ఫలితాన్ని గురించి ఆలోచించకుండా దైవ మార్గంలో మనం చేయగలిగిన పనిని మనం చేస్తూనే పోవాలి. సమాజం నుండి చెడులు అంతమయినా, కాకపోయినా మన ప్రయత్నమేదో మనం చేస్తూనే ఉండాలి.

46. సమాజ సంస్కరణకు మూలమంత్రం

మహాశయులారా!

ఈనాడు మన సమాజం ఎన్నో నైతిక రుగ్మతల్లో కూరుకుపోయింది. ఇలాంటి సమాజాన్ని సంస్కరించడం అంత తేలిక కాదు. అయితే ఈ విషయంలో దివ్యఖుర్‌ఆన్ కొన్ని మౌలిక ప్రతిపాదనలను సూచిస్తోంది చూడండి. "అల్లాహ్ న్యాయాన్ని, ఉపకారాన్ని, బంధువుల హక్కు నెరవేర్చటాన్ని ఆజ్ఞాపిస్తున్నాడు. మరియు అశ్లీలతను, చెడును, అన్యాయాన్ని, అత్యాచారాన్ని నిషేధిస్తున్నాడు. ఆయన మీకు ఉపదేశిస్తున్నాడు, మీరు గుణపాఠం నేర్చుకోవాలని." ఈ ఆయత్‌లో ఖుర్‌ఆన్ మూడు విషయాలను పాటించమని ఆదేశిస్తోంది. ఈ మూడు విషయాలపై మొత్తం సమాజం సంస్కరణ ఆధారపడి ఉంది. అలాగే సమాజ పతనానికి మూల కారణమయ్యే మూడు చెడులను నిర్మూలించాలని కూడా ఖుర్‌ఆన్ ఆజ్ఞాపిస్తోంది.

మొదటి విషయం న్యాయాన్ని తీసుకోండి. ఇందులో రెండు భావాలున్నాయి. ఒకటి, ప్రజల మధ్య హక్కులు సమతూకంగా, తగ్గట్టుగా ఉండాలన్నది. అంటే ఎవరికి ఎంత హక్కు లభించాలో అంత హక్కు లభించాలన్న మాట. రెండో అర్థం, ఎవరి హక్కు వారికి ఎలాంటి ఆటంకం, లోపంలేని విధంగా ఇవ్వాలన్నది. సాధారణంగా మనం న్యాయం అంటే ఇద్దరు వ్యక్తుల మధ్య హక్కుల విభజన సరిసమానంగా ఉండాలని భావిస్తాం. కాని ఇది ప్రకృతికి విరుద్ధం. ఖుర్‌ఆన్‌లో వాడబడిన 'అదల్' అనే పదానికి అర్థం -హక్కుల విభజన ఆయా వ్యక్తులకు తగ్గట్టుగా, సరితూగేలా ఉండాలన్నదే. ఇదే అసలైన న్యాయం.

ప్రతీ విషయంలోనూ సమానత్వం ఉండాలన్న షరతు లేదు. కొన్ని విషయాల్లో సమానత్వం ఉండవలసిందే.ఉదాహరణకు, పౌర హక్కులు ప్రజలందరికీ సమానంగా ఉండాలి. అయితే మరికొన్ని విషయాల్లో ఈ సమానత్వం 'అదల్'కు అంటే న్యాయానికి వ్యతిరేకంగా ఉంటుంది. ఉదాహరణకు, సమాజం రీత్యా, నైతికత రీత్యా తల్లిదండ్రులకు, సంతానానికి మధ్య సమానత్వం ఉండాలనడం సరికాదు. అలాగే ఉన్నత స్థాయి సేవలు చేసే వారికి, తక్కువ స్థాయి సేవలు చేసే వారికి మధ్య ఎలాంటి వ్యత్యాసం లేకుండా సమానమయిన వేతనాలు ఉండాలనడం కూడా న్యాయం కాదు.

ఇలాంటి నిర్బంధంలేని సమానత్వాన్ని సమా జంలో ఎక్కడ అమలు జరపడానిక ప్రయత్నం జరిగినా అక్కడ ఈ ప్రయోగం ఘోరంగా విఫలమవడమో, లేదా సత్ఫలితాలు ఇవ్వకపోవడమో జరిగింది. ఈ యదార్థాన్ని ఎవరూ కాదన లేరు. ఇస్లామ్ న్యాయాన్ని

స్థాపించదలిచింది. అందువల్ల సమాజంలోని ప్రతి వ్యక్తికీ నైతిక, సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, శాసన పరమయిన అతని హక్కులను పూర్తి నిజాయితీతో ఇవ్వాలి. ఈనాడు మానవ సమాజంలో ఇలాంటి న్యాయమే కొరవడింది. కొన్ని చోట్ల హక్కుల విభజన అన్యాయం, అక్రమాలతో కూడుకొని ఉంటే, మరికొన్నిచోట్ల కృత్రిమరీతులలో అత్యంత నీచమయిన సమానత్వాన్ని నెలకొల్పడం జరిగింది. ఫలితంగా సమాజంలో అశాంతి, అసంతృప్తులు చోటు చేసుకున్నాయి.

దేవుడు ఆజ్ఞాపించిన రెండో విషయం ఉపకారం అంటే సత్ప్రవర్తన, మేలు చేయడం, ఉదార బుద్ధితో వ్యవహరించడం, సానుభూతి కనబరచడం, సహనం సామరస్యాలతో మెలగడం మొదలయిన అర్థాలున్నాయి. ఈ విధంగా ఇది 'న్యాయం' కంటే కూడా గొప్ప సత్కార్యం. సామూహిక జీవితంలో న్యాయం కన్నా ఉపకారానికే ఎక్కువ ప్రాముఖ్యం ఉంది. కేవలం హక్కుల ఆధారంగా ఏ సమాజం మన జాలదు. ఎవరికి ఎంత హక్కు ఉందో అంతే ఇవ్వాలన్న భావనపై సంబంధాలు ఏర్పడిన సమాజంలో ఘర్షణలు, హక్కుల నినాదాలు ఉండవన్నది నిజమే. కాని పరోపకారభావం లేకపోతే ఆ సమాజంలో ప్రేమ, అభిమానం, చిత్తశుద్ధి, కృతజ్ఞత, శ్రేయోభిలాష, త్యాగనిరతి లాంటి ఉదాత్త సుగుణాలు జనించవు. అది చిక్కులు, సమస్యలు లేని జీవితమయినప్పటికీ అందులో రుచి, మాధుర్యాలు మాత్రం ఉండవు.

ఈ ఆయత్‌లోని మూడో విషయం, బంధువుల హక్కు నెరవేర్చడం. అంటే బంధువుల పట్ల సద్భావంతో మెలుగుతూ, వారి హక్కులను గౌరవించమని అల్లాహ్ మనల్ని ఆదేశిస్తున్నాడు. బంధువుల హక్కులను గౌరవించడ మంటే కేవలం వారితో మంచిగా మెలగమని, వారి కష్ట సుఖాలలో పాలుపంచుకోమని, ధర్మ సమ్మతయిన విషయాల్లో వారికి చేదోడువాదోడుగా ఉండమని మాత్రమే అర్థంకాదు. దైవం మన కిచ్చిన దాంట్లో మన భార్యా పిల్లలకే కాకుండా, మన బంధువులక్కూడా హక్కుందని తెలుసుకొని, దాన్ని నెరవేర్చాలి.

సుఖసంతోషాలతో జీవితం గడిపే ప్రతి వ్యక్తీ నిరుపేదలైన తన బంధువులను కూడా ఆదుకోవాలని, వాళ్ళు తిండి, బట్ట లేక బాధపడుతూ ఉంటే వాళ్ళ మానాన వాళ్ళను వదలిపెట్ట కూడదని ఇస్లామ్ స్పష్టంగా ఆదేశిస్తోంది. ఒక వ్యక్తి భోగభాగ్యాలు అనుభవిస్తుంటే, అతని బంధువులు ఆర్థిక సమస్యలతో సతమత మయ్యేటటువంటి సమాజం ఇస్లామ్ దృష్టిలో చాలా చెడ్డ సమాజం. ఒక వంశంలో సుఖ సంతోషాలతో జీవితంగడిపేవారు మొట్ట మొదట తమ వంశంలోని పేదవాళ్ళ హక్కులను నెరవేర్చాలి. ఆ తరువాతనే ఇతరుల హక్కులను నెరవేర్చవలసి ఉంటుంది. ఇది వారిపై దైవం మోపిన బాధ్యత.

మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) మన హక్కుదారులను గురించి వివరిస్తూ, ఒక మనిషి యొక్క మొట్టమొదటి హక్కుదారులు అతని తల్లిదండ్రులు, తరువాత అతని భార్యా పిల్లలు, ఆ తరువాత అతని అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్ళు, ఆ తరువాత అతని సమీప బంధువులు, ఆపై ఇతర బంధువుల హక్కులను నెరవేర్చవలసి ఉంటుందని బోధించారు. ఈ సూత్రం ప్రకారమే హజ్రత్ ఉమర్ (రజిఅన్) ఒకసారి ఒక అనాధబాలుడ్ని పోషించే బాధ్యతను తన పినతండ్రి కొడుకులకు అప్పగించారు. సమాజంలోని ప్రతి వ్యక్తీ తన సన్నిహితులకు తోడ్పడి వారిని పైకి లేవనెత్తే బాధ్యతను వహించాలి. ఇటువంటి సమాజాన్నే ఇస్లామ్ నెలకొల్పదలిచింది. ఈ బాధ్యతను ప్రతి మనిషీ గుర్తిస్తే మనల్ని సతమతం చేస్తున్న ఎన్నో సమస్యలు పరిష్కారమవుతాయి.

ఏ సమాజంలో అయితే ఈ మూడు విషయాలపై అమలు జరుగుతుందో ఆ సమాజం ఎంతగా సుఖసంతోషాలతో అలరారుతుందో చెప్పనవసరం లేదు. విశ్వప్రభువు బోధించిన ఈ మూడు విషయాలు మన బాధలకు, కష్టాలకు మంచి నివారణోపాయం అనడంలో సందేహం ఏముంది? అయితే వాటిని మన నిత్య జీవితంలో పాటించాలి. ఇవి ఉండగా ఇతర ప్రతిపాదనలు, ప్రత్యామ్నాయాల జోలికి పోకూడదు.

ఈ ఆయత్‌లో అల్లాహ్ మూడు చెడుల నివారణను గురించి కూడా ప్రస్తావించాడు. ఇందులో మొదటిది అశ్లీలం. అశ్లీలం అంటే అసభ్యకరం, అసహ్యకరం, లజ్జారహిత మయిన విషయాలన్నమాట. ఉదాహరణకు సిగ్గు లేనితనం, నగ్నత్వం, దుర్నడతకు సంబంధించిన సమస్త విషయాలున్నాయి. దొంగతనం, మద్యపానం, దుర్భాష, పరోక్షంగా లోపాలను ఎంచడం, పిసినారితనం మొదలైన చెడులు కూడా ఇందులో చేరివున్నాయి. ఈ చెడులను చేయడం, వీటిని వ్యాపింపజేయడం పూర్తిగా నిషేధించడం జరిగింది. దుష్ప్రచారం, అపనిందలు, చెడులను ప్రేరేపించే కథలు, నాటికలు, సినిమాలు, నగ్నచిత్రాలు, అర్థనగ్న వస్త్రధారణ, స్త్రీ పురుషులు చెట్టపట్టాలు వేసుకొని తిరగడం, వేదికలపై స్త్రీలు నృత్యం చేయడం, పాడటం మొదలయిన చెడులను నిర్మూలించాలని ఇస్లామ్ ఆదేశిస్తోంది.

ఆయత్‌లో ప్రస్తావించబడిన రెండో విషయం- చెడు. ఇక్కడ అసలు "మున్కర్" అనే పదం వాడబడింది. ప్రతి కాలంలో సాధారణంగా మానవులు చెడు అని భావించే ప్రతి చెడు విషయాన్నీ మున్కర్ అంటారు. ప్రతి మతంలోనూ ఈ చెడును చెడుగానే భావించడం జరిగింది.

ఇక మూడో విషయం అన్యాయం లేదా అత్యాచారం. అరబ్బీలో ఇక్కడ "బగీ" అనే పదాన్ని వాడటం జరిగింది. 'బగీ' అంటే హద్దులు మీరడం అని అర్థం. ఎవరైనా

ఇతరుల హక్కులను కాజేస్తే అది 'బగీ' క్రిందికి వస్తుంది. అంటే అన్యాయం, అత్యాచారం క్రిందికే వస్తుందన్నమాట. మానవుల హక్కులను ఉల్లంఘించడం కూడా అన్యాయం, అత్యాచారం క్రిందికే వస్తుంది. దేవుని హక్కులను నెరవేర్చకపోవడం కూడా 'బగీ' క్రిందికే వస్తుంది. సృష్టించిన వాడికే సృష్టిని పాలించే అధికారం ఉంది. అంటే ఆదేశించే హక్కు ఒక్క దైవానికే ఉందన్న మాట. ఈ హక్కు దైవానికి లేదని, మరొకరికి ఉందని అంగీకరించడం 'బగీ' క్రిందికి వస్తుంది. ఈ విధంగా దైవానికి విధేయత చూపకుండా ఇతరులకు విధేయత చూపడం 'బగీ' అవుతుంది. అలాగే దేవుని యొక్క మరో హక్కు ఏమంటే, మానవులు ఆయన్నే ఆరాధించాలి, ఆయన సహాయాన్నే అర్థించాలి. ఆయనకే తమ మొరలను వినిపించాలి. అలా కాకుండా ఇతరుల ముందు శిరస్సు వంచడం, వారిని ఆరాధించడం, వారి సహాయాన్ని కోరడం 'బగీ' అనబడుతుంది. మనిషి దేవుని హక్కులను నిర్వర్తించకపోవడం, ఆయన దాసుల హక్కులను కాజేయడమే అన్ని ఉపద్రవాలకు మూల కారణం.

సోదరులారా!

అల్లాహ్ ఆదేశించిన ఈ మూడు మంచి విషయాలను ఆయన నిరోధించిన ఈ మూడు చెడు విషయాలను గురించి ఆలోచించండి. మన కష్టాలకు, బాధలకు ఈ మౌలిక విషయాల్లోనే మంచి చికిత్స ఉంది. అయితే చికిత్స కోసం ఎంత మంచి పద్ధతి సూచించినా, ఎంత మంచి మందు కనిపెట్టినా పద్ధతి ప్రకారం, ఆ మందు వాడినప్పుడే ప్రయోజనం ఉంటుంది. కాబట్టి మనం మొట్టమొదట మన వ్యక్తిగత జీవితంలో, ఆ తరువాత సామూహిక జీవితంలో న్యాయం, పరోపకారం, బంధువుల పట్ల ప్రేమాభిమానాలు జనించే వాతావరణాన్ని సృజించాలి. దాంతోపాటు చెడును, అశ్లీలతను, అన్యాయాన్ని, అత్యాచారాన్ని అరికట్టి సమాజాన్ని ప్రక్షాళనం చేయడానికి కృషి చేయాలి. అప్పుడే మనం ఇటు ఇహలోకం లోనూ, అటు పరలోకంలోనూ సఫల మవగలం.

47. బాధ్యతల విస్మరణే అశాంతికి కారణం

మహాశయులారా!

ప్రజలను దైవ ధర్మం వైపునకు పిలవడం ముస్లిముల విధి. దేవుని భూమిపై ఎలాంటి కల్లోలం జరుగకుండా చూడవలసిన బాధ్యత కూడా ముస్లిములపైనే ఉంది. దేవుని దృష్టిలో అన్నిటికంటే పెద్ద కల్లోలం, దైవదాసులు తమ నిజ ప్రభువు, యజమాని అయిన అల్లాహ్‌ను మరచిపోవడమే. లేదా వారు దైవాన్ని విడిచిపెట్టి మరొకరిని తమ ప్రభువు, పాలకుడని భావించి అతని దాస్యం చేయడం.

సోదరులారా!

మనం అనేక యేండ్ల నుంచి ఈ బాధ్యతను నిర్వహించవలసిన రీతిలో నిర్వహించడం లేదు. ఒకవేళ మనం చెడులను నిరోధించడంలో అశ్రద్ధ చేస్తే దాని దుష్ప్రభావం మొట్టమొదట మన మీదే పడుతుంది. మన హృదయం నుంచి చెడుల పట్ల ఏహ్యాభావం క్రమంగా తగ్గిపోతుంది. మంచి విషయాల విలువ కూడా మన నుండి తరగిపోతుంది. కొన్నాళ్ళ తరువాత చెడు విషయాలు మంచివిగా తోచడం, మంచి విషయాల పట్ల ఆసక్తి సన్నగిల్లడం కూడా జరుగుతుంది.

అంతేకాదు, ఈ పరిస్థితి మరింత ముదిరిపోయి మనిషి చెడుల రొచ్చులో పూర్తిగా కూరుకుపోతాడు; మంచిని చెరపడానికి సిద్ధమవుతాడు. నీతిరాహిత్యాన్ని బహిరంగంగా ప్రచారం చేస్తాడు. సత్కార్యం, సదాచారాల మార్గాలు మూసుకుపోతాయి. మంచివాళ్ళ జీవితాలు దుర్భరమయి పోతాయి. చెడ్డవాళ్ళు నలువైపులా విస్తరిస్తారు. అందుకే ధర్మపరిచయ కార్యాన్ని నిరంతరం కొనసాగించే బాధ్యతను అల్లాహ్ ముస్లిములపై మోపాడు. ఈ పనిని అశ్రద్ధ చేసేవారిని గురించి ప్రస్తావిస్తూ మహాప్రవక్త (సఅసం) ఒకసారి ఇలా అన్నారు -

“ఎప్పుడయితే మీ స్త్రీలు మీ నుండి అదుపుతప్పుతారో, మీ యువకులు దుర్నడతకు గురవుతారో, మీరు దైవ మార్గంలో కృషి చేయడాన్ని వదలి వేస్తారో, అప్పుడు మీ పరిస్థితి ఏమవుతుంది?”

సోదరులారా!

దైవప్రవక్త (సఅసం) ప్రవచనంలోని ఈ హెచ్చరికను గమనించండి. సమాజ సంస్కరణకోసం ఇస్లామ్ నిర్ణయించిన నియమాలను, కట్టు బాట్లను స్త్రీలు ఉల్లంఘించడమే గొప్ప సాంఘిక చెడు. పోకిరితనం, ఆకతాయి పనులు గనక మొదట స్త్రీల నుండే ప్రారంభమయితే ఇక ఆ సమాజంలో నైతికత, పవిత్రతలనేవి నామమాత్రంగా

కూడా మిగిలి వుండవు. అలాగే యువకుల విషయంలోనూ. యువకులు చెడిపోయినా సంఘాన్ని సంస్కరించడం కష్టమే. దేవుని దృష్టిలో పెద్ద కల్లోలమంటే ఇదే. అప్పుడు సజ్జనులు, ధర్మవేత్తలు ఈ చెడులను అరికట్టడం మానేసి మస్జిద్ నాలుగు గోడల మధ్య కూర్చొని ధ్యానం చేసుకోవడంలోనే మోక్ష ముందని భావిస్తే పరిస్థితి మరీ విషమిస్తుంది.

ధర్మసంస్థాపన కోసం జిహాద్ (పోరాటం) ఎంతో అవసరం. జిహాద్ చేయందే ధర్మ సంస్థాపన సాధ్యం కాదు. ఏ సిద్ధాంతమయినా, ఏ జీవన వ్యవస్థ అయినా స్థాపించబడాలంటే దానికోసం ఆ సిద్ధాంతాన్ని, ఆ జీవన వ్యవస్థను నమ్మేవాళ్ళు నిరంతరం పోరాటం సాగించవలసి ఉంటుంది. ఒకవేళ ఈ బాధ్యతను వారు విస్మరించినా, లేదా దాన్ని నిర్వహించడంలో అలసత్వం చూపినా వారు కోరుకున్న వ్యవస్థ ఎన్నటికీ నెలకొనదు. ఇస్లామీయ వ్యవస్థను స్థాపించే విషయంలోనూ అంతే. దీన్ని స్థాపించడానికి ఒక వైపు సత్సమాజం ఉన్నత నైతిక విలువలు కావాలి. మరోవైపు నిరంతరం దానికోసం పోరాటం సాగాలి. ఈ రెండు విషయాలనే మహాప్రవక్త (సఅసం) తన ప్రవచనంలో సహాబీలకు సూచించారు.

మహాప్రవక్త (సఅసం) ప్రవచించిన ఈ మాటలు విని సహాబీలకు ఆశ్చర్యం వేసింది. స్త్రీలు, యువకులు నీతిబాహ్యతకు లోనయితే, ముస్లిమ్‌లు దైవ మార్గంలో పోరాటం సాగించడాన్ని మానేస్తే, అలాంటి సమాజంలో ధర్మం నెలకొనడం సాధ్యమయ్యే పనికాదని వారు గ్రహించారు. అందుకే వారు ఆశ్చర్యం వ్యక్తపరుస్తూ "దైవ ప్రవక్తా! ఇది కూడా సంభవిస్తుందా?" అని అడిగారు. దీనికి దైవప్రవక్త (సఅసం) "ఔను ఇది కూడా సంభవిస్తుంది, ఎవరి అధీనంలో నా ప్రాణం ఉందో, ఆ దేవుని సాక్ష్యం! ఇంతకంటే తీవ్రమయిన పరిస్థితులు వస్తాయి" అని సమాధానమిచ్చారు.

ఈ మాటలు విని ఆయన అనచరులు ఇంకా ఆశ్చర్యపోయారు. "దైవ ప్రవక్తా! ఇంతకంటే తీవ్రమయిన పరిస్థితులు మరేమున్నాయి?" అని అడిగారు వారు, "మీరు మంచిని గురించి ఆదేశించడంగాని, చెడు నుండి నిరోధించడంగాని చేయరు. అప్పుడు మీ పరిస్థితి ఏమవుతుంది?" అన్నారు మహాప్రవక్త (సఅసం). ఈ మాటలు సహాబీలను మరింత ఆశ్చర్యంలో ముంచివేశాయి. ఎందుకంటే వారి దృష్టిలో మంచిని పెంచడం, చెడును త్రుంచడం జీవిత లక్ష్యంగా పెట్టుకున్న సమాజమే ముస్లిమ్ సమాజమంటే. ఈ లక్ష్యం కోసం పాటుపడని ముస్లిమ్ అంటూ ఉంటాడా అన్న విషయాన్ని కూడా వారు ఆలోచించలేదు. అందుకే వారు మరింత ఆశ్చర్యపోతూ, "దైవ ప్రవక్తా! ఇది కూడా సంభవించనున్నదా?" అని అడిగారు. దీనికి జవాబుగా ఆయన, "ఇది కూడా సంభవిస్తుంది" అంటూ "ఎవరి అధీనంలో నా ప్రాణముందో ఆ దేవుని సాక్ష్యం! అంత కన్నా తీవ్రమైన పరిస్థితులే సంభవిస్తాయి" అన్నారు. సహాబీలు "దైవప్రవక్తా! ఆ

పరిస్థితులు ఏమిటి?" అని మళ్ళీ అడిగారు. దానికి దైవప్రవక్త (సఅసం), "ఎప్పుడయితే మంచి చెడుగా, చెడు మంచిగా మారడాన్ని మీరు చూస్తారో, అప్పుడు మీ పరిస్థితి ఏమవుతుంది?" అని పలికారు.

ఈ మాటలు విని సహాబీలు ఇంకా ఆశ్చర్యపోయారు. "దైవప్రవక్తా! ఇలా కూడా సంభవిస్తుందా?" అని అడిగారు. "ఔను, అలా కూడా సంభవిస్తుంది. ఎవరి అధీనంలో నా ప్రాణముందో ఆ దేవుని సాక్ష్యం; ఇంతకంటే కూడా తీవ్రమయిన పరిస్థితులు సంభవిస్తాయి" అన్నారు మహాప్రవక్త (సఅసం). "ఆ పరిస్థితులు ఏమిటి" అని అడిగారు సహాబీలు మళ్ళీ. "ఎప్పుడయితే స్వయంగా మీరే చెడుని గురించి ఆదేశిస్తూ, మంచి నుండి నిరోధిస్తారో, అప్పుడు మీ పరిస్థితి ఏమవుతుంది?" అన్నారు దైవప్రవక్త(సఅసం).

సహాబీలు ఈసారి పూర్తిగా ఆశ్చర్యంలో మునిగిపోయారు. దైవధర్మం గురించి మాట్లాడే ముస్లిమ్ మరీ ఇంత దిగజారిపోతాడంటే ఆశ్చర్యమే మరి. ఆనాడు సహాబీల విశ్వాసం ఎలా ఉండేదంటే, ముస్లిమ్ అనే వ్యక్తి అగ్నిని చల్లార్చే నీరులా, చెడులను నిరోధించే మహోన్నత సంస్కర్త అని వారు భావించేవారు. దీనికి భిన్నంగా నీళ్ళే అగ్నిని రాజేస్తుందన్నట్లు చెడులను నిరోధించవలసిన ముస్లిమే చెడులను వ్యాపింపజేస్తాడంటే వారు ఆశ్చర్యపోరూ? అందుకే వారు ఆశ్చర్యపోతూ మళ్ళీ అడిగారు, "దైవప్రవక్తా! ఇది కూడా జరుగనున్నదా?" అని. మహాప్రవక్త (సఅసం) దీనికి జవాబిస్తూ "ఇంతకంటే కూడా తీవ్రమయిన పరిస్థితులు సంభవిస్తాయి - అప్పుడు గాంభీర్యతగల పెద్ద పెద్ద వాళ్ళు సయితం అయోమయంలో పడిపోయేలా నేను ముస్లిమ్‌ల కోసం గొప్ప కల్లోలాన్ని సృష్టిస్తానని అల్లాహ్ ప్రమాణం చేసి చెబుతున్నాడు" అని తెలిపారు.

సోదరులారా!

ధర్మ పరిచయ పనిని వదలిపెడితే జరిగే పర్యవసానం ఏమిటో మీరిప్పుడు గ్రహించారు. ఈ పరిస్థితి విషమిస్తే ఇక దానికి విరుగుడు సాధ్యమే కాదు. మంచి అనేది సమాజం నుండి క్రమేణా అంతరించిపోతుంది. సర్వత్రా అన్యాయం, అత్యాచారం, అక్రమాలు ప్రబలిపోతాయి. మానవుల నైతిక సంస్కరణకు ఎలాంటి అవకాశం లేకుండా పోతుంది. మానవుడు తాను చేజేతులా నాటుకున్న విషబీజాల దుష్ఫలితాలను కళ్ళారా చూసుకుంటాడు. అప్పుడు వేసే ప్రతి పథకం తలక్రిందులవుతుంది. ఒక సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నిస్తే దాని వల్ల పది సమస్యలు పుట్టుకొస్తాయి. ఒక కష్టాన్ని ఎదుర్కోబోతే వంద కష్టాలు వచ్చిపడతాయి. ఈ సమస్యల వరదలో, ఈ ప్రమాదాల ప్రవాహంలో ముస్లిమ్‌లుగా, మంచివారుగా ఉండదలచిన వారు కూడా

కొట్టుకుపోతారు. యావత్తు సమాజం జంతువులు, పశువులు ఉండే అరణ్యం కన్నా నికృష్టంగా తయారవుతుంది.

కాబట్టి ఇలాంటి విషమ పరిస్థితులు రాకముందే మనం మేల్కొనాలి. దైవం మనపై మోపిన బాధ్యతలను గుర్తించి ధర్మసంస్థాపనకై నడుం బిగించాలి. మంచిని పెంచడానికి, చెడును అరికట్టడానికి శక్తివంచన లేకుండా పాటుపడాలి. ఈనాడు యావత్తు ప్రపంచం అశాంతి, అలజడులతో నిండిపోయి ఉందంటే దానిక్కారణం మనం ఈ బాధ్యతలను విస్మరించడమే. నిజానికి ఈ పని కోసమే అల్లాహ్ మనల్ని నియమించింది. కాని దీన్ని వదిలేసి సమాజంలో సంచలనం సృష్టించలేని ఏవో కొన్ని వ్యక్తిగతమయిన ఆరాధనలను పట్టుకొని వ్రేళ్ళాడుతూ, ఇవే మన ముక్తికి మార్గమని భావిస్తూ మనల్ని మనం మోసగించుకుంటున్నాము.

సోదరులారా!

ఇప్పటికయినా మన నిజస్థానం ఏమిటో మనం గ్రహించాలి. లేకపోతే చరిత్ర మనల్ని క్షమించదు. భావితరం చేసే దుష్కార్యాలకు కూడా మనమే బాధ్యత వహించవలసి ఉంటుంది. ఫలితంగా పరలోకంలో తీవ్రమయిన శిక్షలకు గురి కావలసి వస్తుంది.

48. సత్యసంధతే సకల సత్కార్యాలకు మూలం

మహాశయులారా!

సజ్జనులు, సత్యసంధులయిన స్నేహితులు లభించడం కూడా గొప్ప భాగ్యమే. దివ్యఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా ఆదేశిస్తున్నాడు. "విశ్వసించిన ఓ ప్రజలారా! మీరు అల్లాహ్ పట్ల భయభక్తులు కలిగివుండండి." మరియు సత్యసంధులతో స్నేహం కలిగి వుండండి.ఈ ఆదేశం అల్లాహ్‌ను తమ ప్రభువుగా, యజమానిగా అంగీకరించి, ఆయనపట్ల వినయ విధేయతలు కలిగి వుండిన వారికి ఇవ్వడం జరిగింది. వారు మరణానంతరం తమ ప్రభువు దగ్గరికి పోవలసి ఉందని, ఆయన సన్నిధిలో తమ కర్మలకు సమాధానం చెప్పుకోవలసి ఉందని కూడా విశ్వసిస్తున్నారు.

దేవుడు ఇలాంటిదాసులను ఉద్దేశించి - మీరు మీ జీవితంలో దేవునికి ఆగ్రహం తెప్పించే ఏ పనీ చెయ్యకండి. మీ హృదయాల్లో దైవభయం ఎప్పుడూ ఉండాలి. మీరు ఏ పని చేసినా దైవానికి భయపడుతూ చెయ్యాలి. దేవునికి ఇష్టంకాని పని చేస్తే ఘోరమయిన శిక్షకు గురికావలసి వస్తుందన్న విశ్వాసం మీ అంతర్యాలలో దృఢంగా నాటుకోవాలి - అని ఆదేశిస్తున్నాడు. ఇలాంటి మానసిక స్థితినే తఖ్వా లేక భయభక్తులు అంటారు. ఈ స్థితే మనిషిని చెడు విషయాల నుంచి నిరోధించి మంచి మార్గాన నడిపిస్తుంది. ఈ స్థితి ఫలితంగానే మనిషి సదాచార సంపన్నుడయి స్వర్గ ప్రవేశానికి అర్హుడవుతాడు. ఈ స్థితే నరకానికి గొనిపోయే అపమార్గాల నుండి అతడ్ని కాపాడుతుంది. నరకం తప్ప, స్వర్గం లభించడమే నిజానికి అన్నిటికన్నా గొప్ప సాఫల్యమని మీకందరికీ తెలుసు. ఇలాంటి తఖ్వా కలిగిన వ్యక్తి జీవితం పరలోకంలోనే కాదు, ఇహలోకంలో కూడా సఫలమవుతుంది.

సోదరులారా!

తఖ్వా కలిగిఉండమని ఆదేశించడంతోపాటు, మీరు సత్యసంధులతో స్నేహం కలిగి ఉండమని కూడా అల్లాహ్ ముస్లిములను ఆదేశిస్తున్నాడు. తమ విశ్వాసంలో, తమ ఆచరణలో, తమ వ్యవహారాల్లో నిజాయితీ కలిగినవాళ్ళనే సత్యసంధులంటారు. ఇలాంటి వ్యక్తులతోనే స్నేహ సంబంధాలు కలిగి ఉండమని అల్లాహ్ బోధిస్తున్నాడు. అంటే వారు ఎలాంటి దృఢవిశ్వాసాన్ని కలిగి ఉన్నారో అలాంటి దృఢ విశ్వాసాన్నే మనమూ మనలో జనింపజేసుకోవాలి. వారు తమ మాటల్లో చేతల్లో ఎలాంటి నిజాయితీని ప్రదర్శిస్తారో, మనమూ మన మాటల్లో, చేతల్లో అలాంటి నిజాయితీనే ప్రదర్శించాలి. వారు ప్రజలతో మృదువుగామాట్లాడుతూ వారికి దైవ సందేశాన్ని ఎలా నేర్పుగా అందజేస్తారో అలాంటి వైఖరినే మనమూ అవలంబించాలి.

ఇలా సత్యవ్రతులతో స్నేహం చేయడమంటే ఆచరణలోనూ వారిని అనుసరించాలని అల్లాహ్ మనల్ని ఉపదేశిస్తున్నాడు. అంతేకాదు, వారు ధర్మవ్యాప్తి కోసం తమ శక్తిసామర్థ్యాలను వినియోగించి కృషి చేస్తుంటే మనమూ ఆ సత్కార్యంలో మన శక్తి సామర్థ్యాలను వినియోగిస్తూ వారికి తోడ్పడాలి. ధర్మం కోసం వారు తమ ఇళ్ళూ వాకిళ్ళూ వదలి హిజ్రత్ చేస్తే మనమూ వారిని అనుసరించాలి. ధర్మ పరిరక్షణ కోసం వారితోపాటు మనమూ పోరాడాలి. ఇంకా వాగ్దాన పాలనలో, నిజాయితీగా వ్యవహరించడంలో వారి అడుగుజాడల్లో నడవాలి. అప్పుడే మనం వారి స్నేహితుల మనిపించుకుంటాం.

సోదరులారా!

సత్యసంధత విలువను గుర్తించండి. మానవుని సద్గుణాలలో సత్యసంధతే ఎక్కువ విలువయినది. సత్యసంధతలకు వ్యక్తిగత జీవితంలోనే గాక, సామూహిక జీవితంలో కూడా ఎంతో ప్రాముఖ్యత ఉంది. సత్యసంధత లేకుండా ఏ మనిషిలోనూ మానవత్వం వృద్ధి చెందదు. అలాగే సత్యసంధత లోపిస్తే ఏ సామూహిక జీవన వ్యవస్థా సవ్యంగా సాగదు. సత్య సంధతను వదిలేస్తే మనం నైతికంగా ఎలాంటి ఉన్నతిని పొందలేము. సత్యసంధత విశ్వాసానికి నిదర్శనం; హృదయ శుద్ధికి సంకేతం. ఒక్కమాటలో చెప్పాలంటే మనిషి గుణగణాలన్నిటికీ సత్య సంధతే పునాదిరాయి. ఈ సత్యసంధత మూలంగానే మనిషి దైవానికి ప్రేమ పాత్రుడవుతాడు. సత్యసంధత కలిగిన వ్యక్తినే ప్రజలు ఎక్కువగా అభిమానిస్తారు. ఇలాంటి వ్యక్తితోనే జనం సంబంధాలు పెట్టుకోవడానికి ఇష్టపడతారు. ఇలాంటి వ్యక్తి ధర్మవేత్త అయి ఉంటే ప్రజలు అతని ధర్మోపదేశాన్ని ఆదరిస్తారు. దాన్ని అవలంబించడానికి త్వరగా ముందుకు వస్తారు. అతను డాక్టరయి ఉంటే అతని వైద్యం బాగా ప్రజాదరణ పొందుతుంది. అతని సలహాలకు ఎక్కువ విలువ ఉంటుంది. ఒకవేళ అతను వర్తకుడయి ఉంటే ఇతరులు అతనితో లావాదేవీలు జరపడానికి ఎక్కువగా ఇష్టపడతారు. ఇలా సత్యసంధుడు జీవితపు ప్రతి రంగంలోనూ గౌరవోన్నతులు పొందుతాడు. అందరి ఆదరాభిమానాలను చూరగొంటాడు.

ఈ సద్గుణంలేని వ్యక్తిని ప్రజలు నమ్మరు. అతనితో స్నేహం చేయాలన్నా, ఏదైనా వ్యవహారం నడపాలన్నా ముందుకు రారు. అతను ఏ మోసం చేస్తాడో, ఏ కుట్ర పన్నుతాడో అని జనం జంకుతారు. దేవుని విషయంలో భయపడని వాడు ప్రజల విషయంలో మాత్రం ఎందుకు భయపడతాడు? తను మాట్లాడుతున్నది, చేస్తున్నది అన్నిటినీ అల్లాహ్ గమనిస్తున్నాడని నమ్ముతున్న వ్యక్తి నిజానికి జీవిత వ్యవహారాల్లో నిజాయితీని, సత్యసంధతను అవలంబిస్తాడు.

సోదరులారా!

మనిషి ఏ విషయాన్ని కూడా దానికి సంబంధించిన జ్ఞానం లేకుండా

మాట్లాడకూడదని దేవుడు తీవ్రంగా నిషేధించి ఉన్నాడు. మనకు తెలియని ఏ విషయం వెంట పడకూడదని, కళ్ళు చెవులు, హృదయం విషయంలోనూ మనం దేవుని ఎదుట సమాధానం చెప్పుకోవలసి ఉంటుందని దివ్యఖుర్ఆన్ హెచ్చరిస్తోంది. అంటే ప్రతి విషయంలోనూ పూర్తి జ్ఞానం ఉన్నప్పుడే మనం నోరు విప్పాలి. అనుమానాల ఆధారంగా మాట్లాడకూడదు. ఈ అనుమానం అబద్ధంగా మారవచ్చు. తద్వార మన వైఖరి ఘోర నష్టానికి కూడా దారితీయవచ్చు.

దేవుని గుణగణాలలో, శక్తి సామర్థ్యాలలో ఇతరులను భాగస్వాములుగా చేయడమే అన్నిటికంటే గొప్ప అబద్ధం. దీన్నే షిర్క్ అంటారు. దీన్నే గొప్ప జులుం అని, క్షమించరాని గొప్ప నేరమని ఖుర్ఆన్ పేర్కొన్నది. ఆ తరువాత దైవ ప్రవక్త (సఅసం) విషయంలో అబద్ధమాడటం కూడా ఘోర నేరమే. ఎవరయితే నా విషయంలో అసత్యం పలికాడో అతను తన నివాసాన్ని నరకంలో ఏర్పరచుకున్నట్లే అని మహాప్రవక్త (సఅసం) ప్రవచించారు. ఆయన ఇంకా ఇలా బోధించారు. "మీరు సత్యాన్ని మీపై విధిగా చేసుకోండి, ఎందుకంటే సత్యం మనిషిని మంచి వైపునకు తీసుకెళ్తుంది. ఈ మంచే అతడ్ని స్వర్గానికి గొనిపోతుంది, ఒక వ్యక్తి సత్యం పలుకుతూ సత్యం పైనే స్థిరంగా ఉంటే చివరికి అతను దేవుని దృష్టిలో సత్యవ్రతుడిగా లిఖించబడతాడు. వినండి. మీరు అసత్యాన్ని విడిచిపెట్టండి. ఎందుకంటే అసత్యం చెడు వైపునకు తీసికెళ్ళుతుంది. చెడు నరకానికి దారితీస్తుంది. ఒక వ్యక్తి అసత్యం పలుకుతూ, అసత్యంపైనే స్థిరంగా ఉంటే, చివరికి అతను దేవుని దృష్టిలో అసత్య వాదిగా లిఖించబడతాడు." మహాప్రవక్త (సఅసం) మనకు మరో విషయాన్ని గురించి హెచ్చరిస్తూ, "కొందరు ప్రజల మధ్య కూర్చొని వారిని నవ్వించడానికి ఏవేవో విషయాలు వినిపిస్తారు. వీరి పరిస్థితి ఎంతో శోచనీయం. వీరు ఆ విషయాల్లో అబద్ధాలు చేర్చి చెబితే మాత్రం వారికి వినాశమే (మిగులుతోంది). నిజం, ఘోర వినాశం వారిని చుట్టుముట్టుతుంది" అని చెప్పారు.

కాబట్టి సోదరులారా! మనమంతా అల్లాహ్ పట్ల అత్యంత భయభక్తులు కలిగి ఉండాలి. ప్రతి వ్యవహారంలోనూ తప్పనిసరిగా సత్యాన్ని పాటించాలి. అప్పుడే మనపై అల్లాహ్ అనుగ్రహాలు, ఆయన శుభాలు వర్షిస్తాయి. ఇదే అల్లాహ్ ప్రసన్నతను పొందే మార్గం. ఈ మార్గమే మనల్ని స్వర్గానికి చేర్చుతుంది. అసత్యం దరిదాపులక్కూడా పోకూడదు. అసత్యమే అన్ని చెడులకు సింహద్వారం. ఈ దారే దైవాగ్రహానికి తీసికెళుతుంది. ఇదే మనిషిని నరకానికి గొనిపోతుంది. అసత్యం నుండి, దాని కీడు నుండి కాపాడుకోవాలంటే రోజూ ఖుర్ఆన్ని పఠించాలి. అందులోని విషయాల్ని గ్రహించాలి. వాటికి అనుగుణంగా మన జీవిత వ్యవహారాలను సంస్కరించుకోవాలి. మహాప్రవక్త (సఅసం) అడుగుజాడలలో నడవడానికి ప్రయత్నించాలి.

49. దేవుని వాగ్దానం

మహాశయులారా!

దివ్య ఖుర్‌ఆన్‌లో దేవుడుఏమంటున్నాడో చూడండి. " మీలో విశ్వసించి సత్కార్యాలు చేసినవారికి అల్లాహ్ వాగ్దానం చేస్తున్నాడు- వారికి పూర్వం గతించినవారిని అల్లాహ్ ఏ విధంగా ఖలిఫాగా చేశాడో అదే విధంగా వారినీ భూమిపై ఖలిఫాగా చేస్తాడు, వారి కోసం అల్లాహ్ ఇష్టపడిన ధర్మాన్ని పటిష్టమయిన పునాదులపై నెలకొల్పుతాడు. వారి ప్రస్తుత భయానక పరిస్థితిని ప్రశాంత పరిస్థితిగా మార్చుతాడు. అయితే వారు నన్నే ఆరాధించాలి. నా దైవత్వంలో ఇతరుల్ని సహవర్తనులుగా నిలబెట్టకూడదు. ఆ తరువాత ఎవరయితే కుఫ్రకు పాల్పడతారో వారే దుర్మార్గులు. మీరు నమాజ్‌ను స్థాపించండి. జకాత్‌ని చెల్లించండి. దైవప్రవక్తకు విధేయులయి ఉండండి. తద్వారా మీరు అనుగ్రహించబడతారని ఆశించవచ్చు".

సోదరులారా! అల్లాహ్ ఈ ఆయత్‌లో ముస్లిమ్‌లకు ఖిలాఫత్ ప్రసాదిస్తానని వాగ్దానం చేశాడు. అయితే ఈ వాగ్దానం నామమాత్రపు ముస్లిమ్‌లకు చేయలేదు. దృఢమైన విశ్వాసం, మంచి నీతి నడవడికలు కలిగి ఉంటూ దైవధర్మాన్ని తు.చ. తప్పకుండా పాటించేవారికే ఈ వాగ్దానం వర్తిస్తుంది. వారు ఎలాంటి షిర్క్‌కు పాల్పడకుండా అల్లాహ్ గుణగణాల్లో శక్తి సామర్థ్యాలలో ఇతరుల్ని ఎవరినీ సహవర్తనులుగా నిలబెట్టకుండా కేవలం ఒక్క అల్లాహ్ దాస్యాన్నే చేస్తూ పవిత్రమయిన జీవితం గడపాలి. ఈ సుగుణాలేవీ లేకుండా ఏదో విశ్వసించామని చెప్పుకొని ప్రాపంచిక వ్యామోహంలో పడ్డవారికి ఖలీఫాగా చేస్తానని దేవుడు వాగ్దానం చేయలేదు. ఇలాంటివారు ఖిలాఫత్‌కు అర్హులు కారుకూడా.

సోదరులారా!

ప్రభుత్వాలయితే ప్రపంచంలో ఏర్పడుతూనే ఉన్నాయి, ఏర్పడతాయి కూడా. ప్రపంచ ఏర్పాట్లు ఎలాగో కొనసాగుతాయి. కాని దైవం వాగ్దానం చేసిన ఖిలాఫత్ ప్రభుత్వాన్ని నెలకొల్పడం అందరి వల్ల సాధ్యం కాదు. దాని కోసం ఖిలాఫత్‌ని నెలకొల్పే వారిలో దేవునిపై పటిష్టమయిన విశ్వాసం, మంచి నీతి నడవడికలు కావలసి ఉంటుంది. అలాంటివారికే ఖిలాఫత్ లభిస్తుంది. దైవ తిరస్కారులు, అధర్మపరులు అధికార పీఠాలపై కూర్చోవడాన్ని చూసి కొందరు మోసపోతారు. దేవుడు ఇలాంటి వారికి

అధికారం ఎలా ఇచ్చాడా అని వారు ఆశ్చర్యపోతారు. కాని దైవం విశ్వాసులకు, నీతిమంతులకు ఇస్తానన్నది ఇలాంటి ప్రభుత్వాధికారం కాదు. అది దైవ ప్రాతినిధ్య పాలనాధికారం. అంటే దైవ చట్టాల్ని అనుసరించి పాలన చేసే ప్రభుత్వం అన్నమాట. ఇలాంటి పాలనకు సదాచారులు, సజ్జనులైన విశ్వాసులే అర్హులు. ఇలాంటివారి చేతుల్లోనే దైవ ధర్మం అయిన ఇస్లామ్ పటిష్టమవుతుంది.

అల్లాహ్ ముస్లిమ్‌లకు ఎంత గొప్ప విషయాన్ని గురించి వాగ్దానం చేశాడో చూశారా! ఆయన వాగ్దానం కంటే గొప్ప వాగ్దానం ఇంకెవరిది ఉంటుంది? ఆయనకు అన్ని విధాల శక్తి సామర్థ్యాలున్నాయి. ఆయన ఏం చేయదలచుకుంటే అది చేయగలడు. ఆయనకు తన వాగ్దానాన్ని పాటించడంలో ఎలాంటి అవరోధం ఎదురు కాదు, ఈనాడు ముస్లిమ్‌లు ఖిలాఫత్‌ని కోల్పోయి ఇతరుల దాస్యంలో జీవితాన్ని గడుపుతున్నారు. వారిని భయాందోళనలు చుట్టుముట్టి ఉన్నాయి. వారి ధన మానప్రాణాలకు రక్షణ లేకుండాపోయింది. దీనికి కారణం వారిలో అల్లాహ్ పేర్కొన్న సుగుణాలు లేకపోవడమే. వారు తాము విశ్వసించామని నోటితో ఎంత చెప్పుకున్నా, ప్రపంచంలో వారి జనాభా ఎంత అధికంగా ఉన్నా ఈ సుగుణాలు లేకపోతే వారికి దైవం చేసిన వాగ్దానం నెరవేరదు.

సోదరులారా!

ఒక విషయాన్ని బాగా అర్థం చేసుకోండి. దైవధర్మ అభ్యున్నతి ప్రజల సంఖ్యాబలంపై ఆధారపడి ఉండదు. పూర్వం ముస్లిమ్‌లు సంఖ్యలో తక్కువగా ఉన్నప్పటికి అత్యధిక సంఖ్యలో ఉన్న శత్రువుల్ని ఓడించగలిగారు. దేవుని వాగ్దానంలో ఎలాంటి మార్పు లేదు. ఇది ప్రళయం వరకూ దివ్య ఖుర్‌ఆన్‌లో సురక్షితంగా ఉంటుంది. అల్లాహ్ ఈ వాగ్దానాన్ని తప్పనిసరిగా నెరవేరుస్తాడు. ఆయన తన అదృశ్య సేనలను పంపి ముస్లిమ్‌లకు సహాయం చేశాడు. భవిష్యత్తులో కూడా ఆయన ఇలాంటి సహాయన్నే చేస్తాడు. అయితే ముస్లిమ్‌లలో నిజమైన విశ్వాసం , దానికి అనుగుణమయిన సదాచరణ, సద్గుణాలు ఉండి తీరాలి. అప్పుడే దైవం చేసిన ఈ వాగ్దానం వారికి వర్తిస్తుంది.

సోదరులారా! అల్లాహ్ తన వాగ్దానంతోపాటు సూచించిన ఈ సద్గుణాలను గురించి మనలోని ప్రతివ్యక్తి ఆలోచించడం ఎంతో అవసరం. విశ్వాసం, నైతికత, సదాచరణల విషయంలో మనం ఆత్మపరిశీలన చేసుకోవాలి. దైవ ధర్మంతో మన సంబంధం ఏ మేరకు ఉందో ఆలోచించాలి. అల్లాహ్ దాస్యం, ఆయన పట్ల విధేయత

విషయంలో మన పరిస్థితిని అంచనా వేసుకోవాలి. వీటన్నిటికి అనుగుణంగా మనం మన జీవితాలను సంస్కరించుకోవాలి. ఈ విధంగా కేవలం పది, ఇరవై మంది మారడం వల్ల దేవుని వాగ్దానం నెరవేరదు. దైవ ధర్మానికి అనుగుణంగా మనందరిలోనూ పరివర్తన రావాలి. అప్పుడే మనం ఇస్లామీయ విప్లవాన్ని తీసుకురాగలం.

ఈ సందర్భంలో మరొక విషయాన్ని కూడా గుర్తుంచుకోవాలి. మనకు ప్రపంచంలో ఖిలాఫత్ లభించినా, లభించక పోయినా దైవాజ్ఞల ప్రకారం జీవితాన్ని సంస్కరించుకుంటే మనం సాఫల్యం చెందినట్లే. ఖుర్‌ఆన్, హదీసుల వెలుగులో జీవితాన్ని గడుపుతూ ధర్మ సంస్థాపన కోసం కృషి చేయడం మన విధి. ఈ విధి నిర్వహణలో మనం సర్వస్వం కోల్పోయినా అది అపజయం క్రిందికి రాదు. దైవ కారుణ్యం మనపై వర్షిస్తుంది. మన జీవితం సార్థకమవుతుంది. పరలోకంలో మనం కృతార్థులమవుతాము.

సోదరులారా!

దైవాన్ని, దైవప్రవక్త (సఅసం)ను విశ్వసించామని చెప్పుకున్నంత మాత్రాన ప్రయోజనం లేదు. ఆ విశ్వాసాన్ని మన ఆచరణలో చూపెట్టాలి. విశ్వసించిన వెంటనే మనం నిర్వహించవలసిన మొట్టమొదటి బాధ్యతలేమిటో అల్లాహ్ తెలుపుతూ, "నమాజ్‌ను స్థాపించండి. జకాత్‌ని చెల్లించండి. ప్రవక్తకు విధేయులయి ఉండండి, తద్వారా మీపై దైవానుగ్రహం వర్షించవచ్చు" అని చెప్పాడు. మన జీవిత సంస్కరణకు కావలసిన మౌలిక సూత్రాలు ఇవే. వీటిని చేయకుండా మనం దైవ సహాయాన్ని ఎన్నటికి పొందలేము.

ఈనాడు మనలో అనేక మంది నమాజ్‌కు దూరమయ్యారు. ఇక నమాజ్ చేసేవాళ్ళలో దాన్ని అర్థం చేసుకొని చేసేవాళ్ళు బహు అరుదు. నమాజ్‌లో పఠించే అరబీ ఆయత్‌లు మనకు అర్థం కావన్నది నిజమే. అయితే మనకు తెలిసిన భాషలో వాటి అనువాదం ప్రతి రోజూ కొంత సమయాన్ని కేటాయించి చదవడం ఎంతో అవసరం. ఇలా ఖుర్‌ఆన్‌ని అర్థం చేసుకొని చదవడం వల్ల అందులోని దైవాజ్ఞలను తెలుసుకొని వాటి ప్రకారం మన జీవితాల్ని సంస్కరించుకోవచ్చు. జీవితాన్ని సంస్కరించలేని నమాజ్ నమాజే కాదు. అలాంటి నమాజ్‌ను అల్లాహ్ మెచ్చుకోడు.

నమాజ్ తరువాత జకాత్‌కు ఎంతో ప్రాముఖ్యం ఉంది. ఇది కూడా ఇస్లామ్ యొక్క మూలస్తంభమే. జకాత్ చెల్లించని వ్యక్తి సమాజం దృష్టిలో ముస్లిమ్ అనిపించుకున్నా దైవం దృష్టిలో అతను ఎన్నటికీ ముస్లిమ్ కాదు. జకాత్ చెల్లించడం వల్ల మనిషిలో పిసినారితనం నశించి ఉదారత్వం జనిస్తుంది. జకాత్ విధిని సామూహికంగా నిర్వహించే

ఏర్పాటు చేసుకుంటే దానివల్ల మరెన్నో సామూహిక సమస్యలు పరిష్కారమయ్యే అవకాశముంది. జకాత్‌ని చెల్లించకపోతే మన విశ్వాసంలో పరిపూర్ణత రాదు. మనం అల్లాహ్ అనుగ్రహాన్ని ఆశించలేము. అల్లాహ్ అనుగ్రహం లేకపోతే మనం ఇహలోకంలోనే కాదు, పరలోకంలోనూ కృతార్థులం కాలేము.

సోదరులారా!

అల్లాహ్ ఎంతో కరుణామయుడు . ఆయన మనల్ని తన కారుణ్య ఛాయలోకి తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నాడు. అయితే దైవ కారుణ్యం తనంతట తాను మన దగ్గరికి రాదు. దాని కోసం మనం ప్రయత్నించాలి. మనం ధర్మసంస్థాపనా మార్గంలో కృషి చేస్తే దైవ కారుణ్యం మన మార్గాన్ని సుగమం చేస్తుంది. దైవ ధర్మానికి విముఖులయితే దైవ కారుణ్యం మనల్ని కన్నెత్తి కూడా చూడదు. ప్రపంచంలో దైవ కారుణ్యానికి నోచుకోలేని వాడు, పరలోకంలోనూ నోచుకోలేడు. ఇలా ధర్మానికి దూరమయినవాళ్ళు ఉభయత్రా నష్టపోతారు. అందుకే మనం బ్రతికుండగానే మన ప్రభువుని వేడుకొని ఖుర్‌ఆన్, హదీసుల వెలుగులో జీవితం గడిపేందుకు ప్రయత్నించాలి. దాంతోపాటు వీలయినంత వరకు దైవమార్గంలో కూడా కృషి చేస్తూ దైవప్రీతిని పొందడానికి ప్రయత్నించాలి.

50. దైవ సహాయం ఎలా లభిస్తుంది?

మహాశయులారా!

మానవ జీవితంలో అనుకూల పరిస్థితులతోపాటు ప్రతికూల పరిస్థితులు కూడా ఏర్పడుతుంటాయి. వ్యక్తుల జీవితాల్లోనూ ఎగుడు దిగుళ్ళు వస్తుంటాయి. జాతుల జీవితాల్లోనూ సౌలభ్యాలు, కాఠిన్యాలు వస్తుంటాయి. సౌలభ్యాలనయితే సంతోషంగా అనుభవిస్తాం. మరి కష్టాలు, కాఠిన్యాలు వస్తే వాటిని ఎలా ఎదుర్కోవాలి? దేవుని దయవల్ల మనకు ఇస్లామ్ లాంటి సమగ్ర ధర్మం లభించింది. ఇది జీవితంలోని అన్ని రంగాల్లోనూ మనకు మార్గదర్శకత్వం ఇస్తుంది. సౌఖ్యాలు, సౌలభ్యాలు ఒనగూడినప్పుడు మన వైఖరి ఎలా ఉండాలో, ఆపదలు, అవాంతరాలు ఎదురయినప్పుడు మన విధానం ఏమై ఉండాలో అన్నది మనకు ఇస్లామ్ నేర్పింది. అయితే కావలసిందల్లా ఒక్కటే - దైవ ధర్మంతో మన సంబంధం పటిష్టంగా ఉండాలి. అన్ని పరిస్థితుల్లోనూ మనం అల్లాహ్ మార్గదర్శకత్వాన్నే ఆశ్రయించాలి. ఆయన బోధనలనే అనుసరించాలి.

సోదరులారా!

ఈనాడు మనం అనేక క్లిష్టపరిస్థితులతో సతమతమవుతున్నాం. సమాజంలో శాంతిభద్రతలయితే ఎప్పుడో క్షీణించిపోయాయి. ప్రత్యేకంగా మనకోసం పరిస్థితులు మరీ కఠినంగా తయారయ్యాయి. ఇలాంటి పరిస్థితిలో ఓ చారిత్రక సంఘటన ద్వారా మనకు మార్గదర్శకత్వం లభిస్తుంది. అది హజ్రత్ ఉమర్ (రజిఅన్) పరిపాలనా కాలం. హజ్రత్ సాద్ బిన్ అబివఖాస్ (రజిఅన్) కొందరు సహచరుల్ని వెంటబెట్టుకొని ధర్మ ప్రచారం కోసం ఇస్లామేతర దేశాలకు వెళ్ళారు. అక్కడ శత్రువులు బలంగా వున్నారు. పరిస్థితి భయానకంగా ఉంది. అలాంటి సమయంలో హజ్రత్ ఉమర్ (రజిఅన్), హజ్రత్ సాద్ బిన్ అబివఖాస్ (రజి)కు హితవు చేస్తూ, "నేను మిమ్మల్ని, మీతో పాటున్న ఇతర ముస్లిమ్‌లను ఆదేశిస్తున్నాను, మీరు అన్ని పరిస్థితుల్లోనూ అల్లాహ్ పట్ల భయభక్తులు కలిగి ఉండండి. శత్రువుని ఎదుర్కోవడానికి ఈ భయభక్తులే మీకోసం అన్నిటికన్నా మంచి యుద్ధ సామగ్రి, ఇదే మీరు అవలంబించవలసిన గొప్ప యుద్ధ వ్యూహం" అని ఉత్తరం రాశారు.

సోదరులారా!

శత్రువుని ఎదుర్కోడానికి హజ్రత్ ఉమర్ (రజిఅన్) ముస్లిమ్‌లకు ఎలాంటి సలహా ఇచ్చారో చూశారా! అది ముస్లిమ్‌లు ఎంతో అభివృద్ధి సాధించిన కాలం. శత్రువుల బలం ముందు ముస్లిమ్‌ల బలం ఆనాడు ఏ మాత్రం తక్కువగా లేదు,

అయినప్పటికీ హజ్రత్ ఉమర్ (రజిఅన్) ఇతర సైన్యాధిపతుల మాదిరిగా సైనిక సలహాలను ఇవ్వలేదు. ఆయన అల్లాహ్ పట్ల భయభక్తులకే ప్రాధాన్యత ఇచ్చారు. వాస్తవం ఏమిటంటే మనిషి దేవుని పట్ల భయభక్తులు కలిగివుంటూ ఆయన అయిష్టతకు భయపడుతున్నంత వరకూ దైవ సహాయం అతనికి లభిస్తూ ఉంటుంది. ఇది లేకపోతే ఎంత సైనిక బలం ఉన్నా, మరెంత ఆయుధ శక్తి ఉన్నా ప్రయోజనం లేదు. దేవుని పట్ల భయభక్తులుంటే మామూలు బలంతో కూడా అత్యధిక శక్తి ఉన్న శత్రువుల్ని ఎదుర్కోవచ్చు. అల్లాహ్ సహాయం, రక్షణ లభించాలంటే ఆయన పట్ల భయభక్తులు కలిగి ఉండడం ఎంతో అవసరం.

ఈ సందర్భంలో హజ్రత్ ఉమర్ (రజిఅన్) తన ఉత్తరంలో ముస్లిములకు మరో విషయాన్ని కూడా బోధించారు. "శత్రువు నుండి కాపాడుకోవడానికి మీరెంత జాగ్రత్త వహిస్తారో అంతకంటే ఎక్కువగా మీరు చెడుకు దూరంగా ఉండే విషయంలో జాగ్రత్త వహించాలి, ఎందుకంటే మీ దుష్కార్యం మీకు మీ శత్రువు కంటే ప్రమాదకరమయింది' అని బోధించారు ఆయన. ముస్లిములు సంఖ్యలో తక్కువగా ఉన్నప్పటికీ అత్యధిక సంఖ్యలో ఉండే శత్రువులపై విజయం సాధించగలుగుతున్నారంటే కారణం శత్రువులు వివిధ చెడులలో కూరుకుపోయి దైవ సహాయం, దైవ రక్షణ కోల్పోవడమే. శత్రువులు కూడా సద్వర్తనులు, సదాచార పరాయణులు అయి ఉంటే అల్లాహ్ పట్ల భయభక్తులు లేని ముస్లిమ్‌లు వాళ్ళను ఎన్నటికీ ఎదుర్కోలేరు. మరొక విషయం ఏమిటంటే మనకు ఇటు సంఖ్యాబలం, అటు వనరులూ తక్కువగా ఉండి వీటికి తోడు మనం చెడులలో శత్రువుల స్థాయికి చేరుకుంటే శత్రుబలమే అధికమయింది. ఒకవేళ చెడులకు దూరంగా ఉంటే విజయం మనల్నే వరిస్తుంది, విజయం సంఖ్యాబలంపై ఆధారపడి ఉండదు. దైవం పట్ల భయభక్తులు కలిగి ఉంటూ చెడులకు దూరంగా ఉండటంపైనే ఆధారపడి ఉంటుంది.

సోదరులారా!

హజ్రత్ ఉమర్ (రజిఅన్) తన లేఖలో పేర్కొన్న ఈ బోధలను గురించి ఆలోచించినట్లయితే మన కష్టాలకు మూల కారణం ఏమిటో మనకు తెలుస్తుంది, ప్రస్తుతం మనం సంఖ్యలో తక్కువగా ఉన్నామన్నది నిజమే, మనకు వనరులు కూడా తక్కువగానే ఉన్నాయి. అయితే చెడుల విషయంలో మనం ఇతరులకు ఏమైనా తీసిపోయామా? లేదు. మరి అలాంటప్పుడు మనల్ని విజయం ఎలా వరిస్తుంది? మనకిప్పుడు రెండే రెండు మార్గాలున్నాయి. శత్రువుల దాడిని తిప్పికొట్టాలంటే వారి దగ్గరున్న వనరులకన్నా మనం ఎక్కువ వనరుల్ని సమీకరించుకోవాలి. అప్పుడు మనం చెడులకు లోనయి ఉన్నా శత్రువు మనల్ని ఎదిరించలేకపోవచ్చు. సాధారణంగా

ప్రపంచంలో విజయం బలాధిక్యతపైనే ఆధారపడి ఉంటుంది. కాని మనం ప్రపంచంలోని ఇతర జాతుల్లా ఒక జాతి కాదు, దైవం, దైవ ధర్మంతో సంబంధమున్న ఒక సైద్ధాంతిక సమాజం. అందువల్ల మన సాఫల్యం కోసం ఒకే ఒక మార్గం ఉంది. మనం చెడులకు దూరంగా ఉండాలి. దైవ ధర్మంతో మనకు దృఢమైన సంబంధం ఉ్ఒడాలి. మనం ఒకసారి ఆత్మపరిశీలన చేసుకొని ఏ ఏ రంగాల్లోనయితే దైవ వ్యతిరేక పనులు చేస్తున్నామో ఆయా రంగాలను సంస్కరించి మన మొత్తం జీవితాన్ని దైవ ధర్మానికి అనుగుణంగా మలచుకోవడానికి ప్రయత్నించాలి. నైతిక, ఆధ్యాత్మిక రంగాల్లోనే గాకుండా, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లోనూ దైవబోధ ప్రకారమే జీవితం గడుపుతామని నిశ్చయించుకోవాలి. మన బలానికి మూలాధారం ఇదే.

మనం మొట్ట మొదట మన మనస్సుతోనే యుద్ధం చేయాలి. సాధ్యమయినంత వరకు మనం మనోవాంఛల్ని అణచివేసేందుకు కృషి చేయాలి. ఇందులో గనక విజయం సాధించగలిగితే ఇతర అన్ని రకాల శత్రువుల్ని ఓడించడం సులభతరమవుతుంది.

దైవ ధర్మాన్ని అవలంబించి కూడా నైతిక రుగ్మతలకు లోనయితే అలాంటి ప్రజలపై అల్లాహ్ అంతకంటే నీచమయిన వాళ్ళను పాలకులుగా తెచ్చి కూర్చోబెడతాడు. ఇది అల్లాహ్ విధానం. అనాదిగా జరుగుతూ వస్తోంది. ఇస్రాయీల్ జాతి ప్రజలు దైవ ధర్మానికి దూరమై వివిధ చెడులలో కూరుకు పోయినప్పుడు అల్లాహ్ వారిపై మజూసీలను పాలకులుగా విధించాడు. అలాగే ముస్లిములు దైవ ధర్మాన్ని విస్మరించగానే ఒకసారి చంగీ జాతులు వారిపై దాడిచేసి అధికారాన్ని చేజిక్కించుకుంటే, మరొకసారి ఇస్రాయీలీలు దాడి చేసి వాళ్ళను ముప్పు తిప్పలు పెట్టారు.

ఈనాటి మన దుస్థితి కూడా అల్లాహ్ యొక్క ఈ విధానం ప్రకారమే ఏర్పడింది. అల్లాహ్‌కు ఆగ్రహం తెప్పించే పనులు చేస్తున్నంత కాలం మన పరిస్థితి మారే అవకాశం లేదు. మన జీవిత సాఫల్యం అల్లాహ్ అధీనంలో ఉంది! ఆయన సహాయ అనుగ్రహాలపై ఆధారపడి ఉంది. అందువల్ల మనం మొట్టమొదట అల్లాహ్ కరుణా కటాక్షాలను పొందే మార్గాన్ని అవలంబించాలి. ఆ మార్గం మనోవాంఛల్ని జయించి దైవ ధర్మం పరిధిలో జీవితం గడుపుతూ చెడులకు దూరంగా ఉండటమే.

సోదరులారా!

దైవానికి భయపడండి. దైవానికి భయపడటమంటే దైవం ఆజ్ఞాపించిన పనులు చేస్తూ, ఆయన వారించిన పనుల జోలికి పోకుండా ఉండటమే. ఇలా మనం సామూహికంగా ఆచరిస్తే దైవ సహాయం తప్పకుండా లభిస్తుంది. అల్లాహ్‌తో మన సంబంధం పటిష్టవంతంగా చేసుకుంటే ఆయన దూతలు మనల్ని వివిధ కష్టనష్టాల

నుండి కాపాడుతారు. ఒకవేళ మనం దేవుని పట్ల భయభక్తులు కలిగి ఉండే జీవితాన్ని గడుపుతూ ఆ మార్గంలో ఎన్ని కష్టనష్టాలు సంభవించినా, చివరికి ధన ప్రాణాలు కోల్పోవలసి వచ్చినా మనం విచారించవలసిన పని లేదు. ఇది కూడా మన కోసం గొప్ప విజయమే. ఇలాంటి వ్యక్తులకు దైవం దగ్గర లభించే అత్యున్నత అంతస్తులను గురించి ఆలోచిస్తే ప్రపంచంలో జరిగే ధన ప్రాణ నష్టాలు ఒక లెక్కలోనికే రావు.

మోమిన్ దృష్టి ఎల్లప్పుడు పరలోక ఫలితాలపైనే ఉంటుంది. అతను తన శక్తినంతటిని ఉపయోగించి పరిస్థితుల్ని ఎదుర్కొంటాడు. ఒకవేళ ఎప్పుడయినా కఠిన పరిస్థితుల్లో చిక్కుకున్నా అతను అధైర్యపడకుండా వాటిని ఎదుర్కొనడానికే ప్రయత్నిస్తాడు. అతను ఎలాంటి పరిస్థితిలోనూ శత్రువుకు లొంగిపోడు. చివరి రక్తపు బొట్టు వరకూ అతను అధర్మానికి వ్యతిరేకంగా పోరాడుతూనే ఉంటాడు, ఈ దృక్పథంతో మోమిన్ ఒకవేళ తన ధన ప్రాణాలను కాపాడుకునే ప్రయత్నంలో కూడా ప్రాణాలు కోల్పోయినా అతను అమరగతుల జాబితాలోకి వస్తాడు. అమరగతి హోదా దేవుని దృష్టిలో ఎంత ఉన్నతమయినదో మీకు తెలుసు. అతను ప్రాపంచిక ఫలితాలకన్నా పరలోక ఫలితాలకే ప్రాధాన్యతనిస్తాడు. ఆ విశ్వాసం, ఆ భావనలే అతనిలో సహన స్థయిర్యాలను కలిగించి పరిస్థితులకు ఎదురీదగల బలాన్నిస్తాయి.

సోదరులారా!

ఈ విధంగా మనలోని ప్రతి ఒక్కరూ దృఢమయిన విశ్వాసంతో దైవ ధర్మాన్ని అనుసరిస్తూ, సామూహిక శక్తితో దుష్ట శక్తుల్ని ఎదుర్కోడానికి ప్రయత్నించాలి. అప్పుడే దేవుని కటాక్షం, ఆయన సహాయం మనకు లభిస్తాయి. అప్పుడే మనం కష్టాల నుండి గట్టెక్కగలం.

51. ఈమాన్ అంటే ఏమిటి?

మహాశయులారా!

ఇస్లామ్‌కు పునాదిరాయి ఈమాన్ అన్న సంగతి మీ కందరికి తెలుసు. ఈమాన్ అంటే అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తలను, ఆయన గ్రంథాలను, పరలోకాన్ని, దైవ దూతలను, అదృష్టం లేక తఖ్‌దీర్‌ని విశ్వసించడం. విశ్వాసానికి సంబంధించిన అనేక అంశాలున్నాయి. కాని అల్లాహ్ పట్ల విశ్వాసం అన్నిటికంటే అతి ముఖ్యమయిన అంశం. ఇది లేకుంటే ఇతర అంశాలు అర్థరహితమైనవి. అందువల్ల మొట్టమొదట అల్లాహ్ పట్ల విశ్వాసం అంటే ఏమిటో తెలుసుకోవాలి.

దీనర్థం కేవలం అల్లాహ్ ఉన్నాడని విశ్వసించడమే కాదు. మనం ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా అల్లాహ్ అయితే తప్ప కుండా ఉన్నాడు. కేవలం అల్లాహ్ ఉన్నాడనే విషయాన్ని అవిశ్వాసులు కూడా ఒప్పుకుంటారు. కాని అల్లాహ్ పట్ల విశ్వాస ముంచడం అంటే అల్లాహ్ మాత్రమే విశ్వానికి సృష్టికర్త, యజమాని అని అంగీకరించాలి. ఆయనే మన ప్రభువు, పాలకుడు. మనమంతా ఆయన పాలితులం. మన ఆరాధనలకు ఆయన మాత్రమే యోగ్యుడు. మనమంతా ఆయన దాసులం. ఆయనకు దాస్యం చేయడం మన విధి. ఇలా ఈ విషయాలన్నిటిని మనస్ఫూర్తిగా ఎవరయినా నమ్మితే అతను విశ్వసించాడంటాం.

అలాగే దైవ ప్రవక్తను విశ్వసించడం అంటే కేవలం ముహమ్మద్ (సఅసం)ను దైవ ప్రవక్తని నమ్మడం మాత్రమే కాదు. ఇదొక చారిత్రక సంఘటనను వ్యక్తపరచడం మాత్రమే అవుతుంది. విశ్వాసం వల్ల ప్రయోజనం కలగాలంటే ప్రపంచ మానవాళి కోసం ముహమ్మద్ (సఅసం) విశ్వప్రభువు నుండి మార్గదర్శక సందేశాన్ని తెచ్చారని, ఆయన మనకు తెలిపినవన్నీ దైవాజ్ఞల ప్రకారమే ఉన్నాయని ఒప్పుకోవాలి. ఇప్పుడు జీవిత సమస్త రంగాల్లో ఆయనే మనకు ఏకైక నాయకుడు, మార్గదర్శి అని, ప్రతి విషయంలోనూ ఆయన చూపిన బాటనే నడవాలని, ఆయన్ని వదలి ఇతరుల్ని అనుసరించకూడదని అంగీకరించాలి.

అదే విధంగా దైవ గ్రంథాన్ని విశ్వసించడమంటే దివ్యఖుర్‌ఆన్ ముహమ్మద్ రచన కాదని, దైవ గ్రంథమని ఒప్పుకున్నంత మాత్రాన సరిపోదు. ఇప్పుడు మనకు మార్గం చూపడానికున్న సరికొత్త ప్రామాణిక గ్రంథం ఖుర్‌ఆన్ మాత్రమేనని అంగీకరించాలి. దీని ఆదేశాలు, బోధనలే అంగీకార యోగ్యమయినవి. వీటికి వ్యతిరేకంగా ఉండే ఇతరుల మాటలు పాటించదగినవి కావు. వారు ఎంత గొప్పవారయినా వారి మాటలు

ఖుర్ఆన్ బోధనలకు అనుగుణంగా లేకపోతే వాటిని పాటించకూడదు. మన జీవితానికి కావలసిన మౌలిక చట్టాలున్న గ్రంథం ఖుర్ఆన్ మాత్రమే. వీటికి వ్యతిరేకంగా ఉండే ఎలాంటి చట్టాలను పాటించకూడదు. మానవాళి జీవితానికి దివ్యఖుర్ఆన్ మాత్రమే వెలుగుబాట.

అలాగే పరలోకాన్ని విశ్వసించడం అంటే మనిషి చనిపోయిన తరువాత తిరిగి బ్రతికించబడతాడని భావించినంత మాత్రాన సరిపోదు, పరలోకం పట్ల విశ్వాసం కూడా పరిపూర్ణం కావాలంటే మనం ఇహలోక జీవితంలో ఏది చేసినా పరలోక జీవితంలో దానికి మన నిజప్రభువు ముందు సమాధానం ఇచ్చుకోవలసి ఉంటుందని, ఆ నమ్మకం ప్రకారమే మనకక్కడ సత్ఫలం లేదా దుష్ఫలం లభిస్తుందని మనస్ఫూర్తిగా నమ్మాలి. ఇంకా, పరలోకం గురించి దివ్య ఖుర్ఆన్‌లో హదీసుల్లో వివరించబడిన విషయాలను నిజమయినవిగా విశ్వసించాలి. మనం చేసిన ప్రతి పనికీ అల్లాహ్ ముందు లెక్క చెప్పుకోవలసి ఉంటుందన్న నమ్మకం లేనంతవరకు మన పరలోక విశ్వాసం పరిపూర్తి కాదు.

సోదరులారా!

ఇవీ విశ్వాసానికి సంబంధించిన వివరాలు. వీటన్నిటిని మనస్ఫూర్తిగా నమ్మి, నోటితో అంగీకరించనంత వరకు మన విశ్వాసం పరిపూర్తి కాదు. ఇలాంటి విశ్వాసమే ఇస్లామ్‌కు మూలాధారం. అంటే మనం దేన్నయితే విశ్వసించామో దానికి అనుగుణంగా అమలు చేయడానిక్కూడా వీలవుతుందన్న మాట. ఉదాహరణకు, మన ప్రభువు, యజమాని, దైవం అల్లాహ్ మాత్రమేనని అంగీకరించిన తరువాత మనం అల్లాహ్ దాసులమై పోతాము. అప్పుడు మనం అల్లాహ్‌నే ఆరాధిస్తాం. ఆయనకే విధేయులమయి ఉంటాం. ఆయన ఆజ్ఞలకు వ్యతిరేకంగా ఎలాంటి పనీ చేయం. ఆయన ఆజ్ఞలను పాటించడంలో ఎలాంటి సాకులు వెదకం. ఆయన ఏ పనయితే చేయమని ఆదేశిస్తాడో ఆ పనే చేస్తాం. ఏ పని నుండయితే వారిస్తాడో ఆ పని జోలికి పోము. ఇలా చేయడమే ఇస్లామ్.

అదే విధంగా ప్రవక్త (సఅసం) పట్ల విశ్వాసం అంటే ఏమిటో గ్రహించండి. మనం నిజంగా మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) బోధనల ప్రకారమే జీవితం గడుపుతుంటే ప్రతి విషయంలోను ఆయన పట్ల విధేయతకే ప్రాధాన్యతనిస్తూ ఆయన నిషేధించిన విషయాల జోలికి పోకుండా ఉంటే అది ఇస్లామీయ జీవితం అనబడుతుంది. అలాగే అల్లాహ్ అంతిమ గ్రంథమైన ఖుర్ఆన్‌లోని బోధనలను పాటిస్తూ, అందులోని చట్టాల ప్రకారం వ్యవహరిస్తూ, ప్రతి విషయంలోనూ పరలోకంలో జవాబు చెప్పుకోవలసి

ఉంటుందన్న భావనతో మొత్తం జీవితాన్ని ఖుర్ఆన్‌కు అనుగుణంగా గడుపుతుంటే ఇలాంటి జీవితాన్ని ఇస్లామీయ జీవితం అంటారు. ఇస్లామీయ జీవితంలో స్వర్గం పట్ల ఆసక్తి, నరకం పట్ల భయం అడుగడుగునా స్పష్టంగా వ్యక్తమవుతుంది.

ఇస్లామీయ జీవితం గడిపే వ్యక్తి ప్రతి పనినీ అల్లాహ్, ఆయన ప్రవక్త బోధనల ప్రకారమే చేస్తాడు. ఒక వ్యక్తి ఇస్లామ్‌ను విశ్వసించగానే ఇస్లామీయ ఆజ్ఞలను పాటించడం అతని విధి అవుతుంది. నమాజ్, రోజా, జకాత్, హజ్ విధులు ఇస్లామీయ జీవితం యొక్క మౌలిక విషయాలు. ఇవే లేకపోతే ఇస్లామ్ అన్నదే లేదు, ఇస్లామీయ జీవన సౌధానికి ఇవే మూల స్తంభాలు.

ఇస్లామ్ మానవుని సమస్త జీవన రంగాలను అల్లాహ్, ఆయన ప్రవక్త బోధనలకు అనుగుణంగా మలచగోరుతుంది. జీవితంలోని కొన్ని వ్యవహారాలు, ఆరాధనలు దైవాజ్ఞల ప్రకారం పాటిస్తూ, మిగిలిన వ్యవహారాల్లో మనిషి తన ఇష్టమొచ్చినట్లు నడచుకోవడాన్ని ఇస్లామ్ అనుమతించదు. ఒకవేళ ముస్లిమ్‌లు తాము స్వయంగా జీవితపు అన్ని రంగాల్లోనూ ఇస్లామ్ చూపిన మార్గాన నడవకపోతే లేదా ఆ మార్గంలో వారికి ఏవయినా అవరోధాలు ఏర్పడితే - ఇలాంటి పరిస్థితిలో పరిపూర్ణ ధర్మసంస్థాపన కోసం ఉద్యమం ప్రారంభించి పోరాడాలని ఇస్లామ్ బోధిస్తోంది. దీన్నే జిహాద్ అంటారు. జిహాద్ అంటే దైవ దాసులు నిజమైన దైవదాసులుగా జీవితం గడపడంలో అవరోధాలుగా నిలిచివున్న ప్రతి చెడును దూరం చేయడానికి సర్వశక్తులు వినియోగించి కృషి చేయాలని అర్థం, దీని కోసం అవసరమయితే ధన ప్రాణాలు కూడా త్యాగం చేయవలసి వస్తుంది. ఈ మార్గంలో ఒకవేళ యుద్ధం చేయవలసి వచ్చినా వెనుకాడరాదు. ఇలా దైవ మార్గంలో ధన ప్రాణాలు త్యజించి చేసే పోరాటం గొప్ప ఆరాధన క్రిందికి వస్తుంది.

ఇస్లామ్‌ను విశ్వసించిన ప్రతి వ్యక్తీ ఈ బాధ్యతను నిర్వహించవలసి ఉంటుంది. అతను మొట్టమొదట తన జీవితాన్ని పూర్తిగా ఇస్లామీయ బోధనలకు అనుగుణంగా సంస్కరించుకోవడానికి ప్రయత్నించాలి. ఆ తరువాత ఇస్లామ్ సందేశాన్ని ఇతరులకు అందజేయడానికి, వారిని పరిపూర్ణ దైవ దాసులుగా మలచడానికి అవిశ్రాంతంగా కృషి చేస్తూ ఉండాలి. ఈ బాధ్యత కేవలం ఎవరో కొందరు వ్యక్తులు లేదా కొన్ని సంస్థలది మాత్రమే కాదు. ఇది ముస్లిమ్‌లందరి బాధ్యత, స్త్రీ అయినా పురుషుడయినా, చిన్నవాడయినా, పెద్దవాడయినా, పండితుడయినా- పామరుడయినా- అందరూ తమ తమ శక్తి మేరకు ఈ బాధ్యతను నిర్వహించవలసిందే.

సోదరులారా!

ఈ బాధ్యత మీకు కాస్త భారంగా తోచవచ్చు. కాని ఈమాన్, ఇస్లామ్‌ల వాస్తవికతను అర్థం చేసుకుంటే ఇది మన కనీస బాధ్యతని మీరు గ్రహిస్తారు. మనకు

అల్లాహ్ వాగ్దానం చేసిన అపార సౌఖ్యాలున్న స్వర్గధామం ఎలాంటి శ్రమ లేకుండా లభించడానికి బజారులో పడిఉన్న వస్తువు కాదు. అది ఏదైనా ప్రత్యేక తెగలోనో లేదా వంశంలోనో పుడ్తే లభించే వస్తువు కూడా కాదు. మనకు సుఖాన్నిచ్చే ప్రతి వస్తువు కోసం ఎంతో కొంత కృషి చేయక తప్పదు. అల్లాహ్ మోమిన్ ధన ప్రాణాలను స్వర్గానికి బదులుగా కొన్నాడని ఖుర్ఆన్ స్పష్టంగా చెబుతోంది. మిమ్మల్ని మీరు మోమిన్ అని భావిస్తుంటే దానర్థం మీ దగ్గరున్న ఏ వస్తువు నిజానికి మీది కాదు, అది అల్లాహ్ది. పరలోక సాఫల్యం కోసం దాన్ని దైవ మార్గంలో వినియోగించడం మీ విద్యుక్తధర్మం. మన దగ్గరున్న సమస్త వస్తువులు, శక్తి సామర్థ్యాలను అల్లాహ్ అభీష్టం ప్రకారమే వెచ్చించాలి. నిజమయిన ముస్లిమ్లుగా మనుగడ సాగించదలచుకుంటే ఎలాంటి పరిస్థితులు ఎదురయినా సరే ధైర్యంతో వాటిని అధిగమిస్తూ ఈ విద్యుక్త ధర్మాన్ని నిర్వహిస్తూ ఉండాలి.

ఈ పని కోసం మొదట మనం వీలయినంత ఎక్కువగా ధర్మ పరిజ్ఞానాన్ని సంపాదించడానికి ప్రయత్నించాలి. మంచి మంచి పుస్తకాలు చదవాలి. ఇతరుల ద్వారా తెలుసుకోవాలి. ప్రతి రోజూ ఖుర్ఆన్ పఠించడానికి కొంత సమయం కేటాయించుకోవాలి. ఖుర్ఆన్ పఠించడం అంటే కేవలం అరబీ ఆయత్లను పారాయణం చేయడం మాత్రమే సరిపోదు. వాటి అనువాదాన్ని వ్యాఖ్యానంతో సహా అధ్యయనం చేయాలి. అలాగే హదీసులు, మహా పురుషుల జీవిత గాథలు కూడా చదువుతూ ఉండాలి. దీని వల్ల మన విశ్వాసం తాజాగా ఉండి దైవాదేశాలను పాటించడంలో శక్తిని, ఆసక్తిని ఇస్తుంది. సాధ్యమయినంతవరకు సత్కార్యాలను చేస్తూ పవిత్ర జీవితం గడపడానికి ప్రయత్నించాలి. తరువాత దైవం ప్రసాదించిన మన శక్తి సామర్థ్యాలను, ఒనరుల్ని వీలైనంత ఎక్కువగా ధర్మ సంస్థాపనా కార్యకలాపాల్లో వినియోగిస్తూ పని చేయడానికి కృషి చేయాలి.

52. ఖుర్‌ఆన్ పట్ల మన బాధ్యతలు-1

మహాశయులారా!

మనమంతా దివ్యఖుర్‌ఆన్ దైవ గ్రంథమని, అది ఎలాంటి మార్పులకు చేర్పులకు లోను కాలేదని విశ్వసిస్తున్నాం. అంతేకాదు, అది భూమ్యాకాశాల ప్రభువు మానవాళి పేరిట జారీ చేసిన ఆఖరి ఆదేశమని కూడా మనం నమ్ముతున్నాం. ఈ విషయాల దృష్ట్యా ఈ గ్రంథం ఎంత విలువయినదో సులభంగా అంచనా వేయవచ్చు. ఈ యదార్థాన్ని గ్రహించి అంగీకరించిన వారు ప్రపంచంలో కోట్ల సంఖ్యలో ఉన్నారు. దేవుని దయవల్ల మనం కూడా వీరిలో చేరి ఉన్నాం.

అయితే ఇది అంతిమ దైవ గ్రంథమని విశ్వసించిన వారు ఈ గ్రంథం పట్ల నిర్వహించవలసిన బాధ్యతలేమిటి? ఇలాంటి గొప్ప దైవాజ్ఞను కేవలం దైవాజ్ఞ అని ఒప్పుకున్నంత మాత్రాన సరిపోతుందా? సరిపోదు. అది మనపై ఎన్నో బాధ్యతల్ని మోపింది. వాటిని నెరవేర్చడం మన విధి. అయితే ఈ విధిని మనం ఎంత వరకు నెరవేరుస్తున్నామో మనలో ప్రతి ఒక్కరూ ఒక్కసారి తనను తాను ప్రశ్నించుకోవాలి. ఖుర్‌ఆన్ ఆదేశాలను నిక్కచ్చిగా పాటించకపోతే పరలోక సాఫల్యం సాధ్యం కాదని మనం నమ్ముతున్నాం కాబట్టి ఇలా ప్రశ్నించుకోవడం ఎంతో అవసరం.

సోదరులారా!

దివ్య ఖుర్‌ఆన్ హక్కులేమిటో, దాని పట్ల మన బాధ్యత లేమిటో ఈ రోజు మనం తెలుసుకుందాం. ఈ విషయాలను తెలుసుకోకపోతే ఖుర్‌ఆన్ ఆదేశాలను పాటించలేము.

మనపై ఖుర్‌ఆన్ మొట్టమొదటి హక్కు ఏమిటంటే మనం దాన్ని విశ్వసించాలి. విశ్వాసానికి సంబంధించిన రెండు అంశాలున్నాయి, ఒకటి, వాక్కు ద్వారా ప్రకటించడం, రెండవది, హృదయపూర్వకంగా నిజమని ఒప్పుకోవడం. దీన్నిబట్టి ఖుర్‌ఆన్‌ని విశ్వసించడమంటే అది దైవ గ్రంథమని వాక్కు ద్వారా ప్రకటించి, అది సత్యంతో కూడుకున్నదని మనస్ఫూర్తిగా అంగీకరించడమని అర్థం.

ఈ గ్రంథంలోని ప్రతి వాక్యం, ప్రతి మాట, ప్రతి అక్షరం అల్లాహ్ నుండి అవతరించిందే. ఇందులో దైవేతరుల మాట ఒక్కటీ లేదు. దైవ దూత హజ్రత్ జిబ్రీల్ (అలైహి) ద్వారా మహా ప్రవక్త ముహమ్మద్ (సఅసం)పై అవతరించిన దైవవాణే ఈ గ్రంథం. ఇందులో ఏ ఒక్క మానవుడూ ఏ మాత్రం తగ్గించడంగాని, హెచ్చించడంగాని

జరగలేదు. ఈ యదార్థాన్ని మనం నోటితో అంగీకరిస్తున్నాం, చిత్తశుద్ధితో విశ్వసిస్తున్నాం. దీనికి వ్యతిరేకంగా మనం ఏ విషయాన్నీ ఒప్పుకోము.

అయితే సోదరులారా! ఈమాన్ విషయం కూడా బహు చిత్రమయింది. వాక్కు ద్వారా ప్రకటించి, హృదయపూర్వకంగా నిజమని అంగీకరించినట్లు మనం ఎంత చెప్పుకున్నా అప్పుడప్పుడు మన హృదయం బలహీన స్థితికి కూడా గురవుతుంటుంది. మన హృదయంలో ఈమాన్ ఏ మేరకుందో స్వయంగా మనకే తెలియదు. అయితే మనిషి యొక్క బాహ్య కర్మల ద్వారా ఈ మానసిక స్థితిని కొంత వరకు తెలుసుకోవచ్చు.

ఉదాహరణకు ఖుర్‌ఆన్ పట్ల విశ్వాసాన్నే తీసుకోండి. ఖుర్‌ఆన్ పట్ల ఎలాంటి విశ్వాసం ఉండాలో అలాంటి విశ్వాసమే గనక ఉండినట్లయితే, మన హృదయాల్లో దాని ఔన్నత్యం బలంగా చోటు చేసుకుంటుంది. దాన్ని మాటిమాటికి చదవాలన్న ఆసక్తి, ఉత్సాహం కలుగుతాయి. చదవడంలో మనస్సు లగ్నమవుతుంది. చదువుతున్నప్పుడు మనం ఒకవిధమయిన అద్భుత పరిస్థితికి లోనవుతాము.

మన ప్రియ ప్రవక్త (సఅసం) ఖుర్‌ఆన్ పఠించడానికి నమాజులో నిలబడినప్పుడు అందులో పూర్తిగా లీనమైపోతారు. అలా చాలా సేపటిదాకా ఖుర్‌ఆన్ పఠనంలో లీనమయిపోవడం వల్ల ఆయన కాళ్ళు వాచిపోయేవి. ఆ విధంగా ఆయన ఒక్కోసారి జాము పొద్దుపోయే వరకు, మరొక్కసారి నడిరేయి వరకు, ఇంకొక్క సారి వేకువ జాము వరకు గడిపేవారు. అప్పుడప్పుడు ఖుర్‌ఆన్ ప్రభావం వల్ల ఆయన కళ్ళ నుండి అశ్రుధారలు కూడా రాలేవి, కారణం ఖుర్‌ఆన్, దైవవాణి అని ఆయన దృఢంగా నమ్మడమే.

ఇక మన పరిస్థితి చూడండి, ఖుర్‌ఆన్ ఔన్నత్యం మన హృదయాల్లో చోటే చేసుకోలేదు. దాన్ని చదవడంలో మన మనస్సు లగ్నం అవదు. చదువుతున్నప్పుడు అందులోని విషయాలను జాగ్రత్తగా ఆలకించి అర్థం చేసుకోవాలన్న ధ్యాసే ఉండదు. ఖుర్‌ఆన్ ఆదేశాలు, బోధనలు మాటిమాటికి మన ముందుకు వస్తున్నా మనం వాటిని వినీ విననట్లు ఉండిపోతాము. చివరికి పరిస్థితి ఎంతవరకు దిగజారిందంటే, ఫలానా విషయాలను ఖుర్‌ఆన్ నిషేధించిందని తెలిసి కూడా మనం వాటిని చేస్తుంటాము. మరికొన్ని విషయాలు విధిగా పాటించవలసి ఉన్నా వాటి వైపు కన్నెత్తి కూడా చూడం. ఇదీ మన పరిస్థితి!

సోదరులారా!

నేను మిమ్మల్ని విమర్శిస్తున్నాననుకోకండి. వాస్తవాన్ని మీ ముందుంచుతున్నాను. దాదాపు మనందరి పరిస్థితి ఇలాగే ఉంది. కాబట్టి మనమంతా ఒక్కసారి మన హృదయా

ల్లోకి తొంగిచూసుకోవాలి. ఖుర్ఆన్ పట్ల మన విశ్వాసం కేవలం వంశపారంపర్యమయినది మాత్రమే. ఒకవేళ అలాంటి విశ్వాసమున్నా మన క్రియా జీవితంలో, జీవిత వివిధ రంగాల్లో ఖుర్ఆన్ ప్రభావం తప్పనిసరిగా కనిపించాలి. కాని అలాంటిదేమీ లేదు మరి మన విశ్వాసానికి అర్థం ఏమిటి? అంటే మన విశ్వాసంలో ఏదో లోపం ఉందన్న మాట. ఎక్కడో దోషం ఉంది.

ఈ లోపాన్ని పూరించే విధానం ఏమిటి? ఈ దోషాన్ని దూరం చేసుకునే దారేమిటి? అని మీరు ప్రశ్నించవచ్చు. దీనికి సమాధానం ఒక్కటే. ఖుర్ఆన్ ద్వారానే మన విశ్వాసాన్ని పటిష్టం చేసుకోగలం. ఈమాన్ అనేది ఎక్కడో బయట నుంచి తెచ్చుకొని హృదయంలో ప్రతిష్ఠించుకునే వస్తువు కాదు. అదొక దివ్య కాంతి, అది మనిషి హృదయంలోనే జనిస్తుంది. కాబట్టి ఆ దివ్య కాంతిని మన హృదయాల్లో జనింపజేసుకోవడానికి, దాన్ని ఎల్లప్పుడూ ప్రకాశవంతంగా ఉంచుకోవడానికి ఖుర్ఆన్‌ని నిరంతరం అధ్యయనం చేస్తుండాలి. అందులో ప్రతి వాక్యాన్ని అర్థం చేసుకొని దాన్ని ఆచరణలో పెట్టడానికి ప్రయత్నించాలి.

హృదయంలో విశ్వాస కాంతిని జనింపజేసుకోవడం ఒక ఎత్తయితే, దాన్ని భద్రంగా కాపాడుకోవడం మరో ఎత్తు. మనచుట్టూ ప్రబలివున్న వివిధ చెడులు, నైతికత లోపించిన విద్యా శిక్షణలు మనిషి హృదయంలోని ఈ విశ్వాస కాంతిని బలహీన పరుస్తాయి. స్వయంగా మనిషిలో తిష్ఠవేసుకొని ఉన్న చెడులు, దురలవాట్లు, దుష్ట భావోద్రేకాలు కూడా ఈ కాంతిని మందగింపజేస్తాయి. అందుకే ఖుర్ఆన్ ప్రతి రోజూ శ్రద్ధాసక్తులతో చదువుతూ ఉండాలి.

సోదరులారా!

ఖుర్ఆన్ అధ్యయనం గురించి ఇన్షా అల్లాహ్ వచ్చే వారం వివరంగా తెలుసుకుందాం. అందులో ఖుర్ఆన్ ప్రాముఖ్యం, దాని విలువలు, వాటి ప్రమాణాలతో సహా మీ ముందుంచడానికి ప్రయత్నిస్తాను. మన విశ్వాస జ్యోతిని మరింత కాంతివంతం చేసుకోవడానికి ఇవన్నీ ఎంతో ఉపయోగపడతాయి. ప్రాపంచిక వ్యామోహం, సమాజ దుష్ప్రభావం వల్ల మన హృదయాలపై పేరుకున్న దుమ్ము, ధూళి కూడా దీంతో చాలా వరకు వదలి పోతుంది.

సోదరులారా!

ఖుర్ఆన్ పట్ల విశ్వాసం పటిష్టమవుతున్న కొద్దీ దాంతో మన సంబంధం కూడా పటిష్టమవుతూ పోతుంది. దానివల్ల మన హృదయంలో పెద్ద విప్లవమే వస్తుంది. మనం మన నిజ యజమాని, ప్రభువు, పాలకుడయిన అల్లాహ్‌ను కంటితోనయితే చూడలేము,

ఆయన పలికే మాటలను కూడా వినలేం. అయితే ఖుర్‌ఆన్ రూపంలో ఆయన వాణి మన దగ్గర ఉంది. అల్లాహ్ పట్ల మన బాంధవ్యం, భక్తిభావం, ప్రేమాభిమానాలు నిజంగా మన అంతరంగాల్లో ఉండినట్లయితే అవి ఖుర్‌ఆన్ ద్వారా మన జీవితాల్లో తప్పనిసరిగా తొణికిసలాడతాయి. ఖుర్‌ఆన్ అధ్యయనం ద్వారా దాని ఔన్నత్యాన్ని కూడా మనం గ్రహించగలం.

ఖుర్‌ఆన్ పట్ల మనకు నిజమయిన శ్రద్ధాసక్తులు ఉంటే దాని అధ్యయనం మన ఆత్మలకు నిత్యాహారమవుతుంది. ఈ ఆహారం లేకుండా మనం ఒక్క రోజు కూడా ప్రశాంతంగా ఉండలేము. మన మనోమస్తిష్కాలను ఆవరించిన కారు చీకట్లను పారద్రోలే ఏకైక జ్యోతి ఖుర్‌ఆన్ ఒక్కటే. ఈ జ్యోతి సహాయంతోనే మనకు జీవితంలోని సమస్త రంగాల్లో సరయిన మార్గ దర్శకత్వం లభిస్తుంది. మన విశ్వాసం పటిష్టతకు, ఆధ్యాత్మిక వికాసానికి, నైతిక పురోభివృద్ధికి ఖుర్‌ఆన్‌ను మించిన అద్భుత సాధనం మరొకటి లేదు. దాన్ని అధ్యయనం చేయడం ద్వారానే ఇవన్నీ మనకు ప్రాప్తమవుతాయి. అంతేకాదు, మన శక్తి సామర్థ్యాలు, ఆర్థికవనరులు, ఇతర సమస్త వస్తువులూ సద్వినియోగం కావడానికి తద్వారా దైవ ప్రీతి, ఇహపర సాఫల్యాలు లభించడానికి కూడా ఖుర్‌ఆన్ అధ్యయనమే మనకు వెలుగు బాట.

సోదరులారా!

ఇదీ మనపై ఖుర్‌ఆన్‌కున్న మొట్టమొదటి హక్కు. ఈ హక్కును పాటించేవారు ధన్యులు, వారు ప్రపంచం దృష్టిలో ఎలాంటి వారయినా దైవం దృష్టిలో ఎంతో ఉన్నతులు. అల్లాహ్ మనందరికీ ఖుర్‌ఆన్‌కున్న ఈ హక్కును పాటించే భాగ్యం ప్రసాదించుగాక!

53. ఖుర్‌ఆన్ పట్ల మన బాధ్యతలు-2

మహాశయులారా!

ఖుర్‌ఆన్ పఠనం ఓ గొప్ప ఆరాధన అని మీకందరికీ తెలుసు. ఖుర్‌ఆన్ దైవ గ్రంథమని మనం అంగీకరిస్తున్నాం కాబట్టి దాన్ని పఠించడం మన విధి. మన విశ్వాసాన్ని ఎల్లప్పుడూ తాజాగా, సజీవంగా ఉంచడానికి ఖుర్‌ఆన్ పఠనానికి మించిన మంచి మార్గం మరొకటి లేదు. అది మన ఆధ్యాత్మిక జీవితానికి ఆహారం లాంటిది. ఖుర్‌ఆన్ పఠనాన్ని అరబీ భాషలో 'తిలావత్' అంటారు. దీని అంతరార్థాన్నిబట్టి ఖుర్‌ఆన్‌ని పవిత్రమయిన దైవ గ్రంథంగా భావించి ఎంతో గౌరవమర్యాదలతో పఠించాలి. దాన్ని చదవడానికి, అర్థం చేసుకోవడానికి, దాని బోధనలను నిత్య జీవితంలో క్రమం తప్పకుండా అనుసరించడానికి మనల్ని మనం దానికి పూర్తిగా అంకితం చేసుకోవాలి.

ఖుర్‌ఆన్ దైవ హితవులతో నిండిన దివ్య గ్రంథం. ఇతర సాధారణ పుస్తకాల్లా ఒకసారి చదివి అర్థం చేసుకొని అవతల పెట్టే పుస్తకం కాదిది. మామూలు పుస్తకం లాంటిదే అయితే మన ప్రియ ప్రవక్త (సఅసం) దాన్ని మాటిమాటికి పఠిస్తూ ఉండేవారు కాదు. ఖుర్‌ఆన్‌ని నిరాఘాటంగా చదువుతూ ఉండమని స్వయంగా అల్లాహ్‌యే మహాప్రవక్త (సఅసం)ను అనేకసార్లు తాకీదు చేసినట్లు ఖుర్‌ఆన్ ద్వారానే తెలుస్తోంది. ఆనాడు మక్కాలో పరిస్థితి తీవ్రస్వరూపం ధరించినప్పుడు, దైవ సన్నిధిలో నిల్చొని ఖుర్‌ఆన్‌ని నెమ్మదిగా ఆగి ఆగి పఠించడంలో రాత్రి వేళల అత్యధిక భాగాన్ని గడపవలసిందిగా అల్లాహ్ దైవ ప్రవక్త (సఅసం)ను ఆదేశించాడు. ఇదే కాకుండా ఆపదలు, కష్టాలు వచ్చినప్పుడు కూడా సహనం, స్థిరత్వం, స్థయిర్యాలను పొందడానికి నమాజ్ చేయమని, ఖుర్‌ఆన్ పఠించమనే అల్లాహ్ ఆదేశించాడు.

దీన్ని బట్టి దివ్య ఖుర్‌ఆన్‌ని నిరంతరం నిరాఘాటంగా పఠిస్తూ ఉండటం ఎంతో అవసరమని తెలుస్తోంది. ప్రత్యేకంగా ఆపదలు విరుచుకుపడి క్లిష్టపరిస్థితులు ఏర్పడినప్పుడు, ఎవరి సహాయ సహకారాలు లభించని కఠిన సమయం ఎదురయినప్పుడు మనలో శక్తిని, సహనాన్ని కలిగించేవి నమాజ్, ఖుర్‌ఆన్ పఠనాలే. మన ఆధ్యాత్మిక పిపాసను తీర్చగలిగేది ఖుర్‌ఆన్ పఠనమే. మన విశ్వాసాన్ని కాపాడగలిగేది కూడా ఇదే.

సోదరులారా!

ఖుర్‌ఆన్ పఠనం మన దినచర్య కావాలి. దాని పట్ల ఆసక్తిని పెంచుకోవాలి. ప్రతి కాలంలోనూ దైవ ధర్మం పట్ల ఆసక్తి, అభిలాష కలవారే ఖుర్‌ఆన్ పఠనాన్ని తమ దైనందిన జీవిత కార్యకలాపాల్లో ఒక భాగంగా చేసుకున్నారు. కాని ఈనాడు ముస్లిమ్‌లు

ధర్మానికి దూరమయిపోతున్నారంటే కారణం, వారు ఖుర్ఆన్ పఠనాన్ని తమ దైనందిన కార్యకలాపాల్లో భాగంగా చేసుకోకపోవడమే. కాబట్టి ప్రతి ముస్లిమ్ తన స్థితి గతుల్ని, శక్తి సామర్థ్యాలను దృష్టిలో పెట్టుకొని ఎంత భాగమైతే ఖుర్ఆన్‌ని చదవగలడో ఆ మేరకయినా ప్రతిరోజూ క్రమం తప్పకుండా చదువుతూ ఉండటం ఎంతో అవసరం.

చదవడమంటే అరబీ భాషలో ఉన్న ఖుర్ఆన్ వాక్యాలను అర్థంపర్థం లేకుండా చదువుకుంటూ పోవడం కాదు, అర్థం చేసుకుంటూ చదవాలి. ఖుర్ఆన్‌ని అర్థం చేసుకోవడానికి అరబీ భాష నేర్చుకుంటే చాలా మంచిది. అయితే ప్రతి ఒక్కరు తప్పని సరిగా అరబీభాష నేర్చుకోవాలన్న నిబంధనలేదు. మనకు తెలిసిన భాషలో ఖుర్ఆన్ భావాన్ని, దాని వ్యాఖ్యానాన్ని చదివి అర్థం చేసుకుంటే చాలు, ఖుర్ఆన్‌ని అర్థం చేసుకోవడానికి ఉర్దూ, ఇంగ్లీషు, తెలుగు భాషల్లో అనేక వ్యాఖ్యాన సహిత గ్రంథాలున్నాయి.

సోదరులారా!

ఇక్కడ మరో విషయం తెలుసుకోవలసిన అవసరం ఉంది. ప్రతి వ్యక్తీ ఖుర్ఆన్‌ని పూర్తిగా అర్థం చేసుకోగలడని చెప్పలేం. ఖుర్ఆన్‌ని అర్థం చేసుకోవడంలో తమ యావజ్జీవితాలను గడిపిన మహా మేధావులు, ధర్మవేత్తలు, పండితులు సయితం తాము ఖుర్ఆన్‌ని పూర్తిగా అర్థం చేసుకున్నామని చెప్పలేదు. ఖుర్ఆన్‌లో కొన్ని అతి క్లిష్టమయిన విషయాలు ఉన్నాయి. వాటిని అర్థం చేసుకోవడానికి, వారు నిరంతరం అధ్యయనం చేస్తూ, పరిశోధనలు చేస్తూ ఉంటారు. అయితే వీటితోపాటు ఖుర్ఆన్‌లో సులభంగా అర్థం చేసుకోగల విషయాలు అనేకం ఉన్నాయి. అల్లాహ్ గుణగణాలను శక్తి సామర్థ్యాలను తెలిపే బోధనలు, పరలోక యదార్థాలను జ్ఞప్తికి తెచ్చే విషయాలు, స్వర్గ నరకాలకు సంబంధించిన వర్ణనలు, జాతుల పతనానికి దారితీసిన చారిత్రక సంఘటనలు మొదలయిన ఎన్నో విషయాలను చదివి సులభంగా అర్థం చేసుకోవచ్చు.

ఎవరైనా ఈ విషయాలను క్షుణ్ణంగా అధ్యయనం చేస్తూ ఒక్కొక్క అంశాన్ని గురించి జాగ్రత్తగా ఆలోచిస్తే వాటిలోని గుణపాఠాన్ని సులభంగా గ్రహించగలరు. కాబట్టి ఖుర్ఆన్‌లోని విషయాలు గూఢార్థంతో కూడుకున్నవి, వాటిని సామాన్యులు అర్థం చేసుకోలేరని భావించకూడదు, ప్రయత్నిస్తే అనేక విషయాలను గ్రహించవచ్చు.

ఈ సందర్భంలో మనం మరో విషయాన్ని కూడా గుర్తుంచుకోవాలి. ఖుర్ఆన్ అధ్యయనం ద్వారా తెలుసుకున్న ప్రతి విషయాన్ని జీవితంలో ఆచరించడానికి కృషి చేయాలి. ఖుర్ఆన్‌ని అర్థం చేసుకోవడానికి ఇది కూడా ఎంతో ఉపయోగపడుతుంది. ఖుర్ఆన్‌లోని ఏదయినా ఒక దైవాజ్ఞను గురించి తెలుసుకున్న వెంటనే దాన్ని ఆచరణలో పెడితే, మిగిలిన దైవాజ్ఞలను కూడా సులభంగా అర్థం చేసుకోగలం. మంచి విషయాలను

గ్రహించిన వెంటనే ఆచరించడానికి సిద్ధమయ్యేవారికి అల్లాహ్ మార్గదర్శకత్వం చేస్తాడు. ఇది ఆయన సంప్రదాయం.

సోదరులారా!

ఖుర్ఆన్ పఠనం ప్రతి వ్యక్తికీ అవసరమే. రేయింబవళ్లు ఖుర్ఆన్‌ని అధ్యయనం చేస్తూ, అందులోని ఒక్కొక్క ఆయత్‌పై ఏళ్ళ తరబడి పరిశోధనలు చేసే గొప్ప గొప్ప తత్వవేత్తలు సయితం ఖుర్ఆన్‌ని నిత్యం నిరంతరాయంగా చదవాలనే కోరుకుంటారు, విద్యార్థులకు ఖుర్ఆన్ విద్యగరిపే ఉపాధ్యాయులు కూడా ఇంకా ఇంకా ఖుర్ఆన్‌ని చదవాలనే కోరుకుంటారు. ఇస్లామీయ ఉద్యమంలో పనిచేసే వారైతే ఉద్యమాల అవసరాల కోసం పూర్తిగా ఖుర్ఆన్ పఠనంలోనే లీనమయిపోతారు.

ఖుర్ఆన్ పఠనం ఖుర్ఆన్ ఒక హక్కు, అంతేకాదు దాన్ని సాధ్యమయినంత ఉత్తమ రీతిలో చక్కని ధ్వనితో పఠించవలసిన అవసరం కూడా ఉంది. శ్రావ్యమయిన ధ్వని అంటే ప్రతి వ్యక్తికి ఇష్టమే. మంచి వస్తువులను కోరుకోవడం మానవుని సహజ గుణం. దీన్ని ఇస్లామ్ అణచివేయాలని కోరదు. దీన్ని సరయిన దిశకు మళ్లించాలని తలుస్తుంది. మానవుడు అందమయిన వస్తువుల్ని కోరుకుంటాడు. అందువల్ల ఖుర్ఆన్‌ని అందంగా ముద్రించడానికి వీలయినన్ని ప్రయత్నాలు చేయాలి.

దైవ గ్రంథాన్ని ఇంపయిన ధ్వనితో పఠిస్తే విందామని ప్రతి వ్యక్తీ అనుకుంటాడు. ఇంపయిన ధ్వనితో పఠించడమనేది నిజంగా దైవ ప్రసాదితమే. ప్రతి ఒక్కరికీ ఇంపయిన ధ్వనితో ఖుర్ఆన్‌ని పఠించడం సాధ్యం కాదన్నది నిజమే. అయితే దాని కోసం కృషి చేస్తే అందులో కొంతయినా సఫలీకృతం కాలేకపోము.

"ఖుర్ఆన్"ని మీ (కంఠ) ధ్వనితో అలంకృతం చేయండ"ని మహా ప్రవక్త (సఅసం) హితవు చేశారు. ఖుర్ఆన్‌ని శ్రావ్యంగా చదవని వారిని ఆయన మెచ్చుకోలేదు. మహా ప్రవక్త(సఅసం) ఏదయినా దారిన పోతూవున్నప్పుడు, ఎవరయినా ఒక సహాబి శ్రావ్యమయిన ధ్వనితో ఖుర్ఆన్‌ని పఠిస్తుంటే, అది దైవ ప్రవక్త (సఅసం) చెవిలో పడగానే ఆయన అక్కడే నిల్చొని చాలా సేపటివరకు దాన్ని వినేవారు; ఖుర్ఆన్ పఠించిన ఆ సహాబీని ప్రశంసించేవారు.

దైవప్రవక్త (సఅసం) అప్పుడప్పుడు తనకు ఖుర్ఆన్ పఠించి విన్పించమని కూడా సహాబీలను అడిగేవారు. దానికి సహాబీలు ఆశ్చర్యపోతూ, " దైవ ప్రవక్తా! ఖుర్ఆన్ మీపైనే కదా అవతరిస్తున్నది, ఇక మేము మీకు ఖుర్ఆన్ పఠించి విన్పించడమేమిటి?' అని పలికేవారు. "ఆఁ నిజమే, కాని ఇతరులు పఠిస్తే నాకు వినాలని ఉంది" అని దైవ ప్రవక్త (సఅసం) తన అనుచరులకు బదులిచ్చేవారు. అప్పుడు ఎవరో ఒక సహాబీ

ఖుర్‌ఆన్ పఠించడం ప్రారంభించగానే దైవ ప్రవక్త (సఅసం) దాన్ని ఎంతో ఆసక్తిగా వినేవారు. అలా వింటూ ఆయన ఒక విధమయిన పరిస్థితికి లోనయ్యేవారు. ఒక్కోసారి ఆయన కళ్ళ నుంచి అశ్రువులు ధారాపాతంగా కారిపోయేవి. దైవ ప్రవక్త (సఅసం) ఒక్కోసారి ఒకే ఆయత్‌ని అనేకసార్లు పఠించమని సహాబీలను అడిగేవారు.

ఒకే ఆయత్‌ని అనేకసార్లు పఠించడం వల్ల, అందులోని విషయం మన హృదయాన్ని కదిలించి, మన క్రియా జీవితంపై మంచి ప్రభావాన్ని వేసే అవకాశం ఉంది. అయితే ఈ విషయంలో చాలా జాగ్రత్త వహించాలి. ఖుర్‌ఆన్ ప్రదర్శనా రీతిలో పఠించకూడదు. అంటే వినేవారికి మన పఠనా శైలిలో ప్రదర్శనా బుద్ధి ఉన్నట్లు పఠించకూడదు. సాధారణంగా సంగీతానికి అలవాటుపడినవారు దివ్య ఖుర్‌ఆన్‌ని కూడా అదే పంథాలో పఠించడానికి ప్రయత్నిస్తారు. ఇది మంచి పద్ధతి కాదు. ఎంతో భయభక్తులతో, వినమ్రతతో, ఎలాంటి బిగపట్టింపులకు తావీయకుండా, హద్దులు మీరిన రాగాలకు పోకుండా, శ్రావ్యంగా పఠించేందుకు ప్రయత్నించాలి.

54. ఖుర్ఆన్ పట్ల మన బాధ్యతలు-3

మహాశయులారా!

ఖుర్ఆన్ మానవాళి మార్గదర్శకత్వం కోసం అవతరించిన అంతిమ దైవ గ్రంథమని మనం విశ్వసిస్తున్నాం. అందువల్ల దీన్ని పఠించే ముందు మనం బాహ్య మర్యాదలను కూడా పాటించాల్సి ఉంది. బాహ్య మర్యాదలంటే దీన్ని పఠించడానికి వుజూ చేయాలి. ఖిబ్లా దిశకు అభిముఖంగా కూర్చోవాలి. ఇది సమస్త లోకాలను సృష్టించి నిర్వహిస్తున్న విశ్వప్రభువు నుండి అవతరించిన గ్రంథమని భావిస్తూ ఉండాలి. మన హృదయాల్లో అల్లాహ్ ఔన్నత్యం ఎంతగా చోటు చేసుకుంటుందో అంతే ఔన్నత్యం ఆయన గ్రంథం పట్ల కూడా ఉంటుంది. అప్పుడే ఈ గ్రంథం నుంచి బోధనలను, ఆజ్ఞలను గ్రహించాలన్న ఉద్దేశ్యంతో చదవగలం. అలాంటప్పుడే చెడులకు దూరంగా ఉండాలన్న భావన మనలో జనిస్తుంది. మన ఇష్టాయిష్టాలను వదలి ఈ గ్రంథం ఆదేశించే విషయాలను అవలంబించాలని, ఇది నిరోధించే విషయాల జోలికి పోకూడదని కూడా అప్పుడే మనం అనుకుంటాం.

కొందరు ముందే కొన్ని భావాలను ఏర్పరచుకుంటారు. వారు ఖుర్ఆన్ పఠించడానికి సిద్ధమయినప్పుడు తమ భావాలను సమర్థించుకోవడానికి పనికొచ్చే ఆయత్లను వెతుకుతారు. వారు ఖుర్ఆన్ నుంచి మంచిని గ్రహించడానికి ప్రయత్నించరు. పైగా ఈ వైఖరి వల్ల వారు మరింత మార్గభ్రష్టులయ్యే ప్రమాదమే ఉంటుంది. ఖుర్ఆన్ పఠనాన్ని అరబీలో తిలావత్ అంటారని లోగడ చెప్పాను. తిలావత్ అంటే వెనకాల నడవడం లేక అనుసరించడం అని అర్థం కూడా ఉంది. కాబట్టి ఖుర్ఆన్ వెనకాల నడవాల్సి ఉందని భావించి ఈ గ్రంథాన్ని పఠించాలి. అంతేగాని, దాన్ని మన సొంత అభిప్రాయాలకు అనుగుణంగా మార్చుకోవడానికి, మనకు నచ్చిన సిద్ధాంతాలు, భావాల కోసం ఖుర్ఆన్ నుంచి ఆధారాలు తీయడానికి ప్రయత్నించకూడదు.

సోదరులారా!

ఖుర్ఆన్ నమాజ్లో పఠించడం అన్నింటికంటే మంచి పద్ధతి. ప్రత్యేకంగా తహజ్జుద్ నమాజ్లో దేవుని ముందు చేతులు కట్టుకొని నిల్చొని ఎంతో నిశ్చింతగా, ప్రశాంత హృదయంతో నెమ్మదిగా ఆగి ఆగి పఠించాలి. ఖుర్ఆన్ని నెమ్మదిగా ఆగి ఆగి పఠించడం వల్ల అందులోని విషయాలు హృదయానికి హత్తుకొని పోతాయి. ధర్మ సంస్థాపన కోసం దైవమార్గంలో కష్టాలను ఎదుర్కోవలసి వచ్చినప్పుడు ఇలాంటి పఠనం వల్ల మనశ్శాంతి లభిస్తుంది.

ఖుర్‌ఆన్‌ని ఆగి ఆగి పఠించడం వల్ల ఎక్కువ సూరాలను, ఆయత్‌లను కంఠస్థం కూడా చేయగలం. పూర్వ కాలంలో సాధారణంగా చాలా మంది ఖుర్‌ఆన్ కంఠస్థం పట్ల ఎంతో ఉత్సాహం చూపేవారు. దురదృష్టవశాత్తు ఇప్పుడా ఉత్సాహం ముస్లిమ్‌లలో కనిపించడం లేదు. పేదలు, మధ్య తరగతి ముస్లిమ్‌లలో మాత్రం కొందరు దీన్ని ఒక వృత్తిగా అవలంబించారు. ధనికులలో ఖుర్‌ఆన్‌ని కంఠస్థం చేయాలన్న ధ్యాసే లేదు. పూర్వం ధనికులు, గొప్పింటి వాళ్ళలోనే ఖుర్‌ఆన్ కంఠస్థం పట్ల ఎక్కువ ఆసక్తి ఉండేది.

1400 సంవత్సరాలు గడిచినా ఖుర్‌ఆన్ తన అసలు స్వరూపంలో భద్రంగా ఉంది. దీనికి ఒక కారణం ఖుర్‌ఆన్ కంఠోపాఠమే. ఏమయినప్పటికీ ప్రతి ముస్లిమ్ వీలయినంత ఎక్కువ భాగం ఖుర్‌ఆన్‌ని కంఠస్థం చేయడం చాలా అవసరం. అదీగాక ఖుర్‌ఆన్‌ని ఆగి ఆగి నెమ్మదిగా పఠించాలి. ఈ రోజుల్లో ఆగి ఆగి నెమ్మదిగా పఠించే విధానం కూడా దాదాపు అంతరించిపోయింది. పెద్ద పెద్ద పండితులు, భక్తి పరాయణులు కూడా ఖుర్‌ఆన్ కున్న ఈ హక్కును నెరవేర్చడం లేదు. ఇక హాఫీజ్‌ల సంగతయితే చెప్పనవసరం లేదు. ఎంతో వడిగా చదువుతారు. అరబీ భాష ఎంత బాగా వచ్చినవాళ్ళయినా సరే ఈ హాఫీజ్ లు పఠించే ఖుర్‌ఆన్ ఆయత్‌లను ఏ మాత్రం అర్థం చేసుకోలేరు. రాకెట్ వేగంతో పఠించే మహానుభావులు కూడా ఉన్నారు. సాధారణ నమాజీలలో కూడా అనేక మంది సూరాలను చకచకా చదువుతారు. కొందరి పఠనా వేగం గమనిస్తే, తాము నమాజు ముగించుకొని ఎప్పుడు బయట పడదామా అన్నట్లు ఉంటుంది. ఈ ధోరణికి మనమంతా వెంటనే స్వస్తి చెప్పాలి.

సోదరులారా!

ఖుర్‌ఆన్‌కున్న మరొక హక్కు ఏమిటంటే దాన్ని తోటి మానవులకు బోధించాలి. ప్రజలకు ఖుర్‌ఆన్‌ని అర్థం చేసుకోవడానికి, దాని ప్రకారం తమ జీవితాలను మలచుకోవడానికే ఈ గ్రంథం అవతరించింది. ఖుర్‌ఆన్ వాక్యాలను కేవలం ఉచ్చరించడం నిరక్షరాస్యులకయితే ధర్మ సమ్మతం కావచ్చు. కాని చదవను, వ్రాయను వచ్చినవారు మాత్రం ఖుర్‌ఆన్ పఠనంతో పాటు దాన్ని అర్థం చేసుకోవడానిక్కూడా ప్రయత్నించాలి. కొందరు ప్రాపంచిక విద్యను ఆర్జించడానికి తమ యావజ్జీవితాన్ని వెచ్చిస్తారు! ఇతర భాషలను నేర్చుకోవడానికి, వాటిలో పెద్ద పెద్ద డిగ్రీలు పొందడానికి ఎంత శ్రమయినా పడతారు, ఎన్ని కష్టాలయినా సహిస్తారు. కాని ఖుర్‌ఆన్‌ని అర్థం చేసుకోవడానికి, అరబీ భాష నేర్చుకోవడానికి మాత్రం ప్రయత్నించరు. ఇలాంటి వారు రేపు దేవుని దగ్గర ఏం సమాధానం ఇచ్చుకుంటారు? చదువుకున్నవారికి అరబీ భాషలో కొద్ది ప్రావీణ్యం సంపాదించడం పెద్ద కష్టమయిన పనేమీ కాదు. దాని వల్ల ఖుర్‌ఆన్‌ని కొంత మేరకయినా

తెలిగ్గా అర్థం చేసుకోవచ్చు. ఒకవేళ అదీసాధ్యం కాకపోతే ఉర్దూ, ఇంగ్లీషు,తెలుగు భాషల్లో ఖుర్‌ఆన్ అనువాదాన్ని, వ్యాఖ్యానాన్ని చదివి అర్థం చేసుకోవచ్చు. ఇందులో కష్టపడాల్సిన పనేమీ లేదు.

ప్రజలు ఖుర్‌ఆన్ చదవకపోవడానికి కారణం దాని పట్ల వారికి ఆసక్తి లేకపోవడమే. ఖుర్‌ఆన్ దైవ గ్రంథమని విశ్వసిస్తూ కూడా దాని పట్ల ఆసక్తి లేకపోవడం ఎంతో శోచనీయం. ఈ నిరాసక్తత, నిర్లిప్తతలు మనిషికి బద్ధ శత్రువులు. ఈ వాస్తవాన్ని గ్రహించి వీటిని వెంటనే తరిమివేయకపోతే చనిపోయే వరకూ ఇవి మనల్ని వెన్నంటే ఉంటాయి. చనిపోయాకగాని అవి తెచ్చిపెట్టిన కీడేమిటో మనకు తెలిసిరాదు. కాని అప్పుడు తెలుసుకొని చేసేదేమీ ఉండదు, వాటి దుష్ఫలం అనుభవించడం తప్ప. కాబట్టి సోదరులారా! మేల్కోండి. నిరాసక్తత, నిర్లిప్తత, సోమరితనాలను తరిమివేయండి. ఖుర్‌ఆన్‌పై నిజంగా విశ్వాసముంటే దాన్ని చదవడానికి ప్రయత్నించండి.

సామాన్య ప్రజానీకానికి మొత్తం ఖుర్‌ఆన్‌ని మథించి అర్థం చేసుకోవడం కష్టమే. అందులో సందేహం లేదు. పెద్ద పెద్ద పండితులు కూడా మొత్తం ఖుర్‌ఆన్‌ని అర్థం చేసుకున్నామని చెప్పలేరు. కాని అల్లాహ్ ఎవరికి ఎంత సామర్థ్యం ప్రసాదించాడో ఆ మేరకయినా ఖుర్‌ఆన్‌ని చదివి అర్థం చేసుకోవడం వారి విధి. ఇందులో పెద్ద కష్టమేమీ లేదు. అయితే దీనికి కావలసిందల్లా ఒక్కటే. ఖుర్‌ఆన్ పట్ల ఆసక్తి, అది మన జీవన్మరణాలకు సంబంధించిన దైవ గ్రంథమన్న అచంచల విశ్వాసం. అందువల్ల దీని కోసం ప్రత్యేకంగా రోజూ కొంత సమయం కేటాయించుకొని క్రమం తప్పకుండా చదవాలి. ఖుర్‌ఆన్ మన జీవన మార్గదర్శి, ఈ మార్గదర్శికి దూరంగా మసలుకుంటే ధర్మానికి దూరమయినట్లే. అప్పుడు ఖుర్‌ఆన్ మీద మన విశ్వాసం నీటి మీద రాతగా మాత్రమే అవుతుంది. ఇలాంటి విశ్వాసంతో మనం ప్రపంచంలోనయితే ముస్లిమ్‌లుగా చెలామణి కాగలం. కాని పరలోకంలో మన పేరు ముస్లిమ్‌ల జాబితాల్లో ఉండదు.

సోదరులారా!

నిరక్షరాస్యులుగా జీవిస్తూ, నిరక్షరాస్యులుగానే వృద్ధులయి కాటికి కాళ్ళు చాచిన వృద్ధుల స్థితి విచారకరమే. పోతే చదవను, రాయను నేర్చుకోకుండానే పెరిగి పెద్దవారై, సంసార సాగరంలో మునిగిపోయి, ఇక చదువుకోడానికి ఏమాత్రం అవకాశం లేనివాడు ఏం చెయ్యాలి? అని మీరడగవచ్చు. అలాంటి వారు తమకు దొరికే తీరిక సమయాల్లో కనీసం పారాయణం కోసమయినా కొంత అరబీ అక్షర జ్ఞానాన్ని సంపాదించుకోవాలి. ఆ తరువాత ఖుర్‌ఆన్ విషయాలు అర్థం కాకపోయినా పుణ్యార్జన ఉద్దేశ్యంతో ప్రతి రోజు వీలయినంత మేరకు పారాయణం చేస్తుండాలి. దీంతోపాటు

వారు మరికొంత సమయాన్ని తీసి చదువుకున్నవాళ్ళ ద్వారా ఖుర్ఆన్ భావాన్ని, వ్యాఖ్యానాన్ని వినడానికి ప్రయత్నించాలి. ఇలాంటివారికి వారు గ్రహించగలిగే భాషలో ఖుర్ఆన్ విషయాలను వినిపించే ఏర్పాటు జరగాలి. ప్రస్తుతం మన సమాజంలో ఇది చాలా అవసరం.

కొందరు జీవన భృతి కోసమయితే ఎంత కష్టపడయినా సరే చదివి బి.ఎ., ఎం.ఏ., డిగ్రీలు పొందుతారు. కాని పరలోక సాఫల్యం కోసం మాత్రం ధార్మిక విద్య నేర్చుకోవడానికి ప్రయత్నించరు. వారు తమ చదువులకు తగిన ఉద్యోగాలు లభించినా వాటితో తృప్తి చెందరు. వాటికంటే పెద్ద ఉద్యోగాలు చేసి ఎక్కువ డబ్బు సంపాదించడానికి ఉన్నత చదువులు చదువుతారు. ప్రమోషన్ల కోసం ప్రత్యేక పరీక్షలు రాస్తారు, డబ్బు, హోదా, అంతస్తుల వ్యామోహంలోపడినవారికి ఖుర్ఆన్‌ను నేర్చుకోవాలన్న ఆసక్తి ఎలా కలుగుతుంది? ఆసక్తి కలిగినా తీరిక ఎలా దొరుకుతుంది?

అసలు విషయం ఏమిటంటే ప్రాపంచిక జీవితంపై పరలోక జీవితానికి ప్రాధ్యాన్యత నివ్వనంతవరకు మనం ఖుర్ఆన్ విద్యను నేర్చుకోవడానికి ప్రయత్నించం. పరలోక జీవితానికి ప్రాధాన్యత ఇవ్వడానికైనా ఖుర్ఆన్ విషయాలు తెలుసుకోవడం అవసరం. అల్లాహ్, ఆయన పట్ల విశ్వాసమే గనక ఉంటే, ఏ విధంగా చూసినా మనం ఖుర్ఆన్ విద్య నేర్చుకోక తప్పదు. ఖుర్ఆన్ నేర్చుకోకపోవడానికి ఇక్కడ ఎన్నిసాకులు చెప్పినా అవి తీర్పు దినాన దేవుని ముందు మనకు ఏ మాత్రం ఉపయోగపడవు. అందువల్ల ప్రతి ముస్లిమ్ ఎలాగయినాసరే కొంత సమయం తీసి ఖుర్ఆన్ నేర్చుకోవడానికి ప్రయత్నించాలి.

ఆసక్తి ఉంటే సాధించలేని కార్యం లేదు, దైవ ధర్మం పట్ల ఆసక్తి ఉన్నవారు దైవ గ్రంథాన్ని నేర్చుకోవడానికి తప్పకుండా కృషి చేస్తారు. ఈ బాధ్యతను విస్మరించడం అంటే తమపై తాము జులుం చేసుకోవడమే. అల్లాహ్ మనందరినీ ప్రాపంచిక వ్యామోహం నుండి, ఆత్మవంచనా వైఖరి నుండి కాపాడి ఖుర్ఆన్ నేర్చుకునే, అర్థం చేసుకునే, ఆచరించే భాగ్యం కలిగించుగాక!

55. మహాప్రవక్త వ్యక్తిత్వం మానవాళికి వరప్రసాదం

మహాశయులారా!

మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను దైవం యావత్ప్రపంచానికే కారుణ్యా మూర్తిగా చేసి పంపాడు. మహాప్రవక్త రాక నిజంగానే మానవాళి పాలిట గొప్ప భాగ్యమని మనమంతా విశ్వసిస్తున్నాం. ఇలాంటి మహాప్రసాదానికి నోచుకోని వారు దేవుని సమస్త అనుగ్రహాలకూ దూరమైనట్లే. ఆ మహనీయుని రాక ధర్మం రీత్యానే గాకుండా ప్రపంచ రీత్యా కూడా మానవులకు ఎంతో ప్రయోజనం చేకూర్చింది. దేవునికి, దాసునికి మధ్య ఉండవలసిన బాంధవ్యం ఏమిటో మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)యే మనకు తెలియజేశారు. దేవుడు మానవుణ్ణి ఎందుకు సృష్టించాడు? మానవుని పట్ల దేవుని బాధ్యతలేమిటి? మన జీవితం యొక్క పర్యవసానం ఏమిటి? పరలోక జీవితంలో మనం ఎలా కృతార్థులమవుతాము? మొదలయిన విషయాలు కూడా ఆయన ద్వారానే మనకు తెలిసాయి.

ఈ విషయాలన్నీ తెలుసుకోకపోతే మన జీవితమే నిరర్థకమవుతుంది. విశ్వకారుణ్యమూర్తి అయిన ఆ మహాత్ముని బోధనలకు నోచుకోని వారు, వాటిని ఆచరించని వారు ఎలాంటి సమస్యలతో సతమతమవుతున్నారో ఈనాడు కూడా మనం చూస్తున్నాం. దేవుని ఏకత్వం ఏమిటో తెలియకపోవడం వల్ల వీరు దైవాన్ని వదలి ఇతరుల ముందు తల వంచుతున్నారు, వాటిపై ఆశలు పెట్టుకున్నారు. వాటి ముందు చేతులు చాపి సహాయం అర్థిస్తున్నారు. వాస్తవానికి అల్లాహ్ అధీనంలోనే అన్నీ ఉన్నాయి. ఆయన ఒకరికి ఏదయినా ఇవ్వదలచుకుంటే ఎవరూ నిరోధించలేరు, ఇవ్వదలచుకోకపోతే ఎవరూ ఇప్పించలేరు.

సోదరులారా!

ఈ విధంగా మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ప్రజల విశ్వాసాలను సంస్కరించారు. వారికి దేవుని ఏకత్వం ఏమిటో వివరించారు. వారిని అన్ని విధాల దాస్యం నుండి విముక్తం చేసి ఒక్క అల్లాహ్‌కు మాత్రమే దాసులుగా ఉండేలా చేశారు. అల్లాహ్ మాత్రమే వారి ప్రభువు, పాలకుడని బోధించారు. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ద్వారా మానవాళికి లభించిన ఈ కారుణ్యం ఎంత విలువయిందంటే దానికి ఏ మానవమాత్రుడు విలువ కట్టలేడు. ఈ కారుణ్యం విలువ గుర్తించకపోవడం వల్లనే ప్రపంచ మానవాళి అశాంతితో సతమతమవుతోంది.

ఇక ఆరాధనల విషయంలో మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) మానవులకు ఎలా మార్గదర్శకత్వం చేశారో చూడండి. అసలు ఆయనే కదా మానవులకు సరైన దైవారాధన ఏమిటో తెలిపింది. రోజుకు అయిదుసార్లు మనిషిని దైవానికి సన్నిహితం చేసే నమాజ్‌ను ఆయనే మనకు నేర్పారు. నమాజ్ ఎలాంటి ఆరాధన అంటే దాన్ని సరైన పద్ధతి ప్రకారం చేస్తే అది దాసుణ్ణి దైవ సాన్నిహిత్యమనే అత్యున్నత స్థానానికి గొనిపోతుంది. అంతే కాదు, ఈ నమాజ్ మనిషిని అన్ని విధాల చెడులకు దూరంగా ఉంచగలుగుతుంది.

ఇవి నమాజ్‌కు సంబంధించిన ఉదాహరణలు మాత్రమే. కాస్త లోతుకుపోయి చూస్తే అంతిమ దైవ ప్రవక్త (సఅసం) రాక ధర్మం రీత్యా మానవాళి పాలిట ఎంత గొప్ప వరప్రసాదమో తెలుస్తుంది. మానవులు ఒకవేళ ఇలాంటి కారుణ్యానికి నోచుకోకపోయి ఉండినట్లయితే మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ప్రభవించక ముందు ప్రజలు అంధ విశ్వాసాలు, దురాచారాలలో ఎలా మునిగి ఉండేవారో అలాగే మునికి ఉండేవారు. ఈనాడు కూడా ఈ కారుణ్యానికి నోచుకోని వారు అంధ విశ్వాసాలు, దురాచారాలలో పడి కొట్టుమిట్టాడుతున్నారు. రాళ్ళను, చెట్లను, నదులను పూజిస్తున్నారు; విగ్రహాలను వేడుకుంటున్నారు. చివరికి పశువుల్ని, పక్షుల్ని కూడా ఆరాధిస్తున్నారు; నిజ దైవాన్ని వదలి లక్షలాది మిథ్యా దేవుళ్ళ దాస్యంలో చిక్కుకున్నారు. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) బోధనలను కాదని కొందరు ప్రతి దైవేతరుని దాస్యానికి తలఒగ్గితే, మరి కొందరు మనోవాంఛలకు బానిసలై విశృంఖల జీవితం గడుపుతున్నారు.

సోదరులారా!

మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) పరలోక రీత్యానే గాకుండా ఇహలోక రీత్యా కూడా మానవాళి పాలిట కారుణ్యమూర్తిగా ప్రభవించారు. జీవితంలో నిజమైన శాంతి సుఖాలు ప్రసాదించగల మధ్యేమార్గాన్ని ఆయనే మానవులకు చూపించారు. ఒక మనిషి పట్ల మరో మనిషి ఎలా ప్రవర్తించాలి? సామూహిక వ్యవహారాల్లో ఒకరి హక్కులను మరొకరు ఎలా గౌరవించాలి? పాలకులకు, పాలితులకు మధ్య ఎలాంటి సంబంధాలు ఉండాలి, పేదవారి పట్ల ధనికుల బాధ్యతలేమిటి? మొదలైన విషయాలు ఆయనే మనకు తెలిపారు. ఆయనే వడ్డీ వ్యవస్థను నిషేధించారు. ఎందుకంటే దీనివల్ల పేదలు మరింత పేదవాళ్ళయిపోతున్నారు. ధనికులు మరింత ధనికులై పోతున్నారు. సమాజంలో ఆర్థిక న్యాయానికి ఈ వడ్డీ వ్యవస్థే పెద్ద ముప్పుగా తయారైంది. అందుకే దైవ ప్రవక్త (సఅసం) దీన్ని పూర్తిగా నిర్మూలించారు. నిజాయితీతో కూడిన వ్యాపార విధానాలను కూడా ఆయనే మనకు నేర్పారు. ఒకరికి నష్టాన్ని, మరొకరికి లాభాన్ని కలగజేసే అమ్మకం కొనుగోలు పద్ధతుల్ని కూడా ఆయనే నిషేధించారు.

హద్దులు మీరిన విలాసం, భోగలాలసత్వం సంఘంలో అనేక నైతిక రుగ్మతలకు జననమిస్తాయి. ఇలాంటి చెడుల ద్వారాలను శాశ్వతంగా మూయించిన మహాపురుషుడు మన ప్రియ ప్రవక్తే (సఅసం). తల్లిదండ్రుల పట్ల ఎలా మసలుకోవాలో, బంధుమిత్రుల పట్ల ఎలా ప్రవర్తించాలో, వారి హక్కులేమిటో ఆయనే మానవులకు నేర్పారు. మానవుల్ని పరస్పరం కలిపే మార్గాలు, బాధ్యతా భావం, పవిత్రత, సద్వర్తనం, నిజాయితీ, పరోపకారం, ఔదార్యం, సచ్ఛీలత - ఒకటేమిటి మానవులు మానవులుగా మనుగడ సాగించడానికి కావలసిన మంచి విషయాలన్నీ అంతిమ దైవ ప్రవక్తే (సఅసం) ప్రపంచానికి నేర్పారు.

మనిషి ధన మాన ప్రాణాల రక్షణ కోసం ఆయన చేసిన ఏర్పాట్లు అపూర్వమయినవి. అలాంటి ఏర్పాట్లు మరే జీవిత విధానాల్లోనూ కానరావు, మానవుని ప్రాణ రక్షణ కోసం ఆయన సూచించిన షరీఅత్‌లో హత్యకు మరణదండనే శిక్ష అన్న సంగతి మీకు తెలిసిందే. అలాగే ధన రక్షణ కోసం షరీఅత్‌లో దొంగకు హస్త ఖండన శిక్ష ఉంది. వ్యభిచార నిందమోపిన వారికి ఎనభై కొరడా దెబ్బల శిక్ష ఉంది. వ్యభిచారానికి మరణ శిక్ష ఉంది. కాస్త జాగ్రత్తగా, న్యాయ దృష్టితో చూస్తే అంతిమ దైవ సందేశహరుని (సఅసం) బోధనలు మానవాళి పాలిట ఎంత గొప్ప కారుణ్యమో ప్రతి వ్యక్తీ గ్రహించగలడు.

అంతేకాదు మానవుల వ్యక్తిగత సామూహిక సంక్షేమం కోసం ఆయన కొన్ని నియమాలను, సూత్రాలను కూడా సూచించారు. ఇంచుమించు ఇలాంటి సూత్రాలనే ఏదో ఒక మేరకు ఈనాడు కొందరు ముస్లిమేతర తాత్వికులు, సంస్కర్తలు కూడా రూపొందించుకున్నారు. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఈ సూత్రాలను, నియమాలను కేవలం సూచించడమే కాదు, వాటిని అమలుపరచి కూడా చూపించారు. పైగా ఆయన ఈ విషయంలో తన అనుచర సమాజంపై ఓ మహత్తర బాధ్యతను ఉంచారు. ప్రపంచంలోని ఉపద్రవాలను నిర్మూలించడానికి ప్రజలను దైవారాధన వైపునకు మరలించడానికి, దైవ ధర్మాన్ని స్థాపించడానికి నిరంతరం కృషి చేయడమే ముస్లిమ్ సమాజంపై ఆయన మోపిన బాధ్యత. ఆ మహనీయుని బోధనల కారణంగానే ముస్లిమ్ సమాజం ధర్మ సంస్థాపన మార్గంలో నిరంతర కృషి సాగించే బాధ్యతను స్వీకరించింది. దైవ మార్గంలో ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా ఖాతరు చేయకుండా వారు తమ ధన ప్రాణాలను సైతం త్యజించడానికి వెనుదీయడం లేదంటే ప్రవక్త బోధనలే కారణం. అలా చేయడం ద్వారానే తాము దైవ ప్రసన్నతకు అర్హులవుతామని, లేకపోతే దైవాగ్రహానికి గురికావలసి వస్తుందని వారికి తెలుసు.

మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) వ్యక్తిత్వం ప్రళయం వరకూ యావత్ప్రపంచానికీ కారుణ్య ప్రదాయిని. ప్రవక్త వ్యక్తిత్వం మానవాళికి కారుణ్య ప్రదాయిని ఎలా అయిందో ప్రపంచానికి చాటి చెప్పవలసిన బాధ్యత ఇప్పుడు ముస్లిమ్ సమాజంపై ఉంది. దైవప్రవక్త (సఅసం)ను విశ్వసించామని, ఆయన పట్ల అపార ప్రేమాభిమానాలున్నాయని చెప్పుకునే ముస్లిమ్‌లు ఆయన వ్యక్తిత్వం నిజంగానే కారుణ్య ప్రదాయిని అని తమ మాటల ద్వారానే కాకుండా చేతల ద్వారా కూడా నిరూపించాలి.

సోదరులారా!

దైవం పట్ల మీ సంబంధాన్ని పటిష్టవంతం చేసుకోండి. మీ నిజ స్థానం ఏమిటో గుర్తుకు తెచ్చుకోండి. అల్లాహ్ మనల్ని లక్ష్యరహిత జీవితం గడపడానికి పుట్టించలేదు, అసలు లక్ష్యాన్ని విస్మరించి మన ఇష్టమొచ్చిన విధంగా ఇక్కడ గడిపినా చివరికి మనమంతా ఆయన సన్నిధికే పోవలసి ఉంది. ఆయన ముందు మనం చేసిన ఒక్కొక్క పనిని గురించి చెప్పుకోవలసి ఉంటుంది. అక్కడ యావత్ మానవుల ముందు జరిగే పరాభవానికి, భయంకర శిక్షలకు గురి కాకుండా ఉండాలంటే మహాప్రవక్త (సఅసం) బోధనలకు అనుగుణంగా జీవిస్తూ వాటి స్థాపనకై కృషి సాగించడమే విజ్ఞుల పని.

56. భయం - దాని నివారణోపాయం

మహాశయులారా!

ముస్లిమ్‌లు అయిన దృష్ట్యా మన బాధ్యతలు ఏమిటి? ఏ పని చేయాలి? ఏ పని చేయకూడదు? అని స్పష్టంగా తెలిసినప్పటికి చాలా మంది దైవ ధర్మాన్ని అనుసరించరు. వారి అంతరంగాలు ఇదే నిజమయిన ధర్మపథం అని చెబుతున్నా ఆ బాటపై నడవడానికి ముందుకురారు. దీనికి ముఖ్యకారణం వారిని ఆవహించిన భయమే.

ఈ భయం రెండు విధాలుగా ఉంది. ఒకటి ఆర్థిక భయం. రెండోది ప్రాణభయం. చేయవలసిన పని మాత్రం ఇదేనని మనిషి ఒప్పుకుంటాడు. కాని అతని హృదయంలో దాగి ఉన్న షైతాన్ ఈ పనికి అడ్డుచెబుతూ, 'నువ్వీ పని గనక చేస్తే నీ వ్యాపారం మందగించి పోతుంది; నువ్వు నష్టంలో పడిపోతావు; నీకు మరో సంపాదన మార్గం దొరకదు; నీ వృద్ధి వికాసాలు ఆగిపోతాయి; నువ్వు ఆర్థిక సమస్యల్లో చిక్కుకు పోతావు' అని భయపెడతాడు. ప్రాణభయం ఇంతకంటే ప్రమాదకరమయింది. ఇక్కడ కూడా షైతాన్ అతనికి అడ్డుతగులుతూ, ' ఈ మార్గం చాలా ప్రమాదంతో కూడుకున్నది; దీనిపై నడిస్తే నీ బంధుమిత్రులు నీకు దూరమయిపోతారు. సమాజం నీకు విరోధి అయిపోతుంది. చివరికి ప్రభుత్వం కూడా నీపై నిఘా వేసి ఉంచుతుంది. నువ్వు ఎప్పుడు జైలు పాలవుతావో, నీ ప్రాణానికి మరే ఆపద ముంచుకొస్తుందో తెలియదు. జాగ్రత్త' అని భయపెడతాడు.

సోదరులారా!

ఈ రెండు మానవ బలహీనతలే మనిషిని ఎల్లప్పుడూ దైవ మార్గం నుండి నిరోధిస్తుంటాయి. ఇస్లామ్ వీటిని కూకటి వ్రేళ్ళతో సహా పెకలించి వేయదలిచింది. అది మానవుడ్ని ఏకైక దైవాన్ని విశ్వసించమని ఆదేశిస్తుంది. దేవుడు అన్ని విధాలా శక్తిమంతుడని, ఆయన అభిమతం లేకుండా ఈ విశ్వంలో ఒక్క ఆకయినా కదలదని ఇస్లామ్ తెలుపుతోంది. ఇంకా ఇస్లామ్ ప్రకారం మానవుల మరణం, ఉపాధి దేవుని చేతిలోనే ఉన్నాయి, ఆయనే అందరికి ఉపాధినిస్తున్నాడు. ఆయన ఇవ్వదలచుకుంటే ఎవరూ ఆయనకు అడ్డుపడలేరు. ఇవ్వదలచుకోకపోతే ఆయన్నుండి ఇప్పించే శక్తి కూడా ఎవరికీ లేదు. ఈ విశ్వాసాన్నే ఇస్లామ్ ముస్లిమ్ హృదయంలో దృఢంగా నాటుతుంది. ఈ విషయం పట్ల మనిషికి దృఢమయిన విశ్వాసం ఉంటే దైవానికే కాకుండా ఇతరులక్కూడా ఉపాధినిచ్చే శక్తి ఉంటుందన్న ఆలోచన అణుమాత్రమయినా రాదు.

లాభమయినా, నష్టమయినా అన్నీ అల్లాహ్ చేతిలోనే ఉన్నాయి. అన్ని వ్యవహారాల అంతిమ నిర్ణయం ఆయన అధీనంలోనే ఉంది. ఎవరయినా మనపై దయదల్చినట్లు పైకి కనిపించవచ్చు. అలాగే మన వ్యాపారం అభివృద్ధి చెందినట్టు, మన పొలాల్లో మంచి పంటలు పండినట్టు పైకి అగుపించవచ్చు. కాని వీటన్నిటికి బాహ్య కారణాలు ఎన్ని ఉన్నా అసలు కారకుడు మాత్రం దేవుడే. ఆయనే మానవులందరికీ ఉపాధినిస్తున్నాడు. వీటికి బాహ్య కారణాలు కూడా ఆయన అభిమతం, పథకాల మూలంగానే ఒనగూడుతున్నాయి. ఇలాంటి విశ్వాసమే మానవునికి ఉండాలని ఇస్లామ్ అంటోంది.

సోదరులారా!

మనమంతా ఇస్లామ్‌ను విశ్వసించామని గొప్పగా చెప్పుకుంటున్నాం. కాని మన విశ్వాసం ఎంతో బలహీనంగా ఉంది. విశ్వాసం యొక్క ఈ బలహీనత కారణంగానే ఈనాడు మనం రకరకాల చెడులకు లోనయిపోతున్నాం. దైవ ధర్మంలోని అనేక ఆదేశాలను మనం గాలికి వదిలేసి కూర్చున్నాం. ఉపాధి విషయంలో దేవునిపై మనకుండవలసిన విశ్వాసం క్రమంగా సన్నగిల్లిపోతోంది. ఫలితంగా దేవునిపై ఆధారపడ టానికి బదులుగా మనం ఉపాధి యొక్క బాహ్య కారణాలపై ఆధారపడుతున్నాం.

ఇక్కడ ఒక విషయాన్ని బాగా అర్థం చేసుకోవాలి. ఉపాధికి కావలసిన బాహ్య కారణాల కోసం కృషి చేయకుండా దాన్ని దేవుడే మన దగ్గరికి నేరుగా తెస్తాడని భావించి చేతులు ముడుచుకొని కూర్చోకూడదు. ఈ వైఖరిని ఇస్లామ్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. దేవుడే మన పోషకుడు, సర్వాధికారి, శక్తిశాలి అని దృఢంగా విశ్వసిస్తూ ఆయన ధర్మానికి వ్యతిరేకంకాని విధంగా ఉపాధి కోసం కృషి చేయాలని ఇస్లామ్ బోధిస్తోంది. నిజానికి దైవ ధర్మాన్ని అనుసరించినప్పుడే మనకు దైవ ప్రసన్నత లభిస్తుంది. దేవుని ఇష్టాయిష్టాలను ఖాతరు చేయకుండా ఇతరుల ఇష్టాయిష్టాలకు ప్రాధాన్యం ఇవ్వడం మన మౌలిక విశ్వాసానికి వ్యతిరేకం.

ఈ విషయంలో మహాప్రవక్త (సఅసం) ఓ మంచి ఉదాహరణను పేర్కొన్నారు. "ఒక వ్యక్తి ధార్మికుడిగా ఉన్న స్థితిలో ఇంటినుండి బయలుదేరుతాడు. తరువాత అతను ఒక వ్యక్తిని కలుసుకుంటాడు. ఆ వ్యక్తితో అతనికేదో అవసరం ఉంటుంది. (ఆ పనికోసం) అతను మీరు ఇలాంటివారు, అలాంటివారు అని ఆ వ్యక్తిని తెగపొగుడుతాడు. ఇదంతా తన అవసరం నెరవేరవచ్చన్న ఆశతోనే చేస్తాడు. ఈ చర్య వల్ల అతనిపై దేవునికి అయిష్టత ఏర్పడుతుంది. ఇప్పుడతను తన ధర్మం తన దగ్గర లేని స్థితిలో వాపసు వెళతాడు" అని ప్రవచించారు దైవ ప్రవక్త (సఅసం).

ప్రజలను సంతోషపెట్టడానికి దైవానికి అయిష్టత కలిగే చర్యలకు పాల్పడటం,

దైవం ఇతరులకు ప్రసాదించిన సంపదను చూసి అసూయపడటం విశ్వాస బలహీనతకు నిదర్శనమని మన ప్రియ ప్రవక్త (సఅసం) తెలిపారు. అసూయపడే మనిషి అసూయ వల్ల అతని ఉపాధి వృద్ధి గావడంగాని, ఒకరి అయిష్టత కారణంగా మరొకరి ఉపాధి క్షీణించడంగానీ జరగదని కూడా ఆయన స్పష్టం చేశారు.

ఇక రెండో రకమయిన ప్రాణ భయాన్ని తీసుకుందాం. ఈ భయం వల్ల మనిషి దైవాజ్ఞలు తెలిసి కూడా వాటిని అనుసరించడానికి వెనుకంజవేస్తాడు. ఈ భయాన్ని పోగొట్టడానికి ఇస్లామ్, జీవన్మరణాలు కేవలం దేవుని చేతిలో మాత్రమే ఉన్నాయన్న విశ్వాసాన్ని మనిషికి నూరిపోస్తోంది. చావు నిర్ణీత కాలంలోనే వస్తుందని, దాన్ని ఒక నిమిషం ముందుగాని, వెనుకగాని ఎవరూ చేయలేరని ఇస్లామ్ పేర్కొంటుంది. దైవాజ్ఞ ప్రకారం ఎవరికయినా మరణం సమీపిస్తే దాన్ని ఎంత గొప్ప శక్తి కూడా ఆపజాలదు.

దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా తెలుపుతున్నాడు:

" ఓ (ప్రవక్తా!) వారితో చెప్పెయ్యి- మీరు మీ ఇళ్ళలో ఉన్నా ఎవరికయితే చావు వ్రాయబడి ఉందో వారు స్వయంగా తమ వధ్య స్థలాల వైపునకు బయలుదేరి వస్తారు".

"వారికి మరణ కాలం సమీపించినప్పుడు, అది ఒక్క ఘడియ వెనక్కుగాని, ముందుకుగాని జరగదు."

మనిషిలో ఉన్న పెద్ద బలహీనత ఈ ప్రాణభయమే. ఈ భయమే గనక మనస్సు నుండి తొలగిపోయి దాని స్థానంలో దైవాజ్ఞ ప్రకారమే మరణం వస్తుందన్న విశ్వాసం దృఢంగా చోటు చేసుకుంటే మనిషి గొప్ప విజయానికి చేరువయినట్లే, అందుకే దైవ మార్గంలో కృషి చేస్తూ లేదా దైవాదేశాల ప్రకారం నడుచుకుంటూ ఆ మార్గంలో ప్రాణాలు అర్పించినవాళ్ళను ఇస్లామ్ మృతులని అనవద్దని చెబుతోంది. వీళ్ళను సజీవులు గానే భావించమని బోధిస్తోంది. ఇలాంటి మరణమే దేవుని దృష్టిలో ఎంతో విలువయినది.

చావనేది నిజానికి ఆపదకుగాని, అపజయానికిగాని మారు పేరు ఎంత మాత్రం కాదు. ఇది ఒక స్థితి నుండి మరొక స్థితికి జరిగే మార్పు మాత్రమే. ఇది ప్రతి ఒక్కరి జీవితంలో జరిగి తీరవలసిన విషయమే. అయితే మరణం తరువాత వచ్చేజీవితం సఫలమయ్యే విధంగా ఈ 'మార్పు' జరిగితే మనిషికి అంతకన్నా గొప్ప విజయం మరొకటి ఉండదు. ఒకవేళ ఈ విధమయిన 'మార్పు' జరగకపోతే మరణానంతర లోకంలో అతనికన్నా దురదృష్టవంతుడు మరొకడు ఉండడు. అతడు ఇహలోకంలో ఎన్ని సౌఖ్యాలు అనుభవించినా, ఎన్ని విజయాలు సాధించినా అవన్నీ పరలోక జీవితం ముందు బలాదూరే. అక్కడ అవి కనీసం గుర్తుకు కూడా రావు. చావు

పట్ల ఈ విశ్వాసం మనిషిని అన్ని విధాలా భయాల నుండి దూరం చేసి ఎంతో శక్తిశాలిగా తయారు చేస్తుంది.

సోదరులారా!

మనిషిలోని రెండు పెద్ద బలహీనతలు ఏమిటో, ఇస్లామ్ వాటిని ఎలా పోగొడ్తుందో తెలుసుకున్నాం. అందువల్ల ఉపాధి, మరణం రెండూ దైవం చేతిలోనే ఉన్నాయన్న విశ్వాసాన్ని మనం ఎల్లప్పుడూ తాజాగా ఉంచుకోవాలి. ఏ ప్రాణి కూడా దాని అదృష్టంలో రాయబడిన ఉపాధి అయిపోయే వరకూ మరణించదని మనం నమ్ముతున్నాం, గుర్తుంచుకోండి, అల్లాహ్ ఎంతో శక్తిమంతుడు. అన్ని అధికారాలు ఆయన అధీనంలోనే ఉన్నాయి. ఆయనే మన సృష్టికర్త, పాలకుడు, పోషకుడు. చావయినా ఆహారమయినా ఇచ్చే శక్తి ఆయనకు మాత్రమే ఉంది. ఆయనపైనే మనం ఆధారపడాలి.

అల్లాహ్ ప్రసన్నత కోసం మనం యావత్ప్రపంచ అయిష్టతనయినా భరించాలి. ఆయన ప్రసన్నతలోనే మన సాఫల్యం ఇమిడి ఉంది. అల్లాహ్‌ను ప్రసన్నం చేసుకుంటే ఆయన మన కోసం ఉపాధి మార్గాలను సుగమం చేస్తాడు. శత్రువుల సమక్షంలో మనకు సహాయం కూడా చేస్తాడు. అల్లాహ్ తలచిందే జరుగుతుంది. ఆయన అభీష్టానికి వ్యతిరేకంగా మనకు ఎలాంటి లాభంగాని, నష్టంగాని చేకూరదు.

57. కృతజ్ఞతా భావం

మహాశయులారా!

దేవునితో సంబంధం మోమిన్ జీవితానికి ఆత్మలాంటింది. మనం వివిధ వ్యక్తులతో, పనులతో పెట్టుకునే ప్రతి సంబంధానికి ఏదో ఒక ప్రాతిపదిక తప్పకుండా ఉంటుంది. తల్లిదండ్రులతో సంబంధం, సంతానంతో సంబంధం, పొరుగువాళ్ళతో సంబంధం, బంధుమిత్రులతో సంబంధం, వ్యాపార సంబంధం, రాజకీయ సంబంధం- ఇలా ప్రపంచంలోని ప్రతి సంబంధానికీ ఏదో ఒక ప్రాతిపదిక ఉండకుండా ఉండదు. మనం ఎవరితోనయినా సంబంధాన్ని సుస్థిరం చేసుకోవాలనుకుంటే ఆ సంబంధం యొక్క పునాదిని పటిష్టవంతం చేయవలసి ఉంటుంది. అలాగే దేవునితో మన సంబంధం సుస్థిరంగా ఉండాలంటే ఆ సంబంధం పునాదిని కూడ పటిష్టవంతం చేసుకోవాలి. ఈ పునాదే గనక గట్టిగా లేకపోతే దేవునితో దాసుని సంబంధం నామమాత్రంగానే ఉంటుంది.

సోదరులారా!

దేవుడు, ఆయన దాసుని సంబంధం యొక్క ముఖ్యమైన పునాది కృతజ్ఞత. కృతజ్ఞత సంబంధం హృదయంతోనూ ఉంటుంది, నోటితోనూ ఉంటుంది, ఆచరణతోనూ ఉంటుంది. హృదయ కృతజ్ఞత అంటే మానవుడు తనకు దేవుడు ప్రసాదించిన వరాలను అనుక్షణం తలచుకుంటూ ఉండాలి. ఇలా మనిషి హృదయం కృతజ్ఞతతో నిండిపోతే అతని నోటి నుండి కూడా కృతజ్ఞతా పలుకులు వెలువడతాయి. దాని ప్రభావం ఆచరణపై కూడా పడుతుంది.

హృదయంలో కృతజ్ఞతా భావాన్ని మేల్కొల్పడానికి ఆసక్తి అభిలాష ఎంతో అవసరం. దేవుడు మనకు ఎన్నెన్ని వస్తువులు అనుగ్రహించాడు, ఎలాంటి మహాభాగ్యాలు ప్రసాదించాడు అనే భావన మనలో కలగకపోతే, ఆ భావనను ఎల్లప్పుడూ సజీవంగా ఉంచకపోతే మన హృదయంలో కృతజ్ఞతా భావం పెంపొందదు.

మనకేదయినా ఆపదగాని, నష్టంగాని వచ్చిపడితే చాలు, ఇక దాన్ని గురించే మనం ఎల్లప్పుడూ ఆలోచించుకుంటూ ఉంటాం. కాని అల్లాహ్ ప్రసాదించిన అపార అనుగ్రహాలను గురించి మాత్రం చాలా తక్కువగా ఆలోచిస్తాం. ఇలా దేవుని అనుగ్రహాలను గురించిన భావనే సరిగా లేకపోతే, ఇక కృతజ్ఞతా భావం మాత్రం మనలో ఎలా కలుగుతుంది? దీనికి కారణం మన విస్మరణ అయినా కావాలి లేదా ప్రాపంచిక

వ్యామోహమైనా కావాలి. కాబట్టి దేవునితో మన సంబంధం పటిష్టం చేసుకోవడానికి ముందు ఈ విస్మరణ, ప్రాపంచిక వ్యామోహాలను తరిమివేయాలి.

సోదరులారా!

మనకు దైవం ప్రసాదించిన అనుగ్రహాలను గురించి ఒక్కసారి ఆలోచించండి, మనం ఆరోగ్యంగా ఉన్నాం, స్వేచ్ఛగా తిరగ్గలుగుతున్నాం. కాస్త రోగులు, వికలాంగులను చూడండి. వాళ్ళను పోల్చుకుంటే మన ఈ ఆరోగ్యం గొప్ప దైవానుగ్రహం కాదా? అల్లాహ్ మనకు చూసే, వినే, మాట్లాడే, ఆలోచించే, అర్థం చేసుకునే శక్తి సామర్థ్యాలు ప్రసాదించాడు. కాస్త అటు గుడ్డివాళ్ళు, చెవిటివాళ్ళు, మూగవాళ్ళు, పిచ్చివాళ్ళను చూడండి. వాళ్ళకంటే మనం మేలు కాదా? ఇదంతా మనకు దైవానుగ్రహం కాదా? ఈ భావన మనలో కలిగితే మన హృదయం తప్పకుండా కృతజ్ఞతా భావంతో నిండిపోతుంది.

అలాగే కాస్త బయట విశ్వ వ్యవస్థపై కూడా ఓసారి దృష్టి సారించండి. రేయింబవళ్ళ రాకపోకలు, రుతువుల మార్పు, వర్షం గాలుల ఏర్పాటు, సూర్యచంద్రుల ద్వారా లభించే లాభాలు, భూమి నుండి మొలకెత్తే రకరకాల వృక్ష జాలాలు, భూ పొరలలో దాగి వున్న అపార ఖనిజ సంపద, నదులు, సముద్రాలు, కొండలు - ఒకటేమిటి, యావత్ విశ్వమే మన పాలిట దైవానుగ్రహమయి వెలసింది. అసలు దేవుని అనుగ్రహాలను లెక్కించడం మానవుని తరం కాదు. వాటి ఆధారంగానే మానవుడు మనుగడ సాగిస్తున్నాడు. సుఖమయిన జీవితం గడుపుతున్నాడు. వీటన్నిటిని అనుభవిస్తూ కూడా అతని హృదయంలో కృతజ్ఞతా భావం జనించలేదంటే అంతకంటే కృతఘ్నుడు మరొకడు ఉండడు.

సోదరులారా!

ఈ విషయాన్ని గురించి ప్రశాంతంగా ఆలోచించండి. దైవానుగ్రహాలను గురించి ఎల్లప్పుడూ ఆలోచించడానికి అలవాటు పడాలి. ఆరోగ్యంలో, ఐశ్వర్యంలో, అంతస్తులలో మనకంటే తక్కువ స్థాయిగల వాళ్ళు ఈ సమాజంలో ఎందరో ఉన్నారు. కాని వాళ్ళపై మన దృష్టి పోదు. ఒకవేళ పోయినా మనం దాన్ని గురించి పట్టించుకోము, పైగా వాళ్ళకు అలా రాసి పెట్టి ఉందని మనం అనుకుంటాం. మన దృష్టి ఎప్పుడూ మన పైస్థాయి వాళ్ళ మీదే ఉంటుంది. వాళ్ళ సుఖసంతోషాలు, హోదా, అంతస్థులు చూసి మనకా అదృష్టం లేదే అని బాధపడుతుంటాం. అందుకే మన హృదయాల్లో దైవం పట్ల కృతజ్ఞతా భావం కలగడం లేదు.

మనం ఎంత సేపటికీ మన పైస్థాయివాళ్ళనే చూస్తూ అలాంటి భాగ్యం మనకు

దైవం ప్రసాదించలేదే అంటూ లోలోన అసంతృప్తి పడుతుంటాం. ఈ అసంతృప్తే కృతజ్ఞతా భావాన్ని నాశనం చేసేది. అంతేకాదు, అసంతృప్తి నుండి అసూయ కూడా పుట్టుకొస్తుంది. ఫలితంగా దైవం పట్ల మన సంబంధం క్రమంగా క్షీణించిపోతుంది. దైవం పట్ల మన సంబంధం పటిష్టవంతం కావాలంటే ముందు ఈ అసూయ, అసంతృప్తులను పారద్రోలాలి. ఈ సందర్భంలో ప్రఖ్యాత వలి అల్లాహ్ షేక్ సాది (రహ్మలై) తన సొంత అనుభవాన్ని గురించి ఇలా చెబుతున్నారు:

"ఒకసారి నేను కాలి నడకన ప్రయాణం చేస్తూ, ఒక పట్టణానికి చేరుకునేటప్పటికి నా జేబు ఖాళీ అయిపోయింది. నా చెప్పులు తెగిపోయాయి. కొత్త చెప్పులు కొనుక్కోవడానికి ఒక పైసా కూడా లేకుండా పోయింది. ఇలాంటి పరిస్థితిలో పట్టణంలో ప్రవేశిస్తుంటే నా కెంతో బాధ వేసింది. అల్లాహ్ ఈ రోజు నాకు చెప్పులు కూడా కొనుక్కో లేని స్థితి కల్పించాడే అని మనస్సులో అనుకున్నాను. ఇలా ఆలోచించుకుంటూ నమాజ్ కోసం మస్జిద్‌కు వెళ్ళాను. అక్కడ హఠాత్తుగా నా దృష్టి ఒక వ్యక్తిపై పడింది. అతనికసలు కాళ్ళే లేవు. పాపం, అతను నేల మీద పాకుతున్నాడు. ఈ దృశ్యం చూడగానే నా ఆలోచన దేవుని అనుగ్రహాల వైపునకు పోయింది. నా ప్రభువు నా పట్ల ఎంత దయామయుడు! నాకు ఎన్నెన్ని మేళ్ళు చేశాడు!! ఆయన నాకు పూర్తి ఆరోగ్యం ప్రసాదించాడు. నడవడానికి నిక్షేపం లాంటి రెండు కాళ్ళు ఇచ్చాడు. ఒకవేళ నేను కూడా ఆ మనిషిలాగే వికలాంగుణ్ణయి ఉంటే ఏమయ్యేది? ఈ ఆలోచన రాగానే నేను నా ప్రభువు ముందు సాష్టాంగపడ్డాను. నా హృదయం కృతజ్ఞతా భావంతో నిండిపోయింది. అప్రయత్నంగా నా నోట ఆయన ప్రశంసా పలుకులు వెలువడ్డాయి."

ఇదీ ఆ మహనీయుని అనుభవం. ఇలాంటి భావన వస్తే మన హృదయాలు కృతజ్ఞతా భావంతో ఎందుకు నిండిపోవు? ఈ కృతజ్ఞతా భావమే దైవం పట్ల మన సంబంధాన్ని పటిష్టం చేసేది. కృతజ్ఞత చూపే వారిని గురించి అల్లాహ్ ఏమంటున్నాడో చూడండి.

"మీరు (మా పట్ల) కృతజ్ఞత చూపితే మేము మీకు మరింత ప్రసాదిస్తాం."

దైవం చేసిన ఈ వాగ్దానాన్ని ప్రతి ముస్లిమ్ దృష్టిలో పెట్టుకోవాలి. ఎవరికయినా కృతజ్ఞత చూపాలంటే అతడ్ని మనస్ఫూర్తిగా గౌరవిస్తూ, నోటితో ప్రశంసించాలన్న సంగతి మీకు తెలిసిందే. అయితే ఈ కృతజ్ఞతా భావాన్ని ఆచరణ ద్వారా కూడా వ్యక్త పరచాలి. ఇది ఎంతో ముఖ్యం. నిజానికీ ఇదే అన్నిటికంటే ముఖ్యమైంది. దీని ప్రాముఖ్యాన్ని ఒక విషయం ద్వారా గ్రహించవచ్చు. ఉదాహరణకు ఒక వ్యక్తి మనకు కొన్ని ఆయుధాలు ఇచ్చాడనుకోండి. వాటితో మన ధన ప్రాణాలను కాపాడుకుంటాం. మన శత్రువుని

అణచివేస్తాం. ఇది మనకా వ్యక్తి చేసిన మేలు. ఈ మేలుకు బదులుగా మనం మనస్ఫూర్తిగా అతడ్ని గౌరవిస్తాం. నోటితో పొగుడుతాం. అయితే దాంతోపాటు మనం ఆ వ్యక్తి ఇచ్చిన ఆయుధాలను అతని అభిమతానికి వ్యతిరేకంగా ఉపయోగించామనుకోండి, లేదా వాటిని తీసుకొని అతనిపైనే దాడి చేశామనుకోండి. ఇంత కంటే విశ్వాసఘాతుక చర్య మరొకటి ఉంటుందా?

అచ్చం ఇదే వైఖరి మనం దేవుని పట్ల కూడా అనుసరిస్తున్నాం. ఆయన ప్రసాదించిన మహాభాగ్యాలను మనం మనస్ఫూర్తిగా ఎంతో గౌరవిస్తున్నాం. ఆయన్ని నోటితో స్తుతిస్తున్నాం కూడా. కాని లాభం ఏమిటి? ఆ మహోపకారి ప్రసాదించిన మహాభాగ్యాలను మనం ఆయన ఇష్టానికి వ్యతిరేకంగా వాడుతున్నాం. ఇలా మనం విశ్వాసఘాతకులుగా, పరమ కృతఘ్నులుగా మారుతున్నాం.

సోదరులారా!

అల్లాహ్ పట్ల నిజమయిన కృతజ్ఞత చూపాలంటే ఆయన మనకు ప్రసాదించిన ఈ కళ్ళు, కాళ్ళు, ఈ చెవులు, చేతులు, సంపద, సంపాదనా మార్గాలు మన సమయం, శక్తి సామర్థ్యాలు సమస్తం ఆయన అభిమతం ప్రకారం, ఆయన ఆదేశాలనుసారమే ఉపయోగించాలి. అలా కాకుండా వీటిని మన ఇష్ట ప్రకారమో లేదా ఇతరుల ఇష్ట ప్రకారమో ఉపయోగిస్తూ దైవాన్ని నోటితో ఎంత స్తుతించినా ప్రయోజనం లేదు. దైవం పట్ల మనకు కృతజ్ఞత ఉన్నట్లు ఆచరణ ద్వారా కూడా నిరూపించాలి. ఆచరణాత్మక కృతజ్ఞతే దైవం పట్ల సంబంధాన్ని పటిష్టవంతం చేస్తుంది.

58. ప్రదర్శనా బుద్ధి అతి ప్రమాదకరమైంది

మహాశయులారా!

అల్లాహ్, ఆయన ప్రవక్త (సఅసం)ను విశ్వసించగానే మనిషిపై నమాజ్ ఫర్జ్ (విధి) అవుతుందన్న సంగతి మనకు తెలిసిందే. నమాజ్ తరువాత దైవ మార్గంలో ఖర్చు పెట్టే విషయానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వబడింది. సాఫల్యం పొందడానికి దానధర్మాలు చేయడం మోమిన్ బాధ్యత. ఈ బాధ్యతను విస్మరించి ఎన్ని నమాజులు చేసినా ప్రయోజనం లేదు. లోభికి ఇస్లామ్‌లో ఏ మాత్రం స్థానం లేదు. పిసినారితనం వహించడమంటే తనను తాను నాశనం చేసుకోవడమే. ఈ విషయాన్నే దివ్య ఖుర్‌ఆన్ ప్రస్తావిస్తూ, "అల్లాహ్ మార్గంలో ఖర్చు పెట్టండి. చేతులారా మిమ్మల్ని మీరు వినాశనం పాలు చేసుకోకండి. మేలు చెయ్యండి. మేలు చేసేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు" అని స్పష్టంగా నొక్కి చెబుతోంది.

ఏ సత్కార్యమైనా మనం దైవ ప్రసన్నత కోసమే చేస్తాం. అలాగే దైవ మార్గంలో చేసే ఏ ఖర్చయినా సరే అది దైవ ప్రీతి కోసమే అయి ఉండాలి. దివ్య ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా ఆదేశిస్తున్నాడు:

"విశ్వసించిన ఓ ప్రజలారా! కేవలం పరుల మెప్పును పొందటానికే తన ధనం ఖర్చు చేసేవాని మాదిరిగా అల్లాహ్‌ను, అంతిమదినాన్ని విశ్వసించనివాని మాదిరిగా మీరు మీ దానధర్మాలను దెప్పిపొడిచి, గ్రహీత మనస్సును గాయపరచి, మట్టిలో కలపకండి. అతడు చేసిన ధన వ్యయాన్ని ఈ విధంగా పోల్చవచ్చు. ఒక కొండ రాతిపై ఒక మట్టి పొర ఏర్పడి ఉంది. భారీ వర్షం దానిపై కురువగా, ఆ మట్టి కాస్తా కొట్టుకుపోయింది. చివరకు మిగిలింది ఉత్త కొండరాయి మాత్రమే. ఇలాంటివారు తాము దానం చేస్తున్నామని భావించి చేసే పుణ్యకార్యం వల్ల వారికి ఏ ప్రయోజనమూ కలగదు, దైవతిరస్కారులకు సత్యమార్గం చూపడం అల్లాహ్ సంప్రదాయం కాదు, దీనికి భిన్నంగా ఎవరయితే తమ సంపదను స్థిర చిత్తంతో కేవలం అల్లాహ్ సంతోషం పొందే ఉద్దేశ్యంతో ఖర్చు చేస్తారో, వారి దానాన్ని మెట్ట ప్రదేశంలో ఉన్న తోటతో పోల్చవచ్చు. భారీ వర్షం కురిస్తే అది రెట్టింపు పంటను ఇస్తుంది. ఒకవేళ భారీ వర్షం కురవక సన్నని జల్లులుపడినా అదే దానికి చాలు. మీరు చేసేదంతా అల్లాహ్ దృష్టిలో ఉంది."

సోదరులారా!

సత్కార్యాల కోసం డబ్బు ఖర్చు పెట్టమని అల్లాహ్ దివ్య ఖుర్‌ఆన్‌లో ముస్లిమ్‌లకు అనేకసార్లు తాకీదు చేశాడు, అయితే ఆయన మన దానధర్మాలకు ఆశపడుతున్నాడని దీని అర్థం కాదు. దానధర్మాల వల్ల మనిషిలో సుగుణాలు పెంపొందుతాయి. మానవులను సజ్జనులుగా, శీలవంతులుగా తీర్చిదిద్దడానికి అల్లాహ్ అనేక సత్కార్యాలను గురించి ఆదేశించాడు. వాటిలో దానధర్మాలు కూడా ఒకటి. ఇస్లామ్ ముస్లిమ్‌ల ద్వారా ఏ ఉన్నత లక్ష్యాన్నయితే సాధించదలచిందో, ఆ లక్ష్యం కోసం ఉన్నత గుణగణాలు కలవారు, ఎంతో ఉదార స్వభావులు, సహృదయులు, సానుభూతి కలవారు, సాహసవంతులు చాలా అవసరం. పిరికి వాళ్ళు, పిసినారులు, స్వార్థపరులు, సంకుచిత మనస్కులు, నిర్దయులు, నిజాయితీ లేనివాళ్ళు ఈ మహా కార్యానికి ఎంత మాత్రం తగరు.

ఇలాంటి ఉన్నత గుణగణాల కోసం ఇస్లామ్ ముస్లిమ్‌లలో దానధర్మాలను ప్రోత్సహిస్తుంది. ఎలాంటి ప్రాపంచిక ప్రలోభానికి లోనుకాకుండా కేవలం దైవ ప్రీతికోసం, దైవ మార్గంలో డబ్బు ఖర్చు పెట్టడం ద్వారా మనిషికి ఈ సుగుణాలు అబ్బుతాయి. ఇలాంటి దానధర్మాల వల్లనే మనిషికి పరలోకంలో అపారమయిన దైవానుగ్రహం లభిస్తుంది. ఈ విధంగా దైవమార్గంలో ధనం ఖర్చు పెట్టడం వల్ల వాస్తవానికి దైవదాసులకే ప్రయోజనం చేకూరుతుంది. దాసులు చేసే దానం దైవానికి ఎలాంటి లాభం చేకూర్చదు. ఆయన అక్కరలు లేనివాడు, దాసుల దానధర్మాలకు అతీతుడు. అయితే మోమిన్‌కు తన దానధర్మాల వల్ల ప్రయోజనం కలగాలంటే అతను కేవలం అల్లాహ్ ప్రసన్నత కోసమే దానధర్మాలు చేయాలి. అదీ దైవానికి ఇష్టమయిన రీతుల్లోనే ఖర్చు చేయాలి. ఇతరుల నుండి కృతజ్ఞతలనుగాని, పొగడ్తనుగాని లేదా మరేదయినా లాభాన్నిగాని ఆశించి దైవ మార్గంలో డబ్బు ఖర్చుపెట్టకూడదు. అంతేకాదు దానం చేసి, దానం పొందినవారి ముందు తామేదో పెద్ద ఉపకారం చేసినట్లు చెప్పడం కూడా మంచిది కాదు.

సత్కార్యాలు చేసే విషయంలో ప్రదర్శనా బుద్ధిని ఇస్లామ్ తీవ్రంగా నిరసిస్తుంది. ప్రదర్శనా బుద్ధి పుణ్య ఫలాన్ని హరించివేస్తుంది. జనానికి చూపించడానికి డబ్బు ఖర్చు పెట్టేవారు జనం నుండి ఏదో లాభాన్ని తప్పకుండా ఆశిస్తారు. వారు తమల్ని గురించి పొగడ్తలు వినాలని కోరుకుంటారు. లేదా తాము చేసే ఈ సత్కార్యం తెరచాటున మరేదయినా ప్రాపంచిక ప్రయోజనం పొందాలని ఆరాటపడతారు.

సోదరులారా!

పేరు ప్రతిష్ఠల కోసం డబ్బు ఖర్చు పెట్టేవారు, దానం చేసి దెప్పిపొడుస్తూ గ్రహీత మనస్సును బాధపెట్టేవారు దైవ ప్రీతిని ఎన్నటికీ పొందలేరు. అల్లాహ్ ఇలాంటివారి దానాన్ని కొండ రాతిపై పేరుకున్న పల్చటి మట్టి పొరతో పోల్చుతున్నాడు. వారిలో ఏదో ఒక సత్కార్యం చేయాలన్న కాస్త ఆసక్తి మాత్రం కలుగుతుంది. కాని మట్టి పొర పల్చగా ఉండి, దాని కింద బండరాయి దాగి ఉంటే వర్షం కురవగానే ఆ మట్టి పొర కాస్తా కొట్టుకుపోయి ఉత్త రాతి నేల మాత్రమే మిగిలిపోతుంది. అదే విధంగా సత్కార్యం పట్ల వారి ఆసక్తి అనే మట్టి పొర కింద దురుద్దేశ్యం, చిత్తశుద్ధి లోపం అనే రాతి నేల దాగి ఉంటుంది.

అందువల్ల వారు దైవ మార్గంలో ధనం వెచ్చించినా వారికి లభించవలసిన అసలు ప్రయోజనం లభించదు. కేవలం దేవుని ప్రసన్నత కోసం, దైవ మార్గంలో డబ్బు ఖర్చు పెట్టేవాళ్ళలో కలిగే గుణాలు వీరిలో కలగవు. ఇలా వీరు ఖర్చు చేసే ధనం, పడే శ్రమ అంతా వృధా అవుతుంది. అంటే పరలోకంలో వారికి ఎలాంటి సత్ఫలితం లభించదన్న మాట. పై పెచ్చు ఇలాంటి దురుద్దేశ్యంతో కూడుకున్న ధన వ్యయం వల్ల వారిపై పరలోకంలో దైవ శిక్ష కూడా విరుచుకుపడవచ్చు.

సోదరులారా!

కష్టపడి సంపాదించిన డబ్బు నాశనం కావడాన్ని మనలో ఎవరూ కోరుకోరు. మనం సంపాదించిన ప్రతి పైసా సద్వినియోగం కావాలనే కోరుకుంటాం. సాధారణంగా ప్రతి వ్యక్తీ ఏదో ఒక లాభం కోసమే తన డబ్బును ఖర్చుపెడతాడు. అలాగే దైవ మార్గంలో డబ్బు ఖర్చు పెట్టడంలో మన ప్రయోజనం ఎంతో ఇమిడి ఉంది. దీని వల్ల పరలోకంలో మనం అల్లాహ్ అనుగ్రహానికి అర్హులమవుతాము; ఇహలోకంలో మనలో ఉన్నత సుగుణాలు జనిస్తాయి. ఈ సుగుణాలు మనకు జీవిత సమస్త రంగాల్లో సరయిన బాటపై నడవడానికి దోహదపడతాయి.

ఈ విధమైన సంకల్ప శుద్ధితో కూడిన సత్కార్యం మనకు ఉభయ లోకాల్లోనూ లాభం చేకూర్చుతుంది. అదే సంకల్పశుద్ధి లోపించిన సత్కార్యమయితే ఐహిక జీవితంలో కొంత లాభాన్ని కలిగిస్తే కలిగించవచ్చు. కాని పరలోక జీవితంలోమటుకు దాని దుష్ప్రభావాన్ని చవిచూడవలసి వస్తుంది.

సోదరులారా!

పేరు ప్రతిష్ఠల కోసం ప్రాకులాడే మనస్తత్వం ఎంత ప్రమాదకరమయిందో మీకిప్పుడు అర్థమయి ఉంటుంది. దైవ మార్గంలో చేసే పనిని నాశనం చేసే అతి

ప్రమాదకరమయిన విషయం ఏదయినా ఉందంటే, అది ప్రదర్శనా బుద్ధే, అందువల్ల మన అంతర్యంలో, మన సంకల్పంలో ఈ చెడు ఏమాత్రం చోటు చేసుకోకుండా మనం దీని పట్ల ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలి. సాధారణంగా మనిషి సద్భావంతో, సదుద్దేశ్యంతోనే ఏదో ఒక సత్కార్యం చేయడానికి ముందుకు వస్తాడు. కాని షైతాన్ వెంటనే అతని సత్కార్యాన్ని నాశనం చేయడానికి ఏదో ఒక పన్నాగం పన్నుతాడు. ఈ విషయంలో వాడు మనపై ప్రయోగించే అతి శక్తిమంతమైన ఆయుధం ఈ ప్రదర్శనా బుద్ధే.

పేరు ప్రతిష్ఠలు కోరుకోవడం ప్రజల నుంచి పొగడ్తలను ఆశించడం, మనం చేసే మంచి పని ఎలాగయినా సరే జనానికి తెలిసిపోయి ప్రచారం పొందాలన్న ఆకాంక్ష మన సత్కార్యాలను సర్వనాశనం చేస్తుంది. కాబట్టి ఇలాంటి దురాలోచన నుండి మనల్ని కాపాడమని కూడా మనం దైవాన్ని వేడుకుంటూ ఉండాలి. పెద్ద పెద్ద పండితుల్ని కూడా షైతాన్ ఇక్కడ సులభంగా బోల్తాకొట్టిస్తాడు. అయితే ప్రదర్శనా బుద్ధి నుండి కాపాడమని దైవాన్ని ఎల్లప్పుడూ వేడుకుంటూ అదే భావంతో మెలిగేవాళ్ళను షైతాన్ ఏమీ చేయలేడు.

59. దేవుని గుణగణాలు

మహాశయులారా!

దైవాన్ని ఏదో ఒక రూపంలో చాలా మంది విశ్వసిస్తారు. అయితే ముస్లిమ్‌లమైన మన విశ్వాసానికి ఒక ప్రత్యేకత ఉంది. అల్లాహ్ పట్ల మన విశ్వాసమంతా ఆయన శక్తి సామర్థ్యాలు, గుణగణాలపైనే ఆధారపడి ఉంది. అంటే దైవ గ్రంథంలో దైవ ప్రవక్త (సఅసం) ప్రవచనాల్లో అల్లాహ్ యొక్క ఏ శక్తి సామర్థ్యాలు, గుణగణాలను గురించి వర్ణించడం జరిగిందో వాటినే మనం విశ్వసిస్తామన్న మాట. దివ్యఖుర్ఆన్‌లో ఒక చోట ఇలా వర్ణించటం జరిగింది :

"ఈ గ్రంథం (ఖుర్ఆన్)అల్లాహ్ తరపున ప్రభవించింది. ఆయన అత్యంత శక్తిశాలి, అన్నీ తెలిసినవాడు. తప్పుల్ని మన్నించేవాడు. పశ్చాత్తాపాన్ని అంగీకరించేవాడు. కఠినంగా శిక్షించేవాడు. ఎంతో ఉదార స్వభావుడు. ఆయన తప్ప మరొక దేవుడు లేడు, అందరూ ఆయన దగ్గరికే పోవలసి ఉంది".

సోదరులారా!

దేవుని గుణగణాలను దృఢంగా విశ్వసిస్తే అది మన క్రియా జీవితంలో గొప్ప మార్పును తెస్తుంది. మన జీవిత గమ్యమే ఒక ప్రత్యేక దిశకు మళ్ళుతుంది. ఈ ఆయత్‌లో మొదట అల్లాహ్ అత్యంత శక్తిశాలి అని పేర్కొనడం జరిగింది. అంటే ఆయన శక్తి, ఆధిక్యతకు తిరుగులేదన్న మాట. ఆయన ఏదయినా ఒక నిర్ణయం చేస్తే అది తప్పనిసరిగా జరిగితీరుతుంది. ఆయన నిర్ణయాన్ని మార్చగల శక్తి ఎవరికీ లేదు. ఏ ఒక్కరికీ ఆయన్ని ఎదిరించి గెలవగల ధైర్యం లేదు, ఆయన పట్టు నుంచి తప్పించుకోలేరు కూడా.

కాబట్టి ఎవరయినా ఆయన అయిష్టాన్ని కొని తెచ్చుకొని విజయాన్ని సాధించగలననుకుంటే అది శుద్ధ పొరపాటే అవుతుంది. అలాగే ఎవరయినా ఆయన అభిమతానికి వ్యతిరేకంగా తన ఇష్టమొచ్చినట్లు చేయగలనని భావిస్తే అంతకన్నా ఆత్మవంచన మరొకటి ఉండదు. ఏ వ్యక్తి అయినా సరే అల్లాహ్ యొక్క గుణనామాన్ని మనస్ఫూర్తిగా దృఢంగా నమ్మితే అతను ఎన్నటికీ అల్లాహ్ పట్ల అవిధేయత చూపడు. పోతే అల్లాహ్ ధర్మాన్ని ఆశ్రయించి, ఆయన మహాశక్తిశాలి అన్న దృఢ విశ్వాసంతో, ఆయన విధేయతా పరిధిలో జీవితం గడపదలచిన వారు ఎన్ని ఆపదలు వచ్చి పడినా చలించరు; పరిస్థితుల ఒత్తిడికి లొంగిపోరు.

ఇక రెండవ గుణనామాన్ని తీసుకుందాం, ఆయన అన్నీ తెలిసినవాడు. అంటే ఆయన ఏది చేసినా ఊహలు, అంచనాల మీద గాకుండా జ్ఞానం ఆధారంగా మాత్రమే చేస్తాడు. ఆయనకు ప్రతి విషయమూ ఎలాంటి సాధనాలు లేకుండానే నేరుగా తెలుసు. అందువల్ల మానవ బుద్ధికి, ఇంద్రియాలకు అతీతమైన విషయాలకు సంబంధించి అల్లాహ్ మనకు తెలిపిన జ్ఞానం పూర్తిగా విశ్వసనీయమైనది. తెలిసినవాడు ఒక విషయాన్ని గురించి తెలుపుతున్నప్పుడు దాన్ని నమ్మడమే తెలియని వారు చేయవలసిన పని.

అల్లాహ్ అన్నీ ఎరిగినవాడు కనుక, మానవుల అసలు సాఫల్యం ఎందులో ఉందో, ఏ చట్టాలను, సూత్రాలను అనుసరిస్తే మానవుల జీవితం సార్థకమవుతుందో కూడా ఆయనకే తెలుసు. అందువల్ల ఆయన పంపిన బోధనలు, ఆజ్ఞల ప్రకారం నడుచుకోవడం ద్వారానే మానవుడు వాస్తవిక విజయానికి చేరువవుతాడు. దైవం పంపిన బోధనలన్నీ సరైన జ్ఞానం, వివేచనలపై ఆధారపడి ఉన్నాయి. కనుక వాటిలో ఎలాంటి పొరపాట్లకు తావులేదు. ఒకవేళ ఎవరయినా ఇలాంటి బోధనలను అంగీకరించడం లేదంటే దానర్థం వారు తమల్ని తాము నాశనం చేయదలచుకున్నారన్న మాట.

అల్లాహ్ సర్వజ్ఞాని అయినందున మానవులు చేసే ప్రతి పనీ, వారి హృదయాల్లో మెదిలే ప్రతి ఊహా, ఉద్దేశ్యం, కూడా ఆయనకు తెలుసు. ఈ కారణంగా మానవులు అల్లాహ్ శిక్ష నుండి తప్పించుకోవడానికి ఎలాంటి సాకునూ చూపించలేరు. ఒక మనిషి ఇంకొక మనిషి కళ్ళు కప్పగలడు. తన దురుద్దేశాలను, దుష్ట పథకాలను దాచి ఇతరులను మోసగించగలడు. కాని అన్నీ ఎరిగినవాడయిన అల్లాహ్ ముందు అతని ఆటలు సాగవు.

దేవుని యొక్క ఈ గుణాన్ని దృఢంగా నమ్మిన తరువాత మనిషి ఇక ఎలాంటి పరిస్థితిలోనూ దేవుని బోధనలను, ఆయన చట్టాలను తిరస్కరించలేడు. కాకపోతే తన తృప్తికోసం ఈ ఆదేశాలు నిజంగా దైవం పంపినవేనా లేక ఇతరులు కల్పించినవా అని మాత్రం పరిశీలిస్తాడు. ఇవి దేవుని ఆజ్ఞలే అని పూర్తిగా నమ్మకం కుదిరినప్పుడు, అతను వాటి నుండి తప్పించుకోవడానికి ప్రయత్నించలేడు. ఒకవేళ మనిషి తెలిసి కూడా తప్పు చేయడానికి పాల్పడుతున్నాడంటే దానర్థం అతని హృదయంలో దేవుని ఈ గుణగణాల పట్ల నమ్మకమయినా లేకపోయి ఉండాలి లేదా నమ్మకం ఉన్నా అది ప్రాపంచిక మైకం, మనోవాంఛల కింద అణగిపోయి బక్కచిక్కి పోయి అయినా ఉండాలి.

ఈ ఆయత్‌లో దేవుని మరో గుణనామం - తప్పుల్ని మన్నించేవాడు, పశ్చాత్తాపాన్ని అంగీకరించేవాడు అని ఉంది. ఈ దైవ గుణం మానవునిలో ఆశను రేకెత్తిస్తుంది. చాలా

మంది ప్రాపంచిక మైకంలో పడిపోయి వివిధ చెడులకు లోనయి ఉంటారు. ఒకవేళ ఎప్పుడయినా వారి హృదయంలో ఏదైనా సత్కార్యం చేయాలన్న ఆలోచన వచ్చినప్పటికి ఇన్ని చెడుల్లో కూరుకుపోయాక ఇప్పుడొక మంచి పని చేసినంత మాత్రాన లాభం ఏమిటి? అని నిరాశపడతారు. ఈ నిరాశా నిస్పృహలే వాళ్ళను సన్మార్గంపై రానీయకుండా అడ్డుకుంటాయి. కాని అల్లాహ్ యొక్క ఈ గుణనామంపై విశ్వాసముంటే నిరాశా నిస్పృహలన్నీ పటాపంచలయిపోతాయి. ఇప్పటికయినా మన నడవడికను మార్చుకుంటే అల్లాహ్ మనల్ని క్షమించి, తన అనుగ్రహ ఛాయల్లోకి తీసుకుంటాడని వారు భావిస్తారు. మనిషి ఎన్ని చెడులకు గురై ఉన్నా ఈ భావన అతడ్ని మంచి వైపు తిప్పి కొత్త జీవితాన్ని ప్రారంభింపజేస్తుంది.

సోదరులారా!

మానవ బలహీనత వల్ల మనం ఎన్నో తప్పులు చేస్తుంటాం. ప్రాపంచిక వ్యామోహం మనల్ని రకరకాల చెడుల్లో కూరుకుపోయేలా చేస్తుంది. దైవాన్ని విస్మరించడమే కాకుండా మద్యపానం, వడ్డీ, వ్యభిచారం, జూదం, లంచం, దగా, మోసం, అక్రమ వ్యాపారం, దోపిడి, దొంగతనం, హింస, దౌర్జన్యం మొదలైన ఘోరపాపాలు కూడా చేస్తుంటాం. కాని ఈ పాపాలకు ఇక నిష్కృతి లేదని, మంచి మార్గం అవలంబించే అవకాశం లేదని భావించి ఆ పాప పంకిలంలోనే ఉండిపోవడం విజ్ఞత అనిపించుకోదు. గొప్ప దోపిడీ దొంగలు, రక్తపిపాసులు, నర హంతకులు సయితం సన్మార్గానికి వచ్చిన సంఘటనలు మన చరిత్రలో అనేకం ఉన్నాయి. అల్లాహ్ ఎంతో దయామయుడు. మనస్ఫూర్తిగా పశ్చాత్తాప పడితే ఆయన మనం చేసిన ఎన్ని పాపాలనయినా క్షమిస్తాడు. అయితే మనం మళ్ళీ వాటి జోలికి పోకుండా ఉండాలి.

ఈ ఆయత్‌లో దేవుని యొక్క నాలుగవ గుణం - ఆయన కఠినంగా శిక్షించేవాడు అని ఉంది. సన్మార్గానికి రాకుండా దుర్మార్గంలోనే పడి ఉండే దైవ తిరస్కారుల్ని, తిరుగుబాటుదారుల్ని కఠినంగా శిక్షించడం జరుగుతుందని దేవుడు ఈ గుణ నామం ద్వారా హెచ్చరిస్తున్నాడు. కొందరు సన్మార్గం అవలంబించి కూడా చెడు పనులకు పాల్పడుతుంటారు. నమాజ్, రోజా లాంటి ఆరాధనలను పాటిస్తున్నాం కదా, దేవుడు క్షమిస్తాడులే అన్న అపోహతో వారు ఈ చెడులనుంచి బయటపడేందుకు ప్రయత్నించరు. అలాంటి వారిక్కూడా ఈ హెచ్చరిక వర్తిస్తుంది. అల్లాహ్ అత్యంత దయామయుడు, తప్పుల్ని క్షమించేవాడు అని విశ్వసించినవారు ఆయన తప్పు చేసిన వారిని కఠినంగా శిక్షిస్తాడని కూడా విశ్వసించాలి. కాబట్టి ఈ గుణ నామంపై కూడా దృఢ విశ్వాసం ఉంటే మనిషి చెడుల జోలికి పోలేడు.

ఇక అయిదో గుణ నామం. దేవుడు ఎంతో ఉదార స్వభావుడు. ఆయన

ఇవ్వదలచుకుంటే అసంఖ్యాకంగా ఇస్తాడు. ఆయన తన సృష్టి రాసులపై నిత్యం తన అనుగ్రహాన్ని వర్షింపజేస్తున్నాడు. విధేయులైనా, అవిధేయులయినా ప్రతి ఒక్కరికీ అసంఖ్యాకమయిన మహాభాగ్యాలు లభిస్తున్నాయి. మనకు ఏది లభించినా దేవుని అనుగ్రహం వల్లనే లభిస్తుంది. ఇహలోక జీవితంలో ఆయన ఔదార్యం అందరిపై సమానంగా ఉంటుంది.

సోదరులారా!

దేవుని యొక్క ఈ అయిదు గుణాలు ప్రస్తావించిన తరువాత ఆయన తప్ప ఆరాధనకు తగిన మరొక దేవుడు ఎవరూ ఉండజాలడని ఖుర్‌ఆన్ విస్పష్టం చేస్తోంది. ప్రజలు అనవసరంగా ఇతర మిథ్యా దేవుళ్ళను కల్పించుకున్నారు గాని వారిలో ఎవరిలోనయినా ఈ గుణాలు ఉన్నాయా? వారిలో ఈ గుణాలు ఏవీ లేనప్పుడు అవి ఆరాధ్య దైవాలు ఎలా అవుతాయి? ఈ గుణాలు ఉన్నవాడే నిజమయిన దేవుడు కాగలడు. ఈ ఆయత్‌లో చెప్పబడిన మరొక విషయం - ప్రతి మానవుడు చివరికి ఆయన దగ్గరికే పోవలసి ఉంది. అంటే మరణానంతరం మన ఇహలోక కర్మలన్నిటికీ ఆయన ముందే సమాధానం చెప్పుకోవలసి ఉంది. ఆయనకే మనల్నందరినీ తిరిగి బ్రతికించగల శక్తి ఉంది. ఆయనకే అంతిమ తీర్పు ఇచ్చే హక్కుంది. ఈ యదార్థాన్ని త్రోసిపుచ్చి ఇతరుల్ని దేవుళ్ళుగా చేసుకోవడం అంటే మనల్ని మనం మోసగించుకుంటున్నట్లే.

దేవుని యొక్క ఈ గుణాలను దృఢంగా విశ్వసిస్తే అవి మన జీవితంలో మనకు మార్గదర్శకత్వం చేస్తాయి. మన నడవడిక దిశను నిర్ణయిస్తాయి. ఒకవేళ మనం దైవ ధర్మాన్ని నిర్లక్ష్యం చేసి దేవుని ఆదేశాలను సరిగా పాటించడం లేదంటే ఆయన గుణగణాలను మనం నమ్మవలసిన విధంగా నమ్మడం లేదని భావించాలి. అందువల్ల దేవుని యొక్క నిజమయిన విశ్వాసిగా, పరిపూర్ణ ముస్లిమ్‌గా జీవితం గడపాలంటే ఆయన గుణగణాలను దృఢంగా విశ్వసించి, వాటి భావంపై మన దృష్టిని స్థిరంగా ఉంచాలి. దీనికోసం రోజూ ఖుర్‌ఆన్‌ని అర్థం చేసుకుంటూ పఠిస్తూ ఉండాలి.

60. ఈదుల్ ఫిత్ర్ ప్రసంగం

మహాశయులారా!

ఈ రోజు ఈదుల్ ఫిత్ర్. దేవుని దయ వల్ల మనకందరికి ఈ పర్వదినాన్ని చూసే మహా భాగ్యం లభించింది. దేవుడు మనకు ప్రసాదించిన మహా భాగ్యాలలో ఈదుల్ ఫిత్ర్, ఈదుల్ అజ్హా కూడా ఉన్నాయి. ఈ పండుగల స్వభావం, లక్ష్యాల దృష్ట్యా ఇవి ప్రపంచంలోని అన్ని పండుగలకన్నా ఎంతో ఉన్నతమయినవి. ఇస్లామ్ మనకు రెండు పండుగలను ప్రసాదించింది. అందులో ఈ రోజు మనం జరుపుకుంటున్న ఈదుల్ ఫిత్ర్ ఒకటి. రెండోది జిల్ హజ్, పదో తేదీన జరుపుకునే ఈదుల్ అజ్హా.

మన ప్రభువు, యజమాని అయిన దేవుడు మనకు రమజాన్ ఉపవాసాలు పాటించమని ఆదేశించాడు. ఆయన ఆజ్ఞను శిరసావహించడంలో మనం సఫలమయ్యాం. దీని తాలూకు ఆనందోత్సవాలు వ్యక్తపరచడానికి మనం ఈ పండుగ జరుపుకుంటున్నాం. అంతే కాకుండా ఉపవాస ఆజ్ఞలను పాటించే సద్బుద్ధిని ప్రసాదించినందుకు దైవానికి కృతజ్ఞతగా కూడా మనం ఈ పండుగను జరుపుకుంటున్నాం.

మన సృష్టికర్త మరోసారి మనకు రమజాన్ లాంటి పవిత్ర నెలను సందర్శించే అవకాశం కల్పించాడు. ఆయన మానవాళికి ప్రసాదించిన మహా భాగ్యాల్లో అత్యున్నతమయిన మహాభాగ్యం ఈ నెలలోనే ఉంది. మానవుల ఇహపర సాఫల్యాలకై వెలుగుబాట చూపే దివ్యఖుర్‌ఆన్ ఈ నెలలోనే అవతరించింది.

సోదరులారా!

దేవుడు మనకు చేసిన మేళ్ళను గురించి ఒక్కసారి ఆలోచించండి. ఆయన తన అపార ప్రేమానుగ్రహాలతో మన జీవన మనుగడ కోసం ఎన్నో ఏర్పాట్లు చేశాడు. మన ఆహారం కోసం భూమి నుండి ఒక చెట్టు మొలకెత్తుతుందంటే దాని పెరుగుదల కోసం భూమ్యాకాశాలలోని సమస్త శక్తులు కలసి పనిచేస్తాయి. ఇంకా ఇలాంటివే అనేక అవసరాల కోసం మన ప్రభువు ఈ సృష్టిలో ఎన్నెన్ని ఏర్పాట్లు చేశాడో మీకందరికి తెలుసు. వీటన్నిటినీ వివరించడం ఎవరికయినా సాధ్యమయ్యే పనేనా? ఒకవేళ మానవులు ప్రపంచంలోని చెట్లన్నిటినీ కలాలుగా తయారుచేసి, సముద్ర జలాలన్నిటినీ సిరాగా మార్చి దేవుని మహాభాగ్యాలను గురించి రాయడానికి ప్రయత్నించినా అవి తరగవు.

మరి మానవుల మనుగడ కోసం ఇన్ని ఏర్పాట్లు చేసిన ఆ దేవుడు వారి ఆధ్యాత్మిక, నైతిక మార్గదర్శకత్వం కోసం ఎలాంటి ఏర్పాట్లు చేయలేదా? తప్పకుండా

చేశాడు. వారికి ప్రసాదించబడిన వస్తువుల మంచి చెబ్బరలేమిటో? వారి శక్తి సామర్థ్యాలు ఎలా వినియోగించుకోవాలో? వారి ఆధ్యాత్మిక, నైతిక, సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాలు ఎలా ఉండాలో? ఏ సూత్రాలు, నియమాలు పాటిస్తే వారి జీవితం సార్థకమవుతుందో అన్నీ ఆయన వివరించాడు. ఆ మార్గదర్శక సూత్రాలను వివరించే అంతిమ దైవగ్రంథమే దివ్యఖుర్‌ఆన్. అలాంటి మహత్తర గ్రంథం అవతరించిన ఈ రమజాన్ నెల ఎంత శుభప్రదమైందో మీరే ఊహించండి.

అల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ లా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ వలిల్లాహిల్ హమ్‌ద్.

సోదరులారా!

ఈ రోజు మనమంతా మన యజమాని దర్బారులో హాజరయ్యాము. ఆయన మనకు రమజాన్ నెల ఉపవాసాలు పాటించే శక్తిని, సద్బుద్ధిని ప్రసాదించినందుకు మనం ఆయనకు కృతజ్ఞతలు చెల్లించుకున్నాం. ఈ నెలలో మనం ఖుర్‌ఆన్ పట్ల మన సంబంధాన్ని మెరుగుపరుచుకున్నాం. సాధ్యమయినంత మేరకు దాన్ని చదవి; దాని బోధనలను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాం. రాత్రి వేళ తరావీహ్ నమాజుల్లో నిల్చొని దైవవాణిని విన్నాం. ఈ గ్రంథం ద్వారా పూర్తి ప్రయోజనం పొందే సద్బుద్ధిని ప్రసాదించమని, ఏ మార్గాన్నయితే మన ప్రియ ప్రవక్త (సఅసం) స్వయంగా నడిచి మనకో మహత్తర ఆదర్శాన్ని చూపారో ఆ మార్గాన నడిచే ధైర్యం కలిగించమని మనం దైవాన్ని వేడుకున్నాం.

దేవుడు చూపిన ఈ మార్గంపై నడవడానికి మనకు కావలసిన బోధనలన్నీ వివరంగా ఆయన మహా ప్రవక్త ముహమ్మద్ (సఅసం) ద్వారా మనకు అందజేశాడు. అవన్నీ ప్రవక్త సంప్రదాయాల రూపంలో మన దగ్గర సురక్షితంగా ఉన్నాయి. ఇదంతా మన ప్రభువు మనపై చూపిన కరుణాకటాక్షాల ఫలితమే. ఇందుకు ఆయన పట్ల మనం ఎల్లప్పుడూ కృతజ్ఞులమయి ఉంటున్నాం. దివ్యఖుర్‌ఆన్, ప్రవక్త సంప్రదాయాల ప్రకారం పూర్తిగా నడచుకోవడంలో మనం ఆయన సహాయాన్ని, అనుగ్రహాన్ని అర్థిస్తున్నాం.

అల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ లా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ వలిల్లాహిల్ హమ్‌ద్.

సోదరులారా!

మనం కేవలం దేవుని ప్రసన్నత పొందడానికి, పరలోకంలో ఆయన నుంచి సత్ఫలాన్ని ఆశిస్తూ రమజాన్ నెలంతా పగటి పూట ఉపవాసాలు పాటిస్తూ, రాత్రివేళ తరావీహ్ నమాజుల్లో నిల్చొని ఖుర్‌ఆన్ వినగలిగామంటే అంతా ఆయన అనుగ్రహమే,

ఆయన అనుగ్రహమే గనక లేకపోతే మనం ఒక్క ఉపవాసాన్ని కూడా పాటించలేము. ఒక్క నిమిషం కూడా జీవించలేము. అలాంటి కరుణామయునికి, మనం ఎంత కృతజ్ఞత చూపించినా తక్కువే.

దేవుని గుణగణాలు, శక్తిసామర్థ్యాల పట్ల మనకు విశ్వాసం ఉంది. మనం చనిపోయిన తరువాత ఒకరోజు ఆయన సమక్షంలో నిలబడవలసి ఉందన్న విషయాన్ని పూర్తిగా నమ్ముతున్నాం. ఇహలోక జీవితంలో మనం ఏదయితే చేసుకున్నామో మరణానంతరం పరలోక జీవితంలో అదే లభిస్తుందని కూడా మనం విశ్వసిస్తున్నాం. ఈ విశ్వాసమే లేకపోతే ఉపవాస వ్రతాల్లో మనిషి తనసహజ అవసరాలను, ధర్మసమ్మతమయిన వస్తువులను ఏమాత్రం త్యజించలేడు. ఈ నెలలో మోమిన్ పగలల్లా ఆకలిదప్పులతో గడుపుతాడు. రకరకాల రుచులకు, లైంగికానుభూతులకు తనను తాను దూరంగా ఉంచుతాడు, ధర్మసమ్మతమయిన ఎన్నో మనోకాంక్షలకు సంకెళ్ళు వేస్తాడు. రాత్రి వేళలో విశ్రాంతిని విడిచిపెట్టి గంటల తరబడి రుకూ, సజ్దాలు చేస్తాడు. తిరిగి తెల్లవారుఝామున తియ్యటి నిద్ర వదిలేసి లేస్తాడు. వేళకాని ఆ వేళలో మాములు అలవాటుకు వ్యతిరేకంగా సహరీ భుజిస్తాడు. ఈ పనులన్నీ హృదయాల్లో విశ్వాసజ్యోతి ఉన్నవాళ్ళే చేయగలరు.

దేవుని కృపవల్ల మనకీ విశ్వాస భాగ్యం లభించింది. ఆయన మనకు తన ఆదేశాల్ని శిరసావహించే శక్తిని కూడా ప్రసాదించాడు. అందుకు మనం ఆయనకు కృతజ్ఞతలు సమర్పించుకుంటున్నాం. మన విశ్వాసాన్ని మరింత పటిష్టపరచమని, జీవితంలోని సమస్త రంగాల్లో, సమస్త పనుల్లో ఆయన ప్రీతి ప్రసన్నతలు లభించే మార్గాలపై నడిపించమని వేడుకుంటున్నాం.

అల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ లా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ వలిల్లాహిల్ హమ్ద్.

సోదరులారా!

మానవుని వల్ల తప్పులు జరుగుతాయని, జరిగాయని మనందరికీ తెలుసు. దైవాజ్ఞలను ఎలా పాటించాలో అలా వాటిని పూర్తిగా పాటించానని మనలో ఏ ఒక్కరూ చెప్పలేరు. మనమంతా పాపులమే. మన వల్ల పొరపాట్లు కూడా జరిగాయి. ఉపవాస స్థితిలో కూడా జరగరాని పొరపాట్లు మన వల్ల జరిగాయి. ఈ పవిత్ర మాసంలో పొందవలసిన ప్రయోజనాలు కూడా మనం పొందలేదు. ఉపవాస వ్రతాలను పూర్తి ఏకాగ్రతతో పాటించనివారు, నమాజులను వాటి నియమాల ప్రకారం సరిగ్గా చేయనివారు కూడా మనలో ఉన్నారు. ఇంతకంటే విచారకరమయిన విషయం ఏమిటంటే ఇలాంటి శుభప్రదమయిన మాసంలో అసలు ఉపవాసాలే పాటించకుండా దాని శుభాలకు

దూరమయినవాళ్ళు కూడా మనలో ఉన్నారు. వారు ఇంతకు ముందు ఎలా ప్రాపంచిక పనుల్లో నిమగ్నులయి ఉండే వారో ఈ నెలలో కూడా అలాగే ఉండిపోయారు. ఈ విధంగా వారు దగ్గరికొచ్చిన దైవకారుణ్యాన్ని పొందకుండా అదృష్టహీనులయిపోయారు. దైవం, దైవ ప్రవక్త (సఅసం) పట్ల విశ్వాసముందని చెప్పుకునే ఇలాంటి ముస్లిమ్‌లు తమ దుస్థితిపై ఒక్కసారి దృష్టి సారించుకోవాలి.

ఈ రోజు దైవ మన్నింపు లభించే శుభదినం. దేవుడు అపార కరుణామయుడు. ఆయన కారుణ్యకడలికి అవధులే లేవు. దాసుడు ఎలాంటి పరిస్థితిలోనైనా సరే పశ్చాత్తాప హృదయంతో దైవం వైపునకు మళ్ళుదలచుకుంటే అతడ్ని దేవుడు తన కారుణ్య ఛాయలోకి తీసుకోవడానికి సిద్ధంగా ఉంటాడు. ఈ రోజు మన తప్పులకు క్షమాపణ కోరేదినం. ఇకముందు తప్పులు చేయమని, దైవ మార్గంపై స్థిరంగా ఉంటామని దీక్షవహించే రోజు ఇది. కాబట్టి మన ఈ ప్రార్థన శరీరంలో ప్రాణం ఉండగానే దైవం మనకిచ్చిన ఈ సదవకాశాన్ని వినియోగించుకొని సన్మార్గం వైపునకు మళ్ళాలి. అవకాశాన్ని జారవిడుచుకోవడమంటే మనల్ని మనం దైవాగ్రహానికి గురి చేసుకోవడమే.

మహాశయులారా!

ఒక విషయం యదార్థమని తెలిసినా, ఆ యదార్థానికి అనుగుణంగా వ్యవహరించడానికి ముందుకు రారు అనేక మంది. ఇదే మనిషిలోని పెద్ద బలహీనత. దీన్ని అధిగమించడంలోనే మన విజ్ఞత ఉంది. పుట్టిన ప్రతిమనిషి గిట్టక తప్పదనే విషయం ఎంత సత్యమో, ఈ అశాశ్వత శరీరం నుండి ఆత్మ ఎప్పుడు వీడిపోతుందో ఎవరికీ తెలియదనే సంగతి కూడా అంతే సత్యం. అందుకే ఈ ఆత్మజ్యోతి ఆరిపోకముందే మేల్కొని దైవం వైపునకు మరలాలి. మన తప్పులను, పొరపాట్లను సవరించుకొని రుజుమార్గం పైకి రావాలి.

దేవుడు ఎంతో దయామయుడు. ఆయన మనం తెలియక చేసిన ఎన్ని తప్పులయినా క్షమించడానికి సిద్ధంగా ఉన్నాడు. దీనికి రమజాన్ నెల ఎంతో మంచి అవకాశం. కనీసం ఈ పవిత్ర మాసంలోనయినా మనం అజ్ఞానాంధకారంతో కూడిన పాత జీవితాన్ని వదలి, దైవ హితవులతో నిండిన కొత్త జీవితాన్ని ప్రారంభించడానికి దీక్ష బూనాలి. ఇక నుండి ఎప్పటికీ దైవాదేశాల ప్రకారమే జీవితం గడుపుతామని, దైవానికి ఆగ్రహం కలిగే పనుల జోలికి పోమని నిర్ణయించుకోవాలి. మనోవాంఛలకు, మిథ్యా దేవుళ్ళకు పూర్తిగా స్వస్తిచెప్పి కేవలం ఏకైక దైవానికే దాసులయి ఉండాలి.

సోదరులారా!

ఈ విధంగా మనం ఈ పండుగ శుభసందర్భంగా దృఢసంకల్పం చేసుకుంటే ఈ రోజు నిజమయిన పండుగ దినమే. మన జీవితంలో ఆనందోత్సవాలు వెల్లివిరిసే

అత్యంత శుభదినం అవుతుంది. అలా కాకుండా దురదృష్టవశాత్తు ఈ చెప్పే మంచి విషయాలన్నీ ఒక చెవితో విని రెండో చెవి ద్వారా వదిలేస్తే, ఈ రోజు మన పాలిట పర్వదినం కాదు, దుర్దినం అవుతుంది. వైఫల్య దినం అవుతుంది. అంటే మరణానంతరం తీర్పు దినం మన పాలిట దుర్దినమవుతుంది. ఆరోజు మన వైఫల్యమంతా మన ముందు నిలుచుంటుంది. అప్పుడు మనం ఎంత పశ్చాత్తాపం చెందినా, మనకు ఎలాంటి సహాయం లభించదు. అలాంటి దుస్థితి రాకముందే మనం ఈ ప్రపంచంలోనే మన జీవితాన్ని సార్థకం చేసుకుందాం. దైవానికి సదా కృతజ్ఞులమయి పవిత్ర జీవితం గడుపుదాం.

అల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ లా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ వలిల్లాహిల్ హమ్ద్.

సోదరులారా!

దైవ భయం అన్ని సత్కార్యాలకు పునాదిరాయి వంటిది. అందువల్ల ప్రతి విషయంలోనూ మనం ఈ పని చేస్తే దేవుడు ఆనందిస్తాడా లేక ఆగ్రహిస్తాడా అని ఆలోచించి మరీ ముందుకు సాగాలి. నా ప్రభువుకు నచ్చని ఏ విషయం జోలికి పోకుండా ఆయనకిష్టమయిన పనులే చేస్తానన్న భావన మనస్సులో అనుక్షణం మెదులుతూ ఉండాలి. ఇలాంటి చింతన కలిగిన మనిషే అదృష్టవంతుడు. మనం ఏకైక దేవుణ్ణే ఆరాధిస్తున్నాం. ఆయనే మన ప్రభువు, యజమాని అని అంగీకరించాం. ఆయన అయిష్టాన్నుండి తప్పించుకోవడానికి ఆయన ఆదేశాలనే పూర్తిగా పాటిస్తూ పవిత్ర జీవితం గడపాలి. దైవ భయం లేదా తఖ్వా అంటే ఇదే. సమస్త సత్కార్యాలకు ఈ దైవ భీతే పునాది. మన విశ్వాసానికి కూడా దైవభీతే పునాది. ఇదేమన దుఃఖాలకు, కష్టాలకు సరయిన నివారిణి కూడా.

అల్లాహ్ తన అపార అనుగ్రహంతో మనలో ఈ తఖ్వాని పెంపొందింపజేయడానికి మనపై రమజాన్ ఉపవాసాలను విధించాడు. కాబట్టి ఎవరయితే ఈ ఉపవాసాలను వాటి నియమ నిబంధనలతో నిష్ఠగా పాటిస్తారో, వారిలో తప్పనిసరిగా తఖ్వా కలుగుతుంది. వారు ఇదివరకటి కంటే ఇప్పుడు సత్కార్యాలను చేయడంలో ఎక్కువ చొరవ చూపించగలరు.

రమజాన్ నెల ముస్లిమ్‌లకు ఒక శిక్షణా కాలమని చెప్పాలి. గత రమజాన్ నెలంతా మనకు సత్కార్య మార్గంపై నడిచే అభ్యాసం చేయించబడింది. దైవాదేశాలను శిరసావహించే అభ్యాసం చేయించబడింది. దైవమార్గంలో కష్టాలను సహించడానికి, మనోవాంఛలను త్యజించడానికి కావలసిన శిక్షణ ఇవ్వడం జరిగింది. ఇక ఈ శిక్షణ ద్వారా వచ్చే పదకొండు నెలల వరకూ ప్రయోజనం పొందే బాధ్యత మనపై ఉంది.

అయితే మనలో దైవ భీతి ఉన్నప్పుడే దేవుని పట్ల విధేయత కలిగి ఉంటూ ఆయన ఆజ్ఞలను పాటించగలం. దేవుని ఆజ్ఞలను తు.చ. తప్పకుండా పాటించడమే మనం పొందే ప్రయోజనం. అంటే ఆయన ఆజ్ఞలను శిరసావహించడంలోనే మన శ్రేయస్సు కూడా ఇమిడి ఉందన్నమాట.

సోదరులారా!

ముస్లిమ్ జీవితమంతా ఆరాధనే అన్న సంగతి మీకు తెలుసు. అయితే అతను జీవితానికి సంబంధించిన ప్రతి పనీ దైవ బోధనలకు అనుగుణంగా నిర్వహించాలి. ఏ విషయంలోనూ తెలిసి దైవం పట్ల అవిధేయత చూపకూడదు. అప్పుడే అతని పూర్తి జీవితం ఆరాధన క్రిందికి వస్తుంది.

దేవుని దయవల్ల మనకు ఇస్లామ్ వంటి మహా భాగ్యం లభించింది. ఈ ధర్మం మానవ జీవితాన్ని ప్రపంచం వేరు, పరలోకం వేరని రెండు వేరే భాగాల్లో విభజించదు. ఇది సమగ్ర జీవన వ్యవస్థ. మొత్తం మానవ జీవితాన్ని తన పరిధిలో ఉంచగోరుతుంది. మన ఆధ్యాత్మిక, నైతిక , సామాజిక, ఆర్థిక రాజకీయాలన్నింటిలోనూ ఇస్లామ్ మనకు మార్గదర్శకత్వం చేస్తుంది. ఈ విధంగా ఇది మన పూర్తి జీవితాన్ని దైవారాధనగా మార్చదలిచింది. అందువల్ల మనం జీవితపు అన్ని రంగాల్లోనూ దైవ హితవుల ప్రకారమే నడచుకోవాలి.

నమాజ్, రోజా, జకాత్, హజ్ లాంటి విధులను పాటిస్తే వాటి సత్ఫలం ఇస్తానని దేవుడు మనకు వాగ్దానం చేశాడు. అదే విధంగా ప్రతి విషయంలోనూ మంచి చెడులను విచక్షణ చేస్తూ ఇస్లాం చూపిన పద్ధతుల ప్రకారమే మన జీవనోపాధికూడా ఉండాలని, అప్పుడే దానికి సత్ఫలం లభిస్తుందని ఆయన తెలుపుతున్నాడు. అంటే మోసం, వంచన, అబద్ధం, అన్యాయం, అవినీతి, దొంగతనం, దౌర్జన్యం, వడ్డీ,జూదం, బ్లాక్ మార్కెటింగ్ లాంటి అక్రమాలకు పాల్పడకుండా, నీతి నిజాయితీలతోనే సంపాదించాలని ఆయన మనకు ఆదేశిస్తున్నాడు.

అదే విధంగా ఇతర రంగాల్లోనూ దైవాదేశాలనే పాటించాలి. చివరికి భార్యాపిల్లలతో ఎలా మసలుకోవాలి? సామూహిక సత్కార్యాలలో ఎలా తోడ్పడాలి? దేశ పాలనా వ్యవస్థను ఎలా నిర్వహించాలి? అనే విషయాలను కూడా దైవాజ్ఞల ప్రకారమే పాటించాలి. సామాన్యంగా ప్రాపంచిక విషయాలు అని చెప్పబడే విషయాలన్నీ మనకు పుణ్యఫలాన్నే ప్రసాదిస్తాయి. అయితే అడుగడుగునా మనం దేవుని బోధనలను దృష్టిలో పెట్టుకోవాలి. ఆయన ప్రసన్నత పొందాలన్నదే మన పనుల లక్ష్యమై ఉండాలి. ఈ విధంగా దేవుడు మన మొత్తం జీవితాన్ని పుణ్యఫల సాధనంగా చేశాడు. ఇది నిజంగా ఆయన మనకు చేసిన మహోన్నత మేలు.

ఇంతటి మేలుచేసిన దైవం పట్ల మనం ఎంతవరకు కృతజ్ఞతా విధేయతలు చూపుతున్నామో ఆత్మపరిశీలన చేసుకోవాలి. మనలో చాలా మంది ప్రపంచ వ్యవహారాలన్నీ దుష్టశక్తులకు ఆధీనం చేసి మస్జిద్ నాలుగ్గోడల మధ్యనే దైవారాధన చేస్తున్నారు. అదే స్వర్గానికి గొనిపోయే సర్వస్వమని, అంతకుమించి ఎలాంటి బాధ్యతలు లేవని భావిస్తున్నారు. మరి మన ప్రియ ప్రవక్త (సఅసం) ఒకసంఘ సంస్కర్తగా, ఒక న్యాయమూర్తిగా , ఒక రాజకీయ వేత్తగా, ఒకరాజ్యాధినేతగా, ఒక సేనాధిపతిగా ప్రపంచ వ్యవహారాలన్నీ నిర్వహించలేదా అని అడిగితే , నిజమే కాని మనమిప్పుడు ఇస్లామేతర పాలనలో ఉన్నాం కదా అంటారు మరికొందరు. కాని అలాంటి పాలన కోసం కృషి చేయవలసిన బాధ్యత లేదా మనకు? ప్రపంచ వ్యవహారాలకు సంబంధించిన దైవాజ్ఞలన్నీ ఖుర్ఆన్ గ్రంథం వరకే పరిమితమయి ఉండాలా? ఇది ఎంతటి సంకుచిత దృక్పథమో మీరే ఆలోచించండి. ఈ సంకుచిత దృక్పథం వల్ల పరలోకంలో ఎటూ శిక్ష ఉంటుంది, కాని స్వయంగా ఇహలోకంలోనూ దాని దుష్పరిణామాలు మనం చవిచూస్తున్నామన్న వాస్తవాన్ని వీరు ఎందుకు చూడలేకపోతున్నారో అర్థం కావడం లేదు.

ఇస్లామ్ పట్ల సరయిన అవగాహన, సమగ్ర దృక్పథం లేకపోతే మన జీవితంలో రమజాన్ లాంటి ఎన్ని వరాల వసంతాలు వచ్చినా, వాటి నుండి మనం పొందవలసిన ప్రయోజనాలన్నీ పొందలేము. మన కర్మల పత్రంలో చివరికి ఆకలిదప్పులతో కూడిన శుష్క ఉపవాసాలే మిగులుతాయి. కాబట్టి సోదరులారా! ఈ శుభమాసంలో మనకు ప్రసాదించబడిన దివ్యఖుర్ఆన్ ఏ మహత్తర లక్ష్యం కోసం ఆవిర్భవించిందో అర్థం చేసుకోండి. ఆ లక్ష్యం కోసమే మనజీవిత పోరాటం సాగాలి. ఈ పోరాటంలో మనం ఎంత వరకు సఫలీకృతమవగలం అని ఆలోచించకూడదు. ధ్యేయమార్గంలో స్థిరంగా ఉండి సాహసంతో ముందుకు సాగడమే మన కర్తవ్యం.

అల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ లా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ వలిల్లాహిల్ హమ్ద్.

61. ఈదుల్ అజ్హా ప్రసంగం

మహాశయులారా!

ఈరోజు గొప్ప శుభదినం. మన కోసం ఇలాంటి శుభదినం నిర్ణయించిన దైవానికి మనం ఎంతకృతజ్ఞత తెలుపుకున్నా తక్కువే. ఆ కరుణా సముద్రుడే కాబా గృహాన్ని మన కోసం పవిత్ర ప్రార్థనా మందిరంగా, గొప్ప సాంస్కృతిక కేంద్రంగా, ప్రపంచ శాంతి నిలయంగా చేశాడు. ఇలాంటి పవిత్ర ఆలయాన్ని ఈ పర్వదినాన సందర్శిస్తున్నవారు ఎంత అదృష్టవంతులు!

ఈ రోజు మక్కా నగరం లక్షలాది హాజీలతో కళకళలాడుతుంది. ఎవరి నోట విన్నా "లబ్బైక్" నినాదాలే. అల్లాహ్ ఆజ్ఞలను, ఆయన ప్రవక్త (సఅసం) సంప్రదాయాలను పాటించడంలో లీనమయిపోతారు. అదొక అపూర్వదృశ్యం. సమానత్వం, సౌభ్రాతృత్వంతో ఉట్టిపడే అంతర్జాతీయ వేదిక. దైవ ధ్యానంతో పరవశించిపోయే ఆధ్యాత్మిక కేంద్రం. హజ్ దృశ్యాన్ని గురించి ఆలోచిస్తేనే హృదయం పులకిస్తుంది. ఆ ప్రజావాహినిలో కాబా ప్రదక్షిణ చేసేవారు కొందరయితే, సఫా, మర్వా కొండలపై తిరిగేవారు మరికొందరు. కొందరు అరఫాత్ మైదానంలో ప్రార్థనలు చేస్తుంటే , మరికొందరు, ఖుర్బానీ పశువుల్ని 'జిబహ్' చేస్తూ కనిపిస్తారు. ఒకప్పుడు భయంకర నిర్మానుష్య ప్రదేశంగా ఉండిన ఈప్రాంతం ఇప్పుడిలా నేత్రానంద నిలయంగా మారిందంటే ఇదంతా విశ్వప్రభువు అనుగ్రహ ఫలితమే.

అల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ లా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ వలిల్లాహిల్ హమ్ద్.

భూమ్యాకాశాలను సృష్టించి పాలిస్తున్న మన ప్రభువు సర్వ శక్తిమంతుడు. అన్ని అధికారాలు ఆయన అధీనంలోనే ఉన్నాయి. ఆయన పవిత్రుడు, నిత్యుడు. ఆయనకు సాటిమరెవరూ లేరు. మనమంతా ఆయన్నే ఆరాధిస్తున్నాం, కీర్తిస్తున్నాం, ఆయన అనుగ్రహాన్ని అర్థిస్తున్నాం.

సోదరులారా!

ఈ రోజు పండుగ. మనలో త్యాగాన్ని ప్రేరేపించే త్యాగోత్సవం. ఈ రోజు మనమంతా ఆనందోత్సాహాలతో అల్లాహ్ సన్నిధిలో ఆయనకు కృతజ్ఞతలు అర్పించుకోవడానికి ఇక్కడ గుమికూడాము. కృతజ్ఞతగా మనమిప్పుడు రెండు రకాతుల నమాజ్ చేశాం. ఆయన ఘనతను పలుమార్లు ప్రశంసించాం. మన ఈ సంతోషానికి, హజ్ మరియు ఖుర్బానీకి ఎంతో సంబంధం ఉంది, ఈ సందర్భంగా లక్షలాది మంది

మన సోదరులు కాబా యాత్ర జరిపారు. ఆ విధంగా వారు దైవసన్నిధిలో ధర్మం పట్ల తమ అభిమానాన్ని, విశ్వాసాన్ని చాటుకున్నారు. ఈ సంతోషం కోసమే వారు తమ డబ్బు, సమయం ఖర్చుపెట్టి వేలాది మైళ్ళు ప్రయాణం చేసి ప్రయాసలు సహించారు. తమ ఇళ్ళ నుండి కాబా గృహం వరకు వారు ప్రతి పని, కదలిక ద్వారా విశ్వప్రభువు ఆదేశంపై తమ సుఖసంతోషాలను, మనోవాంఛలను, సిరిసంపదలను సయితం త్యాగం చేయడానికి సిద్ధమయ్యామని నిరూపించారు. దేవుని ఆజ్ఞను శిరసావహించి, ఆయన్ని మెప్పించడం కన్నా ఒక దాసునికి కావలసిందేమిటి? దాసునికి తన యజమాని ప్రసన్నతే గొప్ప భాగ్యం.

అయితే ఈ మహాభాగ్యం కాబా యాత్రకు పోగలిగిన వారికే దక్కింది. దైవం వారి కాబా యాత్రను సార్థకం చేయుగాక! మనక్కూడా హజ్ చేసే అవకాశం కల్పించుగాక! మనం హజ్ మహా భాగ్యమయితే పొందలేకపోయాం. అయితే అంతమాత్రాన మనం ఎలాంటి భాగ్యానికీ నోచుకోలేదని అర్థం కాదు. మన ప్రభువు తన కరుణాకటాక్షాలతో మన కోసం ఖుర్బానీ , నమాజులను దైవ ప్రీతి పొందే సాధనాలుగా చేశాడు. ఖుర్బానీ కూడా ఇచ్చే శక్తిలేనివారికి నమాజ్, తక్బీర్, తస్బీహ్‌లే దైవ ప్రీతి పొందే సాధనాలు. దైవ సన్నిధిలో కావలసిన అసలు వస్తువు దాసుని సంకల్ప శుద్ధి. హజ్‌లో కానివ్వండి, ఖుర్బానీలో కానివ్వండి, నమాజుల్లో కానివ్వండి- ఇదే అన్నిటికంటే విలువయిన వస్తువు. ఇది లేకపోతే హజ్ కూడా నిష్ప్రయోజనమే.

అల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ లా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ వలిల్లాహిల్ హమ్ద్.

మనలో హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) పేరు వినని వారు ఎవరుంటారు. హజ్రత్ ఇబ్రాహీం (అలైహి)ని ఖలీలుల్లాహ్ అని అంటారని కూడా మీకు తెలుసు. ఖలీలుల్లాహ్ అంటే దేవుని మిత్రుడు. హజ్రత్ ఇబ్రాహీమ్ (అలైహిస్సలామ్) తన యావజ్జీవితం ద్వారా దైవ ప్రసన్నత కంటే మించిన ప్రియమయిన వస్తువు ఏదీ లేదని నిరూపించారు. ఈ ప్రసన్నతను పొందడానికే ఆయన తన స్వదేశాన్ని విడిచిపెట్టారు. "ఇన్నీ జాహిబున్ ఇలా రబ్బీ సయహ్‌దీన్" (నేను నా ప్రభువువైపునకు వెళుతున్నాను) అన్నారు. అంటే "నేను నా ప్రభువు అభీష్టాన్ని నెరవేర్చే అవకాశం లేని ఈ వాతావరణంలో జీవించలేను. ఆయన ఆజ్ఞల ప్రకారం జీవితాన్ని గడిపే అవకాశమున్న ప్రాంతాలకు వెళతాను. ఈ విషయంలో ఆయనే నాకు మార్గం చూపుతాడని నాకు నమ్మకం ఉంది. నేను ఆయనకోసం స్వదేశాన్ని త్యజిస్తాను" అని అర్థం.

సోదరులారా!

దైవ ధర్మాన్ని అభివృద్ధి చేయడమంటే మాటలు కాదు. దీని కోసం ఎన్ని త్యాగాలకయినా సిద్ధం కావాలి. ఈ మహాకార్యంలో సహకరించేవారిని అన్వేషించాలి.

ఈ పనిలో మనకు సంతానంకన్నా ఎక్కువ ఎవరు సహకరిస్తారు. ధర్మ సంస్థాపనా కార్యానికి తోడ్పడతారనే మోమిన్ సంతానం కావాలని కోరుకుంటాడు. హజ్రత్ ఇబ్రాహీమ్ (అలైహి) కూడా "ప్రభూ! నాకు ఉత్తమ సంతానాన్ని ప్రసాదించు" అని దైవాన్ని ప్రార్థించారు. ఈ సంతానం సహాయంతో ప్రజలకు మరింత సులభంగా దైవసందేశాన్ని అందజేయాలని, ధర్మ సంస్థాపన గావించాలని ఆయన అనుకున్నారు. ఆ తరువాత కొన్నాళ్ళకు దేవుడు ఆయనకు ఒక సచ్ఛీలుడయిన కొడుకును ప్రసాదిస్తున్నానని శుభవార్త వినిపిస్తాడు. ఆ శుభవార్త ఫలితమే హజ్రత్ ఇస్మాయీల్ (అలైహిస్సలామ్)జననం. హజ్రత్ ఇస్మాయీల్ (అలైహి) పెరిగి పెద్దవారయి ధర్మ సంస్థాపన కార్యంలో తండ్రికి సహకరిస్తారు.

ఆనాటి సందర్భం గమనించండి, అప్పుడు హజ్రత్ ఇబ్రాహీమ్ (అలైహిస్సలామ్) ఓ కఠినాతికఠినమైన పరీక్షను ఎదుర్కోవలసివచ్చింది. "బాబూ! నేను కలలో నిన్ను దైవమార్గంలో బలి చేస్తున్నట్లు చూశాను. దీనిపై నీ ఉద్దేశ్యమేమిటో చెప్పు" అన్నారు ఆయన కొడుకుతో. ఈ పరీక్ష తండ్రికే కాదు, కొడుక్కీ ఎదురయింది. లేక లేక వృద్ధాప్యంలో కలిగిన ఒక్కగానొక్క కొడుకుని దేవుని సూచనపై తన చేతులారా బలి చేయవలసిన పరిస్థితి తండ్రికి ఎదురయితే, దైవ ప్రీతి కోసం సంతోషంగా తన ప్రాణాన్ని అర్పించవలసిన పరిస్థితి కొడుక్కి ఎదురయింది. అప్పుడు కొడుకు, తండ్రికి ఏం సమాధానమిచ్చాడో చూడండి, "నాన్నా! మీకు లభించిన ఆదేశాన్ని పాటించండి. దైవం కోరితే నన్ను మీరు సహనశీలుల్లో చూస్తారు" అన్నాడు ఆ సుపుత్రుడు. విశ్వాసి విలువ ఇక్కడే పెరుగుతుంది. దైవప్రసన్నత ముందు ఐశ్వర్యం, సంతానం, చివరికి ప్రాణాన్ని సయితం అతను ఖాతరు చేయడు.

చివరికి హజ్రత్ ఇబ్రాహీమ్ (అలైహిస్సలామ్) ప్రపంచంలో తనకు ప్రియాతి ప్రియమైన వస్తువుని దైవ ప్రీతి కోసం త్యాగం చేయడానికి సిద్ధమయ్యారు. హజ్రత్ ఇస్మాయీల్ (అలైహిస్సలామ్) కూడా దైవప్రసన్నత కోసం సంతోషంగా తన కుత్తుకపై కత్తినుంచడానికి ఒప్పుకున్నారు. ఇలా తండ్రీ కొడుకు ఇద్దరూ దైవాజ్ఞ ముందు తలవంచారు. ఈ అపూర్వ సన్నివేశం యావత్ సృష్టిని పులకింపజేసింది. దైవవాణి ప్రతిధ్వనించింది- "ఇబ్రాహీమ్! నువ్వు కలను నిజం చేశావు. నిస్సందేహంగా మేము సజ్జనులకు ఇలాంటి సత్ఫలితాన్నే ఇస్తుంటాం. ఇదే త్యాగానికి విస్పష్ట నిదర్శనం."

ఆ ఇద్దరూ పరీక్షలో కృతార్థులయ్యారు. హజ్రత్ ఇబ్రాహీమ్ (అలైహి) కొడుకుని 'జిబహ్' చేయబోతుండగా దేవుడు సంతోషించి ఆయన్ని వారించాడు. వాస్తవానికి దాసులను అనవసరంగా బాధలకు గురి చేయడం దేవుని అభిమతం కాదు. విశ్వాసి తన ఆజ్ఞను ఎంత వరకు శిరసావహిస్తాడు, తన కోసం అవసరమయితే ఎంతటి ప్రియమయిన

వస్తువునయినా వదులుకుంటాడా లేదా అని మాత్రమే ఆయన పరీక్షించగోరుతాడు, ఈ పరీక్షలో ఆ తండ్రి, కొడుకు ఇద్దరూ దైవం కోసం ఎలాంటి త్యాగానికయినా వెనుదీయమని నిరూపించుకున్నారు.

ఇదీ హజ్రత్ ఇబ్రాహీమ్ (అలైహిస్సలామ్) జీవిత చరిత్ర. దీన్ని దేవుడు తన అంతిమ గ్రంథంలోభద్రపరిచాడు. దీని ద్వారా ఇస్లామ్ వాస్తవికత ఏమిటో ప్రళయం వరకు ప్రపంచం ముందు ఉంటుంది. దైవాజ్ఞను పాటించడానికి దాసుడు ఎలాంటి వస్తువునయినా పరిత్యజించగలడని, పరిత్యజించాలని హజ్రత్ ఇబ్రాహీమ్ (అలైహిస్సలామ్) చరిత్ర మనకు తెలుపుతోంది. ఈ భావన లేకపోతే మన విశ్వాసం పరిపూర్ణమే కాదు.

అల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ లా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ వలిల్లాహిల్ హమ్ద్.

మహాశయులారా!

హజ్రత్ ఇబ్రాహీమ్ (అలైహి) చేసిన అపూర్వ త్యాగం విన్నారు కదా! ఈ త్యాగాన్ని స్మరించడానికే మనం ఈ రోజు పండుగ జరుపుకుంటున్నాం. దీని సంస్మరణగానే మహాప్రవక్త (సఅసం) మనకు ఖుర్బాని పద్ధతిని నేర్పారు. ఈ ఖుర్బాని విధిగా చేయవలసిన ఓ పవిత్ర కార్యం, దైవం పట్ల మన విధేయతను నిరూపించుకోవడానికి ఇదొక సాధనం. ఈ రోజు మనం దైవమార్గంలో ఖుర్బానీ ఇస్తున్నామంటే, దైవాజ్ఞలను పాటించడంలో సమయమొస్తే ప్రాణాలనయినా అర్పించడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటిస్తున్నామన్నమాట. నిజానికి దైవం మనల్నుండి కోరుతున్నది, మన ధన ప్రాణాల త్యాగం కాని, ఖుర్బాని పశువు రక్తమాంసాలు కాదు. అందుకే ఈ పండుగని త్యాగోత్సవమని కూడా చెప్పవచ్చు.

అల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ లా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ వలిల్లాహిల్ హమ్ద్.

సోదరులారా!

ఈ ఖుర్బానీ గనక సంకల్ప శుద్ధితో చేస్తే ఈ రోజు దైవప్రసన్నతను పొందే గొప్ప సాధనం ఇదే అవుతుంది. ఈ విషయంలో మన ప్రియప్రవక్త (సఅసం) ఏమన్నారో చూడండి: " ఖుర్బానీ రోజు దైవ మార్గంలో మానవుడు పశువులను ఖుర్బానీ చేసి వాటి రక్తాన్ని చిందించడం కన్నా గొప్ప ఆచరణ మరేది లేదు. తీర్పు దినాన ఖుర్బానీ పశువులు తమ కొమ్ములు, వెంట్రుకలు, గిట్టలతో సహా పరిపూర్ణ స్థితిలో వస్తాయి. ఈ ఖుర్బానీ రక్తం నేల మీద పడకముందే దైవసన్నిధిలో స్వీకారయోగ్యమవుతుంది" అన్నారు ఆయన.

నిర్ణీత (నిసాబ్) పరిమాణంగాని, అంతకంటే ఎక్కువగాని ధనమున్న ప్రతి వ్యక్తి ఖుర్బానీ విధిగా ఇవ్వాలి. ఒంటె, ఆవు లేదా గేదెను ఏడుగురు వరకు కలిసి ఖుర్బానీ ఇవ్వచ్చు. మేక లేదా గొర్రె అయితే ఒకే వ్యక్తి ఖుర్బానీ ఇవ్వాలి. ఖుర్బానీ కోసం ఒంటె వయస్సు అయిదేళ్ళకు తక్కువ ఉండకూడదు. ఆవు లేదా గేదె వయస్సు రెండేళ్ళు, మేక లేదా గొర్రె వయస్సు ఒక సంవత్సరం కనీసం ఉండాలి. వీటిలో ఆడ, మగ రెండింటినీ ఖుర్బానీ ఇవ్వవచ్చు. అయితే ఖుర్బానీ పశువులో శారీరకమయిన ఎలాంటి లోపం ఉండకూడదు. అంటే గుడ్డిది, కుంటిది, బక్కచిక్కినది, రోగమున్నది ఉండకూడదన్న మాట.

ఖుర్బానీ చేయవలసిన సమయం ఈద్ నమాజ్ తరువాత మొదలయి జిల్‌హజ్ 12వ తేది సూర్యాస్తమయానికి కాస్త ముందు వరకుంటుంది. ఖుర్బానీ అనివార్య పరిస్థితిలో తప్ప రాత్రివేళ చేయకూడదు. ఇక ఖుర్బానీ చేసే పద్ధతి ఏమంటే ఖుర్బానీ ఇచ్చే వ్యక్తే స్వయంగా ఖుర్బానీ పశువుని జిబహ్ చేస్తే మంచిది. గత్యంతరం లేని పరిస్థితిలో ఇతరులచేత కూడా జిబహ్ చేయించవచ్చు. మొదట పశువుని ఖిబ్లాకు అభిముఖంగా ఉండేలా క్రింద పడేయాలి. జిబహ్ చేసే ముందు ఇలా దుఆ చేయాలి.

“ఇన్నీ వజ్జహ్‌తు వజ్‌హియ లిల్లజీ ఫతరస్సమావాతి వల్ అర్జ హనీఫఁవ్వమా అనా మినల్ ముష్రికీన్ ఇన్నసలాతీ వ నుసుకి వ మహ్‌యాయి వ మమాతీ లిల్లాహి రబ్బిఅ అలమీన్ లాషరీకలహూ వబిజాలిక ఉమిర్తు వ అనా మినల్ ముస్లిమీన్. అల్లాహుమ్మ మిన్‌క వలక్”.

తరువాత ‘బిస్మిల్లాహి అల్లాహు అక్బర్’ అని పలికి జిబహ్ చేయాలి. ఈ దుఆ ఖుర్బానీకి ప్రాణం లాంటిది. ఇందులో మనం “ నేను అన్ని వైపుల నుంచి విముఖుణ్ణయి, భూమ్యాకాశాలను సృష్టించిన ఒక్క అల్లాహ్ వైపునకే ముఖాన్ని మరల్చుకున్నాను. నేను ఆయనకు సహవర్తులుగా నిలబెట్టేవారిలో లేను” అని ప్రకటిస్తున్నాం, ఇది ఎంత గొప్ప ప్రకటనో ఆలోచించండి. ఇలా ప్రకటించిన తరువాత మానవుడు దైవాన్ని కాదని మరే ఇతర మార్గాన్ని అనుసరించే అవకాశమే లేదు. తరువాత నా నమాజ్, నా ఖుర్బానీ, నా జీవనం, నామరణం సర్వస్వం సమస్త లోకాల ప్రభువయిన అల్లాహ్ కోసమే అంటున్నాం. బాగా అర్థం చేసుకొని, చిత్తశుద్ధితో చేస్తే ఇంతకంటే గొప్ప ప్రకటన మరేముంటుంది.?

ఇంత గొప్ప ప్రకటన చేసిన తరువాత మనం దైవమార్గాన్ని వదలి వేరే మార్గాన్ని ఎలా అనుసరించగలం? దేవుని ఆజ్ఞలను విస్మరించి ఇతరుల ఆజ్ఞలను ఎలా శిరసావహించగలం? అల్లాహ్ ప్రసన్నతను పొందడమే మన జీవిత లక్ష్యమని ఆయన ముందు ప్రమాణం చేసినప్పుడు ఇక వేరే శక్తులను తృప్తిపరిచే పనుల జోలికి ఎలా

పోగలం? పైగా మనం దేవా! నీ ప్రసన్నత కోసం మేము సమర్పిస్తున్నదంతా నీవు ప్రసాదించినదే, నీ కోసమే త్యజిస్తున్నామని అంటున్నాం. మనం చేస్తున్నదంతా నేను నా సర్వస్వం దేవుని ఆస్తులేనన్న భావనతో చేస్తున్నాం. అలాంటప్పుడు మనకు దైవం ప్రసాదించిన వస్తువులను ఇతరుల మెప్పుకోసం ఎలా వినియోగించగలం?

అల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ లా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ వలిల్లాహిల్ హమ్ద్.

మనం ఖుర్బానీ ఇస్తున్నామంటే సమయమొచ్చినప్పుడు దైవ మార్గంలో మన ధన ప్రాణాలయినా త్యాగం చేయడానికి సిద్ధమవుతామని దైవం ముందు ప్రమాణం చేస్తున్నామన్నమాట. కాబట్టి ఈ ఖుర్బాని మనం చేయబోయే త్యాగాలకు ఒక చిహ్నం. ఖుర్బాని పశువుని జిబహ్ చేసిన తరువాత **అల్లాహుమ్మ తఖబ్బల్ మిన్ని కమా తఖబ్బల్‌త మిన్ హబీబిక ముహమ్మదివ్వఖలీలిక ఇబ్రాహీమ్.** అంటే “ దేవా! నీవు, నీ మిత్రులు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లమ్, ఇబ్రాహిమ్ అలైహి వస్సలామ్‌ల ఖుర్బానీలను ఎలా స్వీకరించావో, నా తరపున ఇస్తున్న ఈ ఖుర్బానీని కూడా స్వీకరించు” అని ప్రార్థిస్తాం. ఇక్కడ మన ఇష్టమొచ్చిన విధంగా ఖుర్బానీ చేయడం లేదు. హజ్రత్ ఇబ్రాహీమ్ అలైహిస్సలామ్ చేసిన అపూర్వ త్యాగానికి స్మృతి చిహ్నంగా మనం ఈ ఖుర్బానీ చేస్తున్నాం. అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ (సఅసం) ముస్లిమ్ సమాజం కోసం నిర్ణయించిన ఓ గొప్ప సంప్రదాయం ఇది. స్తోమత కలిగిన ప్రతి ముస్లిమ్ తప్పనిసరిగా చేయవలసిన ఒక విధి.

అల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ లా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ వలిల్లాహిల్ హమ్ద్.

సోదరులారా!

ఇహలోక జీవితం మనకు సత్కార్యాలు చేయడానికి ఇవ్వబడిన ఒక మంచి అవకాశం, ఇలాంటి అవకాశాన్ని వినియోగించుకొని దైవ ప్రీతి కోసం సత్కార్యాలు చేసేవారు ఎంతో అదృష్టవంతులు. అల్లాహ్ ఆర్థిక స్తోమత కలిగిన ప్రతి ముస్లిమ్‌పై హజ్ ధర్మాన్ని విధించాడు. మనలో ఎవరయినా స్తోమత ఉండి కూడా హజ్ మహాభాగ్యాన్ని నోచుకోకపోతే, అలాంటివాళ్ళు వెంటనే దీన్ని గురించి తీవ్రంగా ఆలోచించాలి.

కొందరు ప్రపంచ కార్యకలాపాల్లో మునిగిపోయి, ఈ సంవత్సరం కాకపోతే వచ్చే సంవత్సరం, వచ్చే సంవత్సరం కాకపోతే ఆ వచ్చే సంవత్సరం హజ్‌కు పోదాంలే అని భావిస్తూ హజ్ విధిని వాయిదా వేస్తుంటారు. కాని వచ్చే యేడు దాకా మనిషి బ్రతికి ఉంటాడన్న గ్యారంటి ఏమిటి? ఎవరి జీవితావకాశం ఎప్పుడు అంతమవుతుందో దైవానికే తెలుసు. అందుకే మన ప్రియ ప్రవక్త (సఅసం) సత్కార్యాలు సాధ్యమయినంత

త్వరగా చేయమని హితవు చేశారు. ప్రపంచ కార్యకలాపాలు, వాటి సమస్యలు ఎల్లప్పుడూ ఉంటూనే ఉంటాయి. ఎలాగయినా సరే ఈ యేడు హజ్ చేయాలని గట్టిగా నిశ్చయించుకుంటే ఈ చిక్కులు దూరమయి పరిస్థితి మనకనుకూలంగా ఏర్పడుతుంది.

పోతే ఖుర్బానీ విషయాన్ని కూడా మనం ఆలోచించాలి. ఖుర్బానీ ఇచ్చే శక్తి ఉండి కూడా ఖుర్బానీ ఇవ్వనివారు చాలా దురదృష్టవంతులు. వీరు ప్రతి యేడూ ఎంత గొప్ప భాగ్యాన్ని కోల్పోతున్నారో అర్థం చేసుకోవడం లేదు. డబ్బును సద్వినియోగం చేసే ఉత్తమోత్తమ విధానం ఒక్కటే. దైవ ప్రీతి కోసం దాన్ని దైవమార్గంలో ఖర్చుపెట్టాలి. కుటుంబ అవసరాలు వదిలేసి ఉన్నదంతా ఖుర్బానీ ఇవ్వడానికి, దానధర్మాలు చేయడానికీ ఉపయోగించమని ఇస్లామ్ అనడం లేదు. ధర్మసమ్మత అవసరాలకై డబ్బు వెచ్చించవలసిందే. అదీ దైవారాధన కిందే వస్తుంది. అయితే అలా అని వస్తున్న ఆదాయమంతా కుటుంబ అవసరాలకే ఉపయోగిస్తుంటే ఇక మనం దైవమార్గంలో ఖర్చు పెట్టేదేమిటి? త్యాగానికి చిహ్నామయిన ఖుర్బానీ పశువునే మనం దైవానికి అర్పించలేకపోతే, ఇక ధర్మం ప్రమాదంలో పడినప్పుడు అత్యవసర పరిస్థితిలో ఏం త్యాగం చేయగలం?

కాబట్టి సోదరులారా! దైవ మార్గంలో ప్రత్యేకంగా ధర్మ సంస్థాపనా మార్గంలో ఉదార బుద్ధితో డబ్బు ఖర్చు పెట్టండి. త్యాగభావం లేకపోతే మన విశ్వాసం పరిపూర్ణత చెందదు.

మరికొందరు ప్రతి యేడూ ఎంతో ఉత్సాహంతో ఖుర్బానీ ఇస్తుంటారు. కాని వీరు ధర్మ సంస్థాపనా మార్గంలో కొసరి కొసరి ఖర్చుపెడతారు. ప్రవక్త కాలంలో ముస్లిమ్‌లు ధర్మ సంస్థాపనకై జరిగే జిహాద్‌లో వెనకా ముందూ ఆలోచించకుండా విచ్చలవిడిగా డబ్బు ఖర్చు పెట్టేవాళ్ళు. ఒకసారి అత్యవసర పరిస్థితి ఏర్పడితే హజ్రత్ అబూబకర్ (రజి) తమ ఇంట్లో ఉన్న గుడ్డ పేలికతో సహా అంతా ఊడ్చి తెచ్చి ప్రవక్త (సఅసం) పాదాల ముందు ధారపోశారు. మరి మనమో....? జిహాద్ అంటే ఏమిటో ఎప్పుడో మరచిపోయాం. తెలిసిన కొందరు దైవసందేశ ప్రచారం కోసం సభలు, సమావేశాలు, పత్రికలు, పుస్తకాల ద్వారా కృషి చేస్తుంటే మనం వారికి కనీసం ఆర్థిక సహకారాన్ని కూడా అందజేయలేకపోతున్నాం. దైవం మనందరికీ ధర్మ మార్గంలో త్యాగం చేసే సద్బుద్ధి, ఉదార స్వభావం ప్రసాదించుగాక!

అల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ లా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ వలిల్లాహిల్ హమ్‌ద్.

62. నికాహ్ ప్రసంగం

మహాశయులారా!

వివాహం ప్రవక్త సంప్రదాయమన్న సంగతి మీకందరికి తెలుసు. ఇలాంటి సంతోష సమయంలోనూ మన ప్రియప్రవక్త (సఅసం) కొన్ని దైవాజ్ఞలను గుర్తుచేస్తూ మనల్ని సన్మార్గంపై స్థిరంగా ఉంచగోరుతున్నారు. అందుకే ఆయన నికాహ్ సందర్భంలో ఖుత్బా పఠిస్తారు. ఖుత్బా అంటే ప్రసంగం అని అర్థం, నేటికి ఆ సంప్రదాయాన్ననుసరించే నికాహ్ జరిగినప్పుడల్లా మనం ఈ ఖుత్బాని పఠిస్తుంటాం. అయితే ఈనాడు మన జీవితం ఏ విధంగా ఇస్లామీయ జీవన వ్యవస్థకు దూరమై మన సమాజం ఎలా నిర్వీర్యమయిపోయిందో, అదే విధంగా మన వివాహాది శుభకార్యాలు కూడా ఇస్లామ్ వాస్తవికతకు దూరమయి పోయాయి.

ఇస్లామ్ మానవ జీవితాన్ని పూర్తిగా దైవానికి ఇష్టమయిన పంథాలో మలచి, మానవులకు ఇటు ఇహలోకంలోనూ, అటు పరలోకంలోనూ సుఖశాంతులు ప్రసాదించదలచింది, దీని కోసం మనిషి దైవాదేశాలను కేవలం మస్జిద్ నాలుగు గోడల మధ్యనేకాక సకల జీవన రంగాల్లో పాటించడం తప్పనిసరి. కాబట్టి ముస్లిములు ఎలాంటి పరిస్థితిలోనూ దైవాజ్ఞలను మరచిపోకుండా ఇస్లామ్ జాగ్రత్తపడుతూ దొరికిన ప్రతి అవకాశాన్ని వినియోగించుకుంటుంది. నలుగురు సమావేశమయ్యే ఏ సందర్భం వచ్చినా దాన్ని జారవిడుచుకోకుండా మనిషి తన నిజస్థానాన్ని, లక్ష్యాన్ని గుర్తు చేసుకోవడానికి తగిన ఏర్పాటు చేస్తుంది. అలాంటి ఓ సందర్భమే నికాహ్ సమావేశం.

సోదరులారా!

నికాహ్ ఒక సంతోష కార్యం. మనిషి సాధారణంగా ఇలాంటి సందర్భాల్లో తన్మయత్వంలో తన అసలు స్థానాన్ని విస్మరించే ప్రమాదం ఉంటుంది. షైతాన్ తన పని నెరవేర్చుకోవడానికి ఇదొక మంచి అవకాశం. అందువల్లనే మహాప్రవక్త (సఅసం) ఆచరణాత్మకంగా బోధించిన నికాహ్ ప్రసంగం ఎంతో శుభప్రదమైందని, గొప్ప వరప్రసాదమని చెప్పవచ్చు. ఇందులో ఇహపర జీవితాలకు సంబంధించిన అనేక మేళ్ళున్నాయి.

కాని ఈనాడు నికాహ్ ప్రసంగం పేరుతో అనేక చోట్ల మనకు విన్పించబడుతున్న విషయాలు కొన్ని పవిత్ర పదాల సముదాయం తప్ప మరేమీ కాదు. ఖాజీ వాటిని లాంఛనంగా విన్పిస్తున్నాడు. మనం కూడా వాటిని అలాగే విని ఖుత్బా లక్ష్యం నెరవేరిందని భావిస్తున్నాం. నిజానికి ఖుత్బా ఉద్దేశ్యం కొన్ని వాక్యాలను చిలక పలుకుల్లా వల్లించినంత మాత్రాన నెరవేరదు. ఖుత్బాలో ఖాజీ ఏం చెబుతున్నాడో, దాని

ప్రాముఖ్యం ఏమిటో తెలుసుకోవాలి. ఈ రోజు మనం మహా ప్రవక్త (సఅసం) బోధించిన ఆ ప్రసంగాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిద్దాం.

ఖుత్బా ప్రారంభంలో పఠించబడే మొట్ట మొదటి వాక్యానికి అర్థం ఇది: "స్తోత్రం, కృతజ్ఞతాభావం అల్లాహ్ కోసమే. మనమంతా ఆయనకే కృతజ్ఞతలర్పిస్తున్నాం. ఆయన్నే కీర్తిస్తున్నాం. ఆయన సహాయమే అర్థిస్తున్నాం. మన పొరపాట్ల మన్నింపుకై ఆయన్నే వేడుకుంటున్నాం. మన అంతర్యంలో పుట్టే, మన దుష్టపరిణామం నుండి మనం ఆయన రక్షణనే కోరుకుంటున్నాం. అల్లాహ్ మార్గం చూపినవారిని ఇతరులెవరూ మార్గభ్రష్టుల్ని చేయలేరు. ఆయన మార్గం తప్పడానికి వదిలేసినవారికి ఇతరులెవరూ మార్గం చూపలేరు".

ఖుత్బాలోని ఈ మొదటి వాక్యంలో దైవాన్ని విశ్వసించే వ్యక్తి ఆలోచనా తీరు ఎలా ఉండాలో స్పష్టమవుతోంది. అతని విశ్వాసం ప్రకారం మనిషికి ఏది లభించినా దైవం ద్వారానే లభిస్తుంది. మనజీవితంలో లభించే అసంఖ్యాక మహా భాగ్యాలన్నీ దైవం ప్రసాదించినవే. ఆయన మహోపకారాలు లెక్కించనలవి కాదు. వాటిని మనం కనీసం ఊహించనయినాలేము. అందువల్ల దేవుడు చేసిన మహోపకారాలను వీలయినంత వరకు గుర్తుచేసుకుంటూ ఆయనకు ఎల్లప్పుడు కృతజ్ఞులమయి జీవించాలి. దేవుని ఆదేశాలను తు.చ. తప్పకుండా పాటించడమే ఆయన పట్ల మనకున్న కృతజ్ఞతా భావానికి నిదర్శనం.

విశ్వ ప్రభువయిన అల్లాహ్‌యే అన్నీ ప్రసాదించేవాడయినప్పుడు మనకు ఏది కావాలన్నా ఆయన్నే అర్థించాలి. ఆయన్ని తప్ప మరెవరిని అర్థించకూడదు. అంతా ఆయనదే అయినప్పుడు ఇతరుల ముందు చేయిజాపడంలో అర్థమే లేదు. అందరికీ ఆయనే ప్రసాదిస్తుంటే ఈ ప్రపంచంలో సృష్టిరాసులంతా ఆయనపై ఆధారపడవలసిందే కదా!

మనం ఎంత నిష్ఠగా ఉండదలచుకున్నా మన వల్ల ఏవో పొరపాట్లు జరుగుతుంటాయి. అయితే జరిగిన పొరపాటును తెలుసుకొని వెంటనే దైవాన్ని వేడుకోవాలి. ఆయన గొప్ప క్షమాగుణం కలవాడు. మనస్ఫూర్తిగా పశ్చాత్తాపం చెంది వేడుకునేవారిని, ఇకముందు తప్పు జరగకుండా జాగ్రత్తపడతామని దృఢసంకల్పం చేసుకునేవారిని దేవుడు తప్పకుండా మన్నిస్తాడు.

సోదరులారా!

మనిషి మానసికంగా బలహీనుడనేది మీకందరికీ తెలిసిన విషయమే. అతని వల్ల మాటిమాటికి పొరపాట్లు జరుగుతుంటాయి. అతని మనస్సు అతడ్ని రకరకాల పెడ మార్గాల వైపునకు మళ్ళించేందుకు ప్రయత్నిస్తుంది. అందువల్ల మనసును ఎలాంటి పెడ మార్గాలకు పోనివ్వకుండా కాపాడటం విశ్వప్రభువుకే సాధ్యం కనుక, మనం

మానసిక దౌర్బల్యాల నుండి దాని చెడుగుల నుండి కాపాడమని ఆయన్నే వేడుకోవాలని ఇస్లామ్ బోధిస్తోంది. మనిషి సన్మార్గాన్ని అనుసరించేందుకు కృషి చేస్తూ దేవుని సహాయాన్ని అర్థిస్తే ఆయన తప్పక సహాయం చేస్తాడు, సన్మార్గం చూపిస్తాడు. అలాంటివారు ఎన్నటికీ మార్గం తప్పరు. వారిని మార్గభ్రష్టుల్ని చేయడం కూడా ఎవరికీ సాధ్యం కాదు. ఒకవేళ మనిషికి మంచి మార్గం పట్ల ఆసక్తి, ఆకాంక్షలే అసలు లేకపోతే, దేవుడు అతనికి సన్మార్గావలంబనలో ఎన్నటికి సహాయం చేయడు. అతణ్ని షైతాన్ సులభంగా వలలో వేసుకుంటాడు. అలాంటి వ్యక్తిని తిరిగి సన్మార్గం వైపునకు మళ్ళించడం ఎవరి తరం కాదు.

ఖుత్బాలో పఠించే రెండో వాక్యానికి అర్థం: " అల్లాహ్ తప్ప మరో దేవుడు లేడని నేను సాక్ష్యమిస్తున్నాను. ఇంకా ముహమ్మద్ (సఅసం) ఆయన దాసుడని, ఆయన ప్రవక్త అని కూడా నేను సాక్ష్యమిస్తున్నాను".

ఇది ఇస్లామ్ మౌలిక సద్వచనమని అందరికీ తెలుసు. ఈ సద్వచనం కారణంగానే దీన్ని నమ్మే ముస్లిమ్‌లందరూ వారి స్థాయి గుణగణాలను బట్టి యావత్ ప్రపంచంలో ఒక ప్రత్యేకతను కలిగినవారవుతారు. వారంతా కలసి ఒక సైద్ధాంతిక సంఘమవుతారు, పరస్పరం సోదరులవుతారు.

ఈ సద్వచనంలో మనం ఒక పరమ సత్యాన్ని అంగీకరిస్తున్నాం. ఈ విశ్వం ఏ శక్తి ప్రమేయం లేకుండా దానంతటదే ఉనికిలోకి రాలేదు. అయితే దీని సృష్టి కార్యంలో అల్లాహ్ హస్తం తప్ప మరే హస్తం లేదు. దీని సృష్టికర్త , స్వామి, ప్రభువు ఒక్కడే, కాబట్టి మనిషి ఆయన ముందే ఆరాధనా భావంతో తలవంచాలి. ఆయన్నే తన అవసరాల కోసం వేడుకోవాలి. ఆయనకే విధేయత పాటించాలి. ఆయన ఆజ్ఞలనే శిరసావహించాలి. ఈ విశాల విశ్వంలో దాగి ఉన్న పరమ సత్యం ఇదే.

ఇందులో మరొక యదార్థం కూడా ఉంది. మనిషి దైవానికి విధేయత పాటించేందుకు దేవుడు తన అభీష్టాన్ని, తన కిష్టమయిన జీవిత విధానాన్ని తన ప్రవక్తల ద్వారా పంపాడు. అలాంటి ప్రవక్తల్లో చివరివారు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం. ఆయన్ని మాత్రమే అనుసరించడం, ఆయన బోధనల్ని, ఆయన నాయకత్వాన్ని, మార్గదర్శకత్వాన్ని స్వీకరించడం ప్రతి ముస్లిమ్ విధి. ఆయన తప్ప ఇతరుల నాయకత్వాన్ని,మార్గదర్శకత్వాన్ని స్వీకరించడం ఘోరమైన తప్పు.

ఈ రెండు సత్యాలకు సాక్ష్యం పలకడమంటే, సంతోషాతిరేకంతో హద్దులు మీరే ఈ శుభసందర్భంలో సయితం ముస్లిమ్‌లు తాము అంగీకరించిన ఈ సత్యాన్ని మరచిపోకుండా దైవ మార్గాన్ని జ్ఞప్తికి తెచ్చుకోవడమన్న మాట.

ఆ తరువాత ఖుత్బాలో కొన్ని ఖుర్ఆన్ ఆయత్‌లు పఠించబడతాయి. వాటిలో ఒకటి "నిసా" సూరాలోని మొదటి ఆయత్. దీనికి అర్థం ఇది:

"మానవులారా! మీ ప్రభువుకు భయపడండి. ఆయన మిమ్మల్ని ఒకే ప్రాణి నుండి పుట్టించాడు. అదే ప్రాణి నుండి దాని జతను సృష్టించాడు. ఇంకా ఆ జంట ద్వారా ఎంతో మంది పురుషుల్ని, స్త్రీలను అవనిలో వ్యాపింపజేశాడు. ఎవరి పేరయితే మీరు చెప్పుకొని పరస్పరం మీ హక్కుల్ని కోరుతారో ఆ దైవానికి భయపడండి. బంధుత్వపు సంబంధాల విచ్ఛిత్తికి దూరంగా ఉండండి, అల్లాహ్ మిమ్మల్ని గమనిస్తున్నాడనే విషయాన్ని తెలుసుకోండి." (4:1)

మహాశయులారా!

మనిషి నిజమయిన మానవుడుగా రూపొందాలంటే అతను తన ప్రభువయిన అల్లాహ్ ప్రసన్నతను పొందడానికి, ఆయన అయిష్టతకు, ఆగ్రహానికి దూరంగా ఉండడానికి ప్రయత్నించాలి. దీన్నే భయభక్తులు అంటారు. మనిషి చేసే ప్రతి పనికి ఈ భయభక్తులే ప్రాతిపదిక, ఇవే లేకపోతే మనిషి చేసే ప్రతి సత్కార్యం వెనుక స్వార్థమో, ప్రదర్శనాబుద్ధో తప్పకుండా ఉంటుంది. దీని అసలు రూపం ఆలస్యంగానయినా బయట పడకుండా ఉండదు. దైవాన్ని విశ్వసించినవారు దైవ ప్రసన్నతను పొందే ఉద్దేశ్యంతో తప్ప మరే ఉద్దేశ్యంతో సత్కార్యం చేసినా దానికి ఎలాంటి విలువ ఉండదు, అందువల్లనే ఇక్కడ మనిషి ఈ మౌలిక గుణాన్ని పెంపొందించుకోవాలని సూచించడం జరిగింది.

ఈ ఆయత్‌లో దేవుడు మరో యదార్థాన్ని తెలియజేస్తున్నాడు. దేవుడు మానవాళి సృజనా క్రియలో మొట్టమొదట హజ్రత్ ఆదమ్ (అలైహిస్సలామ్) ను సృష్టించాడు. తరువాత హజ్రత్ హవ్వాను సృష్టించాడు. ఈ తొలి మానవ జంట నుండే మానవాళి అంతా ఉనికిలోకి వచ్చింది. మానవులంతా ఒకే తల్లిదండ్రుల సంతానమవడంచేత అందరూ పరస్పరం సోదరులు, సమానులు. ఈ యదార్థం మానవుల మధ్య మానవులే సృష్టించుకున్న తారతమ్యాలను పటాపంచాలు చేస్తోంది. ఈ యాదర్థమే గనక మనిషి దృష్టిలో లేకపోతే మానవుల మధ్య పరస్పర సంబంధాలు ఏర్పడలేవు. వారు పరస్పర హక్కులు సక్రమంగా నెరవేర్చుకోలేరు. సమాజ సంస్కరణ జరగదు, సమాజ వికాసమూ జరగదు. మనుషుల మధ్య శాంతి, సామరస్యం, సుహృద్భావం నెలకొనవు.

ఆయత్ చివరిలో దైవం మానవుల్ని గమనిస్తూనే ఉన్నాడన్న సత్యాన్ని గుర్తు చేయడం జరిగింది. నిజానికి మనిషిని సన్మార్గంపై నిలకడగా ఉంచగలిగేది ఈ భావనే. ఈ భావన ద్వారానే మనిషి తన మనోవాంఛల చెడుల నుండి దూరంగా ఉండగలడు. సన్మార్గంపై నడుస్తూ ఎదురయ్యే కష్టాలను పరీక్షలను సునాయాసంగా దాటుకుపోగలడు.

నికాహ్ ప్రసంగాల్లో దైవ ప్రవక్త (సఅసం) పఠించే మరో ఆయత్‌లో "విశ్వసించిన ఓ ప్రజలారా! అల్లాహ్‌కు ఏ విధంగా భయపడాలో ఆ విధంగా భయపడండి. ముస్లిమ్‌లుగా తప్ప మీరు మరణించకండి" (3:102) అని ఉంది. ఇందులో కూడా దైవం పట్ల భయభక్తులతో వ్యవహరించమని బోధించడం జరిగింది. అంటే మనిషి జీవితపు అన్ని రంగాల్లోనూ దేవుని ఆజ్ఞలను పాటిస్తూ, చివరి ఘడియ వరకూ ఆయన పట్ల విధేయుడు, విశ్వసనీయుడయిన దాసునిగా జీవించాలని ఈ ఆయత్‌లో నొక్కి చెప్పడం జరిగింది. ముస్లిమ్‌లో ఈ మనస్తత్వం జనించకపోతే అతనికి తిని, త్రాగి కాలం వెళ్ళబుచ్చే ఇతర మనుషులకు తేడా ఏముంది? దైవానికి ఎల్లప్పుడూ విశ్వాసపాత్రుడయి ఉండటమే అతని ప్రత్యేకత. ఈ విశ్వసనీయతకు ప్రతిఫలంగానే పరలోకంలో దైవ కారుణ్యం లభిస్తుందన్న ఆశ ఉంటుంది.

ఇక చివరి రెండు ఆయత్‌లకు అర్థం చూడండి." విశ్వసించినవారలారా! అల్లాహ్ యెడల భయభక్తులు కలిగి మెలగండి. నోటితో నిత్యం సరయిన మాటనే పలకండి. అల్లాహ్ మీ ఆచరణల్ని సంస్కరిస్తాడు. మీ అపరాధాలను మన్నిస్తాడు. ఎవరయితే అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తకు విధేయులయి ఉంటారో వారు గొప్ప సాఫల్యాన్ని పొందుతారు." (33:70,71)

సోదరులారా!

దైవ విశ్వాసం గల వ్యక్తికి ఉండవలసిన మొట్టమొదటి లక్షణమే చెడు మాటను నోటితో పలకకుండా ఉండటం. ఒక వేళ ఎప్పుడయినా పొరపాటున తప్పుడు మాట దొర్లితే వెంటనే అతను తప్పు తెలుసుకొని పశ్చాత్తాపడతాడు. ఇలా ఎవరయితే తమ నోటిని కాపాడుకుంటారో వారి ఇతర ఆచరణలు కూడా సంస్కారవంతమవుతాయి. మంచి మాటనే నోటి నుండి పలికే మనిషి జీవితం సాధారణంగా సక్రమంగానే ఉంటుంది.

విశ్వసించినవారు గుర్తుంచుకోవలసిన ముఖ్య విషయమేమంటే, పరలోక సాఫల్యమే అసలు సాఫల్యం. దాన్ని సాధించాలంటే జీవిత వ్యవహారాలన్నింటిలో దైవం, ఆయన ప్రవక్త విధేయతను పాటించటం తప్ప గత్యంతరం లేదు. అప్పుడే మనిషికి ప్రపంచంలో శాంతి, తృప్తి లభిస్తాయి. దీని ద్వారానే పరలోక సాఫల్యం కూడా లభిస్తుంది.

నికాహ్ ప్రసంగం చివరిలో రెండు హదీసుల్ని పఠించడం జరిగింది. మొదటి హదీసులో మహాప్రవక్త (సఅసం) "పెళ్ళి చేసుకోవడం నా సంప్రదాయం. ఎవరైతే నా సంప్రదాయాన్ని ఇష్టపడరో వారితో నాకు ఎలాంటి సంబంధం లేదు" అని ప్రవచించారు. పెళ్ళి చేసుకోకుండా ఉండటం ఇస్లామ్ దృష్టిలో భావ్యం కాదని ఈ హదీసు ద్వారా మనకు స్పష్టమవుతోంది. కొందరి దృష్టిలో బ్రహ్మచర్యాన్ని పాటించడం పుణ్యకార్యం

కావచ్చు. కొందరు సన్యాసులు, వైరాగ్యం పాటించేవారు, ఈ విధానమే మంచిదని భావిస్తారు. మరికొందరు లేనిపోని ఈ ఝుంఝూటంలో పడటం దేనికని బ్రహ్మచర్యాన్ని అవలంబిస్తారు.

అయితే ఇస్లామ్ మానవుల్ని అపమార్గాన్నుండి రక్షించడానికి, సమాజ నైతిక స్థాయిని ఉన్నతంగా తీర్చిదిద్దడానికి పెళ్ళి చేసుకోవాలని నొక్కి చెబుతుంది. పెళ్ళి చేసుకుంటే పుట్టే పిల్లల్ని పోషించటం కష్టమని కొందరు ఆందోళన వెలిబుచ్చుతారు. కాని వీరి ఆందోళనకు ఆధారం లేదు. అసలు జీవికను ప్రసాదించేవాడు అల్లాహ్‌యేనని, ఆయనే మీకు కలగబోయే సంతానానికి ఆహారమిస్తాడని ఇస్లామ్ అభయమిస్తుంది.

రెండో హదీసులో దైవప్రవక్త (సఅసం) ఇలా బోధించారు. "యువకుల్లారా! మీలో ఎవరయితే నికాహ్ (దాంపత్య జీవితం) భారాన్ని వహించగలడో అతను నికాహ్ చేసుకోవాలి. ఎందుకంటే ఇది మీ చూపును క్రిందికి చేస్తుంది. మర్మాంగాలను కాపాడుతుంది. ఎవరికయితే నికాహ్ బాధ్యతలు నిర్వహించే శక్తి లేదోవారు అప్పుడప్పుడు నఫిల్ రోజాలు పాటించాలి. వీటి ద్వారా మనోనిగ్రహం జనిస్తుంది."

ఈ హదీసుకూడా బ్రహ్మచర్యాన్ని నిరసిస్తోంది. యుక్తవయస్కులైన యువతీ యువకులు వీలైనంత త్వరగా పెళ్ళి చేసుకోవడమే మంచిది, సమాజంలో నైతికత, పరిశుద్ధత, సౌశీల్యతలను కాపాడటానికి ఇలా చెయ్యడం చాలా అవసరం.

సోదరులారా!

నికాహ్ సందర్భంలో ఇచ్చే ఖుత్బాకు ఇది క్లుప్తమయిన వివరణ. నికాహ్ కేవలం ఒక సంతోష సమయమే కాదు. అదొక స్త్రీ పురుషుల మధ్య జరిగే ఒప్పందం కూడా. అంటే తాము జీవితాంతం సహచరులుగా, పరస్పర సహాయకులుగా రూపొందినట్లు వారు చేసే ప్రకటనన్నమాట. ఒకవేళ ఈ ఒప్పందాన్ని పాటించడంలో భర్త తరపునగాని, భార్య తరపున గాని ఏదయినా లోపం జరిగితే , ఆ విషయం దేవుని అయిష్టానికి కారణభూతమవుతుంది. దాని చెడు పర్యవసానాన్ని పరలోకంలో వారు అనుభవించవలసి వస్తుంది.

ఈ ప్రసంగం మొత్తంలో దైవం పట్ల భయభక్తుల వైఖరికి అత్యంత ప్రాధాన్యతనివ్వడం జరిగింది. దేవుని అయిష్టతకు, ఆగ్రహానికి కారణమయ్యే విషయాలకు దూరంగా ఉండండని మానవుల్ని మాటిమాటికి హెచ్చరించడం జరిగింది.

ఈ సందర్భంలో మనమంతా ఆత్మపరిశీలన చేసుకోవలసిన అవసరం ఎంతో ఉంది. ఖుత్బాలో సూచించబడిన దైవాదేశాలకు, ప్రవక్త సంప్రదాయాలకు మన వైఖరి అనుగుణంగా ఉందా? 'మహర్' ని నికాహ్ సందర్భంలోనే చెల్లించాలి. లేదా వీలయినంత త్వరగా స్త్రీకి ఆమె హక్కును ఇచ్చేసే 'సంకల్పంతో' దాన్ని తర్వాత చెల్లించే విధంగా ప్రకటించాలి. కాని ఈనాడు మనలో చాలా మంది చేస్తున్నదేమిటి? మహర్‌ను

ఎగవేసే ఉద్దేశ్యంతోనో లేక నిజంగా ఇవ్వబోతున్నామా అన్న భావనతోనో పెద్ద మొత్తంలో మహర్ నిర్ణయించడం, తీరా దాన్ని చెల్లించే అవసరం ఏర్పడినప్పుడు వంకలు వెదకడం జరుగుతోంది.

మహర్ విషయంలో ఇలాంటి అసమంజస వైఖరి అవలంబించడమే గాకుండా నేటి యువకులు, వారి తల్లిదండ్రులు చుట్టుప్రక్కల ఉన్న సమాజాన్ని చూసి వరకట్నాన్ని కూడా డిమాండ్ చేస్తున్నారు. వరకట్నం నేడు ఒక సామాజిక రుగ్మత మాత్రమేకాక, చట్టరీత్యా కూడా అది నేరమే అన్న విషయాన్ని మనం మరచిపోకూడదు.

మన యువకులు సమాజ శ్రేయస్సును కాంక్షించేవారయితే వారు వరకట్నం లాంటి దురాచారాన్ని క్రియాత్మకంగా రూపుమాపే కృషి చేయాలి. ఇది ఉపన్యాసాల ద్వారా, బహిరంగ ప్రమాణాల ద్వారా అంతమయ్యే రోగం కాదు. యువకులు వరకట్నాన్ని ఎలాంటి పరిస్థితిలోనూ తీసుకోకుండా ఉండాలి. తమ తల్లిదండ్రులు ఇలాంటి దురాచారానికి పాల్పడినట్టు తెలిస్తే అలాంటి పెళ్ళి చేసుకోమని భీష్మించుకు కూర్చోవాలి.

దీనికోసం కొందరు యువకులైనా ధైర్యం చేసి ముందుకు వస్తే, వారి ఆదర్శం సమాజంలోని ఇతర యువకులకు ప్రేరణ, ప్రోత్సాహాన్ని ఇస్తుంది. అయితే ఈ రంగంలో మొట్టమొదట ముందంజవేసే వారెవరన్నదే ప్రశ్న. గొప్ప గొప్పవాళ్ళు కూడా గురిఅయ్యే ఈ జాడ్యాన్ని నామరూపాల్లేకుండా చెయ్యగలిగిన యువకులే ఆదర్శవంతులు.

ఈ మహమ్మారికి గురయి ఎన్ని సంసారాలు నాశనమయ్యాయో, ఎన్ని ప్రాణాలు బలయ్యాయో మన సామాజిక స్థితిని అధ్యయనం చేసినవారికి తెలియని విషయం కాదు. సమాజ శ్రేయస్సుకై చట్టం విధించే శిక్ష నుండి రక్షణ కోసం మాత్రమే గాక, దైవశిక్ష దైవాగ్రహాల నుండి తప్పించుకోవడానికి సయితం ఈ వరకట్న రాక్షసితో పోరాడటం మన విధి.

సోదరులారా!

నేడు వివాహ బంధంలో ఏకమవుతున్న ఈ కొత్త వధూవరుల మధ్య దైవం ప్రేమానురాగాలను సృజించాలని, వారు పరస్పరం ఒకరి హక్కులను మరొకరు పాటించేవారు కాగలగాలని,వీరిద్వారా కలిగే సంతానం దైవమార్గంలో పయనించేదిగా, ధర్మ ఉన్నతికై కృషిచేసేదిగా కావాలని ప్రార్థిద్దాము. దైవాన్ని మన తప్పుల్ని మన్నించమని, జీవితాంతం పూర్తిగా సన్మార్గంపై నడిచే సద్బుద్ధిని ప్రసాదించమని వేడుకుందాం.

సమాప్తం

خطبۂ جمعہ

ప్రథమ ప్రసంగం خطبۂ اولیٰ

اَلْحَمْدُ لِلّٰہِ نَحْمَدُہٗ وَنَسْتَعِیْنُہٗ وَنَسْتَغْفِرُہٗ وَنُؤْمِنُ بِہٖ وَنَتَوَکَّلُ عَلَیْہِ وَنَعُوْذُ بِاللّٰہِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَیِّئَاتِ اَعْمَالِنَا مَنْ یَّھْدِہِ اللّٰہُ فَلَا مُضِلَّ لَہٗ وَمَنْ یُّضْلِلْہُ فَلَا ھَادِیَ لَہٗ وَنَشْھَدُ اَنْ لَّآ اِلٰـہَ اِلَّا اللّٰہُ وَنَشْھَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُہٗ وَرَسُوْلُہٗ صَلَّی اللّٰہُ عَلَیْہِ وَسَلَّمَ اَمَّا بَعْدُ:

فَاَعُوْذُ بِاللّٰہِ مِنَ الشَّیْطٰنِ الرَّجِیْمِ. بِسْمِ اللّٰہِ الرَّحْمٰنِ الرَّحِیْمِ.

وَلْتَکُنْ مِّنْکُمْ اُمَّۃٌ یَّدْعُوْنَ اِلَی الْخَیْرِ وَیَاْمُرُوْنَ بِالْمَعْرُوْفِ وَیَنْھَوْنَ عَنِ الْمُنْکَرِ ؕ وَاُولٰٓئِکَ ھُمُ الْمُفْلِحُوْنَ. (آل عمران: ۱۰۴)

کُنْتُمْ خَیْرَ اُمَّۃٍ اُخْرِجَتْ لِلنَّاسِ تَاْمُرُوْنَ بِالْمَعْرُوْفِ وَتَنْھَوْنَ عَنِ الْمُنْکَرِ وَتُؤْمِنُوْنَ بِاللّٰہِ ؕ (آل عمران: ۱۱۰)

وَمَنْ اَحْسَنُ قَوْلًا مِّمَّنْ دَعَآ اِلَی اللّٰہِ وَعَمِلَ صَالِحًا وَّقَالَ اِنَّنِیْ مِنَ الْمُسْلِمِیْنَ. (حٰم السجدۃ ۳۳)

عَنْ حُذَیْفَۃَ بْنِ الْیَمَانِ رَضِیَ اللّٰہُ تَعَالٰی عَنْہُ عَنِ النَّبِیِّ صَلَّی اللّٰہُ عَلَیْہِ وَسَلَّمَ وَالَّذِیْ نَفْسِیْ بِیَدِہٖ لَتَاْمُرُنَّ بِالْمَعْرُوْفِ وَلَتَنْھَوُنَّ عَنِ الْمُنْکَرِ اَوْ لَیُوْشِکَنَّ اللّٰہُ اَنْ یَّبْعَثَ عَلَیْکُمْ عَذَابًا مِّنْہُ فَتَدْعُوْنَہٗ فَلَا یَسْتَجِیْبُ لَکُمْ. (رواہ الترمذی)

بَارَکَ اللّٰہُ لَنَا وَلَکُمْ فِی الْقُرْاٰنِ الْعَظِیْمِ وَاَسْتَغْفِرُ اللّٰہَ لِیْ وَلَکُمْ وَلِسَائِرِ الْمُسْلِمِیْنَ اِنَّہٗ تَعَالٰی جَوَادٌ کَرِیْمٌ مَلِکٌ بَرٌّ رَّؤُفٌ رَّحِیْمٌ.

خُطْبَۂ ثانِیَہ ద్వితీయ ప్రసంగం

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِیْنَ. وَالصَّلٰوةُ وَالسَّلَامُ عَلٰی رَسُوْلِهِ الْاَمِیْنِ وَعَلٰٓی اٰلِهٖ وَاَصْحَابِهٖ
اَجْمَعِیْنَ. اَمَّا بَعْدُ! فَاَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّیْطٰنِ الرَّجِیْمِ. بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِیْمِ.
یٰٓاَیُّهَا الَّذِیْنَ اٰمَنُوْا قُوْٓا اَنْفُسَکُمْ وَاَهْلِیْکُمْ نَارًا وَّقُوْدُهَا النَّاسُ وَالْحِجَارَةُ عَلَیْهَا
مَلٰٓئِکَةٌ غِلَاظٌ شِدَادٌ لَّا یَعْصُوْنَ اللّٰهَ مَآ اَمَرَهُمْ وَیَفْعَلُوْنَ مَا یُؤْمَرُوْنَ. وَقَالَ
تَعَالٰی: وَلْتَکُنْ مِّنْکُمْ اُمَّةٌ یَّدْعُوْنَ اِلَی الْخَیْرِ وَیَاْمُرُوْنَ بِالْمَعْرُوْفِ وَیَنْهَوْنَ
عَنِ الْمُنْکَرِ وَاُولٰٓئِکَ هُمُ الْمُفْلِحُوْنَ. وَقَالَ تَعَالٰی: هُوَ الَّذِیْٓ اَرْسَلَ رَسُوْلَهٗ
بِالْهُدٰی وَدِیْنِ الْحَقِّ لِیُظْهِرَهٗ عَلَی الدِّیْنِ کُلِّهٖ وَلَوْ کَرِهَ الْمُشْرِکُوْنَ. وَقَالَ
تَعَالٰی: اِنَّ اللّٰهَ وَمَلٰٓئِکَتَهٗ یُصَلُّوْنَ عَلَی النَّبِیِّ یٰٓاَیُّهَا الَّذِیْنَ اٰمَنُوْا صَلُّوْا عَلَیْهِ
وَسَلِّمُوْا تَسْلِیْمًا. اَللّٰهُمَّ صَلِّ وَسَلِّمْ عَلٰی خَاتِمِ النَّبِیِّیْنَ مُحَمَّدٍ وَّعَلَی الْخُلَفَآءِ
الرَّاشِدِیْنَ الْمَهْدِیِّیْنَ اَبِیْ بَکْرِ الصِّدِّیْقِ وَعُمَرَ الْفَارُوْقِ وَعُثْمَانَ بْنِ عَفَّانٍ
وَّعَلِیِّ بْنِ اَبِیْ طَالِبٍ وَّعَلٰٓی اَزْوَاجِ النَّبِیِّ اُمَّهَاتِ الْمُؤْمِنِیْنَ وَعَلٰی سَآئِرِ الصَّحَابَةِ
وَالتَّابِعِیْنَ وَمَنْ تَبِعَهُمْ اِلٰی یَوْمِ الدِّیْنِ رِضْوَانُ اللّٰهِ تَعَالٰی عَلَیْهِمْ اَجْمَعِیْنَ.
اَللّٰهُمَّ انْصُرْ مَنْ نَصَرَ دِیْنَ مُحَمَّدٍ صَلَّی اللّٰهُ عَلَیْهِ وَسَلَّمَ وَاجْعَلْنَا مِنْهُمْ
وَاخْذُلْ مَنْ خَذَلَ دِیْنَ مُحَمَّدٍ صَلَّی اللّٰهُ عَلَیْهِ وَسَلَّمَ وَلَا تَجْعَلْنَا مِنْهُمْ
اَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّیْطٰنِ الرَّجِیْمِ. بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِیْمِ. اِنَّ اللّٰهَ یَاْمُرُ
بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِیْتَآءِ ذِی الْقُرْبٰی وَیَنْهٰی عَنِ الْفَحْشَآءِ وَالْمُنْکَرِ وَالْبَغْیِ
یَعِظُکُمْ لَعَلَّکُمْ تَذَکَّرُوْنَ. وَلَذِکْرُ اللّٰهِ اَعْلٰی وَاَکْبَرُ.

ఖుత్‌బయె సానియహ్

అల్‌హమ్‌దు లిల్లాహి రబ్బిల్ ఆలమిన్. వస్సలాతు వస్సలాము అలా రసూలిహిల్ అమీన్ వఅలా ఆలిహి వఅస్‌హాబిహీ అజ్మయీన్. అమ్మాబాద్!

ఫఅఊజు బిల్లాహి మినష్షయ్‌తానిర్రజీమ్ బిస్మిల్లాహిర్రహ్మా నిర్రహీమ్. యా అయ్యుహల్లజీన ఆమనూ ఖూఅన్‌ఫుసకుమ్ వ అహ్‌లీకుమ్ నారఁవ్ వఖూదుహన్నాసు వల్‌హిజారతు అలైహా మలాయికతున్ గిలాజున్ షిదాదుల్లా యాసూనల్లాహ మా అమరహుమ్ వ యఫ్ అలూన మా యు'మరూన్. వఖాల తఆలా వల్ తకుమ్ మిన్‌కుమ్ ఉమ్మతుయ్ యద్‌ఊన ఇలల్‌ఖైరి వయ'మూరన బిల్‌మారూఫి వయన్‌హౌన అనిల్ మున్కరి వ ఉలాయిక హుముల్‌ముఫ్‌లిహూన్. వఖాల తఆలా హువల్లజీ అర్సల రసూలహూ బిల్‌హుదా వదీనిల్‌హఖ్ఖి లియుజ్‌హిరహూ అలద్దీని కుల్లిహీ వలౌకరిహల్ ముష్‌రికూన్, వఖాలతఆలా, ఇన్నల్లాహ వ మలాయికతహు యుసల్లూన అలన్నబియ్యి యా అయ్యుహల్లజీన ఆమనూ సల్లూ అలైహి వ సల్లిమూ తస్‌లీమా. అల్లాహుమ్మ సల్లి వ సల్లిమ్ అలా ఖాతిమిన్నబియ్యీన ముహమ్మదిఁవ్ వ అలల్ ఖులఫాయిర్రాషిదీనల్ మహ్‌దియ్యీన అబీ బక్‌ర్ నిస్సిద్దీఖి వ ఉమరల్ ఫారూఖ వ ఉస్మానబ్‌ని అప్ఫానిఁవ్ వఅలీయిబ్‌ని అబీ తాలిబిఁవ్ వఅలా అజ్‌వాజిన్నబియ్యి ఉమ్మహాతిల్ ము'మినీన వఅలా సాయిరిస్సహాబతి వత్తాబియీన వమన్ తబిఅహుమ్ ఇలా యఁవ్‌మిద్దీని రిజ్‌వానుల్లాహి తఆలా అలైహిమ్ అజ్మయీన్.

అల్లాహుమ్మన్‌సుర్ మన్ నసర దీన ముహమ్మదిన్ సల్లల్లాహు అలైహి వ సల్లమ్ వజ్‌అల్‌నా మిన్‌హుమ్ వఖ్‌జుల్ మన్ ఖజల దీన ముహమ్మదిన్ సల్లల్లాహు అలైహి వ సల్లమ్ వలా తజ్‌అల్‌నా మిన్‌హుమ్.

అవూజుబిల్లాహి మినష్షయ్‌తానిర్రజీమ్. బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్. ఇన్నల్లాహ య'మురు బిల్ అద్‌లి వల్ ఇహ్‌సాని వ ఈతాయి జిల్‌ఖుర్‌బా వయన్‌హా అనిల్ ఫహ్‌షాయి వల్ మున్కరి వల్ బగి యయిజుకుమ్ లఅల్లకుమ్ తజక్కరూన్ వలజిక్‌రుల్లాహి ఆలా వ అక్బర్.

ఖుత్బయె సానియ (ద్వితీయ ప్రసంగం)

అల్‌హందు లిల్లాహి రబ్బిల్ ఆలమీన్. అర్రహ్మాన్ నిర్రహీం. మాలికి యౌమిద్దీన్. వస్సలాతు వస్సలాం అలా రసూలిహిల్ అమీన్ వఅలా ఆలిహి వ అస్హాబిహీ అజ్మయీన్ అమ్మాబాద్!

ఫఅఊజు బిల్లాహి మినష్షయ్‌తానిర్రజీం, బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీం.

యా అయ్యుహల్లజీన ఆమనూ ఖూఅన్ఫుసకుం వఅహ్లీకుం నారం వ్వఖూదుహన్నాసు వల్‌హిజారతు అలైహా మలాయికతున్ గిలాజున్ షిదాదున్ లాయాసూనల్లాహ మా అమరహుమ్ వయఫ్అలూన మాయు'మరూన్.

వఖాలల్లాహు తఆల యౌమ యఫిర్రుల్ మర్ఉ మిన్ అఖీహి వఉమ్మిహీ వ అబీహి వ సాహిబతిహీ వబనీహి, లికుల్లిమ్‌రియిమ్ మిన్‌హుమ్ యౌమయిజిన్ షానుయ్ యుగ్‌నీహ్.

వఖాలల్లాహు తఆలా హువల్లజీ అర్సల రసూలహు బిల్‌హుదా వదీనిల్ హఖ్ఖి లియుజ్‌హిరహు అలద్దీని కుల్లిహీ వలవ్ కరిహల్ ముష్రికూన్.

వఖాలల్లాహు తఆలా ఇన్నల్లాహ వ మలాయికతహు యుసల్లూన అలన్నబియ్యి యా అయ్యుహల్లజీన ఆమను సల్లూ అలైహి వ సల్లిమూ తస్‌లీమ. అల్లాహుమ్మ సల్లి వసల్లిం అలా ఖాతిమిన్నబియ్యీన ముహమ్మదింవ్వ అలల్ ఖులఫాయిర్రాషిదీనల్ మహ్‌దియ్యీన అబీ బక్‌రనిస్సిద్దీఖి వ ఉమరల్ ఫారూఖి వ ఉస్మానబ్‌ని అఫ్ఫాన వ అలియ్యిబ్‌ని అబీ తాలిబిన్ వ అలా అజ్‌వాజిన్నబియ్యి ఉమ్మహాతిల్ మూమినీన వ అలా సాయిరిస్సహాబతి వత్తాబియీన వ మన్ తబిఅహుమ్ ఇలా యౌమిద్దీన్ రిజ్వానుల్లాహి తఆల అలైహిం అజ్మయీన్. అల్లాహుమ్మన్‌సుర్ మన్ నసర దీన ముహమ్మదిన్ సల్లల్లాహు అలైహివ సల్లం వజ్‌అల్నా మిన్‌హుమ్ వఖ్‌జుల్ మన్ ఖజల దీన ముహమ్మదిన్ సల్లల్లాహు అలైహివసల్లం వలాతజ్‌అల్నా మిన్‌హుమ్ ఇబాదల్లాహి రహిమకుముల్లాహ్ ఇన్నల్లాహ యామురు బిల్ అద్లి వల్ ఇహ్సాని వ ఈతాయి జిల్‌ఖుర్బా వ యన్‌హా అనిల్ ఫహ్‌షాయి వల్ మున్‌కర్ వల్ బగ్‌యి యయిజుకుమ్ లఅల్లకుమ్ తజక్కరూన్. వలజికురుల్లాహి ఆల వ అక్‌బర్ వల్లాహు యాలము మాతస్‌నఊన్.